వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

సభా పర్వం



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
సభా పర్వం

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82 వ్యా
రామ-మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

సభా పర్వం

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి 2010)

18 సంపుటాల వెల : రూ. 720/-

C 27445

సుందరయ్య గ్రంథాలయ ట్రస్ట్
A C.No. 96353
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు- జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మనాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

ట్రైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

ఎందరో మహానుభావులు

సభా పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ వైద్యుల కృష్ణారావు, డాక్టర్ నిష్ఠల వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని

మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే ఆలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ

ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో పాటు ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. సభాక్రియాపర్వము - 4	
1.	సభ నిర్మించి ఇత్తునని మయుడు అర్జునునితో చెప్పుట. (21+4)*	15
2.	శ్రీకృష్ణుడు ద్వారకకు వెడలుట. (36)	16
3.	మయుడు భీమార్జునులకు గదాశంఖములిచ్చి సభను నిర్మించుట. (37+1 $\frac{1}{2}$)	19
4.	మయసభాప్రవేశము. (40+5)	22
	2. లోకపాల సభాఖ్యానపర్వము - 8	
5.	నారదుడు ధర్మరాజుకు ప్రశ్నరూపమున రాజ్యపాలనమును బోధించుట. (129)	24
6.	దివ్యసభలను గూర్చిన యుధిష్ఠిరుని జిజ్ఞాస. (19)	34
7.	ఇంద్ర సభావర్ణనము. (30+2)	36
8.	యమ సభావర్ణనము. (41)	37
9.	వరుణసభా వర్ణనము. (30+4)	40
10.	కుబేర సభావర్ణనము. (40)	41
11.	బ్రహ్మసభా వర్ణనము. (62)	43
12.	హరిశ్చంద్రమాహాత్మ్యము - పాండురాజ సందేశము. (34)	46
	3. రాజసూయారంభపర్వము - 7	
13.	యుధిష్ఠిరుడు రాజసూయమును సంకల్పించి సన్నిహితులతో చర్చించుట. (51)	48
14.	శ్రీకృష్ణుడు రాజసూయమునకు సమ్మతించుట. (70+5 $\frac{1}{2}$)	52
15.	జరాసంధుని గూర్చి ధర్మజ భీమ శ్రీకృష్ణులు చర్చించుట. (25+1)	56
16.	జరాసంధ వధను గురించి ఆలోచించుట. (17)	58
17.	జరాసంధ జననవృత్తాంతము. (52+9 $\frac{1}{2}$)	59
18.	జరాసంధ నామకరణము. (12+1)	63
19.	జరాసంధుని రాజ్యాభిషేకము. (28)	64

* బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	4. జరాసంధ వధపర్వము - 5	
20.	ధర్మజుని అనుమతితో శ్రీకృష్ణభీమార్జునులు మగధకు వెడలుట. (30)	65
21.	మగధరాజధాని ప్రాశస్త్యము - మూడునగారాలను భేదించుట - శ్రీకృష్ణ జరాసంధ సంవాదము. (54)	67
22.	జరాసంధుడు యుద్ధమునకు సిద్ధమగుట - కృష్ణజరాసంధుల వైరకారణము. (36)	71
23.	భీమజరాసంధుల బాహుయుద్ధము. (35)	75
24.	జరాసంధుని వధ. (60+5 $\frac{1}{2}$)	78
	5. దిగ్విజయ పర్వము - 8	
25.	సంక్షిప్త దిగ్విజయము. (11)	82
26.	అర్జునుడు భగదత్తుని ఓడించుట. (16)	83
27.	అర్జునుడు పర్వతీయదేశములను జయించుట. (29)	84
28.	కింపురుషాది దేశములను జయించి అర్జునుడు ఇంద్రప్రస్థమునకు వచ్చుట. (21+57 $\frac{1}{2}$)	86
29.	భీమసేనుడు తూర్పుదిక్కును జయించుట. (16)	89
30.	భీముడు పూర్వదిగ్విజయము చేసి ఇంద్రప్రస్థమునకు తిరిగివచ్చుట. (30)	90
31.	సహదేవుని దక్షిణ దిగ్విజయము. (78+100)	92
32.	నకులుడు పడమర దిక్కును జయించుట. (20)	100
	6. రాజసూయ పర్వము - 7	
33.	ధర్మరాజు రాజసూయ యాగదీక్ష వహించుట. (55+4 $\frac{1}{2}$)	101
34.	యుధిష్ఠిర యజ్ఞమున అందరు కలియుట. (25)	105
35.	రాజసూయ యాగ వర్ణనము. (19)	106
36.	ధర్మరాజు కృష్ణునకు అర్ఘ్యమిచ్చుట. (32)	108
37.	శిశుపాలుడు ధర్మజ శ్రీకృష్ణులను ఉపాలంభించుట. (31)	110
38.	భీష్ముడు శ్రీకృష్ణుని చరిత్రమును స్తుతించుట. (33+728 $\frac{1}{2}$)	111
39.	సహదేవుని కోపము. (18)	144

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	7. శిశుపాలవధపర్వము - 6	
40.	శిశుపాలుని గూర్చి భీష్ముని పలుకులు. (15)	145
41.	శిశుపాలుడు భీష్ముని ఉపాలంభించుట. (40)	146
42.	కోపించిన భీముని భీష్ముడు వారించుట. (20)	148
43.	శిశుపాలుని జన్మవృత్తాంతమును భీష్ముడు చెప్పుట. (25)	149
44.	భీష్ముని సమాధానము. (42)	151
45.	శిశుపాలవధ - రాజసూయ సమాప్తి. (68+42)	153
	8. ద్యూత పర్వము - 28	
46.	వ్యాసుని భవిష్యవాణి - యుధిష్ఠిరుని ప్రతిజ్ఞ. (33)	158
47.	మయసభలో భంగపడిన దుర్యోధనుడు ధర్మజుని వైభవమును చూచి దుఃఖించుట. (40)	160
48.	పాండవులను జయించుటకు శకుని దుర్యోధనుల మంతనము. (23+1)	162
49.	దుర్యోధనుని చింతను విని ధృతరాష్ట్రుడు విదురుని ఇంద్రప్రస్థమునకు పంపదలచుట. (60+7)	163
50.	దుర్యోధనుడు ధృతరాష్ట్రునకు తన మనోవేదనను తెలుపుట. (36)	168
51.	యుధిష్ఠిరునకు వచ్చిన కానుకలను దుర్యోధనుడు వర్ణించుట. (35+26)	169
52.	దుర్యోధనుని సంతాపము. (49)	173
53.	దుర్యోధనుడు యుధిష్ఠిరుని పట్టాభిషేకము వర్ణించుట. (25)	175
54.	ధృతరాష్ట్రుడు దుర్యోధనునకు నచ్చజెప్పుట. (11+1½)	177
55.	దుర్యోధనుడు ధృతరాష్ట్రునకు తన నిశ్చయమును తెలుపుట. (21)	178
56.	ధృతరాష్ట్రుడు సభానిర్మాణమునకు ఆజ్ఞాపించుట - ధర్మరాజును పిలుచుటకు విదురుని పంపుటకు నిశ్చయించుట. (22)	179
57.	ధృతరాష్ట్ర విదురుల సంవాదము. (5)	181
58.	యుధిష్ఠిరుడు హస్తినకు వచ్చుట. (38+23½)	181
59.	జూదమును గురించి శకుని ధర్మరాజుల సంవాదము. (21)	185
60.	ద్యూతప్రారంభము. (9)	187

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
61.	యుధిష్ఠిరుడు ప్రతిపందెమును ఓడిపోవుట. (31)	187
62.	విదురుడు ధృతరాష్ట్రుని హెచ్చరించుట. (17)	190
63.	విదురుడు జూదమును వ్యతిరేకించుట. (10)	191
64.	దుర్యోధనుడు విదురుని నిందించుట, విదురుడు దుర్యోధనుని హెచ్చరించుట. (20)	192
65.	యుధిష్ఠిరుడు తనతోపాటు సర్వస్వమును కోల్పోవుట. (45+1 $\frac{1}{2}$)	194
66.	విదురుడు దుర్యోధనుని మందలించుట. (12)	197
67.	ద్రౌపదిని సభలోనికి ఈడ్పించుట. (54+2)	198
68.	ద్రౌపదీ పరాభవము. (90+4 $\frac{1}{2}$)	202
69.	ద్రౌపది విలాపము - భీష్మవచనము. (21)	208
70.	దుర్యోధనుని వక్రభాషణము - భీముని ఆవేశము. (18)	209
71.	ద్రౌపదీ వరలాభము. (36)	210
72.	ధర్మరాజు భీముని శాంతింపజేయుట. (17)	213
73.	యుధిష్ఠిర ధృతరాష్ట్ర సంభాషణము. (18)	214
	9. అనుద్యూత పర్వము - 8	
74.	దుర్యోధనుడు పాండవులను మరల జూదమునకు పిలిపించుటకు ధృతరాష్ట్రుని ఒప్పించుట. (27+67 $\frac{1}{2}$)	215
75.	గాంధారిప్రబోధమును ధృతరాష్ట్రుడు తిరస్కరించుట. (12)	220
76.	ధర్మరాజు అనుద్యూతమున ఓడిపోవుట. (24+3 $\frac{1}{2}$)	221
77.	పాండవుల ప్రతిజ్ఞలు. (46)	222
78.	యుధిష్ఠిర వనప్రస్థానము. (24)	225
79.	కుంతీ ద్రౌపదుల సంభాషణము. (36+29)	227
80.	విదుర ధృతరాష్ట్ర ద్రోణవచనములు. (52+15)	230
81.	ధృతరాష్ట్ర సంజయ సంవాదము. (39)	234

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
సభా పర్వం

1. సభ నిర్మించి ఇత్తునని మయుడు అర్జునునితో చెప్పుట.

అంతర్యామిగా ఉండే నారాయణస్వరూపుడైన శ్రీకృష్ణునికీ, అతడి స్నేహితుడూ, మానవులలో శ్రేష్ఠుడూ అయిన అర్జునుడికీ, సరస్వతీ దేవికీ, వేదవ్యాసమహర్షికీ నమస్కరిస్తూ జయం అనే మహాభారతకథను చెప్పాలి. వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. జనమేజయా! ఖాండవవనదహన సమయంలో రక్షింపబడిన మయదానవుడు శ్రీకృష్ణపరమాత్మ దగ్గరకు వచ్చి, నమస్కరించి, అర్జునుని పరాక్రమాన్ని ప్రశంసిస్తూ, మధురమయిన మాటలతో ఇలా అన్నాడు. "కుంతీకుమారా! ఈ వాసుదేవుడు, అగ్నిదేవుడు, నావిషయంలో ఎంతోకోపంగా ఉన్నప్పటికీ నీకు నామీద అపారమైన దయ ఉండటంవల్ల నన్ను ఆనాడు రక్షించావు. కాబట్టి నీకు ప్రత్యుపకారం చేయాలని ఉంది. నీకు ఏవిధంగా ఏమి చేయాలో చెప్పు" అని కోరాడు. అర్జునుడు ఇలా అన్నాడు. "మయాసురా! నీవు ఈవిధంగా కృతజ్ఞత వెల్లడించడమే నాకు మహోపకారం. నీకు శుభం కలుగుగాక! నీవు వెళ్లవచ్చు. నా విషయంలో ఎప్పుడూ ప్రీతితో ఉండు. మేము కూడా నీయందు ప్రీతితో ఉంటాం." మయుడు అన్నాడు. "నరోత్తమా! అర్జునుడు చెప్పిన ఈ మాట మహాపురుషులకు తగినమాటయే. అయినా మీయందు ప్రీతితో ఏదో ఒకటి చేయాలని కుతూహలంగా ఉన్నాను. అర్జునా! నేను దానవులకు శిల్పాచార్యుడిని. శిల్పవిద్యలో నేర్పరిని. అందుచేత ఏదో ఒకటి నిర్మించి మీకు ఇవ్వాలని అనుకొంటున్నాను.

(అర్జునా! పూర్వం నేను రాక్షసుల కోసం భవనాలు నిర్మించాను. అవి చాలా రమణీయమైనవి. సుఖభోగాలకు అవి ఆటపట్టులు. అనేక ఉద్యానవనాలు, అందమైన చెరువులు, విచిత్రమైన అస్త్రాలు, శస్త్రాలు, ఇచ్చవచ్చిన రీతిలో నడిచే రథాలు, విశాలమైన నగరాలు, అట్టహాసంగా ఉండే ప్రాకారాలు, వాహనాలు, అనేకమైన కాలువలు, మొదలైనవి విచిత్రంగా ఉండేటట్లు నేను నిర్మించాను. అందుచేత

అర్జునా! నీకుకూడా ఆలాంటివి నిర్మించి ఇవ్వాలని అనుకొంటున్నాను.")

అర్జునుడు ఇలా అన్నాడు. "శిల్పీ! నీకు ప్రాణసంకట పరిస్థితిలో నేను రక్షించానని అనుకొంటూ నాకోసం ఏదో ఒకపని చేయాలని అనుకొంటున్నావు. ఇట్లాంటి సమయంలో నాకోసం నీవు ఏమీ చేయవద్దు. మయాసురా! కానీ ఈ సంకల్పం వ్యర్థం కారాదు సుమా! నీవు ఏదన్నా చేయాలని అనుకొంటే అది శ్రీకృష్ణపరమాత్మ కోసం చేయి. అపుడు నావిషయంలో నీ కర్తవ్యం పూర్తిఅయినట్లుగా భావించు." అనగానే మయుడు శ్రీకృష్ణపరమాత్మను వేడుకొన్నాడు. శ్రీకృష్ణభగవానుడు రెండు నిమిషాలు మౌనంగా "ఇతనికి ఏం చేయమని చెప్పాలి" అని ఆలోచించి, "శిల్పవిద్యా ప్రవీణుడవైన మయాసురా! నీవు ఏదో చేయాలని అనుకొన్నావు కదా! ధర్మరాజు కోసం ఒక మంచి సభాభవనాన్ని నిర్మించు. మానవులందరూ ఆ సభాభవనాన్ని చూసి ఆశ్చర్యపడేటట్లు నిర్మించు. దానితో సమానమైంది ఇంకొకటి ఉండకూడదు. ఆ నిర్మాణంలో మానవులయొక్క రాక్షసులయొక్క దేవతలయొక్క మనోవృత్తులూ, శిల్పనైపుణ్యమూ నీద్వారా వ్యక్తంకావాలి." ఈ విధంగా శ్రీకృష్ణుడిచ్చిన ఆజ్ఞను మయుడు స్వీకరించి చాలా సంతోషించాడు. విమానంతో సమానమైన సభను యుధిష్ఠిరునికోసం తయారుచేయడానికి నిశ్చయించుకొన్నాడు. ఆ తరువాత కృష్ణార్జునులు ఇద్దరూ ధర్మరాజు దగ్గరకు మయునితో వెళ్లి ఈ విషయాన్ని చెప్పారు. ధర్మరాజు ఆ మయాసురుడికి తగిన సత్కారం చేశాడు. మయుడు కూడా ఆ సత్కారాన్ని ఆదరంతో స్వీకరించాడు. అపుడు మయాసురుడు పాండవులకు దైత్యుల రాజయిన వృషపర్వుని చరిత్రాన్ని చెప్పాడు. మయుడు అక్కడ కొన్నిరోజులు విశ్రాంతిగా గడిపి, చక్కగా ఆలోచించి, మహాత్ములైన పాండవులకోసం సభను తయారు చేయనారంభించాడు. మహాత్ముడైన శ్రీకృష్ణుని అభిమతానికీ, కుంతీపుత్రుని కోరికకూ అనుగుణంగా ఒక శుభముహూర్తంలో మంగళానుష్ఠానం చేసి, వేలాది బ్రాహ్మణులకు క్షీరాన్నంతో సంతృప్తి కలిగించి, అనేకవిధాలుగా ధనాన్ని దానం చేశాడు. తరువాత ఆ సభను తయారుచేయడానికి నాల్గుప్రక్కల పదివేల జానల పొడవు, పదివేల జానల వెడల్పు కలుగునట్లుగా ఒక ప్రదేశాన్ని నిర్ణయించుకొని సభానిర్మాణ కార్యక్రమానికి సిద్ధపడ్డాడు.

2. శ్రీకృష్ణుడు ద్వారకకు వెడలుట.

పరమపూజనీయుడైన భగవానుడు శ్రీకృష్ణుడు ఖాండవప్రస్థంలో ప్రేమాస్పదులైన పాండవులద్వారా నిత్యపూజలు అందుకొంటూ సుఖంగా ఉంటున్నాడు. కొన్నిరోజుల తరువాత

తనతండ్రిని దర్శించాలనే కుతూహలం కలిగి, విశాలలోచనుడైన పరమాత్మ ధర్మరాజు దగ్గర, కుంతిదగ్గర అనుమతి తీసుకొని ద్వారకానగరానికి వెళ్లదలచాడు. జగద్వంద్యుడైన శ్రీకృష్ణపరమాత్మ మేనత్తయిన కుంతీదేవి పాదాలదగ్గర శిరస్సు ఉంచి నమస్కరించాడు. అతని శిరస్సును ఆఘ్రాణించి, ఆమె అక్కున చేర్చుకొన్నది. తరువాత మహాయశోవిరాజితుడైన హృషీకేశుడు తన చెల్లెలయిన సుభద్రను కలుసుకొన్నాడు. ఆమె దగ్గరకు వెళ్లాక శ్రీకృష్ణుడికి ప్రీతితో ఆనందబాష్పాలు వచ్చాయి. భద్రభాషిణి అయిన సుభద్రతో భగవంతుడు ప్రయోజనకారి, హితకరం అయిన పొందిక మాటలతో తన ద్వారకానగర ప్రయాణాన్ని గురించి చెప్పాడు. సుభద్ర కూడా తనసోదరుని సగౌరవంగా పూజించి, శిరస్సుతో నమస్కరించి తన తల్లిదండ్రులు, బంధువులు మొదలగువారికి తెలియజేయడానికి సందేశం ఇచ్చింది. సోదరి సుభద్రను సంతోషపరచి, తన ప్రయాణానికి సమ్మతిని పొంది జనార్దనుడు ఆ తరువాత ద్రౌపదిని, ధౌమ్యమహర్షిని కలుసుకొన్నాడు. పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు యథోచితంగా ధౌమ్యమహర్షికి నమస్కారం చేశాడు. ద్రౌపదికి సాంత్వనవాక్యాలు చెప్పి, ఆమె దగ్గఱ నుండి తన గమనానికి సమ్మతిని పొందాడు. ఆ తరువాత అర్జునుడి దగ్గరకు, మిగిలిన పాండవుల దగ్గరకు వెళ్లాడు. పాండవులు అయిదుగురితో కలిసి శ్రీకృష్ణుడు దేవతలతో కూడిన ఇంద్రుడిలాగ ప్రకాశించాడు. గరుడధ్వజుడైన పరమాత్మ యాత్రాకాలానికి తగిన సముచిత కార్యాలు చేయదలచి పవిత్రస్నానం చేశాడు. తన ఆభరణాలను ధరించాడు. యదుశ్రేష్ఠుడైన పరమాత్మ పుష్పహారాలతోను, చందన తాంబూలాలతోను, జప నమస్కారాలతోను దేవబ్రాహ్మణులకు అర్చనలు చేశాడు. ఆ యదుపుంగవుడు ప్రయాణసందర్భంగా చేయవలసిన అన్నిపనులను పూర్తిచేసుకొని రాజభవనం వెలుపలికి వచ్చాడు. ఆ సమయంలో బ్రాహ్మణులు స్వస్తివచనాలు పలికారు. పరమాత్ముడు ఆ బ్రాహ్మణులకు వెరుగుతోడున్న పాత్రను, అక్షతలను, ఫలాలను, వాటితోపాటు కొంతధనాన్ని కూడా ఇచ్చి, ప్రదక్షిణం చేశాడు. పిదప గరుడధ్వజంతో కూడి గద, చక్రం, ఖడ్గం, విల్లు మొదలైన ఆయుధాలతో అమర్చబడి, శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకాలు అనే గుఱ్ఱాలతో కూర్చబడిన బంగారు రథాన్ని ఎక్కి, శుభనక్షత్రంలో, శుభతిథిలో, శుభముహూర్తంలో ప్రయాణాన్ని ప్రారంభించాడు.

ఆ సమయంలో సారథులలో ఉత్తముడు అయిన దారుకునిస్థానంలో ధర్మరాజు కూర్చుండి ప్రేమపూర్వకంగా భగవానునితో కొంతదూరం వెళ్లాడు. కురురాజైన యుధిష్ఠిరుడు సారథిగా ఉండి, పగ్గాలు తనచేతిలోకి తీసుకున్నాడు. మహాబాహుడైన అర్జునుడు

కూడా రథంపైన కూర్చున్నాడు. బంగారుదండంతో ప్రకాశిస్తున్న తెల్లనివింజామరతో అతనికి విసురుతున్నాడు. అదేవిధంగా నకులసహదేవులతో కూడిన బలాఢ్యుడయిన భీముడు, ఋత్విక్కులూ, పురజనులు అందరూ ఆ రథం వెనుక నడచివస్తున్నారు. వేగంగా వెళ్తున్న ఆ రథంలో శార్ఙ్గధనుస్సును ధరించిన శ్రీకృష్ణునిపై దివ్యపుష్పహారాలతో మెఱుపుతో సమానంగా బంగారు ఛాయతో ప్రకాశిస్తున్న ఛత్రం ఉన్నది. ఆ ఛత్రదండం వజ్రవైడూర్యాలతో ప్రకాశిస్తున్నది. నకులసహదేవులు ఇద్దరూ రథంమీద కూర్చుండి వింజామరలతో విసురుతూ ఆ పరమాత్ముని సేవిస్తున్నారు. ప్రియశిష్యులతో కూడిన గురువులాగ పరమాత్ముడు వారిమధ్య ప్రకాశిస్తున్నాడు. శ్రీకృష్ణుడు అర్జునుని ప్రేమతో గట్టిగా ఆలింగనం చేశాడు. అతడు హృదయ పూర్వకంగా వీడ్కోలుకు అనుమతించాడు. భగవానుడు యుధిష్ఠిరుని చరణస్పర్శచేశాడు. భీముని, కవలలను తనకౌగిలిలోకి తీసుకున్నాడు. నకులసహదేవులు ఇద్దరు ఆయనకు పాదాభివందనం చేశారు. శ్రీకృష్ణుడు రెండు క్రోసులదూరం వెళ్లాక యుధిష్ఠిరుడి అనుమతిని తీసుకొని వారిని వెనుకకు మరలింపజేశాడు. ధర్మజుని పాదాలను ధర్మవిదుడు అయిన కృష్ణుడు పట్టుకొన్నాడు. యుధిష్ఠిరుడు ఆ పరమాత్ముని లేవదీసి, శిరసు మూర్కొని రెండుచేతులు పట్టుకొని శిరస్సువంచి "వెళ్లిరండి" అని అనుమతించాడు. పిమ్మట పరమాత్మ వారితో "మరల వస్తానని" చెప్పి పాదచారులుగా వస్తున్న నగరవాసులను పాండవులను ప్రేమానురాగాలతో నివారించి ఇంద్రుడు అమరావతికి వెళ్లినట్లుగా ద్వారకానగరాన్ని చేరాడు . పాండవులందరు తమ దృష్టికి కనపడేవరకు అతని రథంవైపే చూస్తూ వెనుదిరిగి వెళ్లారు. కృష్ణభగవానునిపైగల అత్యంతప్రేమ కారణంగా వారి అందరి మనస్సులు శ్రీకృష్ణునితోపాటే వెళ్లాయి. ఇంతవరకు కేశవుని దర్శించినా వారికి సంతృప్తి కలుగలేదు. నయనాభిరాముడైన భగవంతుడు కృష్ణపరమాత్ముని ఎంత చూసినా తనివి తీరలేదు. రథం అదృశ్యం అయ్యేంతవరకు దర్శనం చేసుకొన్నారు పాండవులు. వారు మరలిపోయారు కాని వారి మనస్సులు మాత్రం పరమాత్మవెంటే ఉన్నాయి.

పురుషశ్రేష్ఠ డయిన ధర్మరాజు తమనగరానికి సోదరులతో చేరుకొన్నాడు. అక్కడ భగవానుడు కూడా త్వరితగతిని ద్వారకను చేరుకొన్నాడు. సాత్వత వంశీయుడు, వీరుడు అయిన సాత్యకి రథంపై శ్రీకృష్ణుని వెనుక వస్తూండగా దారుకుడు సారథిగా రథాన్ని నడుపుతుంటే వీరిద్దరిమధ్య దేవకీనందనుడు గరుత్మంతుడు లాగా ప్రకాశిస్తూ ద్వారకానగరాన్ని చేరాడు. మర్యాదను అతిక్రమించని ధర్మరాజు తన సోదరులతోను, స్నేహితులతోను

కూడి ఉత్తమనగరమైన ఇంద్రప్రస్థాన్ని చేరాడు. రాజా! ధర్మనందనుడు తన హితులను తమ్ములను, పుత్రులను స్నేహితులను అందరినీ వీడ్కొలిపి రాజభవనంలో ద్రౌపదితో కూర్చుండి ఆనందంగా గడిపాడు. ఇక్కడ కేశవుడు కూడా సంతోషంతో ద్వారకాపురాన్ని ప్రవేశించాడు. ఉగ్రసేనుడు మొదలగు యాదవశ్రేష్ఠ లందరు శ్రీకృష్ణుని సమ్మానించారు. కమలనయనుడైన శ్రీకృష్ణుడు ఉగ్రసేనమహారాజుకూ, ముదుసలి - తండ్రి అయిన వసుదేవుడికీ, కీర్తిమంతురాలైన తల్లికీ, నమస్కరించాడు. పిమ్మట జనార్దనుడు ప్రద్యుమ్నుని, సాంబుని, నిశఠుని, చారుదేష్ణుని, గదుని, అనిరుద్ధుని, భానుడు మొదలగు కుమారులందరిని స్నేహపూర్వకంగా ఆలింగనం చేసుకొని, తరువాత తన పెద్దల అనుమతిని పొంది రుక్మిణీభవనానికి వెళ్లాడు. అక్కడ మహానుభావుడైన మయుడు కూడా ధర్మరాజు కోసం శాస్త్రోక్తంగా సకలరత్నాలతో ప్రకాశించే సభాభవనాన్ని తయారుచేశాడు.

3. మయుడు భీమార్జునులకు గదాశంఖము లిచ్చి సభను నిర్మించుట.

తరువాత మయాసురుడు అర్జునుడితో ఇట్లా చెప్పాడు. "భారతా! నేను ఒక ప్రదేశానికి వెళ్లి తిరిగివస్తాను. అందుకు నీ అనుమతిని కోరుతున్నాను.

(నేను మీకోసం మూడులోకాల్లో ప్రసిద్ధికెక్కేటట్లుగా సభను నిర్మిస్తాను. అది సర్వప్రాణికోటికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పాండవులందరికీ మిక్కిలిగా సంతోషం కలుగుతుంది.)

పూర్వకాలంలో రాక్షసులు కైలాసపర్వతానికి ఉత్తరదిశలో ఉన్న మైనాకపర్వతం పైన యజ్ఞాన్ని చేయాలని అనుకొన్నారు. ఆ సమయంలో నేను విచిత్రమయిన, అందమైన మణిమయ భాండాన్ని తయారుచేశాను. దాన్ని బిందుసరస్సు సమీపంలో సత్యసంధుడైన వృషపర్వమహారాజు యొక్క సభలో ఉంచాను. భారతా! ఆ భాండం ఇప్పటివరకు అక్కడ ఉన్నట్లయితే దానిని తీసుకొని వస్తాను. దానితో పాండునందనుడైన ధర్మరాజుకు కీర్తి కలిగేవిధంగా సభను నిర్మిస్తాను. సకలరత్నాలతో అలంకరింపబడి, విచిత్రమై, మనస్సుకు ఆనందం కలిగించే భయంకరమైన గద కూడా ఒకటి బిందుసరోవరంలో ఉంది. వృషపర్వమహారాజు యుద్ధంలో శత్రుసంహారం చేసిన పిదప ఆ గదను ఆ బిందుసరోవరంలో ఉంచాడు. అది చాలా బరువైనదీ, దృఢమైనదీ కూడా. నీ గాండీవంలాగ ఆ గద ఒక్కటే ఒకలక్షగదలతో సమానంగా ఉండి శత్రుసంహారం చేయగలదు. ఆ గద భీమసేనునికి తగినది సుమా! ఆ గదతో పాటు ఆ సరస్సులో దేవదత్తం అనే పేరుగల శంఖం కూడా ఉంది. అది వరుణునిది. చక్కని ధ్వని కలది. నిస్సందేహంగా ఆ శంఖాన్ని నీకు తెచ్చి

ఇస్తాను." ఆ విధంగా అర్జునుడితో చెప్పి, మయుడు ఈశాన్యదిశలో కైలాసపర్వతానికి ఉత్తరంగా ఉన్న మైనాక పర్వతం దగ్గరకు వెళ్లాడు.

అక్కడ గొప్పగొప్పిమణులతో కూడిన హిరణ్యశృంగం అనే పర్వతం ఒకటి ఉంది. బిందు సరస్సు అనే అందమైన సరస్సు ఉంది. భగీరథుడు గంగను దర్శించుకోవాలని అనేక సంవత్సరాలు తపస్సుచేస్తూ అక్కడ నివసించాడు. అక్కడ సర్వప్రాణికోటికి ఆధిపతి, మహాత్ముడూ అయిన ప్రజాపతి నూరుయజ్ఞాలను చేశాడు. అక్కడ మణిమయాలైన యూపస్తంభాలు, విశాలమైన యజ్ఞశాలలు ఉన్నాయి. అవన్నీ అందంగా చేయబడ్డాయి కాని శాస్త్రప్రకారం కాని, సిద్ధాంతాన్ని అనుసరించి కాని చేయలేదు. అయినా సహస్రలోచనుడైన శచీపతి అక్కడ యజ్ఞంచేసి సిద్ధిని పొందాడు. సమస్తలోకాలను సృష్టించినవాడూ, సమస్తప్రాణికోటికి అధిపతీ, భయంకరతేజోవంతుడూ, సనాతన దైవమూ అయిన బ్రహ్మదేవుడు ఆ బిందుసరోవరంలో ఉండి అందరిచేత సేవింపబడ్డాడు. వేయియుగాల పర్యంతం అక్కడ నరనారాయణులు, బ్రహ్మదేవుడు, యమధర్మరాజు, మహాదేవుడు ఈ అయిదుగురూ యజ్ఞాలు చేశారు. ధర్మాన్ని రక్షించడం కోసం భగవంతుడైన వాసుదేవుడు అక్కడ అనేక సంవత్సరాలు నిరంతరం శ్రద్ధతో యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞంలో సువర్ణమాలలతో అలంకరింపబడిన స్తంభాలు, మిక్కిలిగా ప్రకాశించే యజ్ఞవేదికలు వేలూ, లక్షలూ దానం చేశాడు. మహారాజా! మయాసురుడు బిందు సరోవరానికి వెళ్లి గదను, శంఖాన్ని, సభానిర్మాణానికి కావలసిన స్ఫటికాలనూ, మణిమయద్రవ్యాల్నీ తీసుకొన్నాడు. అవన్నీ పూర్వం వృషపర్వుని ఆధీనంలో ఉన్నవి. ఎంతోమంది రాక్షసులు, సేవకులు ఆ మహానిధిని కాపాడుతున్నారు. మయుడు అక్కడికి వెళ్లి ఆ నిధిని అంతటినీ తీసుకొన్నాడు.

అక్కడి వస్తువులను అన్నిటినీ తీసుకొని వచ్చి మయుడు సాటిలేని భవనాన్ని తయారుచేశాడు. అది ముల్లోకాలలో ప్రసిద్ధికెక్కే దివ్యభవనం. మణులతో ప్రకాశిస్తూ సుందరంగా ఉన్నభవనం. ఆ సమయంలో మయుడు శ్రేష్ఠమైన గదను భీముడికి, ఉత్తమమయిన శంఖాన్ని అర్జునుడికి ఇచ్చాడు. ఆ శంఖంయొక్క నాదాన్ని వింటే సమస్తప్రాణికోటి కంపిస్తుంది. మహారాజా! ఆ సభలో బంగారుమయమైన చెట్లశోభ విరాజిల్లుతుంది. ఆ సభ పదివేల జానలపొడవు, అంతే వెడల్పు గలిగి ఉంటుంది. అగ్ని, సూర్యుడు, చంద్రుడు ప్రకాశించినట్లుగా అత్యంత ప్రకాశపూర్ణమై మనోహరంగా ఉంటుంది. ఆ సభయొక్క తేజస్సు సూర్యతేజాన్ని కూడా తిరస్కరిస్తుంది. ఆ సభ దివ్యతేజస్సుతో వెలిగిపోతోంది. నూతన మేఘంలా ఆకాశాన్ని ఆవరించి విశాలంగా, రమణీయంగా,

దోష రహితంగా ఉంది. ఉత్తమద్రవ్యాలతో ఆ సభ నిర్మింపబడ్డది. రత్నప్రాకార తోరణాలతో అలరారుతోంది. చిత్రవిచిత్రాలైన వస్తువులు, ప్రదేశాలు ఉన్నాయి. అధిక ధనసంపన్నమయింది ఆ భవనం. దానవవిశ్వకర్మ అయిన మయాసురుడు ఆ సభను అతి సుందరంగా నిర్మించాడు. మయుడు నిర్మించిన ఆ సభతో యాదవులయొక్క సుధర్మ ఆనే సభ గాని, బ్రహ్మయొక్కసభ గాని సాటిరావు. మయాసురుని ఆజ్ఞను అనుసరించి ఎనిమిదివేల మంది కింకరులు అనే రాక్షసులు ఆ సభకు రక్షకులుగా ఉన్నారు. వారు ఆ సభను ఒక స్థానంనుండి మరొక ప్రదేశానికి తరలింపగలరు.

ఆ రాక్షసులు భయంకరమైన ఆకారం కలవారు. ఆకాశంలో సంచరింపగలరు. పెద్దశరీరంతో మహాబలవంతులై ఉన్నారు. కళ్లు ఎర్రగాను, పింగళవర్ణంతోను ఉన్నాయి. చెవులు ముత్యపు చిప్పలతో సమానంగా ఉన్నాయి. ప్రహారం చేయడంలో నేర్పరులు వారు. మయాసురుడు ఆ సభలో సాటిలేని సుందరమైన పుష్కరిణిని నిర్మించాడు. దానికి ఏదీ సాటిరాదు. ఆ పుష్కరిణిలో ఇంద్రనీల మణులచే నిర్మింపబడిన నల్లకలువలు ఉన్నాయి. ఆ పద్మాలకాడలు మణులతో చేయబడ్డాయి. అందులో పద్మరాగమణులతో చేయబడిన కమలాలు మనోహరంగా సుగంధాన్ని వ్యాపింప చేస్తున్నాయి. అనేక రకాలయిన పక్షులు ఉన్నాయి. పుష్పించిన పద్మాలతోను, బంగారంతో చేసిన తాబేళ్లు, చేపలతోనూ ఆ సభ విచిత్ర శోభతో ప్రకాశిస్తోంది. విచిత్రమైన స్ఫటికాలతో కూడిన మెట్లతోను, బురదలేని స్వచ్ఛమైన నీటితోను నిండి ఉన్న ఆ కొలను చూడటానికి చాలా అందంగా ఉంది. పిల్లవాయువుచే నీటిబిందువులు తామరపూల రేకులపై చింది, ఆ పుష్కరిణి అంతా ముత్యాల బిందువులు పొదిగినట్లు ముచ్చట గొల్పుతున్నది. ఆ పుష్కరిణి నాల్గువైపుల మణిమయమైన వేదికలు అందంగా నిర్మింపబడ్డాయి. మణులతోను, రత్నాలతోను నిర్మించబడిన ఆ పుష్కరిణి దగ్గరకు రాజాలెవరయినా వచ్చి చూచినప్పుడు వారికి అది పుష్కరిణిగా తోచదు. అది మామూలు ప్రదేశం అనుకొని భ్రమపడి అందులో పడిపోతారు కూడా. ఆ సభాభవనంలో పుష్పఫలాలతో ఉన్న ఎన్నో పెద్దపెద్ద చెట్లు చల్లని నీడను ఇస్తూ ఆహ్లాదం కలిగిస్తున్నాయి. అందమైన ఆ చెట్లు గాలికి ఎప్పుడూ ఊగుతున్నట్లే ఉన్నాయి. కేవలం వృక్షాలే కాదు. ఆ భవనంలో నాల్గువైపుల సుగంధాన్ని వెదజల్లే వనాలు, ఉపవనాలు ఉన్నాయి. అందులో హంసలు, కారండవపక్షులు, చక్రవాకపక్షులు ఉండడంచేత అది చాలా శోభాయమానంగా ఉంది. అక్కడ ఉన్న పద్మాలతో, ఒడ్డునున్న పుష్పాలతో వాయువు సుగంధాన్ని వ్యాపింపచేస్తూ పాండవులకు సేవచేస్తున్నాడు. ఇటువంటి అందమైన

సభను నిండుగా పదునాలుగు నెలలలో మయాసురుడు నిర్మించి ధర్మరాజుకు తెలియజేశాడు

4. మయ సభా ప్రవేశము.

(మయాసురుడు శ్రేష్ఠమైన ఆ సభను నిర్మించి అర్జునునితో ఈవిధంగా అన్నాడు. "సవ్యసాచీ ! ఇదియే మీ సభ. ఇక్కడ ఒక జెండా నేను ఉంచుతాను. దీనియొక్క అగ్రభాగంలో భూతాలలో కింకర గణం నివాసం ఉంటుంది. నీవు ధనుష్టంకారాన్ని చేసినపుడే ఆ శబ్దంతో పాటు ఈ భూతగణం మేఘాలతో సమానంగా గర్జన చేస్తుంది. ఇది సూర్యునితో సమానమైన తేజస్సుతో ప్రకాశించే అగ్నిదేవుని ఉత్తమరథం. అంతేకాదు. ఇవి తెల్లని వర్ణంతో ప్రకాశించే బలిష్ఠమైన దివ్యమైన గుఱ్ఱాలు. ఈ ధ్వజం వానరచిహ్నంతో ఉన్నది. దీని నిర్మాణం అంతా మాయామయం - ఈ జెండా అగ్నిలా పైకి ఎగురుతూ ఉంటుంది. అడ్డం వచ్చినా చెట్లకు తగుల్కొనదు. ఈ వానరధ్వజం అనేకమైన రంగులతో కనిపిస్తుంది. ఇది యుద్ధంలో ఎప్పుడూ పైకి ఎగురుతూనే ఉంటుంది. ఎపుడూ వంగిపోదు. స్థిరంగా ఉంటుంది. ఈవిధంగా మయాసురుడు పలికి, అర్జునుని గాఢంగా ఆలింగనం చేసుకొని వెళ్లిపోయాడు.)

ఆ తరువాత ధర్మరాజు నేయి తేనె కలిపిన పులగాన్ని, పాయసాన్ని, జీవంతి అనే శాకాన్ని అనేక భక్ష్యాలతోను, ఫలాలతోను, భక్ష భోజ్య చోష్య లేహ్యాది నానావిధపదార్థాలతోను వేయిమంది బ్రాహ్మణులకు అన్నసంతర్పణ చేసి, సభాభవనంలోనికి ప్రవేశించాడు. నూతనవస్త్రాలతోను, పుష్పహారాలతోను, సత్కరించి అనేక ప్రాంతాలనుండి వచ్చిన బ్రాహ్మణులను ధర్మరాజు సంతృప్తి పరచాడు. అనంతరం ప్రత్యేకంగా వచ్చిన బ్రాహ్మణులకు అందరికీ వెయ్యి వెయ్యి చొప్పున గోవులను దానం చేశాడు యుధిష్ఠిరుడు. ఆ సమయంలో, ఆ భవనంలో పుణ్యాహవాచనమంత్రాలు ఆకాశమంటుతున్నట్లు మారుమ్రోగాయి. కురుశ్రేష్ఠుడయిన యుధిష్ఠిరుడు అనేక మంగళవాద్యాలు మ్రోగుతూ ఉంటే, వివిధసుగంధ ద్రవ్యాల పరిమళంతో సభాభవనంలో దేవతలను స్థాపించి పూజించాడు. అనంతరం ఆ భవనంలో ప్రవేశించాడు. అక్కడ ధర్మనందనుడైన యుధిష్ఠిరుని సేవించడానికి మల్లులు, నటులు, ఝల్లులు, సూతులు, వైతాళికులు వచ్చారు. తనసోదరులతో కూడి పూజాకార్యక్రమం చేసి, ధర్మనందనుడైన యుధిష్ఠిరుడు స్వర్గంలో ఇంద్రుడి లాగ ఆ సుందర మయిన సభా భవనంలో విహరించాడు.

ఋషులు, వారితోపాటు అనేకదేశాలనుంచి వచ్చిన మహారాజులు పాండవులతో కలిసి ఆ సభలో కూర్చున్నారు. అసితుడు, దేవలుడు, సత్యుడు, సర్పిర్మాలి, మహాశిరుడు, ఆర్యావసుడు, సుమిత్రుడు, మైత్రేయుడు, శునకుడు, బలి, బకుడు, దాల్భ్యుడు, స్థూలశిరుడు, కృష్ణద్వైపాయనుడు, శుకుడు అనేవారూ, వ్యాసుని శిష్యులైన సుమంత పైల జైమినులతో

నేనూ, తిత్తిరి, యాజ్ఞవల్క్యుడు తనకుమారునితో సహా రోమహర్షణుడూ; అప్పుహోమ్యుడు, ధౌమ్యుడు, అణీమాండవ్యుడు, కౌశికుడు, దామోష్ణీషుడు, త్రైబలి, పర్ణాదుడు, ఘటజానుకుడు, మౌంజాయనుడు, వాయుభక్షుడు, పారాశర్యుడు, సారికుడు, బలివాకుడు, సినివాకుడు, సత్యపాలుడు, కృతశ్రముడు, జాతూకర్ణుడు, శిఖావంతుడు, ఆలంబుడు, పరిజాతకుడు, మహాభాగుడైన పర్వతుడు, మార్కండేయుడు, పవిత్రపాణి, సావర్ణుడు, భాలుకి, గాలవుడు, జంఘాబంధుడు, రైభ్యుడు, కోపవేగుడు, భృగుమహర్షి, హరిబభ్రుడు, కౌండిన్యుడు, బభ్రుమాలి, సనాతనుడు, కాక్షీవంతుడు, ఔశిజుడు, నాచికేతుడు, గౌతముడు,పైంగ్యుడు, వరాహుడు, శునకుడు మహాతపస్వి అయిన శాండిల్యుడు, కుక్కురుడు, వేణుజంఘుడు, కాలాపుడు, కఠుడు మొదలగు జితేంద్రియులు, ధర్మవిద్వాంసులు, ధృతాత్ములు అయిన మహర్షులు ఆ సభను అలంకరించారు. వీరితోబాటు వేద వేదాంగ పారంగతులయిన పండితులు, మునిశ్రేష్ఠులు మహాత్ముడైన యుధిష్ఠిరునితోబాటు సభలో కూర్చున్నారు. ధర్మజ్ఞులు, పవిత్రాత్ములు, నిర్మలహృదయులు అయిన మహర్షులు మహారాజైన ధర్మజునకు పవిత్రమైన కథలను చెప్తున్నారు. ఆయనతో పాటు క్షత్రియశ్రేష్ఠ లయిన రాజులు కూడా ధర్మరాజును సేవిస్తున్నారు. మహాత్ముడూ, ధర్మాత్ముడూ, శ్రీమంతుడూ అయిన ముంజకేతుమహారాజు, వివర్ధనుడు, సంగ్రామజిత్తు దుర్ముఖుడు, పరాక్రమవంతుడైన ఉగ్రసేనుడు, కక్షసేన మహారాజు, అపరాజితుడు, క్షేమకుడు, కాంబోజరాజు, కమఠుడు, మహాబలుడైన కంపనుడు ధర్మరాజును సేవిస్తున్నారు. ఆ కంపనుడు బలపౌరుష సంపన్నులు, అస్త్రవేత్తలు, అమితపరాక్రములూ అయిన యువకులను అందరినీ తానొక్కడే నిత్యమూ కంపింపజేసేవాడు. ఇంకా ఆ సభలో జటాసురుడు, మద్రరాజు శల్యుడు, కుంతిభోజమహారాజు, కిరాతరాజయిన పులిందుడు, అంగరాజు, వంగరాజు, పుండ్రకుడు, పాండ్యుడు, ఓడ్రరాజు, ఆంధ్రరాజు, సుమిత్రుడు, శత్రుసంహారకుడైన శైబ్యుడు, కిరాతరాజైన సుమనుడు, యవనదేశాధీశుడు, చాణూరుడు, దేవరాతుడు, భోజుడు, భీమరథుడు, కళింగరాజైన శ్రుతాయుధుడు, మగధ దేశీయుడైన జయసేనుడు, సుకర్ముడు, చేకితానుడు, శత్రుసంహారకుడైన పురుడు, కేతుమంతుడు, వసుదానుడు, విదేహరాజైన కృతక్షణుడు, సుధర్ముడు, అనిరుద్ధుడు, మహాబలాఢ్యుడైన శ్రుతాయువు, దుర్ధర్ష వీరుడైన అనూపరాజు, క్రమజితుడు, సుదర్శనుడు, పుత్రులతో ఉన్న శిశుపాలుడు, కరూషరాజైన దంతవక్త్రుడు, వృష్ణివంశీయులు దేవతాస్వరూపులు అయిన రాజకుమారులు, ఆహుకుడు, విపృథుడు, గదుడు, సారణుడు, అక్రూరుడు, కృతవర్మ, శినిపుత్రుడయిన సత్యకుడు, భీష్మకుడు,

ఆకృతి, పరాక్రమవంతు డైన ద్యుమత్సేనుడు, ధనుర్ధారులలో గొప్పవా డయిన కేకయరాజకుమారుడు, సోమకునిమనుమడైన ద్రుపదుడు, కేతుమానుడు (రెండవ) మొదలగు మహారాజులు ధర్మరాజును సేవిస్తున్నారు. అంతేకాక అస్త్రవిద్యానిపుణులు, మహాబలాఢ్యులు అయిన వసుమానుడు మొదలయిన ప్రధానక్షత్రియులు అందరు ఆ సభలో కుంతీనందనుడైన యుధిష్ఠిరుని సేవిస్తున్నారు.

మహాబలవంతుడు, రాజకుమారుడు అయిన అర్జునుని దగ్గర ఉండి మృగచర్మాంబర ధారులు ధనుర్వేదంలో శిక్షణ ఇస్తున్నారు. వీరుకూడా ఆ సభలో ధర్మరాజును సేవిస్తున్నారు. రాజా! వృష్ణివంశరాజకుమారులు ఆనందంగా ఆ శిక్షణలో పాల్గొన్నారు. రుక్మిణీ కుమారుడైన ప్రద్యుమ్నుడూ, జాంబవతీ కుమారుడైన సాంబుడూ, సాత్యకి, సుధర్ముడూ, అనిరుద్ధుడూ, మానవశ్రేష్ఠుడయిన శైబ్యుడూ, ఇంకా అనేకులైన రాజులూ ఆ సభలో ఉన్నారు. మంత్రులతో కూడ చిత్రసేనుడు మొదలయిన ఇరువదియేడుమంది గంధర్వులు, ఇంకను అప్సరసలూ ఆ సభలో ఉండి ధర్మరాజును సేవిస్తున్నారు. గీతవాద్య నిపుణులయిన సంగీతజ్ఞులు, తాలజ్ఞాన పండితులును లయ, స్థానపరిజ్ఞానంతో సంగీతకళలో విశేషంగా పరిశ్రమచేసిన గాయకులు కిన్నర తుంబురుల ఆజ్ఞానువర్తులై ఉన్నారు. వారితోపాటు ఇతరగంధర్వులు కూడా తగినరీతిలో గానంచేస్తూ మహర్షులందరికీ ఆనందాన్ని కల్గిస్తున్నారు. ఆ విధంగా వారందరు ధర్మరాజును ఆ సభలో సేవిస్తున్నారు. దేవతలందరూ బ్రహ్మదేవుని సేవించినట్లు ఆ సభలో సత్యప్రతిజ్ఞులు, సువ్రతులు అయిన మహాపురుషులు ధర్మరాజును సేవిస్తున్నారు.

5. నారదుడు ధర్మరాజుకు ప్రశ్నరూపమున రాజ్యపాలనమును బోధించుట.

వైశంపాయనుడు అన్నాడు. 'మహారాజా! ఒకరోజున ఆ సభలో మహాత్ములైన పాండవులు, ఇతర మహాపురుషులూ, గంధర్వులూ అందరూ కూర్చొని ఉన్నారు.

అపుడు నారదుడు అక్కడకు వచ్చాడు. అతడు వేదాలు, ఉపనిషత్తులు పూర్తిగ తెలిసియున్న జ్ఞాని, దేవతలందరి చేత పూజింపబడేవాడు. ఇతిహాసాలూ పురాణాలూ తెలిసినవాడు, పూర్వకల్పవిశేషాలు ఎరిగినవాడు. ధర్మజ్ఞుడు. న్యాయవేత్త. శిక్షా, కల్ప, వ్యాకరణ, నిరుక్త, ఛందములు, జ్యోతిషం ఎరిగినవాడు. ఐక్య సంయోగ, వియోగ, నానాత్వ, సమవాయాలలో విశారదుడు. మహావక్త. ప్రగల్భుడు, మేధావి. స్మరణశక్తికలవాడు,

నీతిశాస్త్ర విశారదుడు, త్రికాలదర్శి, పరాపర విభాగం తెలిసినవాడు, ప్రమాణపూర్వకంగా సిద్ధాంతాన్ని నిశ్చయించేవాడు. ప్రతిజ్ఞా, హేతు, ఉదాహరణ, ఉపనయ, నిగమాలు అనే పంచావయవాలతో కూడిన వాక్యాలలోని గుణ దోషాలు తెలిసినవాడు. బృహస్పతి వంటి మహావక్తలకు సాటిగా ఉత్తరప్రత్యుత్తరాలు ఇవ్వటంలో సమర్థుడు, ధర్మ అర్థ కామ మోక్షాలు అనే నాల్గుపురుషార్థాల పరస్పర సంబంధం యథార్థంగా తెలిసినవాడు. ప్రత్యక్ష అనుమానాది ప్రమాణాల యొక్క పరిష్కృత సిద్ధాంతం కలవాడు. ఈ పదునాల్గులోకాలలో సమస్తాన్ని ప్రత్యక్షంగా దర్శింపగల సమర్థుడు, మహాబుద్ధిశాలి, సాంఖ్యయోగ విభాగాలను తెలిసినవాడు. దేవాసురులలో ప్రసిద్ధికెక్కిన వైరాగ్యం కలవాడు. సంధి విగ్రహ తత్త్వజ్ఞుడు. స్వపర పక్షాలలోని బలాబలాలను సులభంగా అంచనా వేసి, శత్రు పక్షాన్ని తన పక్షానికి త్రిప్పుకొనే నేర్పు కలవాడు. రాజనీతిలో షడంగాలను ఉపయోగించడంలో నేర్పుగలవాడు, సమస్త శాస్త్రాలు తెలిసిన పండితుడు. విద్వాంసుడు. యుద్ధవిద్యలోలాగ సంగీతంలో కూడా కుశలుడు, ఏమాత్రం కోపం ఎరుగనివాడు. ఇంకా అసంఖ్యాకసద్గుణాలతో కూడిన మననశీలుడు, పరమ తేజశ్శాలి. అన్ని లోకాలలో సంచరిచగలడు. నారదమహర్షి పారిజాతుడు, పర్వతుడు, సౌమ్యుడు, సుముఖుడు మొదలగు అనేక మహర్షులతో కూడి ప్రేమపూర్వకంగా పాండవులను కలుసుకోవాలని మనోవేగంతో ఆ ధర్మరాజుయొక్క సభకు వచ్చి జయసూచకమైన ఆశీర్వచనాల ద్వారా ధర్మరాజును గౌరవించాడు. వచ్చిన నారదమహర్షికి సర్వధర్మాలను పూర్తిగా తెలిసిన యుధిష్ఠిరుడు తన సోదరులతో సహా సింహాసనం నుండి లేచి, ప్రేమతోను, వినయంతోను నమస్కారం చేశాడు. ఆ మహనీయుడికి ఉచితాసనాన్ని చూపించి కూర్చుండబెట్టి ఆ ధర్మరాజు నారదమహర్షికి గోవులను, మధుపర్కాన్ని బహూకరించి సంప్రదాయబద్ధంగా అర్ఘ్యపాద్యాదులను సమర్పించి, రత్నాలతో శాస్త్రోక్తంగా పూజించి సంతోషపరచాడు. ధర్మజుడు చేసిన ఈ యథోచిత స్వాగత సత్కారానికి నారదమహర్షి చాలా సంతోషించాడు. ఈ విధంగా పాండవులు పూజించిన తరువాత ధర్మ,అర్థ,కామాలను దృష్టిలో పెట్టుకొని నారదుడు, ధర్మరాజును ఇలా అడిగాడు.

"ధర్మరాజా! నీ ధనం యజ్ఞాలకు, దానధర్మాలకూ, కుటుంబరక్షణకు, ఇతరసత్కార్యాలకు ఉపయోగిస్తున్నావా? నీమనస్సు విక్షేపం లేకుండా సుప్రతిష్ఠితమై ఉంటోందా? సుఖసంతోషాలు పొందుతున్నావా? మీ వంశంలో పుట్టిన రాజశ్రేష్ఠుల నుండి పరంపరగా సంప్రాప్త మవుతున్న ధర్మసహిత మయిన వృత్తిని అవలంబించి ధర్మార్థకామాలు ఒకదానినొకటి బాధింపకుండ సముచిత సమయాల్లో వాటిని సేవిస్తూ సుఖిస్తున్నావా?

అర్థంవలన ధర్మం గాని, ధర్మం వల్ల అర్థం గాని, ప్రీతిసార మయిన కామంచేత ఈ రెండూ గాని బాధింపబడటం లేదుగదా! ధర్మ అర్థ కామ మోక్షాలు కాలజ్ఞుడవై కాలవిభజన చేసి సేవిస్తున్నావా? అనఘా! వక్తృత్వం, ప్రాగల్భ్యం, మేధ, పూర్వ-ఉత్తర వచనాల స్మరణం, నీతి విజ్ఞానం, విచక్షణత్వం అనే ఆరు రాజగుణాలతోనుకూడి, ధర్మాన్ని పరిశీలిస్తూ సామ దాన భేద దండాలు, మంత్రం, ఔషధం, ఇంద్రజాలం అనే ఏడు ఉపాయాలను తగినరీతి ఉపయోగిస్తూ బలాబలాలను పరీక్షిస్తున్నావా? విజేతలలో శ్రేష్ఠుడా! యుధిష్ఠిరా! నీ శక్తిని, శత్రువుల శక్తినీ బాగుగా పరిశీలించి, శత్రువు బలిష్ఠ డయితే అతనితో సంధి కుదుర్చుకొనడానికి ప్రయత్నిస్తున్నావా? నీ కోశాగారాన్నీ, ధనాన్నీ పెంచుకోవడానికి అష్టకర్మలయిన వ్యవసాయం, వ్యాపారం, యుద్ధం, సేతువు, గజబంధనం, గనులలో రాబాదాయం పొందటం, బంగారుగనులను వెదికించటం అనే ఎనిమిందింటిని నడిపిస్తున్నావా? భరతవంశోత్తమా! దుర్గాధ్యక్షుడు, బలాధ్యక్షుడు, ధర్మాధ్యక్షుడు, సేనాపతి, పురోహితుడు, వైద్యుడు, జ్యోతిషుడు అనే ఏడుగురు నీయందే అనురక్తులై ఉన్నారుగదా? మోసగాండ్రయిన దూతలకు లోబడటం లేదు గదా! ఏ మాత్రం శంకింపరాని కపటులైన దూతలు నీనుండి కాని, నీమంత్రులనుండి కాని నీ రహస్యాలోచనలను బయటపెట్టడం లేదుగదా! నీ మిత్రులు, శత్రువులు, ఉదాసీనులు మొదలగు వారి విషయంలో వారు ఎప్పుడు ఏమిచేస్తున్నారో తెలుసు కొంటున్నావా? తగిన సమయంలో సరిగా ఆలోచించి సంధి చేసుకోవడం, లేదా యుద్ధానికి సిద్ధపడటం చేస్తున్నావా? వీరవరా! ఉదాసీనులయందుగాని, మధ్యముల యందు కాని ఏదయినా ప్రవర్తనను అనుమానిస్తున్నావా? నీతో సమానులు, వృద్ధులు, నిష్కల్మషహృదయులు, అన్ని విషయాలలో చక్కగా చెప్పగల సమర్థులు, ఉత్తమకుల సంజాతులు, నీయందు అనురాగం గలవారు. వీరిని రాజకార్యాల్ని నడపటానికి మంత్రులుగా నియోగిస్తున్నావా? రాజు యొక్క విజయం వారి ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది. సమాలోచనలను రహస్యంగా దాచగలిగిన శాస్త్రపరిజ్ఞానం కల మంత్రులద్వారా మాత్రమే రాష్ట్రం సురక్షితంగా ఉంటుంది. అట్టిరాజ్యాన్ని శత్రువులు ఎన్నటికీ నాశనం చేయలేరు.

నీవు అకాలంలో నిద్రావశుడవు అగుట లేదుగదా. సమయానికి లేస్తున్నావా? అర్థశాస్త్రాన్ని తెలుసుకొని ప్రవర్తిస్తున్నావు కదా! రాత్రిళ్లు అపరభాగంలో మేల్కొని కర్తవ్యం గురించి ఆలోచిస్తున్నావా? ముఖ్య రాజకార్యాలను నీవు ఒక్కడివే ఆలోచించటం లేదుగదా? ఎప్పుడూ రహస్యం ఇద్దరిమధ్యలోనే ఉండాలిగదా! అదే విధంగా తెలిసీ తెలియని అనేకులతో కూడా రహస్యవిషయాల్ని ఆలోచించటం లేదుగదా? నీవు ఆలోచించిన రహస్యం నీ

రాజ్యాన్ని అతిక్రమించి శత్రురాజ్యానికి పోవటం లేదుగదా? హితులైన మంత్రులతో ఆలోచన చేసి అల్పప్రయత్నంతో విశేషఫలాల్ని పొందదగిన కార్యాలను ఆలస్యం చేయక వెంటనే ప్రారంభిస్తున్నావా? అటువంటి కార్యాలకు ఆటంకం కల్గించటం లేదు కదా? నీ రాజ్యంలో రైతులు, కర్షకులు మొదలయిన శ్రమజీవులు అందరూ నీకు అజ్ఞాతులుగా లేరు గదా! వారి కార్యాల్లో నీ దృష్టిని ప్రసరిస్తున్నావుకదా? వారు నీకు విశ్వాసపాత్రులే కదా! ఒకసారి విడిచిపెట్టి, మళ్ళీ గ్రహించిన వారేనా అందరూ? (మళ్లీ సేవలో తీసుకున్నావంటే వారు నిష్కల్మషులని భావం) ఆప్తులూ, లోభరహితులూ, వంశక్రమంగా సేవిస్తున్నవారు కృషి నిర్వహణ చేస్తున్నారా? రాజా! వారిచేత చేయింపబడినా చాలు. వారు విశ్వాస్యులై రహస్యరక్షణ చేస్తారు. ధర్మజ్ఞులు, సంపూర్ణశాస్త్రమర్మజ్ఞులు అయిన విద్వాంసులను రాజకుమారులకుగాని, ముఖ్యులైన యోధులకుగాని శిక్షణ ఇవ్వటానికి నియమించావా? నీవు వేయిమంది మూర్ఖులను తీసుకొనడం కంటె ఒక్కపండితుని తీసుకుంటే సరిపోతుంది కదా ! కష్టసమయాలలో పండితుడు ఒక్కడే రాజ్యానికీ, రాజుకూ శుభాన్ని కలిగిస్తాడు. నీ కోటలన్నీ, ఇంకా ధనధాన్యాలు, అస్త్రశస్త్రాలు, ఉదకస్థానాలు, యంత్రాలు, శిల్పులు, ధనుర్ధారులైన సైనికులు, అందరూ ఎట్టిలోటు లేకుండా పరిపూర్ణంగా ఉన్నారా? మేధావీ, శూరుడూ, ఇంద్రియ నిగ్రహమూ, విచక్షణజ్ఞానమూ గల మంత్రి ఒక్కడయినా రాజునకు గాని, రాజపుత్రునకు గాని గొప్పసంపదను కల్గించగలడు.

ఒక్కొక్క ప్రదేశంలో, తీర్థంలో ముగ్గురు ముగ్గురు చొప్పున ఒకరికొకరు తెలియకుండా శత్రుపక్షంలోని పద్దెనిమిదిమంది మీద, నీపక్షంలో పదిహేనుమంది మీద గూఢచారులను నియమించావా? నీవు శత్రువులనుండి అజ్ఞాతంగా ఉంటూ, నిత్యమూ జాగరూకుడవై ఉంటూ వాళ్ల కదలికలను, చేష్టలను ఒక కంటితో కనిపెట్టి చూస్తున్నావా? వినయశీలుడు, సత్కులమందు జన్మించినవాడూ, పండితుడూ, విద్వాంసుడూ, అసూయలేనివాడూ, శాస్త్రచర్చలో నేర్పుగలవాడూ అయి నీ పురోహితుడు నీ చేత సత్కరింపబడుతున్నాడా? నీవు చేసే యజ్ఞములందు యాజ్ఞికుడుగా నియోగింపబడిన బ్రాహ్మణుడు శాస్త్రజ్ఞానం కలవాడేనా? బుద్ధిమంతుడై, ఋజువర్తనుడై, హుతాన్ని గురించి హోమము చేయుచున్న దానిని గురించి, తగిన సమయాల్లో నీకు తెలియజేస్తున్నాడా? నిన్ను ఆశ్రయించిన దైవజ్ఞుడు జ్యోతిష శాస్త్రంలో సంపూర్ణపాండిత్యం గలవాడై, గ్రహచారాలను పరిశీలించి, శుభాశుభాలను చక్కగా చెప్పటంలో నేర్పరిగా ఉన్నాడా? సేవకులను ఉత్తము లని, మధ్యము లని, అధము లని విభజించి ఉత్తములకు ఉత్తమకార్యాలను, మధ్యములకు

మధ్యమకార్యాలను అధములకు అల్పకార్యాలను వారి వారికి తగినట్లు నియోగిస్తున్నావా? ధర్మార్థకామాల్లో పరీక్షలు దాటి పవిత్రులై, వంశపారంపర్యంగా వస్తున్న ఉత్తమోత్తములనే ఉత్తమకార్యాల్లో నియోగిస్తున్నావు కదా! భరతశ్రేష్ఠా! కఠినశిక్షలతో నీవు ప్రజలను బాధించటంలేదుగదా! మంత్రులందరూ నీ రాజ్యాన్ని న్యాయపూర్వకంగా నిర్వహిస్తున్నారా? కామచారుడైన పురుషుని స్త్రీలు పరిత్యజించినట్లుగా, పతితుడైన యజమానిని యాజకులు విడిచిపెట్టినట్లుగా ఉగ్రమైన శిక్షలను విధించిన రాజును ప్రజలు అవమానిస్తారు. అలా నిన్ను ప్రజలు అవమానించటం లేదు కదా!

నీ సేనాపతి కులీనుడై ధైర్యశాలిగాను, పరాక్రమవంతుడు గాను, బుద్ధిశాలిగాను, సంతోషంతోను, ఉత్సాహంతోను, నీయందు అనురాగంతోను ఉండి నేర్పరిగా ఉంటున్నాడా? నీ సైన్యంలో ప్రధానులైన దళపతులు నిర్భీకులై, యుద్ధ విశారదులై, నిష్కపటులై, పరాక్రమవంతులై ఉన్నారా? యథోచిత సత్కారాలు చేసి వారిని గౌరవించి తృప్తిని కలిగిస్తున్నావా? నీసైన్యానికి యథోచితంగా భోజనసదుపాయం, వేతనం సకాలానికి అందేటట్లు చేస్తున్నావా? వారి వేతనాలను ఆలస్యం కాకుండా, తక్కువకాకుండా అందజేస్తున్నావా? భోజనవిషయంలోగాని, వేతనవిషయంలోగాని ఆలస్యం జరిగితే సేవకులు స్వామియందు కోపిస్తారు. ఆ కోపంవల్ల రాజుకు ఎన్నో అనర్థాలు కలుగుతాయి. ఉత్తమకులంలో జన్మించినట్టి నీ మంత్రులు, ఇతర అధికారులు అందరూ నీయందు ప్రేమతో అవసరమైతే యుద్ధంలో ప్రాణాలయినా విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నారా? యుద్ధసాధనాలను పూర్తిగా తనొక్కడి అదుపులోనే నిలుపుకొని, నీ శాసనాలను ఉల్లంఘిస్తూ స్వేచ్ఛగా సంచరించేవాడు ఎవ్వడూ నీ సేవకులలో లేడుగదా! నీ సేవకు లెవరయినా పురుషప్రయత్నంతో కార్యాలు చక్కగా నిర్వహిస్తూ ఉంటే, వారికి అధికమర్యాద, వేతనమూ ఇచ్చి గౌరవిస్తున్నావా? విద్యా వినయసంపన్నులయిన మహానుభావులను వారి వారి అర్హతలను బట్టి దానాదులతో సత్కరిస్తున్నావా? భరతశ్రేష్ఠా! నీ మేలుకోరి నీకోసం ప్రాణాలు అర్పించిన వారి భార్యాపుత్రులకు గాని, నీ మేలుకోసం సేవచేసి కష్టాలలో ఉన్న కుటుంబాలకు గాని రక్షణగా ఉంటూ వారి కష్టాలను తీరుస్తున్నావు గదా! నీవల్ల భయపడి గాని, ధనసాధనసంపత్తి నశించి నిన్ను ఆశ్రయించినవారిని గాని, వారికి శరణు ఇచ్చి ఆదుకొంటున్నావా? యుద్ధంలో నీతో ఓడిపోయిన వారిని నీ పుత్రులవలె భావించి వారిని కాపాడుతున్నావా? రాజా! ఈ సమస్త భూమండల ప్రజలయందు సమదృష్టితో, ఆర్జవంతో ఉంటూ, వారిని అందరినీ తల్లిదండ్రులు బిడ్డలను రక్షించినట్లుగా రక్షిస్తున్నావా? భరతకులశ్రేష్ఠా! నీ శత్రువు స్త్రీ,

జూదం, మొదలయిన వ్యసనాలలో చిక్కుకొని కష్టాలలో చిక్కుకొన్నాడని తెలిస్తే అతనిపై త్రివిధబలాలైన మంత్ర,కోశ, సైనికబలాలను ప్రయోగించి అమితవేగంతో పరాక్రమించి అతని రాజ్యాన్ని ఆక్రమించుకొంటున్నావా? శత్రుసంహారకా! పార్ష్ణిగ్రాహులు మొదలగు పండ్రెండు మందిని గురించి తెలుసుకొని, అపుడు నీ కర్తవ్యాన్ని నిశ్చయించుకొని, నీ పక్షంలో ఉన్న పరాజయానికి కారకాలైన దైవ మానుష వ్యసనాల్ని సరిచేసుకొని, నీ సైనికబలానికి ముందుగా జీతాలు చెల్లించి యాత్రను ప్రారంభిస్తున్నావా? పరంతపా! నీ శత్రురాజ్యంలో ప్రధానులైనవారికి ధనాలను, రత్నరాశులను అర్హత ననుసరించి రహస్యంగా ఇచ్చి, వారిని నీ వశవర్తులుగా చేసుకొంటున్నావా? కుంతీనందనా! నీవు ముందుగా ఇంద్రియాలను జయించి, అరిషడ్వర్గాన్ని జయించి, ఇంద్రియదాసులైన శత్రువులను వశవర్తులుగా చేసుకొంటున్నావా?

నీవు శత్రువులను ఆక్రమించే ముందరే, పరాకులేకుండా, సామం దానం భేదం దండం అనే నాలుగు ఉపాయాలను వినియోగించి వారిని జయిస్తున్నావా? మహారాజా! నీ రాజ్యానికి మూలాధారాలైన రథాలు, అశ్వాలు, గజాలు, పదాతులు, యంత్రాలు, ఔషధాలు, ద్రవ్యాలతో కూడిన సైన్యాన్ని సమకూర్చుకొని శత్రువులపై దండెత్తుతున్నావా? పరాక్రమంతో వారిపై గెలుస్తున్నావా? ఓడిపోయిన వారిని రక్షిస్తున్నావా ? ధనరక్షకుడు, ద్రవ్యసంగ్రాహకుడు, చిక్సితకుడు, గుప్తచరుడు, పాచకుడు, సేవకుడు, లేఖకుడు, ప్రహరి అనే ఈ ఎనిమిదిమంది, ఇంకా గజాలు, అశ్వాలు, రథాలు, కాల్బలం అనే ఈ నాలుగు బలాలతో కూడి నీ సేన యోగ్యుడైన సేనాపతిద్వారా చక్కగా ప్రయోగింపబడి శత్రుసంహారానికి సమర్థంగా ఉన్నదా? శత్రుసంహారకా! నీవు శత్రురాజ్యంలో కరువు కాటకాలు కల్గినపుడు రణభూమిలో శత్రుసంహారం చేస్తున్నావా? నీదేశంలోను, శత్రుదేశంలోను నీ చేత నియమింపబడిన అధికారులు ఆయా స్థానాల్లో తిరుగుతూ, ప్రజలను వశపరచుకొంటూ, కార్యాలను ప్రయోజనకరంగా చేస్తూ, పరస్పరం కలుసుకొంటూ, రాష్ట్రాన్నీ, ప్రజలనూ రక్షిస్తున్నారా? మహారాజా! నీవు తినే పదార్థాలను, శరీరధారణకు ఉపయోగించే వస్త్రాలను, సుగంధద్రవ్యాలను నీయందు పరిపూర్ణవిశ్వాసం కల ఆప్తులే చేస్తున్నారా? భాండాగారం, గోష్ఠం, వాహనం, ద్వారం, ఆయుధాగారం, ధనార్జన అనే వీటియందు సుపరీక్షితులైన నీభక్తులే అధికారులై తమకార్యాలను అనుష్ఠిస్తున్నారా? మహారాజా! బాహ్య-ఆభ్యంతర రక్షణలతో ముందు నిన్ను నీవు రక్షించుకొంటున్నావా? అలాగే ఆ రెండింటిని పరస్పరం ఒకదానితో మరొకదానిని (అనగా బాహ్యాన్ని ఆభ్యంతరంతోను, ఆభ్యంతరాన్ని బాహ్యంతోనూ)

రక్షిస్తున్నావా? బాహ్యాభ్యంతరాలకు విరోధం లేకుండా పరస్పరం రక్షిస్తున్నావా? నీ సేవకులు పూర్వాహ్ణకాలంలో (ఇది ధర్మాచరణకు తగిన సమయం) మద్యపానం, జూదం, ఆటలు, స్త్రీ, వ్యసనలోలత్వం మొదలైన వాటియందు ఆసక్తులై నీ సమయాన్నీ, నీ ధనాన్ని నష్టపరస్తూ సమయాన్ని వ్యర్థం చేయరు కదా?

నీ ఆదాయంలో నాల్గవపాలుతో గాని, మూడుపాళ్లతో గాని, అర్థభాగంతో గాని, నీ ఖర్చు జరిగిపోతున్నదా? అంతకంటె ఎక్కువగా ధనవ్యయం చేయవుగదా? రాజా! నిన్ను ఆశ్రయించిన కుటుంబాలనూ, గురువులనూ, వృద్ధులనూ వ్యాపారులనూ, శిల్పులనూ, దీనులనూ, దుఃఖితులనూ ధన ధాన్యాలను ఇచ్చి అనుగ్రహిస్తున్నావా? నీ ఆయవ్యయాలను రాసే కరణాలు అందరూ పూర్వాహ్ణంలో ప్రతిదినం ఆదాయ వ్యయాలను చెపుతున్నారా? కొంతమంది అర్థశాస్త్ర విషయాల్లో నిపుణులై ఉంటారు. వారు నీకు హితం కోరుతూ పరోక్షంలో కూడా ప్రియం చేస్తూ ఉంటారు. వారిలో ఎప్పుడూ దోషం కనపడదు. అటువంటి వారిని అధికారం నుండి తొలగించటం లేదుకదా! మహారాజా! నీవు నీ సేవకులను ఉత్తమ మధ్యమ, అధమ - అని మూడు విభాగాల్లు చేసి వారి వారికి తగిన కార్యాలలోనే నియోగిస్తున్నావా? రాజా! ఫలాపేక్షగలిగిన లోభులను గాని, దొంగలను గాని, శత్రువులనుగాని, వ్యవహార జ్ఞానశూన్యులను గాని రాచకార్యాలలో నియోగించవు కదా? చోరులవల్ల గాని, లోభులవల్ల గానీ, రాజకుమారుల వల్ల గానీ, రాజస్త్రీల ద్వారా గానీ, నీవల్లగానీ రాష్ట్రానికి ఎటువంటి బాధ కలగటం లేదుకదా? నీ రాజ్యంలో రైతులు సంతోషంగా ఉంటున్నారా? నీ రాజ్యంలో అన్ని ప్రాంతాలలో పెద్ద చెరువులన్నీ నీటితో నిండి ఉన్నాయా? కేవలం వర్షాధార వ్యవసాయం జరగటం లేదుగదా ! నీ రాజ్యంలో కర్షకులకు అన్నానికీ, విత్తనానికీ కొఱత లేకుండా ఉన్నదా? వారిపై ప్రత్యేకంగా దయచూపిస్తూ నూటికి రూపాయి వడ్డీ చొప్పున ఋణాన్ని ఇస్తున్నావా? తాతా! నీ రాజ్యంలో ఉత్తమపురుషులద్వారా కృషి, గోరక్ష, వ్యాపారం అన్నీ చక్కగా జరుగుతున్నాయా? వార్త సుభిక్షంగా ఉంటే లోకులంతా సుఖాన్ని ఉన్నతిని పొందుతారు.

రాజా! నీ రాజ్యంలోని ప్రత్యేకగ్రామాలలో శూరవీరులు, బుద్ధిమంతులు, కార్యకుశలులు 1) కార్యప్రారంభంలో మెలకువ కలిగి ఉండడం 2) కార్యాన్ని నెరవేర్చడానికి తగిన మనుష్యులయొక్క, ద్రవ్యముయొక్క సహకారం పొందడవీ 3) దేశకాలవిభజనం చేయడం 4) ఆపద కల్గినపుడు రహస్యంగా ఉంచడం, 5) కార్యసిద్ధి అనే ఈ అయిందింటిని బాగా తెలుసుకొని రాజ్యానికి క్షేమం కల్గిస్తున్నారా? పట్టణాలను రక్షించడానికి గ్రామాలను,

గ్రామాలను రక్షించడానికి పల్లెలను, శూరులద్వారా, వీరుల ద్వారా రక్షిస్తున్నావా? ప్రాంతాలు, గ్రామాలు, నగరాలు – వీటి అధిపతులందరూ నీకు పన్నురూపంలో ధనాన్ని సమర్పిస్తున్నారా? నీ రాజ్యంలో రక్షకభటులు సైన్యసహాయకులై దొంగలను, బందిపోటులను అణచివేయడానికి సుగమనగరాల్లోనూ, దుర్గమనగరాల్లోనూ సంచరిస్తున్నారా? నీవు స్త్రీ సంరక్షణలో సంతృప్తి చెందుతున్నావా? నీ యొక్క పరిపాలనలో స్త్రీలందరు సురక్షితంగా ఉంటున్నారా? వాళ్లయందు నీవు పూర్తి విశ్వాసంతో లేవు గదా! వారితో రహస్యంగా మాట్లాడటం లేదు కదా! నీవు ఎప్పుడైన అమంగళకరమయిన వార్తలు వినినపుడు గాని, ఆ విధమైన సమాచారాన్ని తీవ్రంగా ఆలోచిస్తునపుడు గాని, అంతఃపురంలో స్త్రీలోలుడవై ఆనందంలో మునిగితేలుతూ ఉండవు గదా?

ప్రజాపతీ! నీవు రాత్రిళ్లు ప్రథమయామంలోను, రెండవజాములోను నిద్రపోయి చివరియామంలో నిద్రనుండి మేల్కొని ధర్మాన్ని, అర్థాన్ని గురించి ఆలోచన చేస్తున్నావా? పాండునందనా! నీవు ప్రతిదినం ప్రభాతకాలంలోనే నిద్రనుండి మేల్కొని, అలంకరించుకొని, దేశకాలాలకు అనుగుణంగా మంత్రులతో కూర్చుండి, నీ దర్శనార్థం వచ్చిన ప్రజానీకానికి దర్శనమిచ్చి వారి కోరికలను నెరవేరుస్తున్నావా? శత్రుసంహారకా! ఎట్టని వస్త్రాల్ని ధరించి ఖడ్గపాణులైన భటులు నిరంతరం నీ చుట్టూ నీరక్షణలో సావధానులై ఉంటున్నారా? మహారాజా! నీవు శిక్షింపదగినవారికి యమధర్మరాజులాగ; గౌరవింపదగిన వారికీ నీయందు అనురక్తి కలిగిన వారికి ధర్మరాజులాగా ప్రవర్తిస్తున్నావా? ఎవరు ప్రియులో, ఎవరు అప్రియులో పరీక్షించి ఎవరియందు ఏవిధంగా వ్యవహరించాలో ఆ విధంగా వ్యవహరిస్తున్నావా? కుంతీకుమారా! శరీరానికి రోగం సంభవించినప్పుడు ఔషధాలను సేవించి గాని, లంఘన చికిత్స చేసి గాని రోగం పోగొట్టుకొని ఆరోగ్యవంతునిగ ఉంటున్నావా? పెద్దలను సేవించి మనస్సును సంతోషపరచుకొంటున్నావా? కాయచికిత్స, బాలచికిత్స, గ్రహచికిత్స, ఊర్ధ్వాంగ చికిత్స, శల్యచికిత్స, దంష్ట్రాచికిత్స, జరాచికిత్స, విషచికిత్స అను అష్టాంగ వైద్య చికిత్సలలో ప్రవీణులైన వైద్యులు నీయందు అనురక్తులై సహృదయంతో నీకు శరీరతాపం కలుగకుండా మేలు కలిగిస్తున్నారా?

నరేశ్వరా! లోభం చేత గాని, మోహం చేత గాని నీదగ్గరకు వచ్చిన యాచకులను గాని, పశ్చాత్తాపంతో నీ దగ్గరకు చేరిన ప్రత్యర్థులను గాని ఎప్పుడూ దర్శనమివ్వకుండా అవమానించడం లేదుగదా? నిన్ను ఆశ్రయించిన జనులయొక్క జీవనోపాధులను నీవు లోభం వల్ల గాని, మోహం వల్ల గాని, ఆత్మవిశ్వాసం వల్లగాని ఎన్నడూ ఎగతాళికైనా

అడ్డగించుట లేదుగదా? నీ నగరవాసులు గాని, రాష్ట్రప్రజలు గాని అంతా కలిసి నీయందు విరోధంతో ప్రవర్తించడం లేదుగదా? అందులో ఎవరైనా నీ శత్రుపక్షం నుండి ద్రవ్యలాభాన్ని పొంది నీతో కలహించడం లేదుగదా? ఎవడైనా దుర్బలుడు - ఇదివరకు నీచేత చంపబడకుండా బాధింపబడ్డవాడు - ఇపుడు మంత్రాగం వల్లగాని సేనాబలం వల్లగాని బలవంతుడై నీకు ఎదురు తిరగటం లేదుగదా? నీ సామంతులలో ప్రధానులైన రాజులందరు నీయందు ప్రేమతో ఉంటున్నారా? నీ చేత గౌరవింపబడుతూ వారు నీకోసం ప్రాణాలను సహితం అర్పించడానికి సిద్ధంగా ఉన్నారా? అన్ని విద్యలలోను ఆరితేరినవారిని పరీక్షించి ఆ విద్వాంసుల్ని గౌరవిస్తున్నావా? బ్రాహ్మణులకూ, సాధుపుంగవులకూ నీవు సేవచేస్తున్నావా? నీకు ఎల్లపుడూ శుభాల్ని కల్గిస్తూ ఉండే వారికి దక్షిణలు ఇచ్చి గౌరవిస్తున్నావా? వారు నీ స్వర్గప్రాప్తికీ, మోక్షప్రాప్తికీ కారకులు కదా! నీ పూర్వపురుషులు అందరూ మూడు వేదాలను ఆధారంగా చేసుకొని ధర్మాన్ని ఆచరించారు. ఆ ధర్మాన్నే నీవు ఆచరించడానికి నీ పూర్వులలాగా ప్రయత్నం చేస్తున్నావా? ధర్మాచరణకు అనుకూలమైన కార్యాలలో నీ మనఃప్రవృత్తి నిలుస్తున్నది గదా? నీ రాజభవనంలో నీ కళ్ల ఎదుట సద్గుణగరిష్ఠులైన బ్రాహ్మణులు మధురపదార్థాలు, రసవంతమైన మృష్టాన్నాలు భుజిస్తున్నారా? భోజనం తరువాత వారికి దక్షిణలిచ్చి సత్కరిస్తున్నావా? నీవు ఏకాగ్రమనస్కుడవై వాజపేయం, పౌండరీకం మొదలైన యాగాలను నిండుమనస్సుతో ఆచరించడానికి ప్రయత్నం చేస్తున్నావా?

నీ జ్ఞాతులకు, గురువులకు, వృద్ధులకు, దేవతాపసులకు, అశ్వత్థం మొదలైన పుణ్యవృక్షాలకు, శుభకారకులైన బ్రాహ్మణులకు ప్రతిదినం నమస్కరిస్తున్నావా? పుణ్యాత్మా! నీ మనస్సులో ఎప్పుడూ దుఃఖానికి గాని, కోపానికి గాని ఆశ్రయం ఇవ్వడం లేదుగదా? మంగళకరమైన వస్తువులను చేతిలో ఉంచుకొని నీ పరివారం నిన్నెప్పుడూ విడిచిపెట్టక నీ ప్రక్కనే ఉండి సేవిస్తున్నదా? పుణ్యాత్మా! ఇప్పటివరకు నేను చెప్పినట్లుగా నీ బుద్ధి, ప్రవృత్తి ఉన్నాయికదా? ఇటువంటి విధంగా ధర్మానికి అనుకూలమైన బుద్ధితో ప్రవర్తించినట్లయితే ఆయుర్వృద్ధి, దాంతో బాటు యశోవృద్ధి కలిగి ధర్మార్థకామాలను సంపూర్ణంగా ఆచరించేవాడివి కాగలవు. ఈ విధంగా ధర్మబుద్ధితో ప్రవర్తిస్తే, అతనిరాజ్యం ఎన్నడూ నశించదు. ఈ విధంగా ప్రవర్తించిన రాజు భూమండలాన్ని అంతటినీ జయించి సుఖిస్తూ దిన దినాభివృద్ధి చెందుతాడు. శాస్త్రకుశలులతో, విద్వాంసులతో సాంగత్యం లేక నీ మంత్రులలో మూర్ఖులు ఎవరయినా పవిత్రాత్ములపై దొంగతనం అనే నేరాన్ని మోపి వారి ధనాన్ని అన్యాయంగా కాజేస్తున్నారా? లోభంవల్ల అధికంగా ధనాన్ని సంపాదించాలని

వారికి మరణశిక్ష విధిస్తున్నారా? యుధిష్ఠిరా! "పరలోకం లేదు. ఈశ్వరుడు లేడు" అనే నాస్తిక్యభావం, అసత్యం, కోపం, ఏమఱుపాటు, దీర్ఘచింతనం, జ్ఞానులతో సహవాసం చేయకుండటం, ఆలస్యం, పంచేంద్రియ విషయాల్లో ఆసక్తి చూపటం, ప్రజోపయోగవిషయాలలో ఒక్కడే ఆలోచన చేయటం' అర్థశాస్త్రం తెలియని మూర్ఖులతో ఆ విషయాలను గురించి ఆలోచించటం, నిశ్చయించుకొన్న కార్యాలను చేయకుండటం, రాచరికపురహస్యాలను బయటపెట్టడం, మంగళకరమైన ఉత్సవాల్ని చేయకుండటం, ఒక్కడితో శత్రువుపైకి దాడి వెళ్లటం - అనే ఈ పద్నాలుగూ రాజదోషాలు. ఈ పద్నాలుగు దోషాల్ని నీవు విడిచి పెట్టావుగదా? వీటిచేత రాజు తప్పక నష్టపోతాడు. నీ వేదాలు సఫలమయ్యాయా? నీ ధనం సఫలం అయిందా? నీ స్త్రీలు అందరు సఫలమయ్యారా? నీ శాస్త్రజ్ఞానం సఫలం అయిందా?"

ఆ విధంగా నారదుడు ప్రశ్నించిన తరువాత యుధిష్ఠిరుడు నారదునితో "దేవర్షీ! వేదాలు ఏ విధంగా సఫలం అవుతాయి? ధనం ఎలా సఫలం అవుతుంది? స్త్రీల సాఫల్యం ఏవిధంగా ఉంటుంది? శాస్త్రజ్ఞానం ఏవిధంగా సఫలం అవుతుంది?" అని అడిగాడు. **ఆ ప్రశ్నలకు సమాధానంగా నారదుడు ధర్మరాజుతో "రాజా! వేదాలు నీవుచేసే నిత్యాగ్నిహోత్రక్రియకు ఫలాలు. ధనానికి దానం, భోగమే ఫలం. భార్య రతి, సంతానం అనే ఫలాల్ని ఇస్తుంది. శాస్త్రజ్ఞానానికి శీలమూ, సత్ప్రవర్తనలే ఫలం."***

ఇవన్నీ విని నారదమహర్షి ధర్మాత్ముడైన యుధిష్ఠిరుని మరల ప్రశ్నిస్తున్నాడు. "రాజా! పన్నులు వసూలుచేసే నీ సేవకులు లాభార్జన కోసం బహుదూరం నుండి వచ్చిన వ్యాపారుల నుండి సరిగ్గా పన్నులు వసూలు చేస్తున్నారా? అధికంగా వసూలు చేయటం లేదు గదా? మహారాజా! ఆ వ్యాపారులు నీ నగరంలోను, రాజ్యంలోను ఆదరింపబడుతూ జనానికి ఉపయోగపడే సామగ్రినే అమ్ముతున్నారా? వాళ్లు పన్నులు వసూలు చేసే ఆ సేవకులను మోసగించడం లేదుగదా? నీవు ధర్మాన్ని, అర్థాన్ని తెలిసిన పండితులమాటలను, అర్థశాస్త్రంలో సంపూర్ణ పాండిత్యం గలిగిన వృద్ధుల ధర్మార్థవచనాలనూ వింటున్నావా? వ్యవసాయం వల్ల వచ్చే ఫలాలు, పుష్పాలు, గోవులనుండి వచ్చే పాలు, నెయ్యి మొదలగు పదార్థాలు నీవు ఉపయోగించడానికి ముందు ధర్మార్థం బ్రాహ్మణులకు సమర్పిస్తున్నావా? మహారాజా! నీవు నియమించిన శిల్పులు అందరికీ ఒకే పర్యాయం నాలుగు నెలల వరకు

---

* అగ్నిహోత్రఫలా వేదా దత్తభుక్తఫలం ధనమ్ ।
రతిపుత్రఫలా దారాః శీలవృత్తఫలం శ్రుతమ్ ॥ 113

సరిపడే వేతనం, ఉపకరణాలూ, సమకూర్చి ఇస్తున్నావా? మహారాజా! నీవు ఉపకారం చేసిన వారిని మరచిపోవడంలేదు గదా? ఆ విధంగా నీకు మేలు చేసినవారిని సజ్జనుల సమక్షంలో ప్రశంసిస్తూ నీ కృతజ్ఞతగా సత్కరిస్తున్నావా? భరతవంశోత్తమా! నీవు సంక్షేపంగా సిద్ధాంత ప్రతిపాదన చేసే సూత్రగ్రంథాలయిన గజసూత్రం, అశ్వసూత్రం, రథసూత్రం మొదలగు గ్రంథాలను సంగ్రహంగా పఠించి అభ్యసించావా? భరతశ్రేష్ఠా! నీ భవనంలో ధనుర్వేద సూత్రాన్ని, యంత్రసూత్రాన్నీ, అదేవిధంగా నాగరికసూత్రాన్ని చక్కగా అభ్యసించావా? పుణ్యాత్మా! నీవు మంత్రబలంతో అస్త్రాలను, బ్రహ్మదండాన్ని ప్రయోగించి శత్రునాశనం చేస్తున్నావా? వేదోక్తంగా శిక్షను విధించడానికి, అలాగే శత్రునాశనానికీ విషప్రయోగ పరిశీలనం చేశావా? నీ రాజ్యంలో అగ్నిభయం నుండి, సర్పభయం నుండి, రోగభయం నుండి రాక్షసభయం నుండి ప్రజారంజకంగా రాజ్యాన్ని రక్షిస్తున్నావా? నోరులేని మూగవారిని, కన్నులు కనబడని గ్రుడ్డివారిని, వికలాంగులను, కుంటివారిని దిక్కులేని అనాథలను, సన్యాసులను తండ్రివలె ఆదరిస్తూ రక్షిస్తున్నావా? **మహారాజా! నిద్ర, ఆలస్యం, భయం, కోపం, కాఠిన్యం, దీర్ఘాలోచనం అనే ఈ ఆరుదోషాలను విడిచి పెట్టావా?"*** యుధిష్ఠిరుడు నారదమహర్షి యొక్క ఆ మాటలు విని, మహర్షి పాదాలపై పడి నమస్కరించాడు. ఆనందంతో ఆ దైవస్వరూపునితో ఇలా అన్నాడు. 'దేవర్షీ! మీరు ఏమి ఉపదేశించారో నేను ఆ విధంగా చేస్తాను. మీరు చేసిన ఈ ప్రబోధం వల్ల నా బుద్ధి, ప్రజ్ఞ ఎంతో పెరిగాయి.' యుధిష్ఠిరుడు ఇలా చెప్పి సముద్రపర్యంతం గల మహీమండలాన్ని చక్కగా పరిపాలించాడు. నారదుడు "ఏ రాజైనా ఈప్రకారంగా చాతుర్వర్ణాల వారిని వారి వారి వర్ణాశ్రమధర్మాలను కాపాడుతూ రాజ్యాన్ని పరిపాలిస్తే అట్టివాడు ఈ లోకంలో అత్యంతసుఖాన్ని అనుభవించి చివరకు ఇంద్రలోకాన్ని చేరుతాడు." అన్నాడు.

6. దివ్యసభను గూర్చిన యుధిష్ఠిరుని జిజ్ఞాస.

నారదుడు ఆ విధంగా ఉపదేశించాక ధర్మరాజు అతనికి పూజచేసి ఆ మహర్షి అనుమతితో ఇలా అన్నాడు. "భగవాన్! మీరు ఉపదేశించిన రాజధర్మాలన్నీ యథార్థ సిద్ధాంతాలు. అవి అన్నీ న్యాయసహితాలు. మీరు న్యాయానుకూలంగా ఉపదేశించిన వీటిని యథాశక్తి ఆచరిస్తాను. ప్రాచీన మహారాజులు అందరూ ఆ విధంగా కార్యాలను

* షడవర్తా మహారాజ కచ్చిత్ తే పృష్ఠతః కృతాః।
నిద్రాఽఽలస్యం భయం క్రోధోఽమార్దవం దీర్ఘసూత్రతా ॥ 126

ఆచరించి సంపన్నులయ్యారు. అవి న్యాయోచితాలు. సకారణాలు. విశేషప్రయోజనంతో కూడి ఉన్నాయి. ఇందు ఏమాత్రం సందేహం లేదు. ప్రభూ! మేముగూడా ఆ ఉత్తమ మార్గంలోనే కొనసాగాలని కోరుతున్నాము. కానీ పూర్తిగా మేము ఆ నియతాత్ములవలె ఆచరింపలేమేమో అని సందేహపడుతున్నాము." ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు అక్కడ ఉన్న రాజులందరి సమక్షంలో నారదుని ఈ విధంగా అడుగుతున్నాడు. "మునివరా! మీరు మనోవేగం కలవారు. ఎప్పుడూ అనేకలోకాల్లో సంచరిస్తూ ఉంటారు. బ్రహ్మ నిర్మించిన లోకాల నెన్నింటినో మీరు చూస్తూనే ఉంటారు. ఎక్కడైనా ఎపుడైనా ఈ విధమైన సభను కానీ దీనికన్న గొప్పసభను కానీ చూశారా? ఈ విషయాన్ని తెలుసుకోవాలని ఉంది. నాకు ఈ విషయాన్ని చెప్పండి." అన్నాడు. యుధిష్ఠిరుడు అడిగిన ఈ ప్రశ్నను విని నారదమహర్షి చిరునవ్వుతో చూసి ఆ పాండుకుమారునికి మధురమైన మాటల్లో ఈవిధంగా సమాధానం చెప్పాడు.

"యుధిష్ఠిరా! మణిమయమైన ఇటువంటి సభను మానవలోకంలో నేనింతకుముందు చూడలేదు, వినలేదు కూడా. నీ మనస్సు లోకాలలోని దివ్యసభలను గూర్చి, దేవతలు, పితృదేవతలు, సాధ్యులు, నియతాత్ములయిన యజ్వలు, శాంతులయిన మునులు, సదక్షిణాకములయిన యజ్ఞాలు....వీటిని గురించి నీకు వినాలని ఉంటే.... నీ పితృదేవుడైన యమునిసభను, బుద్ధిమంతుడైన వరుణుని సభను, స్వర్గాధిపతి అయిన ఇంద్రునిసభను, కైలాసనివాసియయిన కుబేరుని సభను, బ్రహ్మదేవుని దివ్యసభను గూర్చి చెపుతాను విను." నారదుడు ఆ విధంగా చెప్పగానే ధర్మరాజు సోదరులతోను, బ్రాహ్మణులందరితోను కలిసి మహర్షికి నమస్కరించి, "తాపసోత్తమా! మేము అందరం ఆ దివ్యసభల్ని గురించి వినడానికి కుతూహలపడుతున్నాం. మీరు వాటిని గూర్చి పూర్తిగా వివరించి చెప్పండి. మహానుభావా! ఆ సభానిర్మాణం ఏ ద్రవ్యంతో జరిగింది? దాని పొడవు - వెడల్పులు ఎంతెంత? బ్రహ్మదేవుని సభలో ఏ ఏ సభాసదులు ఆయనను సేవిస్తూ ఉంటారు? అదే విధంగా ఇంద్రసభలోగానీ, యముని సభలోగానీ, వరుణదేవుని సభలో కానీ, కుబేరుని సభలోగాని ఎవరెవరు వారిని సేవిస్తారు? బ్రహ్మర్షీ! మేమందరం మీ ముఖతః ఈ విషయాల్ని తగిన రీతిలో వినవలెనని కుతూహలంతో ఉన్నాం." అలా యుధిష్ఠిరుడు అడిగిన తరువాత నారదమహర్షి సమాధానం చెపుతున్నాడు. "ధర్మరాజా! ఆ దివ్యసభలను గూర్చి వర్ణిస్తాను విను."

7. ఇంద్ర సభా వర్ణనము.

"కురునందనా! ఇంద్రునియొక్క దివ్యసభ సూర్యతేజంతో సమానంగా ప్రకాశిస్తున్నది. విశ్వకర్మయొక్క ప్రయత్నంతో ఆ సభ నిర్మింపబడింది. ఆ సభ నూరుయోజనాల వెడల్పు, నూట ఏభైయోజనాల పొడవు, ఐదు యోజనాల ఎత్తు కలిగి ఆకాశంలో సంచరిస్తుంది. అది కామగమనశక్తి కలది. ఆ సభలో ముసలితనంతో బాధపడేవారు, శోకంతో కష్టాలతో బాధపడేవారూ ఉండరు. అక్కడ భయం అనేది లేదు. అది మంగళకరం. శోభాసంపన్నమూను. అక్కడ ఉండటానికి అతి సుందరమైన మహళ్లున్నాయి. కూర్చుండటానికి ఉత్తమోత్తమసింహాసనాలు ఉన్నాయి. ఆ సభ దివ్యవృక్షాలతో శోభాయమానంగా ఉంది. ఆ సభలో దేవేంద్రుడు తన పట్టమహిషి అయిన శచీదేవితో కూడి, సకలైశ్వర్యాలతో, సింహాసనస్థుడై ఉంటాడు. ఆ శచీదేవి లక్ష్మివంటి శోభతో విరాజిల్లుతుంది. ఆ సమయంలో దేవేంద్రుడు కిరీటాన్ని, ఎర్రటి అంగదాలను ధరించి మాటలకందని రూపంతో వెలుగుతుంటాడు. నిర్మలవస్త్రాలతో, విచిత్రమాలలతో ప్రకాశిస్తాడు. లజ్జ, కీర్తి, కాంతులతో నిండి ఉంటాడు. రాజా! మహనీయు డయిన ఆ దేవేంద్రుని చుట్టూ నిలిచి మరుద్గణాలు, గృహస్థ లయిన దేవతలు నిత్యమూ సేవిస్తూ ఉంటారు. సిద్ధులు, దేవమునులు, సాధ్యులు, దేవతాగణాలు, మరుత్వంతులు - వీరంతా సువర్ణమాలలను అలంకరించుకొని ఒక్కటై నిలిచి మహాత్ముడయిన ఆ దేవేంద్రుని ఈ సభలోనే సేవిస్తారు. వారంతా తమతమ అనుచరులతో కలిసి దివ్య రూపాలను ధరించి చక్కగా అలంకరించుకొని ఉంటారు. కౌంతేయా! ఈ రీతిగా పావకహితులై, నిర్మలులై, ప్రజ్వలించే అగ్నిలాగా దేవర్షులందరూ దేవేంద్రుని సేవిస్తారు. ఆ దేవర్షులు తేజోవంతులు, సోమయాగకర్తలు, చింతాశోకాలు లేనివారు.

పరాశరుడు, పర్వతుడు, సావర్ణి, గాలవుడు, శంఖుడు, లిఖితుడు, గౌరశిరుడు, దుర్వాసుడు, క్రోధనుడు, శ్యేనుడు, దీర్ఘతముడు, పవిత్రపాణి, సావర్ణి (ద్వితీయ) యాజ్ఞవల్క్యుడు, భాలుకి, ఉద్దాలకుడు, శ్వేతకేతువు, తాండ్యుడు, భాండాయని, హవిష్మంతుడు, గరిష్ముడు, హరిశ్చంద్రమహారాజు, హృద్యుడు, ఉదరశాండిల్యుడు, విశాఖుడు,విధాత, కాలుడు, కరాలదంతుడు, త్వష్ట, విశ్వకర్మ, తుంబురుడు - మొదలయిన ఎందరో మునులు, వాయుభక్షకులూ, హవిర్భోక్తలు అయిన మహర్షులు సర్వలోకాధిపతి అయిన వజ్రపాణిని సేవిస్తారు.

పాండుకుమారా! సహదేవుడు, సునీథుడు, మహాతపస్వి అయిన వాల్మీకి, సత్యవాది

అయిన శమీకుడు, సత్యప్రతిజ్ఞ డైన ప్రచేతుడు, మేధాతిథి, వామదేవుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, మరుత్తుడు, మరీచి, మహాతపస్వి అయిన స్థాణువు, కక్షీవంతుడు, గౌతముడు, తార్క్ష్యుడు, వైశ్వానరముని, షడర్తుడు, కవషుడు, ధూమ్రుడు, రైభ్యుడు, నలుడు, పరావసుడు, స్వస్త్యాత్రేయుడు, జరత్కారువు, కహోలుడు, కాశ్యపుడు, విభాండకుడు, ఋష్యశృంగుడు, ఉన్ముఖుడు, విముఖుడు, కాలక వృక్షీయుడు, ఆశ్రావ్యుడు, హిరణ్మయుడు, సంవర్తుడు, దేవహవ్యుడు, విష్వక్సేనుడు, కణ్వుడు, కాత్యాయనుడు, గార్గ్యుడు, కౌశికుడు, ఆ సభలో ఉంటారు. దివ్యజలాలు, ఓషధులు, శ్రద్ధ, మేధ, సరస్వతి, అర్థధర్మకామాలు, విద్యుత్తు, మేఘాలు, వాయువు, గర్జించే మబ్బులు, తూర్పుదిక్కు, హవిర్వాహకు లయిన సప్తవింశతి వహ్నులు, అగ్నీషోములు, ఇంద్రాగ్నులు, మిత్రుడు, సవిత, అర్యముడు, భగుడు, విశ్వేదేవులు, సాధ్యులు, బృహస్పతి, శుక్రుడు, విశ్వావసువు, చిత్రసేనుడు, సుమనుడు, తరుణుడు, యజ్ఞాలు, దక్షిణలు, గ్రహాలు, తారలు, యజ్ఞనిర్వాహక మంత్రాలు - ఇంద్రసభలో అలంకారాలు. రాజా! అదేవిధంగా అందమయిన అప్సరసలు, మనోహరులయిన గంధర్వులు నృత్యగీత, వాద్యాలతో వివిధ హాస్యవిన్యాసాలతో దేవరాజ యిన ఇంద్రుని మనస్సును రంజింపజేస్తారు. అంతేకాక స్తుతులతో, మంగళగీతాలతో, వీరగాథలతో బలుని, వృత్రుని సంహరించిన దేవేంద్రుని స్తుతిస్తూ ఉంటారు. మరెందరో బ్రహ్మర్షులు, రాజర్షులు, దేవర్షులు పూలమాలలు ధరించి, వస్త్రాభరణాల నలంకరించుకొని, అగ్నులవలె ప్రకాశిస్తూ, దివ్య విమానాలలో దేవేంద్రుని సన్నిధికి వస్తూ పోతూ ఉంటారు. రాజా! బృహస్పతి, శుక్రుడు ఎప్పుడూ అక్కడే ఉంటారు. వీరూ మరెందరో మహాత్ములు, సంయములు, చంద్రునివలె దర్శనీయులై ప్రకాశించే విమానాలలో అక్కడకు వస్తారు. బ్రహ్మసమాను లైన భృగువు, సప్తర్షులు కూడా అక్కడ ప్రకాశిస్తుంటారు. రాజా! కమలశోభిత మయిన ఈ ఇంద్రసభను నేను చూశాను.

8. యమసభావర్ణనము.

నారదుడిలా అన్నాడు. "యుధిష్ఠిరా! ఇప్పుడు సూర్యసుతుడైన యముని సభను గూర్చి చెపుతాను. విను. కొంతేయా! దీనిని కూడా విశ్వకర్మయే నిర్మించాడు. రాజా! తేజోవంతమయిన ఆ సభ నూరు యోజనాల పొడవు వెడల్పులు గలది. పాండునందనా! అంతకన్న ఎక్కువైనా ఉండవచ్చు. ఈ యమసభ సూర్యతేజస్సు గలది. కోరిన రూపాన్ని ధరించగల దిది. అంతటా ప్రకాశవంతమైనది. శీతోష్ణాలను నియంత్రించగలది. మనోరంజక

మయినది. ఆ సభలో శోకానికీ, శైథిల్యానికీ అవకాశం లేదు. ఆకలి దప్పు లుండవు. అప్రియాలు జరుగవు. దీనత్వం కానీ, అలసట కానీ, ప్రాతికూల్యం కానీ అక్కడ ఉండవు. అరిందమా! దివ్యమానుషకాంక్షలన్నీ అక్కడ తీరుతాయి. రుచికరాలయిన భక్ష్యభోజ్యాలు అక్కడ మిక్కిలిగా ఉంటాయి. అక్కడ లేహ్య,చోష్య,పేయాలయిన ఆహారపదార్థాలు మనోహరాలు, రుచికరాలు అయి మనస్సుకు నచ్చుతాయి. ఆ సభలో పుణ్యపరిమళాలు గల పూలమాలలు, కోరిన పండ్ల నిచ్చే చెట్లు ఎప్పుడూ ఉంటాయి. ఆ సభలో తియ్యని చన్నీళ్ళు, వేణ్ణీళ్ళు ఎప్పుడూ దొరుకుతాయి. పవిత్రులయిన రాజర్షులు, నిర్మలులైన బ్రహ్మర్షులు పరమానందంతో అక్కడ యముని సేవిస్తారు. యయాతి, నహుషుడు, పూరుడు, మాంధాత, సోమకుడు, నృగువు, త్రసదస్యుడు, కృతవీర్యుడు, శ్రుతశ్రవుడు, అరిష్టనేమి, సిద్ధుడు, కృతవేగుడు, కృతి, నిమి, ప్రతర్దనుడు, శిబి, మత్స్యుడు, పృథులాక్షుడు, బృహద్రథుడు, వార్తుడు, మరుత్తుడు, కుశికుడు, సాంకాశ్యుడు, సాంకృతి, ధ్రువుడు, చతురశ్వుడు, సదశ్వోర్మి, కార్తవీర్యార్జునుడు, భరతుడు, సురథుడు, సునీథుడు, నిశఠుడు, నలుడు, దివోదాసుడు, సుమనుడు, అంబరీషుడు, భగీరథుడు, వ్యశ్వుడు, సదశ్వుడు, వధ్యశ్వుడు, పృథువేగుడు, పృథుశ్రవుడు, పృషదశ్వుడు, వసుమనుడు, క్షుపుడు, రుషద్రుడు, వృషసేనుడు, పురుకుత్సుడు, ఆర్ష్టిషేణుడు, దిలీపుడు, ఉశీనరుడు, ఔశీనరి, పుండరీకుడు, శర్యాతి, శరభుడు, శుచి, అంగుడు, అరిష్టుడు, వేనుడు, దుష్యంతుడు, సృంజయుడు, జయుడు, భాంగాసురి, సునీథుడు, నిషధేశ్వరుడు, వహీనరుడు, కరంధముడు, బాహ్లీకుడు, సుద్యుమ్నుడు, బలవంతుడైన మధువు, ఐలుడు, మరుత్తుడు, కపోతరోముడు, తృణకుడు, సహదేవుడు, అర్జునుడు, వ్యశ్వుడు, సాశ్వుడు, కృశాశ్వుడు, శశబిందుడు, దశరథుడు, కకుత్స్థుడు, ప్రవర్ధనుడు, అలర్కుడు, కక్షసేనుడు, గయుడు, గౌరాశ్వుడు, పరశురాముడు, నాభాగుడు, సగరుడు,భూరిద్యుమ్నుడు, మహాశ్వుడు, పృథాశ్వుడు, జనకుడు, పృథువు, వారిసేనుడు, పురుజిత్తు, జనమేజయుడు, బ్రహ్మదత్తుడు, త్రిగర్తుడు, ఉపరిచరుడు, ఇంద్రద్యుమ్నుడు, భీమజానువు, గౌరపృష్ఠుడు, అనఘుడు, లయుడు, పద్ముడు, ముచుకుందుడు, భూరిద్యుమ్నుడు, ప్రసేనజిత్తు, అరిష్టనేమి, సుద్యుమ్నుడు, పృథులాశ్వుడు, అష్టకుడు, వందమంది మత్స్యరాజులు, నూర్గురు నీపరాజులు, వందమంది గయులు, వందమంది ధృతరాష్ట్రులు, ఎనభైమంది జనమేజయులు, నూర్గురు బ్రహ్మదత్తులు, వందమంది వీరులు, నూర్గురు ఈరులు, రెండువందలమంది భీష్ములు, వందమంది భీములు, వందమంది ప్రతివింధ్యులు, నూర్గురు నాగరాజులు, వందమంది హయరాజులు,

వందమంది పలాశులు, నూర్గురు కాశీరాజులు, వందమంది కుశరాజులు, శాంతనువు, పాండురాజు, ఉశంగవుడు, శతరథుడు, దేవరాజు, జయద్రథుడు, వృషదర్భరాజర్షి, ఆయన మంత్రులూ, వేలకొలదిగ శశబిందురాజులు ఆ సభలో ఉంటారు. వారు అనేక మహా యాగాలను భూరిదక్షిణలతో నిర్వహించి ధర్మరాజలోకాన్ని పొందినవారు. రాజేంద్రా! పుణ్యాత్ములు, కీర్తిమంతులు, బహుశ్రుతులు అయిన ఈ రాజర్షులందరూ ఆ సభలో సూర్యసుతుడైన యముని సేవిస్తుంటారు.

అగస్త్యుడు, మతంగుడు, కాలుడు, మృత్యువు, యజ్ఞకర్త సిద్ధులు, యోగశరీరధారులు, అగ్నిష్వాత్తపితరులు, ఫేనపులు, ఊష్మపులు, స్వధావంతులు, బర్హిషదులు మొదలుగా గల పితరులు, కాలచక్రమూ, పూజ్యుడైన హవ్యవాహనుడు, దక్షిణాయనంలో మరణించిన మనుషులు, దుష్కరకర్మలు చేసిన మనుష్యులు, కాలుని ఆజ్ఞకు లోబడిన యమదూతలు, శింశప, పలాశ, కాశ, కుశాదులను అభిమానించే దేవతలు మూర్తిమంతులై ఈసభలో ధర్మరాజును సేవిస్తారు. వీరే కాక మరెందరో పితృరాజైన యముని సభలో సభ్యులు. వారిపేర్లను, కర్మలను పరిగణించటం అసాధ్యం. కుంతీనందనా! ఆ యమసభ బాధారహితమైనది, అందమైనదీ, స్వేచ్ఛగా సంచరించునదీ. ఎంతోకాలం తపించి విశ్వకర్మ దానిని నిర్మించాడు. భారతా! ఆ సభ తన తేజస్సుతో ప్రజ్వలిస్తూ, ప్రకాశిస్తూ ఉంటుంది. ఉగ్రతపస్వులు, సత్యవాదులు, సువ్రతులు, శాంతులు, సన్యాసులు, పరిశుద్ధులు, పుణ్యకర్మలవలన పవిత్రులు అక్కడ ప్రవేశించగలరు. వారంతా తేజోవంతమైన శరీరం, నిర్మలవస్త్రాలు ధరించి ఉంటారు. వారు అందరూ చిత్రమైన భుజాలంకారాలూ, చిత్రమైన హారాలూ, ప్రకాశించే కుండలాలు ధరించి ఉంటారు. తమ తమ పుణ్యకర్మలు, వస్త్రాభరణాలు వారికి విభూషణాలు. మహాత్ములయిన గంధర్వులు, గుంపులు గుంపులుగా అచ్చరలు ఆ సభలో నుండి సర్వవిధాలయిన వాద్యాలతో, నృత్యగీతాలతో, హాస్యలాస్యాలతో ఆనందింపజేస్తారు. కౌంతేయా! ఆ సభలో నిత్యమూ అన్నివైపులా దివ్యపరిమళాలు, పవిత్రశబ్దాలు, దివ్యమాలలూ సన్నిహితాలై ఉంటాయి. సుందర రూపధారులయిన కోటిమంది ధర్మాత్ములూ, మానధనులూ మహనీయుడయిన యముని ఉపాసిస్తుంటారు. రాజా! పరేతరాజు, మహానుభావుడూ అయిన యముని సభ ఇటువంటిది. ఇక పుష్కరాదితీర్థాలతో ప్రకాశించే వరుణసభను గురించి చెపుతాను."

9. వరుణ సభావర్ణనము.

నారదుడిలా అన్నాడు. "యుధిష్ఠిరా! వరుణుని దివ్యసభ అమితకాంతి గలది. యమసభ అంత పెద్దది. శుభకరా లయిన ప్రాకారాలు, తోరణాలు గలది. విశ్వకర్మ దీనిని నీటిమధ్యలో నిర్మించాడు. పూలను, పండ్లను ఇవ్వగల రత్నమయ దివ్యవృక్షాలు దీనిలో ఉన్నాయి. దీనిలో పుష్పగుచ్ఛాలు గల లతలు పొదరిళ్ళు ఉన్నాయి. అవి నల్లగా, పచ్చగా, నీలంగా, తెల్లగా, ఎఱగా శోభిస్తున్నాయి. అదే రీతిగా ఆ సభలో మధుర విచిత్ర కంఠధ్వనులు గల పక్షులు వందలు, వేలు కనిపిస్తున్నాయి. వాటి రూపసౌందర్యం వర్ణనలకు అందనిది. ఆ సభ సుఖస్పర్శ కలది. అంత చల్లనిదీ కాదు, అంత వెచ్చనిదీ కాదు. దానిలో ఎన్నో గదులూ, ఎన్నో ఆసనాలు ఉన్నాయి. వరుణరక్షిత అయిన ఆ సభ శ్వేతవర్ణంతో రమణీయమైనది. ఆ సభలో దివ్యరత్నాంబరాలనూ, దివ్యాభరణాలనూ అలంకరించుకొని వరుణదేవుడు వారుణీదేవితో కలిసి విరాజిల్లుతాడు. దివ్యమాలలు, దివ్యగంధాలు, దివ్యానులేపనాలు ధరించిన ఆదిత్యగణం ఆ సభలో వరుణదేవుని ఉపాసిస్తుంది.

వాసుకి, తక్షకుడు, నాగుడు, ఐరావతుడు, కృష్ణుడు, లోహితుడు, పద్ముడు, చిత్రుడు..... కంబలుడు, అశ్వతరుడు, ధృతరాష్ట్రుడు, బలాహకుడు, మణినాగుడు, నాగుడు, మణి, శంఖనఖుడు, కౌరవ్యుడు, స్వస్తికుడు, ఏలాపత్రుడు, వామనుడు, అపరాజితుడు, దోషుడు, నందకుడు, పూరణుడు, అభీకుడు, శిబికుడు, శ్వేతుడు, భద్రుడు, భద్రేశ్వరుడు, మణిమంతుడు, కుండధారుడు, కర్కోటకుడు, ధనంజయుడు పాణిమంతుడు, కుండధారుడు, ప్రహ్లోదుడు, మూషికాదుడు, జనమేజయుడు మొదలుగా గల నాగులు వరుణుని చుట్టూ చేరి పతాకాలు దాల్చి ఉంటారు. వరుణుడు అనంతునికి ఆసనమిచ్చి సత్కరిస్తాడు. వాసుకి మొదలయినవారు శేషుని అనుమతితో ఆసనాలపై కూర్చుంటారు. యుధిష్ఠిరా! వీరూ, ఇంకా చాలామంది నాగులు ఆ సభలో నేద దీరి వరుణుని సేవిస్తారు. విరోచనసుతుడు బలిచక్రవర్తి, పృథివీవిజేత నరకాసురుడు, ప్రహ్లోదుడు, విప్రచిత్తి, కాలఖంజుడు, సుహనుడు, దుర్ముఖుడు, శంఖుడు, సుమనుడు, సుమతి, ఘటోదరుడు, మహాపార్శ్వుడు, క్రథనుడు, పిఠరుడు, విశ్వరూపుడు, స్వరూపుడు, విరూపుడు, మహాశిరుడు, రావణుడు, వాలి, మేఘవాసుడు, దశావరుడు, టిట్టిభుడు, విటభూతుడు, సంహ్లోదుడు, ఇంద్రతాపసుడు, మొదలయిన దైత్యదానవగణం మనోహరకుండలాలను, సుందరహారకిరీటాలను, దివ్యవస్త్రాభరణాలను ధరించి, నిత్యమూ ధర్మపాశధారి అయిన వరుణదేవుని ఉపాసిస్తూ ఉంటారు. ఈదైత్యులంతా వరాలను పొంది శౌర్యసంపన్నులై చిరంజీవులయినారు. వీరి

దీక్షాచారిత్రాలు సర్వోత్తమమయినవి.

అదేతీరున నాలుగు సముద్రాలూ, గంగా, కాళిందీ, విదిశా, వేణా, నర్మదా, వేగవాహినీ నదులు విపాశ, శతద్రువు, చంద్రభాగ, సరస్వతి, ఇరావతి, వితస్త, సింధువు, దేవనది గోదావరి, కృష్ణవేణి, కావేరి, కింపున, విశల్య, వైతరణి తృతీయ, జ్యేష్ఠిల, మహానదమైన శోణ, చర్మణ్వతి, పర్ణాశ, మహానది సరయు, వారవతి, లాంగలి, కరతోయ, ఆత్రేయి, లౌహిత్య (నదం) లంఘతి, గోమతి, సంధ్య, త్రిస్రోతసి మొదలయిన లోకవిఖ్యాత తీర్థాలన్నీ వరుణుని సేవిస్తుంటాయి. యుధిష్ఠిరా! సమస్తనదులు, జలాశయాలు, సరస్సులు, బావులు, వాగులు, చెరువులు, మడుగులు, సర్వదిక్కులు, భూమి, పర్వతాలు సమస్తజలచరప్రాణులు రూపాలు ధరించి మహాత్ముడైన వరుణదేవుని ఉపాసిస్తుంటాయి. గంధర్వులు, అప్సరోగణాలు అందరూ గీత వాద్యాలతో వరుణుని ప్రస్తుతిస్తూ ఉపాసిస్తుంటారు. రత్నమయపర్వతాలు, రూపాలను ధరించిన రసాలు అక్కడ మధురకథలను వినిపిస్తూ నివసిస్తుంటాయి. వరుణుని మంత్రి సునాభుడు పుత్రపౌత్రులతో సహా గో, పుష్కరనామాలు గల తీర్థాలతో పాటు వరుణుని సేవిస్తుంటాడు. వీరంతా దేహధారులై లోకపాలకుడైన వరుణుని ఉపాసిస్తారు. భరతర్షభా! నేను గతంలోనే అంతటా సంచరిస్తూ రమణీయమయిన ఈ వరుణసభను చూచాను. ఇక కుబేరసభను గురించి విను."

10. కుబేర సభావర్ణనము.

నారదుడిలా అన్నాడు. "రాజా! కుబేరసభ నూరుయోజనాల పొడవు, డెబ్బది యోజనాల వెడల్పు కలది. తెల్లని కాంతితో ప్రకాశిస్తుంది. రాజా! విశ్రవసుని కొడుకు కుబేరుడు దీనిని తపస్సు చేసి సాధించాడు. శ్వేతకాంతితో అది వెన్నెలలను తిరస్కరిస్తూ, కైలాసశిఖరంవలె భాసిస్తుంది. గుహ్యకులు దీనిని మోస్తుంటారు. ఆ సమయంలో అది ఆకాశాన్ని అంటినట్టు ప్రకాశిస్తుంది. దివ్యమైన, స్వర్ణమయ మయిన ప్రాసాదాలతో అది విరాజిల్లుతుంది. మహారత్నాలతో, చిత్రవర్ణాలతో, దివ్యగంధాలతో తెల్లని మేఘాలవంటి ఆకృతితో మనోహరమై అది గగనసీమలో ఈదులాడుతున్నట్లు కనిపిస్తుంది. ఆ కుబేరసభ బంగారువన్నెలతో అలంకరింపబడిన గోడలతో మెరుపులవలె ప్రకాశిస్తూ దివ్యంగా ఉంటుంది. ఆ సభలో కుబేరుడు విచిత్రాభరణాలు, విచిత్రవస్త్రాలు ధరించి, ప్రజ్వలించే కుండలాలు అలంకరించుకొని దివ్యాసనాలు, దివ్యపాదపీఠాలు కలిగి సూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్న దివ్యసింహాసనంపై కూర్చొని ఉంటాడు. వేలకొలది స్త్రీలు ఆయనను చుట్టి ఉంటారు.

ఉదారమందారవృక్షాలను కదిలిస్తూ, సౌగంధికావన, అలకా, పుష్కరిణీ, నందనవనాల సౌరభాన్ని మోస్తూ హృదయానందకరంగా వీస్తూ చల్లనిగాలి ఆ కుబేరుని సేవిస్తుంది. రాజా! అక్కడ గంధర్వులతో, అప్సరోగణాలతో సహా దేవతలు సభాసదులై దివ్యతానాలతో గానం చేస్తుంటారు.

మిశ్రకేశి, రంభ, చిత్రసేన, శుచిస్మిత, చారునేత్ర, ఘృతాచి, మేనక, పుంజికస్థల, విశ్వాసి, సహజన్య, ప్రమ్లోచ, ఊర్వశి, ఇర, వర్గ, సౌరభేయి, సమీచి, బుద్బుద, లత మొదలయిన వేలకొలది నృత్యగీతవిశారదు లయిన గంధర్వాప్సరోగణాలు కుబేరుని సేవిస్తుంటారు. గంధర్వాప్సరోగణాల దివ్యవాద్య, నృత్య, గీతాలతో నిండి నిరంతరమూ ప్రతిధ్వనించే ఆ కుబేరసభ మనోరంజకంగా, నిండుగా ప్రకాశిస్తుంది. భారతా! కిన్నరులు, నరులు, గంధర్వులు, మణిభద్రుడు, ధనదుడు, శ్వేతభద్రుడు, కశేరకుడు, గండకండువు, ప్రద్యోతుడు, కుస్తుంబురుడు(పిశాచ), గజకర్ణుడు, విశాలకుడు, వరాహకర్ణుడు, తామ్రోష్ఠుడు, ఫలకక్షుడు, ఫలోదకుడు, హంసచూడుడు, శిఖావర్తుడు, హేమనేత్రుడు, విభీషణుడు, పుష్పాననుడు, పింగళకుడు, శోణితోదుడు, ప్రవాలకుడు, వృక్షవాసి, అనికేతుడు, చీరవాసనుడు, మొదలుగా గల యక్షులు లక్షల కొలది ఆ సభలో నిలిచి కుబేరుని సేవిస్తారు.

పూజనీయ అయిన లక్ష్మీ నలకూబరుడు, నేను నా వంటివారు మరెందరో ఆ కుబేరసభలో ఎక్కువగా ఉంటారు. బ్రహ్మర్షులు, దేవర్షులు, ఇతర ఋషిగణాలు ఆ సభలో ఉంటారు. అంతే గాక ఎందరో పిశాచులు, మహాబలులయిన గంధర్వులు లోకపాలకుడైన కుబేరుని సేవిస్తుంటారు. రాజశ్రేష్ఠా! లక్షలకొలది భూతసమూహాలు చుట్టుముట్టగా ఉగ్రధనుర్ధారి, మహాబలి, పశుపతి, శూలధారి, భగదేవతనేత్రాలను పోగొట్టినవాడు, త్రిలోచనుడు అయిన శివుడు, పార్వతి - ఈ ఇద్దరూ భూతప్రేతాదులతో కలిసి తమ మిత్రుడైన కుబేరుని ఎప్పుడూ సేవిస్తుంటారు. ఆ భూతప్రేతాలు వామనులు, వికటులు, కుబ్జులు, ఎఱ్ఱటి కనులు గలవారు, గొప్ప కోలాహలం చేసేవారు, మేదోమాంసాలను తినేవారు, వివిధ శస్త్రాస్త్రాలను ధరించినవారు, గాలివలె తీవ్రవేగం కలవారు. వీరే కాక వివిధవస్త్రాభరణాలను అలంకరించుకొని ప్రసన్నచిత్తులయిన వందలకొలది గంధర్వపతులు- విశ్వావసువు, హాహుడు, హూహుడు, తుంబురుడు, పర్వతుడు, శైలూషుడు, చిత్రసేనుడు, చిత్రరథుడు మొదలగువారు - ధనాధిపతి అయిన కుబేరుని సేవిస్తుంటారు. విద్యాధరచక్రవర్తి అయిన చక్రధర్ముడు తన తమ్ములతో సహా ఆ సభలో ధనాధిపతి అయిన కుబేరుని సేవిస్తాడు. భగదత్తుడు మొదలగు రాజులు ఆ సభలో ఉంటారు. కింపురుషరాజయిన

ద్రుముడు కుబేరుని ఉపాసిస్తుంటాడు.

మహేంద్రుడు, గంధమాదనుడు, ధర్మనిష్ఠుడు, రాక్షసాధిపతి అయిన విభీషణుడు యక్ష, గంధర్వ, నిశాచరులతో కలిసి తమ సోదరుడయిన కుబేరుని సేవిస్తుంటారు. హిమవంతం, పారియాత్రం, వింధ్యం, కైలాసం, మందరం, మలయం, దర్దురం, మహేంద్రం, గంధమాదనం, ఇంద్రకీలం, సునాభం, మేరువు మొదలుగా గల ఇతరపర్వతాలు మహనీయుడు, ధనాధిపతి అయిన కుబేరప్రభువును సేవిస్తుంటాయి. పూజ్యుడయిన నందీశ్వరుడు, మహాకాలుడు, శంకుకర్ణుడు మొదలగు దివ్యసభ్యులు, కాష్ఠుడు, కుటీముఖుడు, దంతి, తపస్వి అయిన విజయుడు, గర్జనశీలుడయిన శ్వేతనంది ఆ సభలో ఉంటారు. వివిధరాక్షసులు, పిశాచాలు కుబేరుని సేవిస్తుంటారు. దేవదేవేశుడు, త్రిభువనభావనుడు, బహురూపధారి, కళ్యాణస్వరూపుడు, ఉమాపతి అయిన మహేశ్వరుడు సహచరులతో కలిసి ఆ సభలో ప్రవేశించినప్పుడు పులస్త్యనందనుడు, ధనాధిపతి అయిన కుబేరుడు తలవంచి ప్రణమిల్లి ఆయన అనుమతితో దగ్గర కూర్చుంటాడు. కుబేరుని మిత్రుడయిన శివుడు అప్పుడప్పుడు ఆ సభలో కనిపిస్తాడు. శ్రేష్ఠనిధులయిన శంఖపద్మాలు రూపాలను ధరించి ఇతరనిధులతో కలిసి ధనేశ్వరు డయిన కుబేరుని సేవిస్తాయి. గగనసంచారిణి అయిన ఆ రమణీయ కుబేరసభను నేను చూశాను."

11. బ్రహ్మసభావర్ణనము.

నారదుడిలా అన్నాడు "నాయనా! భారతా! ఇప్పుడు బ్రహ్మసభనుగురించి చెపుతాను విను. "ఇది, ఇటువంటి"దని చెప్పటానికి వీలుకానిది ఆ బ్రహ్మసభ. ధర్మరాజా! పూర్వం సత్యయుగంలో సూర్యభగవానుడు బ్రహ్మసభను సందర్శించి, మరల మనుష్యలోకాన్ని చూడాలని అనాయాసంగా బ్రహ్మసభను గురించి ఉన్నదున్నట్టు నాకు వివరంగా చెప్పాడు. భరతర్షభా! ఆ బ్రహ్మసభ కొలతల కందనిది. దివ్య మయినది. బ్రహ్మసంకల్పం నుండి పుట్టినది. సమస్తప్రాణుల మనస్సులను రంజింపజేయగల దాని ప్రభావం వర్ణింపనలవి కానిది. పాండవశ్రేష్ఠా! సూర్యభగవానుని నుండి ఆ బ్రహ్మసభ గొప్పతనాన్ని విని నేను దానిని చూడగోరి సూర్యునితో ఇలా అన్నాను. 'స్వామీ! కిరణాధిపతీ! నేను ఆ బ్రహ్మసభను చూడగోరుతున్నాను. ఉత్తమమూ, పాపనాశనమూ అయిన ఆ సభను ఏ తపస్సుతో, ఏపుణ్యకర్మలతో, ఏ ఓషధి ప్రభావంతో చూడగలనో చెప్పు. ఆ సభను సందర్శించగల ఉపాయాన్ని నాకు తెలుపు." భరతశ్రేష్ఠా! సహస్రకిరణాలుగల ఆ సూర్యుడు నామాట

విని"నీవు ఏకాగ్రచిత్తుడవై వేయి సంవత్సరాలు ఆచరింపవలసిన బ్రహ్మవ్రతాన్ని చేయి" అని సూచించాడు. అప్పుడు నేను హిమాలయశిఖరాలపై ఆ మహావ్రతాన్ని ప్రారంభించాను. ఆ తపస్సు ముగిసిన తరువాత పాపరహితుడు, పరాక్రమశాలి అయిన సూర్యభగవానుడు అనాయాసంగా నన్ను బ్రహ్మసభకు కొనిపోయాడు.

రాజా! ఆ సభ ఇటువంటి దని తేల్చి చెప్పటానికి వీలుకానిది. క్షణకాలంలోనే మాటల కందనంతగా రూపాన్ని మార్చుకొనగలది. భారతా! దానికొలతలు కానీ, దాని స్వరూపం కానీ నేనెరుగను. ఇంతకుముందెప్పుడూ నేను అటువంటి రూపాన్ని చూచి ఉండలేదు.

రాజా! ఆ సభ ఎప్పుడూ మంచిసుఖాన్ని ఇస్తుంది. మరీ చల్లగా ఉండదు. మరీ వెచ్చగానూ ఉండదు. ఆ సభలోనికి చేరిన తర్వాత ఆకలి దప్పు లుండవు. అత్యంతమూ ప్రకాశించే వివిధమణులతో ఆ సభ నిర్మింపబడింది. దానికి ఆధారస్తంభా లుండవు. అదెప్పుడూ పాతబడినట్టుండదు. నిత్యనూతన మది. అనంతకాంతులతో వెలిగే నానావిధదివ్యపదార్థాలతో స్వయంగానే చంద్రుని, సూర్యునీ, అగ్నినీ మించి ప్రకాశిస్తుంది. స్వర్గాన్ని మించి ఉన్నతమై, సూర్యుని తిరస్కరిస్తూ అది ప్రకాశిస్తుంది.

రాజా! ఆ సభలో సర్వలోకపితామహుడు బ్రహ్మ దేవమాయతో సమస్తలోకాలనూ సృష్టిస్తూ తానుమాత్రం ఎప్పుడూ ఒంటరిగా ఉంటాడు. ప్రజాపతులందరూ ఆయనను సేవిస్తుంటారు. దక్షుడు, ప్రచేతుడు, పులహుడు, మరీచి, కశ్యపుడు భృగువు, అత్రి, వసిష్ఠుడు, గౌతముడు, అంగిరుడు, పులస్త్యుడు, క్రతువు, ప్రహ్లోదుడు, కర్దముడు, అథర్వాంగిరసుడు, సూర్యకిరణాలను త్రాగే వాలఖిల్యులు, మనస్సు, అంతరిక్షం, విద్య, వాయువు, తేజస్సు, జలం, పృథ్వి, శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం, ప్రకృతి, వికృతి, ఇతర సృష్టిహేతువులు – వీటి కన్నిటికి అధిష్ఠానమైన దేవతలు, మహాతేజస్వి అగస్త్యుడు, శక్తిశాలి మార్కండేయుడు, జమదగ్ని, భరద్వాజుడు, సంవర్తనుడు, చ్యవనుడు మహాత్ముడు దుర్వాసుడు, ధర్మాత్ముడు ఋష్యశృంగుడు, మహాతపస్వి యోగాచార్యుడు పూజనీయుడు అయిన సనత్కుమారుడు, అసితుడు, దేవలుడు, తత్త్వజ్ఞాని అయిన జైగీషవ్యుడు, శత్రుజేత అయిన ఋషభుడు, పరాక్రమశాలి అయిన మణి అష్టాంగసహితమై మూర్తిమంతమైన ఆయుర్వేదం, నక్షత్రగణాలతో కూడి చంద్రుడు, కిరణమాలి అయిన సూర్యుడు, వాయువులు, క్రతువులు, సంకల్పం, ప్రాణం – వీరే కాక మహావ్రతపరాయణు లయి రూపధారు లయిన మహాత్ములెందరో బ్రహ్మను సేవిస్తుంటారు.

అర్థం, ధర్మం, కామం, హర్షం, ద్వేషం, తపస్సు, దమం – ఇవి కూడా రూపాన్ని ధరించి బ్రహ్మను సేవిస్తాయి. గంధర్వాప్సరసల గణాలు ఇరవై కలిసి బ్రహ్మసభకు వస్తాయి. మరొక ఏడు గణాలకు చెందిన గంధర్వులు అక్కడ చేరుతారు. సమస్తలోకపాలకులు, శుక్రుడు, బృహస్పతి, బుధుడు, కుజుడు, శని, రాహువు, కేతువు – ఈ గ్రహాలు సామగానమంత్రాలు, రథంతరసామ, హరిమంతుడు, వసుమంతుడు, ఇంద్రునితో సహా ద్వాదశాదిత్యులు, జంటలుగా వ్యవహరింపబడిన అగ్నిష్టోమాది దేవతలు, మరుత్తులు, విశ్వకర్మ, వసువులు, సమస్త పితృగణాలు, హవిస్సులు, ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వవేదం, సర్వశాస్త్రాలు, ఇతిహాసాలు, ఉపవేదాలు, వేదాంగాలు అన్నీ– ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థశాస్త్రం. వేదాంగాలు, గ్రహాలు, యజ్ఞాలు, సోమం, సమస్తదేవతలు, సావిత్రి, దుర్గ; అకార, ఉకార, మకార, అర్ధమాత్రా, నాద, బిందు, శక్తులు,(ప్రణవం యొక్క సప్తరూపాలు/ఏడురకాలయిన వాణి), మేధ, ధృతి, శ్రుతి, ప్రజ్ఞ, బుద్ధి, కీర్తి, క్షమ, సామగానాలు, స్తుతిగీతాలు, వివిధగాథలు, తర్కంతో కూడిన భాష్యాలు, వివిధనాటకాలు, కావ్యాలు, కథలు, ఆఖ్యాయికలు, కారికలు ఇవన్నీ రూపాన్ని ధరించి అక్కడ ఉంటాయి. అదేరీతిగా గురుపూజచేసిన పుణ్యపురుషు లెందరో అక్కడుంటారు.

భారతా! క్షణాలు, లవాలు, ముహూర్తాలు, దివారాత్రాలు, పక్షాలు, నెలలు, ఋతువులు, సంవత్సరాలు, పంచయుగాలు; నాలుగు విధాలయిన అహోరాత్రులు, మానవ, పితృ, దేవతా, బ్రహ్మప్రమాణాలు – అహోరాత్రులు నాలుగు విధాలు నిత్య, దివ్య, అక్షయ, అవ్యయరూపమైన కాలచక్రం, ధర్మచక్రం రూపాన్ని ధరించి నిత్యమూ బ్రహ్మను ఉపాసిస్తాయి. అదితి, దితి, దనువు, సురస, వినత, ఇర, కాళిక, సురభి, సరమ, గౌతమి, ప్రభ, కద్రువ, దేవమాతలు, రుద్రాణి, శ్రీ, లక్ష్మి, భద్ర, అపర, షష్ఠి, పృథ్వి, గంగానది, లజ్జ, స్వాహా, కీర్తి, సురాదేవి, శచి, పుష్టి, అరుంధతి, సంవృత్తి, ఆశ, నియతి, సృష్టిదేవి, రతి, ఇతరదేవతలు కూడా ప్రజాపతిని ఉపాసిస్తారు. ఆదిత్యులు,వసువులు, రుద్రులు, మరుత్తులు, అశ్వినులు, విశ్వేదేవులు, సాధ్యులు, మనోవేగం గల పితరులు బ్రహ్మను సేవిస్తుంటారు. పురుషశ్రేష్ఠా! పితృగణాలు ఏడుంటాయి. వాటిలో నాలుగు రూపంగలవి. మూడు రూపం లేనివి. భారతా! లోకవిఖ్యాతులై, స్వర్గలోకసంచారం గల వైరాజులు, అగ్నిష్వాత్తులు, సోమపులు, గార్హపత్యులు ఈ నాలుగు పితృగణాలు రూపంగలవి. ఏకశృంగులు, చతుర్వేదులు, కళలు ఈ మూడు పితృగణాలు రూపంలేనివి. ఈ పితృగణాలు ఏడు నాల్గువర్ణాలలో పూజింపబడతాయి. రాజా! ముందు ఈ పితృగణాలు తృప్తిపడితే సోమదేవత తృప్తి

పొందుతుంది. ఈ సప్తగణాలకు చెందిన పితరులు బ్రహ్మసన్నిధిలో నిలిచి తేజోమూర్తి అయిన బ్రహ్మను పరమానందంగా ఉపాసిస్తారు. రాక్షసులు, పిశాచులు, దానవులు, గుహ్యకులు, నాగులు, సుపర్ణులు, పశువులు బ్రహ్మను ఉపాసిస్తారు. స్థావరజంగమాత్మకాలైన మహాభూతాలు, దేవేంద్రుడు, వరుణుడు, కుబేరుడు, యముడు, పార్వతితో సహా శివుడు ఎప్పుడూ బ్రహ్మ దగ్గరకు వెళ్తుంటారు.

రాజేంద్రా! కార్తికేయుడు కూడా సదా బ్రహ్మను సేవిస్తాడు. నారాయణదేవుడు, దేవర్షులు, వాలఖిల్యమునులు, యోనిజులు, అయోనిజులు అయిన ఇతరమహర్షులు ఆ సభలో బ్రహ్మనారాధిస్తారు. రాజా! త్రిలోకాలలో స్థావర జంగమాత్మకమైన సమస్తాన్ని, నేను ఆ బ్రహ్మసభలో చూశానని తెలుసుకో. ధర్మజా! ఊర్ధ్వరేతస్కులయిన పద్దెనిమిది వేలమంది మునులు ఆ సభలో ఉంటారు. ఆ మహర్షులు, దేవతలందరూ అక్కడ స్వేచ్ఛగా బ్రహ్మను సందర్శించి, తలవాల్చి, నమస్కరించి, వచ్చిన దారినే తిరిగి వెళతారు. సర్వప్రాణులయందు దయగలవాడు, ధీమంతుడు అయిన సర్వలోక పితామహుడు తన దగ్గరకు అతిథులుగా వచ్చిన దేవతలను, దానవులను, నాగులను, ద్విజులను, యజ్ఞస్వరూపులను, సుపర్ణులను, కాలేయులను, గంధర్వులను, అచ్చరలను తగినరీతిగా అనుగ్రహిస్తాడు. రాజా! విశ్వరూపుడు, అమితకాంతివంతుడు అయిన బ్రహ్మ వారిని అనుగ్రహించి, అనునయించి, గౌరవించి, కోరికలను తీర్చి భోగవిశేషాలను అందిస్తాడు. భారతా! ఆవిధంగా ఆ బ్రహ్మసభ వచ్చేపోయే వారితో కోలాహలంగా కనిపిస్తూ సుఖప్రదమై ఉంటుంది. రాజోత్తమా! ఆ బ్రహ్మసభ సమస్తతేజస్సులూ గలది, దివ్యమైనది, బ్రహ్మర్షిగణసేవితమైనది. పాపరహితమై శమసంపత్తితో విరాజిల్లుతుంది. అటువంటి సభను నేను చూశాను. మానవలోకంలో నీ ఈ సభ దుర్లభమైనట్లు అన్ని లోకాలలోనూ బ్రహ్మసభ దుర్లభమైనది. భారతా! ఈ సభలనన్నింటినీ నేను గతంలో దేవలోకంలో చూశాను. మానవలోకంలో నీ ఈ సభయే సర్వశ్రేష్ఠమయినది."

12. హరిశ్చంద్రమాహాత్మ్యము - పాండురాజ సందేశము.

యుధిష్ఠిరుడు అన్నాడు. "వాగ్మిశ్రేష్ఠా! నీవు వర్ణించిన దానిని బట్టి సూర్యసుతుడైన యముని సభలోనే రాజసమూహమంతా ఉన్నది. స్వామీ! వరుణుని సభలో నాగులు, దైత్యేంద్రులు, నదులు, సముద్రాలు ఎక్కువగా ఉన్నాయి. అదేరీతిగా కుబేరసభలో యక్షులు, గుహ్యకులు, రాక్షసులు, గంధర్వులు, అచ్చరలు, శంకరభగవానుడు ఉన్నారు.

బ్రహ్మదేవుని సభలో మహర్షులు, సమస్త దేవతాసమూహాలూ, సర్వశాస్త్రాలు ఉన్నాయన్నావు. మహర్షీ! దేవేంద్రుని సభలో సకలదేవతలు ప్రధానంగా ఉన్నారు. స్వల్పంగా వివిధగంధర్వులు, మహర్షులు ఉన్నారన్నావు. మహర్షీ! రాజర్షులలో హరిశ్చంద్రుడు మాత్రమే దేవేంద్రుని సభలో ఉన్నట్లు చెప్పావు. నియతవ్రతా! నారదా! ఆ హరిశ్చంద్రుడు ఏ పని చేశాడు? ఏ తపస్సు చేశాడు? మహాయశస్వియై ఇంద్రునితో ఎలా పోటీ పడగలిగాడు? బ్రహ్మర్షీ! నీవు పితృలోకానికి పోయి మహానుభావుడైన మాతండ్రిని పాండురాజును కూడా చూశావు కదా! ఆయన నెలా కలిశావు? ఆయ నేమన్నాడు? అది నాకు చెప్పు. అదంతా నీద్వారా వినాలని నాకెంతో కుతూహలంగా ఉంది."

నారదుడిలా అన్నాడు. "రాజశ్రేష్ఠా! నీవు హరిశ్చంద్రుని గూర్చి అడిగావు. ఆ ధీమంతుని గొప్పతనాన్ని వివరంగా నీకు చెపుతాను. ఇక్ష్వాకు వంశంలో త్రిశంకు డనే రాజుండేవాడు. ఆయన అయోధ్యకు రాజు. విశ్వామిత్రునితో పాటు ఉండేవాడు. కేకయవంశస్థురాలయిన సత్యవతి ఆయన భార్య. ధర్మరాజా! ఆ సత్యవతి ధర్మబద్ధంగా గర్భాన్ని ధరించింది. కాలక్రమంలో పదవనెల వచ్చి ఆమె నిష్కల్మషుడైన హరిశ్చంద్రుని కన్నది. ఆ త్రిశంకుసుతుడే లోకప్రసిద్ధి కెక్కిన హరిశ్చంద్రుడు. ఆ రాజు మిక్కిలి బలవంతుడు. సర్వరాజులకు సమ్రాట్టు. రాజులందరూ ఆయన ఆదేశాన్ని శిరసావహించటానికి సిద్ధంగా ఉండేవారు. రాజా! స్వర్ణమయమై, జయశీలమైన ఒక రథాన్ని అధిరోహించి' శస్త్రప్రతాపంతో ఆ హరిశ్చంద్రుడు సప్తద్వీపాలనూ జయించాడు.

మహారాజా! ఆ హరిశ్చంద్రుడు పర్వతారణ్యాలతో సహా సమస్తభూమండలాన్ని జయించి రాజసూయమహాయాగాన్ని నిర్వహించాడు. హరిశ్చంద్రుని ఆదేశాన్ని అనుసరించి రాజు లందరూ ధనాన్ని కానుకగా తెచ్చి, ఆ యాగవేళలో బ్రాహ్మణులకు భోజనం వడ్డించారు. హరిశ్చంద్రమహారాజు సాదరంగా యాచకులు అడిగిన దానికన్న అయిదురెట్లు ఎక్కువగా దానాలు చేశాడు. యాగం ముగుస్తున్న దశలో నానాదిక్కుల నుండి వచ్చిన బ్రాహ్మణులను వివిధధనాలతో సంతృప్తిపరచాడు. వివిధభక్ష్యాలతో, భోజ్యాలతో, కోరుకొన్న వస్తువులు అందుకోవటంతో, రత్నరాసుల దానాలతో సంతృప్తిపడిన బ్రాహ్మణుల ఆశీస్సుల నందుకొని హరిశ్చంద్రుడు ఇతరరాజులను మించి తేజస్వి, యశస్వి అయ్యాడు. ధర్మరాజా! ఈ కారణంవలననే వేలమంది రాజులలో కూడా హరిశ్చంద్రుడు మిన్నగా ప్రకాశిస్తున్నాడు. రాజా! ప్రతాపశాలి అయిన హరిశ్చంద్రుడు రాజసూయయాగాన్ని ముగించి, సామ్రాజ్యాభిషేకాన్ని చేసికొని విరాజిల్లాడు. భరతశ్రేష్ఠా! రాజసూయమహాయాగాన్ని నిర్వహించిన రాజులందరూ

ఇంద్రునితో కలిసి ఆనందంగా ఉంటారు. భరతర్షభా! యుద్ధరంగంలో వెన్ను చూపక నిలిచి మరణించిన వారు కూడా స్వర్గలోకాన్ని చేరి ఆనందంగా ఉంటారు. తీవ్రమైన తపస్సు చేసి, శరీరాన్ని పరిత్యజించిన వారుకూడా ఇంద్రలోకాన్ని పొంది, శ్రీమంతులై సదా ప్రకాశిస్తారు. కొంతేయా! నీ తండ్రి పాండురాజు హరిశ్చంద్రుని వైభవాన్ని చూచి ఆశ్చర్యపడి నీకొక సందేశాన్ని పంపాడు. రాజా! నేను మానవలోకానికి వస్తున్నానని తెలిసి, నాకు నమస్కరించి ధర్మరాజుతో చెప్పవలసినదంటూ నాతో ఇలా అన్నాడు.

'భారతా! నీవు భూమినంతా జయించగలవాడవు. సోదరులు నీ అదుపులో ఉన్నారు. కాబట్టి శ్రేష్ఠయాగ మయిన రాజసూయాన్ని ఆచరించు. నాకుమారుడ వయిన నీవు రాజసూయయాగాన్ని నిర్వహిస్తే వెంటనే నేనుకూడా హరిశ్చంద్రునివలె ఎన్నో సంవత్సరాలు ఇంద్రసన్నిధిలో ఆనందాన్ని అనుభవించగలను' అప్పుడు నేను "అలాగే నేను భూలోకానికి వెళితే మహారాజయిన నీకుమారునకు నీ మాటను చెప్పగలను" అని పాండురాజుతో అన్నాను. ధర్మజా! మీతండ్రి సంకల్పాన్ని నీవు పాటించు. తత్ఫలంగా నీవు నీపూర్వీకులతో సహా ఇంద్రలోకాన్ని పొందగలవు. రాజా! ఈ రాజసూయమహాయాగానికి ఎన్నో ఆటంకాలు వచ్చే అవకాశ మున్నది. యాగవినాశ కులయిన బ్రహ్మరాక్షసులు ఎన్నో విఘ్నాలను కల్పిస్తారు. ఈ యాగాన్ని అనుష్ఠించటంవలన ఈభూమండలంపై సర్వక్షత్రవినాశకమైన యుద్ధం సంభవించేందుకు కారణమైన సంఘటన జరిగే అవకాశం కూడా ఉన్నది. రాజేంద్రా! ఇదంతా ఆలోచించి నీకు క్షేమ మనిపించినది ఆచరించు. నాల్గువర్ణాలను రక్షించటంలో నిత్యమూ అప్రమత్తుడవై సంసిద్ధుడవై ఉండు. లోకంలో అభ్యుదయాన్ని పొందు. ఆనందంగా ఉండు. ధనంతో బ్రాహ్మణులను తృప్తులను చేయి. నీవు నన్ను అడిగినవిషయాన్ని వివరంగా చెప్పాను. నీవు అనుమతిస్తే ఇక్కడ నుండి ద్వారకకు వెళ్తాను." నారదుడు పాండవులతో ఇలా పలికి తనవెంట వచ్చిన మునులతో కలిసి నిష్క్రమించాడు. నారదుడు వెళ్ళిపోగానే కురువంశస్థుడైన ధర్మరాజు తన సోదరులతో రాజసూయమహాయాగాన్ని గూర్చి ఆలోచించాడు.

13. యుధిష్ఠిరుడు రాజసూయమును సంకల్పించి సన్నిహితులతో చర్చించుట.

ధర్మరాజు నారదుని మాటను విని నిట్టూర్చాడు. రాజసూయయాగాన్ని గురించి ఆలోచిస్తూ ప్రశాంతంగా ఉండలేకపోయాడు. రాజసూయయాగాన్ని చేసిన మహాత్ములైన

రాజర్షుల గొప్పతనాన్ని విన్నాడు. పుణ్యకర్మల ద్వారా వారు ఉత్తమలోకాలు పొందిన వైనాన్ని ఆలోచించాడు. ప్రత్యేకించి రాజర్షి అయిన హరిశ్చంద్రుని వైభవాన్ని తెలిసికొని ధర్మరాజు రాజసూయయాగాన్ని చేయాలని భావించాడు. ఆ తర్వాత యుధిష్ఠిరుడు సభాసదులను అందరనూ సత్కరించి, వారి సత్కారాలను గ్రహించి, రాజసూయయాగ నిర్వహణాన్ని సంకల్పించాడు. రాజేంద్రా! కురుశ్రేష్ఠుడైన యుధిష్ఠిరుడు బాగా ఆలోచించి రాజసూయయాగానుష్ఠానంపై మనస్సు పెట్టాడు. ధర్మరాజు తన ధర్మాన్ని గురించి ఆలోచిస్తూ, సర్వలోకహితం మీద కూడా మనస్సు పెట్టాడు. సమస్తధర్మాత్ములలో శ్రేష్ఠుడైన ధర్మరాజు సర్వప్రజలనూ అనుగ్రహిస్తూ అందరికీ సమానంగా హితాన్ని చేయసాగాడు. 'కోప మదాలను పరిత్యజించి అందరికీ వారి వారికి ఇవ్వదగిన వాటినివ్వండి. రాజ్యంలో "ధర్మరాజా! చక్కగా నిర్వహించావు" అన్న మాట తప్ప మరొకటి వినిపించకూడదు' అని తన వారి నాదేశించాడు. ధర్మజుడు ఆ రీతిగా వ్యవహరించగా ప్రజ లందరూ తండ్రిమీదవలె ధర్మజునిపై ఆసక్తు లయ్యారు. ఆయనను ద్వేషించే వారే లేరు. అందుకే అజాతశత్రు డయ్యాడు.

ధర్మజుడు అందరినీ ఆదరించేవాడు. భీముడు అందరినీ రక్షించేవాడు. సవ్యసాచి అయిన అర్జునుడు శత్రువుల నణచివేసేవాడు. ధీమంతుడైన సహదేవుడు ధర్మబోధ చేసేవాడు. నకులుడు స్వాభావికంగానే అందరితో వినయంగా ఉండేవాడు. అందువలన రాజ్యంలోని జనపదాలన్నీ కలహాలు, భయాలు లేకుండా ధర్మాసక్తితో ఉన్నాయి. వారు కోరినప్పుడు విస్తారంగా వర్షాలు కురిసేవి. ధర్మజుని కార్యనిర్వహణవలన వడ్డీవ్యాపారులు, యాగసామగ్రి, గోరక్షణ, వ్యవసాయం, వ్యాపారం బాగా వృద్ధి చెందాయి. దరిద్రులనుండి గడచిపోయిన సంవత్సరాల బాకీలు వసూలు చేసేవారు కాదు. వర్తమానకాలంలోని బాకీలకై ఎవ్వరినీ పీడించేవారు కాదు. ధర్మతత్పరు డైన ధర్మరాజు పాలన చేస్తుండగా రోగాలు, అగ్నిప్రమాదాలు సంభవించేవి కావు. దొంగలనుండి కానీ, వంచకులనుండి కానీ, రాజువలన కానీ, రాజబంధువుల వలన కానీ ప్రజలు మోసాలకు కానీ, అత్యాచారాలకు కానీ గురికాలేదు. ప్రజలు కూడా పరస్పరం కపటత్వంతో ప్రవర్తించేవారు కాదు. ఇతరరాజులు తమదేశాలలోని కులీనవైశ్యులతో కలిసి యుధిష్ఠిరునకు ప్రియాన్ని చేయటానికి, కప్పం చెల్లించటానికి, తాము సంపాదించిన ధనరత్నాదులను కానుక చేయటానికి సంధివిగ్రహాదిషడ్గుణాలలో సహకరించటానికి ఆయన దగ్గరకు వచ్చేవారు. రాజసమనస్కులు, విషయాసక్తి గలవారు ఎంత విచ్చలవిడిగా ధనాన్ని ఖర్చుచేస్తున్నా ధర్మజుని ధర్మపరిపాలనలో దేశం అభివృద్ధినే

సాధించింది. యుధిష్ఠిరుని కీర్తి అంతటా వ్యాపించింది. ఆయన సర్వగుణపరిపూర్ణుడు. అన్నింటినీ సహించగలవాడు. అంతటా విరాజిల్లేవాడు. దశదిశలా వ్యాపించిన మహాకీర్తి గల యుధిష్ఠిరచక్రవర్తి పరిపాలిస్తున్న రాజ్యంలోని ప్రజలు బ్రాహ్మణులనుండి గోపాలురవరకు అందరు ధర్మరాజును తల్లితో, తండ్రితో సమానంగా అనురక్తులై చూసేవారు. వాగ్మి అయిన ఆ యుధిష్ఠిరుడు మంత్రులనూ, సోదరులనూ పిలిపించి రాజసూయయాగ విషయమై పదే పదే అడిగాడు. రాజసూయాన్ని నిర్వహించదలచి ధర్మరాజు తమను ప్రశ్నించగా ఆ మంత్రులంతా కలిసి మహాప్రాజ్ఞుడైన ధర్మరాజుతో ఇలా అన్నారు. రాజసూయాన్ని నిర్వహించి అభిషిక్తుడైన రాజు వరుణుని గుణాలను పొందగలడు. అందువలన ఏరాజు అయినా రాజసూయం చేసి సమ్రాట్టుగుణాలను పొందాలనే కోరుతాడు. కురునందనా! నీవు సమ్రాడ్గుణాలను పొందటానికి సర్వవిధాల యోగ్యుడవు. రాజసూయం చేయటానికి నీ కిదే సమయ మని నీ మిత్రులంతా భావిస్తున్నారు. ఆ రాజసూయనియమం క్షత్రసంపత్తికి అధీనమైనది. కాబట్టి వ్రతాచరణశీలు రయిన బ్రాహ్మణులు అగ్నిప్రతిష్ఠాపనకై ఆరు అగ్నివేదికలను నిర్మిస్తారు. ఈ యాగాన్ని నిర్వహించినవాడు దర్వీహోమం మొదలుగాగల సమస్తయాగాల ఫలాన్ని పొందుతాడు. యజ్ఞావసానంలో అభిషేకాన్ని పొందినవాడు సర్వవిజేతయై సమ్రాట్టు అనబడతాడు. మహాభాగా! నీవు సమర్థుడవు. మేము నీ అధీనంలో ఉన్నాం. మహారాజా! నీవు త్వరలోనే రాజసూయాన్ని పూర్తిచేయగలవు. మహారాజా! ఇక సంకోచించకుండా రాజసూయం మీద మనస్సుపెట్టు" - ఈ రీతిగా మంత్రు లందరూ కలిసి, విడివిడిగా కూడా ధర్మరాజుకు చెప్పారు.

శత్రుసంహర్త అయిన ధర్మరాజు ధర్మబద్ధం, సాహసపూర్ణం, అభీష్టం, శ్రేష్ఠం అయిన మంత్రుల మాటను విని దానిని మనసారా స్వీకరించాడు. మిత్రులు పలికిన ఆ మాటలను విని, తన సామర్థ్యాన్ని కూడా ఆకళింపు చేసికొని ధర్మరాజు రాజసూయయాగం చేయాలని మాటిమాటికి మనసుపడ్డాడు. ధీమంతుడైన ఆ ధర్మరాజు మహాత్ములయిన ఋత్విక్కులతో, మంత్రులతో ధౌమ్య, వ్యాసాది మహర్షులతో రాజసూయాన్ని గూర్చి ఇలా ఆలోచించి అన్నాడు - "రాజసూయమన్న ఈ ఉత్తమక్రతువు ఏ సమ్రాట్టులకో తగినది. నాకు దానిపై శ్రద్ధ కలుగుతోంది. నా ఈ కోరిక ఎలా ఉన్నది. చెప్పండి." ధర్మరాజు అలా అడగగానే వారు ఆ సమయానికి తగినట్లు యుధిష్ఠిరునితో ఇలా అన్నారు. "ధర్మజ్ఞా! రాజసూయయాగానికి నీవు తగినవాడవు." ఋత్విక్కులు, ఋషులు ధర్మజునితో ఆ రీతిగా పలకగానే ధర్మజుని మంత్రులు, సోదరులు ఆమాటను


96353

అభినందించారు.

ఆ తరువాత జితేంద్రియుడు, ధీమంతుడూ అయిన ధర్మరాజు లోకహితాన్ని కోరుతూ మరలా దానిని గురించి ఆలోచించాడు. 'తనశక్తిసాధనాలను గుర్తించి దేశకాలాలను, ఆదాయవ్యయాలను అవగాహన చేసికొని కార్యారంభం చేసిన బుద్ధిశాలి కడగండ్లపాలు కాడు. తానొక్కడే నిశ్చయించుకొని యజ్ఞకర్మ నారంభించరాదు' అని భావించి సర్వయత్నాలతో కార్యాన్ని నిర్వహించాలని సంకల్పించిన యుధిష్ఠిరుడు, రాజసూయ కార్యనిర్ణయంలో శ్రీకృష్ణుని అందరికన్న మిన్నగా తలచి మనసా శ్రీకృష్ణుని శరణువేడాడు. ఆ శ్రీకృష్ణుడు మహాబాహువు, అప్రమేయుడు, లోకరక్షణ మన్న కోరికతో జన్మించినవాడు. దేవతలు సయితం మెచ్చుకొనే శ్రీకృష్ణుని కర్మలను బట్టి ఆయనకు తెలియనిది ఏదీ లేదని, ఆయన చేయలేనిది ఏదీ లేదని భావించాడు యుధిష్ఠిరుడు. శ్రీకృష్ణునకు భరింపరానిది ఏదీ లేదని కూడా భావించాడు యుధిష్ఠిరుడు. ఆ విధంగా స్థిరనిర్ణయానికి వచ్చిన ధర్మరాజు గురుజనులకు తెలియజేసే పద్ధతిలో సర్వప్రాణులకు గురువయిన శ్రీకృష్ణుని దగ్గరకు దూతను పంపాడు. వేగంగా ప్రయాణించే రథంలో ఆ దూత శీఘ్రంగా యాదవుల దగ్గరకు పోయి ద్వారకావాసి అయిన శ్రీకృష్ణుని కలిశాడు. దూతగా వచ్చిన ఇంద్రసేనుని మాట విని యాదవశ్రేష్ఠుడు, బలవంతుడు అయిన శ్రీకృష్ణుడు తనను చూడగోరిన యుధిష్ఠిరుని చూడాలని తలచి, ఇంద్రసేనునితో కలిసి ఇంద్రప్రస్థానికి బయలుదేరాడు. వేగంగా పయనించే వాహనంలో శ్రీకృష్ణుడు వివిధదేశాలను దాటిపోయాడు. శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థంలో ఉన్న యుధిష్ఠిరుని కలిశాడు. అక్కడ మేనత్త కొడుకులయిన ధర్మరాజభీమసేనులచే తండ్రివలె పూజలనంది ఆపై ప్రేమపూర్వకంగా మేనత్తను దర్శించాడు. ఆపై తనకు ప్రీతిపాత్రు డయిన అర్జునునితో సమావేశమై ఆనందించాడు. అర్జునునిచే, నకులసహదేవులచే తండ్రివలె పూజింపబడ్డాడు. ఆపై శ్రీకృష్ణుడు అనువయిన తావున విశ్రమించాడు. కొంతసేపటి తర్వాత సన్నద్ధుడై సందర్శనకు అవకాశం కల్పించినప్పుడు యుధిష్ఠిరుడు ఆయనను కలిసి, తాను ఆశిస్తున్న ప్రయోజనాన్ని తెలియజేశాడు.

"శ్రీకృష్ణా! నేను రాజసూయాన్ని చేయసంకల్పించాను. కానీ అది సంకల్పమాత్రంతో సాధ్య మయ్యేది కాదు. దానిని నిర్వహించగల మార్గాలన్నీ నీకే తెలుసు. అన్నింటిని సాధించగలవాడు, అంతటా పూజింపబడేవాడు, సర్వరాజులను శాసించగలవాడు, అయిన రాజు మాత్రమే రాజసూయాన్ని సుసంపన్నం చేయగలడు. నామిత్రులంతా కలిసి నన్ను ఆ రాజసూయయాగాన్ని చేయమంటున్నారు. కానీ కృష్ణా! నీ మాటను బట్టి మాత్రమే

అంతిమనిర్ణయ ముంటుంది. కొందరు నామీది ప్రేమతో నాలోని దోషాలను చెప్పరు. కొందరు స్వప్రయోజనం కోసం ప్రియంగానే మాట్లాడుతారు. కొందరు తమకు హిత మయినదే నాకూ ప్రియ మయిన దని భావిస్తారు. మనుషులు ఈ రీతిగా స్వప్రయోజనంలో భిన్నభిన్నంగా కనిపిస్తారు. నీవు ఆ కారణాల నన్నింటినీ అతిక్రమించి, కామక్రోధాలను ప్రక్కకు నెట్టి, ఈ లోకంలో నాకు సరిగా సరిపోయినదానినే చెప్పవలసినది.''

14. శ్రీకృష్ణుడు రాజసూయమునకు సమ్మతించుట.

శ్రీకృష్ణుడిలా అన్నాడు. "మహారాజా! నీవు సర్వగుణవంతుడవు. రాజసూయం చేయదగినవాడవు. భారతా! నీకంతా తెలుసు. అయినా అడిగావు కాబట్టి నాకు తోచినది చెపుతాను. పరశురాముడు క్షత్రియుల నందరనూ సంహరించాడు. అప్పుడు మిగిలిపోయిన రాజులు పోయినవారికన్న తక్కువ వారు. కాబట్టి ఇప్పుడు లోకంలో క్షత్రసంజ్ఞ నామమాత్రమే. రాజా! క్షత్రియులంతా కలిసి "క్షత్రియుల నందరనూ జయించినవాడే సమ్రాట్టు కాదగినవాడ"ని ఒక కులనియమాన్ని ఏర్పాటు చేసికొన్నారు. ఆ విషయం నీకు కూడా తెలుసు. పెద్దపెద్ద రాజులు, భూమండలంలోని ఇతర సామాన్యరాజులు కూడా తమను పురూరవునకు, ఇక్ష్వాకునకు వారసులుగా భావిస్తారు. భరతశ్రేష్ఠా! ధర్మరాజా! పురూరవవంశీయులు, ఇక్ష్వాకువంశీయులై ఇప్పుడున్న రాజులలో వందవంశాలు ఉన్నాయని తెలుసుకో. మహారాజా! ఈనాడు యయాతి వారసులలో భోజవంశీయులే గుణదృష్టిలో బాగా విస్తరించి ఉన్నారు. ఆ వంశం నాలుగుదిక్కులా విస్తరించి ఉన్నది. నేటి క్షత్రియు లంతా ఆ వంశసంపదనే ఆశ్రయిస్తున్నారు. రాజా! ప్రస్తుతం జరాసంధ భూపాలుడు సమస్తక్షత్రియుల సంపదలను కొల్లగొట్టి సమ్రాట్టుగా అభిషిక్తు డయ్యాడు. తన బలపరాక్రమాలతో అందరినీ ఆక్రమించి ఆ జరాసంధుడు రాజులపై ఆధిపత్యం వహించాడు. ఆ జరాసంధుడు భూమండలాన్ని అనుభవిస్తూ ఇతర రాజులలో ? మిత్రభేదాన్ని కల్పిస్తున్నాడు. ఇప్పుడు అందరిని మించిన రాజతడే. లోకమంతా ఆయన అదుపులో ఉన్నది. మహారాజా! ఆ జరాసంధుడు తన యుక్తితో, రాజనీతితో మహాసామ్రాజ్యాన్ని సాధించుకొన్నాడు. రాజా! పరాక్రమవంతు డయిన శిశుపాలనరపాలుడు అన్నివిధాలా ఆ జరాసంధుని ఆశ్రయించి ఆయన దగ్గర సేనాపతి అయ్యాడు. మహారాజా! మాయాయుద్ధనిపుణుడూ, మహాబలుడూ, కరూషాధిపతీ, వక్రుడూ అయిన దంతవక్రుడు కూడా ఆ జరాసంధునే ఆశ్రయించి శిష్యునివలె ప్రవర్తిస్తున్నాడు. అంతేకాక మహాపరాక్రమవంతులు, మహాత్ములు అయిన హంసడింభకులు కూడా పరాక్రమశాలి

అయిన జరాసంధుని ఆశ్రయించి ఉన్నారు. కరూషదేశాధిపతి దంతవక్త్రుడు, కరభుడు, మేఘవాహనుడు దివ్యమణిమయకిరీటాలను శిరసా ధరిస్తూ కూడా జరాసంధుని తమ శిరోమణిగా భావిస్తున్నారు.

యవనాధిపుడైన భగదత్తుడు మురు, నరక దేశాలను పరిపాలించేవాడు. అంతులేని బలం కలవాడు. పడమట దిక్కున వరుణునివలె బలసంపన్నుడు. నీతండ్రికి మిత్రుడు. వయస్సు మళ్ళినవాడు. ఆ భగదత్తుడు కూడా వాచా, కర్మణా కూడా విశేషంగా జరాసంధునకు లోబడి ఉన్నాడు. అయినా మనస్సులో నీపై స్నేహబంధం గలవాడు. నీయందు తండ్రివలె వాత్సల్యం గలవాడు. పశ్చిమదిక్కునుండి దక్షిణదిగంతం వరకు భూమిని పాలిస్తున్న నీ మేనమామ కుంతిభోజకులవర్ధకుడైన పురుజిత్తు పరాక్రమశాలి, శత్రుసంహారకుడు. ఆయన నీపై అనన్యస్నేహభావం గలవాడు. వంగ, పుండ్ర, కిరాతదేశాధిపతి అయిన పౌండ్రకుడు కూడా జరాసంధుని పక్షాన చేరాడు. గతంలో నేను ఉదాసీనత కారణంగా ఆ పౌండ్రకుని సంహరించ లేదు. అతడు చేదిదేశంలో పురుషోత్తముడుగా భావింపబడతాడు. దుర్మతి అయిన ఆ పౌండ్రకుడు తనను తాను పురుషోత్తమునిగా భావించుకొని, ఉబలాటంతో ఎప్పుడూ నాలాగా శంఖచక్రాలు ధరించి ఉంటాడు. పౌండ్రక వాసుదేవు డని అతనికి లోకవిఖ్యాతి. మహారాజా! ఈ భూమండలంలోని నాలుగవ భాగానికి రాజు, ఇంద్రుని మిత్రుడు, బలశాలి, తన అస్త్రవిద్యాబలంతో పాండ్య, క్రథ, కైశిక దేశాలను జయించినవాడు, పరశురాముని వంటి సోదరుడు గలవాడు, శూరుడు, శత్రుసంహర్త అయిన భీష్మకుడు కూడా జరాసంధుని భక్తుడే. బంధువులమైన మేము ఎల్లప్పుడూ వినయంగా ఎంత అనుకూలంగా ప్రవర్తించినా, మా శత్రువులతో చేయి కలిపిన ఆ భీష్మకుడు మమ్ము తన వారినిగా భావించడు. ఆయన తన బలాన్ని, తన వంశాన్ని కూడా పరిగణించక జరాసంధుని యశోదీప్తిని చూసి ఆయన పక్షాన చేరాడు. ఉత్తరదిక్కున నున్న పద్దెనిమిది భోజవంశాలు కూడా జరాసంధుని చూచి భయపడి పడమటదిక్కును ఆశ్రయించాయి. శూరసేనులు, భద్రకారులు, బోధులు, శాల్వులు, పటచ్చరులు, సుస్థలులు, సుకుట్టులు, కులిందులు, కుంతులు, శాల్వాయనులు కూడా తమ సోదరులతో, సేవకులతో కలిసి దక్షిణదిక్కుకు పారిపోయారు. దక్షిణపంచాలదేశంలోనూ, కుంతిప్రదేశాలలోను ఉన్న క్షత్రియులు, కోశలులు, మత్స్య, సంన్యస్తపాదాది రాజులు కూడా జరాసంధునకు భయపడి ఉత్తరదిక్కును వీడి దక్షిణానికి పారిపోయారు. అదేరీతిగా పంచాల రాజు లందరూ జరాసంధునకు భయపడి తమ రాజ్యాలను విడిచి సర్వదిక్కులకు పరుగెత్తారు.

కొంతకాలం క్రితం బుద్ధిహీనుడైన కంసుడు యాదవులను మథించి జరాసంధుని కుమార్తెల నిద్దరిని వివాహమాడాడు. వారిపేర్లు అస్తి, ప్రాప్తి. వారు సహదేవుని చెల్లెళ్ళు. వృథామతి అయిన కంసుడు జరాసంధుని బలంతో తనవారి నందరినీ పరాభవించి అందరికన్న పైకి వెళ్ళాడు. కంసుడు చేసిన పెద్ద అత్యాచారమిది. దుర్మార్గుడైన ఆ కంసుడు పీడించగా భోజరాజవంశీయు లయిన పెద్దలు జ్ఞాతిసంరక్షణకై నన్ను అభ్యర్థించారు. అప్పుడు నేను ఆహుకుని కుమార్తె అయిన సుతనువు వివాహాన్ని అక్రూరునితో జరిపించాను. బలరాముని సహకారంతో జ్ఞాతిరక్షణ కార్యాన్ని ముగించాను. నేనూ, బలరాముడూ కంసునీ, సునామునీ సంహరించాము. రాజా! కంసునివలన భయం పోయింది. అయితే జరాసంధుడు మాపై విజృంభించాడు. అప్పుడు భోజవంశానికి చెందిన పద్దెనిమిది కులాలకు చెందిన వారమూ కలిసి ఆలోచించాం. మనం శత్రువులను సంహరించగల మహాస్త్రాలను గైకొని నిరంతరమూ యుద్ధం చేసినా, మూడువందల సంవత్సరాలలోపు జరాసంధుని బలాన్ని నాశనం చేయలేము. శ్రేష్ఠబలవంతులయి, దేవేంద్రసమానులైన హంసడింభకులు జరాసంధుని అనుచరులు. వారు ఏ శస్త్రాస్త్రాలవలన మరణించకుండునట్లు వరాలు పొందినవారు. ఆ హంసడింభకులిద్దరూ, పరాక్రమశాలి అయిన జరాసంధుడు – ఈ ముగ్గురూ కలిసి మూడులోకాల నెదిరించటాని కయినా సమర్థులని నా విశ్వాసం. యుధిష్ఠిరా! ఇది నా అభిప్రాయం మాత్రమే కాదు. ఇతరరాజులు అందరు కూడా ఈ రీతిగానే భావిస్తున్నారు. జరాసంధునితో పదిహేడుసార్లు పోరాడినపుడు యుద్ధంలో బలరాముడు హంసు డని పేరుగల ఒకరాజును చంపాడు. ధర్మజా! ఆ సమయంలో ఎవరో హంసుడు మరణించాడు అన్నారు. అది విని డింభకుడు యమునానదిలో మునిగాడు. హంసుడు లేనిజీవితం ఈ లోకంలో నాకు అవసరం లేదంటూ డింభకుడు మరణించాడు. డింభకుడు ఆ రీతిగా మరణించిన మాట విని శత్రుపురవిజేత అయిన హంసుడు తాను కూడా యమునలోనే మునిగి మరణించాడు. భరతశ్రేష్ఠా! హంసడింభకులు మరణించినట్లు విని జరాసంధమహారాజు శూన్యమనస్కుడై నిర్గమించాడు. శత్రుసంహారా! రాజా! ఆ విధంగా జరాసంధుడు మరలిపోగా, మేమంతా మరల ఆనందంగా మధురలో నివసిస్తున్నాము.

భర్తమరణంతో బాధపడుతూ కంసుని భార్య తండ్రి అయిన జరాసంధుని దగ్గరకు వచ్చి 'నా భర్తను చంపిన వానిని చంపు' అని పదేపదే ఒత్తిడి చేసింది. అప్పుడు మేము గతంలో చేసిన ఆలోచననే మనస్సులో నుంచుకొని, ఉదాసీనంగా మధురను వీడి దూరంగా వెళ్ళాం. అప్పుడు మేమంతా శత్రుభయంతో అక్కడున్న విస్తారసంపదను

విడివిడిగా కొంచెం కొంచెంగా తీసుకొని, జ్ఞాతిబాంధవులతో కలిసి పారిపోవాలని నిర్ణయించుకొని పశ్చిమదిక్కును ఆశ్రయించాం. ధర్మరాజా! రైవతకాద్రిచే రమణీయమైన కుశస్థలిపురంలో మేము నివసించసాగాం. దేవతలు కూడా చొరరానితీరున అక్కడ కోటను బాగుచేసికొన్నాం. ఆ దుర్గంలో నిలిచి ఆడవారు కూడా యుద్ధం చేయగలరు. ఇక వృష్ణియోధులను గురించి చెప్పవలసినదేముంది? మేమక్కడ నిర్భయంగా నివసిస్తున్నాం. రైవతకపర్వతం దుర్గమ మన్న భావనతో జరాసంధునివలన ఇబ్బంది తొలగిపోయిందన్న నిశ్చయంతో మధువంశస్థులంతా సుఖంగా ఉన్నారు. రాజా! మేము జరాసంధునిదృష్టిలో తప్పుచేసినవారం. అందువలననే మా స్వస్థలాన్ని విడిచి రైవతకపర్వతాన్ని ఆశ్రయించవలసివచ్చింది. రైవతకాద్రిలోని కోట మూడు యోజనాల పొడవు గలది. ఒక్కొక్క యోజనం దగ్గరా మూడుదళాలసేన ఉంటుంది. వీరుల పరాక్రమమే దాని తోరణం. ఉన్మత్తులై యుద్ధం చేయగల పద్దెనిమిది యాదవవంశాల ఆవరణాలచే అది రక్షింపబడుతోంది. మావంశంలో పద్దెనిమిది వేలమంది సోదరు లున్నారు. ఆహుకునకు వందమంది కొడుకులు, ఒక్కొక్కడూ దేవతలవంటి పరాక్రమం గలవాడు. రాజా! చారుదేష్ణుడు, ఆయన సోదరుడు, చక్రదేవుడు, సాత్యకి, నేను, బలరాముడు, సాంబుడు, ప్రద్యుమ్నుడు – మేము ఏడుగురం అతిరథులం. ఇతరులను గురించి కూడా విను. కృతవర్మ, అనాధృష్టి, సమీకుడు, సమితింజయుడు, కంసుడు, శంకుడు, కుంతి – ఈ ఏడుగురు మహారథులు. అంధకభోజుని పుత్రుల నిద్దరినీ, వృద్ధు డైన ఉగ్రసేనుని కూడా పరిగణిస్తే మహారథుల సంఖ్య పది అవుతుంది. ఈ వీరు లందరూ వజ్రంవలె దృఢమైన శరీరంగలవారు, పరాక్రమవంతులు, మహారథులు. మధ్యమదేశాన్ని తలచుకొంటూ వృష్ణికులంలో నివసిస్తున్నారు.

(వితద్రువు, ఝల్లి, బభ్రువు, ఉద్ధవుడు, విదూరథుడు, వసుదేవుడు, ఉగ్రసేనుడు – ఈ ఏడుగురు ముఖ్యమంత్రులు. ప్రసేనజిత్తు, సత్రాజిత్తు ఈ ఇద్దరూ కుబేరునివలె సద్గుణసంపన్నులు. వారి దగ్గరున్న శ్యమంతకమణి పెద్ద ఎత్తున బంగారాన్ని ఇవ్వగలది.)

భారతా! నీవెప్పుడూ సమ్రాట్టుకు తగిన గుణాలు గలవాడవు. కాబట్టి నీవు క్షత్రియులలో సమ్రాట్టువు కాగలగాలి.

(దుర్యోధనుడు, భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, శిశుపాలుడు, రుక్మి, ఏకలవ్యుడు, ద్రుముడు, శ్వేతుడు, శైబ్యుడు, శకుని – ఈ వీరుల నందరినీ యుద్ధంలో గెలవకుండా రాజసూయాన్ని ఎలా చేస్తావు? అయితే నీ మీది గౌరవంతో వారంతా నీతో యుద్ధం చేయకపోవచ్చు.)

అయితే ధర్మరాజా! మహాబలుడైన జరాసంధుడు బ్రతికి ఉండగా నీవు రాజసూయాన్ని చేయటం కుదరదని నా అభిప్రాయం. సింహం మహాపర్వతగుహలలో ఏనుగును బంధించినట్లు

జరాసంధుడు రాజులందరినీ గెలిచి గిరివ్రజపురంలో బంధించాడు. జరాసంధమహారాజు మహాత్ముడు, ఉమాపతి అయిన పరమశివుని గూర్చి తీవ్రతపస్సు చేసి విశేషశక్తిని పొంది రాజుల నందరినీ గెలిచాడు. రాజు లందరినీ బలి ఇచ్చి యాగం చేయాలనే ఆయన సంకల్పం దాదాపు నెరవేరినట్లే. ఆ జరాసంధుడు యుద్ధానికి వచ్చిన రాజుల నందరినీ ఓడించి, ఓడించి గిరివ్రజపురానికి బంధించి తెచ్చి ఆ గిరివ్రజపురాన్ని పురుషవ్రజంగా చేశాడు. ఆ సమయంలో మేము కూడా జరాసంధునకు భయపడి మధురను వీడి ద్వారకకు వెళ్ళాం. మహారాజా! నీవు ఈ రాజసూయయాగాన్ని పూర్తిచేయాలంటే జరాసంధవధకోసం, ఆయన అదుపులో నున్న రాజుల విమోచనం కోసం ప్రయత్నించు. ఇలా చేస్తే తప్ప రాజసూయయాగప్రయత్నం పూర్తిగా సఫలం కాదు. భరతర్షభా! జరాసంధుని వధించే ఉపాయాన్ని ఆలోచించు. ఆయనను ఓడిస్తే సకలరాజన్యబలాలను జయించినట్లే. రాజా! ఇది నా అభిప్రాయం. నిష్కలంకా! నీవే మనుకొంటున్నావు? ఈ దశలో హేతుబద్ధంగా ఆలోచించి నిర్ణయించుకొని నాకు తెలియజేయి."

15. జరాసంధునిగూర్చి ధర్మజ భీమశ్రీకృష్ణులు చర్చించుట.

యుధిష్ఠిరుడిలా అన్నాడు- "నీవు బుద్ధిమంతుడవు కాబట్టి మరెవ్వరూ చెప్పజాలని విషయాన్ని చెప్పావు. లోకంలో నీవలె సందేహాలు తీర్చగల వాడెవ్వడూ లేడు. ఇంటింటా రాజు లున్నారు. తమకు తమకు ఇష్టమైన పనులు చేసుకొంటున్నారు. కానీ వారు సమ్రాట్టులు కాలేదు. సామ్రాజ్యపదవి కష్టసాధ్యం. ఇతరుల గొప్పతనాన్ని తెలియగలిగిన వాడెవ్వడూ తనను తాను ప్రశంసించుకొనడు. ఇతరులతో కలిసికూడా గొప్పవాడుగా మిగిలినవాడే పూజార్హుడు. కృష్ణా! పృథివి విశాలమయినది, అనంతమయినది. వివిధరత్నాలతో నిండినది. బాగా దూరం ఆలోచించే నీవంటి వారి సహవాసంతోనే మనుష్యులు శ్రేయస్సును గ్రహింపగలరు. నేనుమాత్రం ఇంద్రియనిగ్రహాన్ని గొప్పగా భావిస్తాను. దానివల్లనే నాకు క్షేమం కలుగుతుంది. రాజసూయాన్ని ప్రారంభించినంత మాత్రాన దాని ఫలితాన్ని పొందలేనని నా అభిప్రాయం. జనార్దనా! ఉత్తమవంశ సంజాతులై, అభిమానవంతు లయిన ఈ సభాసదులలో అన్నింటిని గెలువగలవా రెవరైనా ఉండవచ్చు కూడా. మహానుభావా! జరాసంధుడంటే భయపడుతూ, ఆయన దుర్బుద్ధి కారణంగా మేమెప్పుడూ సంశయిస్తూనే ఉంటాము. నేను నీ భుజబలాన్నే నమ్ముతున్నాను. నీవు కూడా జరాసంధుని సంశయిస్తూ ఉంటే నన్ను నేను బలవంతునిగా భావించుకొనలేను. మహాబాహూ! మాధవా! నీవు,

బలరాముడు, భీముడు, అర్జునుడు - మీలో ఎవ్వరూ జరాసంధుని చంపలేరా? వార్ష్ణేయా! నాకు తెలుసు. అయినా ఈ విషయాన్నే మాటిమాటికి ఆలోచిస్తున్నాను. కేశవా! అన్ని పనులలోనూ నీవే నాకు ప్రమాణం" ఆమాట విని వాక్యవిశారదుడైన భీము డిలా అన్నాడు.

"ప్రయత్నశీలుడు కాని రాజు, తాను దుర్బలుడయినా, ఏదో ఒక ఉపాయంతో పనిచేయక బలవంతునిచూచి భయపడిన రాజు - ఈ ఇద్దరూ చెదపట్టిన పుట్టవలె నశించి పోతారు. అలసత్వాన్ని వీడి రాజనీతిని చక్కగా ప్రయోగించి, పనిచేసిన రాజు దుర్బలుడైనా, బలిష్ఠుడైన శత్రువును ఓడించగలడు. శ్రీకృష్ణునిలో నీతి ఉంది. నాలో బలం, అర్జునునిలో విజయం ఉన్నాయి. మూడు అగ్నుల ద్వారా యజ్ఞసిద్ధిని పొందినట్లు ఈ మూడింటి కలయికతో జరాసంధుని జయిస్తాం.

(గోవిందా! నీ బుద్ధిబలాన్ని ఆశ్రయించి ధర్మరాజు దేన్నైనా పొందగలడు. నీవు మమ్ము ఎల్లప్పుడూ కాపాడుతుంటావు కాబట్టి గెలుపు మాదే.")

కృష్ణు డిలా అన్నాడు. "అజ్ఞాని కార్యారంభం చేస్తాడు కానీ పరిణామాలను గ్రహించలేడు. కాబట్టి స్వప్రయోజనపరాయణుడైన మూఢశత్రువును వీరులు సహించరు. యువనాశ్వకుమారుడు మాంధాత శత్రువులను గెలిచి, భగీరథుడు ప్రజాపాలన చక్కగా చేసి, కార్తవీర్యుడు తపోబలాన్ని బట్టి, భరతమహారాజు బలాన్ని బట్టి సమ్రాట్టు లయ్యారు. సమృద్ధిబలంతో మరుత్తుడు సమ్రాట్టు అయ్యాడు. ఇంతవరకు ఈ అయిదుగురు మాత్రమే సమ్రాట్టులుగా వింటున్నాం. యుధిష్ఠిరా! వీరంతా ఒక్కొక్కగుణంతో సమ్రాట్టు లయ్యారు. నీవు సర్వగుణాలతో సమ్రాట్టువు కాగోరుతున్నావు. సామ్రాజ్యపదవికి అవసర మయిన శత్రుజయం, ప్రజాపాలనం, తపశ్శక్తి, ధనసమృద్ధి, రాజనీతి నీదగ్గరున్నాయి.

అయితే భరతర్షభా! నీ దారికడ్డంగా జరాసంధుడున్నాడు. అది గ్రహించు. క్షత్రియులలోని నూరువంశాల వారు ఆ జరాసంధుని అనుసరించరు. అయినా ఆయన తన బలంతోనే సామ్రాజ్యస్థాపన చేయగలిగాడు. రత్నరాసులు గల రాజులు జరాసంధుని సేవిస్తూనే ఉన్నారు. అయినా దానితో ఆనందించని జరాసంధుడు వివేకశూన్యుడై దుర్మార్గాన్నే స్వీకరిస్తాడు. ఇప్పట్లో జరాసంధుడే ప్రధానపురుషుడై అభిషిక్తు లయిన రాజుల నందరినీ బలపూర్వకంగా బందీలను చేస్తున్నాడు. ఆయన బంధించని రాజును నేనింతవరకు చూడలేదు. ఈరీతిగా జరాసంధుడు నూరురాజవంశాలలోని ఎవరో ఒకరిద్దరిని తప్ప అందరినీ లొంగదీసుకొన్నాడు. కొంతేయా! బలహీను డయిన ఏ రాజు ఆయన నెదిరించే సాహసం చేయగలడు ? పరమేశ్వరునకు బలి ఇవ్వటానికై రాజులను తన రుద్రమందిరంలో

బంధించి, జరాసంధుడు వారికి సంప్రోక్షణ మార్జనాలను జరిపి, జంతువులను వలె సిద్ధంగా ఉంచాడు. వారు జీవితం మీద ప్రేమను కోల్పోయారు. క్షత్రియులకు యుద్ధంలో ఆయుధం ద్వారా మరణమే సత్కారం. కాబట్టి మనం జరాసంధుని ద్వంద్వయుద్ధంలోనే చంపుదాం. జరాసంధుడు ఎనభైఆరుమంది రాజులను బంధించాడు. మిగిలినవారు పదునలుగురు మాత్రమే. వారిని కూడా బంధించిన తర్వాత మరీక్రూరంగా ప్రవర్తిస్తాడు. జరాసంధుని ఈ ప్రయత్నాన్ని అరికట్టగలవాడు ఉజ్జ్వలకీర్తిని పొందగలడు. జరాసంధుని జయించినవాడు తప్పక సమ్రాట్టు కాగలడు."

16. జరాసంధవధను గురించి ఆలోచించుట.

యుధిష్ఠిరుడిలా అన్నాడు - "కృష్ణా! నేను సమ్రాట్టును కావాలన్న స్వార్థదృష్టితో ఇంత సాహసాన్ని చేసి మిమ్ములను జరాసంధుని దగ్గరకు ఎలా పంపగలను? **భీమార్జునులు ఇద్దరూ వాకు కళ్ళు. శ్రీకృష్ణుడు మనస్సు. మనస్సు, కళ్ళు కోల్పోతే ఇక నా జీవితమెలా ఉంటుంది?*** భీకరపరాక్రమంతో అంతులేని ఆ జరాసంధుని సేనను ఎదిరించి యముడు కూడా గెలువలేడు. ఆ తావున మీరేమి చేయగలరు? మీరు ఆ జరాసంధుని గెలిచి తిరిగి ఇక్కడకు రాగలరా? ఈ ప్రయత్నం మనకు అభీష్టఫలం కన్న విపరీతమైన ఫలితాన్ని ఇవ్వవచ్చు. అనర్థాలు కలుగవచ్చు. కాబట్టి రాజసూయయాగాన్ని గురించిన ఆలోచన తగదేమో అని నాకనిపిస్తోంది. జనార్దనా! ఈ విషయంలో నేను ఒంటరిగా చేస్తున్న ఆలోచనను విను. ఈ ప్రయత్నాన్ని విరమించటమే నాకు మంచిదనిపిస్తోంది. రాజసూయానుష్ఠానం చాలాకష్టం. నామనస్సులో నిరుత్సాహ అలముకొంది.

అపుడు అర్జునుడిలా అన్నాడు. "రాజా! ధనుస్సు, శస్త్రాలు, బాణాలు, పరాక్రమం, సహాయకులు, భూమి, కీర్తి, బలం - వీటిని పొందటం కష్టం. అయితే ఈ దుర్లభవస్తువులన్నీ నాకు సంక్రమించాయి. అనుభవంగల పండితులు ఉత్తమవంశంలో జన్మించటాన్ని ప్రశంసిస్తారు. కానీ బలంతో సమానమైనది లేదు. పరాక్రమమే శ్రేష్ఠమని నా అభిప్రాయం. పరాక్రమసంపన్నుల వంశంలో పుట్టినా బలహీనుడు ఏమీ చేయలేడు. పరాక్రమహీనులవంశంలో పుట్టినా పరాక్రమశాలి గొప్పవాడు కాగలడు. రాజా! శత్రువులను జయించాలన్న ప్రవృత్తిగలవాడే ఉత్తమక్షత్రియుడు. అటువంటివాడు ఏ గుణాలు లేకపోయినా పరాక్రమించి, శత్రుసంకటాల

* భీమార్జునావుభా నేత్రే మనో మన్యే జనార్దనమ్ ।
మమశ్చక్షుర్విహీనస్య కీదృశం జీవితం భవేత్ ॥ 2

నుండి బయటపడగలడు. అన్ని మంచి గుణాలున్నా పరాక్రమం లేకపోతే ఏం చేయగలడు? పరాక్రమం ముందు మిగిలిన గుణాలన్నీ అప్రధానమే. మనస్సంకల్పమూ, ప్రారబ్ధానికి తగిన పురుషప్రయత్నమూ విజయహేతువులు. బలవంతుడై కూడా ఎవడైనా కర్తవ్యంలో మనస్సును లగ్నం చేయకపోతే కార్యాన్ని సాధించలేడు. ఆ ఏమరుపాటు కారణమై బలవంతుడైన శత్రువు కూడా తన శత్రువుల చేత చంపబడతాడు. **బలవంతునిలో దైన్యం, బలహీనునిలో మోహం రెండూ దోషాలు. ఆ రెండూ వినాశ కారణాలు. విజయార్థి అయిన రాజు వాటిని వదలివేయాలి.*** రాజసూయయాగం కోసం జరాసంధుని చంపి, రాజులను రక్షించగలిగితే అంతకన్న మంచిపని ఏముంటుంది? రాజా! రాజసూయాన్ని ఆరంభించకపోతే మన బలహీనత నిరూపింపబడినట్లే. కాబట్టి సందేహానికి అవకాశం లేని నిశ్చయగుణాన్ని వీడి, నిర్గుణత్వకలంకాన్ని స్వీకరించట మెందుకు? శాంతిని కోరుకొనే మునులకు వలె మనకు కాషాయవస్త్రాలు సులభంగా దొరుకుతాయి. కానీ మనం సామ్రాజ్యాన్ని పొందదగినవారం. శత్రువులతో యుద్ధమే చేస్తాం."

17. జరాసంధ జననవృత్తాంతము.

వాసుదేవుడిలా అన్నాడు- "భారతవంశంలో పుట్టిన వానికీ, కుంతికొడుకుగా పుట్టినవానికీ తగినరీతిగా అర్జునుడు తన బుద్ధిని ప్రదర్శించాడు. **చావు ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు. అది పగలో, రాత్రో కూడా మనమెరుగం. యుద్ధం మానినంత మాత్రాన ఎవ్వడూ చిరంజీవిగా నిలువడు. నిలిచినట్లు ఎవ్వడూ వినలేదు.** తమ హృదయానందం కోసం రాజనీతి శాస్త్రానుసారం శత్రువులపై ఆక్రమణ చేయటమే వీరపురుషుల కర్తవ్యం. అపాయరహితమయిన రాజనీతి, మంత్రాంగమూ పరాక్రమమూ కలిస్తే కార్యం పూర్తిగా సఫలమవుతుంది. శత్రువులతో కలిసినప్పుడే ఇరువురిమధ్య గల తేడా తెలిసేది. ఏ రెండు బలాలు సర్వవిధాలా సమానంగా ఉండే అవకాశమే లేదు. ఉత్తమనీతి, మంచి ఉపాయమూ లేకుండా యుద్ధాన్ని ఆరంభిస్తే వినాశమే జరుగుతుంది. రెండుపక్షాలూ సమానంగా ఉంటే జయాపజయాలు ఇద్దరికీ సంశయాస్పదాలుగానే ఉంటాయి. మనం కూడా రాజనీతిని ఆశ్రయించి శత్రుశరీరానికి దగ్గరగా పోగలిగితే, నదీవేగం చెట్టును కూల్చినట్లు అంతం చేయవచ్చు. మనం మనలోపాలను కప్పిపుచ్చుకొని శత్రువులోని

* **దైన్యం యథా బలవతి తథా మోహో బలాన్వితే।**
తావుభౌ నాశకౌ హేతూ రాజ్ఞా త్యాజ్యౌ జయార్థినా ॥ 14

లోపాలను అన్వేషించాలి. అప్పుడే అదనుచూచి దెబ్బతీయవచ్చు. అత్యంతబలవంతులై, వ్యూహాలు పన్ని ఉన్న శత్రువుల నెదిరించి యుద్ధం చేయదగదని నీతివేత్తల అభిప్రాయం. ప్రస్తుతం అదే నాకు కూడా మంచిదిగా కనిపిస్తోంది. చాటుమాటుగా శత్రువు ఇంట ప్రవేశించి, శత్రువు శరీరాన్ని ఆక్రమించి మనపని ముగించుకోవటం మంచిది. అది నిందింపదగినదేమీ కాదు. పురుషశ్రేష్ఠుడైన జరాసంధుడు ప్రాణులలో నున్న అంతరాత్మవలె ఎప్పుడూ ఒంటరిగా సామ్రాజ్యలక్ష్మిని అనుభవిస్తున్నాడు. కాబట్టి మరే ఉపాయంతోనూ ఆయనను నశింపజేయలేము. యుద్ధంలో జరాసంధుని చంపి ఒకవేళ మిగిలిన సేనల ద్వారా మనమే మరణించినా మనకు నష్టమేమీ లేదు. చెరలోని జ్ఞాతులను రక్షించటంలో ఆసక్తులమయి మరణించినందువలన వీరస్వర్గమే లభిస్తుంది." యుధిష్ఠిరుడిలా అన్నాడు - "కృష్ణా! ఎవరీ జరాసంధుడు? ఆయన శౌర్యపరాక్రమాలు ఎటువంటివి? అగ్నివంటి నీతో కలబడి కూడా మిడతలా ఎందుకు మాడిపోలేదు."

కృష్ణుడిలా అన్నాడు- "రాజా! జరాసంధుడెవరో, ఎటువంటి శౌర్యపరాక్రమాలు గలవాడో, మాకు చాలాసార్లు కీడు చేసినా ఎందుకు ఉపేక్షించవలసి వచ్చినదో చెపుతా విను. మగధ దేశాన్ని బృహద్రథు డనే రాజు పరిపాలించేవాడు. ఆయన బలవంతుడు. మూడు అక్షౌహిణులకు అధిపతి. బృహద్రథుడు అందగాడు. బలసంపన్నుడు. ధనవంతుడు. సాటిలేని పరాక్రమం గలవాడు. ఆయన శరీరం ఇంద్రుని శరీరం వలె ఎప్పుడూ యాగదీక్షాచిహ్నాలతో ఉండేది. ఆయన తేజస్సులో సూర్యసమానుడు. ఓర్పులో భూమివంటివాడు. కోపంలో కాలునివంటివాడు. కుబేరునివలె సంపన్నుడు. సూర్యకిరణాలు భూమండలమంతా వ్యాపించినట్టు వంశోచిత మయిన ఆ బృహద్రథుని గుణాలు జగమంతా వ్యాపించాయి. మహాపరాక్రమశాలి అయిన ఆ బృహద్రథుడు రూపసంపదతో కూడిన కాశీరాజ పుత్రికలను వివాహమాడాడు. ఆ కన్యలు కవలలు. ఇద్దరినీ సమానంగానే చూస్తానని ఆయన వారిదగ్గర ప్రతిజ్ఞ చేశాడు. తనకు నచ్చిన ఆడయేనుగులతో గజరాజు శోభించినట్లు తన ఇద్దరు భార్యలతో ఆ మగధాధీశుడు ప్రకాశించాడు. గంగాయమునల మధ్య మూర్తీభూత సాగరునివలె ఆ ఇద్దరు భార్యల మధ్య ఆ రాజు రాజిల్లాడు. విషయాసక్తిలో నిమగ్నుడైన ఆయన యౌవనం గడచిపోయింది. కాని వంశవృద్ధికోసమై ఒక్క కొడుకు కూడా పుట్టలేదు. శుభప్రదాలయిన హోమాలతో, పుత్రకామయాగాలతో కూడా ఆ రాజన్యుడు వంశవర్ధనుడైన కొడుకును పొందలేకపోయాడు. ఒకమారు గౌతమగోత్రమహాత్ము డయిన కాక్షీవంతుని కుమారుడు, చండకౌశికుడు తపస్సుమాని

అనుకోకుండా అటువైపు వచ్చి ఒక చెట్టుక్రింద నిలిచాడు. బృహద్రథుడు భార్యలతో పాటు ఆయనను దర్శించి, వివిధ రత్నాలను కానుక చేసి, ఆ మహర్షిని సంతుష్టుని చేశాడు.

(ఆ ఋషి బృహద్రథుని తగు రీతిగా ఆదరించాడు. ఆ మహనీయుని అనుమతితో బృహద్రథుడు ఆసీను డయ్యాడు. అప్పుడు ఆ విప్రుడు "రాజా! భార్యలతో, పురజనులతో కలిసి నీవిక్కడకు రావటానికి కారణ మేమిటి?" అని అడిగాడు. ఆ రాజు మునితో ఇలా అన్నాడు - స్వామీ! నాకు కుమారుడు లేడు. పుత్రులు లేని వారి జన్మ నిరర్థకమని అంటారు కదా! సంతానహీనుడనైన నాకు ఈ వార్ధక్యంలో ఈ రాజ్యంతో అవసర మేముంది? భార్యలను వెంటబెట్టుకొని అడవులకు పోయి తపస్సు చేసికొంటాను. మహర్షీ! సంతతి లేకపోతే కీర్తిలేదు. అక్షయ స్వర్గసుఖమూ కలుగదు." రాజు ఆ రీతిగా పలుకగానే మునికి దయ గలిగింది.)

సత్యధృతి, సత్యవాక్కు గల ఆ మునిశ్రేష్ఠుడు రాజుతో 'సువ్రతా! రాజేంద్రా! సంతోషించాను. వరాన్ని కోరుకో' అన్నాడు. అప్పుడు బృహద్రథుడు భార్యలతో సహా మునికి నమస్కరించి, పుత్రహీనతవలన కలిగిన నైరాశ్యంతో కన్నీరు కారి, గొంతు బొంగురుపోగా ఆ మునితో ఇలా అన్నాడు.

స్వామీ! రాజ్యాన్ని వీడి నేను తపోవనానికి బయలుదేరాను. అల్పభాగ్యుడనైన నాకు వరమెందుకు? సంతానహీనుడనైన నాకు రాజ్యమెందుకు?" ఈ మాటలు విన్న మునిమనస్సు ద్రవించింది. ఆ మామిడిచెట్టు నీడలోనే ఆయన ధ్యానంచేస్తూ కూర్చున్నాడు. ఆ రీతిగా కూర్చున్న మునిఒడిలో ఒక మామిడిపండు పడింది. అది గాలికి రాలి పడినదీ కాదు. ఏ చిలుకో కొరికినదీ కాదు. దానిని స్వీకరించి ఆ మునిశ్రేష్ఠుడు మనసా మంత్రించి పుత్రసంప్రాప్తి కారణమైన ఆ సాటిలేని పండును బృహద్రథమహారాజు కిచ్చాడు. 'రాజా! ధన్యుడవయ్యావు. ఇక వెనుకకు మళ్ళు" అని మహాప్రాజ్ఞుడైన ఆ మహాముని రాజుతో అన్నాడు. 'రాజా! ఈ పండువలన నీకు కుమారుడు పుడతాడు. అడవులలో తపస్సు చేయనవసరం లేదు. ధర్మబద్ధంగా ప్రజలను పాలించు. రాజుల ధర్మమిదియే. వివిధయాగాలను చెయ్యి. సోమరసంతో దేవేంద్రునకు తృప్తి కలిగించు. పుత్రునకు పట్టాభిషేకం చేసి ఆ తర్వాత వానప్రస్థానికి వెళ్ళు. రాజా! నీ కుమారునకు ఎనిమిది వరాలనిస్తున్నాను. బ్రాహ్మణభక్తి, యుద్ధంలో ఓటమిలేకపోవటం, యుద్ధాసక్తి నశించకపోవటం, అతిథులను ప్రేమగాచూడటం, దీనులను కాపాడటం, మహాబలం, లోకంలో శాశ్వతకీర్తి, ప్రజానురాగం' ఈ ఎనిమిది వరాలనిచ్చాడు చండకౌశికుడు. ఆ రీతిగా పల్కిన ముని మాటలు విని మహాప్రాజ్ఞుడైన ఆ బృహద్రథుడు ఆ ముని పాదాలకు నమస్కరించి తన గృహానికి వెళ్ళిపోయాడు.

తగినసమయాన్ని గుర్తించి ఆ రాజశ్రేష్ఠుడు ఆ ఒక్క పండును భార్యల కిద్దరికీ ఇచ్చాడు.

ఆ శుభాంగనలు దానిని రెండుగా కోసి తిన్నారు. **జరుగవలసినది జరిగి తీరుతుంది.** కాబట్టి ఆ ముని సత్యవచనుడు కాబట్టి ఆ పండు తిన్నందువలన వారిరువురూ గర్భవతులయ్యారు. మహాప్రాజ్ఞా! రాజా! ప్రసవవేళ సమీపించగానే ఆ ఇద్దరు భార్యలూ చెరొక ముక్కగా ఒకశిశువుకు జన్మనిచ్చారు. ఒక కన్ను, ఒక చేయి, ఒక కాలు, సగం ముఖం, సగం పొట్ట, నడుం క్రింది సగభాగం కల ఆ రెండు శరీరాల ముక్కలను చూచి వారెంతో కంపించిపోయారు. అబల లయిన ఆ అక్కచెల్లెళ్లు ఇద్దరు కలతపడి, కలసి ఆలోచించి, ఎంతో దుఃఖిస్తూ సజీవంగా ఉన్న ఆ శరీరపుముక్కలను విడిచిపెట్టారు. వారిదాదులు ఆ పిండపు ముక్కలను గుడ్డలలో గట్టిగా చుట్టి, అంతఃపురద్వారాలనుండి బయటకు వచ్చి, వాటిని పారవేసి వెళ్ళారు. నరశ్రేష్ఠా! మాంసం, నెత్తురు ఆహారంగా ఉన్న జర అనే పేరుగల రాక్షసి కూడలిలో విసరివేయబడిన ఆ శరీరపు ముక్కలను తీసికొన్నది. విధిప్రేరణచేత ఆ రాక్షసి ఆ ముక్కలను మోసుకొనిపోవటానికి వీలుగా కలిపింది. పురుషశ్రేష్ఠా! కలిపీ కలపగానే ఆ ముక్కలు ఒకేరూపాన్ని ధరించి వీరకుమారుడుగా రూపొందాయి. రాజా! అప్పుడా రాక్షసి కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి. వజ్రంతో చేసినట్టు అనిపించాడు ఆ శిశువు. ఆమె ఆ బరువు మోయలేకపోయింది. ఆ శిశువు మరీ ఎర్రగా ఉన్న తన చేతుల పిడికిలి బిగించి ముఖంలో నుంచుకొని కోపంతో, నీలమేఘస్వనంతో ఏడవసాగాడు. అప్పటికే పుత్రలాభాన్ని గురించి నిరాశతో ఉన్న ఆ రాణి లిద్దరూ పాలు నిండిన రొమ్ములతో, వాడిపోయిన ముఖాలతో వెంటనే వచ్చారు. ఉదాసీనంగా ఉన్న రాణులను, పుత్రప్రాప్తికై ముచ్చటపడుతున్న రాజును, బలిష్ఠుడైన ఆ బాలకుని చూచి ఆ రాక్షసి ఇలా ఆలోచించింది- 'నేను ఈ రాజు రాజ్యంలో ఉన్నాను. ఈ రాజు ధర్మాత్ముడు, మహాత్ముడు. సంతానాన్ని కోరుతున్నాడు. అటువంటి రాజకొడుకును నేను హత్య చేయకూడదు.'

ఆ తరువాత ఆ రాక్షసి మానుషరూపాన్ని ధరించి మేఘసమూహం భాస్కరుని మోసినట్లు ఆ బాలుని తీసికొని రాజును సమీపించి ఇలా అన్నది. 'బృహద్రథా! ఈ శిశువు నీ కుమారుడు, నేనిస్తున్నాను. స్వీకరించు. బ్రహ్మర్షి అనుశాసనంతో నీ భార్యలిద్దరియందు జన్మించాడు. దాదులు వదలివేస్తే నేను రక్షించాను.' ఆ తరువాత శుభాంగనలైన ఆ కాశిరాజు పుత్రికలు ఆ బాలుని వెంటనే ఎత్తికొని చనుబాలతో అభిషేకించారు. అదంతా చూచి, విని ఆనందించిన ఆ బృహద్రథనరపతి స్వర్ణకాంతులతో

విరాజిల్లుతున్న ఆ మానుష వేష రాక్షసిని ఇలా అడిగాడు. 'నాకు పుత్రప్రదానం చేసిన నీవు ఎవరివి? చెప్పు. స్వేచ్ఛాచారిణివయిన ఏ దేవతవో అయి ఉంటావని నాకనిపిస్తోంది.'

18. జరాసంధనామకరణము.

రాక్షసి ఇలా అన్నది- 'రాజేంద్రా నేను కామరూపిణి అయిన రాక్షసిని. నాపేరు జర. నీ ఇంట పూజింపబడుతూ సుఖంగా ఉన్నాను. నేను మానవలోకంలో ఇంటింటా ఉంటాను. నేను రాక్షసినే. కానీ గృహదేవి అన్న పేరుతో విధి నన్ను ఎప్పుడో సృష్టించాడు. దానవవినాశనం కోసం నన్ను నియోగించాడు బ్రహ్మ. నేను దివ్యరూపం గలదానను. నన్ను పుత్రవతి అయిన యువతిగా ఇంటిగోడలపై చిత్రిస్తే ఆ ఇంట అభివృద్ధి ఉంటుంది. లేకపోతే హాని కలుగుతుంది. నీ ఇంట చాలా కాలం నుండి నేను పూజల నందుకొంటున్నాను. బహుపుత్రవతినిగా నన్ను గోడలపై చిత్రించారు. గంధ, పుష్ప, ధూప, భక్ష్య, భోజ్యాలతో సత్కరించారు. దానికి ప్రత్యుకారమేదైనా నీకు చేయాలని ఎప్పుడూ ఆలోచిస్తుంటాను. ధార్మికా! నీ కుమారుల ముక్కలను చూచాను. వాటిని కలిపాను. అదృష్టవశాన కుమారుడయ్యాడు. ఇది నీ భాగ్యం వలన జరిగినది. నేను నిమిత్తమాత్రమే.

(రాజా! ఆ బాలునకు తగిన సంస్కారాలను జరిపించు. నా పేరుతో ఇతడు ప్రఖ్యాతుడవుతాడు.)

నేను మేరుపర్వతాన్ని అయినా తినగలను. నీ బాలకుడు ఇక లెక్క ఏమిటి? కాని నీ ఇంట నన్ను పూజించావు. కాబట్టి కుమారుని తిరిగి నీకు అర్పించాను.'

ఆ విధంగా పలికి జర అక్కడే మాయమయింది. రాజు ఆ కుమారుని తీసికొని ఇంటిలోనికి వెళ్ళాడు. అప్పుడు బృహద్రథుడు ఆ బాలకునకు తగిన సంస్కారాలు జరిపించాడు. మగధదేశంలో ఆ రాక్షసికి మహోత్సవాలు జరపాలని ఆదేశించాడు. 'జరచేత కలుపబడినవాడు కాబట్టి జరాసంధుడు అగుగాక' అని బ్రహ్మసమానుడైన తండ్రి ఆ బాలకునకు పేరుపెట్టాడు. ఆ మగధాధిపతి కుమారుడు మహాతేజస్వియై, తల్లిదండ్రులకు ఆనందాన్ని కలిగిస్తూ మహాకృతి, గొప్పబలం కలిగి శుక్లపక్ష చంద్రునివలె, నేయి పోసిన అగ్నివలె వృద్ధిపొందాడు.

19. జరాసంధుని రాజ్యాభిషేకము.

శ్రీకృష్ణుడిలా అన్నాడు- 'ఆ తరువాత కొంతకాలానికి మహాతపస్వి అయిన చండకౌశికుడు మరల మగధదేశానికి వచ్చాడు. ఆయనరాకతో ఆనందించిన బృహద్రథుడు అమాత్యులతో, పురోహితులతో, భార్యాపుత్రులతో కలిసి ఆయన సందర్శనకు బయలుదేరాడు. భరతా! అర్ఘ్య, పాద్య, ఆచమనీయాలతో రాజ్యంతో పాటు కుమారుని ఆయనకు నివేదించాడు. రాజా! పూజ్యుడైన ఆ మహర్షి రాజు చేసిన సత్కారాన్ని స్వీకరించి మనస్సులో ఆనందించి ఆయనతో ఇలా అన్నాడు - 'రాజా! దివ్యదృష్టితో నేనంతా తెలిసికొన్నాను. ఈ కుమారుడు ఎటువంటివాడు కాగలడో విను. ఈ నీ కుమారుడు రూప, సత్త్వ, బల తేజస్సులతో జన్మించాడు. ఈ కుమారుడు సామ్రాజ్యలక్ష్మితో సంపన్నుడు కాగలడు. ఆ వైభవాన్నంతా తన పరాక్రమంతో పొందగలడు. ఎగిరే గరుడుని ఇతరపక్షులు ఏవీ అనుసరించలేనట్లు ఈ వీరకుమారుని పరాక్రమాన్ని ఇతరరాజులు అనుసరించలేరు. ఇతని శత్రువులందరూ నశిస్తారు. రాజా! నదీవేగం పర్వతాన్ని పీడించలేనట్లే దేవతలు ప్రయోగించిన ఆయుధాలు కూడా ఇతనిని గాయపరచలేవు. అభిషిక్తులయిన రాజులందరి శిరస్సులపై ఈతడు ప్రకాశిస్తాడు. సూర్యుడు ఇతరగ్రహాల కాంతిని అపహరించినట్టు ఈ బాలుడు అందరి తేజస్సులను అపహరిస్తాడు. సమృద్ధసేనలు, వాహనాలు గల రాజులైనా ఈ బాలుని ఎదిరిస్తే అగ్నిమాది మిడతలవలె నశించి పోతారు. వర్షాకాలంలో సముద్రుడు ఉప్పొంగిన నదుల జలాలను తనలో లీనం చేసికొన్నట్టు ఈ బాలుడు రాజులు కూడబెట్టిన సంపదల నన్నింటినీ గ్రహించగలడు. సర్వసస్యాలను ధరించే భూమి శుభాశుభాల నన్నింటినీ సమానంగా భరించినట్టు మహాబలుడైన ఈ బాలుడు చాతుర్వర్ణ్యాన్ని చక్కగా ఆదరించగలడు. దేహధారులందరూ సర్వప్రాణులకు ఆత్మ అయిన వాయువునకు అధీను లయినట్లు రాజు లందరూ ఈ బాలుని ఆజ్ఞ ననుసరించి నడుచుకొంటారు. సర్వలోకాలలోనూ అత్యంతబలవంతుడైన ఈ మాగధుడు త్రిపురాంతకుడు, మహాదేవుడు, రుద్రుడు అయిన హరుని ప్రత్యక్షంగా దర్శిస్తాడు, శత్రుసంహర్తా! ఈ విధంగా మాటాడుతూనే చండకౌశికముని తన కర్తవ్యాన్ని మనసులో తలచుకొని బృహద్రథుని వీడి వెళ్ళాడు. అప్పుడు మగధాధిపతి అయిన బృహద్రథుడు జ్ఞాతులతో, బంధువులతో కలిసి నగరంలోనికి ప్రవేశించి జరాసంధునకు పట్టాభిషేకం చేసి పరమానందాన్ని పొందాడు. జరాసంధునకు పట్టాభిషేకం చేసిన తర్వాత బృహద్రథరాజు తన ఇద్దరు భార్యలతో కలిసి తపోవనానికి వెళ్ళిపోయాడు. నరపతీ! ఆ రీతిగా తండ్రి, తల్లులు వానప్రస్థులు కాగా జరాసంధుడు రాజుల నందరినీ తన అదుపులోనికి

తెచ్చుకొన్నాడు.

ఆ తర్వాత బృహద్రథనరపాలుడు వానప్రస్థాశ్రమంలో దీర్ఘకాలం తపస్సు చేసి పత్నులతో సహా స్వర్గానికి వెళ్ళాడు. జరాసంధరాజుకూడా చండకౌశికముని ఇచ్చిన వరాలనన్నింటిని పొంది, రాజ్యపాలన సాగించాడు. శ్రీకృష్ణుడు కంసరాజును చంపిన తర్వాత శ్రీకృష్ణునితో జరాసంధునకు వైరమేర్పడినది. భారతా! బలసంపన్నుడైన జరాసంధుడు తొంబదితొమ్మిది సార్లు తనగదను త్రిప్పి గిరివ్రజం నుండి దానిని విసిరాడు. తొంబదితొమ్మిది యోజనాల దూరంలో ఉన్న అద్భుత కర్మశీలు డయిన శ్రీకృష్ణుని రాజ్యం మగధలో ఆ గద పడింది. పౌరులు అది చూచి ఆ విషయాన్ని శ్రీకృష్ణునకు తెలిపారు. ఆ గద పడినచోటు గదావసాన మని ప్రసిద్ధికెక్కింది. ఆ జరాసంధునకు బుద్ధిమంతులలో శ్రేష్ఠులు నీతిశాస్త్రవిశారదులు అయిన మంత్రులు ఇద్ద రుండేవారు. వారే హంసడింభకులు. ఏ ఆయుధంచేతనూ వారు చావరు. మహాబలు లయిన వారిని గురించి నేను నీకు ముందే చెప్పాను. ఈ ముగ్గురు మూడు లోకాలనూ ఎదిరించటానికి సమర్థులని నా భావం. వీరమహారాజా! ఈ రీతిగా నీతిని అనుసరించి యే నాడు బలవంతు లయిన కుకుర-అంధక-వృష్ణివీరులు జరాసంధుని ఉపేక్షించారు."

20. ధర్మజుని అనుమతితో శ్రీకృష్ణభీమార్జునులు మగధకు వెడలుట.

వాసుదేవుడు పలికాడు – "హంసడింభకులు నాశనం అయ్యారు. కంసుడు పరివారంతో సహా చంపబడ్డాడు. జరాసంధుని చంపటానికి తగిన సమయం ఆసన్నమైంది. ఇతడు యుద్ధంలో దేవాసురు లందరికి జయింప శక్యంకాడు. బాహుబలంతోనే ఇతనిని చంపాలి అని తెలిసికొన్నాం. **నాలో రాజనీతి ఉంది, భీమునిలో బాహుబలం ఉంది, అర్జునునిలో రక్షణసామర్థ్యం ఉంది. యాగానికి మూడు అగ్నులు ప్రధానమైనట్లు మనం జరాసంధుని అణచివేయగలం.*** ఏకాంతంలో మనం నిర్బంధిస్తే ఆ జరాసంధుడు నిస్సందేహంగా మనలో ఒకనితో యుద్ధానికి అంగీకరిస్తాడు. అవమానం, లోభం, బాహువీర్యం వీటితో గర్వితుడై భీమసేనునితో యుద్ధానికి సంసిద్ధుడవుతాడు. విజృంభించిన లోకాన్ని యముడు తన శక్తితో నశింపచేస్తున్నట్లు గొప్పబాహుబలం, శరీరబలం కల భీముడు అతనిని పడగొట్టటానికి సమర్థుడు. నాపై విశ్వాసముంటే, నాహృదయాన్ని నీవు తెలుసుకుంటే

---

* మయి నీతిర్బలం భీమే రక్షితా చావయోర్జయః ।
మాగధం సాధయిష్యామః ఇష్టిం త్రయ ఇవాగ్నయః ॥ 3

భీమసేనార్జులను న్యాసభూతులుగా (తిరిగి అప్పగించేవారిగా) వెంటనే నాకు ఇయ్యి." శ్రీకృష్ణుని ఈ పలుకులను విని యుధిష్ఠిరుడు ముఖాల్లో ఆనందం వెల్లివిరిసే భీమార్జునులను చూచి ఇలా అన్నాడు. "శ్రీకృష్ణా! ఈ విధంగా ఎన్నడూ పలుకవద్దు. పాండవులకు నీవే నాథుడవు. నిన్ను ఆశ్రయించే మేం ఉన్నాం. నీవు పలికేదంతా సిద్ధిస్తుంది. నీవు ముందు లేకపోతే వారికి జయలక్ష్మి పరాఙ్ముఖురాలు అవుతుంది. జరాసంధుడు ఇక చనిపోయినట్లే. రాజులందరు విడిపింపబడతారు. నీ ఆదేశాన్ని పాటించే నేను రాజసూయం చేయటం తథ్యం. జగన్నాథా! శీఘ్రంగా ఈ పని నేరవేరేటట్లు యత్నించు. జాగరూకుడవై ఆచరించు. ధర్మార్థకామాలులేని, దుఃఖించే రోగార్తుని జీవితం వలె మీరు ముగ్గురు లేని జీవితాన్ని నేను ఇష్టపడను. కృష్ణుడు లేని అర్జునుడు లేడు. అర్జునుడు లేని కృష్ణుడు లేడు. ఈ కృష్ణార్జునులకు జయింపశక్యం కానిది లోకంలో లేదు అని నా అభిప్రాయం. బలవంతులలో శ్రేష్ఠుడు, తేజోవంతుడు, వీరుడు అయిన భీమసేనుడు మీఇద్దరితో కలిసి ఏపని అయినా సాధించగలడు. నేర్పరులైన సేనాపతులద్వారా బాగుగా నడుపబడిన సేనా సముదాయం గొప్పగొప్ప కార్యాలు సాధిస్తుంది. లేనిచో ఆ సేన గ్రుడ్డిది, విచక్షణలేనిది అని అంటారు. కావున నీతి విశారదులచే సేన నడుపతగింది. ఏవైపున పల్లపు ప్రదేశముంటే ఆవైపు జనులు నీటిని మళ్ళిస్తారు. ఏవైపున రంధ్ర ముంటుందో ఆ వైపుకు ధీవరులు నీటిని మళ్ళిస్తారు. అలాగే మీరు కార్యం సాధించటానికి అనుకూలమైన పద్ధతిని అనుసరించండి. అందుచే మనం నయకోవిదుడు, లోకప్రసిద్ధుడు అయిన శ్రీకృష్ణుని ఆశ్రయించి శరణువేడి కార్యసాధనకోసం ప్రయత్నిద్దాం. ఈవిధంగా కార్యసిద్ధి కోసం అన్నిరంగాలలో బుద్ధి, నీతి, బలం, ప్రయత్నం, ఉపాయం తెలిసిన గోవిందుని మనం ముందు నిలుపుకొందాం. ఇదే మనకు ఉచితమైనది. యదుశ్రేష్ఠుడా! సమస్తకార్యాలసిద్ధికై మీ సహాయం స్వీకరించటం ఉత్తమం, అర్జునుడు శ్రీకృష్ణుని అనుసరించాలి. అర్జునుని భీముడు అనుసరిస్తాడు. యుద్ధనీతి, విజయం, బలం ఈ మూడింటిని సక్రమంగా కలిపి పరాక్రమం చూపిస్తే తప్పక కార్యం సిద్ధిస్తుంది."

యుధిష్ఠిరుని వాక్యాలు విన్న తేజస్వులు శ్రీకృష్ణార్జున భీములు ముగ్గురు కలిసి మగధరాజైన జరాసంధునితో యుద్ధం చేయడానికి అతని రాజధానివైపు బయలుదేరారు. వారు మువ్వురు తేజోవంతులు, స్నాతకులు, అయిన బ్రాహ్మణుల వస్త్రాలను దాల్చి తమ క్షత్రియరూపాన్ని దాచుకొన్నారు. అదే సమయాన స్నేహితుల అభినందనలు తెలిపే మాటలను విన్నారు. జరాసంధునిపై కోపంతో వారు అధికంగా మండిపోసాగారు. జ్ఞాతులను

ఉద్ధరించటానికి వారిలో ఆ తేజస్సు బహిర్గతమైంది. ఆ సమయాన వారు ముగ్గురు సూర్యచంద్రాగ్నుల తేజంతో మిక్కిలిగా ప్రకాశించారు. ఒకే కార్యాన్ని సాధించే తలంపుతో యుద్ధంలో పరాజయ మెరుగని నరనారాయణులైన అర్జునశ్రీకృష్ణులు భీమునిముందు ఉంచుకొని జరాసంధుని తప్పక వధిస్తామనే నమ్మకం యుధిష్ఠిరునకు కలిగించారు. అన్నిపనులు సాధింపగల సమర్థులు నరనరాయణులు. అదేవిధంగా ధర్మ, అర్థ, కామ సాధనంతో కలిగే లోకాలను మానవులకు కల్పించగల సామర్థ్యం ఉన్నవారు. వారు ముగ్గురు కురుదేశాలనుంచి బయలుదేరి కురుజాంగలం మధ్యలోని పద్మసరోవరాన్ని చేరారు. కాలకూటపర్వతాన్ని దాటి ఒకేపర్వతంపై ప్రవహించే గండకి, మహాశోణ, సదానీర అనే నదులను క్రమంగా దాటి ముందుకు సాగారు. అదే మార్గంలో సుందరమైన సరయూనదిని దాటి పూర్వకోసలదేశంలో అడుగుపెట్టారు. చాలా నదుల్ని చూస్తూ కోసలదేశాన్ని దాటి మిథిలను చేరారు. గంగను, శోణభద్రను దాటి వారు ముగ్గురూ తూర్పుముఖంగా బయలుదేరారు. దర్భలతో, వస్త్రాలతో శరీరాన్ని కప్పికొని కార్యసాధకులైన వారు మగధరాజ్య సీమలోకి ప్రవేశించారు. వారు సదా గోధనంతో, జలంతో నిండి, శుభవృక్షాలు గల గోరథమనే పర్వతం చేరి, అక్కడ నుంచి మగధరాజధానిని చూశారు.

21. మగధరాజధాని ప్రాశస్త్యము, మూడునగారాలను ఛేదించుట, శ్రీకృష్ణజరాసంధసంవాదము.

వాసుదేవుడు అన్నాడు – "కుంతీనందనా! చూడు. ఇది మగధదేశపు రాజధాని. నిత్యం జలసమృద్ధితో, పశుసంపదతో, రోగాలకు దూరమై ప్రకాశిస్తోంది. సుందరభవనాలతో నిండి ఈ నగరం మనోహరంగా కనిపిస్తోంది. ఇక్కడ విహారానికి ఉపయోగపడే విపులం, వరాహం, ఋషభం, ఋషిగిరి, చైత్యకం అనే అయిదు పర్వతాలు ఉన్నాయి. పెద్దపెద్ద శిఖరాలు గల ఈ అయిదు సుందర పర్వతాలు చల్లని నీడనిచ్చే చెట్లతో వ్యాపించి ఉన్నాయి. ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఈగిరివ్రజపురాన్ని సంరక్షిస్తున్నాయి. ఇక్కడ లొద్దుగుచెట్లతో నిండిన పెద్దమనోహరవనం ఉంది. అయిదు పర్వతాలమధ్య, లొద్దుగు చెట్ల మధ్య ఆ నగరం దాగి ఉంది. ఎటుచూసినా పూలతో వ్యాపించి ఉంది. లొద్దుగుపూల సుగంధం కాముకులకు చాలా ఇష్టమైంది. ఇక్కడే మిక్కిలి కఠినవ్రతాన్ని ఆచరించే గొప్పమనస్సు గల గౌతమమహర్షి ఉశీనరదేశపు శూద్రజాతి స్త్రీ యందు ఆమె కన్యకగా ఉన్న సమయాన కాక్షీవంతుడు మొదలుగా గల పుత్రులను జనింపచేశాడు. ఈ కారణంగా

గౌతముడు రాజులపై ప్రేమతో అక్కడనే ఆశ్రమాన నివసించసాగాడు. అనుగ్రహంతో మగధ దేశపు రాజులను సేవించసాగాడు. అర్జునా! పూర్వకాలంలో బలవంతులై అంగ, వంగ మొదలైన దేశాల రాజులందరు గౌతముని గృహానికి వచ్చి అక్కడ అతనితో ఆనందించసాగారు. పార్థా! గౌతముని ఆశ్రమసమీపాన సుందరాలైన పిప్పల, లోధ్రాది శుభవృక్షాల వరుసలు ప్రకాశిస్తున్నాయి. చూడు. ఇక్కడ అర్బుదం, శక్రవాపి అనే పేర్లుగల శత్రు పీడాకరాలైన రెండు ఏనుగులు ఉన్నాయి. స్వస్తికం, మణి నాగమనే పేర్లు గల ఏనుగులకు కూడ ఉత్తమగృహాలు ఉన్నాయి. మనువు ఆజ్ఞానుసారం ఈ మగధదేశం మేఘాలకు విడువరానిది అయింది. ఇక్కడ ఎల్లప్పుడూ సమయానుకూలమైన వర్షం పడుతుంది. చండకౌశికు డనే ముని, మణిమంతు డనే ఏనుగు దీన్ని అనుగ్రహదృష్టితో చూస్తూ ఉంటాయి. శ్వేతవర్ణం గల వృషభగిరి, విపులం, వారాహకం, శిలలతో వ్యాప్తం అయిన మాతంగం, పర్వతశ్రేష్ఠం అయిన చైత్యకం - ఈ పర్వతాలపై సిద్ధులకు మణిమందిరాలు ఏర్పడ్డాయి. యతులు, మహాత్ములైన మునుల ఆశ్రమా లిక్కడ ఎక్కువగా ఉన్నాయి. వృషభుడు, మహాపరాక్రమశాలి తమాలుడు, గంధర్వులు, ఏనుగులు అక్కడ నివసించటం చేత ఆ నగరం అధికశోభ కలిగి ఉంది. ఈ విధంగా నాలుగు వైపులనుంచి ప్రవేశింపశక్యంగాని నగరాన్ని పొంది జరాసంధుడు "నాకు సాటిలేని నగరసంపద సిద్ధించి"దని గర్వించి ఉన్నాడు. ఈ రోజున మనం వాని ఇంటికిపోయి అతని గర్వాన్ని అంతటిని హరించివేద్దాం. ఈ విధంగా మాట్లాడుకొంటూనే శ్రీకృష్ణుడు, భీమార్జునులు ముప్పురూ కలిసి మగధపురంలోకి ప్రవేశించారు.

ఆ నగరం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు లనే చాతుర్వర్ణ్యంతో ప్రకాశిస్తోంది. అక్కడి జనమంతా ఆనందం, సంతృప్తి కలిగి ఉన్నారు. అక్కడ ఉత్సవాలెన్నో జరుగుతుంటాయి. అంతా గెలువశక్యం కానివారు. గిరివ్రజసమీపానికి వారు ముగ్గురు చేరారు. వారు ముఖద్వారాన్ని విడచి ఉన్నతమైన చైత్యకపర్వతశిఖరం గుండా నగరంలోకి ప్రవేశించారు. ఆ నగరాన నివసించే ప్రజలు, బృహద్రథకుటుంబీకులు ఆ పర్వత పూజను చేస్తున్నారు. మగధదేశీయులకు ఆ పర్వతం ఎంతో ప్రియమైంది. అక్కడ రాజైన బృహద్రథుడు ఋషభు డనే పేరుగల మాంసభక్షకుడగు రాక్షసుని యుద్ధంలో చంపి, అతని చర్మంతో మూడు నగారాలు చేయించాడు. వాటిని ఒకసారి మ్రోగిస్తే అవి నెలవరకూ అలా మ్రోగుతూనే ఉంటాయి. రాజు ఆ నగారాలను చర్మంతో బిగించి, తన నగరంలో ఉంచాడు. ఎప్పుడు ఆ నగారాలు మ్రోగుతాయో అప్పుడు అక్కడ పుష్పవృష్టి కురుస్తుంది. వారు ముగ్గురూ

అక్కడి భేరీ త్రయాన్ని చీల్చి చైత్యప్రాకారం అధిరోహించారు. వారు ఆయుధాలను తీసికొని మాగధులకు ఇష్టమైన చైత్యకంపై పరుగిడసాగారు. జరాసంధుని చంపాలని భావించి ఆ పర్వతశిఖరంపై కొట్టసాగారు. ఆ చైత్యకపర్వత విశాల శిఖరం చాలా పురాతనమైనది కాని, దృఢమైనది. మగధదేశంలో చాలా ప్రతిష్ఠ కలిగినది. ప్రతిదినం గంధమాల్యాదులతో పూజింపబడుతుంది. శ్రీకృష్ణ భీమార్జునులు తమ భుజబలంతో విరగగొట్టి, ఆ పర్వతశిఖరాన్ని పడగొట్టారు. పిమ్మట వారు ప్రసన్నులై మగధరాజధాని గిరివ్రజంలో ప్రవేశించారు.

ఇదే సమయాన వేదవిదులైన బ్రాహ్మణులు దుఃశకునాలను చూచి జరాసంధునికి సూచించారు. పురోహితులు జరాసంధుని ఏనుగుపై కూర్చుండబెట్టి చుట్టూ నీరాజనాలతో అగ్నిని ప్రజ్వలింపచేశారు. ప్రతాపవంతుడైన జరాసంధుడు అనిష్టం శాంతించటానికి వ్రతదీక్షను గైకొని నియమాలను ఆచరిస్తూ ఉపవాసం చేశాడు. ఇటు వైపునుంచి వారు ముగ్గురు యోధులు స్నాతక బ్రాహ్మణలవేషాలు ధరించి, బాహువులే ఆయుధాలుగా గలిగి, మిగతా ఆయుధాలను విడచి, జరాసంధునితో యుద్ధం చేయాలని నగరంలోకి ప్రవేశించారు. తినుబండారాలు, పూలమాలలు ఇతర వస్తుసామగ్రి గల దుకాణాలలో సిద్ధపరచిన అపూర్వమైన సంపదగల ప్రదేశాన్ని చూశారు. ఆ నగరవైభవం సర్వగుణసంపన్నంగా, అన్ని కోరికల్ని తీర్చేదిగా ఉంది. ఆ వీథిలోని అద్భుతసంపదలను చూసిన శ్రీకృష్ణభీమార్జునులు ఒక మాలాకారుని నుండి చాలా మాలలు బలవంతంగా తీసికొని నగరంలోని ప్రధానరహదారి గుండా నడువసాగారు. రంగుల వస్త్రాలను ధరించి, మెడలో హారాలు వేసికొని, చెవులకు మెరిసేకుండలాలు పెట్టుకొని ముగ్గురూ జరాసంధుని భవనసమీపానికి చేరారు. హిమాలయాన గోవుల ఉనికిని వెదకే సింహాలవలె వారు మువ్వురు రాజభవనాన్ని వెదకుతూ ముందుకుసాగారు. ఆ సమయాన వారిభుజాలు మద్దిమ్రానులవలె ఉన్నాయి. మంచిగంధం, అగరు ధూపం వేయబడి యుద్ధానికి ఉద్యుక్తులైన వారి బాహువులవలె ఉన్నాయి. సాలవృక్షాల మ్రాన్నువలె ఉన్నతాలైనుల, విశాలవక్షంగల గజరాజులవలె ఉన్న వీరులను చూచి మాగధులు అంతా ఆశ్చర్యపడ్డారు.

ఆ నరశ్రేష్ఠులు జనులచే నిండిన మూడు ద్వారాలను దాటి, నిర్భయులై, నిశ్చింతతో రాజైన జరాసంధుని వద్దకు వచ్చారు. పాద్య, మధుపర్క, గోదానాలకు అర్హులై, సర్వత్ర సత్కారం పొందతగిన వారికి ఎదురేగి, జరాసంధుడు విధివిధానంతో అతిథి సత్కారాలు చేశాడు. పిమ్మట జరాసంధుడు వారు మువ్వురికి "స్వాగతం అగుగాక" అని పలికాడు.

ఆ సమయాన భీమసేనార్జునులు మౌనంగా ఉన్నారు. వారిలో బుద్ధిమంతుడు శ్రీకృష్ణుడు జరాసంధునితో ఇలా అన్నాడు. "రాజా! నియమపరులైన వీరిరువురు నీతో అర్ధరాత్రికి ముందు మాటలాడరు. అర్ధరాత్రి సమీపిస్తే వారు నీతో మాటలాడతారు." జరాసంధుడు వారిని యాగశాలలో కూర్చుండబెట్టి స్వయంగా రాజభవనంలోకి వెళ్ళాడు. అర్ధరాత్రి అయిన పిమ్మట వారు కూర్చున్నచోటికి వచ్చాడు. వారి నియమం భూమండలంలోనే ప్రసిద్ధంగా, ఆశ్చర్యంగా ఉంది. యుద్ధవిజేత జరాసంధుడు స్నాతకులైన బ్రాహ్మణుల రాకను విని, అర్ధరాత్రివేళలో వారి సత్కారానికి వారి సమీపానికి బయలుదేరాడు. వారు ముగ్గుర్ని అపూర్వ వేషాలలో చూచి రాజశ్రేష్ఠుడు జరాసంధుడు ఆశ్చర్యంతో వారి సమీపానికి వచ్చాడు. శత్రునాశం చేయగల ముప్పురూ జరాసంధునితో "మహారాజా! మీకు కళ్యాణమగుగాక!" అని పలికారు. పిమ్మట వారు జరాసంధునివైపు, మధ్యమధ్యలో తమలో తాము చూసుకొంటూ నిలబడ్డారు. బ్రాహ్మణవేషాలలో ఉన్న ఆ పాండవ యాదవవీరులను చూచి జరాసంధుడు "కూర్చోండి." అన్నాడు. వారందరూ ఆసీను లయ్యారు. ముప్పురు పురుషశ్రేష్ఠులు యజ్ఞంలో ప్రజ్వలించే మూడు అగ్నులవలె ప్రకాశించారు. సత్యపాలకుడైన జరాసంధుడు వేషభాషలకంటె విపరీత ఆచరణం గల వారిని నిందిస్తూ - "బ్రాహ్మణులారా! స్నాతకవ్రతాన్ని పాలించే బ్రాహ్మణులు సమావర్తనాది కర్మలు లేకుండ మాలలు, చందనం ధరించరు అనే ప్రసిద్ధి మానవులలో ఉంది. నా కీ విషయం బాగుగా తెలుసు. మీ మెడలో మాలలు ఉన్నాయి. భుజాలపై వింటినారిని ధరించిన చిహ్నాలు కనపడుతున్నాయి.

మీరందరు క్షత్రియ తేజం కలవారు. బ్రాహ్మణులం అని చెప్పుతున్నారు. రంగురంగుల వస్త్రాలను దాల్చి, వివిధాలైన మాలలు, లేపనాలు పూసుకున్న మీరెవరో నిజం చెప్పండి. రాజులకు నిజమే శోభనిస్తుంది. చైత్యకపర్వతశిఖరాన్ని పగులగొట్టి, రహస్యవేషాలతో, రాజాపరాధాన్ని పరిగణింపక, నిర్భయులై వెనుక వాకిలి గుండా ఏకారణంచే ప్రవేశించారు? బ్రాహ్మణులకు మాటలలోనే పరాక్రమ ముండి క్రియలలో కన్పించదు. ఈ పర్వతశిఖరాన్ని పగులగొట్టటం మీ లక్షణాలకు విపరీతంగా ఉంది. మీరేవిషయాన్ని ఆలోచించి ఈ పని చేశారు? నాసమీపానికి వచ్చి విధి పురస్సరమైన పూజను నానుండి ఏల గ్రహింపరు? నాదగ్గరకు రావడంవల్ల మీకు కలిగే ప్రయోజనం ఏమిటి? "జరాసంధుని మాటలు విని మనస్వి అయిన శ్రీకృష్ణుడు స్నిగ్ధగంభీరస్వరంతో ఇలా అన్నాడు." రాజా! నీవు మమ్ములను మావేషంచే స్నాతకవ్రతులైన బ్రాహ్మణులు అనుకొన్నావు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు

మువ్వరకూ స్నాతకవ్రతం ఉంది కదా! ఈ మూడు వర్ణాలలో కొందరు విశేషనియమాలు పాటిస్తారు. కొందరు సామాన్య నియమాలు పాటిస్తారు. విశేషనియమపాలకులైన క్షత్రియులు ఎల్లప్పుడు లక్ష్మిని పొందుతారు. ఎవరు పువ్వులను ధరిస్తారో వారు సంపదను పొందగలరు. కావున మేము పువ్వులను ధరించాం. క్షత్రియులు బాహు బలసంపన్నులు, మాటలలో పరాక్రమాన్ని ప్రదర్శింపరు. బృహద్రథకుమారా! అందువలన క్షత్రియుల వచనాలు వినయసహితాలని ప్రసిద్ధి. క్షత్రియుల బలం బ్రహ్మ వారి భుజాల్లో ఉంచాడు. రాజా! అది నేడు చూడాలనుకొంటే తప్పక చూస్తావు. **ధీరులు శత్రువుల గృహాల్లోకి గుమ్మాలగుండా ప్రవేశింపరు. మిత్రుల ఇండ్లను గుమ్మాలద్వారా ప్రవేశిస్తారు.** శత్రుమిత్రుల విషయాన ధర్మంగా ఇవియే ద్వారాలుగా చెప్పారు. మేము కార్యార్థులమై నీఇంటికి వచ్చాం. కావున శత్రు వైన నీనుండి పూజను గ్రహింపము. ఈ విషయాన్ని నీవు బాగా అర్థంచేసుకో. ఇది మాకు చాలాకాలం నుంచి వస్తున్న వ్రతం."

22. జరాసంధుడు యుద్ధమునకు సిద్ధమగుట, కృష్ణ జరాసంధుల వైరకారణము.

జరాసంధుడు పలికాడు - "బ్రాహ్మణులారా! ఎంత ఆలోచించినా నాకు మీకు మధ్య వైరకారణం తెలియటం లేదు. నేను మీపట్ల అపకారం చేయనప్పుడు మీకు నేను శత్రువును ఎలా అవుతాను? చెప్పండి. ఇది సత్పురుషుల నియమమేనా! ధర్మానికి పీడ కలిగినప్పుడు తప్పక మనస్సునకు సంతాపం కల్గుతుంది. ధర్మజ్ఞుడైన క్షత్రియుడు నిరపరాధి పట్ల విపరీత ఆచరణం చేయడు. నిరపరాధులను బాధించిన మహారథుడైన క్షత్రియుడు ధనాన్ని, ధర్మాన్ని పోగొట్టుకొని కష్టాన్ని పొందుతాడు. తన శ్రేయస్సుకు దూరమౌతాడు. ఇది సత్యం. సజ్జనధర్మాన్ని చక్కగా పాలించేవారికి ముల్లోకాల్లోను క్షత్రియధర్మమే శ్రేష్ఠమైంది. ధర్మజ్ఞులైన క్షత్రియులు ఇతర ధర్మాలను ప్రశంసించారు. నేను నామనస్సును వశపరచుకొని స్వధర్మపాలనం చేస్తున్నాను. ప్రజలపట్లకూడ అపరాధిని కాను. అలాంటి నన్ను మీరెందుకో అపరాధిగా భావిస్తున్నారు."

శ్రీకృష్ణుడు అన్నాడు. "మహాబాహూ! మంచికులంలో ఒకే ఒకడు ఆ వంశభారాన్ని మోస్తాడు. ఆ కులరక్షణ అతనిపై ఆధారపడింది. అలాంటి మహాపురుషుని ఆజ్ఞానుసారం మేము నిన్ను శిక్షించటానికి వచ్చాం. రాజా! నీచే భూలోకవాసులైన రాజేంద్రు లెందరో బందీలుగా చేయబడ్డారు. అంత అపరాధం చేసినా నిన్ను నీవు నిరపరాధిగా

భావించుకొంటున్నావు. రాజా! శ్రేష్ఠుడైన రాజు శ్రేష్ఠులైన ఇతరరాజులను ఎందుకు చంపాలి? ఆ రాజులను బంధించి రుద్రునికి కానుకగా సమర్పిస్తున్నావు. జరాసంధా! నీవు చేసిన పాపం అందరిపైనా పడుతోంది. మేము ధర్మరక్షణంలో, పాలనంలో సమర్థులం. దేవతలను పూజించటంకోసం మనుష్యులను వధించటం ఎక్కడా చూడలేదు. కళ్యాణకరుడైన శంకరుని పూజించటానికి మనుష్యులను హింసించడం ఎందుకు? జరాసంధా! నీ బుద్ధి నశించింది. నీవెలా క్షత్రియుడవో అలాగే వారూ క్షత్రియులు. వారిని పశువులుగా చేసి చంపుతున్నావు. నీవంటి క్రూరుడు వేరొకడు లేడు. ఎవడు ఏ ఏ అవస్థలో, ఏ ఏ కర్మలు చేస్తాడో వాడు ఆయా అవస్థలలో అలాంటి ఫలాలనే పొందుతాడు. నీవు నీజాతి వారిని చంపే హంతకుడవు. మేము ఆపదలలో ఉన్న దీనులను రక్షించే శీలం కలవారం. సజాతీయులైన క్షత్రియుల అభివృద్ధికై నిన్ను చంపటానికి ఇక్కడకు వచ్చాం. రాజా! క్షత్రియులలో నావంటి వీరుడు వేరొకడు ఈలోకంలో లేడని నీవు భావిస్తున్నావు. అది అంతా నీ బుద్ధివలన ఏర్పడిన భ్రమ మాత్రమే.

స్వాభిమాని అయిన రాజు ఎవరయినా అయినవారిని తెలిసి చంపటానికి ప్రయత్నిస్తాడా? దీనిద్వారా స్వర్గాన్ని దూరం చేసుకొంటాడా? రాజశ్రేష్ఠా! స్వర్గప్రాప్తికై యుద్ధ మనే యజ్ఞంలో దీక్షగైకొని క్షత్రియులు తమకిష్టమైన లోకాలను జయిస్తున్నారు. దీనిని నీవు తెలుసుకో. **వేదాధ్యయనం స్వర్గాన్నిస్తుంది. పరోపకారం వల్ల కలిగిన కీర్తి స్వర్గాన్నిస్తుంది. తపస్సు స్వర్గాన్ని స్థిరం చేస్తుంది. ఈ మూడింటికంటె యుద్ధంలో మరణించటం ద్వారా స్వర్గాన్ని పొందటం క్షత్రియునికి ఉత్తమం.** క్షత్రియునికి యుద్ధంలో మరణించటం ఇంద్రుని వైజయంతీభవనంలో నివసించటంతో సమానం. ఇది ఎల్లప్పుడు గుణాలతో నిండి ఉంటుంది. ఈ యుద్ధం ద్వారానే ఇంద్రుడు రాక్షసులను జయించి సర్వరక్షణం చేస్తున్నాడు. మాతో నీకు జరుగబోయే యుద్ధం నీకు స్వర్గప్రాప్తికి కారణం అవుతుంది. అట్టి యుద్ధం ఎవరికి చిక్కుతుంది? 'నా వద్ద చాలాసేన ఉంది' అని గర్వంతో మగధసేనలతో లోకాన్ని జయించి, ఇతరరాజుల్ని అవమానింపవద్దు. ప్రతిమనుజుని యందు బలపరాక్రమాలు ఉన్నాయి. కొందరిలో నీతో సమానంగానూ, కొందరిలో నీకంటె అధికంగానూ తేజస్సు ఉంది. ఈ విషయాన్ని నీవు గుర్తించనంతవరకు నీ గర్వం వృద్ధి చెందుతుంది. ఈ నీ గర్వం మావంటివారికి సహింపరానిది. అందుచే నీకే హితవు చెప్తున్నాను. మగధరాజా! నీవు నీ సమానవీరులపట్ల అభిమానాన్ని, గర్వాన్ని విడచిపెట్టు. ఈ గర్వంతో పుత్ర, మంత్రి, సేనాసహితంగా యమలోకానికి పోవద్దు.

దంభోద్భవుడు, కార్తవీర్యార్జునుడు, ఉత్తరుడు, బృహద్రథుడు తమ కంటె ఉత్తములను అవమానించి సేనలతో సహా నశించిపోయారు. నీతో యుద్ధాన్ని కోరే మేము నిశ్చయంగా బ్రాహ్మణులం కాము. నేను వసుదేవుని పుత్రుడనైన హృషీకేశుడను. వీరిరువును పాండుపుత్రులు భీమార్జునులు. నేను వీరిరువురి మామకొడుకును. నీకు ప్రసిద్ధుడైన శత్రువును. నన్ను బాగుగా గుర్తించు. మగధరాజా! మేము నిన్ను యుద్ధానికి ఆహ్వానిస్తున్నాం. నీవు రాజులందరినీ విడిచిపెట్టు లేదా యమలోకానికి పో.''

జరాసంధుడు అన్నాడు - "శ్రీకృష్ణా! నేను యుద్ధంలో జయించి, రాజులందరినీ బందీలుగా చేశాను. నేను జయింపని శత్రురా బొక్కడైనా ఇక్కడ లేడు. శ్రీకృష్ణా! క్షత్రియునకు ఇదే జీవితం నిర్ణయింపబడి ధర్మబద్ధమైంది. పరాక్రమంతో శత్రువులను వశపరచుకొని వారితో స్వేచ్ఛగా ప్రవర్తించాలి. నేను క్షత్రియనియమాలను గుర్తుంచుకుని పాటిస్తూ ఎల్లప్పుడు దేవతల కొరకు బలిగా ఇచ్చేరాజులను కానుకగా తెచ్చి మీభయంతో వారి నిప్పుడు ఎలా విడిచిపెడతాను? మీసేన వ్యూహనిర్మితమైన నాసేనతో గాని, నేను మీలో ఒక్కరితో గాని, ఇద్దరితో, ముగ్గురుతో గాని, విడివిడిగా గాని, కలిపిగాని యుద్ధం చేయటానికి సిద్ధంగా ఉన్నాను.' ఇలా పలికి ఆ ముగ్గురు యోధులతో యుద్ధం చేయ పూనుకొని జరాసంధుడు తన పుత్రుడైన సహదేవుని పట్టాభిషేకానికై ఆజ్ఞ ఇచ్చాడు. పిమ్మట యుద్ధం సమాపింపగా జరాసంధుడు కౌశికుడు, చిత్రసేనుడు అనే నిర్జీవులైన తన సేనాపతులను స్మరించాడు. ఎవరిపేర్లను పూర్వం హంస, డిభకులని కీర్తించామో వారే వీరు. మనుజలోకంలో ప్రతివాడు వీరిపట్ల పెద్ద ఆదరభావం కలవాడే. అదే సమయంలో పురుషులలో శ్రేష్ఠుడు, అభిమానవంతుడు, సత్యప్రతిజ్ఞకలవాడు, సింహపరాక్రమవంతుడు, వసుదేవకుమారుడు, బలరాముని సోదరుడు అయిన శ్రీకృష్ణుడు దివ్యదృష్టిచే జరాసంధుని పూర్వచరిత్రను స్మరించాడు. సింహ సమానపరాక్రమం, భయానక పురుషార్థాలు ప్రదర్శింపగల జరాసంధుని వధను గూర్చి తెలిసికొన్నాడు. యదు వంశీయులకు ఇతడు అవధ్యుడు. బ్రహ్మవరానుసారం స్వయంగా అతడిని చంపటానికి ఇష్టపడలేదు.

జనమేజయుడు అడిగాడు - 'శ్రీకృష్ణజరాసంధులకు పరస్పరం కలహం ఎలా ఏర్పడింది? జరాసంధుడు యదుశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని ఎలా జయించాడు? కంసుడు జరాసంధునకు ఏమవుతాడు? ఏకారణంగా శ్రీకృష్ణునితో శత్రుత్వం కలిగింది? వైశంపాయనా! ఈ వృత్తాంతాన్ని పూర్తిగా నాకు వినిపించు.' వైశంపాయనుడు చెప్పాడు - 'రాజా! యాదవవంశంలో బుద్ధిమంతుడు వసుదేవుడు పుట్టాడు. అతడు యాదవుల రాజైన

ఉగ్రసేనునికి నమ్మకమైన మంత్రి. ఉగ్రసేనుని పుత్రులలో కంసుడు అందరికంటె పెద్దవాడు. అతడు అన్ని శస్త్రవిద్యలలో ఆరితేరాడు. జరాసంధునికుమార్తె అతని భార్య, మిక్కిలి ప్రసిద్ధమైనది. రాజ్యశుల్కంగా తన భర్తను పట్టాభిషిక్తుని చేసే నియమంతో ఆమె జరాసంధునిచే ఇవ్వబడింది. ఆ నియమపాలనానికై ఉగ్రసేనుని పెద్దకుమారుడు, కంసుడు మధురానగరానికి మంత్రులద్వారా పట్టాభిషిక్తుడు అయ్యాడు. ఐశ్వర్యబలమత్తుడై అతడు తన తండ్రిని బందీని కావించి, ఆ రాజ్యాన్ని మంత్రులతో కలిసి అనుభవించసాగాడు. తెలివితక్కువవాడైన కంసుడు వసుదేవుని మంచి ఆదేశాలను పాటించటంలేదు. అయినా ధర్మబుద్ధికల వసుదేవుడు ఆ రాజ్యాన్ని ధర్మంగా పరిపాలింపజేస్తున్నాడు. దైత్యేంద్రుడైన కంసుడు మిక్కిలి ప్రసన్నుడై వసుదేవునికి దేవకుని పుత్రిక అయిన దేవకితో వివాహం జరిపించాడు. దేవకుడు ఉగ్రసేనుని సోదరుడు.

వసుదేవుడు దేవకీదేవిని రథమెక్కించి తీసికొనిపోతున్నపుడు మహారాజు కంసుడు కూడ రథమెక్కి బయలుదేరాడు. ఆకాశంలో ఒక దేవదూత వాణి స్పష్టంగా వినిపించింది. వసుదేవుడు, కంసుడు ఆ అశరీరవాణిని విన్నారు. 'కంసుడా! నేడు దేవకిని నీవు రథంపై తీసుకొని మధురకు పోతున్నావు. ఆమె ఎనిమిదవ గర్భంలో నీమృత్యువు జన్మిస్తాడు. ఆ ఆకాశవాణి మాటలను విని కంసుడు దుర్బుద్ధితో ఖడ్గాన్ని తీసి ఆమె శిరస్సును ఖండింపబోయాడు. అదే సమయాన వివేకి అయిన వసుదేవుడు నవ్వుతూ క్రోధవశుడైన కంసుని ఊరడిస్తూ అతనిని బ్రతిమాలుకొన్నాడు. 'రాజా! అన్ని ధర్మాలలోనూ స్త్రీ చంపగూడనిదని నిర్ణయం. హఠాత్తుగా నిరపరాధి, అబల అయిన ఈమెను ఎందుకు చంప బోతున్నావు? రాజా! నీకు దేనివల్ల భయమో దానిని నీవు తొలగించుకోవచ్చు. ఈమెనూ రక్షించుకోవచ్చు. నీ ప్రతిజ్ఞనూ రక్షించుకోవచ్చు. ఈమె ఎనిమిదవ గర్భంలోని పుత్రుని పుట్టిన వెంటనే నాశనం చేయి. నీకు రాగల ఆపద నివారింపబడుతుంది.' కంసుడు ఆ మాటలను అంగీకరించాడు. పిమ్మట సూర్యసమ తేజోవంతులు కుమారులు పుట్టారు. పుట్టినవారిని పుట్టినట్లుగా అందరినీ మధురాధిపుడు చంపివేశాడు.

అనంతరం దేవకీగర్భాన ఏడవవాడుగా బలరాముడు పుట్టాడు. యముడు తన మాయచే సాటిలేని ఆ గర్భాన్ని రోహిణీదేవి ఉదరంలో ప్రవేశపెట్టాడు. ఆకర్షణ కల్గియుండటం చేత అతడు సంకర్షణుడనే పేరు పొందాడు. **బలప్రధాను డైనందున బలదేవుడనే పేరు** వచ్చింది. తిరిగి దేవకీ గర్భాన ఎనిమిదవవాడుగా మధుసూదనుడు పుట్టాడు. రాజైన కంసుడు ఆ గర్భాన్ని చాలాజాగ్రత్తగా సంరక్షించాడు. దేవకి ప్రసవకాలం సమీపించగా

వసుదేవుని రక్షణకై ఉగ్రస్వభావమూ, క్రూరకర్మ గల మంత్రిని కంసుడు నియమించాడు. కాని బాలుడైన శ్రీకృష్ణుని ప్రభావంచే రక్షకులు నిద్రించిన పిదప అక్కడ నుంచి వసుదేవుడు బాలకునితో కలిసి నందకులానికి వెళ్లాడు. అప్పుడే పుట్టిన వాసుదేవుని మధురనుంచి దూరం చేసి, వసుదేవుడు అతనికి బదులు ఎవరో ఒక గోపాలకుని పుత్రికను తెచ్చి కంసునికి కానుకగా ఇచ్చాడు. దేవదూతమాటను గుర్తు తెచ్చుకొని కంసుడు భయంతో ఆమెను చంపాలని ఆ కన్యకను భూమికేసి గట్టిగా కొట్టాడు. ఆమె అతని చేతినుంచి విడిపించుకొని నవ్వుతూ ఆర్యా అను శబ్దాన్ని ఉచ్చరిస్తూ అదృశ్య అయింది. అప్పటి నుంచి ఆమెపేరు 'ఆర్య' అయింది. ఈవిధంగా బుద్ధిమంతుడైన వసుదేవుడు ఆ కంసుని మోసపుచ్చి, తన పుత్రుని గోకులంలో పెంచసాగాడు. వాసుదేవుడు కూడ గోపకులలో నీటిలోని పద్మంవలె పెరిగాడు. కొయ్యలలో అగ్ని దాగినట్లు అతడు కంసునికి జాడ తెలియకుండానే పెరుగసాగాడు. మధురేశ్వరుడైన కంసుడు ఆ గోపకులను మిక్కిలి బాధించాడు.

ఇక్కడ బాహుసంపదకల శ్రీకృష్ణుడు తేజస్సుతో, బలంతో వృద్ధిపొందాడు. కంసునిచే పీడితులయిన గోపకులు భయంతో కొందరు, కోరికలతో కొందరు శ్రీకృష్ణుని చుట్టుముట్టారు. ఆ శ్రీకృష్ణుడు బలసంపదతోకూడి ఉగ్రసేనుని సమ్మతిపై అతని సోదరగణంతో సహా కంసుని చంపి, తిరిగి ఉగ్రసేనుని రాజ్యాభిషిక్తుని కావించాడు. శ్రీకృష్ణుడు కంసుని చంపాడు అని జరాసంధుడు విని కంసుని పుత్రుని శూరసేనదేశానికి రాజుగా చేశాడు. ప్రతాపవంతుడైన జరాసంధుడు బలం, సేనలతో కూడి ఉగ్రసేనుని, యాదవులను అనేకసార్లు కష్టాలపాలు చేశాడు. శ్రీకృష్ణజరాసంధుల మధ్య వైరానికి ఇదే కారణం. తన మనోవాంఛ తీర్చుకొనటానికి జయించిన రాజు లందరిని దేవశ్రేష్ఠుడు, మహాదేవుడు, చర్మాంబరుడు, త్ర్యంబకుడు అయిన శివునికి బలియిచ్చి తన యజ్ఞాలను పూర్తి చేయసాగాడు. ఇది అంతా జరిగింది జరిగినట్లు చెప్పాను. ఇక భీమసేనుడు ఆ జరాసంధుని ఎలా చంపాడో అది విను.

23. భీమ జరాసంధుల బాహు యుద్ధము.

జరాసంధుడు తన మనస్సులో యుద్ధం చేయ నిశ్చయించాడు. అది చూసిన మాటకారి శ్రీకృష్ణుడు జరాసంధునితో ఇలా అన్నాడు. 'మాముగ్గురిలో నీ మనస్సు ఎవరితో యుద్ధం చేయసంకల్పించింది? మాలో ఎవరు నీతో యుద్ధానికి సిద్ధం కావాలి?' ఇది విని

జరాసంధుడు "భీమసేనునితో యుద్ధం చెయ్యాలి" అని కోరాడు. జరాసంధుని యుద్ధోత్సాహాన్ని గమనించి పురోహితుడు గోరోచనం, మాలలు, మంగళద్రవ్యాలు, గొప్పగొప్ప ఓషధులు, పీడనుపోగొట్టగల వస్తువులను, మూర్ఛనుంచి తెలివి తేగల వస్తువులను తీసికొని అతని వద్దకు వచ్చాడు. యశఃకారకుడైన బ్రాహ్మణుని స్వస్తివచనానంతరం జరాసంధుడు క్షత్రియనియమాలు పాటించి సంసిద్ధు డయ్యాడు. జరాసంధుడు కిరీటం తీసివేసి, కేశాలను బంధించి, సముద్రం తన ఒడ్డును దాటి తీరంపై పడేటట్లు యుద్ధానికి ఉద్యుక్తుడు అయ్యాడు. భయానకపరాక్రమాన్ని ప్రదర్శించే బుద్ధిమంతుడు జరాసంధుడు భీమునివైపు తిరిగి 'భీమా! నీతో యుద్ధం చేస్తాను. శ్రేష్ఠుని చేతిలో ఓడిపోవటం కూడ మంచిదే' అన్నాడు. జరాసంధుడు భీమునితో ఈ విధంగా పలికి బలుడు ఇంద్రుని ఓడించటానికి సిద్ధం అయినట్లు సిద్ధపడ్డాడు. భీమసేనుడు కూడ శ్రీకృష్ణునితో మాట్లాడి, స్వస్తి వచనాల తరువాత యుద్ధకాంక్షతో జరాసంధుని దగ్గరకు చేరాడు. సింహసమాన పరాక్రమం కల వారిరువురూ హర్షోత్సాహాలతో ఒకరినొకరు జయించాలనే కోరికతో బాహువులే శస్త్రాలుగా తలపడ్డారు.

ముందు వారిద్దరి చేతులు కలిశాయి. పిదప ఒకరికొకరు పాదాభివందనం చేశారు. బాహువుల మూలలను కంపింపచేస్తూ పెద్దగా చరుపులు చరిచారు. భుజాలను చేతులతో మోదుకొని, మాటిమాటికి కొట్టికొని, శరీరాన్ని శరీరంతో గట్టిగా పట్టుకొని, తిరిగి తిరిగి చరుపులు చరుచుకొన్నారు. వారు వేగంగా చేతులను సంకోచించి, వ్యాకోచించి ఒకరిపై ఒకరు విసరుకొంటూ ముష్టిఘాతాలను చేశారు. చిత్రహస్తరూపమైన ఘాతాలు చూపి కక్షాబంధాన్ని చేశారు. వీపులపై చేతులువేసి ఒకరినొకరు బంధింప తలపెట్టారు. మెడపై, చెక్కిళ్ళపై కొట్టిన దెబ్బలతో ఆ ప్రదేశం నిప్పురవ్వలతో కలిసిన పిడుగు పడినట్లు అయింది. బాహుపాశ చరణపాశ విద్యలను ప్రదర్శించారు. పాదాలతో గట్టిగా శిరస్సులు నొక్కుకున్నారు. దాని కారణంగా నాడులన్నీ పీడింపబడ్డాయి. ఛాతీలపై మోదుకొనే ఉరోహస్తమనే మల్లయుద్ధాన్ని చేశారు. చేతివ్రేళ్ళ సాయంతో చేసే పూర్ణకుంభ విద్యను కూడ ఒకరిపై ఒకరు నిపుణంగా ప్రయోగించారు. ఒకరిచేతుల్ని ఒకరు పీడించుకొంటూ గజరాజులవలె గర్జించారు. బాహుప్రహారాలు చేసే వారిరువురూ మేఘగర్జనల వంటి సింహనాదాలు చేశారు. అరచేతులతో కొట్టుకొని గుర్రుగుర్రుగా ఒకరినొకరు చూసుకొన్నారు. క్రోధవశమైన రెండు సింహాలవలె అతి భయంకరంగా లాగుకొంటూ యుద్ధం చేసి చూపించారు. శరీరాన్ని శరీరంతో, చేతులను చేతులతో, ఎదుటివారి శరీరాలను పట్టిలాగి

శత్రువు వెన్నుపై, మెడపై, బిగబట్టి దూరంగా విసరుకొన్నారు. ఇరువురు కటిప్రదేశంలో, ప్రక్కల చేతులుంచి ఎదుటి వారిని పడవేయటానికి యత్నించారు. తమ శరీరాన్ని బిగబట్టి ఎదుటివారిని పడవేసే విద్య ఇద్దరికీ తెలుసు. ఇద్దరు మల్లయుద్ధంలో ప్రవీణులు. పొట్ట అడుగున చేతులుంచి, గట్టిగా వీపును పట్టి, తమ కంఠందాకా పైకెత్తి శత్రువును భూమికేసి కొట్టసాగారు.

వారు మల్లయుద్ధమర్యాదలలో ఉన్నతమైన పృష్ఠభంగం అనే విద్యను చూపసాగారు. ఒకరి వీపును ఒకరు నేలకు ఆనించే విద్య అది. రెండు భుజాలతో ఛాతీపై, పొట్టపై కొట్టి మూర్ఛ నొందించటానికి పూర్ణకుంభవిద్య ప్రదర్శించారు. వారి ఇచ్ఛానుసారం తాడును పేనినట్లుగా కాళ్ళను, చేతులను ముష్టిఘాతాలతో బాధించి పూర్ణయోగం, తృణపీడం అనే యుద్ధవిద్యలను చూపి, ఒకరిపై ఒకరు ఆఘాతాలు మొదలైన యుద్ధకళలను ప్రదర్శించి, పీడించుకొన్నారు. ఆ సమయాన వారిమల్లయుద్ధం చూడటానికి వేలకొలది నగరవాసులు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, స్త్రీలు, వృద్ధులు గుమికూడారు. మనుజులగుంపులచే ఆ ప్రదేశం నిండిపోయింది. ఆ ఇద్దరి భుజాల దెబ్బలవల్ల, ఒకరిపై మరొకరు నిగ్రహప్రగ్రహాలను ప్రదర్శించటం వలన వజ్రాయుధమూ, పర్వతమూ సంఘర్షించినట్లు ఘర్షణ ఏర్పడింది. బలవంతులలో శ్రేష్ఠులైన వారు మిక్కిలి బలోత్సాహాలతో పరస్పరజయం ఆశించి పోరటంచేత, వారిమధ్య బలహీన, దుర్బలస్థితుల పరిశీలన సాగింది. యుద్ధభూమిలో వృత్ర - ఇంద్రులకు వలె సాగే ఆ పోరులో భయంకరస్థితి ఏర్పడటంతో జనులందరు దూరానికి పోయి నిలబడ్డారు. ప్రకర్షణం, ఆకర్షణం; అనుకర్షణం వికర్షణం చేసుకొంటూ వారిద్దరూ ఒకరి నొకరు మోకాళ్లతో పొడుచుకొంటున్నారు.

తరువాత గొప్పగొప్ప గర్జన, నిందలతో రాళ్ళవర్షం కురిసినట్లు ముష్టిఘాతాలతో ఒకరినొకరు బాధించుకొన్నారు. ఇద్దరి వక్షఃస్థలాలు విశాలాలు, పెద్దవి, ఇద్దరు మల్లయుద్ధనిపుణులు, ఇనుపగడియల వంటి బాహువులతో కలియబడ్డారు. కార్తికమాసపు మొదటి రోజున ప్రారంభమైన ఆ యుద్ధం తిండిలేక, విశ్రాంతిలేక రాత్రింబగళ్ళు జరిగింది. ఈవిధంగా మహోత్కులైన వారిమధ్య యుద్ధం త్రయోదశి వరకు కొనసాగింది. చతుర్దశినాటి రాత్రి మగధనరేశుడు అలసి యుద్ధం నుంచి మరలాడు. ఆ అలసిన జరాసంధుని చూసి, శ్రీకృష్ణుడు భయంకర యుద్ధం చేసిన భీమునితో తెలియ పరుస్తున్నట్లుగా ఇలా అన్నాడు. "శత్రువు అలసినప్పుడు అతనిని అధికంగా పీడించటం ఉచితం కాదు. ఒకవేళ పీడిస్తే అతడు శీఘ్రంగా ప్రాణాలు వదులుతాడు. భీమా! నీవు జరాసంధుని ఎక్కువగా

బాధించవద్దు. అతనితో చేతులతో మాత్రమే సమానంగా యుద్ధం చెయ్యి." శత్రుసంహారి అయిన భీముడు శ్రీకృష్ణుని మాటలు విని జరాసంధుడు అలసినట్లు గ్రహించి, ఆయనను చంపటాన్ని గూర్చి ఆలోచించాడు. కురుకులానికి ఆనందకారకుడైన భీముడు బలవంతులలో శ్రేష్ఠుడైన జరాసంధుని జయించుటకు కోపాన్ని తెచ్చుకున్నాడు.

24. జరాసంధుని వధ.

పిమ్మట భీమసేనుడు జరాసంధుని వధపై పూర్తిగా బుద్ధిని నిలిపి, యదునందనుడైన శ్రీకృష్ణునితో పలికాడు. "యదుశార్దూలా! ఇతడు మొలకు బిగించిన వస్త్రకారణంగా ఈ పాపాత్ముని ప్రాణాలు హరించాలని నాకు తోచటంలేదు." ఇట్లు పలికిన భీముని పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు జరాసంధుని వధకు ఉత్తేజపరుస్తూ ఇలా అన్నాడు. "నీవు సర్వోత్కృష్టుడవైన దేవతవు. పైగా వాయుబలంతో కూడి ఉన్నావు. ఆ బలాన్ని అంతటిని జరాసంధునిపై మా ఎదుట ఈ రోజున చూపు.

(ఈ మహారథుడు, దుర్బుద్ధిగల జరాసంధుడు నీచేతులతోనే చంపతగినవాడు. ఈ మాటలు నాకు ఆకాశంలో వినిపించాయి. బలరాముని ద్వారా జరాసంధ వధకు అనుజ్ఞ చేయబడి, బలం ఇవ్వబడింది. ఈ కారణంగా గొప్ప పర్వతమైన గోమంతంపై ఇతడు విడువబడినాడు. బలదేవుని చేత చిక్కిన జరాసంధుడు తప్ప వేరొకడు బయటపడలేడు. భీమసేనా! నిన్ను విడచి ఈతని మృత్యువు వేరొకని చేతిలో లేదు. వాయువును తలచుకొని ఈ జరాసంధుని చంపు.")

శత్రుసంహారి భీముడు జనార్దనుని మాటలు విని, గొప్పబలం తెచ్చుకొని, జరాసంధుని ఆకాశంలో ఎత్తి గిరగిరా త్రిప్పాడు.

జరాసంధుని చంపటానికి శ్రీకృష్ణుడు భీమసేనుని వైపు చూచి ఒకరకపు గడ్డిని తీసికొని రెండుగా చీల్చాడు. విసరివేశాడు. ఇదే జరాసంధుని వధకు సంకేతం.

వందసార్లు గిరిగిరా త్రిప్పి భీముడు భూమిపైకి వేసి నడుమును విరచి పిండి చేసి సింహనాదాలు చేశాడు. అతని చేతితో ఒక పాదంతో తొక్కిపట్టుకొని భీముడు జరాసంధుని శరీరాన్ని రెండుగా చీల్చాడు.

తిరిగి ఆ రెండు శరీరభాగాలు ఏకమైపోగా మళ్లీ ప్రతాపవంతుడు జరాసంధుడు భీమునితో బాహుయుద్ధం చేశాడు. వారిమధ్య అత్యంతం భయంకరమైన దొమ్మియుద్ధం చూసేవారికి ఒళ్ళు గగుర్పాటు చెందేటట్లు, సర్వలోకాలు నాశనమయ్యేట్లు జరిగింది. తిరిగి శ్రీకృష్ణుడు తృణవిశేషాన్ని గ్రహించి, రెండుగా చీల్చి, జరాసంధవధకై విపరీతదిశలో పడవేశాడు. జరాసంధుని వధకిది రెండవ సంకేతం. భీమసేనుడు అప్పుడు అది గ్రహించి

జరాసంధుని ఒకకాలిపై పెట్టి రెండుగా చీల్చి విపరీతదిశలో పడవేశాడు. ఆ సమయాన జరాసంధుని శరీరం నుండి మాంసం ముద్దలు బయటపడసాగాయి. ఆ శరీరం నుండి క్రొవ్వు, రక్తం, ఎముకలు, అన్నీ జారిపడ్డాయి. తల, శరీరం కూడ రెండుగా విడిపోయాయి.

ముద్దయిపోయిన జరాసంధుడు ఒకవైపు-, సింహనాదాలు చేస్తున్న భీముడు ఒకవైపు - ఆ నాదం సర్వప్రాణులకు భయంకరమైంది. మగధనివాసు లందరూ భయపడ్డారు. గర్భవంతుల గర్భాలు స్రవించాయి. ఈ ఉపద్రవాలకు భీమసేనుని సింహనాదం, జరాసంధుని చీత్కారాలే కారణం. మగధదేశీయు లందరూ భీమసేనుని సింహగర్జనలు విని "హిమవత్పర్వతం చీలిందా? భూమి రెండుగా చీలుతోందా" అని అనుకొన్నారు.

శత్రువులను అవలీలగా చంపగల వారు ముగ్గురూ నిద్రిస్తున్నవానివలె ఉన్న జరాసంధుని మృతశరీరాన్ని రాజద్వారం దగ్గరవిడిచి, అక్కడ నుండి వెడలిపోయారు. శ్రీకృష్ణుడు జరాసంధుని రథాన్ని ధ్వజంతో సహా అలంకరించి, భీమార్జునులను కూర్చుండబెట్టి కారాగారంలోని బంధువు లందరినీ విడిచిపెట్టాడు. రత్నభోగులైన రాజులందరు భయానికి దూరమై రత్నాలను అనుభవించదగిన శ్రీకృష్ణునికి కానుకలుగా రత్నాలను ఇచ్చారు. భగవంతుడు శ్రీకృష్ణుడు గాయపడక, శస్త్రాస్త్రాలు కల్గి ప్రకాశించాడు. శత్రువులను జయించి దివ్యరథాన్ని అధిరోహించి గిరివ్రజపురం నుండి రాజులతో కలిసి బయలుదేరాడు. ఆ రథంపేరు సోదర్యవంతం. ఇద్దరు మహారథులు ఒక్కసారే కూర్చుండి యుద్ధం చేయడానికి వీలైంది. శ్రీకృష్ణుడు ఆ సమయాన సారథి. ఆ రథంనుంచి మాటిమాటికి శత్రువులపై దాడి చేయటానికి అవకాశం ఉంది. చూడముచ్చటైన ఆ రథం శత్రువు లెవరికీ జయింప వీలుకానిదై ఉంది. భీమార్జునులనే మహారథులతో శ్రీకృష్ణుడు సారథిగా ఉన్న ఆ రథం ధను ర్ధరులందరికీ ఎదిరింపశక్యం కానిదయింది. ఇంద్రుడు, విష్ణువు ఇద్దరు ఒక్కసారి దానిపై కూర్చుంటే తారకామయమైన యుద్ధంలో సంచరిస్తున్నట్లు ప్రకాశిస్తోంది. ఆ రథం పుటంవేసిన బంగారపు రంగులో ప్రకాశిస్తోంది. చిరుమువ్వల జాలర్లు వ్రేలాడుతున్నాయి. మేఘధ్వని వలె గంభీరమైన సవ్వడి చేస్తోంది. శత్రువులను జయించి జయాన్ని ప్రసాదించగలిగినది. అలాంటి రథంపై వారిరువురితో శ్రీకృష్ణుడు బయలుదేరాడు. ఈ రథాన్ని అధిరోహించి ఇంద్రుడు తొమ్మిదిసార్లు తొంభైమంది చొప్పున రాక్షసులను సంహరించాడు. అటువంటి రథాన్ని పొంది ఆ పురుషశ్రేష్ఠులు మిక్కిలి ప్రసన్నులయ్యారు. ఆ ఇద్దరు సోదరులతో రథంపై కూర్చున్న బాహుబలశాలి శ్రీకృష్ణుని చూచి మగధదేశవాసులంతా ఆశ్చర్యపోయారు. ఆ రథం వాయువేగం కల్గి

దివ్యాశ్వాలతో కూడి ఉంది. శ్రీకృష్ణుడు ఆసీను డైనందున మిక్కిలిగా ప్రకాశిస్తోంది. ఉత్తమరథంపై దేవనిర్మితధ్వజం ఎగురసాగింది. అది ఆధారం లేకనే తగులుకున్నట్లు మాత్రం ఉంది. ఇంద్రధనుస్సు కాంతితో వెలిగే ఆ రథం చాలా రంగులు కలిగి ఆ ధ్వజకాంతి యోజనం (ఎనిమిది మైళ్ళు) దూరం నుంచి గుర్తించేలా ఉంది.

ఆ సమయాన శ్రీకృష్ణుడు గరుడుని తలచుకొన్నాడు. గరుడుడు క్షణంలో ప్రత్యక్ష మయ్యాడు. ఆ రథంపై ఉన్న ధ్వజంలో చాలా భూతాలు వికృతగర్జనలు చేస్తూ కనిపించాయి. వాటి సమీపాన గరుడుడు రథారూఢు డయ్యాడు. అతనిద్వారా ఆ ధ్వజం పైకి ఎగురసాగింది. అది చైత్యవృక్షంలా ప్రకాశిస్తోంది. ఈ ఉత్తమధ్వజం వేయి కిరణాలతో వ్యాప్తమైన మధ్యాహ్నకాలపు సూర్యునివలె ప్రకాశిస్తూ తేజస్సు కలిగి ఉంది. ప్రాణులకు దానివైపు చూడటం కష్టంగా ఉంది. వృక్షాలతో అడ్డగింపబడక, శస్త్రాస్త్రాలకు లొంగనిదై ఉంది. ఆ ధ్వజం ఇప్పుడు మనుజుల కళ్ళకు కట్టినట్లు కింకిణీ మేఘధ్వని గల ఆ దివ్యరథంపై శ్రీకృష్ణుడు భీమార్జునులతో కూర్చుండి నగరం వెలుపలికి వెళ్ళాడు. ఇంద్రుని నుంచి రాజైన వసువు ఆ రథాన్ని పొందాడు. క్రమంగా అతనినుంచి బృహద్రథునికి, బృహద్రథుని నుంచి జరాసంధునికి చేరింది. జనార్దనుడు, గిరివ్రజం నుంచి బయటకు వచ్చి సమానప్రదేశంపై నిలబడ్డాడు. అక్కడ బ్రాహ్మణులు మొదలైన నాగరికులు శాస్త్రీయ విధానంతో సత్కరించారు. కారాగారం నుండి విడిపింపబడిన రాజులందరు శ్రీకృష్ణుని స్తోత్రపురస్సరంగా ఇలా స్తుతించారు. "మహాభుజుడా! దేవకిని ఆనందపరచగల మీరు ప్రత్యక్షదైవమే. భీమసేనార్జునుల బలం మీవెంట ఉంది. మీరు చేసే ధర్మరక్షణవలన మీరు నిజంగా ధర్మావతారులే. దుఃఖపంకంతో గూడిన ఘోరజరాసంధుడనే మడుగులో మునిగిపోయే రాజుల సంరక్షణకు మీరే సమర్థులు. అత్యంత భయంకర మయిన పర్వతగుహలో బందీలైన మేము దుఃఖంతో కాలం గడిపాము. కృష్ణా! మీరు మమ్ము ఈ ఆపదనుండి విడిపించి ఉజ్జ్వలమైన కీర్తిని పొందారు. మేం మీ పాదాలపై పడ్డాం. మీరు మమ్ము ఆజ్ఞాపించండి. మీకు మేం ఏ సేవైనా చేస్తాం. ఎంత చేయవీల్లేనిదైనా మేమంతా కలిసి పూర్తిచేస్తాం." గొప్ప మనస్సుతో శ్రీకృష్ణుడు వారిని ఊరడించి ఇలా పలికాడు. "ధర్మరాజు రాజసూయయాగాన్ని చేయ సంకల్పించాడు. ధర్మాన్ని అవలంబించే అతడు చక్రవర్తి కావాలి అని అనుకొన్నాడు. మీరందరు ఆ యజ్ఞంలో అతనికి సహాయం చేయండి." అప్పుడు ప్రీతులైన వారందరు 'తథాస్తు' అని పలికి భగవానుని ఆజ్ఞను శిరసావహించారు. ఇంతేకాదు! దశార్హకులదీపకుడైన శ్రీకృష్ణునికి రత్నాలను కానుకలుగా ఇచ్చారు. గోవిందుడు అతికష్టంమీద వారి యెడల

దయతో వాటిని స్వీకరించాడు. జరాసంధుని కుమారుడు సహదేవుడు వినయంతో వాసుదేవుని పాదాలపై పడి శరణువేడాడు. అతని ఎదుట రత్నాల భారం ఉంది. అది తీసుకొని సహదేవుడు వినయంతో వాసుదేవుని పాదాలపై పడి శరణువేడాడు.

సహదేవుడు అన్నాడు – "పురుషసింహమా! జనార్దనా! నాతండ్రి మీపట్ల చేసిన అపరాధాన్ని మీమనసులో ఉంచుకోవద్దు. నేను మీశరణు కోరాను. నాపై దయ చూపు. నేను నాతండ్రి దహనసంస్కారాలను మీరు అనుమతిస్తే చేస్తాను. మీనుండి, భీమసేనార్జునుల నుండి అనుజ్ఞపొంది నిర్భయుడనై యథేచ్ఛగా చరిస్తాను." సహదేవుని విన్నపానికి వాసుదేవుడు, మహారథులు భీమార్జునులు మిక్కిలి ప్రసన్నులయ్యారు. "నీవు నీతండ్రికి అంత్యేష్టి సంస్కారాన్ని ఆచరించు." శ్రీకృష్ణుని పాండవుల మాటలను విని శీఘ్రంగా నగరంలోకి మంత్రులతో కలిసి సహదేవుడు ప్రవేశించాడు. చితిని చందనపుకర్రలు, అగరు, వృద్ధి, వివిధ తైలాలు, నెయ్యి, సుగంధాలతో అలంకరించి దానిపై జరాసంధుని శవాన్ని ఉంచాడు. మండిపోయే అతని శరీరంపై అన్నివైపుల నుంచి పూలు, అక్షతలు చల్లారు. శవదహనమైన తర్వాత సహదేవుడు తన సోదరునితో కలిసి జలాంజలి సమర్పించాడు. తండ్రికి శ్రాద్ధకర్మ ఆచరించి శ్రీకృష్ణుడున్న చోటికి వచ్చాడు. భీమసేనార్జునులకు, మాధవునికి వినమ్రుడై నమస్కరించి ఇలా విన్నవించుకొన్నాడు. "ఈ గోవులు, మేకలు, గొట్టెలు, దున్నలు, రత్నరాశులు, ఏనుగులు, గుఱ్ఱాలు, పట్టుబట్టలు ధర్మజునికి అందజెయ్యి. ఇంకా నీవు కోరినట్లు చేస్తాను."

భయపీడితు డైన సహదేవునికి శ్రీకృష్ణుడు అభయ మిచ్చి, అత డిచ్చిన గొప్పరత్నా లన్నింటిని శ్రీకృష్ణుడు తీసుకొన్నాడు. సంతోషంతో జరాసంధపుత్రుడైన సహదేవుని పట్టాభిషిక్తుని చేశాడు. స్నేహితుడుగా మన్నించాడు. భీమార్జునులచే అతడు సత్కరింపబడినాడు. మహాత్ముల ఆజ్ఞగైకొని, జరాసంధ కుమారుడు పట్టాభిషిక్తుడై తన బార్హద్రథపురంలోకి ప్రవేశించాడు. పురుషోత్తముడైన కృష్ణుడు ఆ కానుకలను తీసికొని రత్నశోభే సంపన్నుడై భీమసేనార్జునులతో బయలుదేరాడు. పాండవులతో కలిసి శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థనగరానికి చేరి ధర్మరాజును ఆనందపరుస్తూ మాట్లాడాడు. 'మన అదృష్టంవల్ల భీమునిచే జరాసంధుడు చంపబడినాడు. రాజులందరు కారాగారంనుండి విముక్తు లయ్యారు. భీమసేనార్జునులు భాగ్యవశంచే క్షేమంగా ఉన్నారు. వీరు పీడలు, గాయాలు లేకుండా తిరిగి ఈ నగరాన్ని చేరారు.' యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని తగినట్లుగా పూజించి, సంతసించి, వారందరినీ విడివిడిగా కౌగిలించుకొన్నాడు. జరాసంధ మరణానంతరం ఇరువురు సోదరులు సాధించిన విజయంతో

యుధిష్ఠిరుడు అజాతశత్రువై సోదరులతో కలిసి ఆనందంలో మునిగాడు.

(సంతోషించిన ధర్మరాజు జనార్దనునితో ఇలా అన్నాడు. నీ సహాయంవల్ల భీమసేనుడు బలాభిమానంచే ఉన్మత్తుడైన జరాసంధుని పడగొట్టాడు. ఇప్పుడు నిశ్చింతంగా యజ్ఞాలలో శ్రేష్ఠమయిన రాజసూయాన్ని పూర్తిచేస్తాను. నీ బుద్ధిబలంతో అది నాకు సాధ్యమై యాగం చేయటానికి అర్హుడను అయ్యాను. ఈ యుద్ధంతో భూమండలంపై నీ కీర్తి విస్తరించింది. జరాసంధునివధ వల్ల నీకు అపరిమితాలైన సంపదలు దక్కాయి. ధర్మజుడు ఇలా పలికి ఆ దివ్యరథాన్ని శ్రీకృష్ణునికి సమర్పించాడు. ఆది తీసుకొని గోవిందుడు మిక్కిలి ప్రసన్నత పొందాడు. అర్జునునితో దానిపై కూర్చుండి ఆనందాన్ని అనుభవించాడు. ధర్మరాజుచే సత్కరింపబడి ఆ కానుకను గైకొని అంతులేని ఆనందాన్ని పొందాడు.)

వారి వయోభేదాన్ని బట్టి యుధిష్ఠిరుడు సోదరులతో కూడి వారినందరినీ కలిశాడు. సత్కరించి, పూజించి ఆ రాజులందరినీ వారి రాజ్యాలకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు. యుధిష్ఠిరుని ఆజ్ఞానుసారం వారు ఆనందించి శీఘ్రంగా తమ వాహనాల పై వారివారి నగరాలకు చేరారు. ఈ విధంగా శ్రీకృష్ణుడు పాండవులచే తన శత్రువైన జరాసంధుని చంపించాడు. శ్రీకృష్ణుడు తన తెలివితేటలతో జరాసంధుని చంపించి ధర్మరాజు, కుంతి, ద్రౌపదుల ఆజ్ఞగైకొని సుభద్ర, భీముడు, అర్జునుడు, కవలలు నకులసహదేవులు, ధౌమ్యుని వీడ్కొని మనోవేగం కల ఆ దివ్యరథంలో దిశల్ని ప్రతిధ్వనింపజేస్తూ ధర్మరాజును వీడి ద్వారకకు బయలుదేరాడు. తరువాత యుధిష్ఠిరుడు ఆదిగా గల పాండవులు శ్రీకృష్ణునికి ప్రదక్షిణం చేసి నమస్కారాలు చేశారు. రాజులందరికీ అభయమిచ్చి, గొప్ప విజయాన్ని సాధించి శ్రీకృష్ణుడు వెళ్లాడు. కీర్తి నలువైపులా వ్యాపించగా పాండవులు ద్రౌపదికి ఎక్కువ ఆనందాన్ని కలిగించారు. ఆ కాలానికి తగిన ధర్మ, అర్థ, కామ సిద్ధి కొరకైన అన్ని పనులను ధర్మరాజు ధర్మబద్ధంగా చేశాడు. ప్రజారక్షణం కోసం ధర్మోపదేశాన్ని చేయసాగాడు.

25. సంక్షిప్త దిగ్విజయము.

అర్జునుడు శ్రేష్ఠమైన "విల్లు, అక్షయతూణీరాలు, జెండా, రథం, సభాభవనం పొంది యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "విల్లు, అస్త్రాలు, బాణాలు, పరాక్రమం, సహాయకులు, రాజ్యం, కీర్తి, సైన్యం లాంటి దుర్లభమైనవన్నీ మనోవాంఛానుసారం పొందాను. ధన్యుడ నయ్యాను. రాజా! కోశాన్ని పెంచుకోవటమే ప్రస్తుతకర్తవ్యం. రాజులను ఓడించి పన్నును తీసికొని వస్తాను. మీ ఆజ్ఞ అయితే ఉత్తరదిక్కును జయించటానికి బయలుదేరతాను. తిథి, ముహూర్తం, నక్షత్రం పవిత్రాలై ఉండాలి."

ఇది విని సోదరులతో కూడిన ధర్మజునికి మిక్కిలి ప్రసన్నత ఏర్పడింది. మంత్రులు, వ్యాసుడు, ధౌమ్యుడు కూడ ఆనందించారు. అపుడు పరమబుద్ధిమంతుడు వేదవ్యాసభగవానుడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! భాగ్యవశాన నీకు చక్కని బుద్ధి కలిగింది. చాలా బాగుంది. భూమినంతటినీ నీవొక్కడివే జయించే ఉత్సాహం నీకు కలిగింది. పాండురాజు నీవంటి పుత్రుని పొంది ధన్యుడు అయ్యాడు. నీ పరాక్రమంతో యుధిష్ఠిరుడు అన్నింటిని పొందుతాడు. సార్వభౌముడై ఆ ధర్మాత్ముడు వెలిగిపోతాడు. నీ బాహుబలసహాయంతో రాజసూయాన్ని నిర్విఘ్నంగా చేస్తాడు. శ్రీకృష్ణుని రాజనీతి వల్ల, భీమార్జునుల బలంవల్ల, నకులసహదేవుల పరాక్రమం వల్ల ధర్మరాజు అన్నింటినీ పొందుతాడు. అర్జునా! అందువలన దేవతలచే సంరక్షింపబడే ఉత్తరదిక్కుకు నీవు పొమ్ము. నీవు దేవతలను జయించి రత్నాలను తీసుకురాగలవు. తూర్పుకు బలశాలి భీముడు, మహారథుడు సహదేవుడు దక్షిణానికి, నకులుడు వరుణపాలితమయిన పడమర దిక్కుకు వెళ్ళాలి. ఇది నా బుద్ధిమేరకు చేసిన నిర్ణయం. దీన్ని మీరు పాలించండి." వ్యాసుని మాటలను విని పాండుకుమారులందరు ఆనందించి ఆయనతో ఇలా అన్నారు. "మునిశ్రేష్ఠ ! మీ ఆజ్ఞానుసారం మేం నడుస్తాం."

అర్జునుని మాటలు విని ధర్మజుడు ప్రేమ, గాంభీర్యం ఉట్టిపడేటట్లు అతనితో అన్నాడు. "పూజనీయులైన బ్రాహ్మణుల స్వస్తివాక్యాలు విని జైత్రయాత్రకు పొమ్ము. నీ యాత్ర స్నేహితులకు ఆనందమూ, శత్రువులకు శోకమూ కలిగిస్తుంది. అర్జునా! నీవిజయం తథ్యం. నీకోరిక తీరుతుంది." ఈ విధంగా యుధిష్ఠిరుని ఆజ్ఞను పొంది అగ్ని ఇచ్చిన, అద్భుతాలను సాధింపగల రథంమీద గొప్పసైన్యంతో అర్జునుడు ఉత్తరదిక్కుకు బయలుదేరాడు. భీమసేనుడు తూర్పుకు, కవలలు దక్షిణ పడమరలకు సైన్యాలతో బయలుదేరి అందరూ యుధిష్ఠిరునిచే గౌరవింపబడ్డారు. ఇంద్రుని ప్రియపుత్రుడు అర్జునుడు ఉత్తరదిక్కున విజయాన్ని సాధించాడు. భీమసేనుడు తూర్పును, సహదేవుడు దక్షిణాన్ని, నకులుడు పడమరను జయించారు. ధర్మరా జొక్కడే తన మిత్రులందరితో కలిసి రాజ్యలక్ష్మిని అనుభవిస్తూ ఖాండవప్రస్థంలో నివసించాడు.

26. అర్జునుడు భగదత్తుని ఓడించుట.

కుంతీపుత్రులందరు ఒక్కసారిగానే నాలుగు దిక్కులను జయించారు. అయినా ముందుగా అర్జునుని దిగ్విజయాన్ని వర్ణిస్తాను. మహాభుజా డయిన అర్జునుడు పరాక్రమాన్ని

ప్రదర్శించకుండానే కుళిందదేశ రాజు లందరినీ జయించాడు. కుళిందులతో సహా ఆనర్తీయులను, కాలకూటులను జయించి సేనలతో కలిసి రాజమండలాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. శత్రుసంతాపశీలి అర్జునుడు సుమండలదేశంతో స్నేహం చేసి శాకలద్వీపాన్నీ, రాజైన ప్రతివింధ్యుని జయించాడు. శాకలద్వీపం, మిగిలిన ఏడు ద్వీపాల రాజులకు అర్జునుని సైన్యానికి దొమ్మియుద్ధం జరిగింది. అర్జునుడు ఆ మహాయోధు లందర్నీ వశపరచుకున్నాడు. వారందరితో కూడి ప్రాగ్జ్యోతిషపురంపై దాడి చేశాడు. ప్రాగ్జ్యోతిషపురానికి ఆ సమయాన భగదత్తుడు మహారాజు. మహాత్ముడైన అర్జునునికి అతనితో గొప్పయుద్ధం జరిగింది. ప్రాగ్జ్యోతిషాధిపతి భగదత్తుడు కిరాతులు, చీనులు, సముద్రతీరవాసులు మొ॥ చాలమంది యోధులతో కూడినవాడు.

భగదత్తుడు అర్జునునితో ఎనిమిదిరోజులు యుద్ధంచేసినా సంగ్రామంలో అలసిపోని అర్జునునితో నవ్వుతూ పలికాడు. "నీవు ఇంద్రునిపుత్రుడవు. సంగ్రామంలో శోభతో కూడిన పరాక్రమశాలివి. నీయందు ఈ బలం, పరాక్రమం తగినవే. నేను దేవతల రాజు ఇంద్రుని స్నేహితుణ్ణి. యుద్ధంలో అతనితో కొంచెంకూడ తక్కువవాణ్ణి కాదు. అయినా సంగ్రామంలో నీ ఎదుట నిలువలేకపోయాను. అర్జునా! నీకోరికను తెలుపు. నేను తప్పక తీరుస్తాను. వత్సా! నీవు చెప్పినదాన్ని తప్పక ఆచరిస్తాను." అర్జునుడు అన్నాడు - "ధర్మజ్ఞుడు, సత్యవాక్పాలకుడు, కురుకులశ్రేష్ఠుడు, యజ్ఞాల్లో గొప్ప దక్షిణలు ఇచ్చేవాడు అయిన యుధిష్ఠిరుడు రాజసూయం చేయ నిశ్చయించాడు. అతణ్ణి చక్రవర్తిని చేయాలని అనుకొంటున్నాను. మీరు అతనికి కప్పాలు కట్టండి. మీరు నాతండ్రికి స్నేహితులు, నాపై ప్రేమకలవారు. కావున మిమ్ములను ఆజ్ఞాపించలేను. ప్రేమభావంతో పన్ను కట్టండి." భగదత్తుడు - "అర్జునా! నాకు నీవు ఎలాంటి వాడివో యుధిష్ఠిరుడు కూడ అలాంటివాడు. నేను దాని నంతటినీ చేస్తాను. నీకొరకు ఇంకా ఏమి చేయమంటావు?" అన్నాడు.

27. అర్జునుడు పర్వతీయ దేశములను జయించుట.

అర్జునుడు అతని మాటలు విని ఇలా బదులు పలికాడు. "మీమాటతోనే అంతా చేసినట్లయింది. అనుజ్ఞ ఇవ్వండి వెళ్లివస్తాను." భగదత్తుని జయించి ధనంజయుడు అక్కడినుండి కుబేరపాలితమయిన ఉత్తరదిక్కుకు బయలుదేరి క్రమంగా అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరి అనే ప్రదేశాలు జయించాడు. తిరిగి పర్వతప్రదేశా లన్నింటిని జయించి,

అక్కడి రాజులను తన అధీనంలోకి తెచ్చుకుని వారి నుండి అనేక ధనరాశుల్ని స్వాధీనం చేసుకొన్నాడు. పిమ్మట వారందరినీ ప్రసన్నులను చేసుకొని వారితో కలిసి ఉలూకదేశవాసియైన బృహంతునిపైకి యుద్ధానికి వెళ్ళాడు. మృదంగం మొదలయిన వాద్యాలధ్వని, రథపుటిరుసుల ఘోష, ఏనుగుల ఘీంకారాలతో భూమిని కంపింపజేస్తూ అర్జునుడు ముందుకు సాగాడు. బృహంతుడు చతురంగబలాలతో కలిసి నగరం వెలుపలికి వచ్చి అర్జునునితో యుద్ధం చేయసాగాడు. అర్జున బృహంతుల మధ్య పెద్దయుద్ధం ప్రారంభమైంది. కాని అర్జునుని పరాక్రమాన్ని బృహంతుడు తట్టుకో లేకపోయాడు. కుంతీకుమారుని ఎదిరింపలే నని భావించి పర్వతేశ్వరుడు బృహంతుడు యుద్ధాన్ని ఆపి ఎన్నో రత్నరాసులను తీసుకొని సేవింప వచ్చాడు. అర్జునుడు బృహంతుని రాజ్యానికి అతనినే రాజును చేసి, అతనితో కూడి సేనాబిందుని రాజ్యంపై దాడిచేసి అతడిని పదవీచ్యుతుని చేశాడు. మోదాపురం, వామదేవం, సుదామ్నం, సుసంకులం అనే ఉలూకదేశపు ఉత్తరప్రాంతాలను, వాటి రాజులనూ వశపరచుకొన్నాడు. ధర్మరాజు ఆజ్ఞానుసారం అర్జునుడు అక్కడే ఉండి తన సేవకులద్వారా పంచగణదేశాలను జయించాడు. అక్కడనుండి సేనాబిందుని రాజధాని దేవప్రస్థానికి చేరి చతురంగ బలాలతో అక్కడ శిబిరాన్ని ఏర్పాటు చేశాడు. పరాజితులైన రాజులందరితో గూడి పరాక్రమవంతుడైన విష్వగశ్వుడనే పౌరవదేశాధిపతిని ఎదిరించాడు. ఆ యుద్ధంలో పరాక్రమవంతులు, మహారథులూ అయిన పర్వతీయులను ఓడించి, పౌరవరక్షిత మయిన రాజధానిని తన సేనతో జయించాడు. పౌరవుని యుద్ధంలో జయించి, పర్వతవాసులై ఉత్సవసంకేతులని పేరుబడ్డ బందిపోటు దొంగల గణాలను ఏడింటిని కూడా జయించాడు అర్జునుడు.

పిమ్మట అర్జునుడు కాశ్మీరదేశ క్షత్రియులను, దశమండలాలతో కలిసిన రాజు లోహితుని తన అధీనంలోకి తెచ్చుకొన్నాడు. త్రిగర్తులు, దార్వులు, కోకనదులు, ఇతరులైన రాజసమూహాలు అర్జునుని శరణువేడారు. అర్జునుడు రమ్యమైన అభిసారీనగరాన్ని జయించి, ఉరగావాసిరాజైన రోచమానుని యుద్ధంలో వశపరచుకొన్నాడు. అర్జునుడు చిత్రాయుధునిచే రక్షింపబడే సింహపురాన్ని తనసేనతో ముట్టడించి, యుద్ధం చేసి, అధీనంలోకి తెచ్చాడు. పిమ్మట కిరీటి సుహ్మాలను, చోళులను తన సమస్తసేనతో చుట్టుముట్టి మధించాడు. అర్జునుడు మిక్కిలి పరాక్రమం గల సేనతో పోయి యుద్ధంలో జయింపవీలుకాని బాహ్లీకులను వశపరచుకొన్నాడు. అతడు తన శక్తిమంతమైన సేనతో కాంబోజులను, దరదులను కూడ ఓడించాడు. ఈశాన్యమూలలో వనవాసులై ఉన్న దస్యులందరినీ తనశక్తితో జయించి

స్వాధీనం గావించుకొన్నాడు. లోహ, పరమకాంబోజ, ఋషిక ఉత్తరదేశాలన్నింటిని ఒక్కసారిగా జయించాడు. ఋషిక, అర్జునులమధ్య నక్షత్రాల్లా కనులు మిరుమిట్లు గొలిపే భయంకరమైన యుద్ధం ఋషికదేశంలో జరిగింది. యుద్ధభూమిలో ఋషికులందరినీ గెలిచి చిలుక పాట్టవలె ఆకుపచ్చని రంగుగల ఎనిమిది గుఱ్ఱాలను కానుకగా పొందాడు. నెమలిరంగు గలిగి శీఘ్రగమనంతో పరుగెత్తే సామర్థ్యం గల గుఱ్ఱాలను పన్నుగా ఉత్తరదేశాలనుంచి రాబట్టాడు. అర్జునుడు హిమవంతుని, నిష్కుటదేశ అధిపతులను గెలిచి ధవళగిరిపై శిబిరాన్ని ఏర్పాటు చేశాడు.

28. కింపురుషాది దేశములను జయించి అర్జునుడు ఇంద్రప్రస్థమునకు వచ్చుట.

ఆ వీరుడు శ్వేతపర్వతాన్ని దాటి ద్రుమపుత్రుని రక్షణలో ఉన్న కింపురుషనివాసాన్ని చేరాడు. క్షత్రియనాశకరమైన యుద్ధంలో ఆ దేశాన్ని జయించాడు. కప్పం కట్టే పద్ధతిపై మరల సింహాసనంపై అతనిని ఉంచాడు. కిన్నరదేశాన్ని జయించి, శాంతచిత్తుడై అర్జునుడు గుహ్యకరక్షిత మయిన హాటకదేశంపై దాడిచేశాడు. గుహ్యకులను సామోపాయంతో వశపరచుకొని కప్పానికై మానససరోవరానికి వెళ్లాడు. ఋషులపేర్లతో ప్రసిద్ధికెక్కిన ప్రవాహాలను అక్కడ చూశాడు. మానససరోవరాన్ని చేరి శక్తిశాలి అర్జునుడు హాటకదేశ సమీపంలోని గంధర్వ లందరినీ జయించి వారి రాజ్యమందు వారినే సుప్రతిష్ఠితులను చేశాడు. గంధర్వదేశాలనుండి, తిత్తిరి, కల్మాష, మండూకా లనే పేర్లుగల గుఱ్ఱాలను కప్పం రూపంగా గ్రహించాడు.

(పిమ్మట హేమకూటపర్వతంపై విడిది (శిబిరం) చేశాడు. హేమకూటాన్ని దాటి అర్జునుడు హరివర్షాన్ని గొప్పసేనతో సహా చేరినాడు. అక్కడ సుందర నగరాలను వనాలను, జలాలతో నిండిన నదుల్ని చూశాడు. అక్కడి పురుషులు దేవతలవలె తేజోవంతులు. స్త్రీలు పరమసుందరీ మణులు. వారి నందర్నీ చూచిన అర్జునునికి మిక్కిలి ప్రసన్నత కలిగింది. హరివర్షదేశాలను వశపరచుకొని రత్నాలను పొందాడు. నిషధపర్వతంపైకి వెళ్ళి అక్కడివారిని జయించాడు. విశాలమైన నిషధపర్వతాన్ని దాటి దివ్యమయిన ఇలావృతవర్షాన్ని చేరాడు. అది జంబూద్వీపంలో మధ్యనున్న భూభాగం. అక్కడ దేవతలవలె కనిపించే దివ్యపురుషులను తిలకించాడు. వారు మిక్కిలి సౌభాగ్యంతో కూడినవారు. అర్జునుడు ఇదివరకెన్నడు అట్టివారిని చూడలేదు. అక్కడి భవనాలు శుభ్రంగా ఉన్నాయి. స్త్రీలు అప్సరసల అందం కలవారు. అందగత్తెలైన స్త్రీలను, అందం గల పురుషుల్ని చూశాడు. వారి దృష్టి కూడ అర్జునునిపై పడింది. వారినందర్నీ యుద్ధంలో జయించి పన్ను కట్టేవారిగా చేశాడు. వస్త్రాలను,

రత్నాలను ఆభరణాలను వారి నుండి కానుకలుగా పొంది ప్రసన్నుడై ఉత్తరదిక్కుగా సాగిపోయాడు. ముందుకు సాగి మేరుపర్వతాన్ని చూశాడు. అది బంగారుమయం, నాలుగురంగులతో ప్రకాశిస్తోంది. చేర శక్యంగాక ఉంది. దాని పొడుగు ఒక లక్షయోజనాలు. ఆ ఉత్తమపర్వతం తేజఃపుంజంలా ప్రకాశిస్తూ సూర్యుని తేజస్సును కూడ తనబంగారు శిఖరాల కాంతితో తిరస్కరిస్తోంది. సువర్ణ, దివ్యపర్వతం దేవతలకు, గంధర్వులకు నివాసభూమియై ఉంది. సిద్ధచారణులు ఎల్లప్పుడు అక్కడ నివసిస్తారు. ఆ పర్వతంపై ఫలపుష్ప సమృద్ధి ఎల్లవేళలా ఉంటుంది. దాని ఎత్తును ఎవ్వరూ కొలవలేరు. అధర్మంతో జీవించేవారు అక్కడికి చేరలేరు. మహాభయంకర సర్పాలు అక్కడ సంచరిస్తాయి. దివ్యౌషధాలతో ఆ పర్వతం ప్రకాశిస్తూ ఉంటుంది. తనశిఖరాలతో స్వర్గాన్ని తాకుతూ ఉంటుంది. అల్పులకు అది పొంద వీలుకానిది. ఎన్నోనదులు, చెట్లు దాని శోభను పెంచుతున్నాయి. చాలారకాలైన పక్షుల కిలకిలారావాలతో ఆ పర్వతం మార్మోగుతూ కనిపిస్తుంది. అలాంటి మేరుపర్వతాన్ని చూసిన అర్జునుని మనస్సు ఆనందంతో నిండిపోయింది. మేరుపర్వతానికి నాలుగువైపులా మండలాకారంలో ఇలా వృతవర్షం వ్యాపించి ఉంది. మేరువునకు కుడిభాగాన జంబువు అనే వృక్షం ఉంది. అది ఎల్లప్పుడు ఫలపుష్ప భరితమై ప్రకాశిస్తుంది. సిద్ధులు, చారణులు ఆ చెట్టును సేవిస్తూ ఉంటారు. ఆ జంబూవృక్షం కొమ్మలు స్వర్గందాకా వ్యాపించాయి. ఆ చెట్టు కొమ్మలను బట్టి ఈ ద్వీపానికి జంబూద్వీపం అనే పేరు వచ్చింది.

అర్జునుడు ఆ జంబూవృక్షం చూశాడు. ఆ చెట్టు, మేరుపర్వతమూ కూడా ఈ భూమిపై సాటిలేనివి. వాటిని చూచిన అర్జునునికి ఆనందం కలిగింది. అక్కడ అన్నివైపులకు చూస్తూ అర్జునుడు సిద్ధులు, చారణులనుండి విలువైన రత్నాలు, వస్త్రాలు, అలంకారాలు, ఇంకా ఇతర వస్తువులూ పొందాడు. అనంతరం వారికందరికీ తన అన్న యజ్ఞం గురించి చెప్పి, వారినుండి ఇంకా రత్నరాశులను పొంది, అక్కడ నుంచి బయలుదేరటానికి సన్నద్ధుడైనాడు. పర్వతోత్తమ మయిన మేరువుకి ప్రదక్షిణం ఆచరించాడు. జంబూనదీ తీరానికి చేరాడు. అక్కడ ఆ నదీశోభను తిలకించాడు. ఆ దివ్యనదీజలంతో జంబూవృక్షాలు ఆ స్వాదయోగ్యాలైన ఫలాలను ఇస్తున్నాయి. ఆ చెట్టుకొమ్మలపై బంగారు రంగుపక్షులు విహరిస్తున్నాయి. అది బంగారు రంగు నీళ్ళతో ప్రకాశిస్తోంది. అక్కడి ఇసుక తిన్నెలు, బురద, ఇసుక అన్నీ బంగారపు రంగులో ప్రకాశిస్తున్నాయి. అక్కడక్కడ బంగారు పుష్పాలతో, పద్మాలతో వ్యాపించి ఉంది. ఒక్కొక్కచోట బంగారు కలువలు, వికసించి ఉన్నాయి. ఆ నదీతీరం సుందరపుష్పాలతో నిండి బంగారు రంగు చెట్లతో అంతటా వ్యాపించింది. బంగారుమెట్లతో, రేవులతో నిండి ఉంది. నిర్మలమణుల సముదాయాలు దాని శోభను పెంచాయి. నృత్య, గీత నాదాలతో ఆ ప్రదేశం మార్మోగుతోంది. ప్రకాశించే బంగారు మంటపాలు అక్కడ ఉన్నాయి. వాటి వలన నదీశోభ పెరుగుతోంది. ఇది వరకు చూడని ఆ నదిని చూచి అర్జునుడు ప్రసన్నుడై ప్రశంసించకుండా ఉండలేకపోయాడు. ఆ నదీతీరంలో సుందరులైన పురుషులు అప్సరసల వంటి స్త్రీలతో విహరించటం గమనించాడు. వారి సౌందర్యం చూడయోగ్యంగా ఉంది. వారు అందరి మనస్సులకు మోహాన్ని కల్పిస్తున్నారు. జంబూనదీ జలాలే వారికి ఆహారం. వారు నిత్యమూ ఆనందంలో, సుఖంలో మునిగిపోయారు. చాలరకాల ఆభరణాలను

ధరించారు. వారినుండి విలువైన రత్నాలను కానుకలుగా పొందాడు. దివ్యమైన జాంబూనదం అనే పేరుగల బంగారం, విలువైన ఆభరణాలు, దుర్లభాలైన వస్తువులు గ్రహించి పశ్చిమంగా బయలుదేరాడు అర్జునుడు. అచటికి పోయి, నాగులు రక్షించే ఆ దేశాన్ని జయించాడు. అక్కడినుండి ఇంకా పశ్చిమంగా పోయి గంధమాదనపర్వతాన్ని చేరి అక్కడి వారినందరినీ గెలిచాడు. గంధమాదనాన్ని దాటి రత్నసంపదతో తులతూగే కేతుమాలవర్షాన్ని చేరాడు. అది దేవతుల్యులైన స్త్రీపురుషుల నివాసప్రదేశం.

ఆ కేతుమాలవర్షాన్ని జయించి, అర్జునుడు దాన్ని కప్పం కట్టే దేశంగా చేసి, దుర్లభాలైన రత్నాలను తీసికొని తిరిగి ఇలావృతవర్షానికి వచ్చాడు. అర్జునుడు తూర్పుదిక్కుగా బయలుదేరి మేరుమందర పర్వతాలకు మధ్య ఉన్న శైలోదానది ఒడ్డున ఉన్న వెదుర్లు, వేణునామకాలైన చెట్ల నీడల్లో, విశ్రాంతి తీసుకొన్నాడు. అక్కడి ఖశ, ఋష, నద్యోత, ప్రహస, దీర్ఘవేణిక, పశుప, కుళింద, తంగణ, పరతంగణ జాతులను ఓడించి, వారి నుండి కానుకలుగా రత్నాలు తీసుకొని మాల్యవంత పర్వతాన్ని చేరాడు. ఆ పర్వతాన్ని దాటి భద్రాశ్వ వర్షానికి చేరాడు. అది స్వర్గంతో సమానమైన అందమైన చోటు. ఆ దేశంలో దేవతల్లా సుందరులై, సుఖ మనుభవించే పురుషులు నివసిస్తున్నారు. వారినందర్నీ అదుపులోనికి తెచ్చుకొని, కప్పంకట్టే వారిగా చేసి, అసంఖ్యాకాలైన రత్నాలను గ్రహించి, నీలపర్వతంవైపు పోయి, అక్కడి వారిని జయించాడు. అర్జునుడు నీలపర్వతాన్ని దాటి సుందరులైన స్త్రీపురుషులతో నిండిన రమ్యకవర్షాన్ని ప్రవేశించాడు. ఆ దేశాన్ని గెలిచి వారికి కప్పాన్ని నిర్ణయించాడు. పిమ్మట గుహ్యక రక్షితమైన ప్రదేశాలను అర్జునుడు తన అధికారంలోకి తెచ్చాడు. అక్కడ బంగారు రంగు మృగాలను, వక్షులను పొందాడు. అవి చూడడానికి చాలా అందంగా ఉన్నాయి. యజ్ఞవైభవవృద్ధికై వాటి నన్నింటినీ గ్రహించాడు. అర్జునుడు చాలారత్నాలను గ్రహించి గంధర్వరక్షితప్రదేశానికి చేరాడు. వారినందర్నీ తన అధీనంలోకి తెచ్చుకొన్నాడు. అక్కడ చాలా రత్నాలను పొంది ధవళగిరి పర్వతవాసులను జయించాడు. ధవళగిరి పర్వతాన్ని దాటి అతడు హిరణ్యక మనే వర్షానికి చేరాడు. అక్కడకు చేరి సుందర ప్రదేశా లన్నింటిని చూడసాగాడు. చాలా భవనాల వరుసల్లో తిరుగుతూ శ్వేతాశ్వుడైన అర్జునుడు నక్షత్రాలమధ్య చంద్రునివలె వెలుగొందాడు.

అందంగల హిరణ్యకవర్ష రాజమార్గాల్లో నడుస్తూ ఉంటే, అక్కడ మేడలపై నిలబడిన సుందరస్త్రీలు అర్జునుని ఆసక్తితో చూశారు. అర్జునుడు తన కీర్తిని పెంచేవాడు. అతడు శూరుడు, వీరుడు, సేవకులతో కూడినవాడు, కీర్తికలవాడు. రథంపై తిరిగేవాడు. అతని శరీరంపై కవచం, తలమీద కిరీటం ప్రకాశిస్తున్నాయి. అతడు యుద్ధానికి సిద్ధమై యుద్ధసామగ్రితో ఎల్లప్పుడు కూడి ఉండేవాడు. సుకుమారుడు, ధైర్యవంతుడు, తేజోరాశి, సాటిలేనివాడు. ఇంద్రునితో సమానమైన పరాక్రమవంతుడు. శత్రునాశం చేసేవాడు, శత్రురాజుల ఏనుగుల గమనాన్ని నిరోధించేవాడు. అతడిని చూచిన స్త్రీలు అతనిని సాక్షాత్తుగా దేవసేనాని కార్తికేయునిగా భావించారు. వారిలో వారు ఇట్లనుకొనసాగారు. "సఖులారా! మన ఎదురుగానున్న ఇతని పరాక్రమం యుద్ధంలో చూడాలి. ఇతని చేతిలో పడిన శత్రువులు నిర్వీర్యులై మరణించినట్లే భావించాలి, స్త్రీలు ఇలా పరస్పరం మాట్లాడుకొంటూ, అర్జునుని ప్రేమగా చూస్తూ, అతని గుణకీర్తనం చేస్తూ, అతని తలపై పుష్పవృష్టి కురిపించారు. అక్కడి వారందరు ప్రసన్నులై అర్జునుని చూచి అతని సమీపాన రత్నాలను, అలంకారాలను ఎన్నింటినో

కానుకలుగా ఉంచారు.)

అందరినీ జయించి, వారిపై కప్పాన్ని నిర్ణయించి మణులు, బంగారం, రత్నాలు, ఆభరణాలు వారినుంచి గ్రహించి, అర్జునుడు శృంగవంతానికి చేరాడు. శృంగవంతం అనే పర్వతాన్ని దాటి, ఉత్తరకురువర్షంలో ప్రవేశించాడు. ఆ దేశాన్ని జయించాలనికూడ నిర్ణయించాడు. ఇంతలోనే అర్జునుని సమీపానికి మహాబలవంతులు, విశాలకాయులూ అయిన ద్వారపాలకులు వచ్చి ప్రసన్నతతో ఇలా పలికారు. 'అర్జునా! ఈ నగరం నీకు ఏవిధంగానైనా జయింప వీలుకాదు. వెనుకకు మరలు. నీవు ఇక్కడికి రావటమే పెద్ద విశేషం. ఈ నగరప్రవేశం చేసినవాడు ప్రాణాలతో మిగలడు. మేం నీయందు ప్రసన్నులమైనాం. అర్జునా! ఇక్కడ జయించ తగిన వస్తువు కనపడదు. ఇది ఉత్తరకురుదేశం. ఇక్కడ యుద్ధానికి తావులేదు. దీనిలోనికి ప్రవేశించినా నీవు ఏమీ ఇక్కడ చూడలేవు. మానవశరీరంతో ప్రవేశిస్తే ఇక్కడ ఏ వస్తువూ చూడ వీలుకానిది. యుద్ధం విడిచి వేరే ఏదైనా పని చేయాలనుకుంటే చెప్పు. నీమాటపై దాన్ని స్వయంగా మేం నెరవేరుస్తాం.' అర్జునుడు వారితో నవ్వుతూ అన్నాడు - 'నేను నాసోదరుడు అయిన ధర్మజుని ఈ భూమండలాని కంతకీ చక్రవర్తిని చేయసంకల్పించాను. మనుజులకు విరుద్ధమైన మీదేశంలోనికి నేను ప్రవేశించను. యుధిష్ఠిరునికి పన్నులరూపంలో కొంత ధనాన్ని సమర్పించండి' అన్నాడు. అపుడు వారు దివ్యవస్త్రాలు, దివ్యాభరణాలు, నారబట్టలు అర్జునునికి కప్పంగా ఇచ్చారు. ఇలా అర్జునుడు రాజులను, దొంగలను చాలామందిని యుద్ధంలో ఓడించి ఉత్తర దిక్కును పూర్తిగా వశపరచుకొన్నాడు. రాజులను జయించి, కప్పానికి ఒప్పించి, వారి రాజ్యాల్లో వారిని స్థాపించాడు. వారు అర్జునునికి ధనం, రత్నాలు, ఆభరణాలు, వాయువేగం గల తిత్తిరి, కల్మాష, శుకవర్ణపు గుఱ్ఱాలు, నెమలివర్ణంగల గుఱ్ఱాలు కానుకలుగా సమర్పించారు. తిరిగి తన చతురంగ బలాలతో అర్జునుడు ఇంద్రప్రస్థానికి చేరాడు. అర్జునుడు తన అన్న ధర్మరాజుకు వాహనాలతో సహా ధనాన్ని సమర్పించి, అతని అనుజ్ఞ పొంది, తన భవనానికి చేరాడు.

29. భీమసేనుడు తూర్పు దిక్కును జయించుట.

భీముడు ఇదే సమయంలో ధర్మరాజు ఆజ్ఞ తీసుకొన్నాడు. శత్రురాజ్యాలను అణచివేయగల గొప్పసైన్యమూ, ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు, కవచాలతో తూర్పుదిక్కుకు బయలుదేరాడు. పురుషశ్రేష్ఠుడైన భీముడు పాంచాలమహానగరం అహిచ్ఛత్రానికి చేరి

ఎన్నో ఉపాయాలతో వారిని అనునయించి వశం చేసుకొన్నాడు. అక్కడినుండి ముందుకు పోయి అయిన భీముడు గండకీనదీ తీరంలోని విదేహదేశాలను కొద్దికాలంలోనే జయించి దశార్ణదేశంపై అధికారం చేజిక్కించుకొన్నాడు. దశార్ణదేశరాజు సుధర్ముడు భీమునితో శస్త్రాస్త్రాలు లేకుండా యుద్ధం చేశాడు. వారి మల్లయుద్ధం చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. భీమసేనుడు అతని అద్భుతపరాక్రమాన్ని గమనించి ఆ సుధర్ముని తన ప్రధానసేనాపతిగా నియమించాడు.

పిమ్మట భీముడు పెద్దసైన్యంతో భూమిని కంపింపచేస్తూ, తూర్పుదిక్కుకు బయలుదేరాడు. బలశాలి వృకోదరుడు అశ్వమేధాధిపతి అయిన రోచమానుని యుద్ధంలో తమ్ములతో సహా వశం చేసుకొన్నాడు. భీముడు మృదువుగా రోచమానునితో యుద్ధం లేకుండానే పూర్వదేశంపై విజయం సాధించాడు. అక్కడినుండి దక్షిణంగా వచ్చి పులిందనగరం అయిన సుకుమారాన్ని, అక్కడిరాజు సుమిత్రుని తన అధీనంలోకి తెచ్చుకొన్నాడు. ధర్మజుని ఆజ్ఞానుసారం పరాక్రమవంతు డైన శిశుపాలుడు ఉన్నచోటుకి వెళ్లాడు. చేదిరాజు కూడ ధర్మరాజు అభిప్రాయం తెలిపికొని నగరం వెలుపలికి వచ్చి, స్వాగతసత్కారాలతో భీముని తనవాడిగా చేసుకొన్నాడు. కురు, చేదివంశశ్రేష్ఠులు ఇరువురూ పరస్పరం కలిసి, వారివారి వంశాల గురించి కుశలప్రశ్నలు వేసుకొన్నారు. తరువాత చేదిరాజు శిశుపాలుడు తన రాజ్యాన్ని భీమసేనునికి అప్పగించి నవ్వుతూ 'పాపరహితుడా! ఇలా ఎందుకు ఆచరిస్తున్నావు?' అని అడిగాడు. భీముడు శిశుపాలుడు ధర్మరాజు చేయదలచిన సర్వకార్యాలనూ వివరించాడు. అతనిమాటలను శిశుపాలుడు అంగీకరించి కప్పం కట్టటానికి అంగీకరించాడు. శిశుపాలునిచే సమ్మానితుడై భీముడు తన సేనావాహనాలతో పదమూడు రోజులు అక్కడ గడిపాడు. తరువాత అక్కడినుండి బయలుదేరాడు.

30. భీముడు పూర్వదిగ్విజయము చేసి ఇంద్రప్రస్థమునకు తిరిగివచ్చుట.

భీముడు కుమారదేశపురాజు శ్రేణిమంతుని, కోసలరాజు బృహద్బలుని జయించాడు. అయోధ్యానగరాన బలవంతుడు, ధర్మజ్ఞుడు అయిన దీర్ఘయజ్ఞుని మృదువుగా యుద్ధరహితంగా భీముడు లొంగదీశాడు. పిదప వృకోదరుడు గోపాలకక్షుని, ఉత్తరకోసల దేశాలను జయించి, మల్లరాజ్యాధిపతి అయిన పార్థివుని తన అధీనంలోకి తెచ్చాడు. హిమాలయసమీపానికి చేరి జలోద్భవరాజ్యంపై దండెత్తి స్వల్పకాలంలోనే తన వశం చేసుకొన్నాడు. ఇలా భీముడు అనేకదేశాలను జయించి భల్లాట సమీపంలోని దేశాలను, శుక్తిమంతం అనే పర్వతాన్ని

జయించాడు. భీముడు యుద్ధంలో ఎన్నడూ వెనుకంజవేయని కాశీరాజు సుబాహుని తన బాహుబలంతో లొంగదీశాడు. సుపార్శ్వ దేశసమీపాన బలంతో పోరాడే రాజరాజేశ్వరుడైన క్రథుని, యుద్ధంలో ఓడించాడు.

మత్స్యదేశాన్ని, మలదప్రదేశాలను, అనఘ, అభయ ప్రదేశాలను, పశుపతి నాథ సమీపాన ఉన్న ప్రదేశాన్నంతటినీ జయించాడు. అక్కడినుండి వెనుతిరిగి భీముడు మదధారమనే పర్వతాన్ని, సోమధేయనివాసులనూ వశంలోకి తెచ్చాడు. ఉత్తర దిక్కుగా బయలుదేరి వత్సభూమిని బలంతో అధీనం చేసుకొన్నాడు.

క్రమంగా భర్గదేశాలరాజును, నిషాదాధిపతిని, మణిమంతుడు మొదలైన రాజులను తన అధికారంలో ఉంచాడు. దక్షిణమల్లదేశాలను, భోగవంతం అనే పర్వత ప్రాంతాన్ని ఎక్కువ ప్రయాసలేకుండానే భీముడు వశంలోకి తెచ్చుకొన్నాడు. శర్మక వర్మకులను అనునయించి జయించాడు. విదేహరాజు జనకుని ఎక్కువ శ్రమలేకనే తనవాడిగా చేసుకొన్నాడు. శకులు, బర్బరులపై ఛలం ప్రయోగించి జయం సాధించాడు. విదేహదేశంలో ఆగి, భీముడు ఇంద్ర పర్వతసమీపాన ఉన్న ఏడుగురు కిరాతరాజులను జయించాడు. తర్వాత సుహ్మ, ప్రసుహ్మదేశరాజులను, వారి పక్షంలోని సేనలను, యుద్ధంలో ఓడించి మగధదేశంవైపు సాగిపోయాడు. మార్గంలోని దండుని, దండధారుని, ఇతరరాజులను జయించి, వారందరితో కలిసి గిరివ్రజపురం చేరాడు. జరాసంధుని కుమారుని సహదేవుని అనునయించి అతను కప్పం కట్టేటట్లు రాజ్యంలో నెలకొలిపి, అందరితో కలిసి కర్ణునిపై దండెత్తాడు. భూమిని కంపింప చేసే చతురంగబలాలతో, శత్రుభీతియగు కర్ణునితో యుద్ధం ప్రకటించాడు. ఆ సమరంలో కర్ణుని జయించి, తన వశంలోకి తెచ్చుకుని కప్పం కట్టించాడు. ఆపైన పర్వతప్రాంతరాజులపైకి యుద్ధానికి వెళ్ళి, విజయాన్ని పొందాడు. మోదాగిరి రాజును బాహుబలంతో ఎదుర్కొని, తన భుజబలంతో అతనిని చంపివేశాడు.

పిమ్మట పుండ్రాధిపతి వాసుదేవుని, కౌశికీనదీతీరంలోని మహౌజసుని జయించాడు. వారిరువురు బలవంతులు, ఎదిరింప శక్యంకాని పరాక్రమవంతులు, భీమసేనుడు పౌండ్రకవాసుదేవుని యుద్ధంలో ఓడించి వంగదేశాన్ని ఆక్రమించాడు. భరతకులభూషణుడైన భీమసేనుడు సముద్రసేనుని, చంద్రసేనుని, తామ్రలిప్తదేశరాజును, కర్వటాధిపతిని, సుహ్మదేశపురాజును, సముద్రతీరవాసులైన మ్లేచ్ఛరాజులను తన పరాక్రమంతో లొంగదీశాడు. ఇట్లా చాలా దేశాలను, రాజులను జయించి భీముడు వారినుండి ధనాన్ని కానుకగా పొంది, లౌహిత్యదేశంపై దండెత్తాడు. సముద్రతీరవాసులైన మ్లేచ్ఛరాజులను జయించి,

వారి నుండి పన్నురూపంలో రత్నాలను, ఆభరణాలను గ్రహించాడు. ఇంతేకాదు ఆ రాజులందరు చందనం, అగరు, మణులు, వెండి, బంగారం, పగడాలు, వస్త్రాలు, ముత్యాలు, పట్టుబట్టలు, కంబళ్ళు, విలువైన ఆభరణాలు కానుకలుగా సమర్పించారు. కప్పంరూపంలో భీమసేనుని పై కోట్లకొలది ధనాన్ని, రత్నాలను వెదజల్లారు. పరాక్రమవంతుడైన భీముడు ఇంద్రప్రస్థానికి తిరిగివచ్చి ధర్మరాజుకు ఆ ధనాన్నంతటినీ సమర్పించాడు.

31. సహదేవుని దక్షిణ దిగ్విజయము.

ఆ విధంగానే సహదేవుడు ధర్మరాజుచే సమ్మానితుడై గొప్పసేనతో దక్షిణదిక్కుకు బయలుదేరాడు. శక్తిశాలి అయిన సహదేవుడు అన్నిటికంటె ముందు శూరసేనదేశ వాసులను ఓడించి తిరిగి మత్స్యరాజు విరాటుని తన అధీనం చేసుకొన్నాడు. దంతవక్త్రుని జయించి కప్పం కట్టేవిధంగా చేసి మళ్ళీరాజ్యంలో నియమించాడు. పిమ్మట సుకుమారుని, సుమిత్రుని వశం చేసుకొన్నాడు. అపరమత్స్యదేశాన్ని, పటచ్చరులనూ జయించాడు. నిషాదదేశం, పర్వతశ్రేష్ఠం, గోశృంగం జయించి సహదేవుడు శ్రేణిమంతుని వశపరచుకున్నాడు. నరరాష్ట్రాన్ని జయించి కుంతిభోజునిపై ఆక్రమణ చేశాడు. కుంతిభోజుడు ప్రసన్నతతో అతని ఆజ్ఞను స్వీకరించాడు. చర్మణ్వతీ తీరంలో జంభకుని కొడుకును చూచాడు. జంభకుడు శ్రీకృష్ణుని శత్రువు. శ్రీకృష్ణుడతనిని చంపకుండా వదిలివేశాడు. అతడు సహదేవునితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. అతనిని సంగ్రామంలో అణచివేసి దక్షిణదిక్కుగా బయలుదేరాడు సహదేవుడు. సేక, అపరసేక దేశాలపై విజయం సాధించాడు. వారినుంచి అనేక రత్నరాసులను కానుకలుగా పొందాడు. సేకాధిపతితో కలిసి నర్మదానదివైపు సాగాడు.

అవంతీదేశరాజులు విందానువిందులు గొప్పసైన్యం తీసికొని యుద్ధానికి ఎదురురాగా సహదేవుడు అవలీలగా ఓడించాడు. వారినుంచి రత్నాలను స్వీకరించి భోజకటనగరం చేరాడు. సహదేవుడు అక్కడ రెండు రోజులు యుద్ధం చేశాడు. యుద్ధాన ఎదురులేని సహదేవుడు భీష్మకుని జయించి కోసలరాజును, వేణానది ఒడ్డునున్న నేతలను, కాంతారక, పూర్వకోసలరాజులను యుద్ధంలో ఓడించాడు. పిమ్మట నాటకేయ, హేరంబకులను జయించాడు. మారుధుని, రమ్యగ్రాముని తనబలంతో వశంలోకి తెచ్చి, నాచీనులు, ఆర్బుకులు, మొదలయిన వనేచరరాజులను ఓడించాడు. తరువాత సహదేవుడు వాతాధిపుని వశపరచుకొన్నాడు. పుళిందులను సమరంలో గెలిచి సహదేవుడు దక్షిణంగా ముందుకు సాగాడు. పాండ్యరాజుతో ఒకరోజంతా యుద్ధం చేశాడు. సహదేవుడు అతనిని జయించి,

దక్షిణాపథానికి వెళ్లాడు. అక్కడ లోకప్రసిద్ధినొందిన కిష్కింధాగుహను చేరాడు. అక్కడ వానరరాజులు మైందద్వివిదులతో వారంరోజులు పోరుసల్పినా వారిలో కొంచెం కూడ అలసట రాలేదు. మహాత్ములు వానరులిరువురు మిక్కిలి ప్రసన్నులై ప్రేమతో సహదేవునితో ఇలా పలికారు. పాండవశ్రేష్ఠా! మానుంచి రత్నాలను కానుకగా పొంది వెళ్లు. ధర్మరాజు కార్యం విఘ్నం కాకూడదు. వారినుంచి రత్నాలను స్వీకరించి సహదేవుడు మాహిష్మతీ నగరానికి చేరాడు. అక్కడ నీలు డనే రాజుతో గొప్పయుద్ధం చేశాడు. పరవీరులను పడగొట్టగల ప్రతాపవంతుడు సహదేవుడు నీలునితో పిరికివారికి భయం కలిగేటట్లు యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో సైన్యం నశించింది. ప్రాణాలకు సందేహం కలిగింది. ఆ సమయంలో అగ్నిదేవుడు నీలునికి సహాయం చేశాడు. సహదేవుని సైన్యంలో రథాలు, గుఱ్ఱాలు, ఏనుగులు, పురుషులు, కవచాలు కూడ అగ్నితో మండుతున్నట్లు కన్పించాయి. అనంతరం సహదేవుడు తొట్రుపాటుపడి ప్రతీకారం కూడ చేయలేకపోయాడు.

జనమేజయుడు అన్నాడు - 'సహదేవుడు రాజసూయయాగం కోసం జైత్రయాత్ర చేస్తున్న సమయంలో అగ్ని అతనికి విరోధి ఎందుకు అయ్యాడు?' వైశంపాయనుడు పలికాడు - 'మాహిష్మతీనగరంలో నివసించే అగ్నికి ఒకానొక సమయంలో నీలుని పుత్రిక సుదర్శనపై ఆసక్తి కలిగింది అని విన్నాను. నీలునిపుత్రిక చాల అంద మైనది. ఆమె ఎల్లప్పుడు అగ్నిహోత్రగృహంలో అగ్నిని రాజేస్తూ ఉండేది. వింజామరలచే వీచినా అగ్ని రాజుకొనటంలేదు. కాని ఆమె పెదవుల మీది గాలి తాకినప్పుడే ప్రజ్వలించసాగాడు. పిమ్మట అగ్ని సుదర్శనను కోరాడు. ఈ విషయాన్ని నీలుడు, ఆ రాజ్యంలోని పౌరులు తెలుసుకున్నారు. ఒకరోజున బ్రాహ్మణరూపంలో తన ఇచ్ఛానుసారం తిరుగుతూ కలువలవంటి కళ్ళుగలిగి, సర్వాంగసుందరి అయిన సుదర్శన వద్దకు వచ్చి తన కామభావాన్ని ప్రకటించాడు. ధర్మాత్ముడైన నీలుడు శాస్త్రమర్యాదతో ఆ బ్రాహ్మణుని శాసించాడు. కోపంతో అగ్ని స్వస్వరూపంలో మండిపోసాగాడు. అదిచూచి నీలుడు ఆశ్చర్యపోయాడు. తల నేలకు ఆనించి అగ్నికి నమస్కారం చేశాడు. వివాహయోగ్యం అయిన సమయం రాగా నీలుడు బ్రాహ్మణరూపం ధరించిన అగ్నికి సుదర్శనను అప్పగించి అతని పాదాలపై శిరస్సు ఉంచి అభివాదం చేశాడు. సుదర్శనను గ్రహించిన అగ్ని నీలునిపై తన అనుగ్రహాన్ని ఇలా ప్రకటించాడు. అగ్ని తన అభీష్టాన్ని నెరవేర్చిన నీలుని వరం కోరుకొమ్మని నిర్బంధించాడు. రాజు తనసేనకు అభయం ఇమ్మని ప్రార్థించాడు. అది మొదలు అజ్ఞానంతో ఆ నగరాన్ని గెలవాలనుకొన్న వారిని అగ్ని తన జ్వాలలతో దహించేవాడు. అలా మాహిష్మతీనగరాన

స్త్రీలు స్వేచ్ఛగా గ్రహింప వీలుకాని వారు అయ్యారు. అగ్ని స్త్రీలకు ఈ విధంగా వరం ఇచ్చాడు. అగ్ని ప్రతికూలత వలన స్త్రీలకు స్వయంగా వరులనిర్బంధం లేకుండా పోయింది. అందువల్ల ఆ స్త్రీలు స్వేచ్ఛగా వరులను కోరేవారు. అప్పటినుండి రాజు లందరు అగ్నిభయంవల్ల ఈ రాజ్యాన్ని చేరక దూరంగా ఉండిపోయారు. ధర్మాత్ముడైన సహదేవుడు అగ్నికి భయపడుతున్న తన సైన్యాన్ని చూచి పర్వతంలా నిశ్చలుడై ఆచమనం చేసి పవిత్రుడై అగ్నిని ఇలా వేడుకొన్నాడు.

"కృష్ణవర్త్మా! నీ కొరకే ఈ నా ప్రయత్నం. నీకు నమస్కారం. నీవు దేవతలకందరికి ముఖరూపుడవు, యజ్ఞస్వరూపుడవు. అందర్నీ పవిత్రులను చేయటం వల్ల పావకుడవు. వహించటం వల్ల హవ్యవాహకుడవు. వేదాలు నీకొరకే పుట్టాయి. అందుచే నీవు జాతవేదుడవు. అగ్నీ! నీవు చిత్రభానుడవు, సురేశుడవు, అనలుడవు. నీవు ఎల్లప్పుడు స్వర్గద్వారాలను స్పృశిస్తావు. ఆహుతులను భుజిస్తావు కనుక హుతాశుడవు. ప్రజ్వలించటంచేత జ్వలనుడవు. శిఖలుండటంచేత శిఖివి అయ్యావు. నీవే వైశ్వానరుడు, పింగేశుడు, ప్లవంగుడు, భూరితేజుడు అని పేర్లు ధరించావు. కుమారస్వామి జన్మకు కారణభూతుడవు, ఐశ్వర్యమివ్వడంచేత భగవంతుడవు. రుద్రవీర్యధారణచే రుద్రగర్భుడవు. బంగారాన్ని పుట్టించటం చేత హిరణ్యకృత్తువు. అగ్ని నాకు తేజస్సునూ, వాయువు ప్రాణశక్తినీ, భూమి బలాన్నీ, నీరు శుభాన్నీ ఇచ్చుగాక. బలాన్ని ప్రకటించగల మహాసత్త్వా, జాతవేదా, సురేశ్వరా! అగ్నీ ! నీవు దేవతల ముఖానివి. మీ సత్యప్రభావంచేత నన్ను పవిత్రుని చెయ్యి. ఋషులు, బ్రాహ్మణులు, దేవతలు, అసురులు ఎల్లప్పుడు యజ్ఞసమయాన నీలో ఆహుతులు వేస్తారు. నీ సత్యప్రభావంచేత నన్ను పవిత్రం చెయ్యి. ధూమమే నీ ధ్వజం. శిఖలతో నీవు ప్రకాశిస్తావు. పాపాలను పోగొడతావు. వాయుకారణంగా ప్రకటం అవుతావు. ప్రాణు లందరిలో నీవు దాగి ఉన్నావు. నీ సత్యప్రభావంచేత నన్ను పవిత్రం చెయ్యి. నేను పవిత్రుడనై నిన్నీవిధంగా స్తోత్రం చేశాను. అగ్నిదేవా! తుష్టి, పుష్టి, శ్రవణశక్తి, శాస్త్రజ్ఞానమూ, ప్రీతినీ నాకు ఇమ్ము."

వైశంపాయనుడు పలికాడు – 'ద్విజుడు పైన చెప్పిన ప్రకారం శ్లోకరూపంగా ఆగ్నేయమంత్రాలను చదువుతూ హోమంచేస్తే వాడు జితేంద్రియుడవుతాడు. వాని పాపాలు అన్నీ పోతాయి.'

సహదేవుడు అన్నాడు – "హవ్యవాహనా! నీవు ఈ యజ్ఞానికి విఘ్నం చేయ తగదు." ఇట్లు పలికి నరశ్రేష్ఠుడైన సహదేవుడు దర్భలను భూమిపై పరచుకొని భయభీతులై,

ఉద్విగ్నులైన తన సేనలముందు శాస్త్రానుసారం అగ్నిని వెలిగించుకొని ఆసీనుడయ్యాడు. సముద్రం చెలియలికట్టను అతిక్రమించలేనట్లు సహదేవుని దాటి అగ్ని అతనిసైన్యాన్ని చేరలేకపోయాడు. కురుకులానందకరుడైన సహదేవుని సమీపానికి అగ్ని మెల్లమెల్లగా చేరి అనునయిస్తూ అతనితో ఇలా అన్నాడు. "కౌరవ్యుడా! లెమ్ము, లెమ్ము, నేను నిన్నీవిధంగా పరీక్షించాను. నీ అభిప్రాయాన్నీ, ధర్మపరుడైన నీ అన్న ధర్మజుని అభిప్రాయాన్నీ తెలుసుకొన్నాను. భరతశ్రేష్ఠా! నీలరాజసంతతి రాజులుగా ఉన్నంతవరకు నేనీ నగరాన్ని రక్షించాలి. నీ అభీష్టాన్ని నెరవేరుస్తాను. కోరుకో." ఇది విని సహదేవుడు ప్రసన్నచిత్తుడై లేచి, శిరసువంచి నమస్కరించి, అగ్నిదేవుని పూజించాడు. అగ్ని వెనుతిరిగిన పిమ్మట రాజు నీలుడు అక్కడకు వచ్చాడు. అగ్ని ఆజ్ఞానుసారం నరశ్రేష్ఠుడైన సహదేవుని నీలుడు సత్కారపూర్వకంగా పూజించాడు. నీలునిపూజను గ్రహించి, కప్పం అతనికి నియమించి, సహదేవుడు విజయం పొంది, దక్షిణదిక్కుగా బయలుదేరాడు.

త్రిపురేశుడైన అమితౌజసుని వశపరచుకొని సహదేవుడు పౌరవేశ్వరుని బందీగా చేశాడు. గొప్ప ప్రయత్నంతో సురాష్ట్రాధిపతి కౌశికాచార్యుని ఆకృతిని అదుపులోకి తెచ్చాడు. సురాష్ట్రంలో ఉండి సహదేవుడు భోజకటకనివాసి రుక్మికి, విశాలరాజ్యాధిపతి, అయిన భీష్మకుని సమీపానికి దూతను పంపాడు. భీష్మకుడు శ్రీకృష్ణుని దృష్టిలో ఉంచుకుని కుమారులతో సహా సహదేవుని మాట మన్నించాడు. తరువాత యోధాగ్రేసరుడు సహదేవుడు అతని నుంచి రత్నాలను కానుకలుగా తీసికొని ముందుకుసాగాడు. మహాతేజస్వి, బలశాలి, అయిన సహదేవుడు శూర్పారక, తారాకటదేశాలను జయించి దండకారణ్యాలను తన అధీనంలోకి తెచ్చుకొన్నాడు. సముద్రద్వీపవాసులను, మ్లేచ్ఛరాజులను, నిషాదులను, కర్ణప్రావరణాదులను గెలిచాడు. మనుష్య రాక్షసుల సంయోగం చేత పుట్టిన కాలముఖులనే వారిపై కూడ విజయం సాధించాడు. సమస్త కోలగిరి, సురభీపత్తనం, తామ్రద్వీపం, రామకపర్వతం, తిమింగిలరాజును సహదేవుడు జయించాడు. ఒంటికాలిపురుషులు, కేరళులు, వనవాసులు, సంజయంతీ నగరం, పాఖండం, కరహాటకం మొదలైన దేశాలను దూతలద్వారా ఓడించి, వారికి పన్ను నిర్ణయించి, వదిలివేశాడు. పాండ్య, ద్రవిడ, ఉండ్ర, కేరళ, ఆంధ్ర, తాళవన, కళింగ, ఉష్ట్రకర్ణిక, ఆటవీపురి, యవననగరం అనే ప్రదేశాలను దూతలద్వారానే లొంగదీసి వారిని కూడ కప్పం కట్టేటట్లు చేశాడు.

(సముద్రతీరానికి చేరి సహదేవుడు సేనాశిబిరాన్ని ఏర్పాటుచేశాడు. మేధావులైన మంత్రులతో కలిసి సహదేవుడు జరుగవలసిన పనులను గూర్చి చర్చించాడు. వారి అందరి అభిప్రాయాన్ని గౌరవించి,

వెంటనే తన అన్నగారి కుమారుడైన ఘటోత్కచుని తలచాడు. తలచినంతలోనే మిక్కిలిపొడగరి, విశాలకళేబరం కలవాడు, సర్వాలంకారశోభితుడు అయిన ఘటోత్కచుడు ప్రత్యక్షం అయ్యాడు. అతని శరీరం నీలమేఘం రంగులో ఉంది. అతని చెవులకు మెరిసే బంగారు కుండలాలు ఉన్నాయి. విచిత్రాలైన హారాలు, భుజాభరణాలు కలిగి ఉన్నాడు. నడుము వద్ద చిరుగంటల మణులు కన్పించాయి. బంగారు మాలలు మెడలో మెరుస్తున్నాయి. పెద్దపెద్ద కోరలు, అందమైన కిరీటం, కుక్షిబంధనం ధరించాడు. ఎఱ్ఱటిజుట్టు, భయంకరమయిన కళ్ళు, నల్లనిగడ్డం, బంగారు భుజాభరణాలు కలిగి ఉన్నాడు. ఎఱ్ఱచందనం పూసుకున్న శరీరంపై, సన్నటిబట్టలు ధరించి, బలవంతుడైన ఘటోత్కచుడు తన వేగంతో భూమిని కంపింపచేస్తూ అక్కడికి వచ్చాడు. పర్వతాకారంగల ఆ ఘటోత్కచుని చూచి జనులు సింహాన్ని చూసిన నీచమృగాలవలె భయంతో తలో దిక్కుకీ పరుగులు తీశారు. రావణుడు పులస్త్యబ్రహ్మను చేరినట్లు ఘటోత్కచుడు సహదేవుని సమీపానికి చేరి పాదాలకు నమస్కరించి, సహదేవుని ఎదుట వినయభావంతో ఉండి, చేతులు జోడించి, 'ఏంచెయ్యాలి?' అని అడిగాడు. ఘటోత్కచుడు మేరుపర్వతశిఖరంలా ఉన్నాడు. అతడు రాగానే రెండు చేతులు చాచి కౌగిలించుకొని, శిరస్సున మాటిమాటికి ముద్దుపెట్టి, స్వాగతసత్కారాలతో సమ్మానించి, మంత్రులతో కూడి, సహదేవుడు మిక్కిలి ప్రసన్నుడై ఇలా పలికాడు. "వత్సా! లంకానగరానికి కరగ్రహణానికై నా ఆజ్ఞపై వెళ్లు. అక్కడ రాక్షసరాజు విభీషణుని కలిసి రాజసూయానికై వివిధ రత్నాలను గ్రహించి శీఘ్రంగా తిరిగిరా. కుమారా! ఒకవేళ నీకతడు రత్నాలు ఇవ్వనిచో నీ శక్తిని ప్రదర్శిస్తూ ఇలా చెప్పు. 'కుంతీకుమారులలో జ్యేష్ఠుడు ధర్మరాజు శ్రీకృష్ణుని బాహువీర్యసహాయంతో సోదరులతో కూడి రాజసూయం చేయసంకల్పించాడు. అన్నింటిని నీవు తెలిసి నడచుకో. నీకు మంగళం అగుగాక. నేను తిరిగి వెళతాను' అని పలికి ఆలస్యం చేయకుండా వెంటనే తిరిగి రా." సహదేవుని మాటలు విని సంతసించిన ఘటోత్కచుడు 'ఆలాగే' అని సహదేవునికి ప్రదక్షిణం చేసి, దక్షిణ దిక్కునకు బయలుదేరాడు.

ఈవిధంగా సముద్రతీరానికి చేరి బుద్ధిమంతుడు, శత్రుతాపకుడు అయిన సహదేవుడు విభీషణుని సమీపానికి తనదూతగా ఘటోత్కచుని పంపాడు.

లంకానగరానికి వెడుతూ ఘటోత్కచుడు సముద్రంవైపు చూశాడు. తాబేళ్ళు, మొసళ్ళు, పెద్దచేపలు మొదలైన జలజంతువులతోను ముత్యపుచిప్పలతోను, శంఖాలతోను నిండి ఉంది ఆ సముద్రం. శ్రీరామునిచే నిర్మింపబడిన సేతువును చూచి నమస్కరించి రామపరాక్రమాన్ని తలచుకొని, దాన్ని దాటి దక్షిణదిక్కునకు దృష్టి సారించాడు. దక్షిణపు ఒడ్డును చేరి, ఘటోత్కచుడు లంకానగరాన్ని చూశాడు. ఆది స్వర్గంతో సమానంగా ప్రకాశిస్తూ ఉంది. నాలుగువైపుల ప్రాకారాలతో ఆవరించి ఉంది. సుందరశుభద్వారాలతో ప్రకాశిస్తోంది. వేలకొలది తెల్లని, ఎఱ్ఱని మేడలతో నిండి ఉంది. అక్కడి కిటికీలకు బంగారం తాపడం చేశారు. ముత్యాలజాలర్లు వ్రేలాడదీశారు. గవాక్షాలు బంగారం, వెండి, ఏనుగు దంతాలతో అలంకరింపబడి ప్రకాశించాయి. మేడలు, గోపురాలతో ఆ నగరశోభ విస్తరించి ఉంది. బంగారు తోరణద్వారాలు నిర్మించారు. దివ్యదుందుభులు గంభీరంగా మ్రోగసాగాయి. ఉద్యానవనాలు నగరశోభను పెంపొందిస్తున్నాయి. నాలుగువైపుల పుష్పసుగంధం నిండి ఉంది. విశాలమైన

మార్గాలు తీర్చి ఉన్నాయి. నానారత్నాలతో నిండి, ఇంద్రుని అమరావతిలా ఉంది. ఘటోత్కచుడు లంకలో ప్రవేశించి శూలధారులు, భల్లధారులు అయిన రాక్షసులను చాలామందిని చూశాడు. వారందరు నానావేషాలు ధరించారు. సంగ్రామనిపుణులు, స్త్రీలు అందగత్తెలు, దివ్యమాల్యాలు, వస్త్రాలు ధరించారు. దివ్యహారాలతో, ఆభరణాలతో శోభించారు. మద్యపానం చేత నేత్రప్రాంతభాగాలు ఎఱ్ఱబడ్డాయి. బలిసిన నితంబం, వక్షఃస్థలం, కలిగి ఉన్నారు. ఘటోత్కచుని చూచి వారంతా ఆనందం, ఆశ్చర్యం కూడ పొందారు. ఘటోత్కచుడు ఇంద్రభవనసమాన మయిన విభీషణుని గృహాన్ని చేరి, ద్వారపాలకునితో ఇలా అన్నాడు.

"కురుశ్రేష్ఠుడు, బలశాలి ఆయిన రాజు పాండవు. అతని కుమారులలో చిన్నవాడు సహదేవుడు ప్రసిద్ధుడు. అతడు కృష్ణుని మిత్రుడూ, తన అన్న ఆయిన ధర్మరాజు రాజసూయానికై నడుంబిగించాడు. నన్ను నీవద్దకు కప్పం కోసం దూతగా పంపాడు. విభీషణుని దర్శించాలని ఉంది. శీఘ్రంగా పోయి నివేదించు." అతనిమాటలు విని ద్వారపాలకుడు 'అలాగే' అని పలికి నివేదించటానికి విభీషణుని భవనంలో ప్రవేశించాడు. అంజలి ఘటించి దూతవాక్యాలను సవిస్తరంగా విభీషణునికి వినిపించాడు. అతని మాటలు విని విభీషణుడు 'ఆ దూతను నా సమీపానికి ప్రవేశపెట్టు' అని బదులుపలికాడు. ధర్మజ్ఞుడు, మహాత్ముడు అయిన విభీషణుని మాటలను విని అక్కడినుంచి త్వరగా బయటకు వచ్చి ద్వారపాలకుడు ఘటోత్కచునితో "దూతా! రమ్ము! శీఘ్రంగా ప్రవేశించు" అన్నాడు. ద్వారపాలకుని మాటల్ని విని, ఘటోత్కచుడు విభీషణమందిరంలో ప్రవేశించాడు.

అతడు లోనికి ప్రవేశించి రాక్షసరాజైన విభీషణుని భవనాన్ని తేరిపారచూశాడు. అది బంగారు తోరణాలు కల కైలాసపర్వతంలా ఉంది. నాలుగువైపుల ప్రాకారాలతో, నానాగోపురాలతో, మేడలు, ప్రాసాదాలతో, అనేకరత్నాలు పొదగబడి ఉంది. బంగారం, వెండి, స్ఫటికాలు, వజ్రాలు, వైడూర్యాలు పొదిగిన స్తంభాలు చూపరుల దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. అనేకరకాల పతాకలు, ధ్వజాలు, బంగారురంగులో నుండి ప్రకాశించాయి. చిత్రవిచిత్రాలైన మాలలు, శుద్ధిచేసిన బంగారు వేదిక, సుందరంగా కనిపిస్తోంది. ఆ విశేషాలన్నీ చూస్తూ విభీషణుని భవనంలోకి ప్రవేశిస్తుండగానే ఘటోత్కచుడు శ్రావ్యమయిన మృదంగధ్వనిని విన్నాడు. తీగలపై గీతాలు ఆలపిస్తున్నారు. తాళానికి అనుగుణంగా అక్షరాలు ఉన్నాయి. వేలకొద్దీ వాద్యాలతో దివ్యదుందుభులు కలిసి మ్రోగుతున్నాయి. మనోహరమయిన, శబ్దాన్ని విని ఘటోత్కచుడు మిక్కిలి సంతృప్తిచెందాడు. సుందరాలైన కక్షలను దాటి ద్వారపాలకునితో కలిసి బంగారు సింహాసనంపై ఆసీనుడైన విభీషణుని చూశాడు. అతని సింహాసనం సూర్యునితో సమానంగా భాసిస్తోంది. అతని శరీరం దివ్యాభరణాలతో నిండి దివ్యమై ప్రకాశిస్తోంది. అతడు దివ్యమాలలు, వస్త్రాలు ధరించి దివ్యగంధం పూసికొని పవిత్రశరీరుడై కనిపించాడు. శరీరకాంతి దివ్యాభరణాలతో కలిసి సూర్యాగ్నులకాంతిని మించి ఉంది. ఇంద్రుని సమీపంలో చాలామంది దేవతలు ఆసీనులైన విధంగా విభీషణుని సమీపాన అనేకమంత్రులు ఆసీనులు అయ్యారు. సౌందర్యవంతులు, మహారథులు అయిన యక్షులు సౌందర్యవతులైన స్త్రీలతో కలిసి తమ శుభవచనాల ద్వారా విధిగా విభీషణుని పూజిస్తున్నారు. ఇద్దరు అందమైన యువతులు బంగారు దండం కల విలువైన వింజామరలతో

అతని తలవద్ద వీస్తూ ఉన్నారు. రాక్షసరాజు విభీషణుడు కుబేరవరుణుల సంపదలతో తులతూగుతూ అద్భుతంగా కన్పించాడు. అతని అవయవాలనుంచి దివ్యకాంతి వెలువడుతోంది. అతడు ఎల్లప్పుడు ధర్మపరాయణుడై ఉంటాడు. అతడు నిత్యం ఇక్ష్వాకువంశప్రభువైన రాముని తలచుకొంటూ ఉన్నాడు. అతనిని చూసి అంజలి ఘటించి ఘటోత్కచుడు నమస్కరించాడు. చిత్రరథుడు ఇంద్రుని ఎదుట వినమ్రుడైనట్లు ఘటోత్కచుడు విభీషణుని ఎదుట వినయంతో నిలబడ్డాడు. ఆ సహదేవుని దూతను చూచి విభీషణుడు సన్మానించి స్వాగతసత్కారాలతో సాంత్వన వాక్యాలు పలికాడు. విభీషణుడు పలికాడు - "ఘటోత్కచా! నానుంచి కప్పాన్ని కోరేరాజు ఏ వంశానికి చెందినవాడు? అతని తమ్ములు ఎవరు? అతనిదేశం, ప్రధాన నగరాలు ఏవి? నీ విషయాన్ని పూర్తిగా చెప్పు. అంతా సవిస్తరంగా వినాలని ఉంది. నా ప్రశ్నలన్నింటికీ సమాధానాలు వేరు వేరుగా చెప్పు." మహాత్ముడైన విభీషణుడు అలా అడిగిన పిదప అంజలి ఘటించి అతనికి ఊరట కలిగిస్తూ ఘటోత్కచుడు ఇలా చెప్పాడు.

"చంద్రవంశానికి చెందిన మహాబలవంతుడు పాండుడు అనే మహారాజు ఉన్నాడు. అతనికి ఇంద్రునితో సమాన పరాక్రమం గల ఐదుగురు కుమారులు ఉన్నారు. వారిలో జ్యేష్ఠుడు ధర్మపుత్రుడనే పేర లోకంలో కీర్తి గడించాడు. అతని మనస్సులో ఏ వ్యక్తిమీదా శత్రుత్వం లేదు. లోకులు అతనిని అజాతశత్రు వని పిలువసాగారు. అతని మనస్సులో ఎల్లప్పుడు ధర్మమే నిండి ఉంటుంది. మూర్తీభవించిన ధర్మమే అతడు. తండ్రి నుంచి రాజ్యాన్ని పొంది పరిపాలిస్తున్నాడు. గంగానది దక్షిణ తీరాన హస్తినాపురం అతని రాజధాని. విభీషణా! కొంతకాలానికి అతడు హస్తినాపురాన్ని ధృతరాష్ట్రునికి అప్పగించి స్వయంగా సోదరులతో ఇంద్రప్రస్థానికి చేరాడు. అక్కడ వారు ఆనందంలో మునిగిపోయారు. ఆ రెండు నగరాలు గంగాయమునా నదుల మధ్య ఉన్నాయి. ధర్మపరాయణుడైన యుధిష్ఠిరుడు ఇంద్రప్రస్థంలో ఉండి పరిపాలన సాగించసాగాడు. ధర్మజుని సోదరుడు భీమసేనుడు. అతడు గొప్ప తేజస్వి, సింహసమాన పరాక్రమం కలవాడు. బాహుబలశాలి, మహాబలవంతుడు. అతనికి వేయి ఏనుగుల బలం ఉంది. అతని తరువాతి సోదరుడు అర్జునుడు. గొప్ప బలపరాక్రమం కలవాడు. సుకుమారుడు, ధైర్యశాలి. అతని పరాక్రమం ప్రపంచంలో విఖ్యాతమైంది. అర్జునుడు పరాక్రమంలో కార్తవీర్యుడు, బలంలో సగరపుత్రులతో సాటి, అస్త్రవిద్యలో పరశురాముడు, యుద్ధంలో రాముడు, అందంలో ఇంద్రుడు, తేజస్సులో సూర్యసముడు. దేవతలు, దానవులు, గంధర్వులు, పిశాచాలు, సర్పాలు; రాక్షసులు, మనుజులు అందరూ ఏకమై యుద్ధం చేసినా అర్జునుని జయించలేరు. అతడు ఖాండవవనాన్ని మండించి అగ్నికి ఆహుతి చేశాడు. దేవతలతో సహా ఇంద్రుని ఓడించి అగ్నికి సంతుష్టి కలిగించి దివ్యాస్త్రాలను పొందాడు. అతడు పూజ్యుడైన వాసుదేవుని సోదరిని భార్యగా పొందాడు. ఆమె దేవతలకు కూడ పొందశక్యం కాలేదు.

అర్జునుని తమ్ముడు నకులుడు అని ప్రసిద్ధి వహించాడు. రూపు దాల్చిన మన్మథుడు. అతని తమ్ముడు గొప్ప తేజస్వి, సహదేవు డని పేరు. సహదేవుడే నీవద్దకు నన్ను దూతగా పంపాడు. నాపేరు ఘటోత్కచుడు. నేను బలశాలి భీముని కుమారుడను. నాతల్లి పూజనీయ అయిన హిడింబ అనే రాక్షసి. పాండవుల ఉపకారానికై ఇక్కడ సంచరిస్తున్నాను, మహారాజు యుధిష్ఠిరుడు మొత్తం

భూమండలానికి రాజు అయ్యాడు. క్రతుశ్రేష్ఠ మయిన రాజసూయాన్ని ధర్మరాజు చేయనిశ్చయించాడు. అతడు తన సోదరులందరినీ కప్పం కోసం అన్ని దిక్కులకు పంపాడు. యాదవవీరుడు శ్రీకృష్ణునితో కూడి ధర్మరాజు తన సోదరులను దిగ్విజయానికి ఆదేశించాడు. ఉత్తరదిక్కుకు అర్జునుడు శీఘ్రంగా కప్పం కోసం వెళ్ళాడు. మహాబలుడు జితేంద్రియుడైన అర్జునుడు లక్షయోజనాలు ప్రయాణించి రాజు లందరినీ గెలిచి స్వర్గద్వారాన్ని చేరి రత్నాలను సంగ్రహించి వేగంగా మరలివచ్చాడు. నానావిధాలైన రంగురంగుల గుఱ్ఱాలను కానుకగా గ్రహించి, రత్నరాశులను స్వీకరించి, అర్జునుడు ధర్మరాజునకు కానుకగా సమర్పించాడు. భీమసేనుడు తనబలంతో తూర్పుదిక్కును వశపరచుకొని, రాజులందరినీ అణచివేసి, ధర్మరాజుకు ధనాన్ని అప్పగించాడు. పడమరదిక్కుకు నకులుడు కప్పానికై సాగిపోయాడు. సహదేవుడు దక్షిణదిక్కుకు పోయి అందరినీ జయించాడు. రాజేంద్రా! అతడు గొప్ప సత్కారభావంతో నన్ను మీవద్దకు రాజసంబంధమైన కప్పానికి పంపాడు. పాండవుల చరితం మీకు సంక్షేపంగా తెలియజేశాను. మహారాజా! యుధిష్ఠిరుడైన ధర్మరాజును, పవిత్రమైన రాజసూయాన్ని, నడిపిస్తున్న పూజ్య శ్రీకృష్ణభగవానుని దృష్టిలో నుంచుకొని ధర్మరాజుకు కప్పాన్ని కట్టవలసింది." ఘటోత్కచుని ఈ మాటలు విని రాక్షసరాజు విభీషణుడు మంత్రులతో సహా ప్రసన్నుడు అయ్యాడు.

విభీషణుడు ప్రేమతో ఆ ఆజ్ఞను స్వీకరించాడు. శక్తిశాలి, బుద్ధిమంతుడు అయిన విభీషణుడు దానిని సమయవిధానమని గుర్తించాడు.

అతడు సహదేవునికి వీనుగు అంబారీకి వీలయిన కంబళీలు, పరుపులు, బొంతలు, వీనుగు దంతాలతో, బంగారంతో చేసిన పాన్పులు, మణులు, స్వర్ణమయ మయిన అనేక వస్తువులు ఇచ్చాడు. అనేకవిచిత్రాభరణాలు, విలువైన వస్తువులు, మంచి పగడాలు, మణులు, రత్నాలు, బంగారు పాత్రలు, కలశాలు, ఘటాలు, గుండిగలు, జలపాత్రలు కానుకలుగా సమర్పించాడు. చిత్రకళతో కూడిన ఎన్నో వెండిపాత్రలు, మణులు, ముత్యాలు, బంగారం పొదిగిన శస్త్రాలను ఇచ్చాడు. యజ్ఞతోరణాలకు వీలైన 14 తాళాలను, సువర్ణమయాలై మణులు అలంకరించిన పల్లకీలను సమర్పించాడు. చాలావిలువైన కిరీటాలు, బంగారురంగు కుండలాలు, బంగారుపుష్పాలు, మాలలు, చంద్రుని రంగు గల శతావర్త శంఖాలను ఆనందంతో కానుకగా ఇచ్చాడు. పరిమళ భరితమయిన చందనం, రత్నాలు, బంగారం, వస్త్రాలు, కంబళ్లు, ఇంకా వివిధవస్తు సామగ్రిని సహదేవునికి కానుకగా విభీషణుడు అర్పించాడు.)

చందనం, అగరు కొయ్యలు, దివ్యాభరణాలు, చాల విలువైన వస్త్రాలు, పట్టుబట్టలు, ఘటోత్కచునితో సహదేవునికి పంపించాడు. ఘటోత్కచుడు విభీషణునికి నమస్కరించి, దోసిలి ఘటించి, ప్రదక్షిణంచేసి, లంకనుంచి బయలుదేరాడు.

(ఘటోత్కచునితో కలిసి ఎనభైఎనిమిదిమంది రాక్షసులు ఆ రత్నాల నన్నింటిని సంతోషంతో తీసుకొనివచ్చారు. ఈ విధంగా అన్ని రత్నాలను గ్రహించి ఘటోత్కచుడు రాక్షసులతో సహా సహదేవుని విడిది వైపు ప్రయాణం సాగించాడు. సముద్రాన్ని దాటి వారందరు సహదేవుని సమీపానికి చేరారు. సహదేవుడు రత్నహారాలు గైకొని వచ్చే భయంకర రాక్షసు లందరినీ, ఘటోత్కచునీ చూశాడు. ద్రవిడసైనికులు భయంకరులైన రాక్షసులను చూచి భయభీతులై అన్నివైపులకు పారిపోయారు. ఘటోత్కచుడు

సహదేవునికి అంజలి ఘటించి నమస్కరించాడు. పాండుకుమారుడు సహదేవుడు ఆ రత్నరాశుల్ని చూచి చాల ప్రసన్నుడయ్యాడు. అతడు ఘటోత్కచుని రెండు చేతులతో పట్టుకుని కౌగిలించుకున్నాడు. మిగిలిన రాక్షసులవైపు ప్రసన్నత చూపాడు. ద్రావిడసైనికులను వీడి తిరిగివచ్చుటకు ఉద్యుక్తుడు అయ్యాడు. అందరూ సిద్ధంగాకా సహదేవుడు ఇంద్రప్రస్థం దిశగా బయలుదేరాడు. ఈవిధంగా వేగంగా జయించి, సామనీతితో నచ్చజెప్పి, రాజులందరినీ కప్పంకట్టే వారిగా చేసి శత్రుదమనుడైన సహదేవుడు ఇంద్రప్రస్థానికి తిరిగివచ్చాడు.

రత్నాల రాశులను గ్రహించి రాక్షసులతో కూడ సహదేవుడు ఇంద్రప్రస్థంలో ప్రవేశించాడు. ఆ సమయాన కోలాహలంతో భూమి కంపించినట్లు ఉంది. సహదేవుడు ధర్మరాజును చూచి అంజలి ఘటించి వినమ్రభావంతో నమస్కరించాడు. అప్పుడు యుధిష్ఠిరుడు అతనిని ఎంతగానో గౌరవించాడు. లంకనుంచి తెచ్చిన అత్యంతదుర్లభమైన ధనరాశులను చూచి, ధర్మరాజు మిక్కిలి ఆనందించాడు, ఆశ్చర్యపోయాడు. ఆ ధనరాశుల్లో వేయికోట్లవిలువైన బంగారం ఉంది. విచిత్రమణులు, రత్నాలు ఉన్నాయి. గోవులు, మేకలు, దున్నలు కూడ అధికసంఖ్యలో ఉన్నాయి.

వీటి నన్నింటిని ధర్మరాజుకు సమర్పించి కృతకృత్యుడై సహదేవుడు ఆనందంతో రాజధానీనగరంలో నివసించసాగాడు.)

32. నకులుడు పడమర దిక్కును జయించుట.

వైశంపాయనుడు పలికాడు - నకులుని పరాక్రమాన్ని, విజయాన్ని వివరిస్తాను. శక్తిశాలి అయిన నకులుడు భగవానుడైన వాసుదేవుని అధీనంలో ఉన్న పశ్చిమదిక్కును ఎలా జయించాడో విను. నకులుడు పెద్దసేనతో ఖాండవప్రస్థం నుండి పశ్చిమదిక్కుకు బయలుదేరాడు. అతడు సైనికుల సింహనాదాలు, యోధుల గర్జనలు, రథచక్రఘోషలతో భూమిని కంపింపచేస్తూ బయలుదేరాడు. వెడుతూ వెడుతూ చాల ధనధాన్యాలతో సుందరమూ, గోసంపన్నమూ, కుమారస్వామి కిష్టమూ అయిన రోహితకమనే పర్వతప్రాంతాన్ని నకులుడు చేరాడు. అక్కడ మత్తమయూరకులనే పేరు గల రాజులతో ఘోరసంగ్రామం జరిగింది. వారిని జయించి సమగ్ర మయిన మరుభూమిని, ధాన్యంతో తులతూగే శైరీషకాన్ని, మహోత్థదేశాన్ని సాధించాడు. తేజస్వి, మరుభూమి శాసకుడు అయిన ఆక్రోశుని జయించాడు. ఆక్రోశునితో అతనికి గొప్పయుద్ధం జరిగింది. పిమ్మట దశార్ణదేశాన్ని ఓడించి నకులుడు శిబి, త్రిగర్త, అంబష్ఠ, మాళవ, పంచకర్పట మాధ్యమిక దేశాలను అన్నింటినీ జయించి వాటధానదేశీయులను వశపరచుకున్నాడు. మళ్ళీ అక్కడినుండి చుట్టివచ్చి నకులుడు పుష్కరారణ్యనివాసులు ఉత్సవసంకేతులనే పేరున్న గణాలను అదుపులోకి తెచ్చాడు. సముద్రతీరంలో నివసించే మహాబలవంతులు గ్రామణీయులు అనేపేరు గల క్షత్రియులను,

సరస్వతీనదీ తీరాన ఉన్న శూద్రాభీరగణాలను, మత్స్యసంపదచే జీవించే పల్లెవారిని ఇతరప్రాంతీయ వాసులను ఓడించి, వశంలోకి తెచ్చాడు.

సమస్త పంచనదదేశాలను (పంజాబ్), అమరపర్వతం, ఉత్తరజ్యోతిషం, దివ్యకటం ద్వారపాలనగరాలను తేజస్వి అయన నకులుడు కొద్ది సమయంలో గెలిచాడు. రామఠ, హోర, హూణ, పశ్చిమనరాధీశుల నందరినీ నకులుడు ఆజ్ఞామాత్రం చేతనే జయించి, ఆధీనంలోకి తెచ్చాడు. అక్కడే ఉండి శ్రీకృష్ణుని సమీపానికి దూతను పంపాడు. శ్రీకృష్ణుడు ప్రేమతో నకులుని శాసనాన్ని అంగీకరించాడు. తర్వాత శాకలదేశాన్ని గెలిచి నకులుడు మద్రరాజధానిలో ప్రవేశించి, అక్కడి పరిపాలకుడు, మేనమామ అయిన శల్యుని ప్రేమతో జయించాడు. శల్యుని సమ్మానానికి అర్హుడైన నకులుడు ఉచిత సత్కారాన్ని పొంది, కానుకగా రత్నరాశులను గ్రహించి బయలుదేరాడు. చిత్రమార్గాలు తెలిసిన సముద్రమధ్యవాసులు, భయంకరులు, మ్లేచ్ఛులు, బర్బరులు, కిరాతులు, యవనులు, శకులను క్రమంగా జయించి నకులుడు ఇంద్రప్రస్థంవైపు సాగాడు. నకులుడు గ్రహించిన రత్నరాశులను, వేలకొద్దీ గున్నఏనుగులు అతికష్టంమీద మోసితెచ్చాయి. ఇంద్రప్రస్థాన ప్రకాశించే యుధిష్ఠిరుని సమీపానికి శ్రీమంతుడైన నకులుడు వచ్చి మొత్తం ధనాన్ని అప్పగించాడు. వాసుదేవుడు ఇదివరకే జయించిన పడమర దిక్కును జయించి నకులుడు ఇంద్రప్రస్థానికి తిరిగివచ్చాడు.

33. ధర్మరాజు రాజసూయయాగ దీక్ష వహించుట.

(ఈ విధంగా భూమండల మంతా జయించి స్వధర్మానువర్తులై ఐదుగురు సోదరులు ఈ భూమిని పాలించసాగారు. భీమసేనుడు మొదలైన నలుగురు స్నేహితులతో కూడి యుధిష్ఠిరుడు ప్రజలందర్నీ అనుగ్రహంతో చూస్తూ అన్నివర్ణాలవారినీ సంతుష్టిపరచాడు. ఎవరితోను విరోధం లేనివిధంగా అందరి హితసాధనలో నిమగ్నుడయ్యాడు. అందర్నీ తృప్తిపరచాడు. కోశాగారాన్ని తెరిపించి దానధర్మాలు చేయించాడు. ఎవరినీ బలప్రయోగంతో లొంగదీయలేదు. ధర్మ మనేమాట తప్ప వేరొకమాట అతని నుండి వెలువడలేదు. పుత్రుడు తండ్రిపై అనురాగం పెంచుకొన్నట్లు ప్రజలందరు ధర్మరాజు పట్ల అనురాగం కలిగి ఉన్నారు. ధర్మజుని ద్వేషించేవాడు ఒక్కడూ లేడు. అందులకే అతడిని **అజాతశత్రువు** అని కీర్తించారు.)

ధర్మజుడు ప్రజల్ని రక్షించటం, సత్యపాలనం, శత్రునాశం అనే పనులు నిర్వర్తించసాగాడు. ఈ కార్యాలపట్ల నిశ్చింత కలిగి ప్రజలంతా తమతమ కర్మలపట్ల ఆసక్తి పెంచుకుని జీవించారు. న్యాయపూర్వకంగా పన్నుగ్రహించటం వలన, ధర్మప్రధానంగా

పరిపాలించటం వలన మేఘాలు ఇచ్ఛానుసారం వర్షించాయి. ఈ ప్రకారం యుధిష్ఠిరుని జనపదాలన్నీ ధనధాన్యాలతో సమృద్ధం అయ్యాయి. గోరక్షణ, వ్యవసాయం, వ్యాపారం అన్నిపనులు చక్కగా సాగుతున్నాయి. ప్రత్యేకించి రాజవ్యవస్థచే ఉత్తమంగా సంపన్న మయ్యాయి. చోరులనుండి, వంచకులనుండి, రాజవిశ్వాసపాత్రుల నుండి పరస్పరం వ్యర్థమైన మాటలు వినపడటంలేదు. అబద్ధములు ప్రజలమధ్య కూడ లేవు. నిత్యమూ ధర్మాసక్తుడైన యుధిష్ఠిరునిరాజ్యంలో అతివృష్టి, అనావృష్టి, వ్యాధులు, అగ్ని మొదలైన ఉపద్రవాలపేరు కూడ వినబడటంలేదు. రాజులందరు స్వభావానుసారం యుధిష్ఠిరునికి కానుకలు ఇవ్వటానికి ప్రియంచేయటానికి మాత్రమే వచ్చేవారు. (యుద్ధాది) అన్యకార్యాలకోసం ఎన్నడూ రాలేదు. ధర్మంగా సంపాదించిన ధనాగారం బాగా వృద్ధి చెందింది. వందలసంవత్సరాలు దానంకోసం కోశాగారం తెరచినా ఆ ధనం తరిగిపోదు. కుంతీనందనుడు యుధిష్ఠిరుడు తన అన్నవస్త్రాగారాల్ని, కోశాగారాన్ని పూర్తిగా తెలిసికొని యజ్ఞం చేయాలని నిశ్చయించాడు. అతని హితైషులందరు, వేరువేరుగాను, అంతాకలిసీ "యుధిష్ఠిరా! మీరు రాజసూయం చేయటానికి తగినసమయం ఆసన్నమైంది. కావున దానికి కావలసిన ప్రయత్నం చేయండి" అన్నారు.

వారందరు ఇలా విన్నవిస్తూండగనే శ్రీకృష్ణుడక్కడకు వచ్చాడు. శ్రీకృష్ణుడు పురాణపురుషుడు, నారాయణఋషి, వేదస్వరూపుడు, విజ్ఞానులకు కూడ ఆయన దర్శనం దుర్లభం. స్థావరజంగమా లన్నింటికీ శ్రీకృష్ణుడు ఉత్పత్తిస్థానం, అందరికీ ఆశ్రయం, భూతభవిష్యద్వర్తమానాల శాసకుడు. కేశి అనే రాక్షసుని చంపి కేశవుడు అయ్యాడు. కృష్ణుడు వృష్ణివంశస్థులందరికీ ప్రాకారం వంటివాడు. ఆపదలలో అభయమిచ్చేవాడు. శత్రుసంహారకుడు. అతడు తండ్రి వసుదేవుని బలాధిపతిని చేసి ఎన్నో కానుకలు ధర్మరాజుకై తెచ్చాడు. పురుషశ్రేష్ఠుడు శ్రీకృష్ణుడు తనతండ్రి సేననంతటిని యుధిష్ఠిరుని పక్షంలో నిలిపి ధనరాశులను కానుకలుగా తెచ్చి, సేనతో సహా అక్కడకు సహాయంగా వచ్చాడు. ఆ ధనరాశులకు అంతులేదు. రత్నాలసముద్రం ఉందేమో అనిపిస్తోంది. వాటినన్నింటిని గైకొన్న రథాలధ్వని దిశలన్నింటిని మారుమ్రోగిస్తూ కృష్ణుడు ఇంద్రప్రస్థంలో ప్రవేశించాడు. అప్పటికే నిండిన ధనాగారాన్ని శ్రీకృష్ణుడు తన అక్షయ ధనరాశులతో నింపాడు. అతని ఆగమనం పాండవుల శత్రువులకు శోకాన్ని పెంపొందించింది. శ్రీకృష్ణుని రాకతో ఇంద్రప్రస్థమంతా సూర్యోదయమైనప్పుడు పొందే వెలుగువలె, గాలి తన స్థానంలో నిలిచినప్పుడు ఏర్పడే ప్రాణశక్తి వంటి హర్షోల్లాసాలు వెల్లివిరిశాయి. రాజు యుధిష్ఠిరుడు మిక్కిలి

ప్రసన్నుడై అతనిని కలిశాడు. శాస్త్రమర్యాదతో స్వాగత సత్కారాలు చేసి కుశలం అడిగాడు. సుఖాసీనుడైన పిమ్మట శ్రీకృష్ణునివద్దకు ధౌమ్యుడు, ద్వైపాయనుడు మొదలైన ఋషులతో, తన నలుగురు సోదరులతో ధర్మరాజు కలిసి వచ్చి ఇలా అన్నాడు.

"మీ దయవలన మీసేవకొరకు భూమండలమంతా ఇపుడు నా అధీనంలోకి వచ్చింది. శ్రీకృష్ణా! మీ అనుగ్రహంతో అనేక ధనరాశులు నన్ను చేరాయి. దేవకీనందనా! ఈ ధనాన్ని అంతటిని, బ్రాహ్మణులకూ, అగ్నికీ సమర్పించాలని అనుకొంటున్నాను. అందుకోసం దాశార్హా! నేనిప్పుడు నీతోను, సోదరులతోను యజ్ఞం చేయ నిశ్చయించాను. దీనికి నీఅనుజ్ఞ కోరుతున్నాను. గోవిందా! మీరు స్వయంగా యజ్ఞదీక్షను గ్రహించండి. మీరు యజ్ఞం చేస్తే నేను పాపరహితుణ్ణి అవుతాను. లేదా నా ఈ సోదరులతో కలిసి యజ్ఞం చేయడానికి నాకు అనుమతి ఇవ్వండి. శ్రీకృష్ణా! నీచే అనుజ్ఞను పొంది ఉత్తమయజ్ఞదీక్షను గ్రహిస్తాను." అప్పుడు శ్రీకృష్ణుడు రాజసూయవిశిష్టతను విస్తరంగా వర్ణిస్తూ ఇలా అన్నాడు. "రాజసింహమా! నీవే చక్రవర్తి అవటానికి, అర్హుడవు. నీవే ఈ గొప్ప యజ్ఞదీక్షను గ్రహించు. నీవు దీక్షను స్వీకరిస్తే మేమందరం కృతకృత్యులం కాగలం. నీవు ఇష్టమైన యజ్ఞాన్ని ప్రారంభించు. నేను నీకు ఎల్లప్పుడు శుభం చేయటానికి సంసిద్ధుడనే. నాకు తగిన పనిలో నన్ను పెట్టు. నేను మీ అందరి ఆజ్ఞలు పాలిస్తాను."

వెంటనే "యుధిష్ఠిరుడు హృషీకేశా! నాకోరికను అనుసరించి నీవు స్వయంగా ఇక్కడకు విచ్చేశావు. శ్రీకృష్ణా! మా సంకల్పాలు అన్నీ సిద్ధించాయి. నాకు యాగసిద్ధి నిశ్చయం" అన్నాడు. పూజ్యుడైన శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం సోదరసహితుడై ధర్మరాజు రాజసూయయాగం చేయటానికి కావలసిన సామగ్రిని సిద్ధం చేయసాగాడు. అదే సమయంలో శత్రునాశకుడైన ధర్మరాజు యోధాగ్రేసరుడైన సహదేవుని, మంత్రులను ఆజ్ఞాపించాడు. "ఈ రాజసూయంకోసం బ్రాహ్మణుల ఆదేశం మేరకు అంగభూతాలైన సామగ్రి, ఉపకరణాలు, మంగళద్రవ్యాలు, అలాగే ధౌమ్యునిచే ఆజ్ఞాపింపబడిన యజ్ఞోపయోగకరాలైన వస్తువులను, క్రమంగా దొరికినవి దొరికినట్లుగా మిమీ సేవకులను తీసుకొని సిద్ధం చేస్తూ ఉంటారు. ఇంద్రసేనుడు, విశోకుడు, అర్జునసారథి పురుడు, నాహితాన్ని గోరి అన్నపానాది సంగ్రహణం చేయాలి. వేటిని తినాలని అనుకొంటున్నారో వాటినన్నింటిని రసగంధభరితంగా, మనస్సుకి ప్రీతికలిగేటట్లు బ్రాహ్మణులకై చేయించండి." అతని మాటలుపూర్తి అవుతుండగానే యోధాగ్రగణ్యుడు సహదేవుడు ధర్మరాజుకు 'ఈ వ్యవస్థ సర్వం పూర్తయింది' అని నివేదించాడు.

ప్రధాన ఋత్విజుడు వ్యాసుడు తన శిష్యగణంతో ఋత్విజులతో వచ్చాడు. వారందరు మూర్తిమంతాలైన వేదాలవలె (వేదమూర్తుల్లా) ఉన్నారు. సత్యవతీదేవిపుత్రుడు వ్యాసుడు స్వయంగా బ్రహ్మత్వాన్ని అంగీకరించాడు. ధనంజయగోత్రీయులైన బ్రాహ్మణులు సామగానం, సుసామకోసం నియమింపబడ్డారు. యాజ్ఞవల్క్యుడు ఆ యజ్ఞానికి శ్రేష్ఠతముడైన అధ్వర్యువు. వసువు కుమారుడు పైలుడు ధౌమ్యునితో సహితంగా హోత అయినాడు. వీరి పుత్రులు, శిష్యులు మిగిలిన వేదవేదాంగ నిష్ణాతు లందరూ సప్తహోత్రగులు అయ్యారు. వారందరు పుణ్యాహవాచనం చేసి శాస్త్రోక్తవిధితో ఆ యజ్ఞశాలను పవిత్రం చేసి యజ్ఞానికి అనువుగా చేశారు. ఆ స్థానంలో రాజాజ్ఞానుసారం శిల్పులందరు దేవమందిరాల వంటి మందిరాలను నిర్మించారు. అవి విశాలంగా సుగంధభరితంగా ఉన్నాయి. ధర్మరాజు వెంటనే మంత్రి సహదేవుని పిలిపించి రాజులందరినీ, ఆహ్వానించటానికి అరుదైన దూతలను పంపమని ఆదేశించాడు. రాజు మాటలు విని సహదేవుడు వెంటనే దూతలను పంపాడు. "దూతలారా! దేశాలు తిరిగి అక్కడి రాజులను, బ్రాహ్మణులను, వైశ్యులను, మాననీయులు అయిన శూద్రులను కూడ పిలవండి." ధర్మజుని ఆజ్ఞను అనుసరించి సహదేవుని ఆనతిపై శీఘ్రంగా పోగల దూతలు దేశాలన్నిటినీ తిరిగి బ్రాహ్మణులను, క్షత్రియులను అందరినీ ఆహ్వానించారు. చాలామందిని తమవెంటపెట్టుకు వచ్చారు. తమ సబంధం కలవారిని తీసుకొని రావటంలో ఎవరినీ మరచిపోలేదు. అక్కడకు వచ్చిన బ్రాహ్మణు లందరు కలిసి, సరియైన సమయంలో యుధిష్ఠిరునికి యజ్ఞదీక్ష నిచ్చారు.

యజ్ఞదీక్షను తీసుకొని ధర్మరాజు వేలకొద్దీ బ్రాహ్మణులు వెంటరాగా యజ్ఞశాలను చేరాడు. ఆ సమయంలో నలుగురు సోదరులు, జ్ఞాతులు, మిత్రులు, మంత్రులు, నానాదేశాలనుంచి వచ్చిన ఇతర క్షత్రియులు, మంత్రిగణం అతని వెనుక ఉన్నారు. అప్పుడు నరశ్రేష్ఠుడైన ధర్మరాజు రూపుదాల్చిన ధర్మదేవతవలె ఉన్నాడు. వేరువేరు దేశాలనుండి అనేకులు బ్రాహ్మణులు వచ్చారు. వారందరు అన్నివిద్యల్లో, వేదవేదాంగాల్లో ఆరితేరినవారు. ధర్మజుని ఆజ్ఞానుసారం ఆత్మీయులతో బాటు బ్రాహ్మణుల నివాసానికై వేరువేరు ఇండ్లను నిర్మించారు. అవి అగ్ని, అన్న, పాన, వస్త్రాదులతో నిండి ఉన్నాయి. అన్ని ఋతువులకు అనుకూల వాతావరణాన్ని అక్కడ శిల్పులు కల్పించారు. రాజుచే సత్కరింపబడిన ఆ బ్రాహ్మణులందరు అక్కడ నివసింపసాగారు. వినోదభరితాలైన కథలు, నటనర్తకుల కాలక్షేపాలు అక్కడ ఉన్నాయి. వారు భోజనాలు చేస్తూ ఆనందమగ్నులై మాట్లాడుకోసాగారు. దానితో అక్కడ సంతోషించిన మహాత్ముల కోలాహలం ఎక్కువగా వినబడింది. "వీరికి

ఇవ్వండి. వీరికిభోజనం పెట్టండి" అనే మాటలు అంతటా నిత్యమూ మారుమ్రోగాయి. ధర్మరాజు ఒకలక్షగోవులను, లక్ష పాన్పులను, లక్షబంగారు నాణాలను అంతే సంఖ్యలో అవివాహితలైన యువతులను బ్రాహ్మణులకు దానంగా ఇచ్చాడు. ఈ విధంగా స్వర్గంలో ఇంద్రుడు యజ్ఞం చేసినట్లు భూమిపై అద్వితీయుడైన ధర్మరాజు యజ్ఞం ప్రారంభమైంది. తర్వాత ధర్మరాజు ద్రోణుని, ధృతరాష్ట్రుని, భీష్ముని, విదురుని, కృపుని, దుర్యోధనుని, అతని సోదరులను, ఇంకను తనపై ప్రేమకలవారిని ఆహ్వానించటానికి నకులుని స్వయంగా హస్తినాపురానికి పంపాడు.

34. యుధిష్ఠిరయజ్ఞమున అందరు కలియుట.

నకులుడు హస్తినాపురానికి పోయి ధర్మజుని ఆజ్ఞగా భీష్ముడు, ధృతరాష్ట్రుడు మొదలయిన వారిని ఆహ్వానించాడు. నకులునిచే పిలువబడిన ఆచార్యవర్గమూ, మిగిలిన వారందరూ సంతుష్టులై బ్రాహ్మణులతో సహా హస్తినకు బయలుదేరారు. ధర్మరాజు రాజసూయయాగం చేస్తున్నాడని తెలిసి మిగిలిన యజ్ఞవేత్త లందరు ప్రీతచిత్తులై ఆ యాగప్రదేశానికి చేరారు. ధర్మరాజును, అతని సభను చూడటానికి అన్నిదిక్కుల నుండి క్షత్రియులు, చాలా రకాలైన విలువైన రత్నాలను కానుకలుగా తీసుకువచ్చారు. ధృతరాష్ట్రుడు, భీష్ముడు, బుద్ధిమంతుడు విదురుడు, దుర్యోధనుడు, అతని సోదరులు, గాంధారరాజు సుబలుడు, మహాబలుడు శకుని, అచలుడు, వృషకుడు, రథికులలో శ్రేష్ఠుడు కర్ణుడు, బలవంతుడు శల్యుడు, మహాబలవంతుడు బాహ్లీకుడు, సోమదత్తుడు, కురునందనుడు భూరి, భూరిశ్రవసుడు, శలుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు, సింధురాజు జయద్రథుడు, పుత్రసహితుడైన ద్రుపదుడు, శాల్వుడు, ప్రాగ్జ్యోతిషపురనరేశుడు భగదత్తుడు, అతనితో సముద్రతీరవాసులు, మ్లేచ్ఛజాతీయులు, పర్వతీయులు అయిన రాజులు, బృహద్బలుడు, పౌండ్రకవాసుదేవుడు, వంగరాజు, కళింగనృపతి, ఆకర్షణుడు, కుంతల, మాలవ, ఆంధ్ర, ద్రావిడ, సింహళదేశపురాజులు, కాశ్మీరరాజు, మహాతేజస్వి కుంతిభోజుడు, గౌరవాహనుడు, బాహ్లీకుడు, శూరులైన రాజులు, తన ఇద్దరు కుమారులతో విరాటుడు, మహాబలుడు మావేల్లుడు, నానాజనపద శాసకరాజులు, ఇంకా అనేక రాజులు ఆ యజ్ఞాన్ని చూడటానికి వచ్చారు. మహావీరుడు, యుద్ధగర్వితుడైన శిశుపాలుడు, తనపుత్రునితో ఆ యజ్ఞానికి వచ్చాడు. బలరాముడు, అనిరుద్ధుడు, కంకుడు, సారణుడు, గదుడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు, చారుదేష్ణుడు, ఉల్ముకుడు, శిశిరుడు, అంగావహుడు, ఇతర వృష్ణివంశజు

లందరు యజ్ఞ దర్శనానికై అక్కడికి చేరారు. వీరేకాక ఇంకా మధ్యదేశీ యులైన నరేంద్రులు యుధిష్ఠిరుని యజ్ఞంలో కలిశారు. ధర్మజుని ఆజ్ఞానుసారం నిర్వాహకు లందరు వారి విశ్రాంతికై ఉత్తమభవనాలు, తినటానికి భక్ష్య భోజనసామగ్రి సమకూర్చారు. ఆ ఇండ్లలోపల స్నానాలకు దిగుడుబావులు, అలసట తీరటానికి చెట్లు కల్పించారు. ధర్మపుత్రుడు యుధిష్ఠిరుడు వారందరి స్వాగతసత్కారాల్లో నిమగ్నుడు అయ్యాడు. అతనిచే సమ్మానితులై వారికుద్దేశింపబడిన భవనాల్లో రాజులందరూ నివసించసాగారు. ఆ భవనాల శిఖరాలు కైలాసశిఖరాలవలె ఎత్తుగా, అందంగా ఉన్నాయి. ఎన్నో రకాలైన ద్రవ్యాలతో అలంకరింపబడి ఉన్నాయి. ఆ పవిత్రభవనాలు అన్నివైపుల అందంగా, తెల్లగా, ఎత్తుగా, గోడలచే ఆవరింపబడి ఉన్నాయి. వాటికి బంగారు జాలరులు వ్రేలాడదీశారు. వాటి ప్రాంగణం మణులు పొదిగి అందంగా ఉంది. అనాయాసంగా అధిరోహించటానికి వీలుగా మెట్లు. లోపల చాలావిలువైన పెద్దపెద్ద ఆసనాలు, ఆవశ్యకవస్తువులు ఏర్పాటు చేశారు. ఆ ఇళ్లకు మాలలు కట్టారు. ఆ ప్రదేశాలు అగరుగంధంతో నిండి ఉన్నాయి. ఆ అతిథిభవనాలన్నీ చంద్రునితో, హంసలతో సమానమయిన తెల్లదనం కల్గిఉన్నాయి. ఒకయోజనం దూరం నుండి చూడముచ్చటగా, స్పష్టంగా కన్పిస్తున్నాయి. వాటిలో సంకీర్ణత లేదు. అన్ని గుమ్మాలు సమానంగా ఉన్నాయి. అన్ని ఇళ్లు ప్రత్యేకతలతో కూడి ప్రకాశించాయి. వాటిగోడలు అనేకవిధాలైన గైరికాదిధాతువులచే చిత్రితాలై హిమాలయ శిఖరాలవలె ప్రకాశించసాగాయి. వారందరు విశ్రాంతిని గైకొని పిమ్మట ఆ రాజులందరు చాలాదక్షిణలు ఇస్తూ, సదస్యులతో కూడిన ధర్మజుని కలియవచ్చారు. ఆ సమయంలో రాజులు, బ్రాహ్మణులు, మహర్షులతోనిండిన ఆ యజ్ఞమండపం దేవతలతో నిండిన బ్రహ్మలోకంతో సమానంగా శోభిల్లింది.

35. రాజసూయ యాగవర్ణనము.

భీష్మునికి, ద్రోణాచార్యునికి ఎదురుగా వచ్చి యుధిష్ఠిరుడు వారి పాదాలకు నమస్కరించాడు. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు వివింశతి మొదలైన వారితో 'ఈ యజ్ఞంలో మీరంతా అన్నివిధాలా నన్ను అనుగ్రహించండి' అని అన్నాడు ధర్మరాజు. ఈ నా అధికధనాన్ని అంతటిని నాప్రార్థనచే మీరు మీ ఇష్టానుసారం సత్కర్మలకు వినియోగించండి.' యజ్ఞదీక్షితుడైన ధర్మరాజు ఇలా వారందరికి చెప్పి అందరికీ అర్హమైన అధికారాలను అప్పగించాడు. భక్ష్యభోజ్యాలను చూచి వాటిని సరిగా

పంచటానికి దుఃశాసనుని నియమించాడు. బ్రాహ్మణుల స్వాగతసత్కార బాధ్యతను అశ్వత్థామకు అప్పగించాడు. రాజన్యుల సత్కారానికి సంజయుని నియమించాడు. 'ఈ పనిని చేయి. ఈ పనిని చేయవద్దు' అనే శాసనాధికారాన్ని బుద్ధిమంతు లయిన భీష్మద్రోణుల భుజస్కంధాలపై ఉంచాడు. ఉత్తమబంగారాన్ని, రత్నాలను రక్షించటం, దానం చేయటం అనే పనుల భారాన్ని కృపాచార్యునిపై పెట్టాడు. ఈ విధంగా శ్రేష్ఠపురుషులను వారి వారి అర్హతల ననుసరించి నియోగించాడు. నకులునిచే ఆహ్వానింపబడిన బాహ్లీక, సోమదత్త, ధృతరాష్ట్ర, జయద్రథులకు ఇంటియజమానులవలె ఉండే అధికారం అప్పగించాడు. సర్వధర్మాలూ తెలిసిన విదురునికి ధనవ్యయమనే కార్యాన్ని అప్పగించాడు. దుర్యోధనునికి కానుకలు స్వీకరించటం, వాటిని ఉచితప్రదేశాలకు తరలించటం అనే కార్యాలను ఆదేశించాడు. శ్రీకృష్ణభగవానుడు యుధిష్ఠిరుని ఆజ్ఞానుసారం అందరినీ సంతోషపరచే నెపంతో బ్రాహ్మణుల పాదప్రక్షాళనం చేయసాగాడు. దీనివల్ల ఆయనకు ఉత్తమఫలం లభించింది. ధర్మజుని రాజసూయసభను చూడాలని వచ్చిన రాజులలో ఏ ఒక్కడూ వెయ్యి సువర్ణనాణాల కన్న తక్కువ కానుక తీసుకురాలేదు. ప్రతిరోజు బహుసంఖ్యాకాలైన రత్నాలను ఇచ్చి యుధిష్ఠిరుని ధనం వృద్ధిచేశారు. 'ఏదో విధంగా నాచే ఇవ్వబడిన రత్నాలదానం చేతనే యుధిష్ఠిరుడు యజ్ఞాన్ని పూర్తిగా చేయాలి' అనే గొప్ప ఆలోచనతో రాజులందరూ పోటీపడ్డారు.

ఆ యజ్ఞశాలశిఖరాలు యజ్ఞాన్ని చూడవచ్చిన దేవతల విమానాలను తాకుతున్నాయా అన్నట్లు ఉన్నాయి. జలాశయాలచే నిండి, సైనికులతో నిండిపోయాయి ఆ భవనాలు. ఆ సుందర భవనాలు అన్నీ ఇంద్రాదిలోకపాలకుల విమానాలతో, బ్రాహ్మణుల నివాసస్థానాలతో, సమృద్ధిగల రత్నరాశులతో, మణిచిత్రితాలై విమానాలవంటి శోభలతో మెరిసిపోయాయి. ఆ రాజసూయయాగాన్ని చూడవచ్చిన రాజులతో, హద్దులేని సంపదల సమృద్ధితో మహోత్కృష్టమైన యుధిష్ఠిరుని ఆ సభ మిక్కిలిగా శోభిల్లింది. యుధిష్ఠిరుడు తనసాటిలేని సంపద ద్వారా వరుణునితో పోటీపడుతున్నాడు. అతడు యజ్ఞంలో ఆరు అగ్నులను స్థాపించి, భూరిదక్షిణలనిచ్చి ఆ యాగాన్ని సాగించాడు. ఆ యజ్ఞంలో ప్రజలందరి కోరికలను సమృద్ధిగా తీర్చి యుధిష్ఠిరుడు సంతృప్తి కలిగించాడు. అన్నపానీయాలకూ, తినుబండారాలకూ లోటు లేదు. ఎవ్వరిలోనూ ఆకలిలేదు. రత్నాలకానుకలు విరివిగా సమకూరాయి. మంత్రభాగాల్లో నిపుణులైన మంత్రవేత్తలు చేసిన స్తుతులు, ఆజ్యహోమాలు, తిలలు మొదలయిన పదార్థాలతో ఇచ్చిన ఆహుతులతో దేవతాగణం అంతా సంతృప్తిని పొందింది. దేవతలు ఆహుతులచే

సంతృప్తు లయినట్లు బ్రాహ్మణులు దక్షిణలు, అన్నసామగ్రి, ధనాదులతో సంతృప్తిని పొందారు. ఆ యజ్ఞంలో అన్నివర్ణాల ప్రజలు ఆనందించారు.

36. ధర్మరాజు కృష్ణునకు అర్ఘ్యమిచ్చుట.

తరువాత రాజసూయయాగంలో పట్టాభిషేకం చేయవలసిన రోజున బ్రాహ్మణులు, సత్కారానికి అర్హులైన మహర్షులూ రాజులతో పాటు యజ్ఞశాలలో ప్రవేశించారు. నారదుడు మున్నగు మహాత్ములు రాజర్షులతో పాటు ఆ యజ్ఞశాలలో కూర్చుండి శోభిల్లుతున్నారు. అమితతేజస్సంపన్నులైన దేవతలు, దేవర్షులు కలిసి బ్రహ్మభవనంలో కర్మలమధ్య విరామ సమయంలో మాట్లాడుకొంటున్నారు. చర్చించుకొంటున్నారు. "ఇది ఈవిధంగా చెయ్యాలి. దీన్ని ఈ విధంగా కాదు. ఇది కూడా ఈవిధంగానే, మరొకవిధంగా కాదు" అని అక్కడి వారు చాలామంది తార్కికులు పరస్పరం మాట్లాడుకొంటున్నారు. అక్కడ కొందరు శాస్త్రంలో నిశ్చయింపబడిన హేతువులతో యుక్తిదౌర్బల్యం గల విషయాలను యుక్తప్రాబల్యం గలవానిగ, యుక్తిప్రాబల్యం గల విషయాలను యుక్తిదౌర్బల్యం కలవిగా చేస్తున్నారు. అక్కడ మేధావులు కొందరు ఇతరులు చెప్పిన విషయాన్ని ఆకాశంలో ఉన్న మాంసాన్ని డేగలు చెల్లాచెదరు చేసినట్లుగా ప్రక్కదారి పట్టిస్తున్నారు. చీల్చి చెండాడుతున్నారు. అక్కడ కొందరు ధర్మార్థకుశలులు, మరికొందరు మహానిష్ఠాపరులు, కొందరు సర్వభాష్యవేత్తలలో శ్రేష్ఠులూ ఉన్నారు. వారు అనేక విషయాలు చెపుతూ ఉండగా అందరూ ఆనందిస్తూ ఉన్నారు. నక్షత్రాలతో నిండియున్న విశాలమైన ఆకాశంలా ఆ యజ్ఞశాల వేదసంపన్నులైన దేవతలతో, బ్రాహ్మణులతో, మహర్షులతో ప్రకాశించింది. రాజా! యుధిష్ఠిరు డున్న ఆ శాలయందు శూద్రుడు/వేదవేత్తకానివాడు ఒక్కడు కూడా లేడు. నియమనిష్ఠలు లేనివా డొక్కడూ లేడు. ధీమంతుడు, లక్ష్మీవంతుడూ అయిన ధర్మరాజు యొక్క యజ్ఞనిర్వహణసామర్థ్యాన్ని, సంపదను చూచి నారదుడు ఆనందించాడు.

ఆ నారదమహర్షి అక్కడకు వచ్చిన క్షత్రియ సమూహాన్ని చూచి, ఆలోచనలో పడ్డాడు. అంశావతరణ సందర్భంలో బ్రహ్మభవనంలో పూర్వం జరిగిన వృత్తాంతాన్ని నారదుడు గుర్తుకు తెచ్చుకొన్నాడు. ఈనాటి రాజులసమూహాన్ని ఆనాటి దేవతల సమాగమంగా భావించి, నారదుడు మనస్సులో పుండరీకాక్షుడైన విష్ణువును స్మరించాడు. సర్వవ్యాపకుడు, దేవతా శత్రుసంహారకుడూ అయిన నారాయణుడు తన ప్రతిజ్ఞను పాలిస్తూ సాక్షాత్తుగా క్షత్రవంశంలో జన్మించాడు. పూర్వకాలంలో సర్వప్రాణి సృష్టికర్త అయిన మహావిష్ణువు

దేవతలనుద్దేశించి స్వయంగా **'మీరు భూలోకంలో జన్మించి పరస్పరం కలహించి సంహరించుకొని మరల ఈ లోకాలను పొందగలరు'** అని ఉపదేశించాడు. ఈవిధంగా ప్రాణులను భావించే, శుభకరుడైన భగవంతుడు నారాయణుడు దేవతల కుపదేశించి, తానుకూడా యదుకులంలో జన్మించాడు. నక్షత్రములలో చంద్రుడు ప్రకాశిస్తున్నట్లు, భూమిపై అంధకవృష్ణివంశాలలో, వంశాధారులలో శ్రేష్ఠుడై గొప్పకాంతితో ప్రకాశించాడు. ఇంద్రునితోపాటు దేవత లందరూ ఎవని బాహుబలాన్ని సేవించేవారో అట్టి శత్రుమర్దనుడైన శ్రీహరి మనుష్యునివలె భూమిపై జన్మించాడు. ఆహా! ఎంత ఆశ్చర్యం! స్వయంభువు అయిన మహావిష్ణువు స్వయంగా బలసమన్వితమైన క్షత్రసమూహాన్ని మళ్లీ విచ్ఛిన్నం చేస్తాడు. ఈవిధంగా సర్వజ్ఞుడైన నారదుడు ఆలోచింపసాగాడు. యజ్ఞాలచే ఆరాధనీయుడు, అయిన శ్రీమన్నారాయణుని ధ్యానించి ధర్మవేత్తలలో శ్రేష్ఠుడై, బుద్ధిమంతుడైన ఆ ధర్మరాజు యొక్క మహాయజ్ఞంలో మహాబుద్ధిమంతుడైన దేవర్షి నారదుడు సగౌరవంగా కూర్చున్నాడు. తరువాత భీష్ముడు ధర్మరాజుతో "రాజా! వచ్చిన రాజులను వారికి తగినట్లుగ సత్కరించు" అని పలికాడు.

"యుధిష్ఠిరా! ఆచార్యుడు, ఋత్విక్కు, సంయోక్త, స్నాతకుడు, ప్రియమిత్రుడు, రాజు - ఈ ఆరుగురూ పూజింపదగినవారని చెపుతారు. ఒకసంవత్సరకాలం తర్వాత వస్తేనే పూజింపదగిన వీరు ఎంతో కాలం తర్వాత ఇక్కడకు వచ్చారు. రాజా! వీరిలో ఒక్కొక్కరికి వేరువేరుగ అర్ఘ్యం తీసికొనిరా. వీరిలో శ్రేష్ఠుడైన, సమర్థుడైనవారికి ముందుగా అర్ఘ్యమిమ్ము." యుధిష్ఠిరుడిలా అన్నాడు- "కురునందనా! భీష్మపితామహా! ముందుగా అర్ఘ్యమీయదగినవాడొక్కడూ ఎవరని నీవు భావిస్తున్నావో నాకు చెప్పు." భీష్ముడు తన బుద్ధిచే నిశ్చయించి లోకంలో పూజింపదగినవారిలో కృష్ణుడే మిక్కిలి తగినవాడని భావించాడు. భీష్ముడిలా అన్నాడు - "ఈ రాజులందరిలో తేజోబలపరాక్రమాల చేత కాంతిగోళాల్లో ప్రకాశిస్తున్న సూర్యునివలె, గాలిలేనిచోట వాయువువలె శ్రీకృష్ణునిచే ఈ సదస్సు ఇపుడు భాసిల్లుతోంది. ఆనందిస్తోంది." వెంటనే భీష్మునిచే అనుమతింపబడి, ప్రతాపవంతుడైన సహదేవుడు యథావిధిగా కృష్ణునికోసం ఉత్తమమైన అర్ఘ్యాన్ని తీసికొనివచ్చాడు. కృష్ణుడు దానిని శాస్త్రోక్తమయిన కర్మగా స్వీకరించాడు. ఆ గౌరవం వాసుదేవునికి చేయటం శిశుపాలుడు సహింపలేకపోయాడు. చేదిరాజు, మహాబలవంతుడూ అయిన శిశుపాలుడు భీష్ముని, ధర్మరాజును ఆ సభలో నిందించి, వాసుదేవుని కూడ నిందించాడు.

37. శిశుపాలుడు ధర్మజ శ్రీకృష్ణులను ఉపాలంభించుట.

శిశుపాలుడిలా అన్నాడు - "కౌరవ్యా! మహాత్ములైన భూపాలురిక్కడ ఉండగా వృష్ణివంశీయుడైన శ్రీకృష్ణుడు రాజువలె రాజగౌరవానికి అర్హుడు కాడు. పాండుకుమారా! నీవు స్వార్థంవల్ల పుండరీకాక్షుని పూజించావు. మహాత్ములైన పాండవులకు ఇటువంటి ఆచరణ యుక్తం కాదు. పాండవులారా! మీరు బాలురు. ధర్మం సూక్ష్మమైంది. దాన్ని మీరెరుగరు. ఈ గాంగేయుడు జ్ఞాపకశక్తి నశించిన వృద్ధుడు. సూక్ష్మదృష్టి లోపించినవాడు. భీష్మా! నీవంటి ధర్మాత్ముడు ఎవరికో ప్రియం చేయగోరితే, సత్పురుషులమధ్యలో మిక్కిలి అవమానాన్ని పొందగలడు.

ఈ భూపాలు రందరి మధ్యలో రాజుకాని యదువంశీయుడైన ఈ కృష్ణుడు మీరు పూజించిన విధంగా రాజగౌరవానికి ఎలా అర్హుడౌతాడు ? కురుశ్రేష్ఠా! నీవు కృష్ణుని వృద్ధునిగా భావించినట్లయితే, వసుదేవుడుండగా, కృష్ణుడు వృద్ధుడెలా అవుతాడు ? అలాకాక, వాసుదేవుడు నీకు ప్రియమైతే, నిన్ను అనుసరించే మిత్రుడని నీవు భావిస్తే, అంతకంటె ముఖ్యుడైన ద్రుపదు డుండగా కృష్ణుడెలా పూజార్హుడౌతాడు ? కురునందనా! అలాకాక, కృష్ణుని ఆచార్యునిగా భావించినట్లయితే, ద్రోణాచార్యు డుండగా కృష్ణుని ఎలా అర్చించావు ? కురునందనా! కృష్ణుని ఋత్విజునిగా భావిస్తే వృద్ధుడైన వేదవ్యాసుడుండగా, నీవు కృష్ణుని ఎలా పూజించావు ? రాజా! పురుషపుత్తముడై, స్వచ్ఛందమరణంగల భీష్ముడుండగా నీవు కృష్ణుని ఎలా పూజించావు ? కురునందనా! సర్వశాస్త్ర విశారదుడూ, వీరుడూ అశ్వత్థామ ఉండగా నీవు కృష్ణుని ఎలా పూజించావు ? పురుషశ్రేష్ఠుడూ, రాజేంద్రుడూ అయిన దుర్యోధనుడుండగా, భరతవంశానికి ఆచార్యుడైన కృపుడూ ఉండగా కృష్ణుని ఎలా అర్చించావు ? కింపురుషులకు ఆచార్యుడైన ద్రుముడుండగా కృష్ణుని ఎలా అర్చించావు ? పాండురాజుతో సమానుడై జయింపశక్యం కాని రాజోచితలక్షణాలు గల భీష్ముకు డుండగా; రాజైన రుక్మి, వీరశ్రేష్ఠుడైన ఏకలవ్యుడు, మద్రదేశాధిపుడైన శల్యుడు ఉండగా కృష్ణుని ఎలా అర్చించావు ? భారతా! రాజులందరిలో బలవంతుడు, బ్రాహ్మణ శ్రేష్ఠ యిన పరశురాముని ప్రియశిష్యుడు, తనబలంతో యుద్ధంలో చాలామంది రాజులను జయించిన కర్ణుని అతిక్రమించి, ఈ కృష్ణుని ఎలా అర్చించావు ? కురుశ్రేష్ఠా! మధుసూదనుడయిన శ్రీకృష్ణుడు ఋత్విక్కు కాదు. ఆచార్యుడు కాదు. రాజూ కాదు. కాని నీవు ఏ ప్రియాన్ని కోరి అతనిని పూజించావు? భారతా! అయినా మీకు మధుసూదనుడు పూజింపదగినవాడే అయితే, రాజులను ఇక్కడకు ఆహ్వానించి అవమానించడ మెందుకు? మహాత్ముడైన

యుధిష్ఠిరునికి మేము భయంవల్ల గాని, లోభంవల్ల గాని, సాంత్వనంవల్ల గాని పన్ను చెల్లించటంలేదు. ధర్మప్రవృత్తి కల్గి, పార్థివునిగా పరిపాలన చేయగోరుతున్న ఇతనికి మేము పన్నులను చెల్లిస్తున్నాం. కాని అతడు మమ్మల్ని అలా గౌరవించటం లేదు. ఈ రాజసభలో రాజలక్షణాలే లేని ఈ కృష్ణుని అర్ఘ్యంతో పూజించావు. ఇంతకంటె అవమానం ఇంకేముంటుంది ?

అకారణంగా ధర్మరాజుకు ధర్మాత్ము డనే కీర్తి కలిగింది. కాకుంటే ధర్మచ్యుతు డైన కృష్ణునికి ఇటువంటి రాజార్హమైన గౌరవాన్ని ధర్మాత్ము డెవడు చేస్తాడు ? వృష్ణివంశీయుడై దురాత్ముడగు ఈ కృష్ణుడు మునుపు మహాత్ముడైన జరాసంధుని అన్యాయంగా చంపాడు. ఈ యుధిష్ఠిరుడినుండి ధర్మాత్మత దూరం చేయబడింది. కృష్ణునికి అర్ఘ్యాన్ని ఇవ్వడం ద్వారా తన కార్పణ్యాన్ని చూపెట్టాడు ధర్మరాజు. శిశుపాలుడు కృష్ణునికేసి తిరిగి ఇలా అన్నాడు – "మాధవా! కుంతీకుమారులు భయపడినవారు, కృపణులు, దీనులూను. నీవు ఎటువంటి పూజకు అర్హుడవో నీవైనా వారికి తెలియజెప్పవలసింది. జనార్దనా! లేదా, కృపణులైన వారు తీసుకువచ్చిన (పూజను) గౌరవాన్ని అనర్హుడనైన నీవు మాత్రం ఎలా అంగీకరించావు? నీకు యోగ్యంకాని గౌరవాన్ని నీవు పొంది చాల గొప్పగా భావించుకొంటున్నావు కాబోలు! జనంలేని చోట కుక్క హవిస్సును ఆస్వాదించినట్లుగా ఉంది నీపని. జనార్దనా! నిన్నిలా గౌరవించడం రాజేంద్రులకు ఏమీ అవమానం కాదు. కానీ కురువంశీయులైన పాండవులు నిన్నే స్పష్టంగా నిందిస్తున్నారు. మధుసూదనా! నపుంసకుడికి వివాహం చేయడం ఎలాంటిదో, గ్రుడ్డివాడికి రూపాన్ని చూపడం ఎటువంటిదో, రాజుకాని వాడికి రాజోచితమైన పూజ చేయడం కూడ అలాంటిదే. రాజైన యుధిష్ఠిరు డెటువంటివాడో చూశాను. భీష్ముడు ఎటువంటివాడో కూడ చూశాను. ఈ వాసుదేవు డెటువంటివాడో కూడా చూశాను. వాస్తవానికి వీరంతా ఇటువంటివారే." అని పలికి శిశుపాలుడు ఉన్నతాసనాలనుండి కొంతమందిరాజులతో పాటు లేచి సభాభవనం నుండి బయటకు వెళ్ళిపోయాడు.

38. భీష్ముడు కృష్ణుని చరిత్రమును స్తుతించుట.

వెంటనే యుధిష్ఠిరమహారాజు శిశుపాలుని సమీపించాడు. అనునయపూర్వకంగా, మధురంగా అతనితో ఇలా అన్నాడు. "మహీపాలా! నీవు చెప్పిన మాటలవిధానం యుక్తంగా లేదు. అధర్మం కూడాను. రాజా! పరుషంగా మాట్లాడటం వ్యర్థం. శాంతనుడైన భీష్ముడు ఉత్కృష్టమైన ధర్మాన్ని తెలియనివాడు కాడు. నీవు అతనిని గురించి వేరొకవిధంగా

భావించి, అవమానింపరాదు. నీకంటె పెద్దవారైన రాజులు చాలమంది ఇక్కడున్నారు. చూడు. వారంతా కృష్ణుని గౌరవించడాన్ని సహించారు. అలాగే నీవు కూడా సహించడం యుక్తం. చేదిరాజా! భీష్ముడు కృష్ణుని యథార్థతత్త్వాన్ని బాగా తెలిసినవాడు. కృష్ణుని తత్త్వాన్ని భీష్ముడు తెలిసికొన్నవిధంగా నీవు తెలిసికొనలేదు."

భీష్ముడిలా అన్నాడు - "ధర్మరాజా! లోకంలో అందరికంటె గొప్పవాడైన కృష్ణుని అర్చించడాన్ని అంగీకరించని ఈ శిశుపాలుడు అనునయానికీ, సాంత్వనానికీ యోగ్యుడు కాడు. యుద్ధంలో ఒకరాజు వేరొకరాజును జయించిన తరువాత తన అధీనంలో ఉన్న శత్రువును విడిచిపెట్టేరాజు ఆ శత్రువుకు గురువు అవుతాడు. ఈ క్షత్రియ సమూహంలో దేవకీనందనుడైన కృష్ణుని పరాక్రమం చేత యుద్ధంలో జయింపబడనివాడు ఒక్కడూ ఉండడు. ఈ అచ్యుతుడు కేవలం మనకు మాత్రమే అర్చింపదగినవాడు కాదు. ఈ మహాభుజుడు ఈ మూడు లోకాలకూ అర్చనీయుడే. యుద్ధంలో శ్రీకృష్ణుడు చాలామంది క్షత్రియశ్రేష్ఠులను జయించాడు. ఈ ప్రపంచమంతా వృష్ణివంశీయుడైన కృష్ణుని యందు పూర్తిగా ప్రతిష్ఠితమై ఉంది. అందువల్ల వయోవృద్ధులున్నప్పటికీ శ్రీకృష్ణునే ముందుగా పూజిస్తాం. ఇతరులను కాదు. నీవు ఈ విధంగా మాట్లాడతగదు. నీకిటువంటి బుద్ధి ఉండకూడదు. రాజా! చాలామంది జ్ఞానవృద్ధులను నేను సేవించాను. ఇక్కడకు వచ్చిన ఆపెద్దలు చెప్పగా గుణవంతుడైన కృష్ణుని సత్పురుషసమ్మతాలైన గుణాలను నేను విన్నాను. పుట్టిననాటి నుండి ఇతడు చేసిన పనులను ప్రజలు పలుమార్లు చెప్పగా ఎన్నో సార్లు నేను విన్నాను. చేదిరాజా! మేము శ్రీకృష్ణుని కామంవల్ల గాని, బంధుత్వాన్ని పురస్కరించుకొని కాని, చేసిన ఉపకారాన్ని దృష్టిలో పెట్టుకొని కాని పూజించటం లేదు. అతడు ఈ భూలోకంలో ప్రాణులన్నింటికి సుఖాన్ని కలిగించేవాడు. సత్పురుషులచే పూజింపబడిన వాడాను. అందువల్లే కృష్ణుని పూజించాం. ఇతని కీర్తిని, శౌర్యాన్ని, విజయాన్ని తెలిసికొని ఇతనిని పూజిస్తున్నాం. ఇక్కడ మేము పరీక్షించని చిన్నబాలుడు కూడా లేడు. వయో(గుణ)వృద్ధులను కాదని కృష్ణుడు మిక్కిలి పూజింపదగినవాడుగా గ్రహించాం. బ్రాహ్మణులలో జ్ఞానవృద్ధుడు, క్షత్రియులలో బలాధికుడు పూజింపదగినవారు కదా! వైశ్యులలో ధనధాన్యాలు కలవాడు, శూద్రులలో జన్మవల్ల పెద్దవాడూ, పూజింపదగినవాడు. గోవిందునియందు పూజ్యత విషయంలో హేతువులైన విజ్ఞాన బలాలు రెండూ ఉన్నాయి. వేదవేదాంగవిజ్ఞానం, అధికబలమూ రెండూ ఇతనిలో ఉన్నాయి. ఈ మానవలోకంలో కృష్ణునికంటె విశిష్టుడు వేరొకడు ఎవడు ఉన్నాడు ?

దానం, సామర్థ్యం, శాస్త్రవిజ్ఞానం, శౌర్యం, లజ్జ, కీర్తి, ఉత్తమబుద్ధి, వినయం, సంపద, ధైర్యం, సంతోషం, బలం అనే ఈ గుణాలన్నీ కృష్ణునిలో నిత్యమూ ఉంటాయి. సకలగుణ సంపన్నుడు, తండ్రి, గురుడు, పూజనీయుడు, అన్నివిధాలా పూజింపదగినవాడు అయిన శ్రీకృష్ణభగవానుని పూజించాం. అందువల్ల ఈ రాజులంతా దీన్ని సహించాలి. ఋత్విజుడు, గురువు,ఆచార్యుడు, స్నాతకుడు, రాజు మాకు ప్రియుడు, మిత్రుడు అన్నీ కూడ ఆ శ్రీకృష్ణుడే. అందువల్ల అతనిని పూజించాం. ఈలోకాలన్నింటి ఉత్పత్తి, ప్రళయాలు ఆ కృష్ణుని యందే ఉన్నాయి. చరాచరాలతో నిండి ఉన్న ఈ విశ్వం ఆ కృష్ణుని కొరకే ఉంది. ఈ కృష్ణుడు అవ్యక్త ప్రకృతి, సనాతనుడైన కర్త, సర్వప్రాణులకంటె ఉత్కృష్టుడు. అందువల్ల అచ్యుతుడు మిక్కిలి పూజింపదగినవాడు. బుద్ధి, మనస్సు, మహత్తు, వాయువు, తేజస్సు, నీరు, ఆకాశం, భూమి; జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజ్జములనే నాలుగువిధాలైన ప్రాణులు అన్నీ కృష్ణునియందు ప్రతిష్ఠితమై ఉన్నాయి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, దిక్కులు, విదిక్కులు, అన్నీ కృష్ణునియందే ప్రతిష్ఠితమై ఉన్నాయి. వేదాలలో అగ్నిహోత్రం ప్రధానం. ఛందస్సులలో గాయత్రి ముఖ్యం. మనుష్యులలో రాజు శ్రేష్ఠుడు. జలాశయాలలో సముద్రం శ్రేష్ఠం. నక్షత్రాలలో చంద్రుడు ముఖ్యుడు. తేజస్సులలో సూర్యుడు గొప్పవాడు. పర్వతాలలో మేరువు శ్రేష్ఠం. పక్షులలో గరుడుడు శ్రేష్ఠుడు. అదే విధంగా అన్నివైపులకు వ్యాపించిన దేవలోకంతో సహా అన్ని లోకాలలో శ్రీకృష్ణుడు శ్రేష్ఠుడు."

(ఆ తరువాత సమయోచితమైన భీష్ముని మాటలు విని బుద్ధిమంతుడైన యుధిష్ఠిరుడు భీష్మునితో ఇలా అన్నాడు. "పితామహా! ఈ శ్రీకృష్ణభగవానుని చరిత్ర సంపూర్ణంగా విస్తరంగా వినాలనుకొంటున్నాను. దయతో చెప్పండి. శ్రీకృష్ణుని అవతారాలనుగురించి, కాలక్రమంలో ఆయన చేసిన పనులగురించి, ఆయన స్వభావాన్ని గురించి వివరించి చెప్పండి." యుధిష్ఠిరు డా విధంగా ప్రార్థిస్తే, భీష్ముడు ఆ రాజులందరి సమూహంలో దేవేంద్రునిలా ప్రకాశిస్తున్న ఆ శ్రీకృష్ణభగవానుని ఎదురుగా యుధిష్ఠిరునితో శ్రీకృష్ణుని చేష్టలను వివరించాడు. అవి అలౌకికాలు, ఇతరులకు అసాధ్యాలు. ధర్మరాజు సభలో ఉన్న రాజులంతా వింటూండగా బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన భీష్ముడు శ్రీకృష్ణుని గురించి ఈవిధంగా సాంత్వనవచనాలతో శత్రుమర్దనుడైన శిశుపాలుని ఊరడించాడు. మళ్లీ కురుశ్రేష్ఠుడైన ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"రాజా! యుధిష్ఠిరా! పురుషోత్తముడైన శ్రీకృష్ణుని యొక్క భూతవర్తమాన కర్మల రీతి మిక్కిలి గహనమైంది. దానిని చెపుతున్నాను. వినుు. అవ్యక్తమైన పరమాత్మతత్త్వమే, వ్యక్తరూపంలో ఉన్న ఈ శ్రీకృష్ణభగవానుడు. ఇతడే పురాతనకాలంలో నారాయణుడు. ఇతడే స్వయంభువు. ఇతడే సర్వలోకపితామహుడు. అవ్యక్తుడైన ఈ సనాతన పరమాత్మయే సహస్రశీర్షుడైన పురుషుడు. ఇతడే

సహస్రాక్షుడు, సహస్రముఖుడు, సహస్రచరణుడు, సహస్రబాహువు, సహస్రరూపుడు, సహస్రనాముడు. ఇతడే సర్వవ్యాపి, పరమేశ్వరుడు. సహస్ర కిరీటాలు కలవాడు. అనేక రూపాలు కలవాడు, గొప్ప తేజస్సు కలవాడు, అనేక వర్ణాలు కలవాడు. సమస్తదేవతలకు ఆదికారణమైనవాడు, అవ్యక్త ప్రకృతి కంటె ఉన్నతుడు అయిన పరమేశ్వరుడు ఇతడే. ఆ సర్వవ్యాపకుడైన నారాయణుడు ముమ్మొదుగా నీటిని సృష్టించాడు. తరువాత ఆ నీటిలో స్వయంగా బ్రహ్మను సృష్టించాడు. చతుర్ముఖుడైన ఆ బ్రహ్మ స్వయంగా ఈ సర్వలోకాలనూ సృష్టించాడు. పూర్వం సృష్టికి మొదటికాలంలో ఈవిధంగా ఈ సమస్తలోకాల సృష్టి జరిగింది. మరల ప్రళయం జరిగినపుడు ఈ స్థావరజంగమాలు, బ్రహ్మోదులు, చరాచరలోకాలు మూలతత్త్వంలో లయమైపోయాయి. ఈవిధంగా సమస్త భూతాలూ ప్రళయకాలంలో మూలప్రకృతిలో లయం కాగా, సర్వాత్మస్వరూపుడైన నారాయణు డొక్కడే సర్వవ్యాపకుడై నిలచి ఉన్నాడు.

ఆ నారాయణుని సర్వావయవాలే సర్వదేవతలు. అతని శిరస్సు స్వర్గం. నాభి ఆకాశం. పాదాలు భూమి. ఆ నారాయణుని నాసిక అశ్వనీదేవతలు. కన్నులు సూర్యచంద్రులు. ఆ మహాత్ముని ముఖం ఇంద్రాగ్నులు. తక్కిన సర్వదైవతాలు ఆ మహాత్ముని అవయవాలు. మణులలో దారం వ్యాపించి ఉన్నట్లుగా, ఆ శ్రీహరి అంతటా వ్యాపించి ఉన్నాడు. సర్వభూతాలూ ప్రళయంలో లయంకాగా, అంతటా చీకటి వ్యాపించి ఉంది. దాన్నిచూసి సర్వజ్ఞుడు, మహాయోగి అయిన నారాయణపరమాత్మ బ్రహ్మభూతుడై తన్ను తానే బ్రహ్మగా సృష్టించుకొన్నాడు. సర్వభూతాలకు అధ్యక్షుడు. అన్నింటికి మూలకారణం, అచ్యుతుడూ అయిన ఆ బ్రహ్మస్వరూపంలో ఉన్న నారాయణుడు సనత్కుమారుని, రుద్రుని, మనువును, తపోధనులను, ఈ సమస్తలోకాలను, ప్రజలను సృష్టించాడు. తగినసమయంలో మన్వాదులను సృష్టించాడు. మహాత్ములగు వారివలన శాశ్వతమయిన సనాతన బ్రహ్మం నానారూపాలను పొందింది. అనేకకోట్ల కల్పాంతాలు గడిచాయి. అనేకకోట్ల భూతప్రళయాలు గడిచాయి. ఈ జగత్తంతా విష్ణుమయం. వేలకొలదీ మన్వంతరాలు, యుగాలు, కల్పాంతాలు, భూతప్రళయాలు నిరంతరం చక్రంలా ప్రవర్తిస్తుంటాయి.

శ్రీమన్నారాయణుడు సర్వవ్యాపకుడై లోకహితం కోసం చతుర్ముఖబ్రహ్మను సృష్టించి, తాను క్షీరసముద్రంపై నివసిస్తాడు. ఆ బ్రహ్మ సర్వదేవతలకు, లోకానికి పితామహుడు. అందువల్ల ఆ నారాయణుడు అందరికి ప్రపితామహుడు. అవ్యక్తుడు, వ్యక్తరూపంగలవాడూ, సృష్టిప్రళయాలలో నిత్యంగా ఉండేవాడు, సర్వవ్యాపకుడు అయిన నారాయణుడు ఈ జగత్తునంతా రచించాడు. యుధిష్ఠిరా! ఇతడు నారాయణునిగా ఉంటూనే బ్రహ్మను, సూర్యచంద్రులను, ధర్మాన్ని స్వయంగా సృష్టించాడు. సర్వప్రాణులకు అంతరాత్మ అయిన నారాయణుడు కార్యవశాన అనేకరూపాల్లో ప్రాదుర్భవించాడు. దేవగణాలతో కూడిన ఆ దివ్యమైన ప్రాదుర్భావాలను అవతారాలను చెప్తాను విను.

భగవంతుడైన శ్రీహరి సహస్రయుగాలు నిద్రించి, యుగసహస్రం పూర్తయిన తర్వాత పరమేష్ఠి బ్రహ్మ, కపిలుడు, దేవగణాలు, సప్తర్షులు, శంకరుడు అనేవారిని సృష్టించాడు. ఇదేవిధంగా

సనత్కుమారుని, మనువును, ప్రజాపతిని, సృష్టించాడు. పురాతనకాలంలో అగ్నితో సమానమైన తేజస్సుగల నారాయణుడు దేవాదులను సృష్టించాడు. ప్రళయకాలంలో చరాచరభూతప్రపంచమంతా లయమయింది. దేవతలు, రాక్షసులు, మనుష్యులు, నాగులు, అసురులు నశించారు. ఆ సమయంలో మధుకైటభులనే సోదరులైన రాక్షసు లిరువురు సాగరమధ్యంలో యుద్ధానికి సిద్ధపడ్డారు. వారు కోరినవరాలిచ్చి, వారిని నారాయణుడు సంహరించాడు. పూర్వకాలంలో, మహాత్ముడైన విష్ణువు చెవులమలినాల నుండి పుట్టినవారు ఇద్దరు, రాక్షసులు. ఇద్దరూ భూమిని బంధించి మట్టితో ఆకృతిని పొందారు. పర్వతరాజైన హిమవంతునితో సమానంగా ఉన్న వారు ఇద్దరూ సముద్రంలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో బ్రహ్మప్రేరణతో వాయువు వారిలో ప్రవేశించింది. వారిరువురూ స్వర్గాన్ని కప్పివేసి, ఇంకావృద్ధి చెందసాగారు. వాయుదేవుడే ప్రాణంగా గలవారిని చూసి, బ్రహ్మ మెల్లగా వారిని స్పృశించాడు. వారిలో ఒకరిని మృదువైన వానిగా, వేరొకరిని కఠినమైనవానిగా స్పర్శవల్ల గుర్తించి, జలోద్భవుడైన ఆ బ్రహ్మ వారికి పేర్లు పెట్టాడు. వారిలో మృదువుగా ఉన్నవాడు మధువు అనీ, కఠినంగా ఉన్నవాడు కైటభుడనీ పేరు పెట్టాడు. మిక్కిలి బలగర్వితులై వారు ఇద్దరూ సంచరించసాగారు.

రాజా! వారుముందుగా స్వర్గలోకంచేరి, ఆలోకాన్నంతా కప్పివేసి, సంచరింపసాగారు. ఆ సమయంలో లోకమంతా జలమయంగా ఉంది. యుద్ధకాముకులైన ఆ ఇద్దరూ నిర్భయంగా తిరగసాగారు. వారిని చూసి లోకపితామహుడైన బ్రహ్మ ఆ ఏకార్ణవజలరాశిలో అంతర్ధానమయ్యాడు. అతడు పద్మనాభుని నాభిదేశంనుండి పుట్టిన పద్మంలో నివసించాడు. ఆ పద్మం స్వయంగా పుట్టిన పంకజం. పంకజమేకాని పంకం నుండి పుట్టింది కాదు. నిర్మల మయింది. లోకపితామహుడైన బ్రహ్మ తన నివాసానికై దాన్ని పూజించాడు. ఆ నారాయణ చతుర్ముఖు లిరువురూ జలగర్భంలో అనేక సహస్రసంవత్సరాలు శయనించి చలించకుండా ఉన్నారు. ఆపై చాలాకాలం తర్వాత ఆ మధుకైటభులిద్దరూ బ్రహ్మ ఉన్నచోటుకు వచ్చారు. వారిద్దరినీ చూసి కోపంతో ఎర్రబడ్డ కళ్లతో మహాతేజస్సు గల పద్మనాభుడు శయనంమీది నుండి లేచాడు. అపుడు వారిరువురికి, ఆ నారాయణునికి మధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. ముల్లోకాలూ జలప్రళయంలో ఏకార్ణవంకాగా, వేలసంవత్సరాలు నారాయణునికి ఆ మధుకైటభులకూ ఘోరయుద్ధం జరిగింది. అయినా ఆ రాక్షసులిద్దరికి శ్రమ కలుగలేదు. యుద్ధకండూతితో ఉన్న ఆ రాక్షసులిద్దరూ చాలాకాలం తర్వాత మనస్సంతుష్టి పొంది సర్వవ్యాపకుడైన నారాయణునితో ఇలా అన్నారు - "నీ యుద్ధంతో మేము ఆనందించాం. నీవు ప్రశంసించదగినవాడవు. మాకు మృత్యుస్వరూపుడవు. నీటిలో మునగకుండా ఉన్నభూమిపై మమ్మల్ని సంహరించు. సురశ్రేష్ఠా! నీచే చంపబడి నీకే పుత్రులుగా జన్మిస్తాం. యుద్ధంలో మమ్మల్ని జయించిన వారికే మేము పుత్రులుగా పుట్టవలసి ఉంది." వారి మాటను విన్న నారాయణుడు వారిద్దరిని పట్టి, చేతులతో హింసించి, తన తొడలపై పెట్టుకొని ఆ మధుకైటభులను సంహరించాడు. మరణించి ఆ రాక్షసు లిద్దరి శరీరాలూ నీటిలో మునిగి ఒకటయ్యాయి. నీటి తరంగాల తాకిడికి వారి శరీరాల నుండి కొవ్వు వెలువడింది. ఆ కొవ్వు అంతా నీటిలో వ్యాపించింది. క్రమంగా వారు అంతర్ధానమయ్యారు. ఆ రాక్షసుల కొవ్వు భూమినంతా కప్పివేసింది. అప్పటి నుంచే

భూమికి మేదినీ అనే పేరు కల్గింది. కౌంతేయా! ఆ పద్మనాభుని ప్రభావం వల్ల ఈ మేదిని మనుష్యులకు శాశ్వతమైన ఆధారమైంది.

శ్రీకృష్ణభగవానుని వేలవేల అవతారాలు గడిచాయి. యథాశక్తిగా వాటిని గురించి చెపుతాను. విను. పూర్వకాలంలో కమలనాభుడు సాగరజలంలో నిద్రిస్తూండగా పుష్కరం (పద్మం)లో దేవతలూ, ఋషిగణాలూ సంభవించారు. ఇది పౌష్కరికమనే అవతారంగా చెప్పబడుతోంది. వేదశ్రుతి ప్రమాణంగా పురాతనమైంది అని చెప్పబడింది. మహాత్ముడైన శ్రీహరి వరాహావతారం వైదిక శ్రుతి ప్రమాణం కలదే. అపుడు శ్రీమహావిష్ణువు వరాహరూపాన్ని ధరించి పర్వతవనకాననాలతో ఉన్న ఈ భూమిని నీటినుండి పైకి తీశాడు. ఆ వరాహానికి నాలుగువేదాలు నాలుగుపాదాలు. యజ్ఞసంబంధమైన యూపం కోర, క్రతువు దంతం. యజ్ఞంలోని అగ్నివేదిక ముఖం. అగ్నియే నాలుక. దర్భలు రోమాలు. బ్రహ్మయే శిరస్సు. ఆతడు మహాతపస్వి. అహోరాత్రాలు నేత్రాలు. వేదాంగాలు దాని శ్రుతిముఖానికి దివ్య భూషణాలు. ఆజ్యమే ముక్కు. హోమోపకరణమైన స్రువం తుండం. సామమే దానినుండి వెలువడే గొప్పధ్వని. ధర్మపత్నీలు దాని స్వరూపం. కర్మ విక్రమాలచే కూడినది. ప్రాయశ్చిత్తమే గోళ్ళు. ధైర్యం కలదది. పశువు(జానువు) మోకాలు. గొప్ప ధర్మరూపమైన వృషభమే దాని విగ్రహం. ఉద్గాతకు సంబంధించిన హోమమే దానికి గుర్తు. అది ఫలమూ, బీజమూ కల మహావృక్షం. బయటా లోపలా వ్యాపించిన ఆత్మ కలది. మంత్రాలు అస్థికల రూపంలో వికృతిని పొందింది. చూడటానికి సౌమ్యస్వరూపం కలిగింది. అతడు యజ్ఞవేది స్కంధంగా గలవాడు, హవిస్సు గంధంతో ఉన్నవాడు, హవ్యం, కవ్యం మున్నగువాని వేగం కలవాడు, యజమానవంశం శరీరంగా కలవాడు, తేజస్సుకలవాడు, అనేకవిధాలైన దీక్షలతో వ్యాపించినవాడు. దక్షిణ (దయ) హృదయ మందున్నవాడు, యోగి, మహాశాస్త్రస్వరూపుడు, ఉపాకర్మ ఓష్ఠంగా కలవాడు, ప్రవర్గ్యకర్మ అతనికి రత్నాల ఆభరణం. ఈవిధంగా యజ్ఞవరాహరూపుడై సనాతనుడై విష్ణువు ఛాయాపత్నియే సహాయంగా కలిగి, మణిమయపర్వత శిఖరంలా ఉన్నతుడై, సముద్రపర్యంతం వ్యాపించి ఉన్న, పర్వత వనకాననాలతో కూడి ఉన్న ఏకార్ణవజలంలో మునిగిపోతున్న తనదేవి అయిన భూమిని మార్కండేయమహర్షి చూస్తూండగా తన కోరతో పైకెత్తాడు. లోకాలకు హితంచేకూర్చే కోరికతో తనకోరతో భూమిని నీటినుండి ఉద్ధరించిన సర్వవ్యాపకుడూ, సహస్రశీర్షుడూ అయిన శ్రీ మహావిష్ణువు ఈ జగత్తును నిర్మించాడు. ఈవిధంగా భూతభవిష్యద్వర్తమాన స్వరూపుడై యజ్ఞవరాహరూపుడైన విష్ణువు సముద్రజలం నుండి భూదేవిని ఉద్ధరించి, దానవులను సంహరించాడు.

ఈవిధంగా వరాహావతారం జరిగింది. ఇక నారసింహావతారం గురించి విను. అపుడు శ్రీమహావిష్ణువు సింహరూపంతో హిరణ్యకశిపుని సంహరించాడు. రాజా! దేవతలకు శత్రువు, బలగర్వితుడు, ముల్లోకాలకు కంటకుడు అయిన హిరణ్యకశిపు డనే రాక్షసరాజు ఉండేవాడు. దైత్యులకు ఆదిపురుషుడు, వీర్యవంతుడు, ధైర్యంకలవాడు, బలవంతుడు అయిన అతడు వనంలో ప్రవేశించి గొప్ప తపస్సు చేశాడు. అతడు జప – ఉపవాసాలచేత పదకొండువేల ఐదువందల సంవత్సరాలు తపస్సు చేసి, మౌనవ్రతుడై స్థాణువులా నిశ్చలంగా దృఢంగా అయ్యాడు. శమదమాలతో, బ్రహ్మచర్యంతో నియమపూర్వకమైన అతని తపస్సుచేత

బ్రహ్మ సంతుష్టాంతరంగు డయ్యాడు, సంతోషించాడు. భగవంతుడైన స్వయంభువు హంసలు కూర్చబడి సూర్యునిలా ప్రకాశించే విమానం మీద స్వయంగా వచ్చాడు. అతనితోపాటుగా ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, మరుత్తులు, దేవగణాలు, రుద్రులు, విశ్వేదేవులు, యక్షరాక్షస కిన్నరులు, దిశలు, విదిశలు, నదులు, సాగరాలు, నక్షత్రాలు, ముహూర్తాలు, ఖేచరులు, గ్రహాలు, దేవర్షులు, తపస్సులు, సిద్ధులు, సప్తర్షులు, రాజర్షులు, పుణ్యాత్ములు, గంధర్వులు, అప్సరోగణాలు కూడా వచ్చారు. సర్వదేవతలతో కూడి, బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, చరాచరాలకు గురువూ, శ్రీమంతుడూ అయిన బ్రహ్మ ఆ దైత్యుని సమీపించి ఇలా అన్నాడు. బ్రహ్మ ఇలా అన్నాడు - 'సుపుత్రా! భక్తుడవైన నీ తపస్సుచేత సంతుష్టుడ నయ్యాను. మంగళకరమైన వరాన్ని కోరుకో. యథేచ్ఛగా నీకోరికను పొందగలవు.'

హిరణ్యకశిపుడిలా అన్నాడు - 'దేవసత్తమా! దేవాసుర గంధర్వులుగాని, యక్షోరగరాక్షసులు కాని, మనుష్యులుగాని, పిశాచాలు గాని నన్ను చంపరాదు. లోకపితామహా! క్రుద్ధులైన ఋషులు తపోయుక్తులై శాపాల చేత నన్ను శపించరాదు. ఇట్టివరాన్ని నేను కోరుతున్నాను. శస్త్రంచేత గాని, అస్త్రంచేత గాని, పర్వతంచేత గాని, వృక్షంచేత గాని, ఎండినదానిచే గాని, తడిదానిచే గాని, ఇతరమైన దేనిచేత గాని నావధ జరుగరాదు. పితామహా! ఆకాశమందు గాని, భూమిపై గాని, రాత్రియందు గాని, పగటియందు గాని, లోపల గాని బయట గాని నావధ జరుగరాదు. పశువులచేత గాని, మృగాలచేత గాని, పక్షులచే గాని, సర్పాలచే గాని నావధ జరుగరాదు. దేవదేవా! నీవిచ్చేటట్లయితే ఈ వరాలను నేను కోరుకొంటున్నాను.' అపుడు బ్రహ్మ ఇలా అన్నాడు - 'నాయనా! అద్భుతాలై, దివ్యాలైన ఈ వరాలను నీకిస్తున్నాను. నీవన్ని కోరికలను పొందుతావు. సందేహం లేదు.' ఇలా చెప్పి భగవానుడైన బ్రహ్మ ఆకాశమార్గంలో వెళ్ళి. బ్రహ్మలోకంలో బ్రహ్మర్షిగణాలచే సేవింపబడుతూ విరాజిల్లుతున్నాడు. అనంతరం దేవతలు, నాగులు, గంధర్వులు, మునులు ఈవరప్రదానం గురించి విని బ్రహ్మదగ్గరకు వచ్చారు. దేవతలిలా అన్నారు - 'పూజ్యుడా! ఈ వరంచేత ఆ అసురుడు మమ్ము బాధిస్తాడు. అందువల్ల అనుగ్రహించు. అతని వధను గురించి ఆలోచించు. సర్వభూతాలకు మూలకారణం నీవే. స్వయంభువువు. విశ్వవ్యాపకుడవు. హవ్యకవ్యాల స్రష్టవు. అవ్యక్తప్రకృతివి. స్థిరుడవు. లోకహితమైన మాటను విని ప్రజాపతి బ్రహ్మదేవుడు సర్వదేవగణాలను ఉద్దేశించి ఇలా అన్నాడు. 'అతడు చేసిన తపస్సుకు తగిన ఫలితాన్ని అతడు తప్పక పొందాలి. ఆ తపఃఫలం పూర్తయ్యాక భగవంతుడైన కృష్ణుడు అతనిని వధిస్తాడు.' బ్రహ్మ చెప్పిన అతనివధను గురించి విన్న దేవతలందరూ ఆనందంతో తమతమ దివ్యస్థానాలకు వెళ్లారు.

హిరణ్యకశిపుడు వరదానంతో గర్వితుడై జనులందరినీ బాధపెట్టాడు. రాక్షససంఘాలతో కలసి అతడు రాజ్యపాలన చేశాడు. సప్తద్వీపాలను, లోకాలను, లోకాంతరాలను బలంవల్ల తన వశం చేసికొన్నాడు. ముల్లోకాలలో ఉన్న దేవతలను ఓడించి, ఆ మహాసురుడు దివ్యలోకాలను, దివ్యభోగాలను అనుభవించాడు. ముల్లోకాలను తన వశంచేసికొని స్వర్గంలో నివసించాడు. వరగర్వం వల్ల ఉన్మత్తుడై ఆ రాక్షసుడు దేవలోకంలో నివసించాడు. సమస్తలోకాలను జయించిన ఆ హిరణ్యకశివుడు 'నేనే

మహేంద్రుణ్ణి, చంద్రుణ్ణి, అగ్నిని, సూర్యుణ్ణి, వాయువును; జలం, అంతరిక్షం, నక్షత్రాలు, పదిదిక్కులు, కామక్రోధాలు, వరుణుడు, వసువులు, అర్యమ, కుబేరుడు, ధనాధ్యక్షుడు, యక్షుడు, కింపురుషాధిపుడు అన్నీ నేనే'. అని తన బలంవల్ల చాటించుకొన్నాడు. వారి వారి స్థానాలను అతడు ఆక్రమించి, వారిపనులన్నీ తానే చేశాడు. దేవర్షిసత్తముల యజ్ఞాలతో పొందదగిన స్థానాలను అతడే ఆక్రమించాడు. నరకంలో ఉన్నవాళ్లందరినీ తీసికొనివచ్చి స్వర్గస్థులను చేశాడు. బలవంతుడైన ఆ రాక్షసరాజు ఇటువంటి పనులన్నీ చేసి, ఆశ్రమాల్లో నియమనిష్ఠలతో సత్యధర్మపరాయణులై, జితేంద్రియులై, మహానుభావులై ఉన్న మునులను అవమానించాడు. రాక్షసులను యజ్ఞహవిస్సులను పొందే వారిగా చేశాడు. దేవతలకు యజ్ఞసంబంధం లేకుండా చేశాడు. సురలు ఎక్కడకు వెళితే అక్కడకు అతడూ వెళ్లాడు. దేవతల స్థానాలను లాక్కొని తాను రాజ్యపాలన చేశాడు. ఈవిధంగా ఐదుకోట్ల అరవైలక్షల అరవై వేల సంవత్సరాలు దురాత్ముడైన ఆ రాక్షసరాజు భోగైశ్వర్యాలను అనుభవించాడు. బలవంతుడైన ఆ రాక్షసరాజువల్ల చాలా బాధలు పడి, దేవతలంతా ఇంద్రుని ముందుపెట్టుకొని బ్రహ్మలోకం వెళ్ళి, పితామహుని దగ్గర దుఃఖితులై చేతులు జోడించి ఇలా అన్నారు.

"పూజ్యుడా! దైత్యుడైన హిరణ్యకశిపుని వల్ల రాత్రింబవళ్లు ఘోరమైన భయం కలుగుతోంది. ఇక్కడకు వచ్చిన మమ్ము నీవు రక్షించు. భగవంతుడా! సమస్తభూతాలకు మూలకారకుడవు, స్వయంభువువు, సర్వవ్యాపకుడవు, హవ్యకవ్యాల స్రష్టవు నీవే. నీవే అవ్యక్త ప్రకృతివి. నీవే స్థిరుడవు." వెంటనే బ్రహ్మ ఇలా అన్నాడు - "వినండి. ఇంతటి విపత్తును నేను కూడ తెలియలేకపోయాను. పురుషోత్తముడు, విశ్వరూపుడు, మహాతేజస్వి, అవ్యక్తుడు, సమస్తభూతాలకు అచింత్యుడు, సర్వవ్యాపకుడు, అవ్యయుడు అయిన శ్రీమన్నారాయణుడే ఎరుగును. మీకు, నాకు కూడ కష్టాలలో ఆ నారాయణుడే గొప్ప దిక్కు. నారాయణుడు అవ్యక్తంకంటె అతీతుడు. నేను అవ్యక్తంనుండి సంభవించాను. ఈ ప్రజలు, లోకాలు, సర్వదేవతలు, రాక్షసులు, నానుండి జన్మించారు. మీకు నేనెలాగో, నాకు ఆ నారాయణుడు అట్టివాడు. నేను అందరికి పితామహుణ్ణి. విష్ణువు ప్రపితామహుడు. దేవతలారా! ఈ రాక్షసుని ఆ విష్ణువు సంహరిస్తాడు. అతడికి శక్యంకానిది లేదు. అందువల్ల ఆలస్యం చేయక అతని దగ్గరకు వెళ్లండి."

పితామహుని మాటలు విని దేవతలందరూ బ్రహ్మతోపాటు క్షీరసముద్రానికి వెళ్ళారు. ఆదిత్యులు, మరుత్తులు, సాధ్యులు, విశ్వేదేవతలు, వసువులు, రుద్రులు, మహర్షులు, అశ్వినులు, తక్కిన దివ్యులు, దేవతలంతా చతుర్ముఖ బ్రహ్మను ముందిడుకొని శ్వేతద్వీపానికి చేరుకొన్నారు.

క్షీరసముద్రానికి వెళ్ళి, శాశ్వతమైన గొప్పదిక్కు, అనంతశయనుడు, అనంతుడు, ఉద్దీప్తతేజస్సు కలవాడు, శరణ్యుడు, సనాతనుడు, బ్రహ్మమయుడు, యజ్ఞస్వరూపుడు, బ్రహ్మదేవుడు, మహాబలుడు, భూతభవిష్యద్వర్తమానాలకు ప్రభువు, సర్వలోకనమస్కృతుడు, సర్వవ్యాపకుడు అయిన నారాయణుని దేవతలందరు సమీపించి శరణువేడారు. "దేవేశా! హిరణ్యకశిపుని చంపి ఇపుడు నీవే మమ్ము రక్షించాలి. నీవే మాకూ, బ్రహ్మాదులకూ సంపూర్ణ రక్షకుడవు, పోషకుడవు కూడ. వికసించిన కమలపత్రాల వంటి కన్నులుకలవాడా! · శత్రుపక్షభయంకరా! దితివంశనాశనం చేసి నీవే మాకిపుడు రక్షకుడవు

కావాలి." అపుడు విష్ణువు దేవతలమాటలు విని సర్వభూతాలకు అదృశ్యుడై ఇలా చెప్పనారంభించాడు.' దేవతలారా! మీరు భయాన్ని విడిచిపెట్టండి. మీకు నేను అభయాన్నిస్తున్నాను. త్వరలోనే మీరు మీ స్వర్గాన్ని పొందుతారు. వరదానంచేత గర్విష్ఠుడైన, హిరణ్యకశిపుని రాక్షసగణంతో సహా నేను సంహరిస్తాను.'

బ్రహ్మ ఇలా అన్నాడు - 'ఈ దేవతలు మిక్కిలి దుఃఖించి ఉన్నారు. అందువల్ల ఆ రాక్షసరాజును త్వరగా సంహరించు. అందుకు ఇది తగిన సమయం. ఆలస్యం చేయవద్దు.' శ్రీవిష్ణుభగవానుడిలా అన్నాడు - 'దేవతలారా! నేను త్వరలో వేగంగా ఆ దైత్యుని నాశనం చేస్తాను. అందువల్ల నీవు, దేవతలు త్వరగా స్వర్గానికి వెళ్లండి.' ఇలా చెప్పి శ్రీమహావిష్ణువు ఇంద్రాదిదేవతలను పీడ్కొల్పి, నరుని సగందేహాన్ని, సింహాయొక్క సగం దేహాన్ని గ్రహించి, నరసింహశరీరంతో చేతితో చేతిని గట్టిగాపట్టి, భయంకరరూపం, గొప్ప తేజస్సుకలవాడై నోరు తెరిచిన మృత్యువు వలె అయ్యాడు. ఆ నరసింహరూపుడైన విష్ణువు హిరణ్యకశిపుని పైకి వెళ్లాడు. దైత్యులనాశనానికి వచ్చిన మహాబలుడైన ఆ నారసింహుని చూచి క్రుద్ధులై దైత్యులు శ్రీహరిపై శస్త్రవర్షాన్ని కురిపించారు. వారు తనపై విడిచిన శస్త్రాలను శ్రీహరి భక్షింపసాగాడు. వేలవేల రాక్షసులను యుద్ధంలో సంహరించాడు. మహాబలవంతులు, క్రుద్ధులు అయిన ఆ రాక్షసాధిపులను సంహరించి, శ్రీహరి బలగర్వితుడై రాక్షసరాజయిన హిరణ్యకశిపుని దగ్గరకు పరుగెత్తాడు. (మేఘంలా నల్లని శరీరచ్ఛాయ, గంభీరమైన కంఠధ్వని, ఉద్దీప్తమైన తేజస్సు, వేగమూ కల ఆ శ్రీహరి, హిరణ్యకశిపుని దగ్గరకు పరువెత్తాడు) దేవతల శత్రువు, దుష్టుడూ అయిన ఆ దైత్యుడు నృసింహుని చూచి అతడివైపు పరుగెత్తాడు. కోపించిన సింహంలా పరాక్రమిస్తున్న రాక్షసగణాలచే రక్షింపబడుతున్న మహాబలవంతుడైన ఆ దైత్యుని చూసి నృసింహుడు ప్రకాశిస్తున్న తన నఖాగ్రాలతో ఎదుర్కొని అతనితో యుద్ధం చేశాడు. సంధ్యాసమయంకాగానే మహాతేజస్వి అయిన నృసింహుడు ఆ రాక్షసరాజును పట్టి, శీఘ్రంగా సింహద్వారపు గడపపై, నిలిచి తన తొడపై అతడి నుంచుకొని గోళ్ళతో చీల్చాడు. ఈవిధంగా హిరణ్యకశిపుని శ్రీహరి వేగంగా చంపాడు. రాక్షసులందరినీ, హిరణ్యకశిపుని చంపి, దేవతలకు మనుష్యులకు హితాన్ని చేకూర్చి, ఈ భూమిపై ధర్మాన్ని నిలబెట్టి మహాతేజస్వి అయిన శ్రీహరి ఆనందించాడు.

పాండునందనా! ఇంతవరకు నారసింహావతారకథను నీకు చెప్పాను. ఇక మహాత్ముడగు శ్రీహరి వామనుడుగా అవతరించిన విధం చెప్తాను, విను. రాజా! పూర్వం త్రేతాయుగంలో విరోచనుని కుమారుడు 'బలి' అనే రాక్షసరా జుండేవాడు. అతడు వీరుడు, సాటిలేని బలవంతుడు. అతడు తన దైత్యసంఘాలతో కూడి ఇంద్రుని ఓడించి, ఇంద్రస్థానాన్ని కైవశం చేసికొన్నాడు. బలిచే భీతినొందిన ఇంద్రాదిదేవతలు బ్రహ్మను ముందుపెట్టుకొని క్షీరసముద్రం దగ్గరికి వెళ్లి, శ్రీమన్నారాయణ ప్రభువును స్తుతించారు. దేవతలచే స్తుతింపబడిన శ్రీహరి వారికి దర్శనమిచ్చాడు. వారిపై అనుగ్రహంతో అదితికి జన్మించాడు. యదునందనుడగు శ్రీకృష్ణుడు అదితికి పుత్రుడుగా జన్మించి ఇంద్రునికి తమ్ముడై, విష్ణువుగా విఖ్యాతి చెందాడు. ఆ సమయంలోనే రాక్షసరాజైన బలి అశ్వమేధయాగాన్ని మొదలుపెట్టాడు. రాక్షసరాజు యొక్క యజ్ఞం జరుగుతుండగా విష్ణువు వామనుడై బ్రాహ్మణవేషంతో యజ్ఞోపవీతం,

కృష్ణాజినం, పలాశదండం ధరించి, శిఖతో చూడటానికి ఆశ్చర్యం కలిగిస్తూ యజ్ఞశాలలోకి ప్రవేశించాడు. 'మూడడుగుల భూమి మాత్రమే నాకు దానమిమ్ము' అని ఆ మహాసురుని యాచించాడు. అతడు సరే' అని విష్ణువుకు దానమిచ్చాడు.

అతని ద్వారా భూమిని పొంది శ్రీహరి విజృంభించాడు. ఆ వామనుడు ఆకాశాన్ని, స్వర్గాన్ని, భూమిని ఈ సమస్తాన్ని తన మూడడుగులతో ఆక్రమించాడు. రాజా! ఇలా ఆ బలి చేస్తున్న యజ్ఞంలో శ్రీమహావిష్ణువు మూడడుగులతో సమస్త రాక్షసలోకాన్ని క్షోభింపజేశాడు. మహాబలులు, అనేక ముఖాలుకలవారూ, మహాకాయులూ, అనేకవేషాలు ధరించిన విప్రచిత్తి మున్నగు ప్రధాన రాక్షససంఘాలు కోపించాయి. భరతనందనా! అనేక ఆయుధాలు మాల్యాలు, లేపనాలు ధరించి, కోపంతో రుద్రులై తమతమ ఆయుధాలను స్వీకరించి, తేజస్సుతో జ్వలిస్తున్న ఆ రాక్షసగణాలు విక్రమిస్తున్న శ్రీహరిని సమీపించాయి. ఆ రాక్షసు లందరిని తన పాదాలతో, హస్తాలతో పీడించాడు. మహాభయంకరరూపంతో ఈ భూమినంతా ఆక్రమించాడు. అనంతరం ఆకాశమాక్రమించి సూర్యమండలంలో ప్రవేశించాడు. తన తేజస్సుతో సూర్యుని మిక్కిలి ప్రకాశింపజేశాడు. అన్నిదిక్కులను, విదిక్కులను సర్వలోకాలను ప్రకాశింపజేస్తూ విష్ణువు శోభిల్లాడు. భూమిపై విజృంభిస్తున్న అతని వక్షఃస్థలంమీద సూర్యచంద్రు లున్నారు. ఆకాశాన్ని ఆక్రమిస్తున్న విష్ణువు నాభిలో సూర్యచంద్రు లున్నారు. పైపైకి విక్రమిస్తున్న విష్ణువుయొక్క మోకాళ్ల దగ్గరికి సూర్యచంద్రు లున్నారు. ఈవిధంగా అమితపరాక్రమంగల విష్ణువుగురించి ద్విజులు వర్ణించారు. అనంతరం ఆ విధంగా విక్రమిస్తున్న విష్ణువుపాదాలు బ్రహ్మాండంయొక్క కపాలాన్ని తాకాయి. దానివల్ల కపాలంలో ఏర్పడిన చిద్రంనుండి స్రవించిననీరు విష్ణుపాదం నుండి క్రిందపడి సాగరంలో కలిసింది. ఆ జనార్దనుడు భూమినంతా ఆక్రమించాడు. దానవు లందరిని సంహరించాడు. ఆసురసంపద నంతా హరించాడు. పుత్రదారాది సహితులైన రాక్షసులను పాతాళంలో పడవేశాడు. నముచి, శంబరుడు, ప్రహ్లాదుడు మున్నగు వారంతా విష్ణుపాదస్పర్శచే పవిత్రులై పాతాళంలో పడ్డారు. రాజా! భూతాత్ముడైన ఆ శ్రీహరి తన శరీరావయవాలలో పంచమహాభూతాలను, భూతభవిష్యద్వర్తమానకాలాలను చూపించాడు.

జగత్తంతా అతని శరీరంలోనికి తీసికొనిరాబడినట్లుగా కనబడుతోంది. మహాత్ముడైన విష్ణువు వ్యాపించని ప్రదేశం మూడులోకాలలో కొంచెం కూడా లేదు. ఆ శ్రీమహావిష్ణువు యొక్క రూపం చూసిన దేవ,దానవ మానవులు ఆ తేజస్సును తట్టుకొనలేక మూర్ఛపోయారు. అభిమానవంతుడైన బలి యజ్ఞవాటికయందే విష్ణువుచే బంధింపబడ్డాడు. విరోచనుని వంశాన్నంతా పాతాళంలో పడవేశాడు విష్ణువు. గరుడవాహనుడైన విష్ణువు తన పరమేశ్వర సంబంధమయిన తేజస్సుతో ఇటువంటి సత్కర్మలు చేసి కూడా అహంకారాన్ని పొందలేదు. దానవఘాతకుడైన విష్ణువు సమస్తమైన దేవతల సంపదను, ముల్లోకాలను శచీపతియైన ఇంద్రుని కిచ్చాడు. ఈవిధంగా మహాత్ముడైన విష్ణువు యొక్క వామనావతారకీర్తి వేదవేత్త లైన ద్విజులచే చెప్పబడుతోంది. ఇక విష్ణువు మనుష్యులలో అవతరించిన విధాన్ని చెపుతాను, వినుము.

మహారాజా! మహాయశుడైన విష్ణువు దత్తాత్రేయమహర్షిగా అవతరించడం మిక్కిలి ప్రసిద్ధిచెందింది. వేదాలు, యజ్ఞక్రియలు నశించాయి. చాతుర్వర్ణ్య వ్యవస్థ సంకరం చెందింది. ధర్మం శిథిలావస్థకు చేరుకొంది. అధర్మం వృద్ధి చెందింది. సత్యం నశించింది. అసత్యం స్థిరపడింది. ప్రజలు క్షీణిస్తూ ఉన్నారు. ధర్మం వ్యాకులపాటుకు లోనయింది. అపుడు శ్రీహరిఅవతారమైన దత్తాత్రేయమహర్షి యజ్ఞక్రియను, వేదాలను తిరిగి తీసుకువచ్చాడు. చాతుర్వర్ణ్య వ్యవస్థను సంకీర్ణం కాకుండా నిలిపాడు. అతడే హైహయరాజగు అర్జునునకు వరాన్ని ప్రసాదించాడు. హైహయరాజగు అర్జునుడు తన కర్మల ద్వారా దత్తాత్రేయుని ప్రసన్నుని చేసికొన్నాడు. అతడు వనంలో సంచరిస్తూ అసూయలేకుండా దత్తాత్రేయుని సేవిస్తూ అహంకారమమకారాలు విడిచి చాలాకాలం దత్తాత్రేయుని ఆరాధించి సంతోషపెట్టి అతడివల్ల వరాలను పొందాడు. దత్తాత్రేయమహర్షి ఆప్తులకంటె ఆప్తుడు. గొప్పగొప్ప విద్వాంసు లతనిని సేవిస్తూన్నారు. ధీశాలిఅయిన దత్తాత్రేయుడు అమరత్వం తప్ప, తక్కిన వరాలను నాల్గింటిని అర్జునునకు ఇచ్చాడు. అర్జునుడు వరా లిలా కోరాడు. 'శ్రీమంతుడను, మనస్విని, బలవంతుడను, సత్యవాక్కును, అసూయలేనివాడను, వేయి బాహువులు కలవాడను కావాలి. ఇది నా మొదటి వరం. జరాయుజాలు, అండజాలు నివసించే సమస్త చరాచరవిశ్వాన్ని ధర్మంగా నేను పరిపాలింప గోరుతున్నాను. ఇది నా రెండవ వరం. పితరులను, దేవతలను, ఋషులను, విప్రులను పెద్ద పెద్ద యజ్ఞాలచే పూజించాలి. యుద్ధంలో శత్రువులను తీక్ష్ణమైన బాణాలతో నేను సంహరించాలి. దత్తాత్రేయమహర్షీ! ఇది నా మూడో వరం. ఈభూమిపైగాని, స్వర్గంలో గాని భూతభవిష్యత్తులలో సాటిలేనివాడే నన్ను చంపాలి.

హైహయరాజయిన ఆ అర్జునుడు కృతవీర్యుని జ్యేష్ఠకుమారుడు. అతడు యుద్ధంలో ఆరితేరినవాడు. అతడు మాహిష్మతీ నగరంలో ఉండి వేయివేలసంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. సముద్రంలో ఉన్న ద్వీపాలతోపాటు సమస్తభూమండలాన్ని జయించాడు. తన పుణ్యకర్మలచేత కార్తవీర్యార్జునుడు ఆకాశంలో సూర్యునిలా ప్రకాశించాడు. ఇంద్రద్వీపం, కశేరుద్వీపం, తామ్రద్వీపం, గభస్తిమద్ద్వీపం, గంధర్వద్వీపం, వరుణద్వీపం, సౌమ్యాక్షద్వీపం మున్నగు తన పూర్వులు జయింపలేని ద్వీపాలను జయించి, తన అధికారాన్ని విస్తరించాడు. అతని రాజభవనమంతా స్వర్ణమయం, శ్రేష్ఠం. అతడు రాజ్యంలోని ఆదాయాన్ని నాలుగు భాగాలుగా విభజించి, తదనుగుణంగా రాజ్యపాలన చేశాడు. అందలి ఒక భాగంతో సేనను సంగ్రహించుకొనేవాడు, ఒక భాగం గృహస్థులకోసం, మూడవభాగం జనులసంక్షేమం కోసం ఉపయోగిస్తూ ఆప్తుడు, పరమకల్యాణకారి అయిన అర్జునుడు యజ్ఞాలను చేశాడు. నాల్గవభాగంతో గ్రామాలలో అరణ్యంలో ఉండే దొంగలను, దోపిడీ దారులను అందరినీ కట్టడి చేశాడు. సరిహద్దులలో ఉన్నవారందరి నుండి పన్ను స్వీకరించేవాడు. తాను సైన్యబలంతో సంపాదించిన ధనాన్ని గొప్పదిగా భావించేవాడు. కాకిలా గాని, ఎలుకలా గాని ప్రజలధనాన్ని అపహరించేవారిని నియంత్రించేవాడు, రాజ్యంలోని గ్రామాలలోను, నగరాలలోను గృహ ద్వారాలను మూసేవారుకాదు. రాజా! కార్తవీర్యార్జునుడే రాజ్యానికి పాలకుడు. అతడే స్త్రీలకు రక్షకుడు, అతడే మేకలకు సంరక్షకుడు, అతడే గోపాలకుడు కూడ. అతడే అరణ్యంలో మనుష్యులను, పాలాలను రక్షించేవాడు. కార్తవీర్యార్జునుని ఈ కార్యవిధానం మానవులకు అసాధారణమైంది.

అతనికి ముందున్న రాజులు కాని, తరువాతనున్న రాజులు కాని అతని స్థితిని పొందలేదు. సముద్రంలో వెళ్ళినా అతని వస్త్రం తడవదు. ఈవిధంగా దత్తాత్రేయుని అనుగ్రహం చేత లక్షసంవత్సరాలు ఈ భూమిని శాసించి, రాజ్యపాలన చేశాడు.

ఈవిధంగా కార్తవీర్యార్జునుడు లోకహితంకోసం చాలా పనులు చేశాడు. ఇంతవరకు దత్తాత్రేయుడని ప్రసిద్ధి చెందిన విష్ణువు యొక్క అవతారాన్ని గురించి చెప్పాను. భరతశ్రేష్ఠా! భృగుకులంలో మహాత్ముడై జమదగ్న్యుడని ప్రసిద్ధిచెందిన విష్ణువుయొక్క అవతారం గురించి చెపుతాను. విను. 'రాజా! జమదగ్ని కుమారుడు పరశురాముడు గొప్పపరాక్రమవంతుడు. బలవంతులలో శ్రేష్ఠుడు. అతడు హైహయరాజయిన కార్తవీర్యుని సంహరించాడు. కార్తవీర్యుడు మహాపరాక్రమ వంతుడు . బలంలో అతనికి సాటి లేదు. కాని అనుచితంగా ప్రవర్తించటంచేత జమదగ్ని కుమారుడు పరశురాముడు అతనిని సంహరించాడు. కార్తవీర్యార్జునుడు రథస్థుడై ఉండగా పరశురాముడు అతనిని కిందపడవేసి సంహరించాడు. గోవిందుడే భృగువంశంలో పరశురామునిగా అవతరించాడు. అతడే జంభాసురుని, శతదుందుభిని సంహరించిన శ్రీకృష్ణుడు. సహస్రబాహువు అయిన కార్తవీర్యార్జునుని యుద్ధంలో సంహరించడానికి అవతరించాడు. మహాయశస్వి అయిన పరశురాముడు సరస్వతీనదీతీరాన ఆరులక్షల నలభైవేల మంది క్షత్రియులను కేవలం వింటితో సంహరించాడు. వారంతా బ్రహ్మద్వేషులు. మరల పదునాల్గువేల వీరులను సంహరించాడు. అనంతరం పదివేల మంది క్షత్రియులను అంతమొందించాడు. వేయిమందిని ముసలంతో చంపాడు. వేయిమందిని శూలాలతో చంపాడు. పరశురాముడు పదునాల్గువేలమందిని క్షణకాలంలో పడగొట్టాడు. బ్రహ్మద్వేషులుగా మిగిలిన వారినందరిని సంహరించి తలపెట్టిన కార్యసమాప్తి సూచకంగా స్నానం చేశాడు. క్షత్రియులచే హింసింపబడిన బ్రాహ్మణులంతా 'రామా! రామా!' అని ఆక్రోశించగా, పరశురాముడు తన పరశువుతో పదివేలమందిని సంహరించాడు. 'భృగునందనా! రామా! పరిగెత్తుకురా!' అనే బ్రాహ్మణుల ఆర్తనాదాలను అతడు సహింపలేకపోయేవాడు. కాశ్మీర, దరద, కుంతిభోజ, క్షుద్రక, మాలవ, శక, చేది, కాశి, కరూష, ఋషీక, క్రథ, కైశిక, అంగ, వంగ, కలింగ, మగధ, కాశీ, కోసల, రాత్రాయణ, వీతహోత్ర, కిరాత, మార్తి కావతాది క్షత్రియులను, ఇంకా వేలాది క్షత్రియులను తన వాడి బాణాలతో సంహరించి యమునికి అప్పజెప్పాడు. మేరు, మంధర పర్వతాలు అలంకారంగా గల భూమండలంలో వ్యాపించిఉన్న కోట్లమంది క్షత్రియులను ఇరువది ఒక్కమార్లు సంహరించి, భూమిని క్షత్రియరహితం చేశాడు. అనంతరం పరశురాముడు గొప్ప దక్షిణలతో యజ్ఞాలను చేశాడు. మరొక నూరు సంవత్సరాలు సౌభమనే పేరుగల విమానంలో ఎక్కిన సాల్వునితో యుద్ధం చేస్తూ, పరశురాముడు నగ్నికలయిన (రజస్వలలు కాని) కుమారికల నుండి వెలువడిన ఈ గానాన్ని విన్నాడు. 'రామా! రామా! మహాబాహూ! భృగవంశకీర్తివర్ధనా! నీవు శస్త్రాలను విడిచిపెట్టు. నీవు ఈ సౌభవిమానాన్ని నాశనం చేయలేవు. భీతులైనవారికి అభయాన్నిచ్చే చక్రహస్తుడు, గదాపాణి అయిన శ్రీకృష్ణుడు ప్రద్యుమ్న, సాంబులతో కలిసి ఈ సౌభాన్ని నాశనం చేస్తాడు.' ఆ గానం విని పురుషవ్యాఘ్రుడైన పరశురాముడు వనానికి వెళ్ళాడు. సర్వశస్త్రాలను, రథాన్ని, కవచాన్ని, ఆయుధాన్ని, ధనుర్ బాణాలను, పరశువును, నీళ్లలో

పడవేసి, తగినకాలం కోసం ఎదురుచూస్తూ, గొప్పతపస్సు చేశాడు. ధర్మాత్ముడు, శత్రుమర్దనుడైన పరశురాముడు లజ్జ, ప్రజ్ఞ, సంపద, కీర్తి, లక్ష్మి ఈ ఐదింటిని ఆశ్రయించి, రథాన్ని విడిచిపెట్టాడు. ఇది ఆదికాలంలో జరిగింది. ఆదికాలంలో నున్న కాలాన్ని విభజించి పరశురాముడు నగ్నికల మాటపై శ్రద్ధ నుంచి సౌభుని నాశనం చేయలేదు. అంతేకాని అసమర్థుడై కాదు. జమదగ్ని కుమారుడై పరశురాము డని ప్రసిద్ధిచెందిన ఆమహర్షి ప్రస్తుతం తపోనిష్ఠలో ఉన్నాడు. ఈవిధంగా పరశురాముడు లోక విశ్రుతుడయ్యాడు. రాజా! ఇరవై నాలుగో యుగంలో విశ్వామిత్రుని ఎదుటపెట్టుకొని మహాత్ముడైన శ్రీమహావిష్ణువు శ్రీరామునిగా అవతరించాడు. దాని గురించి చెప్తాను విను. అవ్యయుడైన శ్రీమహావిష్ణువు తన్ను తాను నాలుగుభాగాలుగా విభజించుకొని దశరథునికి నవమి రోజున జన్మించాడు. కొంతేయా! సనాతనుడైన విష్ణువు లోకాన్ని అనుగ్రహించడంకోసం, ధర్మం కోసం సూర్య తేజస్సులతో శ్రీరామునిగా జన్మించి కీర్తిమంతు డయ్యాడు. భారతా! మనుష్యేంద్రుడైన ఆ శ్రీరాముని సర్వభూతపతి అయిన విష్ణువు యొక్క స్వరూపంగా చెప్తారు. విశ్వామిత్రుని యజ్ఞానికి విఘ్నం కలిగిస్తున్న సుబాహుని అతడు సంహరించాడు. అలాగే మారీచుని బాగా దెబ్బకొట్టాడు. ధీశాలి అయిన విశ్వామిత్రుడు దేవశత్రుసంహారం కోసం ఆ శ్రీరామునికి దేవతలచే కూడ నివారింపశక్యంగాని శస్త్రాలు ఇచ్చాడు. మహాత్ముడైన జనకుడు ధనుర్యాగంలో ఉండగా, రాముడు లీలగా శివధనుస్సును ఎక్కుపెట్టితే అది విరిగిపోయింది. తరువాత రాముడు సీతను వివాహం చేసికొని అయోధ్యానగరానికి వచ్చి సీతతో ఆనందంగా ఉన్నాడు.

కొంతకాలం తర్వాత కైకేయి కోరిక తీర్చటానికి తండ్రి పంపితే అరణ్యానికి వెళ్లాడు. భరతనందనా! సర్వధర్మాలు తెలిసిన ఆ రాముడు లక్ష్మణుడు వెన్నంటి ఉండగా, సర్వప్రాణుల హితాన్ని కోరుతూ పదనాల్గు సంవత్సరాలు వనంలో నివసించసాగాడు. అతడు ఆపదునాల్గు సంవత్సరాలు అడవిలో అపూర్వమైన తపస్సు చేశాడు. అతనితో కూడా ఉన్న రూపవతియైన స్త్రీని సీత అని జనులంతా అంటారు. మునుపే విష్ణుమూర్తి భార్యగా ఉన్న లక్ష్మి యోగ్యమైనందువల్ల రామునిగా అవతరించినపుడు భర్తను సీతగా అనుసరించింది. జనస్థానంలో నివసిస్తూ దేవతలకార్యాన్ని రాముడు చేశాడు. మారీచుని, ఖర, దూషణులను, త్రిశిరసుని సంహరించాడు. ధర్మాత్ముడైన రాముడు ప్రజలహితాన్ని కోరుతూ పదునాల్గుసంవత్సరాలు రాక్షసులను సంహరించాడు. క్రూరకర్ములైన విరాధుడు, కబంధుడు అనే రాక్షసుల నిద్దరిని రాముడు సంహరించాడు. వారు శాపగ్రస్తులైన గంధర్వులు. అతడు రావణుని సోదరియైన శూర్పణఖ యొక్క ముక్కు కోశాడు. అందువల్ల భార్యావియోగాన్ని పొంది వనంలో ఆమెను వెతుకుతూ తిరిగాడు. తరువాత అతడు ఋష్యమూక పర్వతానికి చేరుకొని, పంపాసరోవరాన్ని దాటి, సుగ్రీవహనుమంతులను చూచి, వారితో మైత్రి చేశాడు. పిమ్మట సుగ్రీవునితో కిష్కింధకు వెళ్లి, యుద్ధంలో బలవంతుడైన వానరేంద్రుని – వాలిని చంపి, సుగ్రీవుని వానరేశ్వరునిగా అభిషిక్తుని చేశాడు. అనంతరం బలవంతుడైన శ్రీరాముడు సీతజాడ వెదకటానికి వారిని తొందరపెట్టాడు. వాయుపుత్రుడైన హనుమంతుడు వెదకి సీత లంకలో ఉన్నట్లుగా నివేదించాడు. సముద్రానికి సేతువు

కట్టి సీత ఉన్న రాముడు లంకలో ప్రవేశించాడు. దేవతలకు, నాగులకు, యక్షరాక్షస పక్షులకూ సంహరింపరాని దుర్జయుడయిన రావణుడు ముక్కలయిన కాటుక పర్వత శకలాల వంటి రాక్షసులతో కూడి ఉన్నాడు. వరదానగర్వంతో దేవతలకు కూడా అశక్యుడై సచివులతో, వంశీయులతో ఉన్న ఆ త్రైలోక్యకంటకుడు, వీరుడు, మహాకాయుడు, మహాబలుడు అయిన రావణుని రాముడు రాక్షసగణ సహితంగా యుద్ధంలో సంహరించాడు. అనంతరం సర్వభూతపతి అయిన శ్రీరాముడు మహాత్ముడైన విభీషణుని లంకలో రాక్షసరాజుగా అభిషిక్తుని, చేసి అక్కడే అతడికి అమరత్వాన్ని ప్రసాదించాడు.

పాండునందనా! సీతతోపాటు రాముడు పుష్పకాన్ని ఎక్కి, తనవారితోపాటు తననగరానికి వెళ్ళి ధర్మరాజ్యాన్ని పాలించాడు. అటుపై రామశాసనంవల్ల శత్రుఘ్నుడు మధుపుత్రుడు, మహాబలవంతుడూ అయిన లవణాసురుని సంహరించాడు. ధర్మాత్ములలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు ఈవిధంగా లోకహితం కొరకు చాలా సత్కర్మల నాచరించి, యథావిధిగా రాజ్యాన్ని పరిపాలించాడు. సరయూనదీతీరంలో జారుధి అనే ప్రదేశంలో నిరాటంకంగా పది అశ్వమేధయాగాలు చేశాడు. అపుడు అశుభమైన మాటలు ఎవరూ వినలేదు. ప్రాణుల వినాశం జరగలేదు. రాముడు రాజ్యం పాలిస్తూండగా ధనభయం కలగలేదు. నీటివల్ల కాని, నిప్పు వల్లగాని, ప్రాణులకు భయం లేదు. భర్తలు మరణించి కాని, అనాథలై గాని స్త్రీలు ఎవరూ దుఃఖించలేదు. రాముడు రాజ్యం పాలిస్తూండగా, అందరూ తృప్తిగా జీవించారు. వర్ణాలు సంకరం కాలేదు. జనులు వ్యవసాయం మానలేదు. రాముడు రాజ్యం చేస్తూండగా, వృద్ధులు చిన్నవారికి ప్రేతకర్మలు చేసే అవసరం రాలేదు. క్షత్రియులను వైశ్యులు సేవించేవారు. క్షత్రియులు వారిని పీడించేవారు కాదు. పురుషులు తమ భార్యలను అవమానించేవారు కాదు. స్త్రీలు కూడ తమ భర్తలను అవహేళన చేసేవారు కాదు. జనులు ఎక్కువగా వ్యవసాయం చేసేవారు. జనులు వేలవేల పుత్రులతో ఉండి, రోగాలు లేకుండా, వేలసంవత్సరాలు జీవించేవారు. రాముడు రాజ్యపాలన చేస్తూండగా ఈ భూమిపై ఋషులు, దేవతలు, మనుష్యులు సహజీవనం చేశారు. రాజా! అపుడు వారందరూ తృప్తితో జీవించారు. రాముడు ధర్మంతో భూమినంతా శాసించాడు. ధార్మికుడైన రాముడు రాజ్యం చేస్తూండగా అందరు తపస్సులో ఉన్నట్లుగా ఉండేవారు. అందరూ ధర్మాలను నియమంగా పాటించేవారు. రాముడు రాజ్యం చేస్తూండగా అధార్మికుడు ఎవ్వడూ లేడు. జనులంతా ప్రాణాపానాలను సమం చేసి, యోగంతో జీవించేవారు. పౌరాణికులైన జనులు రాముని గాథను ఇలా గానం చేశారు. నల్లనివాడు,యువకుడు, ఎఱ్ఱనికన్నులు కలవాడు, ఏనుగు వలె ఉన్నతుడు, ఆజానుబాహువు, అందమైన ముఖం కలవాడు, సింహం వంటి స్కంధాలు కలవాడు, మహాబలుడు అయిన రాముడు పదుకొండు వేల సంవత్సరాలు రాజ్యభోగాలను అనుభవిస్తూ ఈ భూమిని పాలించాడు. ప్రజలు మాటల్లో ఏసందర్భంలోనైనా రాముడు రాముడు రాముడు అనేవారు. అతడు రాజ్యం పాలిస్తూండగా ఈ జగత్తంతా రామమయం అయిపోయింది. బ్రాహ్మణులలో ఋగ్యజుస్సామవేదాలను చదువనివారు లేరు. అట్టి శ్రీరాముడు దండకారణ్యంలో నివసించి, దేవతలకార్యాన్ని చేశాడు. దేవగంధర్వనాగులకు శత్రువు, మునుపు అపకారంచేసినవాడూ, పులస్త్యనందనుడు అయిన రావణుని మనుజశ్రేష్ఠుడు

సత్యవంతుడు, గుణ సంపన్నుడు, తన తేజస్సుతో ప్రకాశించే మహాబాహువు, ఇక్ష్వాకుకులవర్ధనుడు అయిన శ్రీరాముడు సంహరించాడు. రాక్షసగణంతోపాటు రావణుని సంహరించి రాముడు దేవలోకానికి చేరుకొన్నాడు. ఈవిధంగా విష్ణువు దశరథకుమారుడైన రాముడుగా అవతరించి లోకవిఖ్యాతిని పొందాడు.

రాజా! అటుతరువాత ఇరవై ఎనిమిదో యుగంలో విష్ణువు మహాబాహుడు, శ్రీవత్సలాంఛనుడు, భీతులకు అభయంకరుడు అయిన శ్రీకృష్ణుడుగా అవతరించాడు. అందమైనవాడు, ఉదారుడు, లోకంలోని చాలామంది మనుష్యులకు మిక్కిలి ఇష్టుడు, స్మరణశక్తిసంపన్నుడు, దేశకాలజ్ఞుడు, శంఖచక్రగదాఖడ్గాలను ధరించినవాడు ఆ శ్రీకృష్ణుడు. భూదేవికి ఇష్టాన్ని చేయగోరి వృష్ణికులంలో జన్మించి, లోకాలకు హితాన్ని చేసి, వాసుదేవుడుగా ఖ్యాతి నొందాడు. అతడు మానవులకు అభయప్రదాత, మధు వనే రాక్షసుని చంపిన ప్రసిద్ధుడు. శకటాసురుని, యమలార్జునుని, పూతనను మర్మస్థానాలను భేదించి సంహరించినవాడు. మానుషరూపంలో ఉన్న కంసాది రాక్షసులను యుద్ధంలో చంపాడు. లోకహితంకోసం ఈ మహాత్ముడు అవతరించాడు.

కలియుగాంతంలో ధర్మం శిథిలంకాగా, పాఖండికుల వధకోసం, ధర్మాన్ని వృద్ధి చేయడంకోసం, బ్రాహ్మణులకు హితం చేయగోరి, శ్రీహరి 'కల్కి విష్ణుయశస్సు' అనే పేరుతో మరల అవతరిస్తాడు. ఇవేగాక ఇంకా ఇతర దేవగణాలతో కూడిన విష్ణువు యొక్క దివ్యావతారాలను గురించి బ్రహ్మవాదులు పురాణాలలో గానంచేశారు." భీష్ముడు ఈ విధంగా చెప్పాక, పూరువంశీయుడు, యుధిష్ఠిరుడు అయిన ధర్మరాజు భీష్మునితో ఇలా అన్నాడు. "మనుష్యేంద్రా! యశస్వీ, ఉపేంద్రుడూ అయిన శ్రీకృష్ణుడు వృష్ణివంశంలో అవతరించటం గూర్చి ఇంకా తెలియగోరుతున్నాను. పితామహా! మహాబుద్ధిమంతుడు, భగవంతుడు జనార్దనుడు ఈ భూమిపై యదువంశంలో ఎలా పుట్టాడు? ఆ విషయాన్నంతా నాకు చెప్పు. కంసుని వధద్వారా లోకాలను రక్షించిన మహాతేజస్వి, గోవులలె విశాలనేత్రాలు కల కృష్ణుడు గోవులను కాస్తూ ఎందుకున్నాడు? పితామహా! బాల్యంలో గోవిందుడు ఆడుతూ ఏమేం పనులు చేశాడు? వాటన్నింటిని నాకు చెప్పు.' ధర్మరాజు అలా అడుగగా, తేజోవంతుడు అయిన భీష్ముడు మహాత్ముడైన విష్ణువు మధువంశంలో అవతరించిన విధాన్ని ఇలా చెప్పాడు. నాయనా! కురునందనా! యుధిష్ఠిరా! నారాయణుడు వృష్ణివంశంలో అవతరించడాన్ని ఉన్నదున్నట్లుగా నీకు చెప్తాను. అజాతశత్రుడా! భూమిని రక్షించటానికి శ్రీహరి ఈభూమిపై ఎలా పుట్టాడో చెప్తాను. నీవు జాగరూకతతో అర్థం చేసుకో.

జనార్దనుడు అవతరించినపుడు ఆనందంతో సముద్రాలు పులకరించాయి. పర్వతాలు చలించాయి. అగ్నులు ప్రశాంతంగా ప్రజ్వరిల్లాయి. జనార్దనుడు అవతరించినపుడు గాలులు మంగళకరంగా మెల్లగా వీచాయి. ధూళి శాంతించింది. నక్షత్రాలు బాగా ప్రకాశించాయి. ఆకాశంలో దేవదుందుభులు మ్రోగాయి. దేవతలు వచ్చి పుష్పవృష్టులను కురిపించారు. జనార్దనుడు అవతరించినపుడు దేవతలు మంగళకరాలైన వాక్కులతో మధుసూదనుని స్తుతించారు. మహర్షులు ప్రీతులై సమీపించారు. నారదాది ప్రముఖులైన దేవర్షులు రావడం చూసి, గంధర్వులూ, అప్సరోగణాలూ నృత్యంచేస్తూ శ్రీహరిని గురించి పాడారు.

శచీపతి దేవేంద్రుడు కూడ గోవిందుని సమీపించాడు. తేజస్వి అయిన ఇంద్రుడు మహర్షులను గౌరవించి, గోవిందునితో ఇలా అన్నాడు. 'దేవా! దేవకార్యాలను నిర్వర్తించి లోకహితాన్ని కలుగచేసి, నీ తేజస్సుతో నీవు మరల నీ పరమధామానికి వెళ్ళవలసింది.' ఈవిధంగా చెప్పి దేవేంద్రుడు మునులతో పాటు వెళ్ళాడు. రాజా! తరువాత వసుదేవుడు కంసుని భయంవల్ల తనకు పుట్టి, సూర్యునిలా ప్రకాశిస్తున్న బాలుని (కృష్ణుని) నందగోపకులంలో దాచాడు. ఆ నందగోపకులంలో కృష్ణుడు చాలాసంవత్సరాలు నివసించాడు. ఒకసారి బండి క్రింద నిద్రిస్తూన్న ఆ బాలుని విడిచి, యశోద యమునానదికి వెళ్ళింది.

తరువాత బాలకృష్ణుడు బాలచేష్టలు చేస్తూ, కాలుసేతుల్ని ఆడిస్తూ మధురస్వరంతో ఏడ్చాడు. పాదాలు రెండూ పైకి చాచాడు. ఒక పాదం యొక్క అంగుష్ఠంతో బండిని ఎత్తిపట్టి, రెండవపాదంతో దాన్ని పడగొట్టాడు(తన్నాడు). ఆకలితో స్తన్యాన్ని కోరుతూ ఏడ్చాడు. అతడు పడగొట్టిన శకటాన్ని, అందులోని కుండలు పగిలిపోవటాన్ని చూసిన జనులు బాలుడు చేసిన పనికి ఆశ్చర్యపోయారు. భరతనందనా! శూరసేనదేశ నివాసులంతా మహాద్భుతమైన ఈ కృత్యాన్ని ప్రత్యక్షంగా చూశారు. దేవతలంతా చూస్తూండగా బాలకృష్ణుడు వాసుదేవుడు మహాకాయ, మహాస్తని అయిన పూతనను కూడా సంహరించాడు.

ఆకాశంలో సూర్యచంద్రులిద్దరూ ఒకరి కిరణాలొకరు గ్రహించి ప్రవర్తించినట్లుగా, బలరామకృష్ణులిద్దరూ కలిసే సంచరించేవారు. వారి భుజాలు పాముపడగల్లా ప్రకాశిస్తూండేవి. బలరామకృష్ణులిద్దరూ ధూళితో కూడిన శరీరాలతో ప్రకాశిస్తూండేవారు. ఒక్కొక్కచోట మోకాళ్ళతో కొట్టుకొనేవారు. అడవిలో ఆడుకొంటూ ఒకసారి కనబడేవారు. పెరుగు చిలుకుతూండగా త్రాగుతూండేవారు. ఒకసారి బాలగోపాలుడు ఒంటరిగా దాగి, వెన్న తింటూండగా గోపికలు అతనిని చూశారు. రాజా! అపుడు ఆ గోపస్త్రీలు ఆతనిని తాడుతో రోలుకి కట్టేశారు. అపుడు ఆ బాలగోపాలుడు ఆ (ఉలూఖలం) రోటితో, కొమ్మలతో, వేళ్ళతో సహితంగా రెండు అర్జునవృక్షాలనూ పెకలించాడు. అది చాలా ఆశ్చర్యకరంగా జరిగింది. దానితో మహాకాయు లైన ఇద్దరు రాక్షసులకు ప్రాణాలు పోయాయి. అటుపై శ్రీకృష్ణబలరాములు బాల్యదశను దాటి ఆ వ్రజస్థానంలోనే ఏడు సంవత్సరాలు ఉన్నారు. బలరాముడు నీలాంబరాన్ని, కృష్ణుడు పీతాంబరాన్ని ధరించేవారు. ఒకరు పచ్చనిలేపనాన్ని, ఒకరు తెల్లని లేపనాన్ని పూసుకొనేవారు. కాకపక్షాల జుట్టుతో పెరుగుతూ లేగలను రక్షిస్తున్నారు. వారిద్దరూ కూడ ఆకుబూరలను చెవికింపుగా ఊదుతూండేహరు. ఎదుగుతున్న(పాములా) నాగకుమారుల్లా వనంలో తిరుగుతూ శోభిల్లుతూ ఉండేవారు. నెమలి ఈకలను చెవిలో ధరిస్తూ, చిగురుటాకులను శిరస్సుపై ధరిస్తూ, కంఠంలో వనమాలను ధరిస్తూ, సాలవృక్షాల్లా ఎదిగారు. పద్మాలు శిరోభూషణంగా, యజ్ఞోపవీతంగా త్రాళ్లను ధరిస్తూ, గోపజనుల కుచితమయిన వేణువును వాయించేవారు ఆ బాలరామకృష్ణులు. ఒకేచోట నివసించేవారు. ఇద్దరూ కలిసి ఒకేచోట ఆడేవారు వనంలో. ఆకులసెజ్జపై ఒకేచోట పడుకొని నిద్రించేవారు. లేగదూడలను కావుకాస్తూ వనాని కంతటికీ శోభ కలిగించేవారు. రాజా! మంగళస్వరూపు లైన వారిద్దరూ కలిసి

దొంగిలిస్తూండేవారు. తిరుగూతూండేవారు. ఆడుతూండేవారు. ఆనంతరం ఆ బలరామకృష్ణు లిద్దరూ బృందావనానికి వెళ్ళి, అక్కడ ఆవులమందను త్రిప్పి తిరిగితీసికొని వచ్చేవారు.

తరువాత ఒకానొకరోజున బలరాముడు లేకుండా అందమైనరూపమూ, శ్రేష్ఠమయిన ముఖమూ కల గోవిందుడు ఒంటరిగా వనంలో సంచరిస్తూ ఉన్నాడు. కాకపక్షధారి, నీలవర్ణుడు, పద్మనేత్రుడు, శ్రీమంతుడు అయిన కృష్ణుడు చంద్రునిలో మచ్చవలె వక్షంపై శ్రీవత్సచిహ్నాన్ని ధరించేవాడు. అతడు రజ్జువు యజ్ఞోపవితంగా ధరించాడు. పచ్చనివస్త్రం ధరించిన యువకుడు. తెల్లగంధం ఒంటికి పూసుకొన్నాడు. నల్లని జుట్టు ముడికలవాడు. మందమారుతం తాకిడికి కదులుతున్న నెమిలి పించం కలిగి ఒక్కొక్కచోట పాడుతూ, ఒక్కొక్కచోట ఆడుతూ, ఒక్కొక్కచోట నర్తిస్తూ, ఒక్కొక్కచోట నవ్వుతూఉంటాడు. గోపవేషంలో ఉన్న కృష్ణుడు మధురంగా పాడుతూ, వేణువును వాయిస్తూ ఉంటాడు. వనంలో గోవులను ఆనందపరచడంకోసం ఇలా చేసేవాడు. వర్షాకాలంలో కూడా తేజస్వి, సమర్థుడూ అయిన కృష్ణుడు అందమైన వనప్రదేశాల్లో గోకులంలో సంచరించేవాడు. అక్కడ ఆడుకొంటూ ఆనందాన్ని అనుభవించేవాడు. భరతశ్రేష్ఠా! అతడు ఒకానొకరోజున వనంలో గోవులతో తిరుగుతూ ఉన్నాడు. మహాత్ముడైన కేశవుడు అలా తిరుగుతూ భాండీరమనే మర్రిచెట్టును చూసి, దానినీడలో ఉండాలని అనుకొన్నాడు. అక్కడ తనతో సమానవయస్కులైన పసులకాపరులతో, దేవతలతో స్వర్గంలో ఉన్నట్లుగా, ఆ చెట్టుకింద కొన్నిరోజులు ఉన్నాడు. భాండీరవటవృక్షం క్రింద ఉంటూన్న గోపాలురు రకరకాల ఆటవస్తువులతో ఆడుతూన్న కృష్ణుని ఆనందపరుస్తూ ఉన్నారు. సంతోషించినమనస్సుతో ఇతర గోపాలురు వనంలో తిరుగుతూ, కృష్ణుని గురించి గానం చేస్తున్నారు. వారు పాడుతూండగానే కృష్ణుడు కూడ ఆకుబూర వాయించాడు. తరువాత వేణువును, తుంబాన్ని, వీణను మధ్యమధ్య మార్చి వాయించాడు. ఈ విధంగానే వేరే ఆటలతో కూడా కృష్ణుడు ఆ గోపాలురతో విహరించాడు. కుంతీనందనా! భరతనందనా! సర్వభూతాలు చూస్తూండగా బాలుడైన వాసుదేవుడు లోకహితాన్ని ఆచరించాడు. ఆ బృందావనంలో కదంబవృక్షాలవనం దగ్గర్లోని సరస్సులో కాళియుడనే సర్పం శిరస్సుపై జనులంతా చూస్తూండగా ఆడి, దాన్ని శాసించి, శ్రీకృష్ణుడు బలరామునితో కలిసి, విహరించాడు.

రాజా! తాళవనంలో గాడిదరూపంలో ఉన్న ధేనుకాసురుని అపుడే బలరాముడు సంహరించాడు. కుంతీనందనా! తరువాత ఒకానొకరోజున బలరామకృష్ణు లిద్దరూ వనంలో ఆవుల మందలను త్రిప్పుతూ ఉన్నారు. ఆనందంతో వనంలో విహరిస్తూ, ఆడుతూ, పాడుతూ, రకరకాల చెట్లను వెతుకుతూ తిరుగుతూన్నారు. శత్రుమర్దనులైన వారిద్దరూ ఆవులను, దూడలనూ పేర్లతో పిలుస్తూ, లోకప్రసిద్ధాలై బలోచితాలైన ఆటలాడుతూన్నారు. మనుష్యదీక్షను వహించి, సురపూజితులైన శ్రీకృష్ణబలరామదేవులు మానవస్వభావానికి తగిన క్రీడలతో వనమంతా తిరిగారు. అనంతరం మహాతేజస్వి అయిన శ్రీకృష్ణుడు గోవ్రజానికి వెళ్ళాడు. అక్కడ గోపబాలురంతా గిరియజ్ఞాన్ని చేస్తున్నారు. అందులోకి వెళ్ళి శ్రీకృష్ణుడు సర్వభూత స్రష్ట అయిన పరమాత్మ తానే అని తెలిసేటట్లుగా, గిరిరాజుకొరకు చేయబడిన పాయసాన్ని తాను ఆరగించాడు. అది చూసి గోపబాలురంతా శ్రీకృష్ణునే పూజింపసాగారు. వారు పూజిస్తూండగా

శ్రీకృష్ణుడు దివ్యమైన శరీరాన్ని పొందాడు. శత్రుమర్దనా! ఒకసారి బాలుడైన వాసుదేవుడు ఆవులరక్షణకోసం గోవర్ధనపర్వతాన్ని ఏడురోజులు ఎత్తిపట్టుకొన్నాడు. భరతనందనా! ఆ కృష్ణుడు ఆడుతూనే, సర్వలోకానికి ఆశ్చర్యకరమై కష్టసాధ్యమైన ఈ పనిని చేశాడు. దేవదేవుడైన ఇంద్రుడు ఆ పని చూసి, ఆనందంతో భూమిమీదికి వచ్చి శ్రీకృష్ణుని గోవిందుడను పేరుతో పిలిచి అభిషేకించాడు. అనంతరం గోవిందుని కౌగిలించుకొని, ఇంద్రుడు స్వర్గలోకానికి వెళ్లాడు. పశువులహితాన్ని కోరి, కృష్ణుడు వృషభరూపంలో ఉన్న అరిష్టుడనే రాక్షసుని చంపాడు.

రాజా! పృథానందనా! వేయి ఏనుగులబలంకల కేశి అనే రాక్షసుడుండేవాడు. అతడు గుర్రంరూపంలో ఉండేవాడు. ఒకసారి కృష్ణుడు వనంలో ఉండగా భోజకులంలో జన్మించిన కంసుడు ఆ రాక్షసుని కృష్ణుని మీదికి పంపాడు. పురుషోత్తముడు అతనిని సంహరించాడు. ఆంధ్రుడైన చాణూరమల్లు డనే మహారాక్షసుని శ్రీకృష్ణుడు సంహరించాడు. భరతనందనా! శత్రుఘాతకుడైన కంసుని సోదరుడు సునాముడు సర్వసైన్యసమేతంగా రాగా, బాలకృష్ణుడు అతనిని కూడ సంహరించాడు. జనసమూహంలో ఉండగా, తనమీదికి వచ్చిన ముష్టికుడనే మల్లుని బలదేవుడు సంహరించాడు. భరతనందనా! ఆ సమయంలో శ్రీకృష్ణుని చూస్తే కంసుడిలో చాలా భయం కలిగింది. ఐరావతవంశంలో పుట్టిన కువలయాపీడమనే గజేంద్రాన్ని కంసుడు చూస్తూండగానే శ్రీకృష్ణుడు చంపాడు. అనంతరం అందరూ చూస్తూండగా శత్రుసూదను డైన శ్రీకృష్ణుడు కంసుని చంపి, ఉగ్రసేనుని రాజ్యాభిషిక్తుని చేసి, తన తల్లిదండ్రులైన దేవకీవసుదేవుల పాదాలకు నమస్కరించాడు. ఇటువంటి పనులుచేస్తూ జనార్దనుడు బలరామునితోపాటు అక్కడ కొన్నిరోజులు నివసించాడు.

నాయనా! అటుతరువాత వాళ్ళిద్దరు గురువైన సాందీపని వద్దకు వెళ్ళారు. ధర్మజ్ఞులై, ధర్మాచరణం చేస్తూ బలరామకృష్ణులు గురుశుశ్రూష చేస్తూ అక్కడున్నారు. అక్కడ ఆ మహాత్ము లిద్దరూ కఠోరనియమాన్ని పాటిస్తూ అరవై నాలుగురోజులలో షడంగాలతో కూడిన వేదాన్ని అధ్యయనం చేశారు. యదునందనులైన బలరామకృష్ణులిద్దరూ చిత్రకళ, గణితం, గాంధర్వవేదం(సంగీతం), వైద్యం సమస్తమూ పొందారు. గజశిక్ష, అశ్వశిక్షలను పన్నెండు రోజులలో పూర్తిచేశారు. ధర్మజ్ఞులు, ధర్మచారులూ అయిన వారుభయులూ ధనుర్వేదాధ్యయనంకోసం మరల సాందీపనిని ఆశ్రయించారు. రాజా! ధనుర్వేదంలో ఆచార్యవరు డైన సాందీపనిని నమీపించి, నమస్కరించారు. వారిని సాందీపని సత్కారపూర్వకంగా చేరదీశాడు. అప్పటినుండి మరలవారు అవంతిరాజ్యంలో నివసించారు. ఏభైరోజులలో దశాంగాలతో, రహస్యాలతో కూడిన ధనుర్వేదాన్నంతా నేర్చుకొన్నారు. విప్రేంద్రుడైన సాందీపని అస్త్రవిద్యానిపుణులైన వారిని చూసి, గురుదక్షిణకై ఆజ్ఞాపించాడు. సాందీపని ఇలా అన్నాడు 'ఈ సముద్రంలోని 'తిమి' అనే జలజంతువు నా కుమారుని మ్రింగేసింది. ఆ నా కుమారుని భద్రంగా తీసికొనిరా!' భీష్ముడిలా అన్నాడు - "పుత్రశోకంతో విలపిస్తున్న గురువుకు ముల్లోకాలలోను ఎవరికీ చేయశక్యంగాని దుష్కరమైన దాన్ని శ్రీకృష్ణుడు చేస్తానని మాటిచ్చాడు. భరతశ్రేష్ఠా! సాందీపనికుమారుని చంపిన అసురుని బలరామకృష్ణులు యుద్ధంలో చంపి సముద్రంలో పడవేశారు. అనంతరం మరణించి, చాలకాలంగా ప్రేతంగా ఉన్న

సాందీపనికుమారుని మరల జీవింపజేశాడు. అతడు మరల సశరీరు డయ్యాడు. చేయశక్యంగాని, ఊహింపశక్యంగాని మిక్కిలి అద్భుతమైన ఆ పనిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. సకలైశ్వర్యాలు, గోవులను, అశ్వాలను, ధనాన్ని, పుత్రునితో బాటుగా బలరామకృష్ణులు గురువుగారి కిచ్చారు. ఆ సాందీపని యొక్క పురంలోని జనులంతా మరల బ్రతికివస్తున్న ఆ పుత్రుని చూసి "ఇది అందరికి శక్యంగాదు, కనీసం ఊహించడానికి కూడా సాధ్యం కాదు. నారాయణుడు తప్ప వేరొకరెవరూ ఇటువంటి అద్భుతాన్ని గురించి ఆలోచింపలేరు. అనుకొన్నారు.

గదాపరిఘయుద్ధాలలో, అన్ని అస్త్రాలయందు కృష్ణుడు మిక్కిలి శ్రేష్ఠతను పొంది అన్నిలోకాలలోను ప్రసిద్ధు డయ్యాడు. నాయనా! యుధిష్ఠిరా! భోజరాజకుమారుడైన కంసుడు కూడ అస్త్రజ్ఞానంలోను, బలంలోను, పరాక్రమంలోను కార్తవీర్యునితో సమానుడయ్యాడు. ఆ భోజరాజ్యాన్ని వృద్ధిచేస్తున్న భోజవంశీయుడైన కంసునివల్ల రాజులందరూ గరుత్మంతుని వల్ల సర్పాలవలె భయపడుతూండేవారు. ఆ కంసునిదగ్గర చిత్ర-కార్ముక-నిస్త్రింశ-విమల-ప్రాసాలతో యుద్ధంచేసే పదాతిదళాలవారు ఒకకోటి మంది ఉన్నారు. బంగారుధ్వజాలు గల రథికులై, యుద్ధంలో వెనుదిరగని, శూరులు ఆ కంసునివద్ద ఎనిమిదిలక్షల మంది ఉన్నారు. యుధిష్ఠిరా! బంగారు కక్ష్యలు గలిగి యుద్ధంలో వెనుదిరగని, ఎనిమిదిలక్షల ఏనుగులు ఆ కంసునిదగ్గర ఉన్నాయి. ఆ కంసుని దగ్గరున్న గజేంద్రాలు పర్వతాకారంలో ఉన్నాయి. అవి విచిత్రాలైన ధ్వజపతాకలు కలిగి, నిత్యం ఆనందంతో ఉండేవి. యుధిష్ఠిరా! బాగుగా అలంకరింపబడి, వేగంగా వెళ్లే ఆడుఏనుగుల యొక్క బలం ఏనుగుల బలం కంటె రెట్టింపు ఉంది. యుధిష్ఠిరా! అతనిదగ్గర మోదుగపూలులా ఎర్రగా ఉన్న గుర్రాలు పదహారువేలు ఉన్నాయి. కొదమగుర్రాలు మరొక పదహారువేలు ఉన్నాయి. అవి స్వారీ చేయటానికి శ్రేష్ఠమైనవి. బలవంతంగా వాటి నెవరూ లొంగదీసికోలేరు. వాటన్నింటిని కంసుని సోదరుడు సునాముడు నడిపిస్తాడు. కంసునితో సమానుడైన సునాముడు ఎల్లప్పుడు కంసుని రక్షణ చూస్తూంటాడు. యుధిష్ఠిరా! అతనిదగ్గర అన్ని వర్ణాలు కలిగిన గుఱ్ఱాలు మిశ్రగణం పేరుతో ఆరవైవేలు వేరుగా ఉన్నాయి.

కంసునితో జరుగబోయే యుద్ధం ఒక భయంకరమైన నదిలా ఉంది. అది కంసుని యొక్క రోష మనే మహావేగం కలది. ధ్వజాలనే నదీ తీర వృక్షాలు కలది. మదించిన ఏనుగులనే మొసళ్లుకలది. యముని అధీనంలో ప్రవహిస్తున్నది. శస్త్రసముదాయ మనే పెద్ద నురుగు కలది. గుర్రాలవేగ మనే మహాజలం కలది. గదలు, పరిఘలు అనే పాఠీనమత్స్యాలు కలది. వివిధ కవచా లనే నాచు కలిగినది. రథాలు, ఏనుగులు అనే పెద్ద సుడులు కలది. అనేక విధాలైన రక్తాలనే బురద కలది. విచిత్రాలైన ధనుస్సు లనే తరంగాలు కలది. రథాల, అశ్వాల సముదాయమే మడుగులుగా గలది. యుధిష్ఠిరా! సైనికులు ఇటూ అటూ తిరుగుతూ చేసే ధ్వని యుద్ధంలో భయంకరంగా నదీప్రవాహ ఘోషలా ఉంది. నారాయణుడు తప్ప వేరెవరు కంసుని చంపగలరు? భరతనందనా! పెనుగాలి దట్టమైన మేఘాలను చెల్లాచెదరుచేసినట్లు శ్రీకృష్ణుడు ఇంద్రునిరథంలో ఉండి కంసుని సేనలన్నింటిని సంహరించాడు. సభలో అమాత్యులతో, తన వంశీయులతో కూడి ఉన్న కంసుని శ్రీకృష్ణుడు సంహరించి, స్నేహితురాండ్రతో

ఉన్న, పూజ్యారాలగు దేవకిని గౌరవించాడు. కృష్ణుడు యశోదకు, రోహిణికి మరలమరల నమస్కరించి, ఉగ్రసేనుని రాజుగా అభిషిక్తుని చేశాడు. ఉపేంద్రుడైన శ్రీకృష్ణభగవానుని యదుముఖ్యులంతా పూజించారు. అనంతరం సరస్వతీనదీతీరంలో రాజు లందరితో కలిసివస్తూన్న జరాసంధుని పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు జయించాడు.

యాదవు లందరికి ఆనందం కలిగించిన శ్రీకృష్ణుడు శూరసేనపురాన్ని విడిచిపెట్టి, ద్వారకకు వచ్చాడు. పుండరీకాక్షుడైన (కమలనేత్రుడైన) శ్రీకృష్ణుడు రాక్షసులను సంహరించి అనేకరత్నాలను, వాహనాలను పొంది యథాయోగ్యంగా వారినీ రక్షించాడు. వరాలతో గర్వించిన మహాసురులను, దానవులతో కూడి, విఘ్నాలు కలగజేస్తున్న దైత్యులను శ్రీకృష్ణుడు సంహరించాడు. దేవతాగణాలకు కూడా భయంకరుడై నరకు డనే రాక్షసుడు విఘ్నాలు కలుగజేశాడు. అతని ప్రభావం గురించి మీకూ తెలుసు. అతడు సర్వదేవాసురులకు యమునిలాంటివాడు. మనుష్యులకు, ఋషులకు విరోధంగా ప్రవర్తించేవాడు, శత్రుదుర్భేద్యమైన మూర్తిలింగరూపమైన గుహను భూమిలో నిర్మించుకొని, అందులో ఉండేవాడు. నరకాసురుని భౌముడని కూడా అంటారు. అతడు ఏనుగురూపంలో త్వష్టయొక్క కూతురు కశేరువును చేపట్టాడు. ఆమె చాలా అందమైంది. పదునాల్గుసంవత్సరాల ప్రాయం కలది. నరకుడు ప్రాగ్జ్యోతిషపురాన్ని పాలించేవాడు. అతనికి దుఃఖం కాని, భయం కాని, బాధలు కాని లేవు. అతడు కశేరువును బలవంతంగా చేపట్టి తనపురానికి ఎత్తుకొనివచ్చాడు. ఆమెతో ఇలా అన్నాడు. 'దేవీ! దేవతలదగ్గర, మనుష్యుల దగ్గర ఉన్న వివిధ రత్నాలన్నింటిని, ఈ భూమిమీద, సముద్రాలలోను ఉన్న సంపదలను ఈ రోజునుండి దైత్యులు, దానవులు, సర్వరాక్షసులు నీకు బహుమానంగా ఇస్తారు.'

ఈ విధంగా ఎన్నో ఉత్తమ రత్నాలను స్త్రీరత్నాలను కూడా నరకుడు ఎత్తుకొనివచ్చాడు. ఆ నరకుడు గంధర్వకన్యలను, దేవమనుష్యకన్యలను, ఏడు విధాల అప్సరోగణాలను బలవంతంగా ఎత్తుకొనివచ్చాడు. ఆ రీతిగా కొనిరాబడిన స్త్రీలు పదహారువేల వందమంది అతని దగ్గర ఉన్నారు. వారంతా సత్పురుషుల మార్గాన్ని అనుసరిస్తూ, ఏకవేణీధరలై నియమంగా ఉంటున్నారు. నరకుడు వారందరికి మణిపర్వతం మీద అంతఃపురాన్ని నిర్మించాడు. దానిపేరు ఔదక. దాన్ని మురాసురుని అధీనంలో ఉంచాడు. వారిని ప్రాగ్జ్యోతిషపురరాజు నరకుడు, మురాసురుని పదిమంది కుమారులు, ఇతరులైన ముఖ్యరాక్షసులు రక్షిస్తూ సేవిస్తున్నారు. యుధిష్ఠిరా! భూమిపుత్రుడైన నరకాసురుడు తపస్సు చివరిలో వరాన్ని పొందాడు. దానితో గర్వించి దేవమాత అదితిని కుండలాలకోసం అవమానించాడు. మునుపు రాక్షసులెవ్వరూ చేయని మహాఘోరమైన పాపాన్ని ఆ నరకాసురుడు చేశాడు. భూదేవి అతనిని కన్నది. ప్రాగ్జ్యోతిషపురం రాజధానిగా అతడు రాజ్యమేలుతున్నాడు. యుద్ధ దుర్మదులైన నలుగురు దైత్యులు ఎల్లపుడు ఆ పురాన్ని రక్షిస్తూంటారు. ఆ రాక్షసులు తక్కిన వికృతరూపాలు గల రాక్షసులతోపాటుగా భూమార్గంనుండి దేవమార్గం దాకా మార్గాన్నంతా ఆక్రమించి అందరినీ భయపెడుతూంటారు. హయగ్రీవుడు, నిశుంభుడు, క్రూరుడైన పంచజనుడు, వేయిమంది పుత్రులుగల మురుడు- వీరు నలుగురు వరదానం పొంది సంచరించేవారు. వారిని చంపడంకోసం, మహాబాహువు,

చక్రగదాఖడ్గధారి, జనార్దనుడూ అయిన వాసుదేవుడు వృష్ణివంశంలో జన్మించాడు. నాయనా! యుధిష్ఠిరా! లోకప్రసిద్ధతేజస్సుగల ఆ పురుషోత్తముడు ద్వారకలో నివసిస్తూన్నాడు. ఈ విషయం మీకందరికీ తెలుసు.

యుధిష్ఠిరా! ఇంద్రునినివాసమైన అమరావతికంటె మిక్కిలి అందమైన నగరం ద్వారక. ఈ భూమిపై అన్నింటికంటె మిక్కిలి అందమైంది ద్వారక. నీవీ విషయం ప్రత్యక్షంగా ఎరుగుదువు. అమరావతిలా ప్రసిద్ధమైన ఆ ద్వారకానగరంలో వృష్ణివంశీయులంతా ఉండే పెద్దసభామండపం ఉంది. అది 'దాశార్హ' అను పేరుతో ప్రసిద్ధమైంది. అది ఒక యోజనవైశాల్యం కలది. బలరామకృష్ణులు ముందుండగా, వృష్ణి, అంధకవంశీయులంతా అక్కడుండేవారు. వారు సమస్తమైన జనుల జీవనాన్నీ రక్షిస్తూ ఉండేవారు. భరతశ్రేష్ఠా! అక్కడి ఆసనాలన్నింటియందు ఒకానొకప్పుడు దివ్యపరిమళంగల గాలులు వీచాయి. పూలవానలు కురిశాయి. తరువాత వేయిసూర్యుల సమానకాంతిగల మహోద్భుతమైన తేజోరాశి ముహూర్తకాలం అంతరిక్షంలో ఉండి, తరువాత భూమిపై అవతరించింది. ఆ తేజస్సుమధ్యలో తెల్లని ఏనుగుపై దేవగణాలతో పరివృతుడై ఇంద్రుడు కనబడ్డాడు. బలరామకృష్ణులు, ఉగ్రసేనమహారాజు, వృష్ణ్యంధక గణాలు వెంటనే ఎదురేగి, అతనికి నమస్కరించారు. అతడు ఏనుగుమీద నుండి వేగంగా దిగి, జనార్దనుని, బలదేవుని, రాజును కౌగిలించుకొన్నాడు. ఉద్ధవుని, వసుదేవుని, ధీశాలి వికద్రువుని, ప్రద్యుమ్నుని, సాంబుని, నిశఠుని, అనిరుద్ధుని, సాత్యకిని, గద, సారణ, ఆక్రూర, కృతవర్మ, చారుదేష్ణ, సుదేష్ణాది యాదవులను యథోచితంగా కౌగిలించుకొని అందరినీ చూశాడు. అదేవిధంగా ఇంద్రుడు వృష్ణ్యంధకప్రధానులను కౌగిలించుకొని, వారు చేసిన పూజను స్వీకరించి, తలవంచుకొని ఈ విధంగా పలికాడు.

'నాయనా! కృష్ణా! నీతల్లి అదితి పంపగా వచ్చాను. భూమిపుత్రుడైన నరకుడు కుండలాలను అపహరించాడు. మధుసూదనా! మహాభాగా! నరేశ్వరా! ఈలోకంలో తల్లి ఆదేశాన్ని ఆచరించేవాడివి నీవే. అందువల్ల నీవు నరకాసురుని సంహరించు.' మహాబాహువైన జనార్దనుడు ప్రసన్నుడై అతనితో ఇలా అన్నాడు - 'ఆ నరకాసురుని సంహరించి కుండలాలను తీసికొని వస్తాను.' ఇలా పలికి బలరాముడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, సాంబుడు మున్నగువారితో గోవిందుడు మాట్లాడాడు. తర్వాత మహాయశస్వి అయిన వాసుదేవుడు దేవతలకు హితాన్ని చేయగోరి గరుడవాహనాన్ని అధిరోహించి వెళ్ళాడు. శత్రుసంహర్త, అచ్యుతుడూ అయిన శ్రీకృష్ణుడు బయలుదేరగా వెనుకనే ఇంద్రుని ముందిడుకొని దేవతలందరు ఆనందంతో స్తుతిస్తూ వెళ్ళారు. శ్రీకృష్ణభగవానుడు నరకాసురుని యొక్క ముఖ్యులైన రాక్షసగణాలను సంహరించాడు. మురానురుడు సృష్టించిన ఆరువేల పాశాలను చూశాడు. ఆ పాశాల చివరల చురకత్తు లుంటాయి. శ్రీకృష్ణుడు అస్త్రంతో ఆ పాశాలను ఛేదించి, మురాసురునీ, అతని వంశీయు లందరినీ సంహరించాడు. శిలాసంఘాలను అతిక్రమించి, నిశుంభుని సంహరించాడు. అటుపై వేలయోధులకు సమానమైనవాడు, సర్వదేవతలతో ఒంటరిగా యుద్ధం చేయగల మహాబలవంతుడూ, తేజోవంతుడూ అయిన హయగ్రీవుని శ్రీకృష్ణుడు సంహరించాడు. శ్రీకృష్ణుడు లోహితగంగ మనేచోట

ఉన్న ఔదకమనే ప్రదేశంలో విరూపాక్షుని, నరకుని వెంటనుంటూ క్రూరమైన పంచజనులుగా ప్రసిద్ధినొందిన రాక్షసులను సంహరించాడు.

అనంతరం సంపదలతో ప్రకాశిస్తూన్నట్లుగా ఉన్న ప్రాగ్జ్యోతిషపురానికి వెళ్ళాడు. అక్కడ యుద్ధం జరిగింది. వారికి జరిగిన యుద్ధంతో దైవాసురులకు జరిగిన మహాయుద్ధం కూడా సమానం కాదు. అది లోకానికంతటికి మిక్కిలి ఆశ్చర్యకరంగా ఉంది. జనార్దనుని ఎదుర్కొన్న దానవులు చక్రం, లాంఛనం, శక్తి, ఖడ్గం మున్నగు వానిచే పడిపోయారు. శ్రీకృష్ణుడు ఎనిమిది లక్షలమంది దానవులను సంహరించి, పాతాళగుహలోకి ప్రవేశించాడు. అక్కడ నరకునితో కృష్ణుడు మధురాక్షసునితో వలె యుద్ధం చేయసాగాడు. భరతనందనా! దేవేంద్రుని కోరికపై అదితికుండలాల కొరకు మహాత్ముడైన శ్రీకృష్ణునికి, నరకునికి ఘోరమైన యుద్ధం జరిగింది. సుదర్శనచక్రాన్ని ధరించి బలవంతుడై మధుసూదనుడు ముహూర్తకాలం నరకుని లాలనతో పలకరించి, పిమ్మట చక్రంతో అతని శిరస్సును ఖండించాడు. వజ్రాయుధం చేత వృత్రాసురునిలా చక్రంచేత ఖండింపబడిన అతని శిరస్సు హఠాత్తుగా భూమిపై పడింది. భూదేవి నేలపై పడిన నరకునిచూసి, కుండలాలు తీసికొని శ్రీకృష్ణుని కిచ్చి, ఆ మహాబాహునితో ఇలా పలికింది. భూమి ఇలా అంది – 'ప్రభూ! నీచేతనే సృష్టించబడ్డాడు. నీచేతనే చంపబడ్డాడు. నీవెలా కోరుకొంటే అలా ఆడుకో. అతని సంతానాన్ని మాత్రం రక్షించు.' శ్రీకృష్ణభగవానుడిలా అన్నాడు – 'నీ కుమారుడైన ఈ నరకుడు దేవతలను, మునులను, పితరులను, మహాత్ములను, సర్వప్రాణులను భయపెట్టినవాడు. బ్రహ్మద్వేషి పురుషాధముడు, జనులచే ద్వేషింపబడినవాడు, దేవతలకు శత్రువు. లోక కంటకుడూను. సమస్తలోకాలకు నమస్కరింపదగిన అదితిని బాధించి బలవంతంగా, గర్వంతో కుండలాలను అపహరించినవాడు, అందువల్ల ఇతడు చంపబడినాడు. భామినీ! నేను చేసిన పనివల్ల నీవు నాపట్ల కోపగించవద్దు. నా ప్రభావం వల్ల నీపుత్రుడు ఉత్తమగతిని పొందాడు. మహాభాగా! అందువల్ల ఇక నీవు వెళ్ళు. నీకు భారాన్ని తగ్గించాను.'

సత్యభామ తోడుండగా, భూమికుమారుడైన నరకుని సంహరించి, లోకపాలురతోపాటు, శ్రీకృష్ణుడు నరకుని నివాసాన్ని సందర్శించాడు. యశస్వి అయిన నరకుని ఇంట్లో అక్షయమైన ధనం, వివిధరత్నాలు ఉండటం చూశాడు. మణులు, ముత్యాలు, ప్రవాళాలు, వైడూర్యాలు పొదిగిన వస్తువులు, అశ్వసారాలు, సూర్యకాంతమణులు, స్వచ్ఛ స్ఫటికాలూ ఉన్నాయి. జాంబూనదం, శాంతకుంభం అనే బంగారాలతో చేయబడిన వస్తువులు,మండుతున్న అగ్నివలె ప్రకాశిస్తూ చంద్రకాంతి వంటి ప్రకాశం కల అనేకవస్తువు లున్నాయి. అంతఃపురభవనం బంగారువర్ణంతో స్వచ్ఛంగా ప్రకాశిస్తున్నది. ఆ గృహంలో నరకుని అక్షయసంపదలు ఉన్నాయి. అంతటి సంపద కుబేరుని దగ్గర కూడా ఉండదు. సాక్షాత్తూ మహేంద్రుని భవనాలలో కూడ అంత సంపదను పూర్వం చూసి ఉండలేదు. ఇంద్రుడిలా అన్నాడు – 'వివిధ మణిరత్నాలు, సంపదలు, బంగారుజలతారుగల పెద్ద పెద్ద అంబారీలు, తోమరాలతో భీమరూపంగల ఏనుగులు, పగడాలు పొదిగిన కంబళ్లు/బొంతలు, నిర్మలమైన పతాకాలు, వివిధ వస్త్రాలు, (వీటన్నింటిపై నీకే అధికారం ఉంది) ఇరవై వేల ఏనుగులు, వాటికి రెట్టింపు ఆడ ఏనుగులూ

ఉన్నాయి. దేశీయాలై శ్రేష్ఠాలైన అశ్వాలు ఎనిమిది లక్షలున్నాయి. ఎద్దులతో కూడిన క్రొత్త క్రొత్త (వాహనాలు) బళ్ళు ఉన్నాయి. ఇవన్నీ నీవే. శత్రుదమనా! సన్నని ఉన్ని వస్త్రాలు, అనేకవిధాలైన శయనాలు, ఆసనాలు, ఇచ్ఛానుసారం మాట్లాడే అందమైన పక్షులు, చందనాగురు మిశ్రితాలైన వివిధరథాలు ఉన్నాయి. వీటన్నింటిని వృష్ణివంశీయుల నివాసమైన ద్వారకకు తరలిస్తాను.

నరకాసురభవనంలో ఉన్న దేవత గంధర్వ దైత్య అసురుల రత్నాలనన్నింటిని ఇంద్రుడు కృష్ణునితో పాటు గరుడుని పైకెక్కించి, మణిపర్వతం మీదికి వెళ్ళాడు. అక్కడ స్వచ్ఛంగా గాలులు వీచాయి. విచిత్రాలైన ఉజ్జ్వలకాంతులు అంతట వ్యాపించాయి. వాటిని చూస్తూన్న దేవతా సమూహాలు ఆశ్చర్యం పొందారు. ఆ పర్వతకాంతి ఆకాశంలోని చంద్రసూర్య దేవతామహర్షుల కాంతిని తిరస్కరిస్తోంది. దానితో వాటి కాంతిలో విశేషమేమీ లేనట్లుంది. బలరాముని చేత, ఇంద్రుని చేత అనుజ్ఞ పొంది మహాబాహుడైన శ్రీకృష్ణుడు ప్రీతితో నరకాసురనివాసమైన మణిపర్వతాన్ని ప్రవేశించాడు. అక్కడ వైడూర్యవర్ణాలతో నున్న ద్వారాలను, తోరణపతాకాలు గల గృహాలను మధుసూదనుడు చూశాడు. స్వర్ణమయమైన విచిత్ర పతాకాలు గల భవనాలతో శోభిల్లుతున్న మణిపర్వతం చిత్రంలో వ్రాయబడిన మేఘం వలె ప్రకాశిస్తోంది. మణులు పొదిగిన మెట్లుగల విశాలహర్మ్యాలున్నాయి. వాటిలో ఉన్న అందమైన మేనిఛాయగల గంధర్వ, సురముఖ్యుల ప్రియురాండ్రు, కూతుళ్లు, స్వర్గసమానమైన ఆ ప్రదేశంలో ఉన్న అపరాజితుడైన మధుసూదనుని చూశారు. అతనిని చూడగానే వారంతా శ్రీకృష్ణుని దగ్గరకు పరుగెత్తుకొని వచ్చారు. వారంతా కాషాయవస్త్రాలు ధరించి, ఇంద్రియనిగ్రహంతో ఒంటిజడతో తపస్సుచేస్తూ ఉన్నారు. వ్రతాన్ని పాటించడం వల్ల కలిగిన దుఃఖం వారినెవ్వరినీ బాధపెట్టలేదు. నిర్మలమైన, ప్రకాశవంతమైన వస్త్రాలు ధరించిన ఆ స్త్రీలు యదుసింహుడైన హృషీకేశుని వద్దకు వెళ్ళి చేతులు జోడించి, నమస్కరించి, ఇలా అన్నారు.

'పురుషోత్తమా! దేవతల కార్యసిద్ధికై గోవిందుడు వస్తాడని నారదుడు మాకు చెప్పాడు. అతడు సపరివారంగా నరకుని, నిశంభుని, మురాసురుని, హయగ్రీవుని, పంచజనులను సంహరించి, ఈ అనంతసంపదను పొందుతాడు. అతడు అచిరకాలంలోనే మిమ్ము విడిపిస్తాడు. అని దేవర్షి నారదుడు చెప్పి వెళ్లాడు. నిన్ను తలుచుకొంటూ నిత్యం ఘోరమైన తపస్సు చేస్తూ ఉన్నాము. చాలాకాలం గడచింది. మహాబాహువు అయిన మాధవుని ఎపుడు చూస్తామో! అని మనసులో సంకల్పం చేసికొని, పురుషోత్తమా! ఈరాక్షసులచే రక్షింపబడుతూ, ఎల్లపుడూ తపస్సు చేస్తున్నాం. గాంధర్వవిధితో వివాహం చేసికొని మాకు ప్రియాన్ని కల్గించు. మాకు ప్రియమైన కోరిక సిద్ధించటం కొరకు వాయుదేవుడు కూడా 'దేవర్షి నారదుడు చెప్పింది త్వరలో జరుగుతుంది' అని చెప్పాడు. దేవగంధర్వాది స్త్రీలచే గౌరవింపబడిన ఆ వృషభాక్షుడైన శ్రీకృష్ణుని, దేవగంధర్వులంతా నూతనగోవులతో కూడిన గోపాలునిలా చూశారు. చంద్రునిలా ఉన్న అతని ముఖాన్ని చూసి సంతుష్టమనస్కులై ఆ కన్యలు ఆనందంతో మహాబాహువైన శ్రీకృష్ణునితో ఇలా అన్నారు.

పూర్వ మెప్పుడో వాయుదేవుడు ఈ మాట మాకు చెప్పాడు. అది నిజమైంది. ప్రాణులందరి

పనులూ తెలిసికొన గల నారదమహర్షి కూడా ఇలా చెప్పాడు. 'సర్వవ్యాపకుడైన నారాయణుడు శంఖ, చక్ర, గదా, ఖడ్గాలను ధరించి, భూమికుమారుడైన నరకుని చంపి మీకు భర్త కాగలడు. మా సౌభాగ్యంవల్ల ఆ దేవర్షిముఖ్యుడైన నారదమహాత్ముని వచనం నీ దర్శనం చేతనే నిజం కాదగింది. మహాత్ముడ వైన చంద్రుని వంటి నీముఖం చూడటంచేతనే, ఈ రోజు మేము కృతార్థుల మయ్యాము.' భగవంతుని పట్ల కామభావం కలిగిన వారందరితో యదుశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడిలా అన్నాడు. 'సుందరీమణులారా! మీరు కోరినవిధంగానే అంతా మీకు జరుగుతుంది. ఆ సమస్త రత్నాలను, దేవతానృపకన్యకలను, ఇతరస్త్రీలను సేవకులచే ద్వారకకు పంపి, దేవకీసుతుడైన శ్రీకృష్ణుడు శ్రేష్ఠమగు మణిపర్వతాన్ని వైనతేయుని భుజాలపై వేగంగా ఎక్కించాడు. సర్వప్రాణులు చూస్తుండగా, పక్షిగణాలతో, ఏనుగులతో, సర్ప, మృగ, పన్నగాల సమూహాలతో శిలలతో న్యంకువులతో, వరాహాలతో, రురుమృగాలతో కూడి, సెలయేళ్ళతో, పెద్దసానువులతో, విచిత్రాలైన నెమళ్ళ సమూహంతో ఆ మణిపర్వతాన్ని పెకలించి శ్రీకృష్ణుడు గరుడునిపై పెట్టాడు. మహాపర్వతాన్ని పోలిన మహాబలుడైన గరుడుడు బలరామకృష్ణులను, మహాబలుడైన ఇంద్రుని, రత్నరాసులను, మణిపర్వతాన్ని, వరుణుని అమృతాన్ని, చంద్రుని పోలిన దివ్యఛత్రాన్ని మోస్తూ, తన రెక్కల కదలికలచే అన్ని దిక్కులయందు వింతధ్వనిని కలిగించాడు. ఎగురుతూన్న గరుడుడు పర్వతాగ్రాలను పడగొడుతూ, వృక్షాలను పెకలిస్తూ, జోతిష్పథంలోకి వెళుతూ, పెద్దపెద్ద మేఘాలను కూడా తనతో లాక్కువెళుతున్నాడు. గరుడుడు తన తేజస్సుతో గ్రహనక్షత్రతారల, సప్తర్షుల ప్రభలసముదాయాన్ని అతిక్రమించి చంద్రసూర్యమార్గానికి వెళ్ళాడు. భరతశ్రేష్ఠా! మేరుపర్వతం యొక్క మధ్యమశిఖరానికి చేరేసరికి మధుసూదనుడు సమస్తదేవస్థానాలను చూశాడు. యుధిష్ఠిరా! విశ్వేదేవతలయొక్క, మరుద్గణాలయొక్క, సాధ్యులయొక్క ప్రకాశమయస్థానాలను అతిక్రమించి, అశ్వినీకుమారుల పుణ్యతమలోకం చేరి, తరువాత శ్రీకృష్ణుడు దేవలోకం చేరాడు.

ఇంద్రుని భవనం చేరిన జనార్దనుడు గరుడునిపైనుండి క్రిందికి దిగి, అదితి పాదాలకు నమస్కరించాడు. సమస్తదేవతలు, బ్రహ్మ, దక్షుడు మున్నగు ప్రజాపతులందరు అతనిని పూజించారు. అటు తరువాత బలరామునితో పాటు కేశవుడు దివ్యాలయిన అదితి కుండలాలను, అమూల్య రత్నాలను ఇచ్చాడు. అదితి వాటి నన్నింటినీ స్వీకరించి, మానసికదుఃఖం శాంతించగా, బలరామకృష్ణులను గౌరవించింది. ఇంద్రుని పట్టమహిషి శచీదేవి శ్రీకృష్ణుని పట్టమహిషి సత్యభామను తీసికొనివచ్చి అదితికి పరిచయం చేసింది. దుఃఖోపశమనం పొందిన దేవమాత అదితి కృష్ణునికి ఇష్టం చేయగోరి, సత్యభామకు వరమిచ్చింది. అదితి ఇలా అంది – "వరాననా! (సుందరీ!) కృష్ణుడు మానవుడుగ ఉన్నంతవరకు నీవు ముసలితనం పొందవు. దివ్యగంధం, ఉత్తమగుణాలను కలిగి ఉంటావు." సౌందర్యవతి అయిన సత్యభామ శచీదేవితో విహరించి, ఆమె అనుమతి గైకొని, కృష్ణుని మందిరానికి వెళ్లింది. దేవతలచేతను, మహర్షి గణాలచేతను, పూజింపబడి శ్రీకృష్ణుడు దేవలోకంనుండి ద్వారకకు బయలుదేరాడు. మహాబాహువైన అచ్యుతుడు దీర్ఘమైన మార్గాన్నంతా దాటి, వర్ధమాన మనే ద్వారకా పురద్వారానికి చేరుకొన్నాడు. నారాయణుడు సర్వార్థసంపన్నమైన ఆ ద్వారకాపురిని చూసి సంతోషించి లోనికి

ప్రవేశింప నారంభించాడు. ఆ ద్వారవతి చుట్టూ అనేక పుష్పఫలాలతో అందంగా ఉన్న ఉద్యానవనాలలోని వృక్షసమూహాలను అతడు చూశాడు. సూర్యచంద్రులవంటి ప్రకాశంతో, మేరుశిఖరం వంటి కాంతులుగల, అందమైన గృహాలతో విశ్వకర్మ ద్వారకను నిర్మించాడు. పద్మలతల సముదాయాలతో నిండి, హంసలు తిరుగుతూన్న గంగాసింధునదుల వలె ప్రకాశిస్తున్న అగడ్తలతో అలరారుతూ ఉన్నది ఆ ద్వారకాపురి. సూర్యకాంతి వంటి తెల్లని కాంతితో ప్రకాశిస్తున్న ప్రాకారంతో అది మేఘాలతో కప్పబడిన, ఆకాశశిఖరం మీద ఉంచబడిన స్వర్గం వలె ప్రకాశించింది.

నందనవనాన్ని, మిశ్రకవనాలను పోలిన వనాలతో ఆ పురం ప్రకాశిస్తున్నది. దివ్యమైన బ్రహ్మయొక్క వనం వలె ప్రకాశిస్తూన్నది. అన్ని ఋతువులలోని పూలతో సమృద్ధమైన వైభ్రాజమనే దివ్య వనంవలె మనోహరాలైన ఉపవనాలతో, ఆకాశంలో వెదజల్లబడిన నక్షత్రాలు గల స్వర్గం వలె ద్వారకాపురి ఉంది. అందమైన ఆ ద్వారకాపురానికి తూర్పు దిక్కున ఆ పట్టణానికే అలంకారమై చక్కని కొండచరియలతో విశాలమైన రైవతకపర్వతం ప్రకాశిస్తున్నది. ఆ పురానికి దక్షిణదిక్కున లతావేష్ట మను పర్వతం ఉంది. అది పంచవర్ణాలతో ఇంద్రధనుస్సులా ప్రకాశిస్తున్నది. పశ్చిమ దిక్కున సుకక్షమనే పర్వతరాజమున్నది. అది చిత్రాలైన పూలతోటలతో శోభిల్లుతూన్నది. ఉత్తరపు దిక్కున మందరపర్వతంతో సమానంగా ప్రకాశించే తెల్లని వేణుమంత పర్వతం విరాజిల్లుతూన్నది. రైవతక పర్వతానికి దగ్గర్లో చిత్రకంబలం వంటి రంగులతో ప్రకాశించే పాంచజన్యవనమూ, సర్వర్తుక వనమూ ప్రకాశిస్తూన్నవి. లతావేష్ట పర్వతానికి నాలుగుదిక్కులా మేరు ప్రభవనం, తాళవనం, తెల్లతామర పూలవలె ప్రకాశించే పుష్కకవనమూ ఉన్నాయి. సుకక్షపర్వతానికి చుట్టూ చిత్రపుష్పమనే పెద్దవనం, శతపత్రవనమూ, కరవీరవనమూ, కుసుంభివనమూ ఉన్నాయి. వేణుమంత పర్వతానికి నాలుగువైపులా చైత్రరథం, నందనం, రమణం, భావనం అనే మహావనాలు ఉన్నాయి. శ్రీకృష్ణునియొక్క ఆ నగరానికి తూర్పుదిక్కున అందమైన పుష్కరిణి ఉంది. అది నూరు ధనుస్సుల వైశాల్యం కలది. ద్వారవతీ మహాపురం ఏభైముఖద్వారాలు కలిగి ఉంది. చుట్టూ వెలుగులు వెదజల్లే పురంలోకి కృష్ణుడు ప్రవేశించాడు. అపరిమితమై, మహోన్నతమై, అగాధజలప్రవాహాలతో, తెల్లని ఉన్నత ప్రాసాదాలతో ద్వారకాపురి శోభిల్లుతున్నది. తీక్ష్ణయంత్రాలు, శతఘ్నులు, వివిధయంత్ర సమూహాలతో, పెద్దపెద్ద ఇనుపచక్రాలతో ద్వారకాపురి శోభిస్తోంది. అమరావతిలో వలె ప్రాకారాలవద్ద చిరుఘంటికలతో, ఎగురుతున్న పతాకలతో ఎనిమిది వేల రథాలు ఉన్నాయి. ఎనిమిది యోజనాల వెడల్పు, పన్నెండు యోజనాల పొడవు కలిగినది ద్వారకాపురి. దాని పరిసర ప్రాంతం దాని వైశాల్యానికి రెట్టింపు కలది. అన్ని విధాల అచంచలమైన ఆ పురిని కృష్ణుడు చూశాడు. ఎనిమిది ప్రధాన మార్గాలు పెద్దపెద్దకక్ష్యలు, పదహారు చతుష్పథాలు కలది ఆ నగరం. అట్టి మార్గాలతో నిర్మింపడిన ఆ నగరం సాక్షాత్తు శుక్రనీతి ననుసరించి ఉన్నది. వ్యూహాల నడుమ మార్గా లున్నాయి. ఏడు ప్రధాన రహదారు లున్నాయి. ఆ నగరం సాక్షాత్తూ విశ్వకర్మచే నిర్మింపబడినది. మణులు పొదిగిన బంగారు సోపానాలతో, గీతాల మధుర ఘోషలతో శ్రేష్ఠాలైన భవనాలతో ఆ నగరం జనులకు ఆనందం కలిగిస్తోంది. శ్రేష్ఠమైన ఆ ద్వారకానగరంలో దాశార్హ వంశీయుల భవనాలను చూసి ఇంద్రుడు

చాలా ఆనందించాడు.

ఆ నగరంలోని భవనాలపై ఎత్తుగా పతాకాలు ఎగురుతున్నాయి. అవి మేఘాలతో సమానంగా ఉన్నాయి. బంగారు రంగుతో ప్రకాశిస్తూ మేరుపర్వతశిఖరాలవలె ఉన్నాయి. వెల్ల వలె తెల్లని శిఖరాలతో, తెల్లని కుంభాలతో ఆలంకరింపబడి, రత్నమయగుహాలుగల శిఖరాలతో, అంతటా రత్నాలతో అలంకరింపబడి ఉన్నాయి. ఉన్నతమైన అంతరువులతో, అర్ధచంద్రాకారపు భవనాలమీది సెజ్జలతో, అక్కడ సంచరించే పక్షులతో, యంత్రగృహాలతో గైరికాది ధాతువులతో కూడిన పర్వతాల వలె ఆ నగర భవనాలు ప్రకాశిస్తున్నాయి. మణులతో, బంగారంతో, మట్టితో నిర్మింపబడి, సున్నం వేయబడిన తెల్లని క్రిందిభాగాలతో బంగారంతో చేయబడిన ద్వారాలతో, వైడూర్యాలు పొదిగిన గడియలతో కూడినవి ఆ భవనాలు. అక్కడ అన్ని ఋతువులలో సుఖంగా గాలులు వీస్తాయి. అవి మహాసంపదలతో నిండి ఉన్నాయి. అందమైన సామువులతో, గుహలతో, శిఖరాలతో, విచిత్రాలైన పర్వతాలవలె ఆభవనాలు అందముగా ఉన్నాయి. అచటి భవనాలు ఐదురంగులలో గల సువర్ణవిశేషాలతో, పూలవానలతో సమానమైన కాంతులతో, గర్జనవంటి ధ్వనులతో నిండి రంగురంగుల మేఘాలవలె ఉన్నాయి. మహేంద్రపర్వత శిఖరాలను పోలి విశ్వకర్మచే నిర్మింపబడిన ఆ భవనాలు సూర్యచంద్రుల కాంతులతో ఆకాశాన్ని తాకుతున్నట్లుగా ఉన్నాయి. భోగవతి అయిన గంగ భయంకరులైన సర్పగణాలతోనూ మడుగులతోనూ శోభిల్లుతూన్నట్లు, ఆ ద్వారకాపురి దాశార్హశ్రేష్ఠులైన మహానుభావులతో నిండిన భవనా లనే హ్రదాలతో శోభిల్లుతోంది. మేఘాలచే ఆవరింపబడిన ఆకాశంలా ఆ ద్వారకాపురి భవనాలనే మేఘాలతో అలంకరింపబడి ఉంది. ఇంద్ర, ఉపేంద్రులే అక్కడ ప్రధానమేఘాలు. వేలస్త్రీల కాంతులే మెరుపులు. వృష్ణివంశీయ యువకులే మదించిన నెమళ్ళు. దాశార్హుల వివిధ అస్త్రశస్త్రాలు, వివిధ వర్ణాలతో భవనాలపై ఇంద్రధనుస్సులా ప్రకాశిస్తూన్నవి.

• ఆ శ్రీకృష్ణభగవానుని భవనాన్ని సాక్షాత్తూ విశ్వకర్మ నిర్మించాడు. దేవదేవుడైన కృష్ణుని భవనం నాలుగు యోజనాలు పొడవు, నాలుగు యోజనాలు వెడల్పు వ్యాపించి, ఉన్నతాలైన ప్రాసాదాలతో ధనరాశులతో నిండి ఉంది. లోకంలోని పర్వతాల దృశ్యాలతో భవనం నిండి ఉన్నది. ఇంద్రుని ప్రేరణచే త్వష్ట (విశ్వకర్మ) పద్మనాభుని ప్రాసాదాన్ని నిర్మించాడు. అది అన్ని వైపుల యోజనం మేర వ్యాపించి ఉంది. మేరు పర్వతశిఖరంలా ఉన్నతమై, బంగారుపూత పూయబడి ఉంది. మహాత్ముడైన విశ్వకర్మ రుక్మిణికి మరొక శ్రేష్ఠమైన భవనాన్ని నిర్మించాడు. సత్యభామ వేరొక శ్వేతభవనంలో నివసిస్తూ ఉంది. అది విచిత్రాలైన మణులు పొదగబడిన సోపానాలతో ఉంది. దాన్ని శీతలభవనం అంటారు. నిర్మలమైన సూర్యకాంతిలా ప్రకాశించే పతాకాలతో వనప్రదేశంలో నిర్మింపబడి, నాలుగుదిక్కులా ఉన్నతమైన ధ్వజాలతో కూడి వేరొకభవనం శోభిల్లుతోంది. ఆ ప్రధానప్రాసాదంలో జాంబవతి ఉంటోంది. అది విచిత్రాలంకారాల కాంతితో ముల్లోకాలను భాసింపజేస్తుంది. అది సత్యభామారుక్మిణుల భవనాలమధ్య ఉంది. కైలాసశిఖరంలా స్వచ్ఛంగా ఉన్న ఆ భవనాన్ని కూడా విశ్వకర్మ నిర్మించాడు.

ఆ భవనద్వారాలు జాంబూనదసువర్ణంతో చేయబడి ప్రజ్వలిస్తున్న అగ్నిలా ప్రకాశిస్తున్నాయి.

ఆ భవనం సముద్రమంతవిశాలమై మేరు వనే పేరుతో ప్రసిద్ధి చెందింది. కులీన, గాంధారరాజు కూతురూ అయిన సుకేశి అనే ఆమెను శ్రీకృష్ణుడు ఆ భవనంలో ఉంచాడు. పద్మకూటమని ప్రసిద్ధిచెంది, పద్మంవంటి ఛాయ గొప్పకాంతిగల భవనం సుప్రభ అనే మహారాణికి నివాసం. కురుశ్రేష్ఠా! సూర్యప్రభ అనే పేరుగల శ్రేష్ఠమైన ప్రాసాదం శ్రీకృష్ణుడు లక్ష్మణకు ఇచ్చాడు. వైడూర్యమణి సమానమయిన పచ్చని కాంతితో ఉన్న భవనాన్ని వాసుదేవుడు తనరాణి మిత్రవిందకు ఇచ్చాడు. దాన్ని ప్రాణులన్నీ హరియే అని అనుకొంటాయి. అందుచేత అది అన్నిభవనాలకు భూషణంగా నిలిచింది. ద్వారకలో వేరొక ప్రముఖమైన ప్రాసాదం శిల్పులందరిచేత నిర్మింపబడింది. అది మిక్కిలి అందమైంది. నవ్వుతూన్నట్లుగా ఉంటుంది. అది కేతుమంత మని ప్రసిద్ధిగలది. వాసుదేవుని పట్టమహిషి సుదత్త అందులో నివసిస్తూ ఉంటుంది. నాయనా యుధిష్ఠిరా! విరజ మనే ప్రాసాదం ఉంది. అది రజోగుణరహితమై నిర్మలంగా ఉంటుంది. అది మహాత్ముడైన కేశవుని ఉపస్థానగృహం.

ఇదేవిధంగా అక్కడ మరొక ముఖ్యమైన ప్రాసాదం ఉంది. దాన్ని స్వయంగా త్వష్ట నిర్మించాడు. యోజనవైశాల్యం కలది. అంతా రత్నాలు పొదగబడి ఉంది. వాసుదేవుని భవనంలో మార్గాన్ని చూపే ధ్వజా లున్నాయి. వాటి కర్రలన్నీ బంగారంతో చేయబడ్డవి. ద్వారకలోని ఇళ్లన్నింటికీ ఘంటలు వ్రేలాడదీయబడి ఉన్నాయి. యదుసింహుడు వైజయంతి అనే పెద్ద పర్వతాన్ని తెచ్చి అక్కడ పెట్టాడు. ఆ ద్వారకలో హంసకూట మనే పర్వతం ఉంది. అది ఆరు తాటి చెట్ల ఎత్తయినది. అర్ధయోజన విశాలమైంది. దానిమీద ఇంద్రద్యుమ్న మనే పెద్ద సరోవరం ఉంది. కిన్నరుల మహానాదంతోకూడిన ఆ పర్వతం తేజస్వియైన శ్రీకృష్ణుని లీలాస్థలం. ప్రాణులన్నీ దర్శించేదిగా అది ముల్లోకాలలోను ప్రసిద్ధి కెక్కింది. ఆదిత్యమార్గందాకా వ్యాపించి స్వర్ణమయమై, దివ్యమై, ముల్లోకాలలో ప్రసిద్ధి చెందిన మేరుపర్వతశిఖరాన్ని పెకలించి, శ్రీకృష్ణుడు తమ నివాసానికి (ద్వారక) తీసికొని వచ్చాడు. పూర్వం అది అన్ని ఔషధులతో అలంకృతమై ప్రకాశిస్తూన్నది. శత్రుమర్దనుడైన శౌరి ఇంద్రభవనం నుండి తీసికొని వచ్చిన పారిజాతవృక్షాన్ని అక్కడే ప్రతిష్ఠించాడు. వాసుదేవుడు బ్రహ్మలోకం నుండి గొప్పగొప్ప వృక్షాలను తీసికొని వచ్చి ద్వారకలో ప్రతిష్ఠించాడు. సాల, తాళ, అశ్వ, కర్ణవృక్షాలను, అనేక శాఖలతో ఉన్న వటవృక్షాన్ని, భల్లాతక, కపిత్థ, చంద్ర, చంపక, ఖర్జూర, కేతకవృక్షాలను అక్కడ అన్ని వైపులా ప్రతిష్ఠించాడు.

ఆ ద్వారకలో పుష్కరిణులు, సరస్సులూ ఉన్నాయి. వాటిలో పద్మలతలతో నిండి జలాలు ఉన్నాయి. ఎర్రని సౌగంధిక కుసుమా లున్నాయి. అందలి జలకణాలు మణిముక్తికాలవలె ప్రకాశిస్తున్నాయి. ఆ పుష్కరిణుల, సరస్సుల ఒడ్డులు పెద్దపెద్ద వృక్షాలతో శోభిల్లుతూ ఉన్నాయి. శ్రీకృష్ణుడు హిమవత్పర్వతం మీది వృక్షాలను, నందనవనంలోని వృక్షాలను తీసికొనివచ్చి అక్కడ ప్రతిష్ఠించాడు. ద్వారకలోని ఉపవనాలలో ఉన్న వృక్షాలు ఎరుపు, పసుపు, లేత ఎరుపు, తెలుపు రంగులపూలతో, అన్ని ఋతువులలోని ఫలాలతో శోభిల్లుతున్నాయి. సహస్రదళపద్మాలు, వేలకొద్దీమందారాలు, అశోక, కర్ణికార, తిలక, నాగమల్లికా, కురువ, నాగపుష్ప, చంపక, తృణ, గుల్మ, సప్తపర్ణ, కదంబ, నీప, కురవక, కేతకీ, కేసర, హింతాల,

తల, తాటక, తాల, ప్రియంగు, వకుల, పిండికా, బీజపూర, ద్రాక్షా, ఆమలక, ఖర్జూర, మృద్వీకా, జంబుక, ఆమ్ర, పనస, అంకోట(ఊడుదు), తిల, తిందుక, లిద్రుచ, ఆమ్రాతక, క్షీరికా, కంటకీ, నాలికేర, ఇంగుద, ఉత్కోశక, కదలీవన, జాతి, మల్లికా, పాటల, భల్లాతక, కపిత్థ, తైతభ, బంధుజీవక, ప్రవాల, అశోక, కాశ్మరీ, ప్రియంగు, బదరీ, యవ, స్పందన, చందన, శమీ, బిల్వ, పలాశ, పాటల, వట, పిప్పట, ఉదుంబర, ద్విదలపలాశ, పారిభద్రక, ఇంద్ర, అర్జున, అశ్వత్థ, చిరిబిల్వ, సౌభంజన, భల్లట, అశ్వపుష్ప, సర్జ, తాంబూల లతా, లవంగ, క్రముక మున్నగు ఫల, పుష్పజాతి వృక్షాలతో, వివిధాలైన వెదురు వృక్షాలతో ద్వారకా నగరపు చుట్టుప్రక్కల వనాలన్నీ నిండి ఉన్నాయి. నందనవనంలో ఉన్న వృక్షాలు, చైత్రరథవనంలోని వృక్షాలూ యదునాథుడు శ్రీకృష్ణుడు ఆ పురానికి చుట్టూ పాతాడు. ఆ నగరంలోని దిగుడుబావులు, బావులు, పెద్దబావులు వేలకొద్దీ పద్మాలతో, కలువలతో, పసుపు, ఎరుపు పుప్పొడులతో నిండి ఉన్నాయి. ద్వారకలోని గృహోపవనంలో నిర్మలమైన నీటితో నిండిన నదులు, సరస్సులూ ఉన్నాయి. అవి వికసించిన కలువలతో కూడి ఉన్నాయి. అనేక ద్రుమాలతో వ్యాపించి ఉన్నాయి. ఆ గృహోపవనంలో నదులు మణుల రజనుతో కూడిన ఇసుకతో నిండి ఉన్నాయి. మదించిన నెమలి సమూహాలు, కోకిలలు ఉన్నాయి. లోకంలోని పర్వతాలన్నీ వాటి అంశలతో ద్వారకలో ఉన్నాయి. అక్కడే ఏనుగుల గుంపులు, గోవులు, మహిషాలు, వరాహాలు, మృగాలు, పక్షులు నివసిస్తూ ఉన్నాయి.

ఆ శ్రీకృష్ణుని భవనానికి చుట్టూ పర్వతం వంటి ప్రాకారాన్ని విశ్వకర్మ నిర్మించాడు. అది నూరు హస్తాల ఎత్తు ఉంది. చంద్రునిలా తెల్లని కాంతులతో ఉంది. నగరానికిచుట్టూ వనాలు, ఉపవనాలు, మహాశైలాలు, సరిత్తులు, సరస్సులు అతడే ఏర్పాటు చేశాడు. ఈవిధంగా శిల్పిశ్రేష్ఠుడైన విశ్వకర్మ నిర్మించిన ఆ నగరాన్ని ప్రవేశిస్తూనే గోవిందుడు చుట్టూ మరలమరల చూశాడు. ఇంద్రుడు దేవతలతో పాటుగా అక్కడక్కడ ఆ నగరమంతా చూశాడు. మహాయశస్కులు, శ్రేష్ఠులు అయిన బలరామకృష్ణులు, దేవేంద్రుడూ.ముగ్గురూ ఆ నగరాన్ని చూశారు. అనంతరం శ్రీకృష్ణుడు గరుత్మంతుని శిరస్సుపై నిల్చి ఆనందంతో, శత్రువుల ఒళ్ళు జలదరింపజేసే శంఖాన్ని పూరించాడు. ఆ శంఖధ్వనిచేత సముద్రం సంచలించింది. ఆకాశం ప్రతిధ్వనించింది. అందరూ ఆశ్చర్యపోయారు. పాంచజన్యం యొక్క ధ్వనిని విని, గరుడుని చూసి కుకురాంధకులు దుఃఖరహితు లయ్యారు. ఆ గరుత్మంతునిపై, సూర్యునివంటి తేజస్సుతో, శంఖచక్రగదలను ధరించి నిలిచిన శ్రీకృష్ణుని చూసి ఆనందించారు. అనంతరం ఆ పురజనులందరికి తూర్య భేరీవాద్యాల మహాధ్వని వినబడింది. పురజనులంతా సింహనాదం చేశారు.

అటు తరువాత దాశార్హులు, కుకురాంధకులంతా మధుసూదనుని చూసి, ఆనందించి అక్కడకు చేరారు. రాజైన ఉగ్రసేనుడు వాసుదేవుని ముందుంచుకొని, వేణు శంఖధ్వనులతో వాసుదేవుని భవనానికి వెళ్ళాడు. దేవకి, రోహిణి, ఉగ్రసేనునిస్త్రీలు శ్రీకృష్ణుని అభినందించడానికి వారివారి స్థానాల్లో ఉన్నారు. అతడు సమీపించగానే వారు యథోచితంగా సత్కరించారు. బ్రహ్మద్వేషులంతా మరణించారు.

అంధకవృష్ణి వంశీయులంతా విజయు లయ్యారు' అని పలుకుతూ స్త్రీలందరూ మధుసూదనుని సాదరంగా చూశారు. అనంతరం శౌరి గరుత్మంతునితో తన భవనానికి వెళ్ళాడు. శ్రీకృష్ణుడు మణిపర్వతాన్ని సముచితమైనచోట ఉంచాడు. పుండరీకాక్షుడయిన శ్రీకృష్ణుడు తీసికొని వచ్చిన ధనాలను, రత్నాలను సభయందుంచి, తాను తండ్రిని చూడగోరాడు. మధుసూదనుడు ముందుగా గురువయిన సాందీపని పాదాలను స్పృశించాడు. ఆశ్రువులు నిండిన కన్నులతో, ఆనందమగ్నమైన మనస్సుతో ఉన్న తండ్రికి శ్రీకృష్ణుడు బలరామునితోపాటు నమస్కరించాడు. అంధకవృష్ణి వంశీయులంతా బలరామకృష్ణులను కౌగిలించుకొన్నారు. శ్రీకృష్ణుడు తాను తీసికొనివచ్చిన రత్నరాసులను ధనసంచయాన్ని వృష్ణివంశీయులందరికి విభజించి, "తీసికోండి" అని అన్నాడు. శ్రేష్ఠానుక్రమంలో సాత్వతు లందరిని పేరుపేరున పిలిచి యదునందనుడైన శ్రీకృష్ణుడు ఆ ధనసంపదలను, రత్నరాసులను విభజించి ఇచ్చాడు. దాశార్హులకు కూడా అలాగే ఇచ్చాడు. ఆ ద్వారకాపురి కేశవాదిముఖ్యులతో, మహేంద్ర ప్రముఖులతో, వృష్ణివంశీయశ్రేష్ఠులతో, సింహాలతోనున్న పర్వతగుహవలె శోభిల్లుతోంది. ఆటుపిమ్మట మహాయశస్వి దేవతల అధిపతి అయిన మహేంద్రుడు ఆసనాలపై కూర్చుని ఉన్న కుకుర, అంధక ముఖ్యులను, మహారాజైన ఉగ్రసేనుని ఉద్దేశించి ఆనందంతో శుభవచనా లిలా పలికాడు. 'మహాత్ముడైన శ్రీకృష్ణుడు మనుష్యులలో ఎందుకుపుట్టాడో, పుట్టి వాసుదేవుడేమి చేశాడో సంగ్రహంగా చెప్తాను. ఇతడు శత్రుమర్దనుడై లక్షమంది దానవులను సంహరించి, పాతాళవివరానికి వెళ్ళాడు. మునుపు ప్రహ్లాద, బలి, శంబరులు కూడా వెళ్ళనటువంటి ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడి నుండి ఈ ధనరాసులన్నింటినీ మీకు తీసికొని వచ్చాడు. శ్రీకృష్ణుడు పాశసహితుడైన మురాసురుని, పంచజనులను, శిలా సమూహాలను అతిక్రమించి సపరివారంగా నిశుంభుని సంహరించాడు. అట్లే హయగ్రీవుని సంహరించాడు. రాక్షసరాజైన బలిని సంహరించాడు. నరకాసురుని చంపి, అదితికుండలాలను తిరిగి తీసికొని వచ్చి ఇచ్చాడు. దేవతలందరిలో కేశవుడు గొప్ప కీర్తిని పొందాడు. ఇకపై కృష్ణుని బాహుబలాశ్రయంపొందిన అంధకవృష్ణి వంశీయులు శోక భయ బాధలు తొలగి వివిధసోమయాగాలు చేయుదురుగాక. మరల బాణాసుర వధకోసం నన్ను ముందుపెట్టుకొని దేవతలు, వసువులు, సాధ్యులు, ఈ మధుసూదనుని దగ్గరకు వస్తారు.'

అలా చెప్పి ఇంద్రుడు బలరామకృష్ణులను, వసుదేవుని, కుకురాంధక ముఖ్యులందరిని కౌగిలించుకొన్నాడు. వృత్రాసురుని సంహరించిన ఇంద్రుడు ప్రద్యుమ్న, సాంబ, నిశఠ, అనిరుద్ధ, సారణ, బభ్రు, ఝిల్లి, గద, భాను, చారుదేష్ణ, సారణ, అక్రూరులను సత్కరించి, మరల సాత్యకితో మాట్లాడాడు. అటుపై వృష్ణి కుకురవంశాలకు అధిపతి, రాజు అయిన ఉగ్రసేనుని కౌగిలించుకొన్నాడు. అంధకవృష్ణి వంశీయులలోని ఇతరులదగ్గర, భోజ, కృతవర్మల వద్ద, ఉపేంద్రుడైన శ్రీకృష్ణుని వద్ద ఇంద్రుడు సెలవు తీసికొన్నాడు. అనంతరం సర్వభూతాలు చూస్తూండగా, ఇంద్రుడు శచీసమేతంగా శ్వేతాచలాన్ని పోలిన ఐరావతాన్ని అధిరోహించాడు. ఐరావతం తననోటినుండి వెలువడే ఘీంకారాలతో భూమిని, అంతరిక్షాన్ని, స్వర్గాన్ని ప్రతిధ్వనింపజేస్తున్నట్లుగా ఉంది. దాని కిరువైపుల బంగారు యంత్రాలు

కూర్చబడ్డాయి. దాని కొమ్ములు బంగారంతో చేయబడ్డాయి. దానిపై కప్పబడిన కంబళి నవరత్నాలతో అలంకరింపబడింది. వందలకొద్దీ రత్నాలతో కూర్చబడిన పతాకాలతో అలంకరింపబడింది. మేఘం వీటిని కురుస్తున్నట్లుగా అది నిరంతరం మదజలాన్ని స్రవిస్తూంటుంది. మహాకాయం గల ఆ దిగ్గజం స్వర్ణమాలను ధరించి ఉంది. దానిపైనున్న ఇంద్రుడు మందరాచలాగ్రానికి వెళ్లేసరికి, సూర్యునిలా ప్రకాశిస్తున్నాడు. అనంతరం శచీపతి అయిన ఇంద్రుడు వజ్రమయం, భయంకరం, విశాలం అయిన అంకుశాన్ని తీసికొని, అగ్నిదేవునితో పాటు స్వర్గలోకానికి వెళ్ళాడు. అతని వెనుకనే మరుద్గణాలు కరేణుగజసమూహాలతో, కుబేర వరుణాదులు విమానాలతో ప్రీతులై అనుసరించి వెళ్ళారు. ఆ ఇంద్రుడు వాయుపథాన్ని, అటుపై వైశ్వానరపథాన్ని, ఆపై సూర్యపథాన్ని చేరి, అక్కడే అంతర్ధాన మయ్యాడు.

అనంతరం దాశార్హులయొక్క, ఉగ్రసేనుని యొక్క, స్త్రీలు, నందునిభార్య యశోద, బలరాముని భార్య రేవతి, పతివ్రత అయిన రుక్మిణి, సత్యభామ, జాంబవతి, గాంధారరాజకన్య శింశుమ, విశోక, లక్ష్మణ, సాధ్వి సుమిత్ర, కేతుమ ఇంకా శ్రీకృష్ణుని ఇతరభార్యలూ ప్రీతితో శ్రీకృష్ణుని చూడటానికి సభామండపానికి వెళ్ళారు. దేవకి, రోహిణి ముందుండగా ఆస్త్రీలందరూ బలరామునితోపాటు కూర్చుని ఉన్న శ్రీకృష్ణుని చూశారు. ఆ బలరామకృష్ణులిరువురూ ఆసనంనుండి లేచి వచ్చి ముందుగా రోహిణికి అభివాదంచేసి, అటుపై దేవకికి, జ్యేష్ఠానుక్రమంలో తల్లులందరికీ నమస్కరించారు. బలరామునితోపాటుగ శ్రీకృష్ణుడు అందరికీ నమస్కరించాడు. తరువాత వృష్ణివంశీయస్త్రీలలో పెద్దదైన దేవకి ఒకశ్రేష్ఠ మయిన ఆసనంపై కూర్చొని, రామకృష్ణులను తన ఒడిలో కూర్చుండబెట్టుకొంది. మిత్రావరుణులతో దేవమాతవలె, పుత్రులైన ఆ రామకృష్ణులిరువురితో దేవకీదేవి శోభిల్లింది. ఆ పిమ్మట యశోదయొక్క కూతురు క్షణంలో అక్కడకు వచ్చింది. ఆమె శరీరం మహోజ్జ్వలంగా ప్రకాశిస్తూన్నది. కామరూపిణి అయిన ఆమెను 'ఏకానంగ' అని అంటారు. ఆమెనిమిత్తంగానే శ్రీకృష్ణుడు సపరివారంగా కంసుణ్ణి సంహరించాడు. ఆ తరువాత బలరాముడు ఆమెను సమీపించి, శిరస్సుపై ఆఘ్రాణించి, ఆమె ఎడమచేతిని పట్టుకొన్నాడు. శ్రీకృష్ణుడు ఆమె కుడిచేతిని పట్టుకొన్నాడు. బలరామకృష్ణులిద్దరూ తమ సోదరిని అలా తీసికొనివస్తూంటే ఆ సభలో వారంతా రెండు గజేంద్రాల నడుమ బంగారు పద్మంపై నున్న లక్ష్మీదేవిని వలె చూశారు. అనంతరం వృష్ణివంశీయులంతా బలరామకృష్ణులపై పేలాలు, పుష్పాలు, నేతితోకూడిన అక్షతలను మహావృష్టిగా చల్లారు. బాలురు, వృద్ధులు, జ్ఞాతులు, బంధువులు, తనవంశీయులు అంతా ఆనందంతో శ్రీకృష్ణుని దగ్గర కూర్చున్నారు. పౌరులందరికి ప్రీతిని వృద్ధిచేసే పురుషసింహుడైన మధుసూదనుడు తన నివాసాన్ని ప్రవేశించాడు. రుక్మిణీదేవితో కూడి సుఖంగా ఆనందించాడు. తరువాత సత్యభామ, జాంబవతి మున్నగు తనభార్యలందరితో యథాకాలంగా విహరించాడు. తదుపరి శ్రీకృష్ణుడు రుక్మిణి గృహానికి వెళ్లాడు. నాయనా! యుధిష్ఠిరా! ఇది ఆ శార్ఙ్గధన్వుడైన కృష్ణుని విజయగాథ. ఇందుకొరకే ఆ మహాత్ముడు మనుష్యులలో జన్మించాడు.

మహారాజ! అటుపై శ్రీకృష్ణుడు ద్వారకలో రాత్రింబవళ్లు తన భార్యలతో సుఖాన్ని పొంది ఆనందించాడు. పౌత్రుని కారణంగా ఇంద్రాది దేవతలందరికి దుష్కరమూ, హితమూ అయిన కార్యాన్ని

చేశాడు. భరతశ్రేష్ఠా! బలిచక్రవర్తి పెద్దకొడుకు బాణు డనే వాడుండేవాడు. అతడు చాలా బలవంతుడు. పరాక్రమవంతుడూను. అతనికి వేయిచేతు లున్నాయి. రాజా! అతడు సత్యనిష్ఠమైన మనస్సుతో తీవ్రమైన తపస్సు చేశాడు. చాలాసంవత్సరాలు ఆ బాణుడు రుద్రుని ఆరాధించాడు. మహాత్ముడైన శంకరుడు అతనికి చాలా వరాలు ఇచ్చాడు. దేవతలకు కూడా దుర్లభాలైన ఆ వరాలన్నీ పొంది బలవంతుడైన బాణుడు శోణితపురంలో సాటిలేనివిధంగా రాజ్యం చేశాడు. ఆ బాణుడు దేవతలందర్నీ భయపెట్టేవాడు. అతడు ఇంద్రునితోపాటు దేవతలందరినీ జయించి, కుబేరునిలా మహారాజ్యాన్ని శాసించేవాడు. జ్ఞాని అయిన శుక్రాచార్యుడు అతని సమృద్ధికొరకు ప్రయత్నించేవాడు. ఆ బాణునికి ఉష అనే కూతురుంది. లోకంలో రూపంలో ఆమెకు సాటి ఎవరూ లేరు. మేనక యొక్క కూతురిలా (శకుంతల వలె) ఉంటుంది ఆమె. ప్రద్యుమ్నుని కుమారుడు అయిన అనిరుద్ధుడు ఉపాయంతో ఉషను చేరి రహస్యంగా ఆమెతో ఆనందించాడు. మహాతేజస్వి అయిన బాణుడు తన కూతురు ఉషతో రహస్యగృహంలో ఉన్న అనిరుద్ధుని గురించి తెలిసికొని, బలవంతంగా వారిద్దరినీ కారాగృహంలో బంధించాడు. అనిరుద్ధుడు అపుడు దుఃఖాన్ని పొందాడు. బాణునిచే బాధింపబడి అనిరుద్ధుడు మూర్ఛనొందాడు. అదేసమయంలో మునిపుంగవుడైన నారదుడు ద్వారకకు వచ్చి కృష్ణుని దర్శించి, ఈ మాటలు చెప్పాడు.

'కృష్ణా! కృష్ణా! మహాబాహూ! యదువంశీయుల కీర్తిని వృద్ధిచేయువాడా! నీపౌత్రుడైన అనిరుద్ధుని మహాశక్తిశాలి అయిన బాణుడు బాధిస్తున్నాడు. అనిరుద్ధుడు ఇపుడు కష్టం పొందాడు. కారాగారంలో ఉంటున్నాడు.' దేవర్షి నారదుడిలా చెప్పి బాణాసురరాజధాని శోణితపురానికి వెళ్లాడు. శ్రీకృష్ణుడు బలదేవుని, మహాతేజస్వి అయిన ప్రద్యుమ్నుని పిలిచి, వారితోపాటు గరుత్మంతుని ఎక్కాడు. మహాతేజస్సులైన ఆ మువ్వురు పురుషశ్రేష్ఠులు క్రుద్ధులై గరుత్మంతునిపై బాణుని నగరానికి వెళ్లారు. అనంతరం వారు రాగి ప్రాకారాలతోనూ, వెండిద్వారాలతోనూ శోభిల్లుతున్న ఆ పురాన్ని చూశారు. ఆ పురం బంగారు ప్రాసాదాలతో, పొదిగిన ముక్తామణులతో, ఉద్యానవనాల సమృద్ధితో, నృత్తగీతాలతో శోభిల్లుతూ ఉన్నది. పక్షులతో, తోరణాలతో నిండి పుష్కరిణులతో శోభిల్లుతూ, ఆరోగ్యవంతులైన జనాలతో కూడి, స్వర్గంలా ప్రకాశిస్తున్న స్వర్ణమయమైన ఆ పురాన్ని చూసి, వారు మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందారు. ఆ బాణపురాన్ని దేవతలు ద్వారపాలకులై రక్షిస్తూ ఉన్నారు. మహేశ్వరుడు, కుమారస్వామి, భద్రకాళి, అగ్ని - ఈ దేవతలంతా ఆ పురాన్ని రక్షిస్తూన్నారు.

పిమ్మట శ్రీకృష్ణుడు శంఖచక్రగదాధరుడై, మిక్కిలి క్రుద్ధుడై, బలంతో ద్వారపాలురను జయించి, శంకరునిచే రక్షింపబడుతున్న ఉత్తరద్వారానికి చేరాడు. అక్కడ మహేశ్వరుడు శూలం చేతిలో ధరించి ఉన్నాడు. బాణాన్ని సంధించి పినాకధనుస్సుని పట్టుకొని బాణునికి హితాన్ని చేయదలచి ఉన్నాడు. కృష్ణుని రాకను తెలిసిన మహేశ్వరుడు నోరుతెరచిన మృత్యువులా ఉన్న కృష్ణునికి ఎదురుగా వచ్చాడు. అనంతరం ఆ శివకేశవులిద్దరూ యుద్ధం చేశారు. ఆ యుద్ధం చాలాఘోరంగా, ఊహింప శక్యంకానిదిగా ఉండి, గగుర్పాటు కలిగించింది. ఒకరినొకరు జయించాలనే కోరికతో ఉన్న వారిరువురూ ఒకరినొకరు

కొట్టుకొంటున్నారు. క్రుద్ధులై వారిరువురూ దివ్యాస్త్రాలను ప్రయోగిస్తున్నారు. అనంతరం కృష్ణుడు ముహూర్తకాలం శూలపాణితో యుద్ధంచేసి, యుద్ధంలో మహాదేవుని జయించాడు. ద్వారం వద్ద ఉన్న ఇతరులను కూడా జయించి, ఆ పురవరాన్ని ప్రవేశించాడు. శ్రీకృష్ణుడు బాణపురంలో ప్రవేశించి, మిక్కిలి కోపంతో బాణుని సమీపించి, అతనితో యుద్ధం చేశాడు. బాణుడు కూడా, మిక్కిలి కోపంతో, తీక్ష్ణమైన అన్ని శస్త్రాలను ఆ యుద్ధంలో కృష్ణునిమీద ప్రయోగించాడు. యుద్ధంలో మరల ఉద్యమించి తనవేయి చేతులతో శస్త్రాలను ధరించి, బాణుడు మిక్కిలి క్రుద్ధుడై కృష్ణుని మీదకి వదిలాడు. కృష్ణుడు వాటన్నింటిని ఛేదించి, బాణునితో క్షణకాలం యుద్ధం చేసి, దివ్యమైన, ఆయుధశ్రేష్ఠమైన తనచక్రాన్ని సంధించి, మేరలేని పరాక్రమం గల బాణుని వేయి చేతులను నరికాడు. మహారాజా! అపుడు బాణుడు కృష్ణుని వలన మిక్కిలి బాధనొంది, తెగినచేతులతో కొమ్మలు నరికిన చెట్టువలె వెంటనే క్రిందపడ్డాడు. ఈవిధంగా బలిపుత్రుడైన బాణుని యుద్ధంలో పడగొట్టి, కారాగృహంలో ఉంచిన అనిరుద్ధుని విడిపించాడు. గోవిందుడు అనిరుద్ధుని భార్యతోపాటుగా విడిపించి, అసంఖ్యాకాలైన బాణుని రత్నాలన్నింటిని తీసికొని వెళ్ళాడు.

అటుపై బాణుని నివాసంలో ఉన్న గోసంపదలను, సర్వసంపదలను బలవంతంగా హృషీకేశుడు, యదువంశ కీర్తివర్ధనుడూ అయిన కృష్ణుడు తీసికొని వెళ్ళాడు. మధుసూదనుడు సమస్తరత్నాలను గరుత్మంతుని పైకి ఎక్కించాడు. బలదేవుని, ప్రద్యుమ్నుని, అనిరుద్ధుని, ఉషాసుందరిని, సేవకులను, దాసీగణాలను, నేతలందరిని, వివిధ రత్నాలను గరుడునిపై ఎక్కించాడు. శంఖచక్రగదా ఖడ్గాలను ధరించి శ్రీకృష్ణుడు సూర్యుడు ఉదయాద్రిని ఎక్కినట్లు, గరుత్మంతునిపై ఆరోహించాడు. రాజా! గరుత్మంతుని పైకెక్కి, ద్వారకానగరానికి ప్రయాణమై వెళ్ళాడు. కృష్ణుడు యాదవులతో పాటుగ తన ద్వారకాపురాన్ని ప్రవేశించి, స్వర్గంలో ఉన్న ఇంద్రునిలా ఆనందించాడు. మురాసురుడు వేసిన పాశాలను శ్రీకృష్ణుడు ఖండించాడు. నిశంభుని, నరకుని సంహరించాడు. ప్రాగ్జ్యోతిషపురమార్గాన్ని నిష్కంటకం చేశాడు. శ్రీకృష్ణుడు తన ధనుష్టంకారంచేత, పాంచజన్య హుంకారం చేత రాజు లందరినీ భీతావహులను చేశాడు. మేఘ సముదాయంవంటి దాక్షిణాత్యసేనలతో కూడి ఉన్న రుక్మిని కూడ శ్రీకృష్ణుడు భయపెట్టాడు. ఆ తరువాత చక్రగదాధరుడైన శ్రీకృష్ణుడు మేఘంవలె ధ్వని, సూర్యునివంటి కాంతిగల రథంతో భోజకన్య అయిన రుక్మిణిని వివాహమాడి తన పట్టమహిషిని చేసుకొన్నాడు. జారూథినగరంలో ఆహుతి, క్రాథుడు, శిశుపాలుడు, దంతవక్త్రుడు, శైబ్యుడు, శతధన్వుడు అనే రాజులను జయించాడు. అదేవిధంగా కోపంతో ఇంద్రద్యుమ్నుని, యవనుని, కోరుమంతుని సంహరించాడు.

పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు తనచక్రంతో వేయిపర్వతాలను ఛేదించి, ద్యుమత్సేనునితో యుద్ధం చేశాడు. ఒక్కనిమేషంలో ఎక్కడికైనా సంచరింపగల వరుణుని రెండువైపులా తిరుగుతూన్న గోపతి, తాలకేతువు అనే రాక్షసులను శార్ఙ్గధన్వుడైన శ్రీకృష్ణుడు మహేంద్ర పర్వతశిఖరంమీద పట్టుకొని, ఇరావతీనదీతీరాన సంహరించాడు. అక్షప్రపతన మనే ప్రదేశంలో ఉన్న నేమిహంసపథమనే చోట ఉన్న ఇద్దరిని వారి స్వరాష్ట్రంలోనే పడగొట్టి కృష్ణుడు సంహరించాడు. ప్రాగ్జ్యోతిషపురంనిండా

చాలమంది రాక్షసులు ఆక్రమించి ఉన్నారు. కృష్ణుడు అక్కడున్న ఎర్రని పర్వతశిఖరాలపైకి వెళ్ళి ఇతరులకు ఎదిరింపశక్యంకాని, మహాతేజస్వి, లోకపాలుడు అయిన వరుణుని జయించాడు. మహేంద్రుడు పారిజాతరక్షణకోసం ఇంద్రద్వీపాని స్వయంగా రక్షిస్తూండేవాడు. అయినప్పటికి బలవంతుడైన కేశవుడు ఆ పారిజాతాన్ని అపహరించి తీసికొని వచ్చాడు. జనార్దనుడు పాండ్య, పౌండ్ర, మత్స్య, కళింగ, అంగ, రాజులను అందరినీ జయించాడు. కేవల రథసహాయంతో శ్రీకృష్ణుడు నూటొక్క క్షత్రియ శ్రేష్ఠులను సంహరించి, గాంధారరాజకుమారి అయిన శంశుమను తన పట్టమహిషిని చేసికొన్నాడు. శ్రీకృష్ణుడు బభ్రువునకు ప్రియాన్ని చేయగోరి, వేణుదారిచే అపహరింపబడిన అతని భార్యను తిరిగి తీసికొని వచ్చాడు. మధుసూదనుడు వేణుదారి వశంలో ఉన్న సమస్తభూమిని అశ్వ రథ కుంజరాలతో సహా జయించాడు.

బాణాసురుడు దేవేంద్రునితో పాటు దేవతాగణా లన్నింటిని భయపెట్టాడు. యుద్ధంలో ఇంద్రునితో పాటు దేవతలంతా వజ్రాశని గదాపాశాస్త్రాలతో భయపెట్టినా అతడు మరణించలేదు. మహాత్ముడైన శ్రీకృష్ణుడు అతని సహస్రబాహువులను నరికి అతనిని చంపివేశాడు. జనార్దనుడు పీఠ, కంస, పైఠక, అతిలోములను సంహరించాడు. శ్రీకృష్ణుడు జంభ, ఐరావత, విరూపులను, శత్రుమర్దనుడైన శంబరాసురుని సంహరించాడు. పుండరీకాక్షుడైన ఈ కృష్ణుడు పాతాళలోకానికి వెళ్ళి వాసుకిని జయించి, రోహిణీకుమారుని బంధవిముక్తుని చేశాడు. బాలుడుగా ఉండగానే పుండరీకాక్షుడు, జనార్దనుడు అయిన కృష్ణుడు బలరాముడుతోడు కాగా, చాలా పనులు చేశాడు. శ్రీకృష్ణుడు అసురులకు భయంకరునిగ, సురలకు అభయంకరునిగా ఉంటూ సర్వలోకేశ్వరుడు, సర్వవ్యాపకుడు అయ్యాడు.

కృష్ణుడు దురాత్ము లందరిని శాసించి దేవతలకొరకు ఎంతో చేసి, స్వస్థానికి చేరుకొంటాడు. ఈ కృష్ణుడు భోగసంపన్నం, రమ్యం, మునులకు ఇష్టం అయిన ద్వారకానగరాన్ని ఆత్మసాత్కరించి సాగరంలో లయం చేస్తాడు. చైత్యయూపాలతో కూడి అందమై, మిక్కిలి పుణ్యసహితమై వన, ఉపవనాలతో కూడిన ద్వారకను సముద్రంలో లయం చేస్తాడు. సూర్యసదనం అని ప్రసిద్ధి వహించిన ఆ ద్వారకను కృష్ణుడు విడిచిపెట్టిన తరువాత సముద్రుడు తనలో ముంచెత్తుతాడు. మధుసూదనుని కంటె వేరొకరు సురాసుర మనుష్యులలో ద్వారకను అధివసింపగల రాజు మునువు లేడు. ఇకపై ఉండబోడు. ఆ సమయంలో వృష్ణ్యంధకమహారథులు, వారి పిల్లలు ప్రాణత్యాగం చేసి భగవంతునితోపాటుగ పరమధామానికి చేరుతారు. ఇదేవిధంగా దాశార్హవంశీయు లందరికి విధిపూర్వకంగా అన్నికర్మలు నిర్వహిస్తాడు. ఇతడే విష్ణువు, నారాయణుడు, సోముడు, సూర్యుడు, సవిత కూడ. బాలుడు ఆటవస్తువులతో ఆనందించినట్లుగా భగవంతుడైన కృష్ణుడు ప్రాణులతో ఆనందంగా ఆడుకొంటాడు. అతడు ఎట్టి నియంత్రణలేనివాడు. హద్దులేనివాడు. ఇచ్ఛానువర్తనంకలవాడు. అన్నింటిని తన వశంలో ఉంచుకొనేవాడును. ఇతడు గర్భవాసమెరుగనివాడు, అయోనిజుడు. శ్రీకృష్ణుడు ఆత్మతేజస్సుచే అందరికి గతిని కల్పిస్తాడు. నీటిబుడగ ఉత్పన్నమై, నీటిలోనే లీనమైనట్లుగా చరాచరభూతాలన్నీ నారాయణునిలోనే లీనమౌతాయి. భరతనందనా! మహాబాహువైన కేశవుడు ఇదమిత్థంగా ఎవరికీ చెప్పశక్యం కాడు. ఈ సమస్త విశ్వంలో

పరమాత్మకంటె వేరైన దేదీ లేదు.)

ఈ బాలుడైన శిశుపాలుడు ఈ విషయం తెలియజాలడు. అందువల్ల అన్నిచోట్లా, ఎల్లపుడు, కృష్ణునిగురించి ఈ విధంగా మాట్లాడుతుంటాడు. ఉత్కృష్టమైన ధర్మాన్ని వెతకగల్గిన బుద్ధిమంతుడే ధర్మాన్ని చూడగలడు గాని, చేదిరాజు శిశుపాలుడు చూడలేడు. వృద్ధులయందు కాని, బాలురయందు కాని, మహామతులైన రాజులందు గాని కృష్ణుని అనర్హునిగా ఎవడు భావిస్తాడు? ఎవడు ఇతనిని పూజించకుండా ఉంటాడు? ఇంకా ఈ శిశుపాలుడు ఈ గౌరవాన్ని దుష్కృతమని భావిస్తే, అనుచితపూజావిషయంలో ఏంచేస్తే ఉచితమో అలాగే చేసుకోవచ్చు."

39. సహదేవుని కోపము.

ఈ విధంగా చెప్పి భీష్ముడు విరమించాడు. అనంతరం సహదేవుడు శిశుపాలునికి సమాధానంగా అర్థవంతమైన మాటనిలా చెప్పాడు. "రాజులారా! 'కేశి' అనే రాక్షసుని సంహరించి, పోలికలేని పరాక్రమంగల శ్రీకృష్ణుని పూజించడం ఎవరైనా సహించలేకపోతే, మీ అందరి శిరస్సులపై ఇదే నా పాదాన్ని మోపుతున్నాను. ఈ నా మాటకు ఎవరు సమాధానం ఇస్తారో అతడే నాకు ముందుగా చంపదగిన వాడవుతాడు. ఇందులో సందేహం లేదు. బుద్ధిమంతులైన రాజులు ఏ కొందరున్నా వారు ఆచార్యుడు, తండ్రి, గురువు, పూజనీయుడు, అర్ఘ్యాన్ని పొందటానికి సర్వధా అర్హుడు అయిన శ్రీకృష్ణునికి చేసిన గౌరవాన్ని ఆమోదించండి." ఈ విధంగా సహదేవుడు పాదాన్ని చూపిస్తే, అక్కడ బలవంతులైన రాజులలో ఒక్కడూ ఏమీ మాట్లాడలేదు. అనంతరం సహదేవుని శిరస్సుపై పూలవాన పడింది. సాధు సాధు (బాగు, బాగు) అని అదృశ్యవాణి పలికింది. భూతభవిష్యత్తుల గురించి చెప్పగల్గి సర్వసంశయాలనూ తీర్చగల సకలలోకవేత్త అయిన నారదుడు సర్వభూతసమక్షంలో కృష్ణుని గురించి స్పష్టంగా ఇలా చెప్పాడు. **"శ్రీకృష్ణుని అర్చించని మానవులు బ్రతికున్నా మరణించినట్లే భావించాలి. వారితో ఎప్పుడూ మాట్లాడటం కూడ చేయరాదు."***

వైశంపాయనుడిలా అన్నాడు – నరదేవుడైన సహదేవుడు అక్కడున్న బ్రహ్మక్షత్రియుల విశేషాలెరింగి గౌరవింపదగిన వారందరిని యథోచితంగా గౌరవించి, అర్ఘ్యసమర్పణ కార్యాలను

* కృష్ణం కమలపత్రాక్షం వార్చయిష్యంతి యే వరా।
జీవన్మృతాస్తు తే జ్ఞేయాః వ సంభాష్యాః కదాచన ॥ 9

పూర్తి చేశాడు. కృష్ణుని గౌరవిస్తే, శత్రుకర్షణుడైన శిశుపాలుడు కోపంతో మిక్కిలి ఎరుపెక్కిన కన్నులతో అచటి రాజులనుద్దేశించి ఇలా అన్నాడు. "రాజులారా! నేను సేనాపతిని అని తెలుసుకోండి. మీరంతా ఏమి ఆలోచిస్తున్నారు? వృష్ణిపాండవులను యుద్ధంలో ఎదరించి నిలుద్దాం." అని ఈ విధంగా అక్కడి రాజులందరిని చేదిరాజు శిశుపాలుడు ప్రోత్సాహపరిచి, యుధిష్ఠిరుని యజ్ఞానికి విఘాతం కలిగించాలని రాజులతో మంతనాలు చేశాడు. వెంటనే సునీథప్రముఖులైన సైనికగణాలు అక్కడ నుండి వెళ్ళాయి. వారి ముఖాలన్నీ కోపంతో వివర్ణ లయినట్లుగా కనబడ్డాయి. 'యుధిష్ఠిరుని అభిషేకం, వాసుదేవుని పూజనం ఈ రెండుపనులు సఫలం కాకుండా చేయాలి' అని వారంతా అన్నారు. సహదేవుని నిష్కర్షవల్ల, నిర్ణయంవల్ల కోపోద్రిక్తులైన రాజులందరూ నిర్వేదంతో, ఆత్మనిశ్చయంతో ఈ విధంగా పలికారు. స్నేహితులచే వారింపబడుతున్న వారి శరీరాలు మాంసం నుండి దూరంచేస్తే గర్జిస్తూన్న సింహాల శరీరంలా ప్రకాశించింది. అక్షయ బలసమూహమై హద్దులేని ఆ రాజసాగరాన్ని చూసిన కృష్ణుడు వారంతా యుద్ధానికి సన్నద్ధంగా ఉన్నారని తెలిసికొన్నాడు.

40. శిశుపాలుని గూర్చి భీష్ముని పలుకులు.

అనంతరం సుడిగాలికి సంచలించి, భయంకరంగా సముద్రంవలె, రోషంతో కదులుతూ ఉన్న ఆ రాజసమూహాన్ని చూసి, ఇంద్రుడు బృహస్పతితో వలె యుధిష్ఠిరుడు బుద్ధిమంతులలో ముఖ్యుడు, వృద్ధుడు, కురుపితామహుడు అయిన భీష్మునితో ఇలా అన్నాడు. 'పితామహా! ఈరాజసముద్రం రోషంతో ఊగిపోతోంది. ఈ విషయంలో ఏం చేయాలో నీవే చెప్పవలసింది. యజ్ఞానికి విఘ్నం కలగకూడదు. ప్రజలకు హితమూ జరగాలి. అన్నివిధాలా ఏది కర్తవ్యమో అది నాకు చెప్పు." ఈవిధంగా ధర్మరాజు చెప్పగా, కురుపితామహుడైన భీష్ముడు ఇలా అన్నాడు. "కురుశార్దూలా! నీవు భయపడకు. కుక్క సింహాన్ని చంపగలదా! శుభమైన మార్గాన్ని నేను మునుపే స్వీకరించాను. సింహం నిద్రిస్తుంటే చుట్టూరా చేరి కుక్కలు మొరుగుతూ ఉంటాయి. అలాగే వృష్ణివంశసింహం కృష్ణుడు నిద్రిస్తుంటే ఈ రాజులంతా మొరుగుతున్నారు. ధర్మరాజా! సింహం మేల్కొనే వరకూ కుక్కలు అలాగే మొరుగుతూ ఉంటాయి. సింహంలాంటి అచ్యుతుడు మేల్కొనే వరకూ ఈ పురుషపుంగవుడు శిశుపాలుడు రాజులందరినీ సింహాలుగా చేస్తూ ఉంటాడు. తెలివిమాలిన శిశుపాలుడు రాజు లందరినీ యమలోకానికి లాక్కు పోదా మనుకొంటున్నాడు. ఈ శిశుపాలుని తేజస్సును మళ్లీ తనలోకి తీసుకోవాలని శ్రీకృష్ణుడు భావిస్తున్నాడు. బుద్ధిమంతుడా!

ధర్మజా! నీకు శుభమగుగాక - ఇపుడీ శిశుపాలుని బుద్ధి, ఇతరరాజుల బుద్ధులు సంచలించాయి. పురుషోత్తముడు తనలోకి తీసుకుందామనుకున్న వారి బుద్ధులు శిశుపాలుని బుద్ధివలె ఎగిరెగిరి పడుతూఉంటాయి. ధర్మజా! మూడులోకాల్లోను ఉన్న నాల్గు రకాల ప్రాణులకు కూడా జనన మరణాలకు ఆ మాధవుడే కారకుడు." భీష్మునిమాటలు విని శిశుపాలుడు భీష్ముని దురుసుగా ఇలా అన్నాడు.

41. శిశుపాలుడు భీష్ముని ఉపాలంభించుట.

శిశుపాలుడు అన్నాడు. "కులం కళంకితం చేసిన భీష్మా! భయంకరమైన శపథాలతో/ నిందలతో రాజులందరినీ భయపెడతున్నావు. పెద్దవాడవై ఉండి ఇటువంటి పనులు చేయటానికి నీవు ఎందుకు సిగ్గుపడటం లేదు? నపుంసకప్రవృత్తితో ఉన్న నీకు ఇలా అధర్మవాక్యాలు పలకడం తగినదే. పైగా మరో ఆశ్చర్యకరవిషయం ఏమంటే నీవు కురువంశంలో ఉత్తముడవు. ఒక నావకు మరో నావను కట్టినట్లు, ఒక గ్రుడ్డివాని వెనుక మరో గ్రుడ్డివాడు వెడుతున్నట్లు ఈ కౌరవులంతా నిన్ను ముందుంచుకొని నీవెంట పడుతున్నారు. పూతనను చంపిన దగ్గరనుండి కృష్ణుని పనులన్నీ గొప్పగా కీర్తిస్తున్నావు. అవి వింటే నామనస్సు ఎంతో వ్యథ చెందుతోంది. గర్వితుడు, మూర్ఖుడూ అయిన కృష్ణుని ఇలా పొగడుతున్న నీనాలుక ఇంకా నూరుముక్కలు ఎందుకు కాలేదా అని సందేహం! చిన్నపిల్లలు కూడా నిందింప దగినవాని విషయంలో జ్ఞానవృద్ధుడవైన నీవు కూడా ఆ గోపాలకుని పొగడుతున్నావేమిటి? చిన్నతనంలో అతడు ఒకపక్షిని (బకాసురుని) చంపితే అందులో విచిత్రమేముంది? అలాగే ఒక అశ్వాన్ని (కేశిని), ఒక వృషభాన్ని (అరిష్టాసురుని) చంపితే అదేమయినా ఆశ్చర్యకరవిషయమా? చైతన్యంలేని కర్రముక్కలతో కూర్చిన బండిని కాలితో పడగొట్టితే భీష్మా! అదేమయినా అద్భుత కార్యమా? జిల్లేడు చెట్లవంటి రెండు అర్జున వృక్షాలు కృష్ణుడు పడగొట్టాడంటే అది ఆశ్చర్యకరమైన విషయమా? ఒకపామును చంపాడు కృష్ణుడు - ఇది కూడా ఆశ్చర్యమేనా? చీమలపుట్టంత గోవర్ధనమనే గుట్టను వారం రోజులు ఎత్తి పట్టుకొన్నాడు. అది నాకేమీ ఆశ్చర్యంగా అనిపించటం లేదు. భీష్మా! ఆటలాడుకొనేటప్పుడు కృష్ణుడు పర్వతంమీద కూర్చుని కాస్త ఎక్కువ అన్నం తిన్నాడని నీవు చెపితే అది అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోందేమో నాకేమీ ఆశ్చర్యం కలగటం లేదు. బలవంతుడయిన కంసుని అన్నం తిన్నందువల్లనే కృష్ణుడు కంసుని చంపాడనేది పెద్ద ఆశ్చర్యకర విషయం కాదు.

కురుకులాధమా! నీకు నిజంగా ఏ ధర్మమూ తెలియదని సజ్జనులు చెప్పుకొంటున్నారు - నీకీ విషయం తెలియదు. స్త్రీలమీద, ఆవులమీద, బ్రాహ్మణులమీద, అన్నం పెట్టినవానిమీద, ఆశ్రయం ఇచ్చినవాడిమీద ఆయుధాలు ప్రయోగింపకూడదు. భీష్మా! సజ్జనులయిన ధార్మికులు ప్రజలకు సదా ఇలా బోధిస్తూ ఉంటారు. కాని నీ దగ్గర అదంతా అబద్ధమయినట్లు కనిపిస్తోంది. కౌరవాధమా! నా ఎదుట కృష్ణుని జ్ఞానవృద్ధుడనీ, వృద్ధుడనీ స్తుతిస్తున్నావు నాకేదో తెలియనట్లు. భీష్మా! గోవులను చంపినవాడూ, స్త్రీలను చంపినవాడూ నీమాటవల్ల పూజింపబడుతున్నాడు. ఇటువంటివాడు ఎలా పూజార్హు డవుతాడు? ఇతడే బుద్ధిమంతులలో ఉత్తముడనీ, లోకాని కంతటికీ ప్రభువనీ, సర్వమూ కృష్ణుడే అనీ నీవు చెపుతున్న మాటలన్నీ నిశ్చయంగా అసత్యాలే. కథలు ఏవీ కథలు చెప్పేవానిని శాసించవు- అనగా చెప్పేవారు ఆచరించరు. స్వభావాన్నే అనుసరిస్తారు భూలింగ పక్షిలాగా. (భూమి మీద పడుకొని ఉండే పక్షి ఇతరులకు "ఎన్నడూ సాహసం చెయ్యకండి" అని చెపుతూ ఉండేదిట- తాను మాత్రం సింహం నోట్లో మాంసాన్ని లాక్కునేది. అనగా తాను చెప్పినట్లు తానే ఆచరించేది కాదు. భీష్ముడూ అటువంటివాడే అని భావం.)

నీ ఈ స్వభావం చాలా నీచ మయింది. సందేహం లేదు. చాలా పాప మయింది. పాండవుల స్వభావం కూడా అంతే. అధర్మపరుడవయిన నీవు ఆ పాండవులకు ధర్మజ్ఞుడవు. కృష్ణుడు పూజనీయుడని నీవు చెప్పుతున్నావు. అందుచేత వారూ అటువంటివారే. జ్ఞానులలో ఉత్తము డయిన ఈ ధర్మరాజు కూడా ఎలా అయ్యాడో చూడు. ధర్మ మెరిగిన ఇతడు నీవల్ల ఎలా అయ్యాడో చూడు. నీకు ధర్మం తెలిస్తే, నీబుద్ధి ఉత్తమమయితే, మరొకనిని కోరిన కన్యక అంబను తెలివిగలవాడ ననుకొనే నీవు ఎలా అపహరించావు? భీష్మా! నీవపహరించిన కన్యను నీ తమ్ముడు విచిత్రవీర్యుడు ఎందుకు వివాహం చేసుకోలేదో తెలుసా? అతడు సన్మార్గవర్తి కాబట్టి. చాలాపండితుడ ననుకొంటున్న నీవు నీతమ్ముని క్షేత్రాల్లో మరొకరిచేత సంతానం పొందావు. ఇంకా నీవు సన్మార్గవర్తి ననుకొంటున్నావు. నీకసలు ధర్మం ఎక్కడుంది? ఈ బ్రహ్మచర్యం వృథా. నీ వీ బ్రహ్మచర్యం అజ్ఞానంతోనో, నంపుసకత్వంతోనో మోస్తున్నావు - ఇది నిస్సందేహం. ధర్మజ్ఞా! భీష్మా! నీలో ఎప్పుడూ అటువంటి ధార్మికమైన ఉన్నతిని చూడలేదు. నీవెన్నడూ పెద్దలను సేవించలేదు. అందుకే ఇలా చెపుతున్నావు ధర్మం. భూరిదక్షిణలిచ్చి యజ్ఞాలు చెయ్యడం, వేదాలు అధ్యయనం చెయ్యడం, ఇవన్నీ సంతానప్రాప్తిలో 16వ వంతు ఫలాన్ని కూడా ఇవ్వవు. భీష్మా! ఎన్నో వ్రతాలతో, ఉపవాసాలతో పొందిన పుణ్యం ఏదయినా సంతానం లేనివానికి నిష్ఫలమే

అవుతుంది. అందుచేత అపత్యంలేని ముసలివాడివి, వ్యర్థధర్మాలు అనుసరిస్తున్నావు. నీవు హంసలాగా జ్ఞాతులచేత వధింపబడతావు. ఇలా అని జ్ఞానులు చెప్పే వారు పూర్వం.. అదేమిటో పూర్తిగా చెపుతాను. విను.

భీష్మా! పూర్వం సముద్ర తీరంలో ఒక ముసలి హంస ఉండేది. ధర్మం చెప్పేది. వ్యతిరేకంగా చేసేది. 'ధర్మం ఆచరించండి - అధర్మం చేయకండి' అని బోధించేది. సత్యవాదు లయిన పక్షులు ఆ మాటలు వినేవి. సముద్రంలో తిరిగే పక్షులు ఈ హంస చెప్పే ధర్మాలు వినటానికి వచ్చి దానికి ఆహారం ఇచ్చేవి. ఆ పక్షులు తమ గ్రుడ్లను అన్నిటిని హంస దగ్గర భద్రంగా పెట్టి సముద్రంలోకి వెళ్లిపోయేవి. రోజూ ఈ పాపి హంస వాటి గ్రుడ్లను తినివేసేది. పక్షులు ఆదమరచి ఉంటే హంస మాత్రం అప్రమత్తంగా ఉండి గ్రుడ్లను భక్షించేది. రోజురోజుకు గ్రుడ్లు తరిగిపోతుంటే ఆ పక్షుల్లో చాలా తెలివికల పక్షి ఒకటి హంసను అనుమానించింది. ఒకరోజున హంస గ్రుడ్లు తింటుండగా చూసింది. హంస చేసే ఈ పాపపుపని ఆ పక్షి అన్నిటికీ చెప్పింది. పక్షులన్నీ చాలా దుఃఖించాయి. తరువాత ఆ పక్షులన్నీ ప్రత్యక్షంగా హంసచేసే పాపకృత్యం చూసి, మిథ్యాప్రవర్తన కల ఆ హంసను చంపివేశాయి. భీష్మా! పక్షులు హంసను చంపినట్లుగా ఈ రాజులంతా కోపంతో అధర్మపరుడవయిన నిన్ను వధిస్తారు. ఈవిషయమై పౌరాణికులు ఈగాథను కీర్తిస్తారు. ఆదేమిటో నీకు వివరిస్తాను. 'హంసా! నీ అంతరాత్మ రాగాది దోషాలతో కూడి ఉంది. నీ ఈ గ్రుడ్లను భక్షించే పని నీ మాటలకు సర్వధా విరుద్ధం.'

42. కోపించిన భీముని భీష్ముడు వారించుట.

శిశుపాలుడు ఇలా అన్నాడు. "కృష్ణుని దాసునిగా భావించి వానితో యుద్ధం చేయలేదు జరాసంధుడు. అటువంటి మహాబలుడు జరాసంధు డంటే నాకు చాలా ఇష్టం. నేర్పుగా భీమార్జునులతో కేశవుడు జరాసంధుని చంపించడం ఎవరూ మంచిపనిగా భావించడం లేదు. జరాసంధుని ప్రభావం కృష్ణునికి తెలిసింది. ద్వారం విడిచి మారువేషంలో బ్రాహ్మణుల్లా నగరంలో ప్రవేశించవలసి వచ్చింది. వీని బ్రాహ్మణత్వం ఎంతటిదో తెలియక ఆ ధర్మాత్ముడు జరాసంధుడు వీనికి విప్రయోగ్యమైన పాద్యం ఇచ్చాడు. అది వీడు గ్రహించలేకపోయాడు కదా! జరాసంధుడు ఈ ముగ్గురికీ భోజనం పెడతానంటే దాన్ని కృష్ణుడు (వికృతంగా చిత్రీకరించి) భుజించ నన్నాడు. ఈ కృష్ణుడే కనుక నీవనుకున్నట్లు లోకాలకు కర్త అయితే తన్ను బ్రాహ్మణుడుగా ఎందుకు భావించలేదు? ఈ పాండవులను

సన్మార్గం నుండి నీవు తప్పిస్తే అదే మంచిదని భావిస్తున్నారు పాండవులు. ఇది నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. భారతా! స్త్రీసమానధర్ముడవూ (నపుంసకుడవు), వృద్ధుడవూ అయిన నీవు ఎవరికి అన్ని విషయాల్లోనూ మార్గదర్శకం చేస్తున్నావో వారికిది ఏమీ ఆశ్చర్యం కాదు, కాకపోనూవచ్చు."

శిశుపాలుని కటువాక్యాలు విని బలపరాక్రమశాలి అయిన భీమునికి చాలా కోపం వచ్చింది. సహజంగా పద్మపత్రాల వలె విశాల సుందరాలయినవి భీముని కనులు. కోపంతో ఇపుడవి బాగా ఎఱ్ఱబడి పోయాయి. అతని నుదురు బొమముడితో మూడుపాయలయింది. త్రికూటపర్వతం మీద మూడు పాయలై ప్రవహించిన గంగానదిలా అనిపించింది అక్కడి రాజులందరికీ. క్రోధంతో పళ్లు పటపటలాడిస్తున్న భీముని ముఖం సర్వభూతాలను సంహరిస్తున్న యముని ముఖంలా భాసించింది. వేగంగా (శిశుపాలుని మీదికి)దూకుతున్న మనస్వి అయిన భీముని భీష్ముడు పట్టుకొని ఆపాడు. ఆ దృశ్యం మహేశ్వరుడు కుమారస్వామిని పట్టి నిలిపినట్లుంది. పితామహు డయిన భీష్ముడు సముచితవాక్యాలతో వారించాడు. దానితో భీముని కోపం ఉపశమించింది. వానకాలం పూర్తి అయ్యాక సముద్రం చెలియలికట్టను దాటలేక వెనుదిరిగినట్లు శత్రుసంహారకు డయిన భీముడు భీష్ముని మాటను అతిక్రమింపలేకపోయాడు. రాజా! శిశుపాలుడు మాత్రం భీముని కోపానికి ఏ మాత్రం చలించకుండా తన పౌరుషం మీదనే నిలిచాడు. ఇంకా ఇంకా పైపైకి వస్తున్న భీముని శిశుపాలుడు ఏమీ లెక్కచేయలేదు. ఇది క్రుద్ధమైన సింహం మృగాన్ని లెక్క చేయనట్లుంది. ప్రతాపశాలి అయిన శిశుపాలుడు క్రుద్ధుడై పరాక్రమశాలి అయిన భీముని చూసి నవ్వుతూ ఇలా అన్నాడు. "భీష్మా! వీనిని విడిచిపెట్టు. అగ్నిలో మిడుత దగ్ధమయినట్లు ఇతడు నా ప్రభావంతో భస్మమయితే ఈ రాజులంతా చూస్తారు." శిశుపాలుని ఈ మాటలు విని ప్రజ్ఞావంతుడయిన భీష్ముడు భీమునితో ఇలా అన్నాడు.

43. శిశుపాలుని జన్మవృత్తాంతమును భీష్ముడు చెప్పుట.

"చేదివంశంలో ఈతడు మూడు కళ్ళతో, నాలుగు చేతులతో పుట్టాడు. పుట్టినవెంటనే ఇతడు గాడిద అరిచినట్లు ఏడిచాడు. దానితో వీని తల్లిదండ్రులూ, బంధువులూ ఎంతో భయపడ్డారు. ఆ వికారరూపం చూసి వీడిని విడిచి పెట్టేద్దా మనుకొన్నారు. అపుడు భార్యతోను, అమాత్యులతోను, పురోహితుని తోను చింతాకులుడై ఉన్న రాజుతో అశరీరవాణి

ఇలా అంది. 'రాజా! నీ ఈ పుత్రుడు శ్రీమంతుడు బలవంతుడూను. అందుచేత నీవు భయపడ నవసరం లేదు. శ్రద్ధగా ఈ శిశువును రక్షించుకో. ఇప్పు డీతనికి మృత్యువు రాదు. ఇంకా కాలం రాలేదు. రాజా! తన శస్త్రంతో వీనిని చంపేవాడు ఇప్పటికే పుట్టి ఉన్నాడు.' ఈ మాట చెప్పి అశరీరవాణి అంతర్ధాన మయింది. అపుడు వీని తల్లి పుత్రవాత్సల్యంతో దుఃఖిస్తూ ఇలా అంది. 'నాపుత్రుని గురించి ఈ మాట చెప్పిన వారికి నమస్కరిస్తున్నాను. మళ్లీ ఆ వాణి పలుకుగాక - వీని మృత్యువుకు కారకుడు ఎవరో - అతడు దేవుడైనా ఇతరుడయినా నిజం చెప్పగోరుతున్నాను.' అపుడా భూతం కనపడకుండానే ఇలా మళ్లీ చెప్పింది. 'వీనిని ఎవరు ఎత్తుకొన్నపుడు వీని అదనపు చేతులు పోతాయో వాడే వీనికి మృత్యువు. అలాగే నుదుటిమీద మూడవకన్ను పోతుందో అతడే వీనికి మృత్యు వవుతాడు.' వీడి మూడుకళ్లూ, నాలుగు చేతులూ చూడాలని భూమిమీది రాజులంతా వచ్చి చూసేవారు. అలా వచ్చిన రాజులందరినీ పూజించి ఆ రాజు ప్రతీరాజు ఒడిలోను ఆ పుత్రుని కూర్చోపెట్టేవాడు. అలా కొన్నివేల మంది రాజులు వీనిని తొడమీద కూర్చోబెట్టుకొన్నారు. కాని ఆ నిదర్శనం కనపడలేదు.

ఈ విషయం విని బలరామకృష్ణులు తమ మేనత్తను చూడటానికి ద్వారవతి నుండి చేదిపురానికి వచ్చారు. వారిద్దరూ తమమేనత్తకూ, రాజుకూ (దమఘోషుడు) నమస్కరించి కుశలమడిగి ఆసీను లయ్యారు. ఇరువురు మేనల్లుళ్లను ఎంతో ప్రీతితో ఆదరించి స్వయంగా శ్రుతశ్రవ తన కొడుకును కృష్ణుని ఒడిలో ఉంచింది. కృష్ణుని ఒడిలో ఉంచిన వెంటనే అదనపు చేతులు రెండూ రాలిపోయాయి. నుదిటిమీది కన్ను అణగిపోయింది. ఈ దృశ్యం చూసి భయపడి మేనత్త కృష్ణుని ఇలా కోరింది. "కృష్ణా! భయంతో ఆర్తురాల నయిన నాకు ఒక వరం ఇవ్వాలి. నీవు ఆర్తులకు ఆశ్వాసాన్ని, భీతులకు అభయాన్ని ఇస్తావు." ఈ మాట విని కృష్ణుడు ఇలా అన్నాడు. "అత్తా! భయపడకు - నావల్ల నీకేమీ భయంలేదు. నీకే వరం కావాలి? నేనేం చెయ్యాలి? నాకు శక్యమయినా కాకపోయినా నీమాట నెరవేరుస్తాను" కృష్ణుని ఈ మాట విని ఆమె కృష్ణునితో ఇలా అంది. "ఈ శిశుపాలుని అపరాధాలను నాకోసం క్షమించు. యదుశ్రేష్ఠా! ఇదే నావరం - తెలుసుకో." శ్రీకృష్ణుడిలా అన్నాడు - "అత్తా! వీని అపరాధాలు నూరు వరకూ క్షమింపదగినవే. వధింపదగిన పుత్రుని కోసం నీవు మనసులో దుఃఖించకు." భీష్ముడు ఇలా అన్నాడు - "ఇదీ జరిగినది. మందబుద్ధి అయిన శిశుపాలుడు గోవిందుని వరంతో గర్వించి నిన్ను యుద్ధానికి పిలుస్తున్నాడు."

44. భీష్ముని సమాధానము.

"ఈ చేదిరాజు కృష్ణుని ఆహ్వానించడం నిజంగా వీని బుద్ధి కాదు. ఇది తప్పకుండా జగన్నాథుడయిన కృష్ణుని నిశ్చయమే. భీమసేనా! నన్ను అధిక్షేపించడం కాలపరీత బుద్ధియై, కులకలంకుడు అయిన వీనికే చెల్లింది కాని లేకపోతే నన్ను ఈ భూమి మీద మరోరాజు ఎవడయినా అధిక్షేపించగలడా? ఈ శిశుపాలుడు నిశ్చయంగా శ్రీహరి తేజోంశమే. అందుకే వీనిని ఆ హరి మళ్లీ తనలోకి లాక్కుంటాడేమో! అందుకే మనలనందరినీ లెక్కచేయకుండా పెద్దపులిలా గర్జిస్తున్నాడు ఈ శిశుపాలుడు."

అయినా శిశుపాలుడు భీష్ముని మాటలను సహించకుండా కోపంతో మళ్లీ భీష్మునికి ఇలా సమాధానం చెప్పాడు. "భీష్మా! నీవు సదా పూనుకొని కృష్ణుని స్తుతిస్తున్నావు. కృష్ణుని ప్రభావం మా శత్రువుల మీద ఉండుగాక. నీకు ఇతరులను పొగడాలనే మనసు ఉంటే ఈ జనార్దనుని విడిచి ఇతర రాజులను ప్రశంసించు. ఇడుగో ఈ దరదదేశపు రాజును స్తుతించు. రాజులలో ఉత్తముడు అయిన బాహ్లీకుని స్తుతించు ఇతడు పుట్టినపుడు భూమి బ్రద్దలయింది. భీష్మా! ఇడుగో ఈ కర్ణుని స్తుతించు ఇతడు వంగ అంగదేశాలకు రాజు. బలంలో ఇంద్రసమానుడు. పెద్దపెద్ద దివ్యధనుస్సులను ఎక్కుపెట్టగలవాడు. వీని ఈ కుండలాలు సహజమైనవి. దేవనిర్మితమైనవి. కవచం కూడా అటువంటిదే. లేత సూర్యుని కాంతితో విరాజిల్లుతున్నాడు. ఇడుగో ఇంద్రసమానుడయిన భీముడు - ఇతడు దుర్జయుడయిన జరాసంధుని బాహుయుద్ధంలో చంపడంకాదు, చీల్చిపారేశాడు - వీనిని స్తుతించు. తండ్రికొడుకులు, మహారథులూ అయిన ద్రోణాశ్వత్థామలను పొగడు - వారిద్దరూ విప్రోత్తములు. వీరిద్దరిలో ఎవరికి కోపం వచ్చినా చరాచరమయిన ఈ భూమి నంతటినీ నిశ్శేషం చేయగలరని నా అభిప్రాయం. ద్రోణునితో, అశ్వత్థామతో సమంగా యుద్ధం చేయగల రాజును ఇంతవరకు చూడలేదు. మరి నీవు వారిద్దరినీ మాత్రం పొగడవు. సాగరపర్యంతమయిన ఈ భూమి మీద దుర్యోధనునితో సమానమయిన భుజపరాక్రమం కల రాజోత్తముని చూడ. అలాగే స్థిర విక్రముడయిన సైంధవుడూను - కింపురుషులకు కూడా ఆచార్యుడయి ప్రసిద్ధపరాక్రమం కల ద్రుముడూ అంతే. వీరిని వదలి నీవు కేశవుని మాత్రం స్తుతిస్తున్నావు. వృద్ధుడూ, భరతవంశానికి గురువూ అయిన కృపాచార్యుని వదలి నీవు కేశవుని స్తుతిస్తున్నావు.

ధనుర్ధారులయిన పురుషులలో ఉత్తముడూ, మహాపరాక్రమవంతుడూ అయిన రుక్మిని వదలి కేశవుని ప్రశంసిస్తున్నావు. అలాగే మహాపరాక్రమశాలి అయిన భీష్మకుని,

రాజయిన దంతవక్త్రుని, భగదత్తుని, యూపకేతుని, జయత్సేనుని, మగధరాజు సహదేవుని, విరాటుని, ద్రుపదుని, శకునిని, బృహద్బలుని, అవంతీరాజులు విందానువిందులనూ, పాండ్యరాజును, శ్వేతుని, ఉత్తరుని, మహాభాగుడు శంఖుని, అభిమానవంతుడు వృషసేనుని, పరాక్రమశాలి ఏకలవ్యుని, మహారథుడూ, బలశాలి అయిన కళింగరాజును వదలి కేశవుని ప్రశంసిస్తున్నావు. నీకు పొగడాలని ఉంటే భీష్మా! శల్యాదులయిన రాజులున్నారుగా వారి నెందుకు స్తుతించవు? ధర్మవేత్తలు పూర్వం చెపుతూ ఉండగా నీవు వినలేదు. కాబోలు - నేనేం చేయగలను? ఆత్మనింద, ఆత్మస్తుతి, పరనింద, పరస్తవం ఈ నాల్గు పనులూ సజ్జనులు ఎన్నడూ చేసి ఉండలేదు. స్తుతింపరాని కేశవుని నీవు మోహంతో, భక్తితో స్తుతిస్తున్నావు - భీష్మా! నీ ఈ పనిని ఏ రాజూ అనుమతించటం లేదు. దురాత్ముడయిన కృష్ణుడు కంసుని సేవకుడు. అతని గోవులకు మాత్రమే రక్షకుడు. వానిని నీవు కేవలం స్వార్థంకోసం లోకాని కంతకూ అంటగడుతున్నావు.

భారతా! నీ యీ బుద్ధి సహజంగా లేదు. నేను ముందే చెప్పాను. భూలింగ పక్షిలాగా నీ మాటలు "చెప్పేదొకటి చేసే దొకటి" అన్నట్లు ఉన్నాయి. హిమవత్పర్వతానికి అటుప్రక్క భూలింగ పక్షి ఉండేది. భీష్మా! అది ఇటువంటి నిందార్హమైన మాటలే చెప్పేది. 'సాహసం చెయ్యకు' అని నిత్యమూ చెపుతూ ఉండేదిట. కాని అది మాత్రం సాహసం చేస్తూనే ఉండేది. అయినా ఆ విషయం దానికి తెలిసేది కాదు. భీష్మా! సింహం మాంసం తింటుంటే దాని పళ్లలో ఇరుక్కున్న మాంసపు ముక్కను అది తినేది. ఎంత అల్పబుద్ధియో! ప్రాణాలకు ముప్పని తెలిసే అది అట్లా చేసేది. అలాగే నీవు కూడా సదా వాగుతూ ఉంటావు. ఈ రాజులు తలచుకొంటే నీ జీవితం సంశయమే అని తెలిసి కూడా లోకం ద్వేషించే పనులు చేస్తున్నావు. నీ వంటి వాడెవడున్నాడు?' రాజా! శిశుపాలుని పరుషవాక్కులు విని, భీష్ముడు శిశుపాలుడు వింటూ ఉండగా ఇలా అన్నాడు.

"ఆహా! నేను ఈ రాజుల దయవల్ల జీవిస్తున్నానట. ఏం మాటలు! నేను ఈ రాజులందరినీ గడ్డి పరకతో సమానంగా కూడ లెక్కచేయను." భీష్ముడిలా అనగానే కొంతమందికి కోపం వచ్చింది. కొంతమంది సంతోషించారు. కొంతమంది అసహ్యించుకొన్నారు. భీష్ముని మాటలు విని కొంతమంది ఇలా అన్నారు. "ఈ వృద్ధభీష్ముడు ఇలా గర్వంతో అనరాదు. అది క్షమార్హం కాదు. ఈ భీష్ముని పశువులా అందరూ కలిసి చంపండి. లేదా గడ్డి మంటతో దహించి వేయండి." రాజుల ఈ మాటలు విని కురుపితామహుడు, బుద్ధిమంతుడూ, అయిన భీష్ముడు ఆ రాజులతోనే ఇలా అన్నాడు. "ప్రతీమాటకూ

సమాధానం చెప్పడం మొదలుపెడితే దీనికి అంతం నాకు కనపడదు. అందుచేత రాజులారా! నేను చెప్పేది వినండి. మీ అందరి తలమీద నేను నాపాదం పెట్టాను. పశువులా నన్ను చంపుతారో! గడ్డి మంటతో నన్ను దహించుతారో చేసుకోండి. మేము పూజించిన కృష్ణుడు ఇక్కడే ఉన్నాడు. మీ బుద్ధి మరణానికి త్వరపడుతూ ఉంటే ఈ చక్రగదాధరుడయిన కృష్ణుని యుద్ధాని కిపుడే పిలవండి. యుద్ధంలో పడిపోయి ఆ కృష్ణుని దేహంలో ప్రవేశించండి."

45. శిశుపాల వధ - రాజసూయసమాప్తి.

శిశుపాలుడు భీష్ముని మాటలు విని వాసుదేవునితో యుద్ధం చేయాలని అతనితో ఇలా అన్నాడు. "జనార్దనా! నిన్ను యుద్ధానికి పిలుస్తున్నాను. నాతో యుద్ధం చెయ్యి. పాండవులందరితో నిన్ను ఇపుడే చంపుతాను. నీతోపాటు పాండవులు కూడా అన్నివిధాలా వధింపదగినవారే. ఎందుకంటే రాజులందరినీ కాదని పాండవులు రాజుకాని నిన్ను అర్చించారు. ఆ పాండవులు దాసుడ వయిన దుర్మతిని నిన్ను చిన్నతనం నుండీ పూజిస్తున్నారు. కృష్ణా! అనర్హుని అర్హునిగా పూజిస్తున్నారు. అందుచేత వారు వధింపదగిన వారని నా అభిప్రాయం." రాజశార్దూలు డయిన శిశుపాలుడు కోపంతో ఇలా గర్జిస్తూ ఉన్నాడు. శిశుపాలు డిలా అనగానే కృష్ణుడు సామవచనాలతో రాజులందరితో అందరి ఎదుట మధురంగా ఇలా అన్నాడు. "రాజులారా! వీడు మాకు మిక్కిలి శత్రువు. మామేనత్త సాత్వతికి కొడుకు. సాత్వతులలో క్రూరుడు. ఏ అపకారమూ చేయనివారికి కూడా హితుడు కాడు, శత్రువే.

రాజులారా! మేమంతా ప్రాగ్జ్యోతిషపురానికి వెళ్లామని తెలిసి మా మేనత్త కొడుకై ఉండి కూడా ఈ క్రూరుడు ద్వారకా నగరాన్ని తగులబెట్టాడు. రైవతకపర్వతం మీద భోజరాజు క్రీడిస్తూ ఉంటే వీడు వాళ్లలో కొందరిని చంపి, కొందరిని బంధించి తన పురానికి వెళ్లిపోయాడు. నాతండ్రి అశ్వమేధం చేసి రక్షకులతో గుర్రాన్ని వదలితే, ఈ పాపి యజ్ఞానికి విఘ్నం చేయటానికి గుర్రాన్ని అపహరించాడు. సౌవీరదేశానికి వెళ్లే తపస్వియైన బభ్రుని భార్యను, తనను కోరని దానిని, ఇక్కడినుండి వెడుతున్న దానిని, మోహంతో అపహరించాడు. ఈ క్రూరకర్ముడు మాయారూపం దాల్చి, కరూష దేశాధిపతికోసం తపస్సు చేస్తున్న తన మేనమామ విశాలరాజు కూతురు భద్రను అపహరించి తీసుకుపోయాడు. మామేనత్త కోసం ఈ అపరాధదుఃఖం సహిస్తున్నాను. ఇది దైవవశాత్తు ఇప్పుడు రాజులందరి సమక్షంలో జరిగింది. ఇపుడు నామీద ఎంతటి వ్యతిరేకత ప్రదర్శించాడో ప్రత్యక్షంగా

మీరు చూశారు కదా! ఇక పరోక్షంలో ఏమేమి చేశాడో మీకు ఇంతకుముందే చెప్పాను. గర్వితుడైన ఈతడు రాజులందరి సమక్షంలో నామీద చూపిన వ్యతిక్రమం క్షమింపరానిది. వీడిపుడు మరణం కోరుకొంటున్నాడు. ఈ మూడుడు పూర్వం రుక్మిణిని కోరాడు. కాని పొందలేకపోయాడు, శూద్రుడు వేదశ్రుతిని పొందలేకపోయినట్లుగా."

వాసుదేవుని మాటలు విని రాజులంతా శిశుపాలుని నిందించారు. వారి నిందావాక్యాలు విని ప్రతాపశాలి అయిన శిశుపాలుడు బిగ్గరగా నవ్వి ఇలా అన్నాడు. "ముందు నాకిస్తానన్న రుక్మిణిని సభల్లో అందునా రాజసభల్లో కీర్తిస్తూ కృష్ణా! నీకు సిగ్గు కలగటం లేదెందుకు? ముందు ఇతరుని కిస్తానన్న వనితను సభల్లో అందులోనూ రాజసభల్లో గొప్పగా చెప్పుకొనేవాడు నీవు తప్ప మరెవడూ లేడు. వీకు ఇష్టమయితే క్షమించు - లేకపోతే మానుకో - నీకు కోపం వస్తే ఏమి? సంతోషం కలిగితే ఏమి? నీ వల్ల నాకు ఏమి ఒరుగుతుంది?"

శిశుపాలుడు ఇలా అంటూనే ఉన్నాడు. భగవంతుడయిన కృష్ణుడు దానవులను సంహరించే చక్రాన్ని మనసులో తలచుకొన్నాడు. వెంటనే అపుడే చక్రం కృష్ణుని చేతిలోకి వచ్చింది. వాక్యవిశారదుడయిన కృష్ణ భగవానుడు ఉచ్చైస్వరంతో అలా అన్నాడు. "రాజులారా! అంతా వినండి. ఈతని తల్లి "వీని నూరు తప్పులు క్షమించమని అడిగింది. నేను 'సరే' అన్నాను - అలాగే నూరు తప్పులు ఇప్పటితో పూర్తి అయ్యాయి. అందుచేత మీరంతా చూస్తూ ఉండగానే ఇపుడు వీనిని చంపుతాను". ఇలా చెప్పి తత్క్షణమే శ్రీకృష్ణుడు చక్రంతో శిశుపాలుని శిరస్సును ఖండించాడు. వెంటనే వజ్రాయుధం దెబ్బతిన్న పర్వతంలా శిశుపాలుడు పడిపోయాడు. శిశుపాలుని శరీరం నుండి సూర్యతేజస్సు వంటి తేజస్సు పైకి రావటం రాజులంతా చూశారు. పద్మనేత్రుడై సర్వలోకాల చేతనూ నమస్కరింపబడే కృష్ణునికి వెంటనే ఆ తేజస్సు నమస్కరించి, కృష్ణునిలో కలిసిపోయింది. ఆ తేజస్సు అలా పురుషోత్తమునిలో కలిసిపోవడం రాజులంతా చూసి ఎంతో ఆశ్చర్యపడ్డారు.

అలా శిశుపాలుడు వధింపబడినపుడు మేఘాలు లేకుండానే వర్షం కురిసింది. పిడుగులు పడ్డాయి. భూమి అంతా కంపించిపోయింది. అపుడు రాజులు కొందరు ఏమీ మాట్లాడకుండా జనార్దనుని చూస్తూ మౌనంగా నిలిచిపోయారు. కోపంతో మరికొందరు చేతులతో చేతులు అప్పళించారు. ఇంకా కొందరు క్రోధపరవశులై పళ్లతో పెదవులు కొరుక్కున్నారు. కొంతమంది రాజులు చాటుమాటున కృష్ణుని ప్రశంసించారు. కొందరు క్రోధానికి వశులయ్యారు. మరికొందరు తటస్థంగా ఉన్నారు. మహర్షులూ, బ్రాహ్మణులూ, బలిష్ఠులయిన రాజులూ అంతా శ్రీకృష్ణుని పరాక్రమం చూసి సంతోషించి ప్రశంసిస్తూ

శ్రీకృష్ణుని శరణు కోరారు. అపుడు ధర్మరాజు తమ్ముళ్లతో "వీరుడయిన ఈ శిశుపాలునికి త్వరగా అంతిమ సంస్కారం సగౌరవంగా చేయించండి" అని ఆజ్ఞాపించాడు. అన్నగారి ఆజ్ఞను తమ్ముళ్లు వెంటనే నిర్వర్తించారు. అపుడు ధర్మరాజు రాజులందరి ఎదుట ఆ శిశుపాలుని కుమారుని చేదిరాజ్యానికి పట్టాభిషిక్తుని చేశాడు. అలా ధర్మరాజు యొక్క యాగం సమృద్ధిమంతమై ప్రజలకు ప్రీతికరమయి ప్రకాశించింది. అలా ఆ యజ్ఞం శుభారంభంతో విఘ్నాలు లేకుండా ధనధాన్య సంపన్నమై బహుభక్ష్యాన్న సంపూర్ణమై కేశవుని చేత రక్షింపబడి వెలుగొందింది.

(కృష్ణుని బుద్ధితో సహదేవుని చేత అమలు పరుపబడిన ఆ ఉత్తమమయిన యజ్ఞవిధానాన్ని రాజులంతా చూశారు. ఆ యజ్ఞమంటపంలో ఎన్నో బంగారు తోరణాలు కట్టారు. బంగారు తాళవాద్యాలున్నాయి. అవి అన్నీ ప్రకాశించే సూర్యుని వలె భాసించాయి. బంగారు తోరణాలతో కూడిన యజ్ఞవాటిక గ్రహాలతో కూడిన ఆకాశంలా భాసించింది. ఎన్నో శయ్యలు, ఆసనాలు, విహారాలు, ధనసమృద్ధమయిన పాత్రలు, ఘటాలు, గంగాళాలు, చెంబులు అంతటా కనపడ్డాయి. విశేషమేమంటే పాత్రలన్నీ బంగారంతో చేసినవే. వివిధభోజనపదార్థాలు, రుచికరములయిన భక్ష్యాలు, మధురపానీయాలు బ్రాహ్మణులకు సదా రాజసేవకులు అందించేవారు. ఒక లక్షమంది బ్రాహ్మణులు భోజనం చేసిన వెంటనే ఒక శంఖం మ్రోగుతుంది. అది సదా మ్రోగేది. మాటిమాటికి నిరంతరంగా మ్రోగే ఆ శంఖనాదం విని అంతా ఆశ్చర్యపోయేవారు. ఇలా భోజనసంతృప్తులయిన జనులతో, వర్షతాల వలె ఉన్న అన్నపురాసులతో, పెరుగు కాల్వలతో, నేతి మడుగులతో యజ్ఞవాటిక నిండుగా వెలుగొందింది. ఆ యజ్ఞంలో జంబూద్వీపంలో ఉన్న వారంతా ఒకేచోట కనిపించారు. చక్కని మణికుండలాలతో, మాల్యాలు ధరించి రాజులంతా కనిపించారు. వారు వివిధాలయిన అన్నపానీయాలు బ్రాహ్మణులకు పెట్టేవారు. ఈవిధంగా ద్విజాతులంతా ఆ యజ్ఞంలో సతతం భుజించి అంతా ఎంతో ప్రీతిని తుష్టిని పొందారు. ఇలా ధనధాన్యసమృద్ధమయిన యజ్ఞవాటికను చూసి రాజులంతా ఎంతో ఆశ్చర్యపడ్డారు. ధర్మరాజు యొక్క రాజసూయంలో ఋత్విజులు, యాజకులు యథావిధిగా, యథాకాలం హోమాలన్నీ చేయించేవారు.

ఆ రాజసూయంలో వ్యాసుడు, ధౌమ్యుడు మొదలయిన పదహారుమంది ఋత్విజులూ తమ తమ విధులను యథావిధిగా నిర్వర్తించారు. ఆ సదస్యులలో షడంగవేత్తకానివాడు లేడు. బహువేదవేత్తకానివాడు కాని, వ్రతశీలం లేనివాడు కాని, ఉపాధ్యాయుడు కాని వాడు కాని, పాపి కాని, క్షమలేని అసమర్థుడైన ద్విజుడు కాని మచ్చుకైనా లేడు. సహజంగా కూడా ఆ యజ్ఞ వాటికలో కృపణుడు కాని, దరిద్రుడు కాని, ఆకలిగొన్నవాడు కాని, దుఃఖితుడు కాని కనపడటం లేదు. రాజశాసనాన్ని అనుసరించి మహాతేజస్వి అయిన సహదేవుడు ఎల్లపుడూ భోజనార్థులకు భోజనం పెట్టించేవాడు. యజ్ఞనిపుణు లయిన యాజకులు శాస్త్రవిధుల మీద దృష్టికల్గి అన్నిపనులూ నిత్యమూ చేసేవారు. వేదశాస్త్రవేత్త లయిన విప్రులు సదా కథాప్రవచనం చేసేవారు - అందరూ ఆ మహాయజ్ఞంలో

కథాంతమందు చాలా సంతోషించేవారు. దేవతలు, రాక్షసులు, యక్షులు, ఉరగులు, దివ్యమానవులు, విద్యాధరులు – వీరి సమూహాలతో నిండి మహాత్ముడయిన ధర్మరాజు రాజసూయం శోభిల్లింది. గంధర్వగణాలు, అప్సరసల సమూహాలు, దేవ, ముని గణాలు, యక్షులు కిన్నరకింపురుష గీతాలాపనలతో శోభిల్లి వీరితో మరో దేవలోకమా అనిపించింది. నారదుడు, తేజస్వి అయిన తుంబురుడు, విశ్వావసువు, చిత్రసేనుడు – ఇంకా ఇతర గీత విద్వాంసులు యజ్ఞకర్మాంతరాల్లో పాడి అందరికీ మనోరంజనం చేసేవారు. నిత్యమూ విరామసమయంలో అంతట శబ్దశాస్త్రవేత్తలు ఇతిహాసాలు, పురాణాలు, ఆఖ్యానాలు చెప్పేవారు. .భేరులు, మురజాలు, మడ్డుకాలు, గోముఖాలు, కొమ్ములు, వేణువులు, శంఖాలు – వేలకొద్దీ వినపడేవి. లోకంలో ఉన్న విప్రులంతా, వైశ్యులు, శూద్రులు, మ్లేచ్ఛులు ఇలా అన్నివర్ణాల వారూ, నానాదేశాలవారూ, నానాజాతులవారూ అందరూ వచ్చి ధర్మరాజు భవనం నింపేశారు.

భీష్మద్రోణాదులు, దుర్యోధనునితో సహా కౌరవులందరూ, వృష్ణివంశస్థులంతా, అన్నివైపులనున్న పాంచాలురూ వచ్చి ఆ యజ్ఞంలో దాసులవలె తమకు తగిన పనులన్నీ స్వయంగా చేశారు. రాజా! ధీమంతుడయిన ధర్మజుని యజ్ఞం అలా జరిగింది. అది సోముని క్రతువులాగా ప్రకాశించింది. వస్త్రాలు, కంబళ్లు, దుప్పట్లు, నిష్కాలు, బంగారు పాత్రలు, భూషణాలు అంతటా ఏ వేళలో అయినా ధర్మరాజు ఇస్తూనే ఉండేవాడు. రాజులిచ్చిన రత్నాలు, ధనరాసులు అన్నీ అపుడే ధర్మరాజు విప్రులకు ఇచ్చి వేశాడు. మహాత్ములయిన విప్రులకు వెయ్యికోట్లు ఇచ్చాడు. ఆ విధంగా యజ్ఞం చెయ్యడం మరోరాజు ఎవరికీ సాధ్యంకాదు. యాజకులను అన్ని విధాల ఎల్లవేళలా సంతృప్తులను చేశాడు ధర్మరాజు. వ్యాసుని, ధౌమ్యుని, మహాప్రజ్ఞుడు నారదుని, సుమంతుని, జైమినిని, పైలుని, వైశంపాయనుని, యాజ్ఞవల్క్యుని, కతుని, కలాపుని, మహౌజసుని, ఇంకా విప్రవరులందరినీ శ్రద్ధగా సత్కరించి, పూజించి, ధర్మరాజు ఇలా అన్నాడు. "మీ ప్రభావం వల్ల రాజసూయ యాగం ఇలా సంపన్నమయింది." శ్రీకృష్ణుని ప్రభావం వల్ల నా కోరిక సంపూర్ణమయింది. తరువాత యజ్ఞసమాప్తిలో శ్రీకృష్ణుని దేవేశుడయిన బలరాముని, భీష్మాది కురుసత్తములను పూజించాడు.)

అలా రాజసూయ యాగాన్ని పూర్తిచేశాడు భగవంతుడు, శార్ఙ్గం, చక్రం, గదను ధరించిన శ్రీకృష్ణుడు రాజసూయ సమాప్తి దాకా స్వయంగా రక్షించాడు. ధర్మరాజు అవభృథ స్నానం చేసిన పిదప రాజసముదాయమంతా ధర్మరాజును చేరి ఇలా అన్నారు. 'ధర్మజ్ఞా! దైవానుగ్రహంతో వృద్ధిపొందావు. సార్వభౌముడ వయ్యావు. అజమీఢ వంశోద్భవా? మీ వంశప్రతిష్ఠను ఈ యాగంతో నీవు వృద్ధి పొందించావు. రాజేంద్రా! ఎంతో ధర్మాచరణం చేశావు. మా కోరికలు తీరాయి. నీ సత్కారాలతో సంతృప్తుల మయ్యాం. వెళ్లి వస్తాం అనుమతించు. మేము మా రాష్ట్రాలకు వెడతాం. అనుజ్ఞ ఇయ్యి' రాజుల ఈ మాటలు విని ధర్మరాజు రాజులందరినీ తగినట్లు సన్మానించి తమ్ములతో ఇలా అన్నాడు. 'ఈరాజులందరూ మనమీది ప్రీతితో వచ్చారు. తమ రాష్ట్రాలకు వెడుతూ నాకు చెప్పటానికి వచ్చారు. భద్రంగా మన పొలిమేర దాకా ఈ రాజోత్తములను సాగనంపండి.' అన్నగారి

మాట శిరసావహించి ధర్మవర్తను లయిన పాండవులు ఒక్కొక్కరాజునూ ప్రత్యేకంగా సాగనంపారు. ప్రతాపశాలి అయిన ధృష్టద్యుమ్నుడు విరాటుని అనుసరించి సాగనంపాడు. అర్జునుడు మహాత్ముడూ, మహారథుడూ అయిన ద్రుపదుని సాగనంపాడు. మహాబలుడైన భీముడు భీష్ముని, ధృతరాష్ట్రుని సాగనంపాడు. ద్రోణుని, అశ్వత్థామను సహదేవుడు సాగనంపాడు. రాజా! నకులుడు పుత్రసహితు డయిన శకునిని, ఉపపాండవులూ, అభిమన్యుడూ మహారథులయిన పర్వతీయ రాజులను సాగనంపారు. అలాగే మిగిలిన రాజు లందరినీ తనవారైన రాజులు సాగనంపారు. వేలకొద్దీ విప్రులంతా పూజితులై బయలుదేరారు. ఇలా రాజులూ, విప్రులూ వెళ్లిన తరువాత ప్రతాపశాలి కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"కురునందనా! నీ అనుజ్ఞ కోరుతున్నాను. ద్వారకకు వెళ్లి వస్తాను. దైవానుగ్రహంతో రాజసూయయాగం చక్కగా చేశావు." అపుడు ధర్మరాజు కృష్ణునితో "కృష్ణా! నీ అనుగ్రహంతోనే ఈ రాజసూయం నాకు సంపన్నమయింది. నీ అనుగ్రహంవల్లనే రాజసముదాయమంతా వశమయింది. ఎన్నో కానుకలిచ్చి నన్ను సేవించారు. మహాత్మా! నిన్ను వెళ్లవచ్చునని నేనెలా చెప్పగలను? నీవు లేకుండా ఎపుడయినా నాకు ప్రసన్నత కలుగుతుందా? కోరిక తీరుతుందా? నీవు తప్పక ద్వారకకు వెళ్లాలి కదా!" అన్నాడు ధర్మరాజు. ఆమాట అనిపించుకొని ధర్మాత్ము డయిన శ్రీకృష్ణుడు కుంతీదేవి దగ్గరకు వెళ్లి "అత్తా! నీ పుత్రులు సామ్రాజ్యం పొందారు. ధనవంతులై, కార్యసిద్ధిని పొందారు. చక్కగా సంతోషించు. నేను ఇక ద్వారకకు వెళ్లి వస్తాను అనుమతించు." కేశవుడు సుభద్రకూ, ద్రౌపదికీ కూడా మళ్లీ కలుద్దాం అని మధురంగా వీడ్కోలు చెప్పి, అంతఃపురం నుండి బయటపడ్డాడు.

తరువాత కృష్ణుడు స్నానం, జపం, ముగించుకొని విప్రుల ఆశీస్సులు పొందాడు. దారుకుడు మేఘసుందర మయిన రథం సిద్ధంచేసుకొని వచ్చాడు. కృష్ణుడు గరుడకేతనం చూసి, ప్రదక్షిణం చేసి, రథమెక్కి, ద్వారవతికి బయలుదేరాడు. సాత్యకి, కృతవర్మ ఇద్దరూ వెంటనే రథమెక్కి చామరాలతో కృష్ణుని వీస్తున్నారు. బలరాముడూ, వేలకొద్దీ యాదవులూ ధర్మరాజు చేత పూజితులై బయలుదేరారు. వెంటనే ధర్మరాజు సువర్ణసింహాసనం విడిచి, తమ్ముళ్లతో కాలినడకతో వాసుదేవుని అనుసరించాడు. ఒక్కక్షణం రథం ఆపి కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'రాజా! అప్రమత్తుడవై నిత్యమూ నిలిచి ప్రజలను రక్షించు. ప్రాణులు మేఘాన్ని, పక్షులు మహావృక్షాన్ని, దేవతలు ఇంద్రునీ, ఆశ్రయించి జీవిస్తున్నట్లు నీ బంధువులు కూడా నీ ఆశ్రయంలో జీవించాలి'. ఇలా చెప్పిన పిదప

కృష్ణధర్మజులు ఇరువురూ పరస్పరం వీడ్కోలు చెప్పుకొని తమతమ నివాసాలకు వెళ్లిపోయారు. సాత్వతముఖ్య డయిన కృష్ణుడు ద్వారవతికి వెళ్లిన తరవాత ఇక దుర్యోధనుడు, శకుని మాత్రం ఆ దివ్యసభలో మిగిలారు.

46. వ్యాసుని భవిష్యవాణి - యుధిష్ఠిరుని ప్రతిజ్ఞ.

అతిదుర్లభమై, యజ్ఞాలలో శ్రేష్ఠమయిన రాజసూయయాగం పూర్తి అయిన పిదప వ్యాసమహర్షి శిష్యులతో కలిసి ధర్మజుని వద్దకు వచ్చాడు. అతడు వెంటనే ఆసనం నుండి లేచి తమ్ములతో కలిసి ఎదురేగి పాద్యం, ఆసనం సమర్పించి తాతగారిని పూజించాడు. ఆ పూజ్యుడు ఉత్కృష్టమయిన స్వర్ణసింహాసనం మీద ఆసీనుడయి, యుధిష్ఠిరుని కూర్చోమని చెప్పాడు. తరువాత తమ్ములతో కలిసి కూర్చున్న రాజును ఉద్దేశించి మాటలలో నేర్పరి అయిన వ్యాసభగవానుడు ఇలా అన్నాడు. "కౌంతేయా! దుర్లభమయిన సామ్రాజ్యాన్ని పొంది, అదృష్టంకొద్దీ వృద్ధిపొందుతున్నావు. కౌరవు లందరినీ నీవు వృద్ధి పొందిస్తున్నావు. "రాజా! నీవు నన్ను పూజించావు. ఇక నేను వెడతాను. నీ అనుమతిని కోరుతున్నాను" అని పల్కిన వ్యాసమహర్షికి నమస్కరించి, పాదాలు పట్టుకొని ధర్మరాజు తాతగారితో ఇలా అన్నాడు. పురుషోత్తమా! నాకు గొప్ప సంశయం ఒకటి కలిగింది. ద్విజశ్రేష్ఠా! నీవు తప్ప దానికి సమాధానం చెప్పగలవారు వేరెవరూ లేరు.

పితామహా! ఉత్పాతాలు దివ్యాలని (పిడుగుపాటు మొదలైనవి); ఆంతరిక్షాలని (ధూమకేతువు మొదలైనవి); పార్థివాలని (భూకంపాదులు) మూడు రకాలుగా ఉంటాయని నారదభగవానులవారు చెప్పారు. శిశుపాలుని మరణంతో ఆ ఉత్పాతాలు ఏమయినా శాంతించాయా?" ధర్మరాజు మాట విని వ్యాసుడు ఇలా అన్నాడు. "రాజా! మహోత్పాతాల ఫలితం పదమూడేళ్లు ఉంటుంది. సర్వక్షత్రియ నాశనం జరుగుతుంది. భరతశ్రేష్ఠా! సమయం కాగానే నీ కారణంగా, దుర్యోధనుని అపరాధం వలన, భీమార్జునుల పరాక్రమం ద్వారా భూమిమీది రాజులందరూ కలసి పరస్పర యుద్ధంతో నాశనం అవుతారు.. రాజేంద్రా! తెల్లవారు జామున స్వప్నంలో నీవు వృషభధ్వజుడు, నీలకంఠుడు, భవుడు, స్థాణుడు, కపాలి, త్రిపురాంతకుడు, ఉగ్రుడు, రుద్రుడు, పశుపతి, మహాదేవుడు, ఉమాపతి, హరుడు, శర్వుడు, వృషుడు, శూలి; పినాకి, చర్మవసనుడు అయిన శివుని చూస్తావు. కైలాసశిఖరంలా వెలుగొందే వృషభారూఢుడైన ఆ శివుడు పితృదేవతలకు ఆశ్రయమైన దిక్కును(దక్షిణదిక్కును) ఎల్లప్పుడూ చూస్తూ ఉంటాడు. రాజా! ఈవిధమైన స్వప్నాన్ని నీవు చూస్తావు. దాని

గురించి నీవు చింతించకు. కాలం దాటరానిది. నీకు శుభమగుగాక! నేను కైలాసానికి వెడుతున్నాను. నీవు ఇంద్రియనిగ్రహం కలిగి, అప్రమత్తంగా ఉంటూ భూమిని పాలించు." ఇలా అని ఆ పూజ్యుడు కృష్ణద్వైపాయనుడు వేదాచారులైన శిష్యులతో సహితంగా కైలాసపర్వతానికి వెళ్లాడు.

తాతగారు వెళ్లిపోయాక ధర్మరాజు పదేపదే వేడి నిట్టూర్పులు విడుస్తూ - దానిగురించే "పౌరుషంతో దైవాన్ని అడ్డుకోవడం ఎలా శక్యం అవుతుంది? మహర్షి చెప్పినది తప్పకుండా జరుగుతుంది" అని అనుకోసాగాడు. మహాతేజస్వి అయిన యుధిష్ఠిరుడు తన తమ్ములందరితో అప్పు డిలా అన్నాడు - "పురుషసింహాల్లారా! వ్యాసమహర్షి నాతో చెప్పినది మీరు విన్నారు కదా! అప్పుడు ఆయన అన్నమాట విని నాకు నిశ్చయంగా మరణించా లనిపించింది. ఎందుకంటే సర్వక్షత్రవినాశనానికి విధి నన్నే కారణంగా చేయదలచుకుంటే, నేను జీవించి ఉండడం వలన ప్రయోజనమేమిటి?" ఇలా అంటున్న రాజును ఉద్దేశించి అర్జునుడు ఇలా చెప్పసాగాడు. "రాజా! పాపభూయిష్ఠమైన, ఘోరమైన మోహాన్ని పొందకు. ధైర్యం వహించి ఏది మేలో అది ఆచరించు." సత్యధృతి అయిన యుధిష్ఠిరుడు ద్వైపాయనుని మాటలనే తలచుకొంటూ తమ్ముళ్లందరితో ఇలా అన్నాడు. 'మీకందరికీ క్షేమం కలుగుగాక. నాయనలారా! బ్రతికి ఉన్నా, పదమూడేళ్లు నావలన ఏ ప్రయోజనం ఉంటుంది? కనుక నేటినుండి నేను చేసే ప్రతిజ్ఞ వినండి. సోదరులనుగాని, ఇతరరాజులను గాని పరుషంగా మాట్లాడను. జ్ఞాతుల ఆజ్ఞను పాటిస్తూ, వారు అడిగినవన్నీ ఇవ్వడంలో నిమగ్నమవుతాను. ఇలా ప్రవర్తిస్తున్న నాకు నాకుమారులపట్ల, ఇతరులపట్ల భేదభావం రాకుండుగాక! లోకంలో విరోధానికి భేదమే మూలం కదా! నరశ్రేష్ఠులారా! వైరభావాన్ని దూరంగా ఉంచుతూ, అందరికీ ప్రియాన్నే ఆచరిస్తూ ఉంటే నాకు లోకంలో నింద కలుగదు. "తమ అన్నగారిమాట విని పాండవులందరూ, అతనికి మేలు చేయడంలో తత్పరులై, అతనినే అనుసరించసాగారు. రాజా! తమ్ముళ్లతో కలిసి ధర్మరాజు సభలో ఇలా ప్రతిజ్ఞ చేసి దేవతలకు, పితరులకు యథావిధిగా తర్పణాలు చేశాడు. భరతశ్రేష్ఠా! రాజులందరూ వెళ్లిపోయిన పిదప, శోభాకరమైన మంగళకార్యాలు పూర్తిచేసుకొని, తమ్ముళ్లందరూ కూడా రాగా, మంత్రులతో కలిసి యుధిష్ఠిరుడు నగరంలో ప్రవేశించాడు. మహారాజా! దుర్యోధనుడు, సుబలసుతుడైన శకుని ఇద్దరూ రమణీయమైన ఆ సభలోనే ఉండిపోయారు.

47. మయసభలో భంగపడిన దుర్యోధనుడు ధర్మజుని వైభవమును చూచి దుఃఖించుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు - పురుషశ్రేష్ఠా! దుర్యోధనుడు శకునితో కలిసి మెల్లమెల్లగా ఆ సభనంతటినీ చూడసాగాడు. కురునందనుడైన దుర్యోధనుడు ఆ సభలో ఇంతకుముందు హస్తినాపురంలో తాను ఎన్నడూ చూడని దివ్యమైన దృశ్యాలను చూసి సంప్రీతిని పొందాడు. ఒకమారు దుర్యోధనుడు ఆ సభాభవనంలో స్ఫటికమణులు పొదిగిన స్థలాన్ని చేరుకొని, అక్కడ నీరు ఉన్నదనే సందేహంతో తన వస్త్రాన్ని పైకి పట్టుకొన్నాడు. తన బుద్ధి పొరబడినందుకు అతడు మనసులో చాలా విచారించి, అక్కడ ఉండడానికి విముఖుడై కూడ ఆ సభలోనే తిరుగసాగాడు. అనంతరం నేలపై పడిపోయాడు. అందుకని మనసులోనే దుఃఖిస్తూ, సిగ్గుతో నిట్టూర్పులు విడుస్తూ అక్కడినుండి కదిలినా ఆ సభలోనే తిరుగసాగాడు. తరువాత స్ఫటిక మణులవలె స్వచ్ఛమైన జలంతో, స్ఫటిక మణిమయపద్మాలతో అలరారే కొలనును చూచి స్థలం అనుకొని కట్టుబట్టలతో నీటిలో పడ్డాడు. నీళ్లల్లో పడిన సుయోధనుని చూసి భీమసేనుడు నవ్వాడు. అతని పరిచారకులూ నవ్వారు. రాజుగారి ఆజ్ఞప్రకారం అతనికి పొడిబట్టలు ఇచ్చారు. ఆ స్థితిలో ఉన్న అతనిని చూచి భీమార్జునులు నకులసహదేవులు కూడా బాగా నవ్వారు. అసలే అసహనశీలుడైన దుర్యోధనుడు వారి పరిహాసాన్ని సహించలేకపోయాడు. సిగ్గుతో కూడిన తన ముఖకవళికలను దాచుకోవడానికి అతడు వారివైపు చూడలేదు. మరల స్థలాన్ని చూచి, బట్ట పైకి ఎత్తి పట్టుకొని ఈదే వానిలా నడవసాగాడు. అలా పైకి ఎక్కిన అతన్ని చూచి జనులందరూ మళ్లీ నవ్వారు. మూయబడి ఉన్న స్ఫటికమయమైన ద్వారాన్ని చూచి దుర్యోధనమహారాజు ప్రవేశించబోగా తలకు గట్టిదెబ్బ తగిలింది. దిమ్మతిరిగినట్లు నిలబడిపోయాడు. అటువంటిదే స్ఫటికమయమైన పెద్ద కవాటం (తలుపు) కల ద్వారాన్ని రెండుచేతులతో గట్టిగా చరుస్తూ (మూసిఉంది అనుకొని) దానిని దాటి ముందుకు పడిపోయాడు. అతడు మళ్లీ ఒక వెడల్పయిన ద్వారం వద్దకు వచ్చాడు. అది కూడా అలాంటిదే అనుకొని ద్వారంవద్ద నుండే వెనుతిరిగాడు.

రాజా! ఈ రీతిగా వంచనలను పొంది దుర్యోధనమహారాజు పాండవేయుల వద్ద అనుమతి తీసికొని, రాజసూయ మహాయాగంలో వారికి లభించిన అద్భుతమైన సంపత్సమృద్ధిని చూచి, అప్రసన్నమైన మనసుతో హస్తినాపురానికి బయలుదేరాడు.

పాండవుల సంపదకు కుతకుతలాడుతూ, దాని గురించే ఆలోచిస్తూ వెళ్తున్న

దుర్యోధనమహారాజుకు పాపచింతన కలిగింది. నిర్మలచిత్తు లయిన పాండవులను, వారికి వశు లయిన రాజులను, వారికి హితం కోరే ఆబాలవృద్ధులైన సమస్తలోకాన్ని, మహాత్ము లయిన పాండవుల ఉత్కృష్ట మయిన మహిమను చూచి ధృతరాష్ట్రసుతుడైన దుర్యోధనుడు పాలిపోయాడు. వెలవెలబోయాడు. దారిలో అతడు చెదరిన మనసుతో, ఒంటరిగా, ఆ ధర్మరాజుయొక్క సాటిలేని సభాభవనం గూర్చి, సంపదను గూర్చి తలపోయసాగాడు. మైకం క్రమ్మినట్లున్న దుర్యోధనుడు ఆ సమయంలో పదేపదే పలకరిస్తున్నా శకునితో ఏమీ మాట్లాడటం లేదు. వికలమనస్కు డయిన అతనిని చూచి శకుని- "దుర్యోధనా! నిట్టూర్పులు విడుస్తూ వెడుతున్నావు. దీనికి కారణం ఏమిటి?" అని అడిగాడు.

దుర్యోధనుడు చెపుతున్నాడు - "మామా! గొప్ప వాడయిన అర్జునుని అస్త్రప్రతాపం వలన గెలిచిన, యుధిష్ఠిరుని వశమయిన ఈ భూమినంతటినీ చూచి, దేవతలలో మిక్కిలి తేజస్వి అయిన ఇంద్రుడు చేసిన యజ్ఞం లాగే జరిగిన యుధిష్ఠిరుని యజ్ఞం చూచి, అసహనంతో, రాత్రింబగళ్లు, గ్రీష్మఋతువులో కొద్దిగా ఉన్న నీరు ఆవిరై పోతున్నట్లుగా పూర్తిగా దహించుకుపోతున్నాను. చూడు. సాత్వత వంశీయు డయిన కృష్ణుని చేతిలో శిశుపాలుడు మరణించాడు. కాని అక్కడ దానికి ఎవరూ ప్రతీకారం తీర్చుకోలేకపోయారు. పాండవులనుండి పుట్టిన అగ్నిలో దగ్ధులైన రాజులు ఆ అపరాధాన్ని క్షమించారు. లేకుంటే అంత అన్యాయాన్ని ఎవరు సహించగలుగుతారు? ఆ మహత్కార్యం వాసుదేవుడు అనుచితంగా చేశాడు. మహాత్ము లైన పాండుపుత్రుల ప్రతాపంవలన అది సిద్ధించింది. అవును మరి. పన్నులు చెల్లించే వైశ్యులవలె రాజులందరూ అనేకరకాల రత్నాలను తెచ్చి రాజయిన కుంతీసుతుని సేవించారు. పాండవులవద్దకు చేరి మిరుమిట్లుగొలిపే ఆ సంపదను చూచి అసూయపడి దహించుకుపోతున్నాను. ఇలా కావటం ఉచితం కాదు." ఇలా నిశ్చయించుకొని అతడు అగ్నిచేత దహింపబడుతున్నవాని వలె తిరిగి గాంధారరాజు శకునితో ఇలా అన్నాడు. "అగ్నిలో ప్రవేశిస్తాను. లేదా విషం తింటాను. లేదా నీటిలో మునుగుతాను. కాని బ్రతికిమాత్రం ఉండలేను.

శత్రువుల వృద్ధిని, తన హీనదశను చూచి ఈ లోకంలో ఏ బలవంతుడు సహించి ఊరుకోగలడు? శత్రువులకు సంక్రమించిన అటువంటి ఆ సంపదను సహిస్తున్న నేను స్త్రీని కాను. స్త్రీ కాకుండా పోను. పురుషుడిని కాను. పురుషుడిని కాకుండా పోను. ఆ భూమండలాధిపత్యాన్ని, అటువంటి సంపద కలిగి ఉండడాన్ని, అటువంటి యజ్ఞాన్ని చూచి నావంటివాడు ఎవడు తపించడు? ఆ రాజలక్ష్మిని తేవడానికి నేను ఒక్కడినే

అశక్తుడిని. సహాయకులు ఎవరూ కనపడడంలేదు. కనుకనే చావాలని తలపోస్తున్నాను. కుంతీపుత్రుడైన యుధిష్ఠిరుని వద్ద ఉన్న ఆ అక్షయమై, విశుద్ధమైన సంపదను చూచి దైవమే గొప్ప దని, పురుషప్రయత్నం నిరర్థక మని అనుకొంటున్నాను. సౌబలా! పూర్వం నేను యుధిష్ఠిరుని నాశనం కొఱకు ప్రయత్నం చేశాను. అదంతా దాటుకుని అతడు నీటిలోని తామరలా వృద్ధిపొందాడు. కనుకనే దైవం గొప్ప దని, పౌరుషం నిరర్థక మని అనుకొంటున్నాను. ధార్తరాష్ట్రులు హాని పొందుతున్నారు. పాండవులు నిత్యమూ వృద్ధి పొందుతున్నారు. ఆ సంపదను, అటువంటి సభను, రక్షకులయొక్క పరిహాసాన్ని చూచి నేను అగ్నిచేత దహింపబడుతున్నట్లుగా పరితపిస్తున్నాను. మామా! అసహనంతో మిక్కిలి దుఃఖితుడనైన నాకు (మరణించడానికి) అనుజ్ఞ నివ్వు. నా ఈ అవస్థను ధృతరాష్ట్రునకు నివేదించు."

48. పాండవులను జయించుటకు శకుని దుర్యోధనుల మంతనము.

శకుని అంటున్నాడు – "దుర్యోధనా ! యుధిష్ఠిరునిపై నీకు కోపం వద్దు. పాండవులు తమ అదృష్టాలను అనుభవిస్తున్నారు. పూర్వం వారిని వశపరచుకోవడానికి ఎన్నో ఉపాయాలను అవలంబించావు. కాని వాటివలన వారిని వశపరచుకోలేకపోయావు. నీవు పదే పదే కుతంత్రాలు చేస్తూనే ఉన్నావు. కాని ఆ పురుషశార్దూలాలు తమ అదృష్టంతో ఆ ఆపదలనుండి విముక్తి పొందారు. వారు ద్రౌపదిని భార్యగా పొందారు. కొడుకులతో సహితంగా ద్రుపదుని సహాయం పొందారు. వారికి రాజ్యలాభంలో పరాక్రమవంతుడైన వాసుదేవుడు సహాయకుడు.

(ఆ వాసుదేవుడు కూడా దేవాసురులకు, మనుష్యులకు ఎవరికీ జయింపశక్యం కానివాడు. అతని తేజస్సుచేత యుధిష్ఠిరుడు వృద్ధిపొందాడు. ఇందులో శోకించవలసిన పనేముంది?)

భూనాయకా! ఎడతెగని తిరుగులేని ప్రయత్నాల చేత వారు తమ తండ్రి రాజ్యభాగాన్ని పొందారు. వారి తేజస్సుచేత అది మరింత పెరిగింది. ఇందులో విచారించడానికేముంది? అర్జునుడు అగ్నిదేవుని సంతోషపెట్టి గాండీవాన్ని, అక్షయతూణీరాలను, దివ్యాస్త్రాలను పొందాడు. ఆ దివ్యధనుస్సు వలన, తన బాహుబలం వలన రాజులందరినీ వశపరచుకొన్నాడు. ఇందులో శోకించవలసినదేమున్నది ? అగ్నిలో మాడిపోకుండా ఆ మయదానవుని విడిపించి పరంతపుడైన సవ్యసాచి మయునిచేత ఆ సభను నిర్మింపచేశాడు. ఆ మయుడే చెప్పగా కింకరు లనే భయంకరు లయిన రాక్షసులు ఆ సభను మోశారు. ఇందులో విచారించడానికేముంది? భారతా! నీవు "నాకు సహాయం లే"దని చెప్పావే అది మిథ్య.

ఈనీ సోదరులందరూ నీకు వశవర్తులు. మహాధనుర్ధరుడు, పరాక్రమవంతుడు అయిన ద్రోణుడు తన కొడుకు అశ్వత్థామతో పాటు నీ సహాయకుడై ఉన్నాడు. సూతపుత్రుడు కర్ణుడు, మహారథుడైన కృపాచార్యుడు, తమ్ముళ్లతో సహితంగా నేను, రాజయిన భూరిశ్రవసుడు - వీరందరితో కలిసి నీవు ఈ సమస్తపృథివిని జయించు." దుర్యోధనుడు చెపుతున్నాడు - "రాజా! నీవు అనుమతిస్తే నీతో, ఇతరమహారథులతో కూడి ఈ పాండవులనే జయించగలను. వీరిని జయించితే రాజ్యం భూమి, సమస్తరాజులు, గొప్ప ధనసంపదతో కూడిన ఆ సభ నాకు వశమవుతాయి."

శకుని బదులిస్తున్నాడు - "అర్జునుడు, కృష్ణుడు, భీమసేనుడు, యుధిష్ఠిరుడు, నకులసహదేవులు, కొడుకులతో సహా ద్రుపదుడు - వీరందరూ యుద్ధంలో దేవతలకు కూడా జయింపశక్యం కానివారు. అందరూ మహారథులు, మహాధనుర్ధరులు, అస్త్రవిశారదులు, యుద్ధోత్సాహం కలవారు. రాజా! యుధిష్ఠిరుడు స్వయంగా ఎలా పరాజితుడవుతాడో ఆ ఉపాయాన్ని నేను ఎరుగుదును. దానిని విను. ప్రీతితో సేవించు." దుర్యోధనుడు అడుగుతున్నాడు - "మామా! స్నేహితులకు, మహాత్ములయిన ఇతరులకు కూడా ఏ ప్రమాదం జరుగకుండా జయించడానికి నీకు చేతనయితే, ఆ ఉపాయమేదో నాకు చెప్పు." శకుని చెపుతున్నాడు - "కుంతీపుత్రుడయిన యుధిష్ఠిరుడు ద్యూతప్రియుడు. కాని జూదమాడడం ఎరుగనివాడు. ఆ రాజును ఆహ్వానిస్తే, వెనుతిరగడానికి శక్తుడు కాడు. జూదమాడడంలో నేను నేర్పరిని. భూలోకంలోనే కాదు ముల్లోకాలలో కూడా జూదంలో నాతో సాటిరాగలవారు లేరు. కురునందనా! కనుక నీవు అతనిని జూదానికి ఆహ్వానించు. రాజా! అక్షకుశలుడి నైన నేను అతనియొక్క రాజ్యాన్ని, మిరుమిట్లుకొలిపే సంపదను, నీకు దక్కేలా చేయగలను. ఇందులో సందేహం లేదు. దుర్యోధనా! ఇదంతా నీవు రాజుగారికి నివేదించు. నీ తండ్రి అనుమతిస్తే వారిని జయిస్తాను. సందేహం లేదు". దుర్యోధనుడు అంటున్నాడు - "సౌబలా! కురుముఖ్యుడైన ధృతరాష్ట్రునికి నీవే యథోచితంగా నివేదించు. నేను చెప్పడానికి శక్తుడిని కాను. (నేను చెప్పలేను)."

49. దుర్యోధనుని చింతను విని ధృతరాష్ట్రుడు విదురుని ఇంద్రప్రస్థమునకు పంపదలచుట.

గాంధారీపుత్రు డయిన దుర్యోధనునితోకలిసి సుబలసుతుడైన శకుని యుధిష్ఠిర మహారాజు యొక్క రాజసూయ మహాయజ్ఞాన్ని చూచి వచ్చాడు. దుర్యోధనునికి ప్రీతికరమైన

అభిప్రాయాన్ని తెలుసుకొన్నాడు. దుర్యోధనుని మాటలను విని, మహాప్రాజ్ఞుడైన ధృతరాష్ట్రుని సమీపించి శకుని ఇలా అన్నాడు. "మహారాజా! దుర్యోధనుడు కాంతి తరిగిపోయి ఉన్నాడు. పాలిపోయాడు. చిక్కిపోయాడు. దీనుడై (అహంకారం చచ్చి) చింతాపరవశుడై ఉన్నాడు. అతని మనసులో ఏముందో తెలుసుకో రాజా! శత్రువులవలన కలిగిన సహింపరాని కష్టాన్ని ఎందుకు పరీక్షించి తెలుసుకోవు ? నీ పెద్దకొడుకు మనసులోని శోకాన్ని ఎందుకు గుర్తించవు ?" ధృతరాష్ట్రుడు అంటున్నాడు - "నాయనా! దుర్యోధనా! మిక్కిలి దుఃఖంతో ఉన్నావు అని విన్నాను. కారణమేమిటి? కురునందనా! అది వినదగినది అయితే చెప్పు. నీవు కాంతిహీనుడవని, పాలిపోయావని, చిక్కిపోయావని, సతతమూ చింతిస్తూ ఉంటావని ఈ శకుని చెప్పాడు. నీకు శోకం కలుగడానికి కారణం కనిపించడం లేదు. నాయనా! గొప్ప సంపద అంతా నీ అధీనంలోనే ఉంది. నీ తమ్ముళ్లు, స్నేహితులు కూడా నీకు అప్రియం చేయడం లేదు. అమూల్యమైన వస్త్రాలను ధరిస్తున్నావు. శుచి అయిన అన్నాన్ని తింటున్నావు. ఉత్తమజాతి గుఱ్ఱాలను ఎక్కి తిరుగుతున్నావు. ఇక పాలిపోవడానికి, చిక్కిపోవడానికి కారణమేమిటి ? అమూల్యమైన శయ్యలు, మనసును రంజింపచేసే యువతులు, అన్ని ఋతువులలోను అనుకూలంగా ఉండే భవనాలు, కోరినట్లుగా సుఖాన్ని కలిగించే క్రీడాస్థానాలు దేవతలకు వలె అన్నీ మాటమాత్రంగానే ఏర్పాటవుతాయి. సందేహంలేదు. పుత్రకా! అట్టి దుర్ధర్షుడవైన నీవు ఎందుకు శోకిస్తున్నావు ?

(స్వర్గంలో ఉన్న ఇంద్రుని వలె అన్నికోరికలు అనుభవిస్తూ, శ్రేష్ఠమైన అన్నపానీయాలు పొందుతూ ఉన్న నీవు ఎందుకు శోకిస్తున్నావు ? నీవు కృపాచార్యునివద్ద నిరుక్తం, నిగమం, ఛందస్సు, షడంగసహితంగా అర్థశాస్త్రాన్ని, అష్టవ్యాకరణాలను చదువుకొని పండితుడవయ్యావు. నాయనా! బలరాముడు, కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు - వీరి వద్ద నీవు అస్త్రవిద్యను నేర్చుకొన్నావు. ప్రభువుగా అన్నీ అనుభవిస్తున్నావు. సూత మాగధులు కొనియాడుతున్నారు. చక్కని ప్రజ్ఞ కలవాడవు. ఈ లోకంలో జ్యేష్ఠుడవై భోగాలు పొందుతున్నావు. అటువంటి నీకు ఈ శోకం కలుగడానికి మూలమేమిటి? అది నాకు చెప్పు తండ్రీ!" ధృతరాష్ట్రుని మాటలను విని, మూడుడై క్రోధానికి చిక్కి, దుర్యోధనుడు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ తండ్రికి ఇలా బదులిచ్చాడు.)

"నేను తింటున్నాను, కట్టుకొంటున్నాను కూడా. కాని పిరికివాళ్లవలె చేస్తున్నాను. కాలంలో మార్పును కోరుకొంటూ, తీవ్రమైన ఈర్ష్యను మనసులో దాచుకొంటున్నాను. శత్రువులను సహించలేనివాడు, వారిని పరాభవించి, వారి వలన కలిగిన కష్టాలనుండి ప్రజలను విడిపించగలవాడై ఉండాలి. అతనినే పౌరుషం కలవానిగా చెప్పుకొంటారు. భారతా! సంతుష్టి సంపదను, గర్వాన్నీ హరిస్తుంది. దయ, భయం రెండూ కూడా

అటువంటివే. ఈ గుణాలు కలిగినవాడు ఉన్నతపదవిని పొందలేడు. కుంతీనందనుడైన యుధిష్ఠిరుని యొక్క అతి ఉజ్జ్వలమైన సంపదను చూసిన తర్వాత నా భోగాలు నాకు రుచించడం లేదు. అది నన్ను వివర్ణుడిని చేస్తోంది. శత్రువుల వృద్ధిని, తన క్షీణత్వాన్ని తెలుసుకొని, కనబడకపోయినా ఆ కౌంతేయుల సంపద వృద్ధిపొందుతున్నట్లు మనసులో ఊహించుకొంటూ ఉండడంవలన నేను రంగుమారి, దీనుడినై, పాలిపోయి, చిక్కిపోయాను.

యుధిష్ఠిరుడు తన గృహంలో నివసించే ఎనభై ఎనిమిది వేలమంది స్నాతకులను రక్షించి పోషిస్తున్నాడు. వారికి ఒక్కొక్కరికి ముప్పదిమంది చొప్పున దాసీలు ఉన్నారు. వీరుకాక ఇతరులు పదివేలమంది యుధిష్ఠిరుని భవనంలో బంగారు పాత్రలలో నిత్యమూ ఉత్తమమైన భోజనం భుజిస్తూ ఉంటారు. నలుపు, నీలం, ఎరుపు రంగులు కల కదళీమృగ చర్మాలను, అతివిలువైన కంబళ్లను కాంబోజరాజు అతనికి కానుకగా పంపాడు. అతనికి కానుకలుగా సమర్పించబడిన వందలకొద్దీ ఆడవీనుగులు, వేలకొద్దీ గోవులు, గుఱ్ఱాలు, ముప్పైవేల ఒంటెలు, ముప్పైవేల ఆడు గుఱ్ఱాలు అక్కడ తిరుగుతూ ఉంటాయి. రాజలోకమంతా కానుకలు తీసుకొని రాజభవనంలో గుమికూడారు. భూపతీ! ఈ మహాయజ్ఞంలో రాజులు యుధిష్ఠిరునికోసం అనేకరకాల రత్నాలను మిక్కిలిగా తెచ్చారు. బుద్ధిమంతు డయిన ఆ యుధిష్ఠిరుని యజ్ఞానికి వచ్చినంత ధనం నేను ఇంతకుముందు చూడలేదు. వినను కూడా లేదు. మహారాజా! శత్రువుయొక్క అంతులేని ఆ ధనసమూహాన్ని చూచి, నేను చింతాకులుడనై సుఖంగా ఉండలేకపోతున్నాను. బ్రాహ్మణులు, పాలాలు పండించే కాపులు, గోవులను రక్షించే వైశ్యులు వందలమంది గుంపులుగా మూడు ఖర్వాల సంఖ్య గల కానుకలను తీసుకొని వచ్చి, ఆపివేయడంతో ద్వారం వద్దే నిలిచిపోయారు. బంగారుమయమైన అందమైన కమండలాలను తెచ్చినవారికి, ఇంతింత ధనం తెచ్చినవారికి ప్రవేశమే దొరకలేదు. దేవకాంతలు ఇంద్రునికొఱకు అమృతాన్ని నింపి ఉంచినట్లుగా సముద్రుడు వరుణుడిచ్చిన కంచుపాత్రలో యుధిష్ఠిరుని కొరకు మధువు నింపి కానుకగా పంపాడు. వేయి బంగారు నాణేలతో చేయబడి, అనేక రత్నాలతో అలంకరింపబడి, కావడిలో పెట్టి తెచ్చిన కలశంలోని నీటిని వాసుదేవుడు ఉత్తమమైన శంఖంతో అభిషేకించాడు. అదంతా చూసి నాకు జ్వరం తగిలినట్టయింది. ఆ కలశాలను తీసుకొని పూర్వదక్షిణ సముద్రాలకు వెళ్తున్నారు. భరతశ్రేష్ఠా! అలాగే పశ్చిమ సముద్రానికి కూడా వెళ్లారు. పక్షులు, ఖేచరులు తప్ప ఉత్తరదిక్కుకు వెళ్లలేరు. అక్కడకు కూడా అర్జునుడు వెళ్లి అమితమైన ధనాన్ని కప్పంరూపంలో తెచ్చాడు. ఆ యుధిష్ఠిరుని రాజసూయయాగంలో

ఒక అద్భుతం చెప్తాను. విను. లక్షమంది బ్రాహ్మణులు భుజించడం పూర్తికాగానే అక్కడ ఒక శంఖం మ్రోగేటట్లు ఏర్పాటు చేశారు. దాని ప్రకారం శంఖం ఎప్పుడూ మ్రోగుతూనే ఉంది. భారతా! మాటిమాటికి మోగుతున్న ఆశంఖధ్వనిని నిరంతరంగా విన్న నాకు శరీరం గగుర్పొడిచింది. మహారాజా! యజ్ఞాన్ని చూడడానికి వచ్చిన పెక్కుమంది రాజులచేత క్రిక్కిరిసిపోయిన ఆ సభాభవనం నక్షత్రాలతో నిండిన నిర్మలమైన ఆకాశంలా శోభిల్లింది. జనాధిపా! బుద్ధిమంతు డయిన ఆ పాండుకుమారుని యజ్ఞానికి రాజులు సమస్తరత్నాలను తీసుకొనివచ్చారు. రాజులు వైశ్యులవలె ద్విజులకు భోజనాలు వడ్డించారు. రాజా! యుధిష్ఠిరుని వద్ద ఉన్న సంపద దేవేంద్రునివద్ద కాని, యమ, వరుణ, కుబేరుల వద్దగాని లేదు. పాండుపుత్రుని ఆ ఉత్కృష్టమైన సంపదను చూచి దహించుకుపోతున్న మనసుతో నేను శాంతిని పొందలేకపోతున్నాను.

(పాండవుల ఐశ్వర్యం పొందకపోతే నాకు శాంతిలేదు. యుద్ధాన్ని చేసైనా పొందుతాను. లేదంటే శత్రువుల చేతిలో మరణిస్తాను. ఇటువంటి దశలో ఉన్న నేను జీవించి ఏం ప్రయోజనం ? పాండవులు దినదినాభివృద్ధి పొందుతున్నారు. మనవృద్ధి నిలిచిపోయింది.)

శకుని అంటున్నాడు – "యుధిష్ఠిరుని వద్ద నీవు చూచిన ఆ సాటిలేని సంపదను పొందే ఉపాయం నేను చెప్తాను విను. ఈ భూమండలంలో నేను ద్యూతవిద్య బాగా తెలిసినవాడిని. దానిలోని మర్మాలను ఎరిగినవాడను. పందెం ఒడ్డడం తెలిసినవాడిని. పాచికలు విసరడంలో విశేషజ్ఞానం కలవాడిని. కుంతీసుతుడైన యుధిష్ఠిరుడు ద్యూతప్రియుడే కాని పాచికలు వేయడం అతనికి తెలియదు. జూదానికి గాని యుద్ధానికి గాని పిలిస్తే అతడు తప్పక వస్తాడు. మోసంచేసి అయినా సరే అతనిని తప్పక గెలుస్తాను. ఆ దివ్యసంపదనంతా తెచ్చిపెడతాను. అతనిని పిలువు." వైశంపాయనుడు చెపుతున్నాడు. శకుని ఇలా అనగానే దుర్యోధనమహారాజు వెంటనే (ఆమాట అందిపుచ్చుకొని) ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. 'రాజా! అక్షకోవిదుడు అయిన ఇతడు జూదంతో పాండుపుత్రుని సంపదను తీసికొనిరావడానికి ఉత్సాహ పడుతున్నాడు. కాబట్టి మీరు అనుజ్ఞ ఇవ్వండి.'

ధృతరాష్ట్రుడు అంటున్నాడు – "విదురుడు మహాప్రాజ్ఞుడు. మంత్రి. అతని శాసనాన్ని అనుసరించి ఉంటాను నేను. అతనిని కలుసుకొని ఈ కార్యవిషయంలో ఏమి నిశ్చయించాలో తెలుసుకొంటాను. దీర్ఘదర్శి అయిన అతడు ధర్మాన్ని పురస్కరించుకొని మిక్కిలి హితమై, రెండు పక్షాలకూ తగిన కార్యాన్ని నిశ్చయించి చెప్పుతాడు." దుర్యోధనుడు అంటున్నాడు

– "విదురుడు నిన్ను కలుసుకొంటే అతడు నిన్ను ఈ కార్యం నుండి మరలించుతాడు. రాజేంద్రా! నీవు అలా మరలితే నేను చనిపోతాను. ఇది నిశ్చయం. రాజా! నేను పోతే అప్పుడు నీవు విదురునితో సుఖంగా ఉండు. ఈ భూమినంతా నీవే అనుభవించు. నాతో నీకు పనేమిటి ?" దుర్యోధనునియొక్క ఆర్తితో కూడిన ఆ ప్రణయోక్తిని విని ధృతరాష్ట్రుడు దుర్యోధనుని ఆలోచనకు మొగ్గు చూపి, సేవకులతో ఇలా అన్నాడు. "వేయిస్తంభాలతో, వంద ద్వారాలతో విశాలమైన అందమైన చూడచక్కని ఒక సభాభవనాన్ని త్వరగా శిల్పులు నిర్మించాలి. ఆ తరువాత అన్నిదేశాలనుండి చెక్కుడుపనివారిని పిలిపించి ఆ భవనంలో రత్నాలను పరిపించాలి. ఆ రీతిగా అమర్చి చక్కగా ప్రవేశయోగ్యమైన తరువాత మెల్లగా నాకు తెలియచేయండి." మహారాజా! దుర్యోధనుని శాంతికోసం ఇలా నిశ్చయించి ధృతరాష్ట్ర మహారాజు విదురుని కొఱకు సేవకుని పంపాడు. విదురుని అడుగకుండా అతడు స్వయంగా ఏదీ నిశ్చయించడు. జూదం వలన కలిగే దోషాలను తెలిసికూడా అతడు పుత్రమమకారానికి లొంగిపోయాడు. బుద్ధిమంతుడయిన విదురుడు కలహానికి ద్వారభూతమై, వినాశనాన్ని కలిగించే జూదం జరగనున్నదనే వార్తను విని ధృతరాష్ట్రుని వద్దకు పరుగెత్తుకు వచ్చాడు. ఆ సోదరుడు విదురుడు మహాత్ముడైన పెద్దన్నగారిని సమీపించి, శిరసుతో పాదాభివందనం చేసి ఇలా అన్నాడు.

"రాజా! మీ యొక్క ఈ నిశ్చయాన్ని నేను మెచ్చుకోలేను. జూదం కారణంగా పుత్రులమధ్య కలహం రాకుండా చేయండి." ధృతరాష్ట్రుడు చెపుతున్నాడు – "విదురా! దేవతలు మనలను అనుగ్రహిస్తే నా పుత్రులకు, పాండుపుత్రులకు కలహం రాదు. ఇందులో సందేహంలేదు. అశుభమైనా, శుభమైనా, హితమైనా, అహితమైనా గానీ సుహృద్ధ్యాతం జరిగితీరుతుంది. నిస్సందేహంగా ఇది దైవం వలననే జరిగింది. భారతా! నేను, ద్రోణుడు, భీష్ముడు, నీవు దగ్గరలో ఉండగా ఎటువంటి దైవవిహితమైన అన్యాయమూ జరగదు. వాయుసమానవేగం గల గుఱ్ఱాలను పూన్చిన రథం ఎక్కి ఈ రోజే ఖాండవప్రస్థానికి వెళ్లు. యుధిష్ఠిరుని తీసుకొనిరా. విదురా! నానిర్ణయం గూర్చి చెప్పకు. ఇది నీకు నేను చెపుతున్నాను. ఈ జూదాన్ని ఘటింపచేసిన దైవం బలీయమని అనుకొంటున్నాను." ఇలా ఆదేశింపబడిన బుద్ధిమంతుడైన విదురుడు ఇది జరగకూడదు అని ఆలోచిస్తూ, మిక్కిలి దుఃఖంతో మహాప్రాజ్ఞుడైన భీష్ముని వద్దకు వెళ్లాడు.

50. దుర్యోధనుడు ధృతరాష్ట్రునకు తన మనోవేదనను తెలుపుట.

విదురుని ఆలోచనను తెలిసికొని అంబికాసుతుడైన ధృతరాష్ట్రుడు ఏకాంతంగా దుర్యోధనునితో తిరిగి ఇలా అన్నాడు. "గాంధారీనందనా! జూదం వద్దు. విదురుడు దీనిని ఇష్టపడడం లేదు. మహాబుద్ధిమంతుడైన అతడు మనకు అహితాన్ని చెప్పడు. విదురుడు చెప్పినదే పరమహితమని నాకు అనిపిస్తోంది. పుత్రా! అలాగే చేయి. ఇదంతా నీ మేలుకే అనిపిస్తోంది. దేవర్షి, ఇంద్రగురువు, పరమబుద్ధిమంతుడు అయిన బృహస్పతి ధీమంతుడయిన ఇంద్రునికి చెప్పిన నీతిశాస్త్రమంతా రహస్యాలతో సహితంగా మహాజ్ఞాని అయిన విదురునికి తెలుసు. పుత్రకా! నేను కూడా ఎప్పుడూ అతని మాటనే పాటిస్తాను. కురుకులంలో విదురుడు మేధావి, సర్వశ్రేష్ఠుడు అంటారు. వృష్ణివంశీయులు ఉద్ధవుని మహాబుద్ధిమంతునిగా పూజిస్తారు. కాబట్టి నాయనా! జూదం వద్దు. జూదంలో కలహమే కనిపిస్తోంది. కలహం వలన రాజ్యం నశిస్తుంది. కాబట్టి నాయనా! జూదం విడిచిపెట్టు. పుత్రుడు ఉత్కృష్టకార్యం చేయాలనే తల్లిదండ్రులు కోరుకొంటారు. నీవు కూడా నీ తాతతండ్రుల స్థానాన్ని పొందావుకదా! వేదాధ్యయనం చేశావు. శాస్త్రాలలో పండితుడవైనావు. ఇంటిలో ఎల్లప్పుడూ అందరిచేత ముద్దు చేయబడుతున్నావు. అన్నదమ్ములలో పెద్దవాడివి. రాజ్యాన్ని పొందావు. ఏ శుభాలు పొందలేదు? ఇతరజనులకు అలభ్యమైన ఉత్కృష్టమైన భోజనవస్త్రాలను పొందుతున్నావు. నాయనా! ఇక ఎందుకు దుఃఖిస్తున్నావు ? తాతతండ్రులనుండి వచ్చిన గొప్ప రాజ్యం సమృద్ధమై ఉంది. నిత్యమూ శాసిస్తూ స్వర్గంలో ఇంద్రునివలె వెలుగొందుతున్నావు. నీ ప్రజ్ఞ విదితం. అటువంటి నీకు శోకం ఎలా కలిగింది ? మూలం ఏమిటి? దుఃఖదాయకమైన ఈ స్థితి నాకు చెప్పు."

దుర్యోధనుడు చెపుతున్నాడు – "తింటున్నాను, కట్టుకొంటున్నాను అని మాత్రమే చూసుకొనే పాపాత్ముడు శత్రువులపట్ల అసహనం చూపకపోతే అతనిని అధముడని అంటారు. రాజేంద్రా! ఈ సాధారణసంపద నాకు ఆనందం కలిగించడం లేదు. యుధిష్ఠిరునివద్ద ఉన్న ఉజ్జ్వలమైన సంపదను చూస్తే నాకు వ్యథ కలుగుతోంది. ఈ సమస్త భూమండలం యుధిష్ఠిరునికి వశమైపోయింది. రాయిలా ఇంకా నేను బతికి ఉన్నాను. ఇది దుఃఖంతో అంటున్నాను. నీప, చిత్రక, కుకుర రాజులు, కారస్కారులు, లోహజంఘులు అనే క్షత్రియులు యుధిష్ఠిరుని ఇంటిలో సేవకుల వలె కనిపిస్తున్నారు. హిమవంతం మీది పార్వతీయులు, సాగరద్వీపవాసులు, రత్నఖనుల వాసులు – ఈమ్లేచ్ఛులందరూ యుధిష్ఠిరుని నివాసంలోనికి నిషేధింపబడినారు. రాజా! నన్ను జ్యేష్ఠుడని, శ్రేష్ఠుడని తలచి సత్కరించి యుధిష్ఠిరుడు

రత్నాలను స్వీకరించడానికి నియోగించాడు. రాజులు కానుకలు తెచ్చి ఈయగా పోగుపడిన శ్రేష్ఠమైన అనర్ఘమైన రత్నాలకు అంతూ-దరీ కనపడలేదు. ఆ బంగారాన్ని (రత్నరాశులను) స్వీకరిస్తున్న నాచేయి తిమ్మిరెక్కి అలసిపోయింది. నేను అలా అలసిపోయినపుడు రాజులు రత్నరాశులు పట్టుకొని చాలా దూరం నిలబడిపోయారు. బిందుసరోవరంలోని రత్నాలను తెచ్చి మయుడు స్ఫటికమణిశిలలలో ఆచ్ఛాదించి ఒక పుష్కరిణిని నిర్మించాడు. అది నాకు నీటితో నిండి ఉన్నట్లుగ కనిపించింది. అందుకని వస్త్రం పైకి పట్టుకొన్న నన్ను చూచి భీమసేనుడు విరగబడి నవ్వాడు. రత్నాలు లేకుండానే శత్రువుల విశిష్టసమృద్ధికి నాకు మూర్ఛవచ్చినట్లయింది. నేను సమర్థుడినే అయిఉంటే అక్కడే భీమసేనుని చంపిపారవేసేవాడిని. కానీ నరాధిపా! భీముని చంపడానికి ప్రయత్నం చేసి ఉంటే శిశుపాలుని గతే నాకూ పట్టేది. అందులో సందేహం ఏమీ లేదు. నన్ను శత్రువు పరిహసించాడు. అది నన్ను దహించేస్తోంది. తిరిగి మళ్లీ అటువంటిదే పద్మాలతో నిండిన ఒక కొలనును చూసి, స్ఫటికశిలలతో చదును చేయబడినది అనుకొని నీటిలో జారిపడ్డాను. అక్కడ నన్ను చూచి అర్జునునితో కలిసి కృష్ణుడు బిగ్గరగా నవ్వాడు. ద్రౌపది కూడా వెంట ఉన్న స్త్రీలతో కలిసి నవ్వి నామనసును వ్యథ పెట్టింది. నీటిలో తడిసిపోయిన వస్త్రాలతో ఉన్న నాకు రాజుగారి ఆజ్ఞపై సేవకులు వేరేవస్త్రాలను తెచ్చి ఇచ్చారు. అది ఇంకా నాకు మిక్కిలి దుఃఖాన్ని కలిగించింది.

మహారాజా! నాకు జరిగిన ఇంకొక మోసం విను. ద్వారం లేనిచోట ద్వారం ఉన్నట్లుగా నిర్మించడంతో, అందులో నుండి బయటకు వెళ్తున్న నాకు రాయి కొట్టుకొని నుదుటిపై గట్టి దెబ్బ తగిలింది. అప్పుడక్కడ నకులసహదేవులు దూరంనుండి దెబ్బతగిలిన నన్ను చూశారు. వారు వెంటనే వచ్చి చేతులతో నన్ను పట్టుకొని ఇద్దరూ కలిసి నాకోసం విచారించారు. సహదేవు డయితే నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ "రాజా! ఇది ద్వారం. ఇటు వెళ్లు" అని పదేపదే చెప్పాడు. అక్కడ భీమసేనుడు నన్ను "ధృతరాష్ట్రపుత్రా! అని సంబోధించి నవ్వి, "ఇటు ద్వారం" అని చెప్పాడు." అక్కడ చూచిన రత్నాలపేర్లు కూడా అంతకు ముందు నేను విని ఉండలేదు. అది కూడా నా మనసును తపింపచేస్తోంది."

51. యుధిష్ఠిరునికి వచ్చిన కానుకలను దుర్యోధనుడు వర్ణించుట

దుర్యోధనుడు చెపుతున్నాడు - పాండవుల యొక్క యజ్ఞానికి ఆయాదేశాలనుండి రాజులు తెచ్చిన ఉత్కృష్టమైన రత్నరాశులను నేను చూసినవి చెపుతాను. విను. శత్రువుయొక్క

ఆ ధనసంపదను చూచి అది ఎంత ఉంటుందో, ఎక్కడినుండి వచ్చిందో కూడా నేను తెలుసుకోలేకపోయాను. నన్ను మూఢుడనే అనుకో. కాంబోజరాజు గొట్టెల ఉన్నితో, బిలంలో నివసించే జంతువుల చర్మాలతో, పిల్లి రోమాలతో చేసి బంగారు నగిషీలు చెక్కిన వస్త్రాలను, చర్మాలను మొదలైనవానిని కానుకలుగా సమర్పించాడు. తిత్తిరిపక్షులవలె అనేక వర్ణాలు గలిగి, చిలుకలవంటి ముక్కులు గల గుఱ్ఱాలను మూడువందలు తెచ్చి యిచ్చాడు. పీలు, శమీ, ఇంగుదాలు తినడంచేత పుష్టిగా ఉన్న ఆడుఒంటెను, ఆడుగుఱ్ఱాలను ముప్పదిచొప్పున ఇచ్చాడు. మహారాజా! బ్రాహ్మణులు, గోవులను మొదలైనవానిని పోషించే వైశ్యులు, శూద్రులు అందరూ కూడా మహాత్ముడైన ధర్మరాజుయొక్క ప్రీతికొఱకు మూడు ఖర్వాల కానుకలను తెచ్చి, ఆపివేయడం వలన ద్వారం బయటనే నిలుచుండిపోయారు. పాలాలు పండించే, బ్రాహ్మణులు గోపులను పోషించే వైశ్యులు వందలకొద్దీ గుంపులు గట్టి శుభప్రదాలైన బంగారు కలశాలను కానుకలుగా తెచ్చి కూడా లోపలికి ప్రవేశం పొందలేకపోయారు.

(బ్రాహ్మణులలో ప్రధానమైన కుణిందుడు శంఖాన్ని సమర్పించుకొన్నాడు. దానిని ఎంతో ప్రీతితో ధర్మరాజుకు ఇచ్చాడు. ఆ శంఖాన్ని అన్నదమ్ములందరూ తమ సోదరుడయిన కిరీటికి ఇచ్చారు. నీటిలో పుట్టిన, బంగారు హారాలు కలిగిన, వేయి బంగారు నాణేలతో నింపబడి, స్వీయకాంతులతో ప్రకాశిస్తున్న దానిని అర్జునుడు స్వీకరించాడు. అది అందమైనది. చూచుటకు ఇంపయినది. విశ్వకర్మ రత్నాలతో అలంకరించినది. సాక్షాత్తు ధర్ముడు పదేపదే దానికి నమస్కరించి, ధరించాడు. అన్నదానం జరిగినపుడు అది తనంత తానే మ్రోగుతుంది. ఆ సమయంలో అది ఎక్కువగా నినదించింది. దాని నాదానికి రాజులు తేజస్సు కోల్పోయి పడిపోయారు. కేవలం ధృష్టద్యుమ్నుడు, పంచపాండవులు, సాత్యకి, ఎనిమిదవవాడు శ్రీకృష్ణుడు మాత్రమే ధైర్యంగా నిలుచున్నారు. వారు శౌర్యసంపన్నులు. పరస్పరం ప్రియం ఆచరించేవారు. మూర్ఛపొందిన రాజులనూ, నన్నూ చూచి వారు అప్పుడు బిగ్గరగా పరిహసించారు. అనంతరం మిక్కిలి సంతోషంతో అర్జునుడు బంగారపు కొమ్ములు గల ఐదువందల ఎడ్లను బ్రాహ్మణోత్తమునికి ఇచ్చాడు. సుముఖుడు అజాతశత్రువునకు ముఖ్యమైన కానుకలను పంపాడు. కుణిందుడు బంగారం, వస్త్రాలు అనేక రకాలైనవి ఇచ్చాడు. కాశ్మీరరాజు స్వచ్ఛమై, రసవంతమైన తీయని ద్రాక్ష గుత్తులను కానుకలుగా తీసుకొని వచ్చి ధర్మరాజుకు స్వయంగా ఇచ్చాడు. యవనులు పర్వతప్రాంతాలలోని మనోవేగంకల గుఱ్ఱాలను, విలువైన ఆసనాలను; నూతనమై, విచిత్రమై, సూక్ష్మమై, దర్శనీయమై, శ్రేష్ఠమైన కంబళ్లను (తివాచీలను), ఇతరాలైన అనేక రత్నాలనూ కానుకలుగా తెచ్చి, వారింపబడి ద్వారం దగ్గరే నిలిచిపోయారు. కళింగరాజు శ్రుతాయువు అత్యుత్తమమైన మణిని ఇచ్చాడు. అదేకాక అతడు దక్షిణ సాగరతీరంలోని శంఖాలను, రత్నాలతోకూడిన వందకు మించిన వస్త్రాలను ఇతర రాజులనుండి తీసుకొని కానుకలుగా తెచ్చి యుధిష్ఠిరునికి సమర్పించాడు.

పాండ్యరాజు దర్దురపర్వతం మీది చందనకాష్ఠాలను తొంబదిఆరింటిని పాండుపుత్రునకు సమర్పించాడు. అంతే సంఖ్యగల శంఖాలను కూడా ఇచ్చాడు. చోళ కేరళ నరేశులు ఇద్దరూ అనంతమైన చందనం, అగరు, ముత్యాలు, వైడూర్యాలు, చిత్రకాలు పాండుపుత్రునికి ఇచ్చారు. అశ్మకమహారాజు బంగారం తాపడం చేసిన కొమ్ములు, కుండలవంటి పొదుగులు కలిగి బంగారుహారాలతో అలంకరింపబడిన పదివేల గోవులను దూడలతో సహా ఇచ్చాడు. సింధురాజు పసిడిమాలలు అలంకరించిన సింధుదేశపు గుఱ్ఱాలను ఇరవైఅయిదువేలు ఇచ్చాడు. సౌవీరరాజు ఏనుగులు పూన్చిన రథాలను మూడువందలకు తక్కువ కాకుండా ఇచ్చాడు. అవి బంగారు అలంకారాలతో, మణిరత్న విభూషితాలై, మధ్యందిన సూర్యునిలా, సాటిలేనిప్రకాశంతో వెలుగొందుతున్నాయి. వాటిని కానుకలుగా తెచ్చి సమర్పించాడు. అవంతిరాజు రకరకాల రత్నాలను, హారాలను, భుజకీర్తులు, మొదలైన వివిధాభరణాలను, అయుత సంఖ్యగల దాసీలను కూడా కానుకగా తెచ్చి, లోపలికి వెళ్లి చూడాలనే కోరికతో ద్వారం దగ్గర నిలబడి ఉన్నాడు. దశార్ణ, చేది దేశపురాజులు; పరాక్రమశాలి అయిన శూరసేనుడు ఎన్నోకానుకలను తీసుకొని వచ్చి పాండుపుత్రునికి సమర్పించారు. రాజా! కాశీరాజు ఎనభైవేల గోవులను, ఎనిమిది వందల ఏనుగులను, వివిధ రత్నాలను అతిసంతోషంగా కానుకలిచ్చాడు. విదేహరాజు కృతక్షణుడు, కోసలరాజు బృహద్బలుడు పద్నాలుగువేల ఉత్తమాశ్వాలను ఇచ్చారు. వసాదిరాజులతో కలిసి శైబ్యుడు, మాళవులతో కలిసి త్రిగర్తరాజు యుధిష్ఠిరునికి అనేక రత్నాలను కానుకలిచ్చారు. అందులో ఒక్కొక్కరాజు ప్రత్యేకంగా అంతులేని హారాలు విలువైన ముత్యాలు, వివిధాభరణాలు ఇచ్చారు.)

కార్పాసిక దేశంలో నివసించే లక్షమంది దాసీలు ఆ యజ్ఞంలో సేవలు చేశారు. వారు అందరూ నల్లనివర్ణం కలిగి, బక్కపలుచని దేహాలతో, పొడవైన జుట్టు కలిగి బంగారు ఆభరణాలు ధరించి ఉన్నారు. భరుకచ్ఛనివాసులైన శూద్రులు ఉత్తమ బ్రాహ్మణులకు యోగ్యమైన రాంకవమృగ చర్మాలను, గాంధారదేశంలో పుట్టిన గుఱ్ఱాలను కానుకలుగా తెచ్చి సమర్పించారు. ఇంద్రుడు కురిపించిన వానతో, నదీజలాలతో పండే ధాన్యంతో జీవనం గడుపుకొంటూ, సముద్రతీరప్రాంతంలో పుట్టి, సింధునదికి ఆవలి తీరంలో ఉండే వైరామ, పారద, ఆభీర, కితవజాతులకు చెందిన మానవులు వివిధ రత్నాలు, మేకలు, గొఱ్ఱెలు, గోవులు, బంగారం, గాడిదలు, ఒంటెలు, ఫలాలనుండి పుట్టిన తేనె, రకరకాల కంబళ్లు-మొదలైన ఎన్నో రకాల కానుకలను తెచ్చి లోనికి రానీయకపోవడంతో ద్వారంవద్దనే నిలిచిపోయారు. ప్రాగ్జ్యోతిషాధిపతి, అయిన భగదత్తుడు యవనులతో కూడి వేయు ఉత్తమజాతి అశ్వాలను, ఎన్నో కానుకలను తెచ్చి, ద్వారంవద్దనే నిలిచిపోయాడు. రాళ్లల్లో శ్రేష్ఠమయిన వజ్రాలతో చేయబడిన భాండాన్ని, తెల్లనిదంతపు పిడులు గల కత్తులను ఇచ్చి ప్రాగ్జ్యోతిషపురాధిపతి భగదత్తుడు ఆ సమయంలో లోపలికి వెళ్లాడు.

నానాదిక్కులనుండి ద్వ్యక్ష, త్ర్యక్ష, లలాటాక్ష, ఔష్ణిక, అంతవాస, రోమక, పురుషాదక, ఏకపాద- రాజులందరూ ద్వారం వద్ద నిలబడి ఉండడం అక్కడ నేను చూశాను. ఆ రాజులందరూ తమతో నల్లని మెడలు, పెద్దశరీరాలు కలిగి ఎంతదూరమైనా వెళ్లగల రంగురంగుల కంచరగాడిదలను కానుకలుగా తెచ్చారు. అవి పదివేలున్నాయి. అన్నీ సుశిక్షిత మైనవి. అన్ని దిక్కులయందు ప్రసిద్ధి కెక్కినవి. చక్కని ఒడ్డు, పొడవు, రంగు కలిగి, వంక్షునదీ తీరమందు పుట్టిన ఆ రాసభాలను యుధిష్ఠిరునికి కానుకలుగా ఇస్తూ, ఆ రాజులందరూ అమితమైన వెండి బంగారాలను ఇచ్చి యుధిష్ఠిరుని యజ్ఞమండపాన్ని ప్రవేశించగలిగారు.

ఏకపాదదేశీయులైన రాజులు ఆర్ద్రపురుగులవలె ఎఱ్ఱనై, చిలుకలవలె పచ్చనై, మనోవేగంగలవై, ఇంద్రధనుస్సువలె వివిధవర్ణశోభితాలై, సంధ్యామేఘాలవలె ఎఱ్ఱనివై, అనేక వర్ణాలు కల మహావేగవంతాలైన అడవి గుఱ్ఱాలను, ఇంకా విలువైన బంగారాన్ని సమర్పించారు. చీన, శక, ఓడ్ర, బర్బర, వనవాసులైన వార్ణేయ, హార, హూణ, కృష్ణ, హిమవత్పర్వత ప్రాంత, నీప, అనూపదేశాధిపతులైన అనేకులు ద్వారం వద్దనే నిలిచిపోయారు. వారు యుధిష్ఠిరుని యజ్ఞానికి వివిధాకారాలు కల పదివేల కంచరగాడిదలను కానుకలుగా తెచ్చారు. అవి నల్లని మెడ, పెద్దశరీరం కలవి. వందక్రోసుల దూరం పరుగెత్తగలవి. మంచి శిక్షణగలవి, లోకవిఖ్యాతి నందినవి. తగినంత పొడవు వెడల్పులు కలిగి, తాకా లనిపించే చక్కని రంగులతో, బాహ్లీ చీన దేశాలలో తయారయినవి; ఉన్ని, రంగుమృగచర్మంతో చేసినవి; పట్టుపురుగులనుండి వచ్చినవి; పూలగుత్తులతో, కమలాలతో సమానమైన మృదుత్వం కలిగి, పత్తి అనేదే లేకుండా తయారయిన వేలకొద్దీ వస్త్రాలను; మృదువైన మృగచర్మాలను; వాడిగా పొడుగ్గా ఉండేకత్తులను, ఋష్టి, శక్తి పరశ్వథాయుధాలను; పశ్చిమదేశాలలో తయారయిన వాడి గొడ్డళ్లను, వివిధ రసాలను, గంధాలను, వేల రత్నాలను, కానుకలుగా తీసుకొని వచ్చిన శక, తుషార, కంక, రోమశ, శృంగి దేశాల రాజులు ద్వారం వద్దనే నిలిపి వేయబడ్డారు. అతిదూరం ప్రయాణించగల అర్బుదసంఖ్య కల మదపుటేనుగులను, వందల అర్బుదాలగుఱ్ఱాలను; పద్మసంఖ్య కల బంగారాన్ని ఇంకా అనేక ఇతరవస్తువులను కానుకలుగా తెచ్చినవారు కూడా ద్వారం వద్దనే నిలిచిపోయారు. విలువైన ఆసనాలు, వాహనాలు, రత్నాలు, బంగారం తాపడం చేసిన ఏనుగుదంతపు మంచాలు, విచిత్రమైన కవచాలు, సుశిక్షతమైన గుఱ్ఱాలు పూన్చిన వివిధాకారాలు గల రథాలు, ఏనుగులమీద రథాలమీద పరిచే విచిత్రమైన కంబళ్లు, అనేకరత్నాలు, నారాచాలు, అర్ధనారాచాలు, వివిధశస్త్రాలు-

ఇవన్నీ కానుకలుగా ఇచ్చి, పూర్వదేశాధిపతులైన రాజులు యుధిష్ఠిరుని యజ్ఞమండపాన్ని ప్రవేశించారు."

52. దుర్యోధనుని సంతాపము.

"అనఘా! యజ్ఞంకోసం రాజులు ఇచ్చిన మహాధనసమూహాలు అక్కడ ఎన్నోరకాలు ఉన్నాయి. వానిని చెపుతాను. విను. మేరుమందరపర్వతాల మధ్య ప్రవహించే శైలోదమనే నదికి ఇరువైపుల ఉన్న వెదురుబొంగుల అందమైన నీడలలో నివసించే ఖస, ఏకాసన, అర్ష, ప్రదర, దీర్ఘవేణు, పారద, కుళింద, తంగణ, పరతంగణ దేశాధిపతులైన రాజులు చీమలు కూడబెట్టిన "పిపీలికం" అనే బంగారాన్ని ద్రోణపరిమాణం కలదానిని కుప్పలుకుప్పలుగా తెచ్చారు. శ్రేష్ఠమైన నల్లని చామరాలను, చంద్రకాంతి గల తెల్లని చామరాలను, హిమాలయపుష్పాల నుండి పుట్టిన రుచికరమైన మధువును, మిక్కిలిగా తెచ్చారు. మహాబలసంపన్నులైన పర్వతప్రాంతపు రాజులు ఇంకా ఉత్తరకురు దేశాలవారు గంగాజల సముద్భూతమై హారాలుగా కూర్చదగిన రత్నాలను, ఉత్తరకైలాసం నుండి ఓషధులను, కానుకలుగా తెచ్చి, అజాతశత్రువు అయిన ఆ యుధిష్ఠిరుని ద్వారం వద్ద వినీతులై నిలిచిపోయారు. రాజా! హిమవత్పర్వతానికి ఆవలివైపు సూర్యోదయగిరిపై నివసించే రాజులు; సముద్రతీరమందున్న కారూషదేశపు వాసులు, లౌహిత్య పర్వతవాసులు వీరంతా ఫలమూలాలు తినేవారు, చర్మవస్త్రధారులు, క్రూరశస్త్రాలు ధరించేవారు, క్రూరకర్ములు అయిన కిరాతులు – వీరిని కూడా అక్కడ నేను చూశాను. చందనకాష్ఠాలు, అగురుకాష్ఠాలు, కృష్ణాగురుకాష్ఠాలు – వీటియొక్క మోపులను, చర్మాలు, రత్నాలు, బంగారం, గంధద్రవ్యాలు – వీటి రాశులను, కిరాత దేశవాసినులైన దాసీలను పదివేలమందిని, దూరప్రాంతాలలో దొరికే అందమైన మృగపక్షులను, పర్వతప్రాంతాలలో దొరికే మిక్కిలి కాంతిగల బంగారాన్ని సంగ్రహించి సమస్తకానుకలతో వచ్చిన రాజులు ద్వారం వద్ద నిలిచి ఉండేవారు.

కిరాత, దరద, దర్వ, శూర, యమక, ఔదుంబర, దుర్విభాగ, పారద, బాహ్లీక, కాశ్మీర, కుమార, ఘోరక, హంసకాయన, శిబి, త్రిగర్త, యౌధేయ, భద్ర, కేకయ, అంబష్ఠ, కౌకుర, తార్ష్య, వస్త్రప, పహ్లవ, వశాతల, మౌలేయ, కుద్రక, మాలవ, శౌండిక, కుకుర, శాక, అంగ, వంగ, పుండ్ర, శాణవత్య, గయ – ఈ ఉత్తమకుల సంజాతులు, శ్రేష్ఠులు, శస్త్రధారులు అయిన క్షత్రియులు వందలకొద్దీ బారులు తీరి యుధిష్ఠిరునికి ధనాన్ని సమర్పించుకొన్నారు. భారతా! వంగ, కళింగ, మగధ, తామ్రలిప్త, పుండ్రక,

దౌవాలిక, సాగరక, పత్రోర్ణ, శైశవ, కర్ణప్రావరణ - మొదలైన అనేక క్షత్రియ భూపతులు ద్వారం వద్ద నిలుచుండగా రాజాజ్ఞపై ద్వారపాలుకు వారికి "మంచికానుకలను తెచ్చిన మీకందరికీ నిశ్చిత సమయంలో ప్రవేశం లభిస్తుంది" అని చెపుతున్నారు. క్షమాశీలులు, కులీనులు అయిన రాజులు ఒక్కొక్కరు వేయి చొప్పున కామ్యకసరోవరసమీపంలో లభించే ఏనుగులను బహూకరించి లోపలకు ప్రవేశం పొందారు. ఆ ఏనుగులు పొడవైన దంతాలు కలిగి, బంగారు సూత్రాలతో కట్టబడి, పద్మవర్ణంతో, పైన వస్త్రాలు కప్పబడి, కవచావృతాలై, కొండలవలె, మదించి ఉన్నాయి. వీరేకాక ఇంకా ఇతర భూపాలగణాలు అనేక దిక్కులనుండి కానుకలను తెచ్చారు. మహాత్ములైన ఇతరు లనేకులు కూడా అక్కడకు వచ్చి రత్నాలను కానుకలుగా సమర్పించారు. ఇంద్రుని స్నేహితుడు అయిన చిత్రరథుడనే గంధర్వరాజు వాయువేగం కలిగిన నాలుగువందల దివ్యాశ్వాలను ఇచ్చాడు. తుంబురుడనే గంధర్వరాజు మహాసంతోషంతో - మామిడాకుల రంగుకలిగి, బంగారు హారాలతో అలంకరింపబడిన వంద గుఱ్ఱాలను ఇచ్చాడు. పుణ్యాత్ముడైన శూకరదేశపు రాజు ఉత్తమమైన వంద ఏనుగులను ఇచ్చాడు. మత్స్యదేశపురాజయిన విరాటుడు బంగారుహారాలు కలిగిన రెండువేల మదపుటేనుగులను కానుకగా సమర్పించాడు.

రాజా! వసుదానుడనే రాజు పాంశురాష్ట్రం నుండి ఇరవైయారు ఏనుగులను, జవసత్వాలు, యుక్తవయసు బంగారుహారాలు కలిగిన, రెండువేల గుఱ్ఱాలను, సమస్త వస్తువులను కానుకలుగా తెచ్చి, యుధిష్ఠిరునికి నివేదించాడు. రాజా! ద్రుపదుడు దాసీసహస్రాన్ని, భార్యలతోపాటు పదివేల దాసులను, గజాలు పూన్చిన ఇరవైయారు రథాలను, తన సమస్తరాజ్యాన్ని యజ్ఞంకోసం పాండవులకు సమర్పించాడు. వృష్ణివంశీయుడయిన వాసుదేవుడు కూడా అర్జునుని ఆదరించి పద్నాలుగువేల ఏనుగులను ఇచ్చాడు. **అర్జునుని యొక్క ఆత్మ కృష్ణుడు. కృష్ణుని యొక్క ఆత్మ అర్జునుడు.** అర్జునుడు ఏది చెప్పినా శ్రీకృష్ణుడు నిస్సంశయంగా అంతా చేస్తాడు. కృష్ణుడు అర్జునుని కోసం స్వర్గలోకాన్ని కూడా విడిచిపెడతాడు. అలాగే పార్థుడు కూడా కృష్ణునికోసం ప్రాణాలనైనా ఇస్తాడు. మలయ, దర్దుర పర్వతాలనుండి అక్కడి రాజులు పరిమళభరితమైన చందనరసాన్ని, చందనాన్ని, అగురు ముద్దలను బంగారు కుండలలో పెట్టి తెచ్చారు. మిరుమిట్లు కొలిపే మణిరత్నాలు, బంగారం, సన్నని వస్త్రాలు తెచ్చిన చోళపాండ్యరాజులు కూడా ద్వారం వద్ద ఉండి లోనికి ప్రవేశించలేకపోయారు. సింహళదేశనరేశులు సముద్రంలోని సారభూతమైన వైడూర్యాలను, ముత్యాలప్రోవులను, వందలకొద్దీ ఏనుగులమీద కప్పే వస్త్రాలను తెచ్చారు.

ఆ సింహళదేశపు రాజులు మణిమయవస్త్రాలు ధరించి ఉన్నారు. నల్లనిశరీరాలతో, ఎఱ్ఱని కనుకొలకులతో ఉన్నారు. వారు కానుకలను తీసుకొని ద్వారం వద్ద నిలబడి ఉన్నారు. బ్రాహ్మణులు,జయించబడిన క్షత్రియులు, వైశ్యులు, శుశ్రూషలు చేసే శూద్రులు యుధిష్ఠిరుని ప్రీతికోసం కానుకలు సమర్పించారు.

సమస్త మ్లేచ్ఛులు, సర్వవర్ణాలవారూ ప్రేమతోనూ, గౌరవంతోను యుధిష్ఠిరునికి కానుకలు తెచ్చారు. నానాదేశాలనుండి వచ్చిన నానాజాతులతో నిండిన యుధిష్ఠిరుని యజ్ఞమండపస్థలం – లోకమంతా ఇక్కడే ఉందా అనిపించింది. నా శత్రువులకు రాజులు ఇచ్చిన చిన్నాపెద్దా కానుకలను చూచి నాకు దుఃఖంతో చచ్చిపోవా లనిపించింది. రాజా! పాండవుల సేవకులను గురించి చెపుతాను. విను. యుధిష్ఠిరుడు వారికి పక్వాహారం, అపక్వాహారం కూడా ఏర్పాటు చేశాడు. యుధిష్ఠిరుని వద్ద మూడుపద్మాల పదివేల గజారోహకులు, అశ్వారోహకులు, అర్బుదసంఖ్య (పదికోట్లు) కల రథాలు, అసంఖ్యాకమైన కాల్బలం ఉంది. యుధిష్ఠిరుని యజ్ఞంలో ఒకచోట అపక్వాహారం కొలుస్తూ, తూస్తున్నారు. ఒకచోట పక్వాహారం వడ్డిస్తున్నారు. ఒకచోట పుణ్యాహవాచన ధ్వనులు వినిపిస్తున్నాయి. యుధిష్ఠిరుని గృహంలో తినని వానిని, త్రాగనివానిని, అలంకరింపబడనివానిని, గౌరవం పొందనివానిని సర్వవర్ణాలవారిలో ఒక్కరినీ చూడలేదు. యుధిష్ఠిరుని గృహంలో నివసించే ఎనభై ఎనిమిది వేల స్నాతకులకు అతడు భరణపోషణలు కల్పిస్తున్నాడు. వారికి ఒక్కొక్కరికి ముప్పదిమంది దాసదాసీలున్నారు. ప్రీతులై, సంతుష్టిచెందిన వారు యుధిష్ఠిరునికి శత్రు నాశనం కలగాలని దీవిస్తూ ఉంటారు. ఇంకొక పదివేల మంది ఊర్ధ్వరేతసులైన యతీశ్వరులు యుధిష్ఠిరుని గృహంలో బంగారు పళ్లెరాలలో భుజిస్తూ ఉంటారు. రాజా! ద్రౌపది తాను తినకముందే మరుగుజ్జులు, వామనులు మొదలైనవారందరూ తిన్నారా లేదా అని చూచుకొంటూ ఉంటుంది. భారతా! యుధిష్ఠిరునికి కప్పం చెల్లించనివారు ఇద్దరు మాత్రమే. బంధుత్వం కారణంగా పాంచాలురు, మిత్రత్వం కారణంగా అంధకవృష్ణులు."

53. దుర్యోధనుడు యుధిష్ఠిరుని పట్టాభిషేకమును వర్ణించుట.

"ఆర్యులు, సత్యసంధులు, మహావ్రతులు, పండితులు, వక్తలు, వేదోక్తమైన అవభృథస్నానాలతో తడిసినవారు, ధృతిమంతులు, లజ్జాశీలులు, ధర్మాత్ములు, కీర్తిపరులు, మూర్ధాభిషిక్తులు – అయిన రాజులు యుధిష్ఠిరుని సేవిస్తున్నారు. దక్షిణకొఱకు రాజులు తెచ్చిన ఆవులు – అరణ్యాలలో పెరిగినవి– ఎన్నో వేలు అక్కడక్కడా ఉండడం చూశాను.

వాటి పాలు తీయడానికి కంచుపాత్రలు ఉన్నాయి. భారతా! అక్కడిరాజులందరూ యుధిష్ఠిరుని అభిషేకించడానికి శాంతచిత్తులై స్వయంగా పూనుకొని సత్కారపూర్వకంగా చిన్న, పెద్ద పాత్రలు పట్టుకొని వచ్చారు. బాహ్లీకుడు బంగారంతో అలంకరింపబడిన రథం తెచ్చాడు. సుదక్షిణుడు దానికి కాంబోజదేశపు తెల్లని గుఱ్ఱాలను పూన్చాడు. మహాబలుడైన సునీథుడు మిక్కిలిప్రేమతో అనుకర్షను (రథాన్ని కిందికి దించడానికి ఉపయోగించే కట్ట) తగిలించాడు. చేదిరాజు కవచాన్ని ఇచ్చాడు. మగధరాజు హారాలను, శిరస్త్రాణాన్ని ఇచ్చాడు. మహోదనుర్ధరుడయిన వసుదానుడు అరవై ఏళ్ల గజరాజును సిద్ధం చేశాడు. మత్స్యరాజు బంగారు, ధనంతో నిండిన శకటాలను ఇచ్చాడు. ఏకలవ్యుడు పాదుకలు తెచ్చాడు. అవంతిరాజు అభిషేకం కోసం వివిధరకాల జలాలను సేకరించాడు. చేకితానుడు అమ్ములపొదిని, కాశీరాజు ధనుస్సును ఇచ్చారు. శల్యుడు చక్కని పిడిగల కత్తిని, ఉట్టికి కట్టిన బంగారుకలశాన్ని ఇచ్చాడు. అనంతరం ధౌమ్యుడు, మహాతపస్వి వ్యాసుడు - నారదుని, అసితుని, దేవలుని ముందుంచుకొని యుధిష్ఠిరుని అభిషేకించారు. పరశురామునితో కూడి వేదపారంగతులైన ఇతర మహర్షులు కూడా, ప్రీతితో యుధిష్ఠిరుని అభిషేకించారు. స్వర్గంలో దేవరాజు అయిన మహేంద్రుని సప్తర్షులు సమీపించినట్లుగా, మంత్రాలు చదువుతూ, మహాత్ములయిన ద్విజులు భూరిదక్షిణలిచ్చే యుధిష్ఠిరుని సమీపించారు. సత్యవిక్రముడైన సాత్యకి ఛత్రాన్ని, పాండవులైన భీమధనంజయులు వ్యజనాలను పట్టుకొన్నారు. నకులసహదేవులు రెండు తెల్లని చామరాలను పట్టుకొన్నారు. పూర్వం ప్రజాపతి ఇంద్రునికి ఇచ్చిన శంఖాన్ని సముద్రుడు యుధిష్ఠిరునికి కానుకగా పంపాడు. విశ్వకర్మ వేయి బంగారు నాణేలతో ఉట్టియందు ఉంచే కలశాన్ని నిర్మించాడు. అందులోని సముద్రజలాన్ని కృష్ణుడు శంఖంతో తీసుకొని యుధిష్ఠిరుని అభిషేకించాడు. అప్పుడు నా మనసు పాడయిపోయింది.

లోకులు జలాన్ని తేవడానికి పూర్వసముద్రం నుండి పశ్చిమసముద్రానికి వెడతారు. దక్షిణదిక్కుకు కూడా వెళ్తారు. తండ్రీ! ఉత్తరదిక్కుకు పక్షులు తప్ప వేరెవరూ వెళ్లలేరు. అక్కడ అభిషేకసమయంలో వందలకొద్దీ మంగళ కారకాలయిన శంఖాలు మ్రోగాయి. అలా మ్రోగిన ధ్వనికి నా రోమాలు నిక్కపొడుచుకొన్నాయి. తేజస్సుచేత అల్పులయిన రాజులు నేలపై పడిపోయారు. ధృష్టద్యుమ్నుడు, పంచపాండవులు, సాత్యకి, వీరితోపాటు ఎనిమిదవ వాడైన శ్రీకృష్ణుడు - వీరందరూ ధైర్యంగా ఉన్నారు. వీరు వీర్యసంపన్నులు. అన్యోన్యప్రియంగా మసలుకొనేవారు. మూర్ఛిల్లిన రాజులను, నన్ను చూచి, వారు హేళన చేశారు. అనంతరం అర్జునుడు మిక్కిలి హర్షంతో బంగారుకొమ్ములు

కలిగిన ఐదువందల ఎడ్లను ద్విజముఖ్యులకు దానం చేశాడు. తండ్రీ! రంతిదేవుడు, నాభాగుడు, మాంధాత, మనువు, వేనుని కొడుకైన పృథుమహారాజు, భగీరథుడు, యయాతి, నహుషుడు కూడా యుధిష్ఠిరుని వలె మహాసమ్రాట్టులు కారు. అత్యధికమైన పరమసంపదతో కూడిన కౌంతేయుడు రాజసూయయాగంచేసి హరిశ్చంద్రుని వలె చక్రవర్తి అయ్యాడు. భారతా! హరిశ్చంద్రునికి వలె యుధిష్ఠిరునికి లభించిన ఈ సంపదను చూచి నేను జీవించి ఉండడం శ్రేయస్కరమని ఎలా అనుకొంటున్నావు? రాజా! గ్రుడ్డివాడివలె విధాత ఈ కాలాన్ని అస్తవ్యస్తంగా సంఘటించాడు. చిన్నలు వృద్ధిపొందుతున్నారు. పెద్దలు క్షీణిస్తున్నారు."

54. ధృతరాష్ట్రుడు దుర్యోధనునికి వచ్చజెప్పుట.

ధృతరాష్ట్రుడు అంటున్నాడు – "పుత్రా! నీవు నా పెద్దకొడుకువు. పట్టపురాణి గర్భాన పుట్టినవాడవు. పాండవులను ద్వేషించకు. ద్వేషించే మనిషి మృత్యువువలె అసుఖాన్ని పొందుతాడు. యుధిష్ఠిరుడు కపటం తెలియనివాడు. సంపదలు సమానంగా ఉండాలని కోరుకొనేవాడు. నీ మిత్రులపట్ల తుల్యభావం కలవాడు. నిన్ను ద్వేషించనివాడు. నీవంటివాడు అతనిని ఎలా ద్వేషిస్తాడు? రాజా! నీవూ, యుధిష్ఠిరుడూ తుల్యమైన ఆభిజాత్యం, పరాక్రమం కలవారు. నాయనా! మోహవశుడవై సోదరుని సంపదను ఎందుకు కోరుకొంటావు ? అలా ఎన్నడూ (అధముడవు) కాకు. శాంతించు. శోకించకు. భరతశ్రేష్ఠా! నీవు ఆ యజ్ఞవైభవమే కావాలనుకొంటే, ఋత్విజులు సప్తతంతువులతో కూడిన మహాయజ్ఞాన్ని నీకోసం అనుష్ఠింపచేస్తారు. రాజులు నీకు కూడా ప్రీతితో, ఆదరంతో రత్నాలను, ఆభరణాలను, విస్తారమైన ధనాన్ని తెచ్చి ఇస్తారు.

(భూమి కోరికలీడేర్చే కామధేనువని, ఆది వీరపత్ని అని చెప్తారు. భూమి పరాక్రమాన్ని ఆశ్రయించుకొని ఉంటుంది, మనోరథాలు తీరుస్తుంది అని కూడా అంటారు. నీకు పరాక్రమం ఉంటే ఈ భూమిని అనుభవిస్తావు.)

తండ్రీ! ఇతరుల ధనాన్ని అపేక్షించడం అనార్యలక్షణం, **తనకు ఉన్నదానితో తృప్తిపడుతూ, తన ధర్మాన్ని ఆచరించేవాడు సుఖంగా వృద్ధిలోకి వస్తాడు. ఇతరుల సంపదను పొందడానికి ప్రయత్నించకపోవడం, తాను చేయవలసిన పనులయందు నిరంతరప్రయత్నశీలుడై ఉండడం, తనకు లభించిన దానిని రక్షించుకోవడం- ఇదీ వైభవానికి లక్షణం.** ఆపదలలో క్రుంగిపోనివాడు, నిత్యమూ ప్రయత్నశీలుడైనవాడు,

పరపాట్లు చేయనివాడు, వినయం, దక్షత- కలవాడే ఎల్లప్పుడూ శుభాలను పొందగలుగుతాడు. పాండుపుత్రులు నీ బాహువులవంటివారు. ఆ బాహువులను నరికివేయకు. సోదరుల సంపదను ఆశించి మిత్రద్రోహం చేయకు. పాండుపుత్రులను ద్వేషించకు. సోదరులయిన వారి సంపద అంతా నీది కూడా కదా! తండ్రీ! మిత్రద్రోహం చాలా అధర్మం సుమా! నీ తాతలు వారికీ తాతలే కదా! యజ్ఞాలలో ధనం దానం చెయ్యి. ఇష్టమైన కోరికలను అనుభవించు. నిర్భయంగా స్త్రీలతో క్రీడించు. ఇలా ఉంటూ శాంతిని పొందు."

55. దుర్యోధనుడు ధృతరాష్ట్రునకు తన నిశ్చయమును తెలుపుట.

దుర్యోధనుడు చెపుతున్నాడు - "స్వయంగా ప్రజ్ఞ లేకుండా కేవలం ఎక్కువ వినికిడి జ్ఞానం మాత్రమే కలవాడు తెడ్డు -గరిటె పప్పురుచిని గ్రహించలేనట్లుగా శాస్త్రార్థాలను తెలుసుకోలేడు. ఓడతో కట్టిన ఓడ వంటివాడవు. (విదురుని బుద్ధిని ఆశ్రయించినవాడవు) తెలిసికూడా నన్ను మోహంలో పడేస్తున్నావు. స్వీయప్రయోజనంలో నీకు శ్రద్ధ లేదా? లేక నీవు నన్ను ద్వేషిస్తున్నావా? నీవు శాసిస్తున్న ఈ ధార్తరాష్ట్రులు లేనివారే అవుతారు. ఎందుకంటే నీవు ఎప్పుడూ నీ పనిని భవిష్యప్రయోజనంగానే చెప్పి దాటవేస్తూ ఉంటావు. దళానికి ముందు నడిచేవాడు ఇతరుల బుద్ధిని అనుసరిస్తే తాను వెళ్లవలసిన మార్గంపట్ల మూఢుడై ఉంటాడు. అతని వెనుక వెళ్లేవారు ఇక సరియైన దారిని ఎలా అనుసరించగలుగుతారు ? రాజా! పరిణత ప్రజ్ఞుడవు, పెద్దలను సేవించినవాడవు, జితేంద్రియుడవు అయిన నీవు స్వకార్యతత్పరు లమయిన మమ్ము మిక్కిలిగా మోహపెడుతున్నావు. లోకవ్యవహారం కంటె రాజవ్యవహారం వేరని బృహస్పతి చెప్పాడు. కాబట్టి రాజు జాగరూకుడై ఎల్లప్పుడూ తన ప్రయోజనం గురించే ఆలోచించాలి. మహారాజా! క్షత్రియుని యొక్క ప్రవృత్తి జయమందే నిలిచి ఉంటుంది. అతడు తన ప్రవృత్తిలో ధర్మమా, అధర్మమా అనే పరీక్ష చేయాలా? భరతసత్తమా! ఉజ్జ్వలమైన శత్రుసంపదను పొందాలనే కోరిక కలవాడు సారథి కొరడాతో రథాన్ని నడిపినట్లుగా దిక్కులన్నిటిని నడపాలి. చాటుగా ఉన్నా, వెల్లడిగా ఉన్నా ఏ ఉపాయం శత్రువును మిక్కిలిగా బాధిస్తుందో అదే శస్త్రవేత్తలకు శస్త్రం అవుతుంది. ఛేదించేది మాత్రమే శస్త్రం కాదు. రాజా! ఇతడు శత్రువని, ఇతడు మిత్రుడని ఎక్కడా వ్రాసిపెట్టి ఉండదు. అది శాశ్వతమైన మూలం కూడా కాదు. ఎవడు బాధిస్తాడో వానినే శత్రువని అంటారు.

అసంతుష్టియే సంపదకు మూలం. కాబట్టి దానినే నేను కోరుకొంటాను. రాజా!

తన ఉన్నతికోసం ప్రయత్నించడమే పరమనీతి. సంపదను గాని, ధనాన్ని గాని నాది అనుకోవడం తగదు. పూర్వార్జితమైనదానిని ఇతరులు అపహరిస్తారు. దీనినే రాజధర్మం అంటారు. ద్రోహం చేయనని ప్రతిజ్ఞ చేసికూడా ఇంద్రుడు (అతనిని నమ్మించి) నముచిదానవుని శిరసును ఖండించాడు. శత్రువు పట్ల ఈ ప్రవర్తన సనాతనకాలం నుండీ వస్తోంది. ఇది ఇంద్రునకు కూడా సమ్మతమే. **సర్పం కన్నాలలో ఉండే ఎలుకలను మ్రింగివేసినట్లుగా భూమి విరోధం వహించని రాజును, దేశాంతరం వీగని బ్రాహ్మణుని మ్రింగివేస్తుంది.*** రాజా! మానవునికి జన్మతః శత్రువు ఉండడు. ఎవరితోపాటు సాధారణమైన (ఒకేరకమైన) వృత్తి కలిగిఉంటాడో అతడే శత్రువు. ఇతరులు కారు. నిరంతరం వృద్ధి చెందుతున్న శత్రుపక్షాన్ని అజ్ఞానంతో ఉపేక్షించినవానిని ఆ శత్రువు విస్తరించిన వ్యాధివలె అతని మూలాన్ని నాశనం చేస్తాడు. చెట్టుమొదట్లో పుట్టిన పుట్ట చివరివరకు చెట్టును తినేసినట్లుగా, పరాక్రమంతో మిక్కిలిగా వృద్ధిచెందుతున్న శత్రువు అల్పుడైనప్పటికీ సర్వనాశనం చేస్తాడు. శత్రుసంపద నీకు రుచించకూడదు. బలవంతులకు నీతిని శిరసున మోయడం భారమే అవుతుంది. పుట్టినది మొదలు పెరుగుతున్నట్లుగా, సంపద కూడా పెరగాలని కాంక్షించేవాడు జ్ఞాతిజనులలో వృద్ధిచెందుతాడు. పరాక్రమం తాత్కాలికవృద్ధిమాత్రమే. పాండవుల ఐశ్వర్యం పొందనంతవరకు సందిగ్ధత నాకు ఉంటూనే ఉంటుంది. ఆ సంపదను పొందనైనా పొందుతాను, లేదా యుద్ధంలో చావనైనా చస్తాను. రాజా! ఇటువంటి నాకు జీవితంతో పనేమిటి? పాండవులు నిత్యమూ వృద్ధి పొందుతున్నారు. మన వృద్ధిమాత్రం అస్థిరంగా ఉంది."

56. ధృతరాష్ట్రుడు సభానిర్మాణమునకు ఆజ్ఞాపించుట- ధర్మరాజును పిలుచుటకు విదురుని పంపుట.

శకుని అంటున్నాడు - "దుర్యోధనా! పాండుపుత్రుడయిన యుధిష్ఠిరుని యొక్క ఏ సంపదను చూసి నీవు బాధపడుతున్నావో దానిని జూదంతో హరిస్తాను. రాజా! కుంతీపుత్రుడయిన యుధిష్ఠిరుని పిలువనంపు. నేను ఏ మాత్రం సందేహం లేకుండా, సేనాముఖంలో నిలిచి యుద్ధంచేయకుండా, కేవలం పాచికలు విసురుతూ ఏమాత్రం నష్టం పొందకుండా, ఇందులో విద్వాంసుడను కనుక విద్వాంసుడు కాని అతనిని జయిస్తాను.

---

* ద్వావేతౌ గ్రసతే భూమిః సర్పో బిలశయానివ ।
రాజానం చావిరోద్ధారం బ్రాహ్మణం చాప్రవాసినమ్ ॥ 14

భారతా! పాచికలాటలే నా ధనుస్సులు, పాచికలే నాబాణాలు అని తెలుసుకో. పాచికలలోని రహస్యమే నావింటినారి, జూదపుబల్లయే నా రథం అని గుర్తించు." దుర్యోధనుడు అంటున్నాడు - "రాజా! అక్షవిద్యానిపుణుడు అయిన ఇతడు జూదంతో పాండుపుత్రులనుండి సంపదను హరించడానికి ఉత్సాహం చూపుతున్నాడు. కాబట్టి మీరు అనుమతించండి."

ధృతరాష్ట్రుడు చెపుతున్నాడు - "నేను నా సోదరుడు, మహాత్ముడు అయిన విదురుని శాసనంలో ఉన్నాను. అతనితో కలిసి ఈ కార్యం ఎలా నిశ్చయించాలో తెలుసుకొంటాను." దుర్యోధనుడు అంటున్నాడు - టటవిదురుడు ఏ మాత్రం సంశయించడు. నీ బుద్ధిని మరల్చివేస్తాడు. పాండవులయొక్క హితానికి కట్టుబడినవాడు, నా హితాన్ని కోరడు. మానవుడు తన పనిని ఇతరుల సామర్థ్యం మీద ఆధారపడి ప్రారంభించకూడదు. కార్యసాధనలో ఏ ఇరువురి బుద్ధి ఒకేలా ఉండదు. మందబుద్ధి భయాన్ని పోగొట్టుకొంటూ, తన్ను తాను సంబాళించుకొంటూ ఉండగానే వర్షాలకు తడిసిన చాపలా ఉన్నవాడు ఉన్నట్లే నశించిపోతాడు. వ్యాధులు కాని, యముడు కాని శుభాలు కలిగేవరకు వేచి ఉండరు. ఎంతవరకు సామర్థ్యం ఉంటుందో అంతవరకు శుభాలకోసం ప్రయత్నించవలసినదే."

ధృతరాష్ట్రుడు అంటున్నాడు - "నాయనా! బలవంతులతో విరోధం నాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. వైరం విరూపాన్ని సృష్టిస్తుంది. అది లోహంతో చేయబడని ఆయుధం. రాజకుమారా! అనర్థాన్ని(ద్యూతాన్ని) అర్థం అనుకొంటున్నావు. జూదం అతిఘోరమైన కలహాన్ని ముడిపడేలా చేస్తుంది. ఏదో ఒక రీతిగా అది ప్రారంభింపబడితే పదునైన కత్తులను, బాణాలను కూడా సృష్టిస్తుంది." దుర్యోధనుడు అంటున్నాడు - "ప్రాచీనులు కూడా ద్యూత వ్యవహారం నడిపి ఉన్నారు. దానివలన దోషమూ లేదు, యుద్ధమూ రాదు. కాబట్టి ఇప్పుడు శకుని మాటను అంగీకరించు. వెంటనే ఇక్కడ సభానిర్మాణానికి ఆజ్ఞాపించు. అది మాకు విశిష్టమైన స్వర్గద్వారం ఇచ్చుగాక! అందులో చరించే వారికి కూడా అలాగే ఉచితంగా ఉంటుంది. ఇలా సమానంగానే అగుగాక. పాండవులతో జూదాన్ని నీవు ఏర్పాటు చేయి." ధృతరాష్ట్రుడు అంటున్నాడు - "నీవు చెప్పినది నాకు రుచించడంలేదు. నరేంద్రా! నీకు ఇష్టమైనదే జరుగునుగాక! జూదం ఆరంభిస్తే, ఆపైన నామాటలు జ్ఞప్తికి వచ్చి బాధపడతావు. ఇటువంటి మాటలు ధర్మయుక్తమైనవి కావు. బుద్ధిని విద్యను అనుసరించే పండితుడైన విదురునికి ఇదంతా ముందే తెలుసు. అవశుడనైన నాకు క్షత్రియుల జీవితాలను నాశనం చేసే ఈ మహాభయం కలుగుతోంది."

ధృతరాష్ట్రుడు దైవాన్ని పరమదుస్తరమైన దానిగా తలచి, విధివశాత్తు మూఢచిత్తుడై

పుత్రునిమాటపై సేవకులకు గట్టిగా ఆజ్ఞాపించాడు- "ఒక క్రోసు పొడుగు వెడల్పులు కలిగి, హేమవైడూర్యఖచితాలైన వేయిస్తంభాలతో, వంద ద్వారాలతో తోరణస్ఫాటికమనే పేరుగల ఒక అందమైన సభను వెంటనే తత్పరులై నిర్మించండి" అని అతని ఆజ్ఞను విని వేగవంతులై, చతురులై, బుద్ధిమంతు లయిన వేలకొద్దీ శిల్పులు తత్పరులై ఆ సభను శీఘ్రంగా నిర్మించారు. సభలో అన్ని పదార్థాలు చక్కగా అమర్చారు. అతిస్వల్పకాలంలోనే నిర్మించబడిన ఆ సభ అనేక రత్నాలతో విచిత్రంగా, అందంగా ఉంది. చిత్రమైన బంగారు ఆసనాలను అందులో అలంకరించారు. ఈ విషయాన్ని విశ్వాసపాత్రులైన సేవకులు రాజుదగ్గరకు వెళ్లి చెప్పారు. ఆ తరువాత విజ్ఞానియైన ధృతరాష్ట్ర నరేంద్రుడు మంత్రి అయిన విదురునితో "రాజపుత్రుడైన యుధిష్ఠిరుని వద్దకు వెళ్లి నామాటగా అతనిని వెంటనే ఇక్కడకు తీసుకురా". 'మా ఈ సభ బహురత్నాలతో విచిత్రమై, చాలా విలువైన శయ్యలతో ఆసనాలతో నిండి ఉంది. తమ్ముళ్లతో కూడి వచ్చి దీనిని చూడు. ఇక్కడ సుహృద్ద్యూతం కూడా జరుగుతుంది' అని అతనితో చెప్పు" అన్నాడు.

57. ధృతరాష్ట్ర విదురుల సంవాదము.

ఇలా కొడుకు అభిప్రాయం గుర్తించి మహారాజు ధృతరాష్ట్రుడు దైవం బలీయమైనదని తలచి ఇదంతా చేశాడు. పండితోత్తము డయిన విదురుడు అలా చెప్పిన సోదరుని యొక్క అన్యాయపూర్ణమైన మాటలను హర్షించలేక ఇలా అన్నాడు. "మహారాజా! మీ ఈ ఆదేశాన్ని అభినందించలేను. ఇలాంటిపని చేయకండి. వంశనాశనానికి భయపడుతున్నాను. నరేంద్రా! పుత్రుల మధ్య విభేదం నిశ్చయంగా కలహానికి కారణమవుతుంది. ద్యూతం వలన నాకు ఇలాంటి సందేహం కలుగుతోంది." ధృతరాష్ట్రుడు అంటున్నాడు – "విదురా! దైవం ప్రతికూలం కాకపోతే కలహం నన్ను ఇప్పుడు బాధించదు. విధాత నిర్మించిన ఈ జగత్తు అంతా దైవానికి లోబడినదే కాని స్వతంత్రంగా ఉండదు. కాబట్టి విదురా! నా ఆజ్ఞ పాటించి దుర్ధర్షుడైన కుంతీపుత్రుని యుధిష్ఠిరుని ఇప్పుడే శీఘ్రంగా తీసుకురా."

58. యుధిష్ఠిరుడు హస్తినకు వచ్చుట.

పిమ్మట ధృతరాష్ట్రుడు బలవంతంగా నియోగించడంచేత విదురుడు వేగవంతాలై, బలిష్ఠాలై, చక్కగా వశపడిన మంచి గుఱ్ఱాలు పూన్చిన రథాన్ని ఎక్కి బుద్ధిమంతు

లయిన పాండవుల వద్దకు వెళ్లాడు. మహాబుద్ధిమంతు డయిన అతడు రాజధానిని చేరాడు. అక్కడ ద్విజులచేత పూజింపబడి నగరంలోనికి ప్రవేశించాడు. ధర్మాత్ము డైన విదురుడు కుబేరభవనం వంటి రాజగృహాన్ని చేరుకొని ధర్మపుత్రుడైన యుధిష్ఠిరుని కలుసుకొన్నాడు. సత్యనిష్ఠుడు, మహాత్ముడు, అజాతశత్రువు అయిన యుధిష్ఠిరమహారాజు యథావిధిగా విదురుని పూజాపూర్వకంగా స్వాగతించి పుత్రసహితంగా ధృతరాష్ట్రుని కుశలాన్ని అడిగాడు. "విదురా! నీ మనసు సంతోషంగా లేదని తెలుస్తోంది. క్షేమంగానే వచ్చావా? వృద్ధుడైన ధృతరాష్ట్రుని కొడుకులు అతనికి అనుకూలంగా ఉన్నారా? ప్రజలందరూ అతనికి వశవర్తులై ఉన్నారా?" విదురుడు చెపుతున్నాడు - "రాజా! మహాత్ముడయిన రాజు పుత్రసహితంగా కుశలంగానే ఉన్నాడు. జ్ఞాతులతో కూడి ఇంద్రునివలె ఉన్నాడు. వినీతులైన పుత్రులవలన ప్రీతిని పొందుతున్నాడు. ఆ మహాత్ముడు శోకరహితుడై తనయందు తాను అనురాగం కలిగి ఉన్నాడు. మీ క్షేమాన్ని, ఆరోగ్యాన్ని గురించి అడిగి, కురురాజు మీకు ఈ సందేశాన్ని ఇచ్చాడు. పుత్రా! ఈ సభ నీ సభతో సమానమైన ఆకారంతో నిర్మించబడింది. తమ్ముళ్లతో కలిసి వచ్చి నీవు దీనిని చూడాలి. పార్థా! సోదరులతో కలిసి ఆ సభలో సుహృద్ద్యూతం ఆడాలి. వినోదించాలి. మిమ్మల్ని కలుసుకోవడం వలన అక్కడకు వచ్చిన కౌరవుల మందరమూ సంతోషిస్తాము. మహాత్ము డైన ధృతరాష్ట్రమహారాజు ఏర్పరచిన జూదశాలలను, అక్కడకు చేరి ఆసీనులయిన జూదరులను చూచుదువుగాని. రాజా! ఇందుకే నేను వచ్చాను. అది సేవించుకో."

యుధిష్ఠిరుడు అంటున్నాడు - "విదురా! ద్యూతం వలన మాకు కలహం కలుగుతుంది. బుద్ధిమంతు డెవడు దీనిని ఇష్టపడతాడు? నీవు దీనిని తగినదనే అనుకొంటున్నావా? నీ మాటమీదే మేమంతా నిలబడి ఉన్నాం." విదురుడు చెపుతున్నాడు "జూదం అనర్థకారణమని నేను ఎరుగుదును. దీనిని వారించడానికి నేను ప్రయత్నం చేశాను. రాజు నీ దగ్గరకు నన్ను పంపాడు. విద్వాంసుడా! ఇది విని శ్రేయస్కరమైనది ఆచరించు." యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు - "విదురా! అక్కడ ధృతరాష్ట్రుని కొడుకులు కాక జూదమాడే వేరే జూదరు లెవరు? నిన్ను అడుగుతున్నాను. వారెవరో మాకు చెప్పు. వందలకొద్దీ పందెములు వేసి ఎవరితో జూదమాడాలి మేము ? విదురుడు చెపుతున్నాడు - "రాజా! గాంధారరాజు శకుని ఉన్నాడు. అతడు ఎక్కువగా జూదమాడుతాడు. అభిమతమైన పాచికలు కలవాడు. నేర్పరి. అతడేకాక రాజు వివింశతి, చిత్రసేనుడు, సత్యవ్రతుడు, పురుమిత్రుడు, జయుడు కూడా ఉన్నారు." యుధిష్ఠిరుడు అంటున్నాడు - "మహాభయంకరులు, మోసంతో జూదమాడే

జూదరులు అక్కడ చేరి ఉన్నారు. విధాత నిర్మించిన ఈ జగత్తు సర్వం విధికి లోబడి ఉంది. స్వతంత్రమైనది కాదు కదా! విదురా! ధృతరాష్ట్రుని ఆజ్ఞను అనుసరించి జూదానికి నేను వెళ్లాలనే అనుకొంటున్నాను. పుత్రునకు తండ్రి ఎప్పుడూ ఇష్టుడే కదా! కాబట్టి నీవు ఆదేశించినట్లుగానే, నేను చేస్తాను. జయశీలుడైన ధృతరాష్ట్రుడు సభకు రమ్మని నన్ను ఆహ్వానించకపోతే పాచికలాటలో కోరిక లేని నేను శకునితో జూదమాడను. పిలువబడి ఎన్నడూ వెనుతిరగను. ఇది నాకు శాశ్వతమైన వ్రతం."

విదురునితో ఇలా చెప్పి ధర్మరాజు ప్రయాణానికి వెంటనే ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించి, తెల్లవారగానే సోదరులతో, బంధువులతో, పరిచారకులతో, ద్రౌపది మొదలగు స్త్రీలతో ప్రయాణమయ్యాడు. **మిరుమిట్లు కొలిపే కాంతి పడగానే కన్నులు మూసుకుపోయినట్లుగా దైవం మానవుని ప్రజ్ఞను హరిస్తుంది. పాశాలతో కట్టబడినట్లుగా నరుడు విధాతకు వశమై ఉంటాడు.** ఇలా చెప్పి యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రుని ఆహ్వానాన్ని అంగీకరించాలని లేకపోయినా విదురునితోపాటు బయలుదేరాడు. యుధిష్ఠిరుడు బాహ్లీకుడు కూర్చి ఇచ్చిన రథం ఎక్కి తమ్ములందరితో కలిసి బయలుదేరాడు. రాజ్యలక్ష్మితో దేదీప్యమానుడై బ్రాహ్మణపురస్సరుడై బయలుదేరాడు.

(తన హస్తినాపురగమనం గురించి వార్తాహరులచేత సందేశం పంపాడు. ఆ పురుషశ్రేష్ఠులు రాజశాసనాన్ని పాటించారు. అనంతరం యుధిష్ఠిర మహారాజు సమస్తసామగ్రితో బ్రాహ్మణులచేత స్వస్తివాచనం చేయించి ధౌమ్యునితో సహితంగా మందిరంనుండి వెలుపలికి వచ్చాడు. సుఖప్రయాణం కోసం యథావిధిగా బ్రాహ్మణులకు ధనం ఇచ్చి, ఇతరులకు కూడా అడిగినది ఇచ్చి, అతడు ప్రయాణోన్ముఖుడయ్యాడు. అరవైఏళ్ల వయసుగలిగి, సర్వలక్షణసంపన్నమై, సమస్త వస్తువులతో కూడిన, రాజయోగ్యమైన, గజరాజును మహారాజు అధిష్ఠించాడు. హారాలు, కిరీటం, ధరించి సర్వాభరణభూషితుడై పసిడిఛాయతో మెరిసిపోతున్న యుధిష్ఠిరుడు ఏనుగు మీది బంగారు అంబారీమీద ఆసీను డయ్యాడు. రాజా! ఇనుమడించిన రాజశోభతో, యుధిష్ఠిరుడు బంగారు వేదికపై ఆజ్యాహుతులతో ప్రజ్వలిస్తున్న అగ్నిదేవునివలె ప్రకాశించాడు. హర్షాతిరేకులైన నరులతో, వాహనాలతో కూడి రాజు ముందుకు నడిచాడు. గొప్ప రథఘోషలతో ఆకాశమంతా నిండిపోయింది. సూతులు, మాగధులు, వందులు స్తోత్రాలతో అతనిని స్తుతిస్తున్నారు. మహాసైన్యంతో కూడిన అతడు కిరణాలతో కూడిన ఆదిత్యుని వలె ఉన్నాడు. తలపై శ్వేతచ్ఛత్రాన్ని ధరించిన యుధిష్ఠిరుడు పున్నమినాటి చంద్రునివలె ప్రకాశించాడు. బంగారు కట్టలు గల చామరాలతో అతనికి అన్నివైపులనుండి విసురుతున్నారు. భరతసత్తమా! మార్గమధ్యంలో అమితసంతోషంతో ప్రజలు అతనికి జయజయధ్వానాలు చేస్తున్నారు. అతడు యథోచితంగా శిరసు వంచి యథావిధిగా వాటిని స్వీకరిస్తున్నాడు. మార్గంలో సాగిపోతున్న కురురాజును ఇతరులు కొంతమంది దగ్గరకు చేరి మృగపక్షిధ్వనులతో నిరంతరం సుఖంగా స్తుతిస్తున్నారు. రాజా! రాజును

అనుసరించి వస్తున్న సైనికుల యొక్క కోలాహలధ్వని ఆకాశంలో గూడుకట్టి ప్రతిధ్వనిస్తోంది.

రాజుకు ముందుగా ఏనుగునెక్కి బలశాలి అయిన భీముడు బయలుదేరాడు. కవలలు నకులసహదేవులు చక్కగా అలంకరింపబడిన మంచి గుఱ్ఱాలను ఎక్కి రాజుకిరువైపుల నడుస్తున్నారు. ఆ రూపవంతులు ఇద్దరూ ఆ మహాసైన్యానికి శోభను చేకూరుస్తున్నారు. తెల్లని గుఱ్ఱాలు పూన్చిన అగ్నిదత్తమైన రథాన్ని ఎక్కి, ఆయుధధారులలో శ్రేష్ఠుడు బుద్ధిమంతుడయిన అర్జునుడు గాండీవాన్ని తీసుకొని వెనుకనే బయలుదేరాడు. కురురాజు యుధిష్ఠిరుడు సేనామధ్యంలో ఉన్నాడు. ద్రౌపది మొదలైన స్త్రీలు కావలసిన సామగ్రితో, పరిచారికలతో విచిత్రాలైన నూర్లకొలది పల్లకీలను ఎక్కి సేనాసహితంగా రాజుగారికి ముందు నడుస్తున్నారు. ఆ కురురాజు సైన్యం కాల్బలంతో ఏనుగులతో, అశ్వాలతో సమృద్ధిగా ఉంది. రథాలు పతాకాలతో కూడిన ధ్వజాలతో, కత్తులతో సమృద్ధిగా ఉన్నాయి. కాల్బలం యొక్క కోలాహలం నలువైపుల వ్యాపించింది. శంఖ, దుందుభి, తాళ, వేణు, వీణా ధ్వనులతో ఆ ప్రాంతమంతా మారు మ్రోగుతోంది. అలా బయలుదేరి ప్రయాణిస్తున్న పాండవసైన్యం ఎంతో శోభాయమానంగా ఉంది. ఆ కురురాజు యుధిష్ఠిరుడు సరస్సులను, నదులను, వనాలను, ఉపవనాలను దాటుకొంటూ, హస్తినాపురసమీపంలో నగరాన్ని చేరుకున్నాడు. అక్కడ అతడు సైనికులతో కలిసి సుఖకరమైన సమతల ప్రదేశంలో గుడారం ఏర్పాటు చేసుకొన్నాడు. పిమ్మట విదురుడు శోక విహ్వలమయిన గొంతుతో ధృతరాష్ట్రుడు చేయదలచుకొన్నది యథాతథంగా యుధిష్ఠిరునకు చెప్పాడు.)

ధృతరాష్ట్రుడు పిలిచిన కాలనియమానుసారంగా ధర్మాత్ముడైన పాండుపుత్రుడు హస్తినాపురాన్ని చేరుకొని, ధృతరాష్ట్రుని భవనానికి వెళ్లి, అతనిని కలుసుకొన్నాడు. అలాగే భీష్మద్రోణులను, కర్ణ కృపులను, అశ్వత్థామను కూడా యథోచితంగా ఆ రాజు కలుసుకొన్నాడు. తదనంతరం పరాక్రమశాలి మహాబాహువు అయిన యుధిష్ఠిరుడు సోమదత్తుని కలుసుకొని, అంతకుముందే అక్కడకు వచ్చి ఉన్న దుర్యోధనుడు, శకుని, శల్యుడు మొదలైనవారినందరినీ కూడా కలుసుకొన్నాడు. అనంతరం దుశ్శాసనుని, అతని సోదరులందరినీ, జయద్రథుని, కౌరవులందరినీ కలుసుకొని, సోదర సహితంగా యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రమహారాజు భవనాన్ని ప్రవేశించాడు. అక్కడ నక్షత్రాలతో పరివేష్టింపబడిన రోహిణీదేవిలా కోడళ్లతో కలిసికూర్చున్న పతివ్రతయైన గాంధారిని చూశాడు. యుధిష్ఠిరుడు గాంధారీదేవికి నమస్కరించాడు. ఆమె కూడా అతనిని ఆశీర్వదించి ఆనందం కలిగించింది. అనంతరం వృద్ధుడు, గ్రుడ్డివాడు, రాజు అయిన తండ్రిని మరల దర్శించాడు. ధృతరాష్ట్రమహారాజు కురుకులానికి ఆనందం కలిగించే భీమసేనుడు మొదలుగాగల నలుగురు పాండవులయొక్క శిరసులను ఆఘ్రాణించాడు. రాజా! పురుషశ్రేష్ఠులు, ప్రియధర్మనులు అయిన ఆ పాండవులను చూచి కౌరవులకు హర్షం కలిగింది. వారంతా ధృతరాష్ట్రుని అనుమతిని పొంది, రత్నమయగృహాలను ప్రవేశించారు. దుశ్శల మొదలైన స్త్రీలు అక్కడికి వచ్చిన వారందరినీ

చూశారు. మిరుమిట్లు కొల్పుతున్నట్లున్న ద్రౌపదియొక్క ఉత్తమసమృద్ధిని చూచి ధృతరాష్ట్రుని కోడళ్లు అంతగా ఆనందించలేదు. అనంతరం ఆ పురుషశ్రేష్ఠులు ద్రౌపది మొదలైన తమ స్త్రీలతో సంప్రదించి వ్యాయామం, కేశాలంకరణ మొదలైన పనులు చేసుకొన్నారు. తరువాత నిత్యకృత్యాలు చేసి, వారంతా దివ్యచందన భూషణాలు అలంకరించుకొన్నారు. శుభచింతనలు గల పాండవులు బ్రాహ్మణులచేత స్వస్తివాచనం చేయించుకొని, మనోరంజకమైన భోజనంచేసి, శయనగృహాలను ప్రవేశించారు. స్త్రీలు తమ యశస్సును గానం చేస్తుంటే, ఆ కురుశ్రేష్ఠులు నిద్రించారు. ఆ శుభరాత్రి వారికి రతివిహారాలతో గడిచింది. ప్రాతఃకాలంలో వందిమాగధులు స్తోత్రం చేస్తుంటే విశ్రాంతి పొందినవారు నిద్రలేచారు. రాత్రి సుఖంగా గడిపిన వారందరూ ప్రొద్దుటే ఆహ్నికకర్మలు నిర్వర్తించి, జూదరులందరూ అభినందిస్తూ ఉండగా రమణీయమైన సభను ప్రవేశించారు.

59. జూదమును గురించి శకుని ధర్మరాజుల సంవాదము.

ఆ సభలో ప్రవేశించి పాండవులందరూ కలిసి గౌరవింపదగిన రాజులందరిని కలుసుకొన్నారు. వయసు ననుసరించి, అర్హతననుసరించి వారందరిని గౌరవించి తివాచీలు పరిచిన విచిత్రమైన ఆసనాలమీద పోటీకి సిద్ధమై కూర్చున్నారు. ఆ రాజులందరూ అక్కడ ఆసీనులుకాగానే సుబలసుతుడు శకుని యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "రాజా! యుధిష్ఠిరా! సభలో పాచికలాడే బల్లను పరిచారు. అందరూ నీ కోసమే ఎదురు చూస్తున్నారు. ఇక పాచికలు విసిరి జూదం ఆరంభించడానికి సమయం ఆసన్నమయింది." యుధిష్ఠిరుడు అంటున్నాడు – "రాజా! జూదం కపటపూరితం. పాపం. ఇందులో క్షత్రియసంబంధమైన పరాక్రమానికీ చోటులేదు. నిశ్చితమైన నీతీ లేదు. నీవు జూదాన్ని ఎందుకు కొనియాడుతున్నావు ? కపటంతో కూడిన జూదాన్ని గౌరవించదగినదని జూదరులు తప్ప సజ్జనులు ప్రశంసించరు. శకునీ! క్రూరునివలె అనుచిత మార్గంలో మమ్మల్ని జయించాలని అనుకోకు." శకుని అంటున్నాడు – "పాచికలు విసిరేముందే ఆ సంఖ్యను తెలుసుకొన్నవాడూ, అందులోని పద్ధతులన్నీ తెలుసుకొన్నవాడూ, పాచికలు వేయడం మొదలైన పనులన్నింటి యందు ఉత్సాహంగా ఉండేవాడూ, మిక్కిలి తెలివిగలవాడై, జూదం గురించి తెలిసిన కితవుడు మాత్రమే, ఆ ప్రక్రియలన్నిటి యందు ఎదురయ్యే సమస్తాన్ని సహించగలుగుతాడు. జూదమాడే మనలో (ఒకరిని) ఇతరుని పాచికయే ఓడిస్తుంది (విరుద్ధంగా పడడంచేత). కనుక దాని చేతనే ఇక్కడ దోషం కలుగుతోంది. (పాచికదే పాపం) పార్థా! పాచికలాడదాం.

(తప్పులేదు) రాజా! సందేహించకు. పందెం వేయి. ఆలస్యం చేయకు." యుధిష్ఠిరుడు అంటున్నాడు -"మునిశ్రేష్ఠుడయిన అసితదేవలుడు ఈ లోకద్వారాలన్నిటియందు సర్వదా సంచరిస్తూ ఉంటాడు. అతడు ఇలా చెప్పాడు - "జూదరులతో కలిసి మోసపూరితంగా పాచికలు ఆడడం పాపం. ధర్మబద్ధమైన విజయం యుద్ధమందే ఉంటుంది. కనుక యుద్ధతత్పరత కావాలి కాని పాచికలాట కాదు." ఆర్యులు మాటలతో ఎవరినీ చిన్నపుచ్చరు. కపటంగా ప్రవర్తించరు. మోసంలేనిది, ధూర్తత్వం లేనిది అయిన యుద్ధమొకటే సత్పురుషులకు వ్రతం. మేము మాధనంతో శక్తిని అనుసరించి ఉత్తము లయిన బ్రాహ్మణులను రక్షించడానికే ప్రయత్నిస్తాం. ఆ ధనాన్ని నీవు జూదంలో ఒడ్డకు. శకునీ! మమ్ము ఓడించవద్దు. ధూర్తత్వంతో సుఖాలను గాని, ధనాన్ని గాని నేను కోరను. సజ్జనులు జూదరియొక్క ఈ ప్రవర్తనను గౌరవించరు."

శకుని అంటున్నాడు - "యుధిష్ఠిరా! శ్రోత్రియుడు ధూర్తత్వం చేతనే శ్రోత్రియుని చేరుకొంటాడు (ఓడించడానికి). విద్వాంసుడు మూర్ఖులను అలాగే సమీపిస్తాడు. లోకులు దానిని నికృతి (వంచన) అనరు. యుధిష్ఠిరా! పాచికలతో బాగా నేర్చుకొన్నవాడు మోసంతోనే ఇతరుని సమీపిస్తాడు. విద్వాంసుడు అపండితుని అలాగే సమీపిస్తాడు. లోకులు దానిని నికృతి అనరు. అస్త్రవిద్యలో ఆరితేరినవాడు ఆరితేరనివానిని, మిక్కిలి బలవంతుడు బలహీనుని - ఇలాగే అన్ని కర్మలయందు నికృతియే ఉంటుంది. యుధిష్ఠిరా! విద్వాంసుడు అపండితుని నికృతిచేతనే సమీపిస్తాడు. లోకులు దానిని నికృతి అనరు. ఇలాగే నీవు నన్ను సమీపించి ఇది నికృతి అనుకొంటే, నీకు భయం ఉన్నట్లయితే జూదంనుండి తప్పుకో." యుధిష్ఠిరుడు అంటున్నాడు - "రాజా! పిలిచిన తరువాత వెనక్కి మరలను. ఇది నా నిశ్చితమైన వ్రతం. విధి బలీయం. విధికి లోబడి ఉన్నాను. ఇక్కడ కూడిన వారందరిలో ఎవరితో నేను జూదం ఆడాలి? నాకు ఎదురుపందెం ఒడ్డేవాడు ఎవడు? ఇది నిర్ణయం అయ్యాక జూదం ప్రారంభించవచ్చు." దుర్యోధనుడు అంటున్నాడు - "రాజా! నేను రత్నాలను, ధనాన్ని ఇచ్చేవాడిని. నాకోసం నా మామ ఈ శకుని జూదం ఆడతాడు." యుధిష్ఠిరుడు అంటున్నాడు - "ఇతరునికోసం ఇతరుడు జూదం ఆడడం విషమమని నాకు తోస్తోంది. విద్వాంసుడా! దీనిని తెలుసుకో. ఇచ్ఛానుసారంగా జూదం ప్రారంభమగుగాక!"

60. ద్యూతప్రారంభము.

వైశంపాయనుడు చెపుతున్నాడు - జూదం ఆరంభం కాగానే రాజులందరూ ధృతరాష్ట్రుని ముందు ఉంచుకొని సభలో ప్రవేశించారు. భారతా! భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, మహామతి అయిన విదురుడు అసంతుష్టమైన మనసుతోనే ధృతరాష్ట్రుని అనుసరించారు. సింహసమానులు, మహాతేజస్సులు అయిన ఆ రాజులు ఇద్దరిద్దరు చొప్పున, ఒక్కొక్కరు చొప్పున బహుసంఖ్యాకమైన విచిత్రాలైన ఆసనాలను అధిష్ఠించారు. రాజా! మహాభాగులైన దేవతలు ఒక్కచోట కూడితే స్వర్గం ఎలా ఉంటుందో అలాగే వచ్చిన రాజులందరితో ఆ సభ ప్రకాశించింది. మహారాజా! వారందరూ వేదవేత్తలు. శూరులు. అందరూ ప్రకాశవంతమైన శరీరాలు కలవారు. అనంతరం సుహృద్ద్యూతం ఆరంభం అయింది. యుధిష్ఠిరుడు అంటున్నాడు - "రాజా! ఇదిగో! బహుమూల్యమైన, సాగరావర్తసంభవమైన మణిని పొదిగిన, బంగారుమయమైన ఆభరణం. ఇది శ్రేష్ఠమైన శోభాయుతమైన హారం. రాజా! ఇదే నేను ఒడ్డిన ధనం. ప్రతిపణంగా నీవేమి ఒడ్డుతున్నావు? మహారాజా! ఏ ధనంతో నీవు నాతో జూదమాడాలనుకొంటున్నావు?" దుర్యోధనుడు చెపుతున్నాడు - "నావద్ద మణులు, ధనాలు చాలా ఎక్కువగానే ఉన్నాయి. సంపదల పట్ల నాకు లోభం లేదు. ఈ జూదాన్ని నీవు గెలుచుకో." వైశంపాయనుడు చెపుతున్నాడు - అనంతరం అక్షతత్త్వవేత్త అయిన శకుని ఆ పాచికలను తీసుకొన్నాడు. 'ఓడిపోయావులే' అని శకుని యుధిష్ఠిరునితో అన్నాడు.

61. యుధిష్ఠిరుడు ప్రతిపందెమును ఓడిపోవుట.

యుధిష్ఠిరుడు అంటున్నాడు - "శకునీ! జూదంలో నన్ను మోసంతో జయించానని గర్విస్తున్నావు. పాచికలు తీసుకొని పరస్పరం మళ్లీ పందెం వేద్దాం. రాజా! వేయి నిష్కాలతో నిండి ఉన్న చక్కని భాండాలు ఉన్నాయి. కోశం ఉంది. అక్షయమైన హిరణ్యం ఉంది. అనేకరకాలైన బంగారం ఉంది. ఇదీ నా ధనం. దీనిని ఒడ్డి నీతో జూదం ఆడతాను." ఇలా అన్న కౌరవకులోద్ధారకుడు, మర్యాదలనుండి దిగజారనివాడు, జ్యేష్ఠుడు అయిన ఆ యుధిష్ఠిరునితో శకుని "ఇదిగో. ఈ పందెం కూడా నేను గెలిచాను" అన్నాడు. యుధిష్ఠిరుడు అంటున్నాడు - "ఇక్కడికి మమ్మల్ని మోసితెచ్చిన ఈ రాజరథం ఆహ్లాదకరమైనది. జైత్రమనే పేరుగల రథశ్రేష్ఠం. ఇది వేయి రథాలతో సమానమైనది. పులిచర్మంతో కప్పబడి, అతి దృఢంగా ఉన్నది. చక్కని చక్రాలతో ఇతరసామగ్రితో అలంకరింపబడినది. శోభాకరమైన

ఇది చిరుమువ్వలతో అలరారుతోంది. పుణ్యమయమైన ఇది కదులుతున్నప్పుడు మేఘంవలె, సాగరంవలె ఘోషిస్తోంది. కుశపక్షుల వంటి వర్ణం కలిగి దేశమంతటా ప్రసిద్ధికెక్కిన ఎనిమిది మేలు జాతి గుఱ్ఱాలు ఈ రథాన్ని వహిస్తున్నాయి. నేలను తాకుతూ ఉన్నప్పుడు వీటి పాదాలనుండి ఏదీ తప్పించుకోలేదు. రాజా! ఇది నా సొత్తు. దీనిని పణంగా పెట్టి నీతో జూదం ఆడతాను." ఇది విని మోసాన్ని ఆశ్రయించి పాచికలు వేస్తున్న శకుని యుధిష్ఠిరునితో "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు. యుధిష్ఠిరుడు అంటున్నాడు - "తరుణవయసులో ఉన్న లక్షమంది దాసీలున్నారు. వారు మంగళకరమైన బంగారు ఆభరణాలు ధరించి ఉన్నారు. చేతులకు శంఖాలగాజులు, భుజాలకు కేయూరాలు, మెడలో నిష్కహారాలు ధరించారు. ఇంకా ఎన్నో మంచి అలంకారాలు, మిక్కిలివిలువైన హారాభరణాలు, ధరించి ఉన్నారు. మంచి వస్త్రాలను కట్టుకొని చందనలేపనం చేసుకొన్నారు. రత్నాలు, బంగారం ధరించారు. చతుష్షష్టికళలలో నేర్పరులు. సంగీత నృత్యాలలో ఆరితేరినవారు. నా ఆదేశానుసారం స్నాతకులకు, మంత్రులకు, రాజులకు వెన్నంటి ఉండి సేవలు చేస్తారు. ఇది నా ధనం. దీనిని ఒడ్డి నీతో జూదమాడుతాను." ఇది విని మోసాన్ని ఆశ్రయించి పాచికలు వేస్తున్న శకుని యుధిష్ఠిరునితో "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు.

యుధిష్ఠిరుడు అంటున్నాడు - "దాసీల వలెనే నావద్ద లక్షమంది దాసులు ఉన్నారు. వారు కార్యనైపుణ్యం కలవారు. అనుకూలురు. ఎల్లప్పుడూ ఉత్తరీయాలు ధరించి ఉంటారు. వారు ప్రాజ్ఞులు, మేధావులు, సంయమనం కలవారు, యువకులు, ప్రకాశించే కుండలాలు ధరించినవారు. వారు పాత్రహస్తులై రాత్రింబవళ్లు అతిథులకు భోజనం వడ్డిస్తూ ఉంటారు. ఇది నావద్ద ఉన్నధనం. దీనిని ఒడ్డి నీతో జూదం ఆడుతాను." ఇది విని, మోసాన్ని ఆశ్రయించి, పాచికలు వేస్తున్న శకుని యుధిష్ఠిరునితో "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు. యుధిష్ఠిరుడు అంటున్నాడు - "సౌబలా! నావద్ద వేయిమదపుటేనుగులు ఉన్నాయి. అవి బంగారు గొలుసులతో బంధింపబడి ఉంటాయి. పద్మచిహ్నాలు కలిగి, బంగారుహారాలతో, ఆభరణాలతో అలంకరింపబడి ఉంటాయి. అవన్నీ చక్కగా వశమై ఉంటాయి. రాజుల సవారీకోసం ఉపయోగపడతాయి. యుద్ధాలలో అన్ని రకాల శబ్దాలను సహించగలవు. పొడవైన దంతాలతో, విశాలమైన శరీరాలతో ఒప్పుతూ ఉంటాయి. అన్నీకూడా ఒక్కొక్కటి ఎనిమిది ఆడు ఏనుగులతో కూడి ఉంటాయి. అన్ని ఏనుగులూ కూడా నగరాలను నాశనం చేయగలవు. నూతనమేఘాలతో సమానమైన కాంతి గలవి. ఇదంతా నాకున్న

ధనం. దీనిని ఒడ్డి నీతో జూదం ఆడుతాను." కుంతీతనయుడు ఇలా చెప్పగానే సౌబలుడు నవ్వుతూ యుధిష్ఠిరునితో "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు. యుధిష్ఠిరుడు అంటున్నాడు. - "ఈ రథాలు కూడా అంతే సంఖ్యకలవి. ఈ వేయి రథాలు బంగారు కొయ్యలతో, పతాకాలతో కూడి ఉన్నాయి. సుశిక్షితమైన గుఱ్ఱాలు పూన్చబడినాయి. చిత్రవిచిత్రంగా యుద్ధం చేసే యోధు లయిన రథికులతో కూడి ఉన్నాయి. వారికి ఒక్కొక్కరికి వేయిసువర్ణనాణెములు వేతనంగా లభిస్తాయి. వారు యుద్ధం చేస్తున్నా, చేయకున్నా ప్రతినెలకు వేతనం పొందుతారు. ఇది నా ధనం. దీనిని ఒడ్డి నీతో జూదమాడుతాను."

ఇలా యుధిష్ఠిరుడు చెప్పగానే వైరం పూనిన ఆ దుర్మార్గుడు శకుని - "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు.

యుధిష్ఠిరుడు అంటున్నాడు - "తిత్తిరిపక్షులవలె చిత్రమైన వర్ణాలు, బంగారుహారాలు కల గంధర్వాశ్వాలు నావద్ద ఉన్నాయి. శత్రుదమనుడైన చిత్రరథుడు యుద్ధంలో ఓడి పరాభూతుడై, ప్రీతిపూర్వకంగా, తృప్తిచెంది వాటిని గాండీవధనుస్సు ధరించిన అర్జునునకు ఇచ్చాడు. ఇది నా ధనం. ఇవి ఒడ్డి నీతో జూదమాడుతాను." ఇది విని, వంచననే ఆశ్రయించి, పాచికలాడే శకుని యుధిష్ఠిరునితో "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు. "నావద్ద పదివేల శ్రేష్ఠమైన రథాలు, బండ్లు - నానావిధాలయిన గుర్రాలు పూన్చినవి ఉన్నాయి. అలాగే ఒక్కొక్క వర్ణానికి వేలకొద్దీ ఎంపిక చేయబడిన యోధులు నావద్ద ఉన్నారు. వారంతా వీరోచితపరాక్రమంతో కూడిన మహాశూరులు. వారిసంఖ్య అరవై వేలు. వారంతా పాలు త్రాగుతారు. శ్రేష్ఠమైన శాలిధాన్యాన్ని భుజిస్తారు. విశాలమైన వక్షఃస్థలాలు కలవారు. ఇది నావద్ద ఉన్నధనం. దీనిని పణంగా పెట్టి నీతో జూదమాడుతాను." ఇది విని, మోసాన్ని ఆశ్రయించి, పాచికలు వేస్తున్న శకుని యుధిష్ఠిరునితో "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు. యుధిష్ఠిరుడు అంటున్నాడు - "నాలుగువందల రాగిలోహపాత్రలనిండా ఒక్కొక్కదానిలో ఐదు ద్రోణుల చొప్పున శుద్ధమైన బంగారం ఉన్న నిధులు నావద్ద ఉన్నాయి. అది పుటంపెట్టబడిన, విలువకట్టలేని స్వచ్ఛమైన బంగారం. భారతా! దానిని ఒడ్డి నీతో జూదం ఆడుతాను." వైశంపాయనుడు చెపుతున్నాడు - ఇది విని, మోసాన్ని ఆశ్రయించి, పాచికలు వేస్తున్న శకుని యుధిష్ఠిరునితో "ఇదిగో ఓడిపోయావు" అన్నాడు.

62. విదురుడు ధృతరాష్ట్రుని హెచ్చరించుట.

ఈ రకంగా సమస్తాన్ని హరిస్తూ ఘోరమైన జూదం జరుగుతూ ఉండగా, సర్వసంశయాలను తీర్చగల విదురుడు ఇలా అన్నాడు. "మహారాజా! చావదలచుకొన్నవానికి మందులు కూడా అనిష్టంగానే ఉంటాయి. అదే విధంగా నామాటలు నీకు నచ్చకపోవచ్చు. అయినా చెపుతాను. అర్థం చేసుకో. పాపబుద్ధిగల ఈ సుయోధనుడు భరతవంశ వినాశకుడు. పుట్టినవెంటనే నక్క అరుపు లాగా ఏడ్చినవాడు. ఈ సుయోధనుడు నిశ్చయంగా మీ వినాశనానికి కారణమవుతాడు. నీ ఇంటిలో దుర్యోధనరూపంతో నక్క నివసిస్తోంది. నీ మోహంవలన నీవు గ్రహించటం లేదు. శుక్రాచార్యుని నీతివాక్యాన్ని చెపుతాను విను. చెట్టుపైనున్న తేనెపట్టునుండి తేనె పొందగోరినవాడు అక్కడనుండి పడతామేమో అని ఆలోచించడు. చెట్టు ఎక్కిన తరువాత తేనెలో మునిగిపోవచ్చు. లేదా నేలపైన పడవచ్చు. అదేవిధంగా జూదంలో గెలిచిన మత్తుతోఉన్న ఈ దుర్యోధనుడు మత్తెక్కిన వానివలె రాబోవు సంకటాన్ని గ్రహించటంలేదు. మహారథు లయిన పాండవులతో శత్రుత్వాన్ని కల్పించుకొని పతనాన్ని గ్రహించటం లేదు.

మహాప్రాజ్ఞా! భోజవంశస్థులలో ఒకరాజు పురజనుల హితాన్ని కోరి దారితప్పిన తన కుమారుని పరిత్యజించాడు. అంధక, యాదవ, భోజవంశస్థులందరూ కలిసి కంసుని పరిత్యజించారు. వారి ఆదేశాన్ని బట్టి శత్రుమర్దనుడయిన కృష్ణుడు కంసుని చంపాడు. ఆ కంసుడు మరణించిన తర్వాత జ్ఞాతులంతా సుఖంగా నిండు నూరేళ్ళు జీవించారు. నీవు ఆదేశిస్తే అర్జునుడు సుయోధనుని బంధించగలడు. ఈ పాపాత్ముని సుయోధనుని బంధించితే కౌరవులంతా సుఖంగా ఉంటారు. సుయోధనుడు కాకి. పాండవులు నెమళ్ళు. దుర్యోధనుడు నక్క, పాండవులు పులులు. ఈ కాకి నక్కలను వదిలించుకొని పాండవులను సొంతం చేసికో. శోకసాగరంలో మునిగిపోవద్దు. **వంశంకోసం వ్యక్తినీ, గ్రామంకోసం వంశాన్ని, జనపదం కోసం గ్రామాన్ని, ఆత్మరక్షణకై సమస్త భూమండలాన్ని అయినా పరిత్యజించాలి.*** సర్వభావజ్ఞుడు, సర్వశత్రుభయంకరుడు, సర్వజ్ఞుడూ అయిన శుక్రాచార్యుడు జంభరాక్షసుని పరిత్యజించే సమయంలో మహారాక్షసులకు ఈ విషయాన్ని చెప్పాడు. ఒక అరణ్యంలో బంగారాన్ని క్రక్కే పక్షులుండేవి. వాటిని చూచి ఆ దేశపురాజు వాటిని పట్టి తెచ్చి ఇంట్లో ఉంచాడు. బంగారంమీది ఆశతో ఆ రాజు వాటిని చంపివేశాడు.

---

* **త్యజేత్ కులార్థే పురుషం గ్రామస్యార్థే కులం త్యజేత్।**
మవశ్చక్షుర్విహీనవ్య కీదృశం జీవితం భవేత్ ॥ 11

పరంతపా! సువర్ణాన్ని కోరుతున్న రాజు లోభంతో గ్రుడ్డివాడయ్యాడు. రాజా! స్వర్ణలోభంతో వాటినిచంపి వర్తమానభవిష్యత్తులు రెండింటిలో నష్టపోయాడు. నీవు అదే విధంగా పాండవుల సంపదను కోరుతూ వారికి ద్రోహం చేయవద్దు. పక్షులను చంపిన వానివలె, నీవు కూడా మోహంతో ప్రవర్తిస్తే పశ్చాత్తాపపడవలసివస్తుంది. దీనివలన ఎరను లాగిన చేపవలె నీవు కూడా నశిస్తావు. భారతా! తోటమాలి చెట్లను తడుపుతూ, వాటికి పూచిన పూలను స్వీకరించినట్లు, నీవు కూడా పాండవులతో స్నేహాన్ని చేస్తూ వారి సంపద లనే పూలను తీసికోవచ్చు. బొగ్గు తయారుచేసేవాడు చెట్లను సమూలంగా దహించినట్లు నీవు పాండవులను నిర్మూలంచేసే ప్రయత్నం చేయవద్దు. ఆవిధంగా ప్రయత్నిస్తే కొడుకులతో, మంత్రులతో కలిసి నీవు యమసదనానికి వెళ్ళవలసి వస్తుంది. భారతా! కలిసికట్టుగా ఉన్న పాండవులను ఎవ్వరూ ఎదిరించలేరు. సాక్షాత్తు దేవేంద్రుడే దేవతలతో కలిసి వచ్చినా ఎదిరించలేడు."

63. విదురుడు జూదమును వ్యతిరేకించుట.

విదురుడిలా అన్నాడు - "జూదం కలహాలకు మూలం. కడకు అభిప్రాయభేదాలు వచ్చి చాలా దారుణంగా పరిణమిస్తుంది. ధృతరాష్ట్రకుమారుడయిన దుర్యోధనుడు ఆ జూదాన్ని ఆశ్రయించి భీకరశత్రుత్వాన్ని సృష్టిస్తున్నాడు. దుర్యోధనుని అపరాధం వలన ప్రతీప, శంతను, భీమసేన, బాహ్లీక వంశస్థులు అన్నివిధాలా కష్టాలు పడబోతున్నారు. మదించిన ఆబోతు తన కొమ్మును తానే విరుచుకొన్నట్లు మదించిన ఈ దుర్యోధనుడు రాజ్యం నుండి సంక్షేమాన్ని దూరం చేస్తున్నాడు. రాజా! వీరుడూ, పండితుడూ అయిన మనిషి తన ఆలోచనలను కాదని పరులచిత్తాన్ని అనుసరించి ప్రవర్తిస్తే, సముద్రంలో మూర్ఖనావికుడు నడిపే పడవలో ఎక్కిన మనిషివలె భయంకరకష్టాలలో మునిగిపోతాడు. దుర్యోధనుడు యుధిష్ఠిరునితో పందెం పెట్టి జూదమాడుతున్నాడు. ఆ దుర్యోధనుడు గెలిచినట్టే భావించి నీవు ముచ్చటపడుతున్నావు. హద్దులు మీరిన వినోదంతో ఈ జూదం యుద్ధంగా మారబోతుంది. దీనివల్ల ఎందరో మనుష్యులు నశించిపోతారు.

ఈ జూదం అధఃపతనానికి దారితీస్తుంది. కాని (శకుని) దీనిని గొప్పగా భావించి ఏర్పాటు చేయించావు. మీరు రహస్యంగా మంత్రాంగం నెరిపి దీనిని స్థిరపరిచారు. అయితే యుధిష్ఠిరునితోడి ఈ జూదం నీ అభిప్రాయానికి విరుద్ధంగా కలహరూపంగా పరిణమిస్తోంది. ప్రతీపశంతను వంశస్థులారా! కౌరవసభలో నేనాడిన మాటలను వినండి. ఇది విద్వాంసులు కూడా సమ్మతించేది. మీరంతా ఈ మూర్ఖదుర్యోధనుని అనుసరిస్తూ,

వైరంతో మండిపడే అగ్నిలోనికి దూకకండి. జూదం మత్తులో మైమరచి ఉన్న అజాతశత్రువయిన యుధిష్ఠిరుడు తనకోపాన్ని నియంత్రించుకొనకపోతే, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు కూడా కోపంతో చెలరేగితే, జరగబోయే యుద్ధంలో, విపత్సముద్రంలో మునిగిపోయిన మీకు ఆశ్రయమిచ్చేవాడెవడు? మహారాజా! జూదమాడకపోయినా నీవు కోరుకొన్నంత ధనాన్ని పొందగలవు. బహుసంపన్నులైన పాండవులను జూదంలో ఓడించినంత మాత్రాన నీకు ఒరిగేదేముంది? పాండవులు ధనస్వరూపులు. వారిని సొంతం చేసికో. శకుని ద్యూతవిద్య ఏమిటో మనకు తెలుసు. ఆ పర్వతరాజుకు కపటద్యూతమే తెలుసు. శకునిని వచ్చిన చోటికే పంపివేయి. భారతా! కౌరవపాండవుల మధ్య యుద్ధాన్ని కల్పించకు."

64. దుర్యోధనుడు విదురుని నిందించుట - విదురుడు దుర్యోధనుని హెచ్చరించుట.

దుర్యోధనుడిలా అన్నాడు. "విదురా! నీవెప్పుడూ శత్రువులకీర్తినే ప్రశంసిస్తూ ధార్తరాష్ట్రులను నిందిస్తూనే ఉంటావు. నీవెవరిని ఇష్టపడతావో తెలుసు. మమ్ములను చిన్నపిల్లలనుగా భావించి ఎప్పుడూ అవమానిస్తుంటావు. శత్రువులపై మనసుపడే మనిషిని తేలికగా తెలిసికొనవచ్చు. అటువంటి వ్యక్తి ఇష్టంలేని వారిని నిందిస్తూ, ఇష్టమైన వారిని ప్రశంసించటంలో లీనమై ఉంటాడు. నీ మనస్సు ఆ రీతిగా ద్వేషింపదగదు. నీవు ఒడిలోని పామువలె మాకు అనిష్టమైనవాడవు. పిల్లివలె పోషకుని మెడపట్టి హింసించే వాడవు. స్వామిద్రోహివయినా, నిన్ను పాపాత్ముడని అనటం లేదెవ్వరూ. విదురా! ఈ పాపాన్ని చూచి నీవు భయపడటం లేదా? విదురా! మేము శత్రువులను గెలిచి గొప్ప ఫలితాన్ని పొందాము. నీవు మమ్ములను గూర్చి పరుషంగా మాటాడవద్దు. నీవు శత్రువులతో కలిసి ఆనందంగా ఉంటావు. మాతో కలిసి ఉంటూ పదేపదే మమ్ములనే ద్వేషిస్తావు. సహించరాని మాటలు పలికేవాడు శత్రు వవుతాడు. శత్రువును ప్రశంసించవలసిన సమయంలో అయినా తన అంతర్యాన్ని కప్పిపుచ్చుకొంటాడు. విదురా! నీవు ఆ మార్గాన్నే ఆశ్రయించు. మౌనాన్ని వహించు. నీ మనస్సుకు తోచినట్లుగా మాటాడుతూ మమ్ము ఇబ్బంది పెట్టవద్దు.

విదురా! మమ్ము అవమానించవద్దు. నీ ఈ మనస్సు మాకు తెలుసు. పెద్దల దగ్గర నుండి బుద్ధి నేర్చుకో. నీ కీర్తిని నిలుపుకో. ఇతరుల పనులలో చొరబడవద్దు. విదురా! అన్నింటికీ నేనే(దుర్యోధనుడు) కర్తననుకోవద్దు. అనుక్షణమూ మమ్ము పరుషంగా మాటాడవద్దు. నాకు హితమేది? అని నిన్ను సలహా అడగటం లేదు. నీకు పుణ్య

ముంటుంది. నీ మాటలను సహనంతో భరిస్తున్న మాపై నీ వాగ్బాణాలను విసరవద్దు. విశ్వానికి శాసకు డొక్కడే. రెండవ శాసకుడు లేడు. ఆ శాసకుడే గర్భస్థశిశువును కూడా శాసిస్తాడు. నన్ను కూడా ఆయనే శాసిస్తున్నాడు. నీరు పల్లానికే ప్రవహించినట్టు ఆ శాసకుడు నియంత్రించిన రీతిగా నేను ప్రవర్తిస్తాను. పరాత్పరుని బుద్ధియే జగత్తులోని సకలకార్యాలను శాసిస్తుంది. ఆయన ప్రేరణచేతనే మనిషి కొండ నెత్తి కెత్తుకొంటున్నాడు. పాముకు పాలుపోసి పెంచుతున్నాడు. దానికి భిన్నంగా ఎవరైనా శాసించా లనుకొంటే వారితో శత్రుత్వాన్ని కొని తెచ్చుకోవటమే. ఈరీతిగా బలవంతంగా మిత్రత్వాన్ని పాటించ దలచినవానిని పండితుడు పరిత్యజించాలి. భారతా! నిప్పును మండించి ముందుగా పరువెత్తక జాగుచేస్తుంటే అటువంటి వానికి బూడిద కూడా మిగలదు. విదురా! శత్రుపక్షపాతియై తనను ద్వేషిస్తూ అహితాన్ని కల్గించే మనిషిని ఇంట నుంచుకొనకూడదు. కాబట్టి నీకు ఎక్కడకు వెళ్ళాలనిపిస్తే అక్కడకు వెళ్ళు. కులటను ఎంతగా అనునయించినా ఆమె భర్తను విడిచి వెళుతుంది."

విదురుడిలా అన్నాడు. "రాజా! తనకు నచ్చని హితాన్ని బోధించినంతమాత్రాన హితైషులను వదిలించుకొనే వారి స్థితి ఎలా ఉంటుంది. సాక్షిమాత్రుడవై చెప్పు. రాజుల మనస్సులు ద్వేషంతో నిండి ఉంటాయి. వారు మంచిగా అనునయిస్తూనే వెనుక నుండి రోకళ్ళతో కొట్టిస్తారు. రాజకుమారా! నీవు మందమతివి. నిన్ను ప్రాజ్ఞునిగా నన్ను మూర్ఖునిగా భావిస్తున్నావు. ముందు మిత్రులలో పరిగణించి వారినే అనంతరకాలంలో నిందించినవాడే మూర్ఖుడు. శ్రోత్రియుల ఇంటిలో దుష్ప్రవర్తన గల స్త్రీ శ్రేయోదాయ కాలయిన పనులకు పనికిరానట్లు మందమతిని శ్రేయోమార్గంలో నడిపించలేము. అరువదేండ్ల ముసలివాడు పడుచుపిల్లకు నచ్చనట్లు భరతవంశపుంగవుడైన దుర్యోధనుడికి హితవచనాలు నచ్చవు. రాజా! హితాహితాలయిన సర్వకార్యాలలో నీవు ప్రియవచనాలనే వినదలచుకొంటే ఆడవారినో, మందబుద్ధులనో, మతి చలించినవారినో లేక అటువంటివారినో సలహా అడుగు. ఈ లోకంలో మనస్సునకు నచ్చేటట్లు మాత్రమే మాట్లాడగల పాపాత్ములు కూడా ఉంటారు. కానీ అప్రియమైనా హితాన్ని మాటాడేవారూ, వినేవారూ కూడా అరుదే. ధర్మపరుడై రాజు ఇష్టానిష్టాలను పరిగణించక అప్రియ మయినా హితాన్ని చెప్పేవాడే రాజుకు సహాయకుడు. మహారాజా! క్రోధం తీవ్రమై, తాపహేతువై, కీర్తినాశకమై, కఠినమై నిందింపదగినది. పరుషవాక్యాలు దానికి మూలం. క్రోధాన్ని దిగమ్రింగుకొని ప్రశాంతంగా ఉండు. నేను విచిత్రవీర్యకుమారుడయిన ధృతరాష్ట్రునకు అతని కుమారులకూ ఎప్పుడు కీర్తిసంపదలు

కలగాలని కోరేవాడిని. నీవు ఎలా ఉండదలచుకొంటే అలా ఉండు. నీకొక నమస్కారం. బ్రాహ్మణులు నాకు దీవెనల నిత్తురుగాక. కురునందనా! నేను నిశ్చలమనస్కుడనై నీకు ఇది చెప్తున్నాను. పండితుడైన వాడు కోరలనుండి, కళ్ళనుండి కూడా విషాన్ని చిమ్మగల సర్పాలను రెచ్చగొట్టకూడదు."

65. యుధిష్ఠిరుడు తనతోపాటు సర్వస్వమును కోల్పోవుట.

శకుని ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! పాండవుల ధనాన్ని ఇప్పటికే చాలా కోల్పోయావు. కొంతేయా! నీదగ్గర ఇంకా పోగొట్టుకొనని ధనశేషముంటే చెప్పు." యుధిష్ఠిరుడిలా అన్నాడు. "శకునీ! నాదగ్గర లెక్కలేనంత ధనమున్నదన్న విషయం నేనెరుగుదును. అసలు నాధనాన్ని గురించి నీవెందుకడుగుతున్నావు. రాజా! నాదగ్గర అయుతం, ప్రయుతం, శంకువు, పద్మం, అర్బుదం, ఖర్వం, శంఖం, నిఖర్వం, మహాపద్మం, కోట్లు, మధ్యం, పరార్థం, పరం. అంత ధనముంది. అదంతా పందెంగా పెట్టి నేను ఆడుతున్నాను." వైశంపాయనుడిలా అన్నాడు - అది విని శకుని కైతవాన్ని ఆశ్రయించి పాచికలు వేసి "ఇదంతా కూడా నేను గెలిచేశాను" అని ధర్మరాజుతో అన్నాడు. అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. "సింధునదికి తూర్పునుండి పర్ణాశా నది వరకూ ఎద్దులు, అశ్వాలు, ఆవులు అన్నీ చాలా ఉన్నాయి. అదంతా నా ధనమే. దానితో ఆడతాను." ఆ మాట విని శకుని మోసంతో పాచికలు విసిరి "నేనే గెలిచాను" అన్నాడు ధర్మరాజుతో. యుధిష్ఠిరుడిలా అన్నాడు - "రాజా! బ్రాహ్మణులకు దానం చేసిన భూమితప్ప మిగిలిన నగరగ్రామాలు భూమి, నా అధికారంలో ఉన్న బ్రాహ్మణేతరజనులు అంతా నా ధనమే. మిగిలిన ఈ ధనాన్ని పందెంగా పెట్టి ఆడబోతున్నాను." అది విని, శకుని కటపత్వాన్ని ఆశ్రయించి, పాచికలు విసిరి "నేనే గెలిచాను" అని యుధిష్ఠిరునితో అన్నాడు. యుధిష్ఠిరుడిలా అన్నాడు - ఈ రాజకుమారులు - భీమాదులు - ధరించి ఉన్న కుండలాలు, పతకాలు మొదలగు ఆభరణాలు అన్నీ రాజునకు సంబంధించినవే. ఈ నా ధనాన్ని పందెంగా పెట్టి నీతో ఆడుతున్నాను." అది విని శకుని, కపటత్వాన్ని ఆశ్రయించి, పాచికలు విసిరి "నేనే గెలిచాను" అని యుధిష్ఠిరునితో అన్నాడు.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. "శ్యామవర్ణంగలవాడు, యువకుడు, ఎఱ్ఱటి కన్నులు గలవాడు, సింహమధ్యముడు, మహాభుజుడు అయిన నకులుడే నా పందెం. ఇతనినే ధనంగా భావించు." శకుని ఇలా అన్నాడు- 'రాజా యుధిష్ఠిరా! నకులుడు రాజకుమారుడు.

నీకు ఇష్టమైన వాడు. మాకు వశమయితే ఇంక దేనితో ఆడుతావు ?' ఆ మాట అని శకుని పాచికలు విసిరి "నేనే గెలిచాను" అని యుధిష్ఠిరునితో అన్నారు. యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'ఈ సహదేవుడు ధర్మాన్ని ఉపదేశించగలవాడు. పండితుడని ఈలోకంలో పేరుపొందినవాడు. నాకు ప్రియుడైన ఈ రాజకుమారుడు పందెంగా పెట్టదగినవాడు కాదు. అయినా ఇష్టంలేని వస్తువుగా భావించి ఇతనిని పందెంగా పెడుతున్నాను.' ఆ మాట విని కపటత్వాన్ని ఆశ్రయించి పాచికలు విసిరి "నేనే గెలిచాను" అని శకుని యుధిష్ఠిరునితో అన్నాడు. శకుని ఇలా అన్నాడు. 'రాజా! నీకిష్టులయిన నకుల సహదేవులను నేను గెలిచికొన్నాను. భీమార్జునులు నీకు చాలా విలువైన వారని భావిస్తున్నాను.' యుధిష్ఠిరుడిలా అన్నాడు - 'మూఢుడా! అధర్మంగా ప్రవర్తిస్తున్నావు. న్యాయాన్ని పాటించటం లేదు. మంచిమనస్సులు గల మాలో విభేదాలు కల్పించాలని చూస్తున్నావు.' శకుని ఇలా అన్నాడు. 'భరతర్షభా! మదించి అధర్మాన్ని ఆశ్రయించే వాడు నరకంలో పడతాడు. బాగా మదించిన వాడు మొద్దుబారి పోతాడు. రాజా! నీవు పెద్దవాడవు, గొప్పవాడవు. నీకు నమస్కారం. యుధిష్ఠిరా! జూదగాళ్ళు జూదమాడుతూ పిచ్చెత్తిపోయి ఏదేదో వాగుతుంటారు. కానీ ఆ మాటలు కలలో కానీ ఇలలో కాని వాస్తవరూపాన్ని ధరించవు.' యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'శకునీ! అర్జునుడు నావలె మమ్ము యుద్ధంలో తరింపజేయగలవాడు. శత్రువులను జయించగలవాడు. లోకైకవీరుడైన అతనిని పందెంగా పెట్టడం తగనిపనే. అయినా సరే ఆ అర్జునుని పందెంగా పెట్టి ఆడుతున్నాను.' ఆ మాట విని, శకుని కపటత్వాన్ని ఆశ్రయించి, పాచికలు విసిరి "నేనే గెలిచాను" అని యుధిష్ఠిరునితో అన్నాడు. శకుని ఇలా అన్నాడు 'పాండవులలో మేటివిలుకాడయిన సవ్యసాచిని కూడా నేను గెలుచుకొన్నాను. రాజా! యుధిష్ఠిరా! ఇప్పుడు నీదగ్గర నీకిష్టమయిన భీమసేనుడే పందెం పెట్టడానికి మిగిలి ఉన్నాడు. అతనిని పందెంగా పెట్టి ఆడు.'

యుధిష్ఠిరుడిలా అన్నాడు - 'రాజా! భీముడు యుద్ధంలో మా సేనాపతి. రణరంగంలో వజ్రధారి అయిన ఇంద్రునివలె ఒంటరిగా మమ్ము నడిపించదలచాడు. అడ్డంగా కూడా చూడగలవాడు. వింటివలె వంగిన కనుబొమలు గలవాడు. మహనీయుడు. సింహస్కంధుడు. సదా అమర్షతో కూడినవాడు. బలంతో అతనికి సాటిరాగలవాడు లేడు. గదాధరులలో అగ్రగణ్యుడు. శత్రుసంహర్త. అటువంటి వానిని పందెంగా పెట్టరాదు. అయినా ఆ భీమును పందెంగా పెట్టి ఆడుతున్నాను.' ఆ మాటవిని, శకుని కపటత్వాన్ని ఆశ్రయించి, పాచికలు విసిరి, "నేనే గెలిచాను" అని యుధిష్ఠిరునితో అన్నాడు. శకుని ఇలా అన్నాడు.

'కొంతేయా! ఎంతో సొమ్మును కోలుపోయావు. సోదరులనూ, గుఱ్ఱాలనూ, ఏనుగులనూ కూడా ఓడిపోయావు. నీవు పోగొట్టుకోక మిగిలిన ధనమేదైనా ఉంటే చెప్పు.' యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'నేను సోదరులందరిలో విశిష్టుడను. అందరికీ ఇష్టమయిన వాడిని. నన్ను పందెంగా పెడుతున్నాను. ఓడిపోతే దానునివలె సర్వకార్యాలను చేస్తాను.' వైశంపాయనుడిలా అన్నాడు - ఆ మాట విని, శకుని కపటత్వాన్ని ఆశ్రయించి, పాచికలు విసిరి, "నేనే గెలిచాను" అని యుధిష్ఠిరునితో అన్నాడు. శకుని ఇలా అన్నాడు - 'రాజా! నీవు నిన్నే పందెంగా పెట్టి ఓడిపోయి పెద్దపాపం చేశావు. నీదగ్గర ఇంకా డబ్బున్నప్పటికీ నిన్నే నీవు ఓడిపోవటం పాపం.' ద్యూతవిద్యలో నిపుణుడయిన శకుని పందెం విషయంలో ఆ విధంగా యుధిష్ఠిరునితో పలికి లోకవీరులు సభాసదులు అయిన రాజులతో పాండవుల పరాజయాన్ని విడివిడిగా చెప్పాడు. శకుని ఇలా అన్నాడు - 'రాజా! ఇంతవరకు నీవు పోగొట్టుకొనని పందెపు వస్తువు ఒకటున్నది. నీ ప్రియసతి ద్రౌపదియే అది. ఆ ద్రౌపదిని పందెంగా పెట్టి నిన్ను మళ్లీ గెలుచుకో.' యుధిష్ఠిరుడిలా అన్నాడు - 'ఈ ద్రౌపది మరీ పొట్టికాదు మరీ పొడుగూ కాదు. మరీ నల్లనిదీ కాదు. మరీ తెల్లనిదీ కాదు. ఉంగరాలు తిరిగిన నీలవేణి. ఈమెను పందెంగా పెట్టి నీతో ఆడుతున్నాను. ఈమె శరత్కాలపు కలువరేకుల వంటి కళ్ళుగలది. శరత్కాలపు కలువల పరిమళం వంటి పరిమళం గలది. శరత్కాలపు కలువలను సేవించెడిది. రూపంలో లక్ష్మిని పోలినది. పురుషులలో స్త్రీలలో ఆశించే దయాగుణం, రూపసంపత్తి, శీలసంపత్తి గలది ఈ ద్రౌపది. ఈమె సర్వగుణసంపన్న. అనుకూలవతి. ప్రియభాషిణి. ధర్మార్థకామసిద్ధికై మగవాడు భార్యలో కోరుకొనే గుణాలు కలది. ఈమె ఆవులను, గొఱ్ఱెలను మేపే వారందరూ నిదురించిన తరువాత నిదురించేది. అందరికన్న ముందుగా నిదుర లేచేది. అయినపనులు, కావలసినపనులు అన్నీ తెలిసినది. చెమర్చిన ఈమె ముఖం పద్మంలా ప్రకాశిస్తుంది. మల్లెపూవులా పరిమళిస్తుంది. ఈమె సన్నని నడుము, పొడవైన కురులు, అరుణ వర్ణముఖం గలది. శరీరంపై మిక్కిలిగా రోమాలు లేనిది. ఆ విధంగా సర్వాంగసుందరియై, సుమధ్యమ అయిన పాంచాలరాజకుమారి ద్రౌపదిని పందెంగా పెట్టి నాకిది కష్టమయినా - ఆడుతున్నాను.' ధీమంతుడైన ధర్మరాజు ఆరీతిగా పలుకగానే అక్కడున్న వృద్ధసభ్యులనుండి "అయ్యో అయ్యో" అన్న మాటలు వెలువడ్డాయి. రాజా! అప్పుడు ఆ సభ క్షోభకు గురి అయింది. రాజులంతా బాధపడ్డారు. భీష్మద్రోణకృపాదులకు చెమటకూడా పట్టింది. విదురుడు శక్తిని కోల్పోయి తలపట్టుకొని కూర్చున్నాడు. బుసకొట్టే పాములవలె విశ్వసిస్తూ తలవాల్చి ఆలోచనామగ్ను డయ్యాడు.

(బాహ్లీకుడు, ప్రతీపుని కుమారుడు సోమదత్తుడు, సంజయుడు, అశ్వత్థామ, భూరిశ్రవుడు, ధృతరాష్ట్రపుత్రుడు యుయుత్సుడు బుసకొట్టే సర్పాలవలె తలవాల్చి చేతులు నలుపుకొన్నారు.)

ధృతరాష్ట్రుడు ఆనందంతో 'గెలిచామా? గెలిచామా?' అని పదేపదే అడిగాడు. తన ఆకారాన్ని, ముఖకవళికలను దాచుకొనలేకపోయాడు. దుశ్శాసనాదులతో కలిసి కర్ణుడు ఆనందించాడు. ఇతరసభ్యుల కళ్ళనుండి నీళ్ళురాలాయి. శకుని ఆరీతిగా పలికి 'ఇది కూడ గెలిచినట్టే' అంటూ మరలా పాచికలు చేతబట్టాడు. ఆ సమయంలో విజయోల్లాసంతో మదించి ఉన్నాడు.

66. విదురుడు దుర్యోధనునీ మందలించుట.

దుర్యోధనుడిలా అన్నాడు. 'విదురా రా! పాండవుల మనస్సుకు నచ్చిన ప్రియసతి ద్రౌపదిని ఇక్కడకు తీసికొనిరా. ఆ పాపాత్ములాలు వెంటనే ఇక్కడకు రావాలి. అంతఃపురాన్ని శుభ్రం చేయాలి. ఆమె అక్కడ దాసీలతోపాటు ఉండాలి.' విదురుడిలా అన్నాడు. 'మూర్ఖుడా! నీవంటివాడే ఇటువంటి మాటలనగలడు. కాలపాశానికి చిక్కి ఎరుకలేక ప్రవర్తిస్తున్నావు. లోయలోనికి జారి వ్రేలాడుతున్నావు నీవు. కానీ అది నీకు తెలియటం లేదు. జింక పులులను రెచ్చగొట్టినట్లు నీవు నడుస్తున్నావు. బుద్ధిహీనుడా! నీ తలమీద మహావిషసర్పాలు ఉన్నాయి. కోపంతో నిండినవాటికి మరీ కోపాన్ని తెప్పించవద్దు. యమలోకానికి వెళ్ళే ప్రయత్నాలు వద్దు. ద్రౌపది దాసి కాదగదు. యుధిష్ఠిరుడు ముందు తనను ఓడి ఆపై అస్వతంత్రుడై ద్రౌపదిని పణంగా పెట్టాడని నేను భావిస్తున్నాను. వెదురు తన వినాశనంకొరకే ఫలాన్ని ధరించినట్లు ఈ దుర్యోధనుడు మహాభయంకరమైన వైరం కోసమే జూదాన్ని స్వీకరించాడు. మదించిన ఈ సుయోధనుడు పోగాలాన్ని గ్రహించలేకున్నాడు. మాటలతో ఎవ్వరినీ గాయపరచకూడదు. ఎవ్వరితో కఠినంగా మాటాడకూడదు. నీచకృత్యాలతో శత్రువును వశం చేసికొనకూడదు. ఇతరులకు ఉద్వేగాన్ని కలిగించే మాటలు పలుకతగదు. అది నరకలోకానికి దారితీస్తుంది.

నోటినుండి వాగ్బాణాలు వెలువడితే అవి తాకిన మనిషి రేబవళ్ళు దుఃఖానికి లోనవుతాడు. ఇతరులకు మర్మచ్ఛేదకాలయిన మాటలను పండితులు ఇతరులపై ప్రయోగింపకూడదు. ఒక మేక ఒక బాణాన్ని మ్రింగిందట. అది మ్రింగుడు పడకపోయే సరికి తలను నేలకేసి కొట్టుకొన్నదట. దానితో ఆ బాణం దాని కంఠాన్నే తెగకోసిందట. పాండుపుత్రులతో వైరం అటువంటిదే. దాన్ని కొనితెచ్చుకొనవద్దు. పాండవులు వనచరులతో

కానీ, గృహస్థులతో కానీ, మహర్షులతో కానీ, పండితులతో కానీ ఎప్పుడూ ఈరీతిగా మాటాడరు. కుక్కబుద్ధిగలవారే ఈ విధంగా మొరుగుతుంటారు. దుర్యోధనుడికి అత్యంతభయంకరమై వక్రంగా ఉండే నరకద్వారాన్ని గురించి తెలియదు. దుశ్శాసనునితోపాటు కౌరవులలో చాలామంది ఈ ద్యూతక్రీడలో దుర్యోధనుని అనుసరిస్తున్నారు. సొరకాయలు నీటిలో మునగవచ్చు. రాళ్ళు నీటిపై తేలవచ్చు. నౌకలను శాశ్వతంగా నీట ముంచవచ్చు. కానీ మూర్ఖుడైన ఈసుయోధనరాజు హితకరాలైన నా మాటలు మాత్రం వినడు. ఈసుయోధనుడు నిశ్చయంగా కురువంశవినాశకుడు అవుతాడు. సర్వనాశనమూ ఇతని ద్వారానే జరుగుతుంది. వీడు మిత్రుల మాటలను అవి ఎంత మంచివైనా వినడు. లోభమే ఇతనిలో పెరుగుతోంది.'

67. ద్రౌపదిని సభలోనికి ఈడ్పించుట.

గర్వోన్మత్తుడైన దుర్యోధనుడు విదురుని ధిక్కరించి, ప్రాతికామివైపు చూచి శ్లేష్మలయిన సభాసదులమధ్య ఇలా అన్నాడు. "ప్రాతికామీ! ద్రౌపదిని తీసికొనిరా! పాండవులను గురించి భయపడనవసరం లేదు. విదురుడు పిరికివాడు. ఎప్పుడూ ఈ రీతిగానే మాటాడుతుంటాడు. మన వృద్ధిని ఎన్నడూ కోరడు." దుర్యోధనుడు ఆ విధంగా పలుకగానే రాజాజ్ఞను శిరసావహించి ప్రాతికామి వెంటనే వెళ్ళాడు. సింహపుగుహలోనికి కుక్క ప్రవేశించినట్లు రాజభవనంలో ప్రవేశించి ద్రౌపది దగ్గరకు చేరాడు. ప్రాతికామి ఇలా అన్నాడు.

"ద్రౌపదీ! యుధిష్ఠిరుడు ద్యూతోన్మాదానికి లోనయ్యాడు. దుర్యోధనుడు నిన్ను గెలుచుకొన్నాడు. యాజ్ఞసేనీ! ఇప్పుడు నీవు ధృతరాష్ట్రుని భవనానికి రావాలి. నిన్ను దాసీ పనికి అక్కడకు తీసికొని వెళతాను." ద్రౌపది ఇలా అన్నది. "ప్రాతికామీ! ఏమిటిలా అంటున్నావు. రాజకుమారుడు ఎవడయినా భార్యను పందెంపెట్టి జూదమాడుతాడా? ఆ రాజు మూర్ఖుడై జూదంతో పిచ్చివాడయ్యాడా? పందెం పెట్టడానికి మరేదీ దొరకలేదా?" ప్రాతికామి ఇలా అన్నాడు. "రాజకుమారీ! జూదంలో పందెంగా పెట్టడానికి మరేదీ లేనిసమయంలో అజాతశత్రు డయిన యుధిష్ఠిరుడు ఈ విధంగా జూదమాడాడు. ఆ యుధిష్ఠిరుడు ముందు తమ్ములను, తరువాత తనను, చివరిగా నిన్ను కోలుపోయాడు." ద్రౌపది ఇలా అన్నది. "సూతకుమారా! వెళ్ళు. జూదగాడైన ఆ మహారాజును సభలో ఈ విధంగా అడుగు - ముందు నిన్ను ఓడిపోయావా! లేక నన్ను ఓడిపోయావా? సూతకుమారా! ఆ విషయం తెలిసికొనిరా! తరువాత నన్ను తీసికొని వెళ్ళవచ్చు. ఇది తెలిసిన తర్వాతనే

దుఃఖితనయిన నేను సభకు వెళ్తాను." వైశంపాయనుడిలా అన్నాడు. ప్రాతికామి సభలో ప్రవేశించి రాజుల సమక్షంలోనున్న యుధిష్ఠిరునకు ద్రౌపదిమాటను ఇలా వినిపించాడు "ఏ వస్తువులపై ఆధిపత్యం కలిగి నీవు నన్ను ఓడిపోయావు. ముందు నిన్ను ఓడిపోయావా? లేదా నన్నే ముందు ఓడిపోయావా? అని ద్రౌపది అంటోంది." యుధిష్ఠిరుడు నిశ్చేష్టుడయ్యాడు. ప్రాణాలు పోయినట్లయింది. మంచో - చెడో ఏ సమాధానమూ చెప్పలేకపోయాడు ప్రాతికామికి.

దుర్యోధనుడిలా అన్నాడు. "ద్రౌపదిని ఇక్కడకే వచ్చి ఈ ప్రశ్నను అడగమను. ఆమె ప్రశ్ననూ, యుధిష్ఠిరుని సమాధానాన్ని ఇక్కడే అందరూ వింటారు." వైశంపాయనుడిలా అన్నాడు. ప్రాతికామి దుర్యోధనునకు లోబడిన వాడు కాబట్టి బాధపడుతూ రాజభవనానికి వెళ్ళి ద్రౌపదితో ఇలా పలికాడు. "రాజకుమారీ! ఈ సభ్యులు నిన్ను సభలోనికి పిలుస్తున్నారు. కౌరవులకు వినాశకాల మేర్పడిందని నేను భావిస్తున్నాను. నిన్ను సభలోనికి పిలిపించి పతనమైన ఆ సుయోధనుడు తన ఐశ్వర్యాన్ని రక్షించుకొనలేడు." ద్రౌపది ఇలా అన్నది. "సూతపుత్రా! విధి ఈవిధంగా నిర్ణయించాడు. పెద్దవారికైనా చిన్నవారికైనా సుఖదుఃఖాలు తప్పవు. ధర్మమొక్కటే లోకంలో గొప్పది. మనం దానిని రక్షిస్తే అది మనకు శాంతిని ఇస్తుంది. ఈ ధర్మాన్ని నేను అతిక్రమించను. కాబట్టి నీవు కౌరవసభలోనికి వెళ్ళి ధర్మబద్ధ మయిన నా ఈ మాటను అడుగు. నేనేం చేయాలో వారే నిర్ణయించి చెపుతారు. ఆ మేరకు నేను పాటిస్తాను. ధర్మాత్ములు, నీతిమంతులు అయిన ఆ పెద్దలు చెప్పినట్లు చేస్తా." ద్రౌపది మాట విని సూతుడు సభకు వెళ్ళి అక్కడ ఆమె మాటను వినిపించాడు. దుర్యోధనుని మొండిపట్టును గ్రహించిన ఆ పెద్దలు ఏమీ అనలేదు. తలవాల్చి కూర్చున్నారు. వైశంపాయనుడిలా అన్నాడు. భరతర్షభా! దుర్యోధనుడు చేయదలచిన పనిని విని ధర్మరాజు ద్రౌపదికి నచ్చిన ఒక దూతను ఆమె దగ్గరకు పంపాడు. 'పాంచాలీ! నీవు ఏకవస్త్రవు, రజస్వలవు, నీవి క్రిందకు వస్త్రాన్ని ధరించి ఉన్నదానవు అయిననూ, ఏడుస్తూ సభలోనికి వచ్చి, మామగారి ఎదుట నిలు. నీవు వస్తే ఆ రీతిగా సభలోనికి రావలసి వచ్చిన రాజకుమారిని నిన్ను చూచి సభ్యులంతా దుర్యోధనుని గట్టిగా నిందిస్తారు' - అని చెప్పి పంపాడు. రాజా! బుద్ధిమంతుడైన ఆ సూతుడు వెంటనే ద్రౌపది భవనానికి పోయి ధర్మరాజు నిశ్చయాన్ని ఆమెకు నివేదించాడు.

మహాత్ము లయిన పాండవులు దీనులై దుఃఖిస్తూ సత్యబద్ధులై ఉన్నారు. దేనినీ గమనించటం లేదు. పాండవుల దీనవదనాలను చూచి పరమానంద పడిన దుర్యోధనుడు "ప్రాతికామీ! ఆ ద్రౌపదిని ఇక్కడకే తీసికొనిరా! ఆమె ఎదుటే కౌరవులు సమాధానం

చెప్తారు" అని ఆదేశించాడు. ఆపై దుర్యోధనవశవర్తి అయిన సూతుడు ద్రౌపది కోపానికి భయపడి తన మానావమానాలను పరిగణించక "ద్రౌపదితో ఏం చెప్పమంటారు" అని మరల సభ్యులను అడిగాడు. దుర్యోధనుడిలా అన్నాడు. 'దుశ్శాసనా! నా సేవకుడైన సూతపుత్రుడు మందమతి. భీముని చూచి భయపడుతున్నాడు. నీవే వెళ్ళి ద్రౌపదిని తీసికొనిరా. పరాధీను లయిన పాండవులు నిన్నేం చేయగలరు.' అప్పుడు సోదరుని శాసనాన్ని విని దుశ్శాసనుడు లేచి కన్నెఱ్ఱ చేసి మహారథులయిన ఆ పాండవుల భవనంలో ప్రవేశించి రాజకుమారి అయిన ద్రౌపదితో ఇలా అన్నాడు. 'పాంచాలీ! రా! రా! జూదంలో నిన్ను గెలిచికొన్నాం. కృష్ణా! సిగ్గు విడిచి దుర్యోధనుని చూడు. విశాలనేత్రా! కౌరవులను సేవించు. ధర్మబుద్ధితో నిన్ను పొందాం. సభలోకి రా.' ఆ మాట విని దుఃఖించిన ద్రౌపది లేచి వివర్ణమైన ముఖాన్ని చేతితో తుడుచుకొని ఆర్తయై, వృద్ధుడైన ధృతరాష్ట్రుని అంతఃపురకాంతలున్న వైపునకు పరువెత్తింది. అప్పుడు దుశ్శాసనుడు కూడా రోషంతో గర్జిస్తూ వేగంగా ఆమెను వెంబడించాడు. నల్లగా ఉంగరాలు తిరిగిఉన్న ఆ ద్రౌపది దీర్ఘకేశాలను పట్టుకొన్నాడు. రాజసూయమనే మహాక్రతువులో అవభృథస్నానంతో మంత్రపవిత్రమైన నీటితో తడిసిన ఆ ద్రౌపది కురులు పాండవ పరాక్రమాన్ని పరిహసించి, దుశ్శాసనునిచే బలాత్కారంగా లాగబడ్డాయి. దీర్ఘకేశి అయిన ఆ ద్రౌపదిని దుశ్శాసనుడు అంతమంది భర్తలున్నా అనాథను వలె లాగుకొని పోయాడు. అప్పుడు ఆమె ఆర్తురాలు. పెనుగాలి అరటి చెట్టును ఊపివేసినట్లు దుశ్శాసనుడు ఆమెను లాగాడు.

ఆ విధంగా లాగబడుతున్న ద్రౌపది శరీరాన్ని కుదింపజేసికొని మెల్లగా "నేను రజస్వలను. ఏకవస్త్రను. బుద్ధిహీనుడా! దుర్మార్గుడా! నన్ను సభలోనికి కొనిపోకూడదు" అని అన్నది. అప్పుడు ఆ దుశ్శాసనుడు ఆమె జుట్టును మరీ గట్టిగా పట్టి ఏదో అనసాగాడు. ఆ ద్రౌపది తన రక్షణకై జిష్ణువు, పాపహర్త, నరరూపుడు అయిన కృష్ణుని పిలుస్తూ ఆక్రోశించింది. దుశ్శాసనుడిలా అన్నాడు - 'యాజ్ఞసేనీ! నీవు రజస్వలవు కావచ్చు. ఏకవస్త్రవు కావచ్చు. వివస్త్రవయినా కావచ్చు. జూదంలో నిన్ను గెలిచికొన్నాం. దాసివయ్యావు. కాబట్టి మా ఇష్టప్రకారం దాసులమధ్యనే నివసించాలి.' ద్రౌపది చెదరిన కురులు, జారిన వస్త్రంతో, సిగ్గుతో, అసహనంతో మండిపోతూ ఉంది. దుశ్శాసనుడు ఈడ్చుతూ ఉంటే ద్రౌపది మెల్లగా ఇలా అన్నది. ఈసభలోని వారంతా శాస్త్రవేత్తలు, కర్మిష్ఠులు, ఇంద్రతుల్యులు, గురుస్థానీయులు, గురువులు కూడా. వారి మధ్య ఈ విధంగా నిలవటం నాకు తగినది కాదు. క్రూరకర్ముడా! దురాచారుడా! నన్ను లాగవద్దు. వివస్త్రను చేయవద్దు. ఇంద్రునితో

పాటు దేవతలందరూ మీకు సహాయంగా నిలిచినా సరే పాండవులు నిన్ను సహించరు. మహాత్ముడైన ధర్మజుడు ధర్మమందే నిలిచేవాడు. ధర్మం సూక్ష్మమైనది. నిపుణులు మాత్రమే దానిని గ్రహింపగలుగుతారు. నేను నా భర్తలోని గుణాలను కాదని పరమాణురూపమైన దోషాన్ని కూడా చెప్పదలచుకోలేదు. ఈ కురువీరులమధ్య రజస్వలనయిన నన్ను ఈ తీరున లాగటం తగనిపని. ఇక్కడ ఒక్కడు కూడా నీవు చేస్తున్న పనిని నిందించటం లేదు. వీరంతా నీ అభిప్రాయంతోనే ఉన్నారనటం నిశ్చయం. ఛీ! భరతవంశరాజుల ధర్మం, క్షత్రియధర్మవేత్తలయిన ఈ మహానుభావుల నడవడీ రెండూ చెడ్డాయి. అందుకే కౌరవులు ధర్మాన్ని అతిక్రమిస్తున్న సభలోని కురువంశస్థులంతా ప్రేక్షకులయ్యారు.

ద్రోణ భీష్మ విదురులలోనూ, మహానుభావుడైన ఈ ధృతరాష్ట్ర మహారాజులోనూ శక్తి ఉడిగిపోయింది. కురువంశ వృద్ధులలో ప్రధానమైన వారందరూ ఈ దుర్యోధనుని తీవ్రమైన అధర్మవర్తనపై దృష్టి సారించటం లేదు.

(ఈ నాప్రశ్నకు సభాసదులందరూ సమాధానమివ్వండి. సమస్తరాజులారా! ధర్మానుసారంగా నన్ను గెలుచుకొన్నారా? లేదా?)

ద్రౌపది ఆ రీతిగా దీనంగా మాటాడుతూ, కుపితులై ఉన్న తన భర్తలను కనుకొనలతో చూచింది. ఆ చూపులతో ఆమె అసలే కోపంతో మండిపోయే శరీరాలుగల ఆ పాండవుల కోపాన్ని మరింత పెంచింది. సిగ్గు, కోపం నిండిన ద్రౌపది చూపుతో పాండవులకు కలిగిన బాధ రాజ్యాన్నీ, ధనాన్నీ, గొప్పగొప్ప రత్నాలనూ కోలుపోయినప్పుడు కూడా కలగలేదు. దీనులయిన తన భర్తలను చూస్తున్న ద్రౌపదిని గమనించి దుశ్శాసనుడు ఆమెను వేగంగా లాగి **"దాసి"** అని పెద్దగా నవ్వుతూ అరిచాడు. ఆ సమయంలో ద్రౌపది అచేతనయైనట్లు ఉంది. కర్ణుడు పరమానందంతో బిగ్గరగా నవ్వుతూ దుశ్శాసనుని మాటను సమర్థించాడు. గాంధారరాజైన శకుని కూడ దుశ్శాసనుని అభినందించాడు. కర్ణుడు, శకుని, దుర్యోధనుడు తప్ప మిగిలిన సభ్యులందరూ సభలో ఊడ్వబడుతున్న ఆ ద్రౌపదిని చూచి ఎంతో దుఃఖించారు. భీష్ముడిలా అన్నాడు. "సౌభాగ్యవతీ! ధర్మం సూక్ష్మమైనది. కాబట్టి నీ ప్రశ్నను స్పష్టంగా విచారించలేను. తనది కాని దానిని పందెంగా ఎవడూ పెట్టలేడు. స్త్రీ ఎప్పుడూ భర్తతోటిదే. ఇవన్నీ ఆలోచించకుండా ఏమీ చెప్పలేను. ధర్మరాజు సమృద్ధమైన భూమినంతా అయినా వదలుకొంటాడు కానీ ధర్మాన్ని విడువడు. అటువంటి ధర్మరాజే 'ఓడిపోయాను' అని అంగీకరించాడు. కాబట్టి నీ ప్రశ్నను గూర్చి విచారించలేను. మానవులలో ద్యూతవిద్యలో సాటిలేని వాడు శకుని. ఆ శకుని యుధిష్ఠిరుని రెచ్చగొట్టి నిన్ను పణంగా పెట్టాడు.

శకుని మోసాన్ని ధర్మజుడు గ్రహించలేదు." కాబట్టి నేను నీ ప్రశ్నను గూర్చి చెప్పలేను.

ద్రౌపది ఇలా అన్నది. "జూదంలో నిపుణులు, అనార్యులు, దుష్టాత్ములు, వంచకులు, ద్యూతప్రియులయిన వారు యుధిష్ఠిరుని సభకు పిలిపించి జూదమాడారు. ధర్మరాజుకు జూదంలో పెద్దగా అభ్యాసం లేదు. అటువంటి ఆయన మనస్సులో జూదమాడాలన్న కోరిక ఎందుకు కల్గించారు? అపవిత్రమనస్కులు, వంచకులు అందరు చేరి అమాయకుడైన ధర్మరాజును ముందుగా జూదంలో గెలుచుకొన్నారు. ఆ తర్వాత నన్ను పందెంగా పెట్టడానికి అంగీకరింపజేశారు. సభలో నున్న కురువంశస్థులందరూ కొడుకులు, కోడళ్ళు గలవారే. మీరంతా చక్కగా నా వాక్యాన్ని ఆలోచించి, నా ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పండి.

(పెద్దలు లేని సభ సభయేకాదు. ధర్మం చెప్పని పెద్దలు పెద్దలే కాదు. సత్యహీనమయిన ధర్మం ధర్మం కాదు. కపటత్వంతో కూడిన సత్యం సత్యమే కాదు.)"

ఆ రీతిగా దీనంగా మాటాడుతూ ఏడుస్తూ దీనులయిన భర్తలను చూస్తున్న ద్రౌపదితో దుశ్శాసనుడు పరుషంగా, అప్రియంగా, కఠినంగా ఎన్నో మాటలన్నాడు. ద్రౌపది రజస్వల. ఆమె ఉత్తరీయం జారి ఉన్నది. తగని రీతిగా దుశ్శాసనుడు ఆమెను ఈడుస్తున్నాడు. అది చూచి భీమసేనుడు ధర్మరాజువైపు కూడా చూచి నిస్సహాయస్థితిలో తీవ్రకోపాన్ని ప్రదర్శించాడు.

68. ద్రౌపదీ పరాభవము.

భీముడిలా అన్నాడు. "యుధిష్ఠిరా! జూదగాళ్ళ ఇళ్ళలో కులటలు కూడా ఉంటారు. కానీ వాళ్ళను పణంగా పెట్టి జూదమాడరు. ఆ కులటలమీద కూడా వారికి దయ ఉంటుంది. కాశిరాజు కానుకచేసిన ధనాన్ని, ఆయన మనకై తెచ్చిన విలువయిన ద్రవ్యాన్నీ, ఇతర నరపాలురు ఇచ్చిన రత్నాలను, వాహనాలనూ, ధనాన్ని, కవచాలను, ఆయుధాలను, రాజ్యాన్ని, నిన్ను, మమ్ము కూడా శత్రువులు జూదంలో గెలుచుకొన్నారు. ఆ విషయంలో నాకు కోపం రాలేదు. మా సర్వస్వానికీ నీవే అధిపతివి. కాని ద్రౌపదిని పణంగా పెట్టటాన్ని నేను హర్షమీరటమనే భావిస్తున్నాను. ఈ బాల - ద్రౌపది - పాండవులకు పత్నియై క్షుద్రులు, క్రూరులు, సంయమహీనులూ అయిన ఈకౌరవుల చేత నీ కారణంగా ఇబ్బందులు పడుతోంది. దీని కీమె తగదు. రాజా! ద్రౌపది యొక్క ఈ దుర్దశకు నేను నీ మీదనే కోపాన్ని ప్రదర్శిస్తున్నాను. నీ చేతులను తగులబెడతాను. సహదేవా! అగ్నిని

తీసికొనిరా." అర్జునుడిలా అన్నాడు. "భీమసేనా! ఇంతకు ముందెప్పుడూ నీవు ఇటువంటి మాటలు పలుకలేదు. క్రూరకర్ములయిన శత్రువులు నీ ధర్మగౌరవబుద్ధిని నాశనం చేసినట్టే ఉన్నది. శత్రువుల కోరికలను సఫలం చేయవద్దు. ఉత్తమధర్మాన్నే పాటించు. ధార్మికుడైన అన్నను కాదని ఎవరైనా ప్రవర్తిస్తారా? యుధిష్ఠిరుడు శత్రువుల ఆహ్వానాన్ని మన్నించి క్షాత్రవ్రతాన్ని అనుసరించి ఇతరుల కోరిక మేరకు జూదమాడాడు. అది మనకెంతో కీర్తిని కలిగిస్తుంది." భీమసేనుడిలా అన్నాడు. "అర్జునా! ఇది క్షాత్రధర్మానుగుణమే అని నాకు తెలియకపోతే మండే అగ్నిలో యుధిష్ఠిరుని రెండు చేతులనూ కలిపి బలపూర్వకంగా తగులబెట్టి ఉండేవాడిని."

ఆ విధంగా దుఃఖిస్తున్న పాండవులనూ, లాగబడుతున్న ద్రౌపదిని చూచి ధృతరాష్ట్రుని కొడుకుయిన వికర్ణుడిలా అన్నాడు. "రాజులారా! యాజ్ఞసేని అడిగిన ప్రశ్నకు బదులివ్వండి. ప్రశ్నకు సమాధానం తెలియకపోతే మనమంతా వెంటనే నరకాన్ని పొందవలసి వస్తుంది. కురువృద్ధులయిన భీష్మధృతరాష్ట్రులు అక్కడే ఉండికూడా ఏమీ అనలేదు. మహామతి అయిన విదురుడు కూడా నోరెత్తలేదు. అందరికీ గురువయిన ద్రోణుడు,కృపాచార్యుడు ఇద్దరూ బ్రాహ్మణోత్తములు. వారు కూడా ఈ ప్రశ్నకు సమాధాన మెందుకు చెప్పరు? అన్ని దిక్కులనుండి వచ్చిన రాజులు ఎందరో ఉన్నారు. వారైనా కామక్రోధాలకు అతీతంగా తమ బుద్ధి ననుసరించి సమాధానం చెప్పవలసి ఉన్నది. రాజులారా! సౌభాగ్యవతి అయిన ద్రౌపది పదే పదే వేసిన ప్రశ్నకు విచారించి సమాధానం చెప్పాలి. ఎవరు ఎవరి పక్షమో తెలియాలి." ఈరీతిగా వికర్ణుడు ఆ సభాసదులను చాలాసార్లు అడిగాడు. కాని ఆ రాజులు మంచిచెడులగూర్చి అతనికేమీ బదులు చెప్పలేదు. వికర్ణుడు ఆ విధంగా ఆ రాజులతో మాటిమాటికి చెప్పి చేతులు అప్పళించుకొంటూ, నిట్టూర్పు విడుస్తూ ఇలా అన్నాడు. "కౌరవులారా! నరపతులారా! ఈ ద్రౌపది ప్రశ్నకు మీరు సమాధానం చెప్పినా, చెప్పకపోయినా నేను మాత్రం ఈ విషయంలో న్యాయంగా భావించిన దానిని చెప్తాను. నరోత్తములారా! రాజులకు నాలుగు వ్యసనాలు చెప్పబడ్డాయి. అవి వేట, మదిరాపానం, జూదం, విషయాసక్తి. ఆ వ్యసనాలలో చిక్కిన నరుడు ధర్మాన్ని వీడి ప్రవర్తిస్తుంటాడు. ఈవిధంగా వ్యసనాసక్తిగలవాడు చేసిన పనిని లోకం మెచ్చదు. ఆ తీరున ఈ యుధిష్ఠిరుడు తీవ్రంగా వ్యసనాసక్తుడై, ఈ జూదగాళ్ళు రెచ్చగొట్టడం వలన ద్రౌపదిని పణంగా పెట్టాడు. ఈ సాధ్వి ద్రౌపది పాండవులకు అందరికీ భార్య. ధర్మరాజు ముందు తనను ఓడిపోయి ఆ తర్వాత ద్రౌపదిని పణంగా పెట్టాడు. మొత్తాన్ని గెలవాలనుకొన్న శకునియే ద్రౌపదిని

పణంగా పెట్టే విషయాన్ని ప్రస్తావించాడు. ఇదంతా విచారించి నేను ద్రౌపది గెలవబడలేదనే భావిస్తున్నాను." ఈ మాటలు విన్న సభాసదులు వికర్ణుని ప్రశంసిస్తూ, శకునిని నిందిస్తూ మాట్లాడసాగారు. సభలో పెద్దకోలాహలం ఏర్పడింది. ఆ కోలాహలం అణగిపోగానే కర్ణుడు కోపంతో వివశుడై వికర్ణుని చేయిపట్టుకొని ఈ మాటలన్నాడు.

"వికర్ణా! ఈ లోకంలో ఎన్నో వస్తువులు విపరీతపరిణామాలనే కల్గిస్తూ కనిపిస్తాయి. అరణిలో పుట్టిన అగ్ని దానినే దహించినట్టు ఏ వంశంలో పుట్టినవాడు ఆ వంశాన్నే నాశనం చేస్తుంటాడు.

(శరీరంలో పుట్టినరోగం శారీరకశక్తిని నశింపజేస్తుంది. పశువులు గడ్డిమేస్తూ ఆ ప్రదేశాన్నే త్రొక్కుతుంటాయి. అలాగే కురువంశంలో పుట్టిన నీవు నీవారికే చేటు తెస్తున్నావు. ద్రోణుడు,భీష్ముడు, కృపుడు, అశ్వత్థామ, విదురుడు, ధృతరాష్ట్రుడు, గాంధారీ - వీరంతా నీకన్నా తెలివయిన వారే.)

ద్రౌపది ఎంత ప్రేరణ చేసినా వారు ఏమీ మాటాడలేదు. వారంతా ద్రౌపది ధర్మవిజిత అనే భావిస్తున్నారు. ధార్తరాష్ట్రా! నీ అజ్ఞానం వలన నీవు చిందులు త్రొక్కుతున్నావు. అంతే కాదు. బాలుడవయి కూడా సభామధ్యంలో పెద్దవాడిలా మాటాడుతున్నావు. దుర్యోధన సోదరా! ధర్మతత్త్వాన్ని నీ వెరుగవు. అందుకే మందమతివై ద్రౌపదిని మనం గెలిచికొన్నా, గెలిచికానలేదని మాటాడుతున్నావు. ధృతరాష్ట్ర కుమారా! ద్రౌపది ఓడిపోలేదని నీవెలా భావిస్తావు? యుధిష్ఠిరుడు సభలో తన సర్వస్వాన్నీ పణంగా పెట్టాడు గదా! భరతర్షభా! సర్వస్వంలో ద్రౌపదికూడా చేరినదే గదా! ఈరీతిగా ధర్మవిజిత అయిన ద్రౌపది ధర్మవిజిత కాదని ఎలా అనుకొంటున్నావు? ద్రౌపదిని పేరు చెప్పియే పణంగా పెట్టాడు. పాండవులు దానిని అంగీకరించారు. ఇక ఏ కారణం చేత ఆమె ధర్మవిజిత కాదని నీకనిపిస్తోంది? ఒకవేళ ఏకవస్త్ర అయిన ఈమెను సభలోనికి తీసికొని రావటం అధర్మమని నీవనుకొంటే, ఆ విషయంలో కూడా ఒకమాట చెపుతాను విను. కురునందనా! దేవతలు స్త్రీకి ఒక్కభర్తనే విధించారు. కానీ ఈ ద్రౌపది అనేకులకు భార్య. కాబట్టి బంధకి అని నిర్ణయింపబడుతోంది. అటువంటి ఈమెను ఏకవస్త్ర అయినా, వివస్త్ర అయినా సభలోనికి ఈడ్చుకొనిరావటం విచిత్రం కాదని నా అభిప్రాయం. పాండవుల ధనాన్నీ, ఈమెను, పాండవులను మొత్తం సంపదనూ శకుని ధర్మబద్ధంగానే గెలుచుకొన్నాడు. దుశ్శాసనా! ఈ వికర్ణుడు బాలుడు. పండితుడి వలె మాటాడుతున్నాడు. పాండవుల వస్త్రాలను, ద్రౌపదివస్త్రాలను కూడా ఊడదీయి." ఆ మాట విని పాండవులంతా తమ తమ ఉత్తరీయాలను తీసి సభలో కూర్చున్నారు. రాజా! ఆ తరువాత దుశ్శాసనుడు బలాత్కారంగా సభామధ్యంలో

ద్రౌపదివస్త్రాలను లాగి తొలగింప నారంభించాడు. వైశంపాయనుడిలా అన్నాడు. వస్త్రాలను లాగుతుంటే ద్రౌపది శ్రీకృష్ణుని స్మరించింది.

(ద్రౌపది ఇలా అన్నది. "పెద్ద ఆపద కలిగినపుడు భగవంతుడైన శ్రీహరిని స్మరించాలని వసిష్ఠమహాత్ముడు పూర్వం పలికిన మాట నాకు బాగా తెలుసు." వైశంపాయనుడిలా అన్నాడు. 'గోవిందా!' 'కృష్ణా!' అని మాటిమాటికి పిలుస్తూ ద్రౌపది లోకప్రపితామహుడు, నారాయణుడు, ప్రభువు, ఆపదలలో అభయప్రదాత అయిన కృష్ణదేవుని మనసారా స్మరించింది.)

"గోవిందా! ద్వారకావాసా! కృష్ణా! గోపీజనప్రియా! కేశవా! కౌరవులు పరాభవిస్తున్న నన్ను గుర్తించవా? ప్రభూ! రమావల్లభా! వ్రజనాథా! ఆర్తినాశకా! కౌరవసాగరంలో మునిగిపోతున్న నన్ను ఉద్ధరించవా? జనార్దనా! కృష్ణా! మహాయోగీ! విశ్వాత్మా! విశ్వభావనా! గోవిందా! కౌరవుల మధ్యలో కలతపడుతూ శరణుకోరిన నన్నురక్షించు."* రాజా! ఈవిధంగా త్రిభువనేశ్వరుడూ, హరి అయిన శ్రీకృష్ణుని స్మరించి ఆ ద్రౌపది ముఖాన్ని కప్పుకొని బాధతో రోదింపసాగింది. యాజ్ఞసేని పిలుపు విని శ్రీకృష్ణుడు ఖిన్నుడై శయ్యను, ఆసనాన్ని విడిచి దయాళువై పరువెత్తి వచ్చాడు. యాజ్ఞసేని రక్షణకై 'కృష్ణా!' 'నారాయణా!' 'హరీ!' 'పురుషోత్తమా!' అని ఆక్రోశిస్తోంది. అప్పుడు ధర్మస్వరూపుడయిన ఆ మహాత్ముడు అదృశ్యుడై, వివిధ సుందరవస్త్రాలతో ద్రౌపదిని ఆచ్ఛాదించాడు. రాజా! దుశ్శాసనుడు ద్రౌపదివస్త్రాన్ని లాగుతుంటే అటువంటివే మరెన్నో వస్త్రాలు కనిపించసాగాయి. రాజా! ధర్మస్వరూపుడైన శ్రీకృష్ణుని ప్రభావంతో అనేకవర్ణాలుగల వస్త్రాలు కనిపించసాగాయి. అప్పుడు సభలో భయంకరమైన కోలాహలం చెలరేగింది. లోకంలో అత్యద్భుతదృశ్యాన్ని చూచి, రాజులందరూ ద్రౌపదిని అభినందిస్తూ దుశ్శాసనుని నిందించారు. అప్పుడు భీముడు కోపంతో పెదవు లదరుచుండగా చేతులు పిసుకుకొంటూ ఆ రాజులసమక్షంలో పెద్దగొంతుతో ప్రతిజ్ఞ చేశాడు.

"దిగ్దిగంతవాసులయిన క్షత్రియులారా! ఈ నామాట ఆలకించండి.

---

* గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజనప్రియ ॥ 42
కౌరవైః పరిభూతాం మాం కిం న జానాసి కేశవ ।
హే నాథ హే రమానాథ వ్రజనాథార్తినాశన ।
కౌరవార్ణవమగ్నాం మామ్ ఉద్ధరస్వ జనార్దన ॥ 42
కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన ।
ప్రపన్నాం పాహి గోవింద కురుమధ్యేఽవ సీదతమ్ ॥ 43

ఇంతకుముందెవ్వడూ ఇటువంటి మాటలు అనలేదు. ఇక ముందెవ్వడూ ఇటువంటి మాట అనడు. రాజులారా! ఈ దుశ్శాసనుడు పాపాత్ముడు, దుర్మతి, భరతవంశానికి అపకీర్తిని తెస్తున్నవాడు. యుద్ధంలో ఇతని గుండెలను చీల్చి నెత్తురు త్రాగుతాను. ఈ మాటను ఆచరించి చూపకపోతే నాకు నా పూర్వీకులు పొందిన ఉత్తమ గతులుండవు." రోమాలు నిక్కపొడిచేటట్లు భీకరంగా భీముడు పలికిన ఆ మాటను విని రాజులందరూ దుశ్శాసనుని నిందిస్తూ భీముని బాగా ప్రశంసించారు. సభామధ్యంలో వస్త్రాల రాశి ప్రోగుపడగానే దుశ్శాసనుడు అలసిపోయి సిగ్గుతో కూర్చున్నాడు. పాండవుల స్థితిని చూచి సభ్యులు, రాజులూ దుశ్శాసనుని నిందిస్తూ ధిక్కారస్వరాలు చేశారు. అవి రోమాంచాన్ని కలిగిస్తున్నాయి. ద్రౌపది ప్రశ్నను సరిగా ఆలోచించి కౌరవులు స్పష్టంగా సమాధానం చెప్పలేదు అని జనులు ఆక్రోశిస్తూ ధృతరాష్ట్రుని నిందించసాగారు. అప్పుడు సర్వధర్మవేత్త అయిన విదురుడు చేతులు పైకెత్తి సభాసదులను నివారించి ఇలా అన్నాడు.

"సభ్యులారా! ద్రౌపది తన ప్రశ్నను మన ముందుంచి అనాథవలె రోదిస్తోంది. కాని మీరు ఆ ప్రశ్నను విచారించటం లేదు. ఇక్కడ ధర్మహాని కలుగుతోంది. ఆర్తుడు అగ్నివలె, చింతతో జ్వలిస్తూ సభను శరణువేడుతాడు. అప్పుడు సభ్యులు సత్యధర్మాలను ఆశ్రయించి ఆర్తిని ఉపశమింపజేస్తారు. అందువలన మంచిమనిషి ధర్మానుకూలమైన ప్రశ్ననే లేవనెత్తుతాడు. సభ్యులు కామక్రోధాదులకు లోనుకాకుండా ప్రశ్నకు సమాధానం చెప్పాలి. రాజులారా! వికర్ణుడు తన ప్రజ్ఞననుసరించి ఆ ప్రశ్నను వివేచించాడు. మీరు కూడా మీమీ బుద్ధికి తగినట్లు దానిని నిశ్చయించండి. **ధర్మజ్ఞుడై సభలో నిలిచి ప్రశ్నకు సమాధానమివ్వనివాడు అసత్యఫలంలోని అర్ధభాగాన్ని అనుభవించవలసివస్తుంది. ధర్మజ్ఞుడై సభలో నిలిచి ప్రశ్నకు తప్పుడు సమాధానం చెపితే అసత్యఫలితాన్ని పూర్తిగా తప్పక అనుభవిస్తాడు.**

ఈ విషయంలో ప్రాచీనమైన ప్రహ్లాదాంగిరసుల మధ్య జరిగిన సంవాదాన్ని పెద్దలు ఉదాహరిస్తుంటారు. ప్రహ్లాదుడు రాక్షసరాజు. ఆయన కొడుకు విరోచనుడు, కన్యకొఱకై అంగిరుని కొడుకైన సుధన్వునితో పోటీపడ్డాడు. ఆ కన్యను పొందగోరుతూ "నేనే గొప్ప, నేనే గొప్ప" అని వాడులాడుకొన్నారు. వాళ్ళిద్దరూ ప్రాణాలనే పణంగా పెట్టుకొన్నారు. ఆ ఇద్దరి మధ్య గొప్పతనానికి సంబంధించిన వివాదం తీవ్రమయింది. వారు "మా ఇద్దరిలో ఎవరు గొప్ప? సరిగ సమాధానం చెప్పు. అసత్యమాడవద్దు" అని ప్రహ్లాదుని అడిగారు. ప్రహ్లాదుడు ఆ వివాదంతో భయపడి సుధన్వుని వైపు చూచాడు. అప్పుడు బ్రహ్మదండం

వలె జ్వలిస్తున్న సుధన్వుడిలా అన్నాడు. "ప్రహ్లాదా! నీవు అసత్యమాడినా, అసలేమీ మాటాడక ఊరుకొన్నా ఇంద్రుడు వజ్రంతో నీ శిరస్సును వందల ముక్కలుగా చేస్తాడు." సుధన్వుడు అలా అనగానే రావిఆకులాగా కంపిస్తూ, బాధపడుతూ, ప్రహ్లాదుడు తేజస్వి అయిన కశ్యపుని దగ్గరకు సలహాకై వెళ్ళాడు. ప్రహ్లాదుడిలా అడిగాడు. "మహాభాగా! నీవు దేవదానవ బ్రాహ్మణధర్మాలు బాగా తెలిసినవాడవు. ఈ ధర్మసంకటాన్ని విను. ప్రశ్నకు సమాధానం చెప్పనివానికి, అసత్యసమాధాన మిచ్చినవానికి పరలోకాలలో ఏవి లభిస్తాయి? నేనడుగుతున్న ప్రశ్నకు సమాధానం చెప్పు." కశ్యపుడిలా అన్నాడు - "తెలిసి కూడ కామక్రోధభయాల కారణంగా సమాధానం చెప్పనివాడు వేయి వరుణపాశాలను తన మీదవేసికొన్నట్టే. సాక్షి గోవు చెవులవలె శిథిలుడై ఇరుపక్షాలతో సంబంధాన్ని కలిగి సాక్ష్యం చెప్పకపోతే వాడు కూడా వేయి వరుణపాశాలను మీదికి తెచ్చుకొన్నట్టే. సంవత్సరం గడిచిన తరువాత ఒక్కపాశం నుండి బయటపడతాడు. కాబట్టి సత్యం సరిగా తెలిసినవాడు సత్యాన్నే చెప్పాలి. ధర్మం అధర్మంచే భంగపడి సభలో నిలిచినపుడు సభాసదులు కూడా భంగపడినట్లే. వారు ఆ శల్యాన్ని తొలగించలేరు. వారు పాప ఫలాన్ని అనుభవించవలసిందే. నిందింపదగిన వానిని నిందింపనిచో ఆ పాపఫలంలో సభాపతి సగాన్ని, తప్పుచేసిన వాడు నాల్గవభాగాన్ని, సభాసదులు నాల్గవభాగాన్ని అనుభవిస్తారు. నిందింపదగిన వానిని నిందించినపుడు సభాపతి పాపరహితుడవుతాడు. సభాసదులకు పాపమంటదు. తప్పుచేసిన వాడే మొత్తం ఫలాన్ని అనుభవిస్తాడు. ప్రహ్లాదా! ధర్మమడిగినపుడు తప్పుడు సమాధానం చెపితే ఆ వక్తయొక్క ఇష్టాపూర్తధర్మాలు నశిస్తాయి. ముందు, వెనుకల ఏడుతరాల పుణ్యాలు కూడా నశిస్తాయి. ధనాన్ని గోలుపోయినవాడు, కొడుకు చనిపోయినవాడు, ఋణగ్రస్తుడు, స్వప్రయోజనాన్ని పోగొట్టుకొన్నవాడు, భర్తను కోలుపోయిన స్త్రీ, రాజకోపానికి ఎర అయినవాడు, సంతానంలేని కాంత, పులి వాసన చూచినవాడు, సపత్నులు గల స్త్రీ, సాక్షులు మోసగించినవాడు వీరందరూ ఒకే విధమయిన దుఃఖాన్ని అనుభవిస్తారని దేవతల అభిభాషణ. అసత్యం చెపితే ఆ దుఃఖాల నన్నింటినీ అనుభవించవలసి వస్తుంది. ప్రత్యక్షంగా చూచినా, విన్నా, ధారణచేసినా అతడు సాక్షి అవుతాడు. కాబట్టి సత్యం చెప్పిన సాక్షి ధర్మార్థాలకు దూరంకాడు. కశ్యపుని మాటలు విని, ప్రహ్లాదుడు కొడుకుతో ఇలా అన్నాడు. "విరోచనా! సుధన్వుడు నీకన్న గొప్పవాడు. వాని తండ్రి అంగిరుడు నాకన్న గొప్పవాడు. సుధన్వుని తల్లి నీ తల్లి కన్న గొప్పది. ఇప్పుడీ సుధన్వుడే నీ ప్రాణాలకధికారి." అపుడు సుధన్వుడిలా అన్నాడు. "పుత్రస్నేహాన్ని కూడా కాదని నీవు ధర్మంమీదనే నిలిచావు. అనుగ్రహిస్తున్నాను. ఈ నీ

కుమారుడు నూరేండ్లు బ్రతుకుతాడు."

విదురుడిలా అన్నాడు. "సభాసదులారా! ఈ పరమధర్మ ప్రసంగాన్ని మీరంతా విన్నారు గదా! ద్రౌపది ప్రశ్నను అనుసరించి ఈ విషయంలో ఏది యుక్తమని భావిస్తున్నారు?" విదురుని మాట విని రాజు లెవ్వరూ ఏమీ అనలేదు. కర్ణుడు "ఈ ద్రౌపది దాసి. ఇంటికి నడిపించు" అని దుశ్శాసనునితో అన్నాడు. సిగ్గుపడుతూ, వణికిపోతూ, పాండవులను గూర్చి విలపిస్తున్న ఆ తపస్వినిని దుశ్శాసనుడు సభామధ్యంలోనికి ఈడ్చాడు.

69. ద్రౌపది విలాపము - భీష్మవచనము.

ద్రౌపది ఇలా అన్నది. "ముందుగా చేయవలసిన నా పని ఇప్పటికీ కాలేదు. ఇప్పుడు ఆ పని జరగాలి. బలిష్ఠుడైన ఈ దుశ్శాసనుడు బలపూర్వకంగా నన్ను ఈడ్చాడు. నేను కలత జెందాను. కౌరవసభలోని కురువంశస్థుల కందరకు నమస్కారం. ఇంతకుముందే నమస్కరించకపోవటంలో నా దోషం లేదు." వైశంపాయనుడిలా అన్నాడు. ఆ ద్రౌపదిని దుశ్శాసనుడు ఈడ్చుతుండగా తపస్విని అయిన ద్రౌపది నేలబడింది. సభలో ఈ రీతిగా విలపించింది. ఆ స్థితి ఆమెకు తగినది కాదు. "స్వయంవర సమయంలో సమాగతులైన రాజులు రంగస్థలంలో నన్ను చూశారు. మరెక్కడా నేను ఇతరుల కంటపడలేదు. అటువంటి నేను నేడు సభలోనికి రావలసి వచ్చింది. గతంలో రాజభవనంలో నున్న నన్ను గాలి, సూర్యుడు కూడా చూడలేదు. అటువంటి నేను నేడు సభామధ్యంలో జనసమూహంలో అందరికీ కనిపించవలసి వచ్చింది. గతంలో రాజభవనంలో గాలి నన్ను తాకినా సహించలేని పాండవులు నేడు ఈ దురాత్ముడు తాకుతూ ఉంటే సహిస్తున్నారు. కురువంశానికి కోడలినై, పుత్రీసమానంగా ఉన్న నేను ఈవిధంగా బాధపడుతున్నాను. నేను దీనికి తగను. అయినా కౌరవులు సహించి చూస్తున్నారు. ఇది కాలవైపరీత్యమే. స్త్రీని, పతివ్రతను, కళ్యాణిని అయిన నేను సభామధ్యంలోనికి ఈడ్చుకు రాబడ్డాను. ఇంతకన్న దయనీయమైనది మరే ముంటుంది? రాజుల ధర్మమేమయినది? ధర్మపరాయణ అయిన స్త్రీని పూర్వమెప్పుడూ సభలోనికి కొనివచ్చేవారు కాదని నేను విన్నాను. కౌరవులలో ఆ సనాతన ధర్మం నశించింది. పాండవులకు భార్యనై, ధృష్టద్యుమ్నుని సోదరినై, శ్రీకృష్ణుని సఖినై ఈ రాజ సభలోనికి ఎలా వచ్చాను? కౌరవులారా! నేను యుధిష్ఠిరుని ధర్మపత్నిని, క్షత్రియకాంతను. ఇప్పుడు చెప్పండి. నేను దాసినా? అదాసినా? మీరు చెప్పినట్టు చేస్తాను. కౌరవులారా! కురువంశ కీర్తినాశకుడైన ఇతడు నన్ను చాలా బాధిస్తున్నాడు. దీన్ని ఎక్కువసేపు భరించలేను.

కురువంశస్థులారా! నేను ఓడిపోయానో? ఓడిపోలేదో? రాజులందరూ ఎలా భావిస్తే అలాగే సమాధానం చెప్పాలని కోరుతున్నాను. దాని ననుసరించి నేను ప్రవర్తిస్తాను."

భీష్ముడిలా అన్నాడు. "కళ్యాణీ! నేను చెప్పాను గదా! ధర్మం యొక్క పరమగతి చాలా సూక్ష్మమైనది. లోకంలో విజ్ఞులైన మహాత్ములు కూడా దానిని తెలియలేరు. లోకంలో బలవంతుడు భావించిందే ధర్మసంశయసమయంలో ధర్మమవుతుంది. బలహీనుడు పలికే ధర్మం బలవంతుని ధర్మం చేతిలో దెబ్బతింటుంది. నీ ప్రశ్న పరమసూక్ష్మమైనది, దురవగాహ మైనది, ధర్మనిర్ణయకార్యం గురుతర మైనది. కాబట్టి నేను వివేచించి నిశ్చయించి చెప్పలేకున్నాను. త్వరలో ఈ కురువంశనాశనం తప్పదు. కౌరవులందరూ లోభమోహాలకు లోనయ్యారు. కళ్యాణి! నీవు కోడలివి. పాండవధర్మపత్నివి. వారు ఉత్తమవంశసంజాతులు. తీవ్రకష్టాలు వచ్చినా ధర్మమార్గాన్ని విడువరు. పాంచాలీ! నీకు ఈ ప్రవర్తన యోగ్యమయినదే. మహాసంకటంలో పడికూడా ధర్మం మీదనే దృష్టి పెడుతున్నావు. ద్రోణాచార్యులు మొదలయిన ఈ పెద్దలు ధర్మవేత్తలయి కూడా, ప్రాణాలు పోయినట్లు తలలు వాల్చి శూన్యశరీరాలతో కూర్చొని ఉన్నారు. నీ ప్రశ్న విషయంలో ధర్మరాజే ప్రమాణమని నా భావం. నీవు ఓడిపోయావో లేదో చెప్పదగిన వాడు తాను మాత్రమే."

70. దుర్యోధనుని వక్రభాషణము - భీముని ఆవేశము.

మహారాణి ద్రౌపది ఆర్తయై ఆడుగొట్టెవలె ఆక్రోశించడటం చూచి కూడా దుర్యోధనునకు భయపడిన రాజులు మంచి, చెడూ ఏదీ మాటాడలేదు. అప్పుడు రాజపుత్రులు, రాజపౌత్రులు అందరూ మౌనంగా ఉండటాన్ని చూచి దుర్యోధనుడు నవ్వుతూ ద్రౌపదితో ఇలా అన్నాడు.

"ద్రౌపదీ! ఈ నీ ప్రశ్న బలిష్ఠుడైన భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఈ నీ భర్తలకే వదలిపెడుతున్నాను. వీరినే నీ ప్రశ్నకు సమాధానమివ్వమను. పాంచాలీ! నిన్ను పణంగా పెట్టే అధికారం ధర్మరాజుకు లేదని ఈ పెద్దల సమక్షంలో నీ భర్తలను చెప్పమను. ధర్మరాజు తప్పు చేశాడని చెప్పమను. అప్పుడు నీకు దాస్య విముక్తి కలిగిస్తాను. ధర్మరాజు మహాత్ముడు, ఇంద్రతుల్యుడు. ధర్మబద్ధుడు. నిన్ను పణంగా పెట్టడానికి తన కధికారమున్నదో లేదో తననే చెప్పమను. ఆయన మాటను బట్టియే నీవు దాసివో, కాదో వెంటనే నిర్ణయించుకొనవచ్చు. సజ్జనులయిన ఈ సభలోని కౌరవులందరూ నీ గురించియే

బాధపడుతున్నారు. మందభాగ్యులయిన నీ భర్తల పరిస్థితిని గమనించి నీప్రశ్నకు ఉన్నదున్నట్లుగా సమాధానం చెప్పలేకున్నారు." వైశంపాయనుడిలా అన్నాడు - అప్పుడు సభ్యులందరూ దుర్యోధనుని పలుకులను పెద్దగా అభినందించారు. గర్జనలు చేస్తూ ఉత్తరీయాల నూపారు. మరొకవైపు హాహాకారాలు చెలరేగాయి. దుర్యోధనుని ఆ రమణీయవచనాలను విని కౌరవసభలో ఆనందం కూడా వెల్లివిరిసింది. ఇతరరాజులు కూడా సంతసించి దుర్యోధనుని కురుశ్రేష్ఠుడనీ, ధార్మికుడనీ ఆదరించారు. ఆ రాజులందరూ ధర్మరాజు ఏం చెపుతాడో అని ముఖాలు సాచి ధర్మరాజు వైపే చూడసాగారు. యుద్ధంలో పరాజయమెరుగని అర్జునుడూ, భీమసేనుడూ, నకులసహదేవులు ఏమంటారో అన్న కుతూహలం సభ్యుల మనస్సులలో ఏర్పడింది. ఆ కోలాహలం సద్దుమణగ గానే భీమసేనుడు చందనచర్చితమై, అందమైన తన దివ్యబాహువు నెత్తి ఇలా అన్నాడు. "మహాత్ముడు, మాకు పితృసమానుడు అయిన ధర్మరాజు మా యజమాని కాకుంటే మేము ఈ కౌరవుల అత్యాచారాన్ని సహించేవారమే కాదు. ఈ ధర్మజుడు మా తపస్సులకు, పుణ్యాలకు, ప్రాణాలకు కూడా ప్రభువే. ద్రౌపదిని పణంగా పెట్టకముందు తాను ఓడినట్లు ధర్మజుడు భావించకపోతే అప్పుడు మేమంతా ఓడినట్లే. నేను ఓడకున్నట్లయితే నేను బ్రతికి ఉండగానే ద్రౌపదీకేశాలను స్పృశించిన ఈ దుశ్శాసనుడు నేలపై నిలువగలిగేవాడు కాదు. నా భుజాలను చూడండి. విశాలంగా గుండ్రంగా, తలుపు గడియలవలె ఉన్నాయి. వీటిమధ్య చిక్కి ఇంద్రుడైనా విడిపించుకొనలేడు. నేను ధర్మానికి కట్టుబడి ఉన్నాను. అన్నమీది గౌరవం నన్ను కట్టిపడవేసింది. అర్జునుడు కూడా మిన్నకున్నాడు. కాబట్టి ఈ సంకటాన్ని దాటలేకపోతున్నాను. ధర్మరాజు ఆదేశిస్తే సింహం క్షుద్రమృగాలను పీడించినట్లు పాపాత్ములయిన ఈ దుర్యోధనాదులను కత్తులవంటి నా కరతలాలతో పిప్పిచేయగలను." అప్పుడు భీష్మద్రోణ, విదురులు "ఇదంతా క్షమించు. నీవేమైనా చేయగలవాడవే" అని భీమసేనునితో అన్నారు.

71. ద్రౌపదీ వరలాభము

కర్ణుడిలా అన్నాడు. "కళ్యాణీ! దాసుడు, పుత్రుడు, అస్వతంత్ర స్త్రీ - ఈముగ్గురు నిర్ధనులే. ఐశ్వర్యభ్రష్టుడయిన దాసుని భార్యమీదా, అతని సంపదలమీద, ఆ దాసుని యజమానికి అధికారాలుంటాయి. రాజకుమారీ! దుర్యోధనుని పరివారంలో చేరి వారి భార్యలకు సేవలు చేయి. ఇక నీకు మిగిలిం దిదే. అందుకే ఆదేశిస్తున్నాను. ఇక నీకు

సమస్తధార్తరాష్ట్రులే యజమానులు కానీ పాండవులు కారు. భామినీ! వెంటనే మరొకరిని భర్తగా ఎన్నుకో. అప్పుడు జూదం ద్వారా మరల నీవు దాసీవయ్యే పరిస్థితి రాదు. భర్తలయెడ స్వేచ్ఛగా ప్రవర్తించటం నీవంటి దానికి తప్పేమీకాదు. దాస్యంలో స్వేచ్ఛ ఉంటుంది. కాబట్టి నీకు దాస్యమే మంచిది. యాజ్ఞసేనీ! నకులుడు, భీమసేనుడు, యుధిష్ఠిరుడు, సహదేవుడు, అర్జునుడు అందరూ ఓడిపోయారు. నీవిప్పుడు దాసివి. ఓడిపోయిన ఆ పాండవులు నీ భర్తలు కారు. జీవితానికి పరాక్రమమూ, పౌరుషమూ పరమార్థమని యుధిష్ఠిరుడు ఎరుగడు. అందుకే పాంచాలరాజైన ద్రుపదుని పుత్రివి నిన్ను - పణంగా పెట్టి సభలో జూదమాడాడు." కర్ణుని మాట విని భీమసేనుడు తీవ్రమైన అసహనంతో, ఆర్తితో నిట్టూర్చాడు. ధర్మపాశబద్ధుడై యుధిష్ఠిరునే అనుసరిస్తూ కూడా కోపంతో ఎఱ్ఱబడిన కళ్ళతో యుధిష్ఠిరుని దహిస్తున్నట్టు చూస్తూ ఇలా పలికాడు.

భీముడిలా అన్నాడు. "రాజా! సూతపుత్రుడైన కర్ణునిపై నాకు కోపం లేదు. దాసధర్మం మేరకు కర్ణుడు మాటాడాడు. మహారాజా! ద్రౌపదిని పణంగా పెట్టి నీవు జూదమాడకుండా ఉంటే మన శత్రువులు ఇప్పు డిలా మాటాడగలిగేవారా?" భీమసేనుని మాటవిని దుర్యోధనరాజు మౌనంగా, అచేతనంగా ఉన్న యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "రాజా! భీమార్జునులూ, నకులసహదేవులూ నీ అనుశాసనంలోనే ఉన్నారు. ద్రౌపది ప్రశ్నకు నీవే సమాధానం చెప్పు. ఆమె ఓడిపోలేదని నీవు భావిస్తున్నావా?" ధర్మరాజుతో ఆ మాటలు అని ఐశ్వర్యమదమత్తుడైన దుర్యోధనుడు సైగలతో కర్ణుని చూసి నవ్వుతూ, రెచ్చగొడుతూ, భీమసేనుని ఉద్రేకపరుస్తూ ద్రౌపదిని చూచి నవ్వుతూ తన వస్త్రాన్ని పైకెత్తి అరటిబోదెవలె, ఏనుగు తొండంవలె, వజ్రంవలె దృఢంగా సర్వలక్షణ లక్షితమై ఉన్న తన ఎడమతొడను ద్రౌపదికి చూపించాడు. అది చూచి భీమసేనుడు ఎఱ్ఱబడ్డకన్నులను పెద్దవి చేసి రాజమధ్యంలో నిలిచి సభకు వినిపిస్తున్నట్లు ఇలా అన్నాడు. "యుద్ధంలో ఈ నీ తొడను బ్రద్దలు చేయకపోతే వృకోదరుడు పితరులతోకలిసి పుణ్యలోకాలకు దూరమవుతాడు." ఆ సమయంలో కోపించిన ఆ భీమసేనుని రోమకూపాలనుండి అగ్నిజ్వాలలు వెలువడ్డాయి. చెట్టు తగులబడుతుంటే తొఱ్ఱలనుండి మంట బయటకు వచ్చినట్లుగా ఉంది.

వెంటనే విదురుడిలా అన్నాడు - "ధృతరాష్ట్రకుమారులారా! తెలుసుకోండి. భీమసేనుడి ద్వారా ఎంత భయంకరస్థితి ఏర్పడిందో, ప్రారబ్ధప్రేరణచేతనే భరతవంశస్థులలో ఇంత అన్యాయం పుట్టింది. ధృతరాష్ట్రసుతులారా! హద్దుల నతిక్రమించి జూదమాడారు. స్త్రీని

సభకు తెచ్చి వివాదాన్ని సృష్టించారు. మీ యోగక్షేమాలు పూర్తిగా నశించాయి. కౌరవులు పాపిష్ఠమైన మంత్రాంగం చేస్తున్నారని అందరికీ అర్థమైంది. కౌరవులారా! ధర్మమాహాత్మ్యాన్ని త్వరగా గ్రహించండి. ధర్మం నశిస్తే సభమొత్తం దుష్టమవుతుంది. జూదమాడుతున్న ధర్మరాజు తానోడకముందే ద్రౌపదిని పణంగా పెట్టి ఉంటే అప్పుడు అలా చేసే అధికారముండేది. అధికారం లేనివాడు పణంగా పెట్టిన ధనాన్ని గెలిచినా, ఓడినా అది కలలోని గెలుపు ఓటముల వంటిదే. కౌరవులారా! మీరు గాంధారరాజైన శకుని మాటలు విని ధర్మానికి దూరం కావద్దు." దుర్యోధను డిలా అన్నాడు. "యాజ్ఞసేనీ! నేను భీమార్జున నకులసహదేవుల మాటను మన్నించాలను కొంటున్నాను. వీరంతా నిన్ను పణంగా పెట్టడానికి ధర్మరాజుకు అధికారం లేదని చెపితే దాస్యం నుండి నీకు విముక్తి కలిగిస్తాను." అర్జునుడిలా అన్నాడు. "కౌంతేయుడు, మహాత్ముడైన ధర్మరాజు మమ్ము పణంగా పెట్టినపుడు తాను స్వతంత్రుడే కానీ తానే ఓడిపోయిన తర్వాత మరెవరిమీదా తనకు అధికారముండదు. కౌరవులందరూ అది గ్రహించాలి."

వైశంపాయనుడిలా అన్నాడు. రాజా! జనమేజయా! ఆ తరువాత ధృతరాష్ట్రమహారాజు అగ్నిశాలలో ఒక నక్క పెద్దగా ఊళ పెట్టసాగింది. దానికి సమాధాన మన్నట్లు అన్నివైపులనుండీ గాడిదలు ఓండ్రపెట్టాయి. భయంకర పక్షులు రొదపెట్టసాగాయి. ఆ ఘోరశబ్దాలను తత్త్వవేత్త అయిన విదురుడు, గాంధారి, భీష్ముడు, ద్రోణుడు, పండితుడయిన కృపాచార్యుడు విన్నారు. వెంటనే 'స్వస్తి స్వస్తి' అని పెద్దగా శుభకామన చేశారు. ఆ తరువాత గాంధారి, పండితుడైన విదురుడు పెద్దకీడును శంకించి దీనంగా ఆ విషయాన్ని ధృతరాష్ట్రునకు నివేదించారు. అప్పుడు ధృతరాష్ట్రమహారాజు ఇలా అన్నాడు.

"మందమతీ! దుర్యోధనా! నీవు మరణించినట్లే. దుర్వినీతా! కురుశ్రేష్ఠులున్న ఈ సభలో స్త్రీని, విశేషించి పాండవధర్మపత్నిని పిలిపించి దుర్భాషలు ఆడుతున్నావు." ఈ విధంగా పలికి మనీషి, తత్త్వమతి అయిన ధృతరాష్ట్రుడు బాంధవుల వినాశాన్ని తప్పించి వారికి హితాన్ని కల్పించదలచి, పరిస్థితిని ఆకళింపు చేసికొని అనునయ పూర్వకంగా పాంచాలితో ఇలా అన్నాడు. "పాంచాలీ! నీవు నాకోడళ్ళలో సర్వోన్నతవు. ధర్మపరాయణవు. నీకు ఇష్టమయిన వరం కోరుకో."

ద్రౌపది ఇలా అడిగింది. "భరతర్షభా! నాకు వరమిచ్చే టట్లయితే సర్వధర్మాచరణశీలి అయిన యుధిష్ఠిరుని దాస్యవిముక్తిని కోరుతున్నాను. దీనితో నాకుమారుడు, మనస్వి అయిన ప్రతివింధ్యుని, తెలిసీతెలియని పిల్లలు దాసపుత్రుడని పిలవరు.

ఒకప్పుడు రాజకుమారుడై తర్వాత దాసపుత్రు డయిన వాడు మరెవ్వడూ లేడు. రాజులచే లాలింపబడిన నా కుమారుడు దాసపుత్రు డవటం తగదు." ధృతరాష్ట్రు డిలా అన్నాడు. "కళ్యాణీ! నీవడిగినట్లే జరుగుతుంది. నీకు మరొక వరమిస్తున్నాను. కోరుకో. నా మనస్సు మరొక వరమివ్వమంటోంది. ఒకే వరానికి నీవు తగినదానవు కాదు." ద్రౌపది ఇలా అన్నది. "రాజా! నీవశమై ఉన్న భీమార్జున నకులసహదేవులకు రథ ధనుస్సులతో బాటు దాస్యవిముక్తిని కోరుతున్నాను." ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "మహాభాగా! నీవు వంశానికి ఆనందాన్ని కల్గించే దానవు. నీవు కోరినట్లే జరుగుతుంది. మూడవవరం కోరుకో. నా కోడళ్లు అందరిలో శ్రేష్ఠవు నీవు. ధర్మవర్తినివి. రెండు వరాలే ఇవ్వటం నీకు పూర్ణసత్కారం కాదు." ద్రౌపది ఇలా అన్నది. "ప్రభూ! లోభం ధర్మాన్ని నశింప జేస్తుంది. నాకిక వరాలపై ఆసక్తిలేదు. రాజశ్రేష్ఠా! మూడవ వరానికి నేను తగినదానను కాను. రాజేంద్రా! వైశ్యులకు ఒక్కవరం, క్షత్రియకాంతకు రెండువరాలు, క్షత్రియునకు మూడు వరాలు, బ్రాహ్మణునకు వందవరాలు అని పెద్దలంటారు. రాజా! నా భర్తలు దాస్యాన్ని పొంది విపత్తిలో పడ్డారు. ఇప్పుడు దానినుండి బయటపడ్డారు. ఇకపై పుణ్యకర్మలతో శుభాలను పొందగలరు."

72. ధర్మరాజు భీముని శాంతింపజేయుట.

కర్ణుడిలా అన్నాడు. "నేను మనుష్యులలో అందగత్తెలయిన స్త్రీలను గూర్చి విన్నాను. కానీ వారిలో ఎవ్వరూ ఈ విధంగా కార్యాన్ని సాధించినట్టు వినలేదు. పాండవులు, ధార్తరాష్ట్రులూ ఒకరిపై ఒకరు మండిపడేటప్పుడు ఈ ద్రౌపది పాండవులకు ప్రశాంతిని కల్గించింది. పాండవులు నావ కానీ మరే ఆధారం కానీ లేకుండా నీటమునిగిపోతుంటే ద్రౌపదియే వారు తరించటానికి నౌక అయింది." వైశంపాయనుడిలా అన్నాడు - రాజా! కౌరవులమధ్యలో కర్ణుడన్న ఈ మాటలు విని భీమసేనుడు సహించలేకపోయాడు. మనస్సు కలతపడగా "పాండవులకు స్త్రీ గతి అయింది" అనుకొన్నాడు. భీముడిలా అన్నాడు. "సంతానం, కర్మ, విద్య అనే మూడు జ్యోతులు పురుషునిలో ఉంటాయని దేవలుడు చెప్పాడు. వాటి ద్వారానే సర్వసృష్టి జరుగుతుంది. శరీరం ప్రాణరహితమై, అపవిత్రమైనప్పుడు జ్ఞాతులు దానిని వదలివేస్తారు. అప్పుడు సంతాన, కర్మ, జ్ఞానాలే పురుషునకు పరలోకంలో ఉపయోగపడతాయి. ధనంజయా! దుశ్శాసనుడు ద్రౌపదిని తాకి, ఆమెను అపవిత్రం చేశాడు. దానితో మన సంతానజ్యోతి నశించింది. పరపురుషుడు తాకిన స్త్రీకి పుట్టిన

సంతానం దేని కుపయోగ పడుతుంది?" అర్జునుడిలా అన్నాడు. "భారతా! హీనుడు పరుషంగా మాటాడినా, మాటాడకపోయినా ఉత్తమపురుషులు వాటికి సమాధానం చెప్పరు. ప్రతిక్రియ తెలిసినా కూడా, సత్పురుషులు ఇతరుల ఉపకారాలనే స్మరిస్తారు, కానీ శత్రుత్వాన్ని కాదు. అటువంటి సజ్జనులే సమ్మానాలను పొందుతారు."

భీముడిలా అన్నాడు. "రాజా! యుధిష్ఠిరా! ఇక్కడున్న శత్రువుల నందరినీ ఇక్కడే చంపివేస్తాను. ఇక్కడనుండి లాగి సమూలంగా నాశనం చేస్తాను. భారతా! ఇక్కడ వివాదాలు, ఉత్తరప్రత్యుత్తరాలు అవసరం లేదు. ఈరోజే ఇక్కడే అందరినీ చంపుతాను. ఈ భూమిని నీవే పాలించు." తన తమ్ములతో కలిసి నిలిచి ఉన్న భీము డీ విధంగా పలికి మృగాలమధ్య నిలిచిన సింహంవలె పదేపదే శత్రువుల వైపు చూడసాగాడు. శత్రువులవైపే చూస్తున్న భీమును, అనాయాస కార్యసాధకుడైన అర్జునుడు శాంతింపజేస్తున్నాడు. అయితే పరాక్రమశాలి అయిన భీముడు తనలోతాను దహించుకొని పోతున్నాడు. రాజా! ఆ సమయంలో క్రోధావిష్టుడైన భీముని కర్ణాదిరంధ్రాలనుండీ రోమకూపాలనుండీ పొగ, రవ్వలతో కూడిన అగ్ని వెలువడింది. బొమముడిపాటుతో నున్న ఆ భీమసేనుని ముఖం చూడటంకూడా కష్టంగా ఉంది. ప్రళయకాలయమునివలె కనిపించాడు ఆ భీముడు. అప్పుడు భుజశాలి అయిన భీమసేనుని ఒక చేతితో ఆపి ధర్మరాజు 'ఇది వద్దు శాంతంగా ఉండు' అని పలికాడు. కోపంతో కన్నెఱ్ఱ చేసిన మహాబాహువైన భీముని ఆపి ధర్మరాజు చేతులు జోడించి పెదనాన్న అయిన ధృతరాష్ట్రుని సమీపించాడు.

73. యుధిష్ఠిర ధృతరాష్ట్ర సంభాషణము.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. "రాజా! నీవే మా ప్రభువువు. మేమేం చేయాలో ఆదేశించండి. నీమాటమేరకే ఎప్పుడూ నిలవాలనుకొంటున్నాము." ధృతరాష్ట్రు డిలా అన్నాడు. "అజాతశత్రూ! నీకు నిర్విఘ్నంగా మేలు కలుగుతుంది. నా ఆదేశంతో మీరు ఓడిపోయిన ధనాన్నంతా తీసికొని మీ రాజ్యానికి క్షేమంగా పోయి పరిపాలించుకోండి. వృద్ధుడనైన నేను ఇదే శాసిస్తున్నాను. గ్రహించండి. నా ఈ మాటలు మీకు హితాన్ని, పరమశ్రేయస్సునూ కలిగిస్తాయి. నాయనా! యుధిష్ఠిరా! నీకు ధర్మసూక్ష్మాలు తెలుసు. మహాప్రాజ్ఞా! నీవు వినయశీలుడవు. పెద్దలను సేవించేవాడవు. భారతా! బుద్ధి ఉన్నచోటే శాంతి ఉంటుంది. ప్రశాంతంగా ఉండు. కొయ్యమీదనే గొడ్డలిప్రేటు కాని, రాళ్ళమీదనో, లోహంమీదనో అది పడదు.

ఉత్తమపురుషులు శత్రుత్వాలను మరచిపోతారు. గుణాలనే చూస్తారు. అవగుణాలను చూడరు. ఎవ్వరితోను శత్రుత్వం పెట్టుకోరు. ఇతరుల సత్కర్మలనే తలచుకొంటారు కానీ కీడు జరిగినా తలచుకోరు. ఇతరులకు మేలే చేస్తారు కానీ ప్రతీకారాలకు దిగరు. యుధిష్ఠిరా! హీనమానవులు ప్రథమ సంభాషణలో కూడా కటువుగా మాటాడుతారు. ఇతరులు కటువుగా పలికితే కటువుగా ప్రత్యుత్తర మిచ్చేవారు మధ్యములు. అయితే ధీరులైన ఉత్తములు ఎప్పుడూ ఇతరులు కఠినంగా మాటాడినా మాటాడకపోయినా పరుషవచనాలు కానీ, అహితవచనాలు కానీ పలుకరు. సత్పురుషులు తమ అనుభవాన్ని బట్టి ఇతరుల మంచిచెడులను కూడా అవగాహన చేసికొని వారు చేసిన మంచిపనులనే గుర్తుంచుకొంటారు కాని చెడ్డపనులను గుర్తుచేసికొనరు. సజ్జనులు పెద్దల హద్దులను అతిక్రమించరు. వారి దర్శనమే అందరికీ ఆనందకారణం. కౌరవపాండవుల సమాగమంలో నీవు పెద్దమనిషివలెనే ప్రవర్తించావు. నాయనా! దుర్యోధనుడి కఠినప్రవర్తనను మనస్సులో పెట్టుకొనవద్దు. గుణగ్రాహివై మీ అమ్మ గాంధారిని, గ్రుడ్డివాడిని ముసలివాడనైన నీతండ్రిని నన్ను మనస్సులో పెట్టుకో. మిత్రులందరితో కలవాలనీ, నా కుమారుల బలాబలాలను చూడాలనీ తలచి నేను బాగా ఆలోచించి కూడా జూదాన్ని జరగనిచ్చాను. ఆపే ప్రయత్నం చేయలేదు. రాజా! నీవు పాలకుడవై సర్వశాస్త్రవేత్త, ధీమంతుడు అయిన విదురుడు మంత్రిగా ఉండగా కురువంశ మెప్పుడూ శోచనీయం కాకూడదు. అజాతశత్రూ! నీలో ధర్మం, అర్జునునిలో ధైర్యం, భీమసేనునిలో పరాక్రమం, పురుషోత్తములయిన నకులసహదేవులలో శ్రద్ధ, గురుశుశ్రూష ఉన్నాయి. నీకు మేలు జరుగుతుంది. నీవు ఖాండవప్రస్థానికి వెళ్ళు. దుర్యోధనాది సోదరులతో స్నేహంగా ఉండు. మనసును ధర్మంమీద నిలుపు." ధృతరాష్ట్రుడిలా అన్న తరువాత యుధిష్ఠిరుడైన ధర్మరాజు పెద్దల అనుమతితో సోదరులతో కలిసి నిష్క్రమించాడు. మేఘాలవలె ధ్వనించే రథాలపై ద్రౌపదితో పాటు కూర్చొని పాండవులు ప్రసన్నమనస్కులై, శ్రేష్ఠనగరమైన ఇంద్రప్రస్థానికి బయలుదేరారు.

74. దుర్యోధనుడు పాండవులను మరల జూదమునకు పిలిపించుటకు ధృతరాష్ట్రుని ఒప్పించుట.

ధీమంతుడయిన ధృతరాష్ట్రుడు పాండవులు వెళ్లటానికి అనుమతించాడని తెలిసి దుశ్శాసనుడు వెంటనే అన్న దగ్గరకు పోయాడు. అమాత్యులతో కలిసి ఉన్న దుర్యోధనుని సమీపించి దుఃఖార్తితో భరతశ్రేష్ఠునితో దుశ్శాసనుడిలా అన్నాడు. "మహారథులారా!

మనం కష్టపడి ధనాన్ని సాధించాం. కానీ ఈ ముసలి అంతా నాశనం చేస్తున్నాడు. ధనాన్ని అంతా శత్రువులపాలు జేశాడు. గ్రహించండి." ఆ తర్వాత అభిమానవంతులైన దుర్యోధనుడు, కర్ణుడు, సౌబలుడైన శకుని పాండవులపై ప్రతీకారం తీర్చుకొనటానికి అందరూ కలిసి ఆలోచించారు. ఆపై తొందరగా వెళ్లి ధృతరాష్ట్రునితో మధురంగా ఇలా అన్నారు.

(దుర్యోధనుడిలా అన్నాడు. "లోకంలో అర్జునునితో సాటిరాగల విలుకాడు లేడు. రెండు భుజాలు గల ఈ అర్జునునకు వేయి బాహువులు గల ఆ కార్తవీర్యార్జునుడే సాటి. అర్జునుడు గతంలో ఊహకందని సాహసకృత్యాల నెన్నింటినో చేశాడు. రాజా! విను. ఆ అర్జునుడు ద్రుపదుని నగరంలోనూ, ద్రౌపదీస్వయంవర సందర్భంలోనూ ఇతరులకు అసాధ్యమైన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. ఆ అర్జునుడు కోపించిన రాజులనందరినీ చూచి, ఎక్కడివారినక్కడే నిలువరించి తానొక్కడై జయించాడు. అప్పుడు కర్ణుడు మొదలుగా గల రాజులందరితో యుద్ధం చేసి గెలిచి, పరాక్రమబలంతో శుభప్రద అయిన ద్రౌపదిని పొందాడు. అది గతంలో సర్వక్షత్రియసమూహంలో భీష్ముడు అంబను గెలిచిన రీతిగా అనిపించింది. తరువాత ఒకసారి అర్జునుడు ఒంటరిగా తీర్థయాత్రకు వెళ్ళాడు. ఆ సమయంలో నాగలోకానికి పోయి పరమ సౌందర్యవతి అయిన నాగకన్యక ఉలూపిని ఆమె కోరికపై యథా శాస్త్రంగా పరిణయమాడాడు. ఆ తరువాత గోదావరీ, వేణ్ణా, కావేరీ నదులలో స్నానమాడాడు. అర్జునుడు సముద్రతీరంలోని కుమారతీర్థానికి పోయి తన పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ మకరరూపాలు ధరించిన అయిదుగురు అప్సరసలను బలపూర్వకంగా ఉద్ధరించాడు. ఆ తరువాత కన్యాకుమారీ తీర్థానికి పోయి ఆపై వెనుదిరిగి ద్వారకకు వెళ్ళాడు. అక్కడ కృష్ణుని ఆదేశంతో ఫాల్గునుడు సుభద్రను తీసికొని, రథంపై కూర్చొనబెట్టుకొని, తన నగరానికి వెళ్ళిపోయాడు.

మహారాజా! ఆ అర్జునుని సాహసాన్ని ఇంకా చెపుతాను విను. అగ్నిదేవుడు యాచించగా ఖాండవవనాన్ని ఆయనకిచ్చాడు. రాజా! అర్జునుడు ఇచ్చే ఇవ్వగానే అగ్ని ఖాండవవనాన్ని దహింపనారంభించాడు. రాజేంద్రా! అగ్నిదేవుడు ఖాండవవనాన్ని దహింప నారంభించినప్పుడు ఆ అగ్ని ఇచ్చిన రథాన్ని, వింటినీ, బాణాలను కవచాన్ని స్వీకరించి మహాబలుడై ప్రభావశాలియై అర్జునుడు ఆ అగ్నిని రక్షింపసాగాడు. ఆ విషయం విని మహేంద్రుడు మేఘాలకు ఆదేశాలనిచ్చాడు. ఆయన ఆదేశం మేరకు మేఘాలు అతివృష్టిగా కురిశాయి. అప్పుడు అర్జునుడు ఆకాశంలో అన్నివైపుల శరసమూహాలను ప్రయోగించి మేఘాలను వారించాడు. అది ఆశ్చర్యం. మేఘాలు నిరోధింపబడిన విషయం విని దేవేంద్రుడు క్రుద్ధుడై తెల్లని ఏనుగునెక్కి సర్వదేవగణాలు తనచుట్టు నిలువగా ఖాండవరక్షణకై అర్జునునితో యుద్ధం చేయటానికి వెళ్ళాడు. అప్పుడు రుద్రులు, మరుత్తులు,వసువులు, అశ్వినులు, ఆదిత్యులు, సాధ్యులు, విశ్వేదేవులు, గంధర్వులు, తదితర దేవగణాలు ఒక్కటిగా కలిసి అర్జునుని చంపాలని వచ్చారు. ఆ విబుధేంద్రులందరూ తమ తేజస్సుతో వెలుగొందుతున్నవారు. శస్త్రాస్త్రశాస్త్రసంపన్నులు. తర్వాత ఆ దేవగణాలన్నీ అర్జునునితో యుద్ధం చేసి, అతనిని యుద్ధంలో

గెలవటం అసాధ్య మని తెలిసికొని అర్జునుని బాణఘాతాలు తిని శాంతించాయి. ప్రళయకాలంలో వినాశసూచకంగా కనిపించే అపశకునాలన్నీ ఆ సమయంలో కనిపించాయి. ఆ తరువాత దేవగణాలన్నీ అర్జునుని మీదికి ఉరికాయి. కానీ అర్జునుడు కలవరపాటు లేకుండా దేవమయమయిన ఆ సేనను చూచి శీఘ్రంగా వాడి అయిన బాణాలను తీసికొని దేవేంద్రుని, దేవతలనూ చూస్తూ ప్రళయకాలయమునివలె నిశ్చలంగా నిలిచాడు.

దేవేంద్రునితో కూడిన దేవగణాలు మానవుడైన ఆ అర్జునునిపై బాణవృష్టిని కురిపించాయి. అప్పుడు మహాతేజస్వి అయిన అర్జునుడు వెంటనే గాండీవాన్ని చేతబట్టి, బాణాలను ప్రయోగించి, దేవగణాల బాణాలను నివారించాడు. మరల మహాబలులయిన దేవతలు అందరూ కోపించి, మానవుడైన సవ్యసాచిపై వివిధశస్త్రవర్షాన్ని కురిపించారు. అప్పుడు దేవతలు కురిపించిన ఆ శస్త్రవృష్టిని, అర్జునుడు వాడి బాణాలతో గగనతలంలోనే రెండేసి, మూడేసి ముక్కలు చేశాడు. అర్జునుడు మరల తీవ్రకోపంతో వింటిని మండలాకారంగా వంచి, తీక్ష్ణబాణాలతో, అన్నివైపుల దేవసమూహాలను గాయపరిచాడు. యుద్ధభూమినుండి పరుగెత్తుతున్న దేవగణాలను చూచి మహాతేజస్వి అయిన దేవేంద్రుడు అర్జునునిపై బాణాలను వెదజల్లాడు. మానవు డయిన అర్జునుడు కూడ దేవాధిపతి అయిన శక్రుని గాయపరిచాడు. అప్పుడు దేవేంద్రుడు రాళ్ళవాన కురిపించాడు. దానితో అసహనానికి లోనై అర్జునుడు బాణాలతో ఆ రాళ్ళవానను నిరోధించాడు. దేవేంద్రుడు అర్జునుని పరాక్రమాన్ని ఇంకా పరీక్షింపగోరి, ఆ రాళ్ళవానను మరీ ఎక్కువ చేశాడు. ఆ అర్జునుడు మహేంద్రునకు ఆనందాన్ని కల్గిస్తూ, మహావేగంతో ఆ రాళ్ళవానను తన బాణాలతో లయింపజేశాడు. మహేంద్రుడు అర్జునుని చంపదలచినట్లుగా అంగదమనే పర్వతాన్ని చెట్లతో సహా చేతులతో పెరికి అర్జునుని మీదికి విసిరాడు. అప్పుడు అర్జునుడు అగ్నిలా మండుతున్న బాణాలను వేలకొలది నేరుగా లక్ష్యంమీదికి ప్రయోగించి, ఆ శ్రేష్ఠపర్వతాన్ని ధ్వంసం చేశాడు. పార్థుడు యుద్ధంలో బలాన్నంతా వినియోగించి బాణాలతో ఇంద్రుని వారించాడు. మహారాజా! తర్వాత ఇంద్రుడు తేజోబలసమన్వితుడై వీరుడైన ఆ అర్జునుని యుద్ధంలో గెలవటం వీలుకాదని గ్రహించి కుమారుని పరాక్రమానికి చాలా మురిసిపోయాడు. రాజా! ఆ సమయంలో అక్కడ – స్వర్గలోకంలో– అర్జునుని గెలువగల ఖ్యాతిగల వీరు లెవ్వరూ లేకపోయారు. సాక్షాత్తు బ్రహ్మదేవునికయినా అర్జునుని గెలువగల స్థితి లేదు. మహాతేజస్వి అయిన అర్జునుడు యక్షరాక్షస పన్నగాలను తన బాణాలతో చంపి ప్రజ్వరిల్లే అగ్నిలో పడవేశాడు. స్వర్గవాసులనందరినీ ఇంద్రునితో సహా నిలువరించాడు. అప్పుడు అక్కడ అర్జునుని వైపు తేరిచూడగల వారెవ్వరూ లేకపోయారు. గతంలో అమృతంకోసం గరుత్మంతుడు దేవతలను జయించినట్లు అర్జునుడు దేవతలమ గెలిచి ఖాండవ దహనం ద్వారా అగ్నిని తృప్తిపరచాడు. ఈ ప్రకారంగా అర్జునుడు తన పరాక్రమంతో అగ్నిని తృప్తిపరచి రథాన్ని, ధ్వజాన్ని, గుఱ్ఱాలను, దివ్యాస్త్రాలను, మేటివిల్లు అయిన గాండీవాన్ని, అక్షయబాణాలు గల రెండు అమ్ములపొదులను పొందాడు. వీటితోపాటు కీర్తిని, మయుని ద్వారా ఒక సభాభవనాన్ని కూడా పొందాడు.

రాజేంద్రా! ఇంకా చెపుతాను. విను. అర్జునుడు ఉత్తరదిగ్యాత్ర చేసి జంబూద్వీపంలోని తొమ్మిది

ప్రాంతాలను పర్వతనగరాలతో సహా గెలుచుకున్నాడు. భరతర్షభా! జంబూద్వీపాన్నంతా వశం చేసికొని, రాజులనందరినీ బలప్రయోగంతో ఓడించి, పన్నులు వేసి, వివిధ రత్నాలను గైకొని తిరిగి తన నగరానికి వెళ్ళిపోయాడు. భారతా! తరువాత మహాత్ముడైన తన అన్న, యుధిష్ఠిరునితో ఉత్తమయాగమైన రాజసూయాన్ని చేయించాడు. వీటితో పాటు మరెన్నో పరాక్రమకార్యాలను గతంలో చేశాడు. పరాక్రమంలో అర్జునునితో సమానుడైన మగవా డెవ్వడూ లోకంలో లేడు. రాజా! దేవతలు, దానవులు, యక్షులు, పిశాచాలు, నాగులు, రాక్షసులు, కురువంశమహారథులయిన భీష్మద్రోణాదులు, లోకంలోని సమస్తరాజులు, ఇతరవీరులు, మేటి విలుకాండ్రు మరెందరో కలిసి, అర్జునుని చుట్టుముట్టి, సావధానులై నిలిచినా ఒంటరియై యుద్ధంలో నిలిచిన అర్జునుని ఎదిరించలేము. నేను మంచివారిలో మేటి అయిన అర్జునుని గూర్చి నిరంతరం ఆలోచిస్తూ భయంతో ఉద్విగ్నుడ నవుతున్నాను. తండ్రీ! నాకు ప్రతిఇంటిలోనూ పాశాన్ని చేతబట్టిన యమధర్మరాజువలె గాండీవంపై బాణాలు ఎక్కుపెట్టిన అర్జునుడే కనిపిస్తున్నాడు. ఆ భయంలో వేలకొలదీ అర్జునులు నాకు కనిపిస్తున్నారు. ఈ నగరమంతా అర్జునమయంగా నాకు కనిపిస్తోంది. తండ్రీ! భారతా! ఏకాంతంలో కూడా నాకు అర్జునుడే కనిపిస్తున్నాడు. కలలో కూడా అర్జునుని చూచి నిశ్చేష్టుడనై బెదరిపోయి లేస్తున్నాను.అర్జునుడంటే నాకు చాలా భయం. దానితో అకారంతో మొదలయ్యే అశ్వ-అర్థ-అజ పదాలను విన్నా నాకు భయం కలుగుతోంది. తండ్రీ! అర్జునునివలన తప్ప మరే శత్రువీరులన్నా నాకు భయం లేదు. యుద్ధంలో అర్జునుడు ప్రహ్లాదుని అయినా, బలిచక్రవర్తి నయినా చంపగలడు. కాబట్టి మహారాజా! అర్జునునితో యుద్ధమంటే స్వజనవినాశనమే. అర్జునుని ప్రభావ మేమిటో నాకు తెలుసు. అందుకే నిత్యం దుఃఖిస్తున్నాను. పూర్వం దండకారణ్యంలో మారీచునకు రాముడంటే ఎలా భయముండేదో అలాగే నాకు మహావీరుడైన అర్జునుడంటే భయం."

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "నాయనా! అర్జునుడు మహాపరాక్రమశాలి అని నాకు తెలుసు. అతనిని ఎదిరించటం చాలా కష్టం. కాబట్టి అర్జునునికి నచ్చని పని ఏదీ చేయవద్దు. జూదమైనా, శస్త్రయుద్ధమైనా, దుర్భాషణలయినా ఎప్పుడూ చేయవద్దు. అలా జరిగితే మీకు అతనితో యుద్ధం చేయవలసివస్తుంది. కాబట్టి కుమారా! అర్జునునితో స్నేహంతోనే ప్రవర్తించు. భారతా! అర్జునునితో సత్సంబంధమున్న మనిషికి మూడు లోకాలలోనూ భయం కలుగదు. కాబట్టి నాయనా! ఆ అర్జునునితో ఎప్పుడూ స్నేహంతో మెలగు." దుర్యోధనుడిలా అన్నాడు. "కౌరవ్యా! జూదంలో మేము అర్జునునివిషయంలో కపటంగా ప్రవర్తించాం. కాబట్టి మరో ఉపాయంతో వారిని చంపగలిగితే మాకు హితం చేకూరుతుంది." ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "భారతా! పాండవుల విషయంలో ఎటువంటి ఉపాయాన్నీ ప్రయోగించకూడదు. వత్సా! ఇంతకుముందు ఆ పాండవులపై నీవెన్నో ఉపాయాలను ప్రయోగించావు. నీ ఉపాయాల వన్నిటినీ పాండవులు అతిక్రమించారు. కాబట్టి మనవంశం, మన పరిజనం జీవించి ఉండాలంటే నీవు, నీసోదరులూ, మిత్రులు, బంధువులు అర్జునునితో నిత్యం స్నేహంతోనే మెలగాలి." వైశంపాయనుడిలా అన్నాడు. ధృతరాష్ట్రుని మాటలు విని దుర్యోధననరపాలుడు కొద్దిసేపు ఆలోచించి విధిప్రేరణచే ఇలా అన్నాడు.)

"రాజా! పండితుడు, దేవపురోహితుడు అయిన బృహస్పతి ఇంద్రునకు నీతినుపదేశిస్తూ అన్నమాట నీవు వినలేదా? శత్రుసూదనా! మనకు కీడుచేసే శత్రువులను యుద్ధంచేసి అయినా, యుద్ధాన్ని విరమించి అయినా సర్వోపాయాలతో సంహరించాలి. మేము పాండవుల ధనంతో రాజుల నందరినీ సత్కరించి, పాండవులతో యుద్ధం చేస్తే మనకు నగుబాటు ఏముంటుంది? మనలను కాటువేయటానికి వచ్చిన క్రూరసర్పాలను మెడలోనో, పీపుమీదనో ధరించి అలాగే ఎవరు వదిలివేస్తారు? తండ్రీ! పాండవులు కోపించి శస్త్రాలు ధరించి రథాలనెక్కి కుపితసర్పాల వలె మనలను నిశ్శేషంగా చంపివేస్తారు. అర్జునుడు కవచాన్ని ధరించి రెండు అమ్ములపొదులను తగిలించుకొని మాటిమాటికి గాండీవాన్ని ధరించి నిట్టూర్పులు విడుస్తూ అటు ఇటు చూస్తూ వెళ్లాడట. భీముడు పెద్దగదను చేతబట్టి వేగంగా తన రథాన్ని ఎక్కి గబగబా వెళ్ళాడట. అలా మేము విన్నాం. నకులుడు అర్ధచంద్రాకారంలో ఉన్న డాలును, కత్తిని తీసికొని వెళ్ళాడట. సహదేవుడు,యుధిష్ఠిరుడు కూడా వారు చేయదలచిన పనిని సూచిస్తూ వెళ్ళారట. వారంతా శస్త్రాలు మొదలయిన సామగ్రితో నిండిన రథాలనెక్కి శత్రుపక్షరథికులను సంహరించటానికి సేనను సమకూర్చుకొనటానికి వెళ్ళారు. మనం వారిని పరాభవించాం. దానిని వారెప్పుడూ క్షమించరు. ద్రౌపది పడిన కష్టాలకు సహించి వారిలో ఎవరు మిన్నకుండగలరు?

నీకు మేలు జరుగుతుంది. వనవాసాన్ని పందెంగా పెట్టి మరల జూదం ఆడుతాం. ఈ రీతిగా మాత్రమే వారిని లొంగదీసికొనగలం. జూదంలో ఓడిపోతే వారయినా, మేమైనా పండ్రెండు సంవత్సరాలు మృగచర్మాలు ధరించి వనంలో నివసిస్తాం. పదమూడవ సంవత్సరం జనులమధ్యనే అజ్ఞాతంగా గడపాలి. అజ్ఞాతవాసం భంగమయితే మరల పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో నివసిస్తాం. వారైనా, మేమైనా, పందెంతో జూదమాడుతాం. పాచికలు వేసి పాండవులు మరల జూదమాడాలి. రాజా! భరతర్షభా! ఇదే మనకు సర్వోత్తమ కర్తవ్యం. ఈ శకుని అక్షవిద్యలో ఆరితేరినవాడు. మనం మిత్రులను సమకూర్చుకొని బలశాలులూ, ఎదిరింపరానివారూ అయిన సైనికులను బాగా సత్కరిస్తూ రాజ్యాన్ని గట్టి చేసికొందాం. రాజా! పరంతపా! ఒకవేళ వారు పదమూడవ సంవత్సరాన్ని కూడా గడిపి ప్రతిజ్ఞను పూర్తిచేస్తే వారిని యుద్ధంలో ఓడిద్దాం. ఇది మీకు నచ్చుతోందా?" ధృతరాష్ట్రుడిలా అన్నాడు - "పాండవులు ఎంతదూరం వెళ్ళి ఉన్నా సరే వారిని వెనుకకు పిలిపించు. వారువచ్చి ఈ క్రొత్త పందెంతో జూదమాడాలి." వైశంపాయనుడిలా అన్నాడు. అప్పుడు

ద్రోణుడు, సోమదత్తుడు, బాహ్లీకుడు, కృపాచార్యుడు, విదురుడు, అశ్వత్థామ, యుయుత్సుడు, భూరిశ్రవుడు,భీష్ముడు, మహారథి అయిన వికర్ణుడు అందరూ "ఇప్పుడు జూదం వద్దు. ప్రశాంతంగా సాగనీ" అని పలికారు. భవిష్యత్తును భావింపగలవారు, మిత్రులు తమ అనిష్టాన్ని ప్రకటిస్తున్నా, కుమారులపై ప్రేమగల ధృతరాష్ట్రుడు పాండవులను పిలవటానికే ఆదేశించాడు.

75. గాంధారి ప్రబోధమును ధృతరాష్ట్రుడు తిరస్కరించుట.

అప్పుడు రాబోయే అనిష్టాన్ని శంకించి ధర్మపరాయణ అయిన గాంధారి పుత్రస్నేహం వలన ఏర్పడిన శోకంతో భీతిల్లి, ధృతరాష్ట్ర మహారాజుతో ఇలా అన్నది. "దుర్యోధనుడు పుట్టగానే మహామతి అయిన విదురుడు "ఈ బాలుడు వంశనాశకుడు, ఇతనిని వదలి పెట్టుట మంచిది" అని చెప్పాడు. నక్కలాగా అరిచాడు. వీడు తప్పక వంశనాశకుడే. కౌరవులారా మీరు దీన్ని గ్రహించాలి. స్వదోషంతో ఈ వంశాన్ని సముద్రంలో కలపకండి. ప్రభూ! దుర్మార్గులయిన ఈ బాలకుల మాటలను మన్నించకండి. ఈ వంశవినాశానికి మీరు కారణం కాకండి. కట్టిన వంతెనను ఎవరైనా కూలుస్తారా? ఆరిన నిప్పును ఎవరైనా రాజేస్తారా? భరతర్షభా! శాంతించిన కౌంతేయులను మరల రెచ్చగొట్టటమెందుకు? ఆజమీఢా! తమకంతా తెలుసు. గుర్తున్నది కూడా. అయినా మరల గుర్తు చేస్తున్నాను. రాజా! దుర్బుద్ధికి శాస్త్రం మంచి కానీ, చెడు కానీ నేర్పలేదు. మందమతి అయిన బాలుడు వృద్ధులవలె వివేకవంతుడు కాలేడు. తమ పుత్రులను తమరే నడిపించండి. లేకపోతే వారు హద్దుల నతిక్రమించి, భంగపడి బెదరిపోయి తమను వీడిపోతారు. నామాట విని వంశనాశకుడైన వీడిని వదలివేయండి. మహారాజా! పుత్రస్నేహం కారణంగా తమరు చేయవలసిన పనిని చేయలేదు. దాని ఫలితమే ఇది. ఇప్పుడు వంశమే నాశనం కావలసివస్తోంది. శాంతి, ధర్మం, నీతి - వీటితో కలిసిన తమ బుద్ధిని అలాగే నిలుపుకోండి. పొరపాట్లు చేయకండి. **క్రౌర్యంతో సాధించిన సంపద వినాశహేతువు అవుతుంది. మార్దవంతో కూడి ప్రౌఢిమతో సాధించిన లక్ష్మి పుత్రపౌత్రపరంపరగా కొనసాగుతుంది.**" అప్పుడు ధర్మదర్శిని అయిన గాంధారితో ధృతరాష్ట్ర మహారాజు 'ఈ వంశం నాశనమైనా సరే నేను దుర్యోధనుని వారించలేను. వీరు కోరుకొన్నట్లే జరగనీ! పాండవులు తిరిగి రావలసినదే. నాకుమారులు ఆ పాండవులతో మరల జూదమాడవలసిందే' అన్నాడు.

76. అనుద్యూతమున ధర్మరాజు ఓడిపోవుట.

తరువాత చాలా దూరం వెళ్ళిపోయిన యుధిష్ఠిరుని ధీమంతుడైన ధృతరాష్ట్రమహారాజు ఆదేశం మేరకు ప్రాతికామి సమీపించి ఇలా అన్నాడు. 'రాజా! యుధిష్ఠిరా! సభ మరల సమాయత్తమై ఉన్నది. తమకై నిరీక్షిస్తోంది. తమ తండ్రి ధృతరాష్ట్రుడు తమను మరలి వచ్చి జూదమాడమని ఆదేశిస్తున్నాడు.' యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'ప్రాణులు విధిప్రేరణ ననుసరించి శుభాశుభాలను పొందుతున్నారు. వాటిని తప్పించే అవకాశంలేదు. మరల నేను ఆడవలసిన విధి ఉన్నట్లుంది. వృద్ధుడైన ధృతరాష్ట్రమహారాజు ఆదేశాన్ని అనుసరించి జూదానికి మరల ఆహ్వానించటం వంశవినాశకరం. అది తెలిసి కూడా అతిక్రమించలేకపోతున్నాను. **బంగారు జంతువు అసంభవమని తెలిసి కూడా రాముడు బంగారులేడి కోసం వెంటపడ్డాడు. పతనమో, పరాభవమో సంభవించనున్నప్పుడు ఎవని బుద్ధి అయినా విపరీతంగా ఆలోచిస్తుంది.'*** ఆ రీతిగా పలుకుతూ యుధిష్ఠిరుడు సోదరులతో సహా వెనుదిరిగాడు. శకుని మాయ తెలిసి కూడా మరల జూదమాడటానికి వెళ్ళాడు. భరతశ్రేష్ఠులైన ఆ మహారథులు మరల సభలోనికి ప్రవేశించారు. అది చూచి మిత్రుల మనస్సులు కలతపడ్డాయి. ప్రారబ్ధానికి వశులయిన కుంతీ కుమారులు సర్వలోక వినాశ హేతువైన జూదం ఆడటానికి సుఖంగా అక్కడ కూర్చున్నారు.

శకుని ఇలా అన్నాడు. 'భరతర్షభా! వృద్ధుడైన ధృతరాష్ట్ర మహారాజు మీ ధనమంతా మీకు తిరిగి ఇచ్చి, మంచిపని చేశాడు. జూదానికి ఒక్కటే పందెం పెడదాం. విను. మీరు జూదంలో గెలిస్తే మేము పండ్రెండు సంవత్సరాలు మృగచర్మాలను ధరించి అరణ్యవాసం చేస్తాం. పదమూడవ సంవత్సరం మనుష్యుల మధ్యనే ఉంటూ అజ్ఞాతంగా గడుపుతాం. అజ్ఞాతవాసం భంగమయితే మరల పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో గడుపుతాం. మేము మిమ్ము ఓడిస్తే ద్రౌపదితో పాటు మీరు పండ్రెండు సంవత్సరాలు మృగచర్మధారులై అరణ్యవాసం చేయండి. పదమూడవ సంవత్సరం మనుష్యుల మధ్యనే అజ్ఞాతంగా గడపండి. అజ్ఞాతవాసం భంగపడితే మరల పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో గడపండి. పదమూడవ సంవత్సరం కూడా ముగిస్తే మీరైనా, మేమైనా యథోచితంగా స్వరాజ్యాన్ని మరల పొందవచ్చు. భారతా! యుధిష్ఠిరా! ఈ నిర్ణయంతో రా! మరల పాచికలు వేసి మాతో జూదమాడు,

---

* అసంభవవే హేమమయస్య జంతోఃతథాపి రామో లులుభే మృగాయ ।
ప్రాయఃసమాసన్నవరాభవానాం ధియో విపర్యస్తతరా భవంతి ॥ 15

అది విని సభ్యులందరూ సభలో తమ చేతులు పైకెత్తి ఉద్విగ్నచిత్తులై కలవరపాటుతోఇలా అన్నారు. 'అయ్యో! బంధువులైనా యుధిష్ఠిరునకు తనమీదికి వస్తున్న ప్రమాదాన్ని తెలియజేయటం లేదు. ఈ భరతశ్రేష్ఠునకు స్వబుద్ధితో ఈ విషయం అర్థమవుతున్నదో లేదో!'

లోకులు అనుకొంటున్న మాటలను వింటూ కూడా యుధిష్ఠిరనరాధిపుడు మొగమోటమివలన, ధృతరాష్ట్ర వచనపాలన మను ధర్మదృష్టివలనా మరలా జూదానికి సిద్ధపడ్డాడు. మహాబుద్ధి గల యుధిష్ఠిరుడు అంతా తెలిసికూడా 'కురుకుల వినాశం సమీపించింది' అని ఆలోచిస్తూ జూదానికి సమాయత్తమయ్యాడు. యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'శకునీ! స్వధర్మపరిపాలనలో ఆసక్తి గల నావంటి రాజు జూదానికి పిలవబడి మరలిపోతాడా! నీతో నేను ఆడుతున్నాను.'

('భారతా! యుధిష్ఠిరుడు ప్రారబ్ధానికి లోనయ్యాడు. భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, యుయుత్సువు, కృపుడు, సంజయుడు, గాంధారి, పృథ, భీమార్జున నకుల సహదేవులు, వికర్ణుడు, ద్రౌపది, అశ్వత్థామ, సోమదత్తుడు, బాహ్లీకుడు వారిస్తున్నా ఆ ధర్మరాజు జూదం నుండి మరలలేదు.)

శకుని ఇలా అన్నాడు - 'మాదగ్గర గోవులు, గుఱ్ఱాలు, ఆవులు, మేకలు, గొఱ్ఱెలు, ఏనుగులు, డబ్బు, బంగారం, దాసదాసీజనులు అన్నీ ఉన్నాయి. అయినా పాండవులారా! వనవాసమొక్కటే మా పందెం. మీరైనా మేమైనా ఓడిపోతే అరణ్యాలలో నివసించాలి. పదమూడవ సంవత్సరాన్ని జనులమధ్యనే అజ్ఞాతంగా గడపాలి. ఈ నిర్ణయంతో జూదమాడుదాం. వనవాసాన్ని పందెంగా పెట్టి ఒక్కమారు పాచికలు విసరగానే ఆట ముగుస్తుంది.' ఆ నియమాన్ని యుధిష్ఠిరుడు అంగీకరించాడు. ఆ తరువాత శకుని పాచికను చేతబట్టి విసిరి 'నేనే గెలిచాను' అని యుధిష్ఠిరునితో అన్నాడు.

77. పాండవుల ప్రతిజ్ఞలు.

పరాజితులైన పాండవులు వనవాసదీక్షను స్వీకరించి క్రమంగా అందరు మృగచర్మాలు ఉత్తరీయాలుగా స్వీకరించారు. రాజ్యాన్ని పోగొట్టుకొని, మృగచర్మాలు ధరించి వనవాసానికి బయలుదేరిన అరిందములైన ఆ పాండవులను చూచి దుశ్శాసనుడిలా అన్నాడు. 'మహానుభావుడైన దుర్యోధనమహారాజు తేజస్సు పెరిగి రాజ్యం ఏకచక్రాధిపత్యమయింది. పాండవులు పరాజితులై ఘోరవిపత్తి పాలయ్యారు. ఈనాడే ఆ పాండవులు సమతలమార్గాలలో,

బీళ్ళలో పయనిస్తూ అరణ్యాలకు వెళ్ళిపోయారు. మనమిప్పుడు శత్రువుల కన్న గుణానుసారంగా గొప్పవారం. ఉన్నతస్థితిలో నున్నవారం. కుంతీకుమారులు సుఖాలను, రాజ్యాన్ని కోలుపోయి చిరకాలమూ అంతంలేని దుఃఖనరకంలో పడిపోయారు. ధనమదంతో ధార్తరాష్ట్రులను పరిహసిస్తున్న ఆ పాండవులు పరాజితులై ధనాన్ని కూడా కోలుపోయి అరణ్యానికి వెళ్తున్నారు. శకునితో చేసికొన్న ఒడంబడిక మేరకు మృగచర్మాలను ధరించి విచిత్రకవచాలను, ప్రకాశవంతాలయిన దివ్యవస్త్రాలను విసర్జించారు. మావంటి మగవారు మూడులోకాలోనూ లేరని నిత్యమూ భావించుకొన్న పాండవులు కాలవైపరీత్యం వలన మొలకెత్తని నువ్వులవలె నిర్వీర్యులై తమస్థితిని తాము తెలిసికొనబోతున్నారు. అభిమానవంతులు, బలిష్ఠులు అయిన పాండవులు యజ్ఞదీక్షితులు కారు. అయినా యాగదీక్షలో మహాత్ములు ధరించే మృగచర్మాన్ని ధరించారు. కేవలం ఆటవికులు మృగచర్మధారణ చేసినట్లుంది.

ధీమంతుడు అయిన ద్రుపదుడు తన పుత్రిని పాంచాలిని పాండవులకివ్వటం తగిన పనికాదు. ఆమె భర్తలు నపుంసకులయ్యారు. యాజ్ఞసేనీ! పలుచనిమేలి వస్త్రాలు ధరించవలసిన పాండవులు, జింకచర్మాన్ని ఉత్తరీయంగా వేసికొని నిర్ధనులై ప్రతిష్ఠాహీనులై అరణ్యంలో తిరుగుతుంటే నీకు ప్రీతి ఎలా కలుగుతుంది? మరెవరినైనా నీకిష్టమైనవానిని వరించు. ఈ కౌరవులందరూ శమదమాలు గలవారు. ధనసంపన్నులు. కలిసి ఉండేవారు. వీరిలో ఎవరినైనా భర్తగా వరించు. ఈ కాలవైపరీత్యం నిన్ను పీడించదు. మొలవని నువ్వులులాగా, తోలు మృగం లాగా, గింజలులేని 'కాకయవ ధాన్యం' పాల్లులాగా పాండవుల జన్మ నిష్ప్రయోజనమయినది. మొలవని నువ్వులను ఆశ్రయిస్తే శ్రమ అంతా వ్యర్థం. పతితులయిన పాండవులను సేవిస్తే బ్రతుకంతా వ్యర్థం.' ఈవిధంగా దుర్మార్గుడయిన దుశ్శాసనుడు పాండవులు వినేటట్లు నీచంగా మాట్లాడాడు. ఆ మాటలు విని భీమసేనుడు తీవ్రంగా కోపించి, హిమాలయాల్లో గుహలో ఉన్న సింహం నక్క మీదికి వచ్చినట్టు దుశ్శాసనుని సమీపించి, కోపంతో అతనిని ఆపి, పెద్దగా బెదిరిస్తూ ఇలా అన్నాడు.

'క్రూరుడా! పాపాత్ములవలె నీవు నీచంగా మాటాడుతున్నావు. శకుని ప్రదర్శించిన మాయా విద్యాప్రభావంతో రాజమండలిలో నిన్ను నీవు ప్రశంసించుకొంటున్నావు. మాటలబాణాలతో మా మర్మస్థానాలను పీడిస్తున్నావు. యుద్ధంలో నీ మర్మస్థానాలను బ్రద్దలు చేస్తూ నీ ఈ మాటలను నీకు గుర్తు చేస్తాను. క్రోధానికి, లోభానికి లోనయి నీకు రక్షకులై నీ వెన్నంటి నడుస్తున్నవారిని కూడా యమసదనానికి పంపిస్తాను.' మృగచర్మాన్ని ధరించి భీమసేను డిలా మాటాడుతుంటే కౌరవుల మధ్యలో నిలిచి దుశ్శాసనుడు సిగ్గులేకుండా

"ఎద్దు!ఎద్దు!" అని భీముని పరిహసిస్తూ, పిలుస్తూ నృత్యం చేయసాగాడు. అప్పుడు ధర్మజుడు భీముని నిరోధించాడు.

భీమసేనుడిలా అన్నాడు. 'దుశ్శాసనా! మోసంతో ధనాన్ని సంపాదించి తనను తాను ప్రశంసించుకొనే నీకే ఇటువంటి క్రూర, నీచ వచనాలు పలకటం సాధ్యం. పృథాకుమారుడైన ఈ వృకోదరుడు యుద్ధంలో నీ గుండెలు చీల్చి నీ నెత్తురు త్రాగకపోతే పుణ్యలోకాలను పొందలేడు. నీకొక మాట చెప్తున్నాను. త్వరలోనే సమస్త ధనుర్ధరులు చూస్తూ ఉండగానే ధార్తరాష్ట్రుల నందరినీ యుద్ధంలో చంపి శాంతి పొందుతాను.' వైశంపాయనుడిలా అన్నాడు. సభనుండి పాండవులు నిష్క్రమించే సమయంలో మందమతి అయిన దుర్యోధనుడు ఆనందపరవశుడై సింహంవలె నడుస్తున్న ఆ భీమసేనుని గమనాన్ని సరదాగా తన నడకతో అనుకరించాడు. అది చూచి తన శరీరాన్ని సగభాగం వెనుకకు త్రిప్పి "మూఢుడా! దుశ్శాసనుని నెత్తురు త్రాగటంతో నా కర్తవ్యం ముగియదు. త్వరలోనే నిన్ను సబాంధవంగా యమలోకానికి పంపి, నీవు చేస్తున్న హేళనను గుర్తుచేసి అప్పుడు బదులిస్తాను" అని అన్నాడు. ఈ ప్రకారం తనకు జరుగుతున్న అవమానాన్ని చూచి బలిష్ఠుడు, అభిమానవంతుడు అయిన భీముడు కోపాన్ని నియంత్రించుకొని యుధిష్ఠిరుని వెనుక నడుస్తూ కౌరవసభలో ఇలా అన్నాడు. 'నేను దుర్యోధనుని చంపుతాను. అర్జునుడు కర్ణుని చంపుతాడు. ఈ జూదరిశకునిని సహదేవుడు చంపుతాడు. సభామధ్యంలో మరొక పెద్దమాట అంటున్నాను. దేవతలు కూడా నామాటను వమ్ముచేయరు. కౌరవపాండవుల మధ్య యుద్ధం జరిగినపుడు ఈసారి దుర్యోధనుని గదతో చంపివేస్తాను. రణభూమిలో నేలపై పడద్రోసి ఈ పాపాత్ముని తలను కాలితో తన్ని నిలబడతాను. వాచాలుడు, దుర్మార్గుడు, క్రూరుడు అయిన ఈ దుశ్శాసనుని నెత్తుటిని సింహంవలె త్రాగుతాను.'

అర్జునుడిలా అన్నాడు. 'భీమా! సజ్జనులు తాము చేయదలచుకొన్న దానిని మాటలతో చెప్పరు. నేటికి పదునాలుగవ సంవత్సరంలో జరుగబోయేది జనం చూస్తారు.' భీమసేనుడిలా అన్నాడు. 'ఈ నేల దుర్యోధన, కర్ణ, శకుని, దుశ్శాసనుల నెత్తురు త్రాగుతుంది. అర్జునుడిలా అన్నాడు. మనలో తప్పులనే చూస్తూ, మన బాధలను చూచి ఆనందిస్తూ, కౌరవులకు సలహాలనిస్తూ, ప్రగల్భాలు పలుకుతున్న ఈ కర్ణుని నీ ఆజ్ఞతో రణరంగంలో చంపివేస్తాను.' భీమునకు ప్రియాన్ని కల్గించాలని అర్జునుడిలా ప్రతిజ్ఞ చేస్తున్నాడు. 'కర్ణుని అతని అనుచరులను యుద్ధంలో బాణాలతో సంహరిస్తాను. మతిచెడి, మరెవరైనా నాకెదురునిలిచి యుద్ధం చేస్తే వారినందరినీ నా బాణాలతో యమలోకానికి పంపుతాను. హిమాలయం కదిలినా,

సూర్యుడు తేజస్సు కోలుపోయినా, చంద్రుని చల్లదనం నశించినా నామాట తప్పదు. నేటికి పదునాలుగవ సంవత్సరంలో దుర్యోధనుడు మనలను సత్కరించి, రాజ్యమివ్వకపోతే నేను చెప్పినట్టు జరిగి తీరుతుంది.' అర్జునుడిలా అనగానే అందగాడు, పరాక్రమశాలి అయిన సహదేవుడు తన విశాలబాహువులను పైకెత్తి కోపంతో కళ్లెఱ్ఱచేసి, పాములా బుసకొడుతూ శకునిని చంపదలచి ఇలా అన్నాడు.

'గాంధారుల కీర్తిని నాశనం చేస్తున్న మూఢుడా! ఇవి పాచికలని నీవనుకొంటున్నావు. కానీ ఆ రూపంలోని తీవ్రబాణాలవి. యుద్ధానికి నీ అంతట నీవే ఎన్నుకొన్నావు. భీమసేనుడు నిన్నూ, నీ బంధువులనూ ఉద్దేశించి పలికిన మాటలను నేను తప్పక చేసి చూపిస్తాను. ఆత్మరక్షణకు అన్ని ఏర్పాట్లు చేసుకో. సౌబలా! క్షాత్రధర్మాన్ని పాటించి నీవు రణరంగంలో నిలిస్తే నేను నిన్నే నీ బాంధవులతో సహా యుద్ధంలో త్వరగా చంపివేస్తాను.' రాజా! సహదేవుని మాటలు విని రాజులలో అందగాడైన నకులుడు కూడా ఇలా అన్నాడు. 'దుర్యోధనుడి కిష్టమైన రీతిగా ప్రవర్తించాలని ధార్తరాష్ట్రులు ఈ ద్యూతసభలో యజ్ఞసేనుని పుత్రిక అయిన ద్రౌపదిని అనరాని మాట లన్నారు. దుష్ప్రవర్తనతో కాలప్రేరితులై చావగోరుతున్న వారిని అందరనూ యమలోకానికి పంపిస్తాను. ధర్మరాజు ఆదేశంతో ద్రౌపదికి ప్రియాన్ని కల్గిస్తూ త్వరలో ఈ భూమిని ధార్తరాష్ట్రరహితంగా చేస్తాను. ఈ రీతిగా పురుషసింహాలు, మహాబాహువులయిన ఆ పాండవులు చాలా ప్రతిజ్ఞలు చేసి ధృతరాష్ట్రుని సమీపించారు.

78. యుధిష్ఠిర వనప్రస్థావము.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'భరతవంశస్థులందరి దగ్గర సెలవు తీసికొంటున్నాను. వృద్ధుడైన భీష్ముడు, రాజైన సోమదత్తుడు, మహారాజైన బాహ్లికుడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, విదురుడు, ధృతరాష్ట్రుడు, ధార్తరాష్ట్రులు, యుయుత్సుడు, సంజయుడు, ఇతర నరపాలురు, సభాసదులు – అందరి దగ్గర సెలవు తీసికొని వెళ్తున్నాను. తిరిగివచ్చి దర్శనం చేసికొంటాను.' అప్పుడు సిగ్గుతో కుంచించుకొనిపోయిన కౌరవ లందరు యుధిష్ఠిరునితో ఏమీ అనలేకపోయారు. మనస్సులలోనే ఆ ధీమంతునకు శుభం కలగా లనుకొన్నారు. విదురుడిలా అన్నాడు. "కౌంతేయులారా! రాజకుమారి అయిన ఈ కుంతి అరణ్యాలలో ఉండదగదు. సుకుమారి, వృద్ధురాలు అయిన ఈమె ఎప్పుడూ సుఖాల ననుభవించదగినదే. కాబట్టి ఈమె ఇక్కడే మా ఇంటిలో గౌరవంగా ఉంటుంది. ఇది మీకు తెలిసినది గదా! మీరు ఆరోగ్యంగా ఉండాలని కోరుకొంటున్నాను." పాండవులిలా

అన్నారు. "అనఘా! అలాగే! నీవు చెప్పినట్లే చేస్తాం. నీవు మా పినతండ్రివి. తండ్రివంటివాడివి. మేము నీ శరణులో ఉన్నవారం. పండితా! నీవు ఆజ్ఞాపించినట్లే చేస్తాం. మాకు పరమగురువు నీవే. మహామతీ! మా కర్తవ్యం మరేదైనా ఉంటే ఆజ్ఞాపించు." విదురుడిలా అన్నాడు. "భరతశ్రేష్ఠా! యుధిష్ఠిరా! మరొక విషయం తెలిసికో. అధర్మంవలన ఓడిపోయినవారు తన పరాజయానికి దుఃఖించకూడదు. నీవు ధర్మం తెలిసినవాడవు. అర్జునుడు యుద్ధంలో గెలువగలవాడు. భీమసేనుడు శత్రుసంహారం చేయగలవాడు. నకులుడు అర్థాన్ని సమకూర్చగలవాడు. సహదేవుడు సహనంగలవాడు. ధౌమ్యుడు బ్రహ్మజ్ఞులలో శ్రేష్ఠుడు. మీ సహధర్మచారిణి అయిన ద్రౌపది ధర్మార్థాలలో నేర్పుగలది. మీరు ఒకరంటే మరొకరు ఇష్టపడేవారు. మిమ్ములను చూస్తే అందరు ముచ్చటపడతారు. మిమ్ము ఎవ్వరూ విడదీయలేరు. లోకంలో మిమ్ములను ఇష్టపడనివాడు లేడు.

భారతా! నీ సహనమే నీకు సర్వశుభాలనూ సమకూర్చగలది. శత్రువు ఇంద్రుడంతటివాడైనా నీ సహనం ముందు నిలువలేడు. గతంలో మేరుసావర్ణి హిమాలయాలలో నీకు ఉపదేశించాడు. వారణావతంలో కృష్ణద్వైపాయనుడు, భృగుతుంగంలో పరశురాముడు, దృషద్వతిలో సాక్షాత్తు శంకరుడు, అంజనపర్వతంపై అసితమహర్షి నీకు జ్ఞానోపదేశం చేశారు. కల్మాషినదీ తీర్థంలో నున్న భృగుమహర్షికి నీవు శిష్యుడవు అయ్యావు. నారదమహర్షి ఎప్పుడూ నిన్ను కనిపెట్టి ఉంటాడు. ఈ ధౌమ్యుడు నీకు పురోహితుడు. మహర్షుల ద్వారా సంక్రమించిన ఆ పారలౌకిక విజ్ఞానాన్ని నీవు ఎప్పుడూ విడువవద్దు. యుధిష్ఠిరా! నీవు నీ బుద్ధితో ఇలానందనుడైన పురూరవుని కూడా జయించగలవు. నీవు శక్తితో రాజులందరినీ, ధర్మసేవనంలో ఋషుల నందరినీ మించిపోగలవు. విజయోత్సాహాన్ని ఇంద్రుని ద్వారా, క్రోధనివారణను యమధర్మరాజు ద్వారా గ్రహించు. అలాగే దానంలో కుబేరుని, సంయమనంలో వరుణుని ఆదర్శంగా తీసుకో. ఇతరులకై తనను తగ్గించుకోవటం, సౌమ్యత్వం, జీవనప్రదానం నీటిద్వారా గ్రహించు. భూమినుండి సహనాన్ని, సూర్యమండలం నుండి తేజస్సును, వాయువు నుండి బలాన్ని, సమస్త భూతాలనుండి ఆత్మసంపదను పొందు. నీకు ఆరోగ్యం సమకూరుగాక. నీకు శుభం చేకూరుగాక. వనవాసం నుండి మరలివచ్చిన మిమ్ము చూడగలను. యుధిష్ఠిరా! ఆపత్కాలంలో, ధర్మార్థాలకు సంబంధించిన క్లిష్టపరిస్థితులలో సమస్తకార్యాలలో ఆయా సమయాలకు తగినట్లు కర్తవ్యాన్ని పరిపాలించు. కౌంతేయా! నీకు చెప్పవలసినది చెప్పాను. నీకు మేలు జరుగుతుంది. కృతార్థుడవై క్షేమంగా తిరిగి వచ్చినపుడు మిమ్ము చూస్తాం. గతంలో మీరే దోషాలు చేశారో ఎవ్వరికీ

తెలియదుగదా! అది జరగవలసినదే" విదురు డా రీతిగా మాటాడిన తర్వాత సత్యవిక్రముడైన యుధిష్ఠిరుడు భీష్మద్రోణులకు నమస్కరించి బయలుదేరాడు.

79. కుంతీ ద్రౌపదుల సంభాషణము.

వైశంపాయను డిలా అన్నాడు. యుధిష్ఠిరుడు బయలుదేరగానే ద్రౌపది యశస్విని అయిన కుంతిని సమీపించి దుఃఖిస్తూ వనవాసానికి సెలవు తీసికొన్నది. అక్కడున్న ఇతర స్త్రీలకు కూడా తగినరీతిగా నమస్కరించి, దగ్గరకు తీసికొని వనానికి వెళ్ళదలచుకొన్నట్టు చెప్పింది. అప్పుడు పాండవుల అంతఃపురంలో ఆర్తనాదాలు బయలుదేరాయి. బయలుదేరిన ద్రౌపదిని చూచి కుంతి తీవ్రంగా కలతపడుతూ శోకగద్గద మయిన కంఠంతో ఎట్టకేలకు ఇలా అన్నది. "అమ్మా! ఈ విధంగా పెద్దకష్టం కలిగిందని నీవు శోకించవద్దు. నీవు స్త్రీధర్మాల నెరిగినదానవు. శీలాచారాలు గలదానవు. శుచిస్మితా! భర్తలవిషయంలో నీ కర్తవ్యాన్ని నీకు చెప్పగల అర్హత నాకు లేదు. నీవు సాధ్వివి. సద్గుణసంపన్నవు. పుట్టినింటికీ, మెట్టినింటికీ శోభ నిచ్చినదానవు. అనఘా! ఈ కౌరవులు అదృష్టవంతులు. నీ క్రోధాగ్నిలో దగ్ధమైపోలేదు. వెళ్ళు. నీ మార్గానికి ఏ ఆటంకాలు కలుగవు. నా సంకల్పం వల్ల మీకు అభ్యుదయం కలుగుతుంది. విధి ననుసరించి జరిగిన సంగతులవలన ఉత్తమస్త్రీ కలతపడదు. నీ ధర్మాచరణమే నిన్ను రక్షిస్తుంది. త్వరలోనే శ్రేయస్సు నందుకొనగలవు. నాకుమారుడు - సహదేవుని అరణ్యవాసంలో ఎప్పుడూ కనిపెట్టి ఉండు. ధీమంతుడైన ఈ సహదేవుడు ఈ మహాపదలో చిక్కి దుఃఖించకూడదు. కుంతిమాటలు విని కళ్ళలో నీళ్ళు నింపుకొని ద్రౌపది 'అలాగే' అన్నది. అప్పుడామె ఒకే వస్త్రాన్ని ధరించి ఉంది. ఆది కూడా దుమ్ముకొట్టుకొని ఉన్నది. జుట్టు విరబోసికొని ఉంది. ఆ స్థితిలో ద్రౌపది నిష్క్రమించింది. ఆక్రోశిస్తూ వెళ్తున్న ఆ ద్రౌపదిని కుంతి అనుసరించి వచ్చింది. అప్పుడు ఆభరణాలు, విలువయిన వస్త్రాలు కోల్పోయి ఉన్న తన కొడుకుల నందరినీ చూచింది. పాండవులు జింకచర్మాలు ధరించి సిగ్గుతో ముఖాలు దించుకొని ఉన్నారు. చుట్టూ ఉన్న శత్రువులు పరమానందంగా ఉన్నారు. మిత్రులందరూ వారికై శోకిస్తున్నారు. ఆస్థితిలో నున్న తన కొడుకుల నందరినీ సమీపించి ఎంతో వాత్సల్యభావంతో వారిని దగ్గరకు తీసికొని కుంతి శోకంతో విలపిస్తూ ఇలా అన్నది.

"మీరు సద్ధర్మాన్ని పాటించేవారు. మీ సత్ప్రవర్తనమే మీకు ఆభరణం. మీరు ఉన్నతులు, దృఢభక్తులు. దేవతారాధనతత్పరులు. అటువంటి మీకు గొప్ప విపత్తు

కలిగింది. ఏమిటీ విధివిపర్యయం. ఎవరి అనిష్టసంకల్పం, క్రోధం వలన మీకు ఈ స్థితి వచ్చింది? ఎంత ఆలోచించినా తెలియటం లేదు. ఇది నాదోషమే కావచ్చు. ఉత్తమగుణాలు కలిగి ఉన్నా, తీవ్ర దుఃఖాన్ని, కష్టాలను అనుభవింపజేయటానికే నేను మిమ్ము కన్నాను. సంపదలను కోలుపోయి దుర్గమారణ్యాలలో ఎలా జీవిస్తారు? వీర్యం, ధైర్యం, బలం, ఉత్సాహం, తేజస్సు అన్నీ ఉన్నా మీరు బలహీనులయ్యారు. మీకీవిధంగా వనవాస మేర్పడుతుందని తెలిసి ఉంటే మీ తండ్రి మరణించిన తరువాత శతశృంగం నుండి హస్తినాపురానికి వచ్చి ఉండే దాననే కాదు. తపస్సు, మేధ కలిగిన మీతండ్రి ధన్యు డనుకొంటున్నాను. అందుకే పుత్రశోకానికి గురి కాకుండా ఆ రీతిగా స్వర్గలోకగమనాన్ని ప్రియంగా భావించాడు. ఇదేవిధంగా అతీంద్రియజ్ఞాన సంపన్నులై పరమగతిని పొందిన ఆ కళ్యాణి మాద్రి కూడా సర్వవిధాలుగా ధన్యురాలనే భావిస్తున్నాను. ఆమె తన అనురాగం, బుద్ధి, నడవడి – ఈ మూడింటితో నన్ను జయించింది. నాకు జీవితంపై ఆశ కలిగించింది. అందువలననే ఈ తీవ్రక్లేశాన్ని అనుభవించవలసి వస్తోంది. బిడ్డలారా! మీరు మంచివారు. నాకిష్టమైన వారు. నాకు లేక లేక పుట్టినవారు. మిమ్ములను విడిచి ఉండలేను. నేను కూడా అరణ్యానికి వస్తాను. ద్రౌపదీ! నన్ను విడిచి వెళ్తున్నావా? ప్రాణధారణ శాశ్వతం కాదు. ఏదో ఒక రోజు జీవితం ముగియవలసిందే. కానీ బ్రహ్మదేవుడు ఏ పొరపాటు చేశాడో ఏమో! నాకు త్వరగా ముగింపును ఏర్పాటు చేయలేదు. ఆయుష్షు నన్ను విడిచిపెట్టడం లేదు. హా కృష్ణా! ద్వారకావాసీ! ఉపేంద్రా! ఎక్కడున్నావు? ఈ దుఃఖంలోనుండి నన్ను, నరోత్తములయిన వీరినీ ఎందుకు కాపాడవు? నీవు ఆది, అంతం లేనివాడ వనీ' నిన్ను ధ్యానించే నరులను నీవు రక్షిస్తా వనీ అంటుంటారు. అది ఎలా వ్యర్థమయింది? సద్ధర్మాన్ని పాటిస్తూ' మహాత్ముల శీలస్వభావాలను అనుసరిస్తూ, కీర్తిపరాక్రమాలను సేవించే ఈ నా కుమారులు కష్టాల ననుభవింపదగినవారు కాదు. వీరిపై దయ చూపు. ఈ వంశానికి సంరక్షకులై నీతి, అర్థశాస్త్రవేత్తలయిన భీష్మద్రోణ కృపాచార్యాదులు జీవించి ఉండగానే మాకీ విపత్తు ఎలా వచ్చింది? హా! పాండుమహారాజా! ఎక్కడున్నావు? ఎందుకు ఉపేక్షిస్తున్నావు? నీ సత్పుత్రులను శత్రువులు జూదంలో ఓడించి వనవాసాన్ని కల్పిస్తుంటే ఎందుకు ఊరుకున్నావు? సహదేవా! వెనుకకు మరలిరా! మాద్రేయా! నాకు నాశరీరం కన్న నీవంటేనే ఇష్టం. చెడ్డకొడుకువలె నన్ను వీడిపోవద్దు. సత్యాభిసంధు లయిన నీ సోదరులందరు వెళ్ళితే వెళ్ళనీ! నా ప్రాణాలను రక్షించటమనే ధర్మాన్ని నీవు పాటించు."

కుంతి ఇలా విలపిస్తుంటే పాండవులు ఆమెకు అభివాదనాలు తెలిపి, నమస్కరించి,

ఆనందానికి దూరమై వనానికే బయలుదేరారు. విదురుడు విలపిస్తున్న కుంతిని అప్పటికి తగిన కారణాలతో ఓదార్చి, తానుకూడా మెల్లగా వీడుస్తూనే కుంతిని ఇంటికి తీసికొనిపోయాడు.

(ధర్మరాజు బయలుదేరగా అక్కడి ప్రజలందరూ ధర్మరాజును చూడాలన్న తహతహతో మేడలను, విమానశిఖరాలను, అన్ని గోపురాలను, చెట్లను ఎక్కారు. అందరూ ఉదాసీనులై ధర్మరాజును చూచారు. అక్కడి మార్గాలు జనసమూహాలతో నిండి కదలటానికి కూడా వీలులేకపోయింది. అందుకు ప్రజలు అలా పైకెక్కి దీనంగా ధర్మరాజును చూడసాగారు. ధర్మరాజు గొడుగులేకుండా పాదచారియై వెళ్తున్నాడు. రాజోచిత వస్త్రాలు కానీ, ఆభరణాలు కానీ లేవు. నారచీరలను, మృగచర్మాన్ని ధరించి ఉన్నాడు. అటువంటి ధర్మరాజును చూచి ప్రజలు గాయపడిన మనస్సులతో రకరకాలుగా మాటాడసాగారు.

ప్రజలిలా అన్నారు. 'గతంలో ధర్మరాజు వెళుతుంటే చతురంగబలాలతో కూడిన పెద్దసేన అనుసరించేది. ఇప్పుడు ఆ ధర్మరాజును ఆయన సోదరులు నలుగురు ద్రౌపది, పురోహితుడు మాత్రమే అనుసరిస్తున్నారు. ఇంతకుముందు ఖేచరులయిన ప్రాణులకు కూడా ద్రౌపదిని చూడటం సాధ్యమయ్యేది కాదు. ఇప్పుడు రాజమార్గంలోని జనులందరూ చూస్తున్నారు. ద్రౌపది అంగరాగాలను ధరించేది. రక్తచందనాన్ని పూసుకొనేది. ఇప్పుడు వాన, ఎండ, చలి ఆమె శరీరచ్ఛాయను మలినపరుస్తాయి. నిజంగా కుంతిదేవి ఈరోజు ఎంతో ధైర్యాన్ని తెచ్చుకొని కొడుకులతో, కోడలితో మాటాడుతోంది. లేకపోతే ఈ స్థితిలో వారిని కనీసం చూడనైనా చూడలేదు. కొడుకు గుణహీనుడైనా కష్టాల్లో ఉంటే చూడలేము. అటువంటిది తన నడవడితో లోకాన్నే జయించగల వారి కష్టాలను తల్లి ఎలా చూడగలుగుతుంది? పురుషోత్తముడైన ధర్మరాజునకు మార్దవం, దయ, ధైర్యం, శీలం, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం-అనే ఈ ఆరుగుణాలు శోభావహాలు. అటువంటి ధర్మరాజు దెబ్బతినటంతో ప్రజలు చాలా దుఃఖిస్తున్నారు. వేసవిలో నీరు ఎండిపోయినందువలన జలజంతువులు బాధపడినట్లు, వేరు నరికివేసినందున ఫలపుష్పాలతో కూడిన చెట్టు ఎండిపోయినట్లు ఆ ధర్మరాజు బాధవలన ప్రజలంతా బాధపడుతున్నారు.

కాంతిమంతుడైన ధర్మరాజు మనుష్యులకు మూలం. ఇతరులందరూ పుష్పాలు, ఫలాలు, ఆకులు, కొమ్మలు. ఈరోజు మనం బిడ్డలు, బంధువులతో సహా ఆ నలుగురు పాండవులవలె ధర్మరాజు నడిచే బాటలో ఆయన ననుసరించి వెళదాం. ఉద్యానాలను, పాలాలను, ఇళ్ళను వదలి, ఆయన సుఖదుఃఖాలను మనవిగా భావిస్తూ ఆ ధార్మికుని అనుసరిద్దాం. మన ఇళ్ళలో ఉన్న నిధులను త్రవ్వి తీసుకుందాం. ముంగిళ్ళను త్రవ్వేద్దాం. ధనధాన్యాలన్నీ వెంట తీసుకొని పోదాం. అవసరమైన సామగ్రిని కొనిపోదాం. ఇళ్ళన్నీ దుమ్ముకొట్టుకొంటాయి. దేవతలు కూడా వెళ్ళిపోతారు. ఎలుకలు కలుగుల నుండి బయటకు వచ్చి పరుగులు పెడతాయి. నిప్పుమండదు. నీళ్ళుండవు. చిమ్మటం కూడా జరుగదు. బలికర్మలు,యాగాలు, మంత్రపాఠాలు, హోమాలు, జపాలు ఏవీ ఉండవు. కాలం కలిసిరాక ఇళ్ళన్నీ కూలిపోతాయి. పగిలిన పాత్రలు చెల్లాచెదరుగా పడతాయి. ఆ ఇళ్ళను మనం వదలి వెళ్ళిన తర్వాత శకునినే తీసికొనీ. పాండవులు వెళ్ళిన అరణ్యమే నగర మవుతుంది. మనం విడిచిన నగరమే అరణ్య మవుతుంది. అరణ్యంలో మనలను చూచి భయపడి, పాములు

పుట్టలు వదలి పారిపోతాయి. మృగాలు, పక్షులు, ఏనుగులు, సింహాలు అరణ్యాన్ని వీడి దూరంగా పోతాయి. ఆకులు, అన్నం, పండ్లు మొదలుగునవి తినే వాళ్ళం మనం. మన పోకతో అరణ్యంలోని జంతువులు, పక్షులు అక్కడనుండి పారిపోవాలి. మనమున్నచోటును వీడి అవి మనం లేని తావులకు వెళ్ళాలి. అరణ్యంలో పాండవులతో కలిసి ఆనందంగా జీవిద్దాం.'

ఈ ప్రకారంగా అనేకులు అనేకవిధాలుగా అంటున్న మాటలను ధర్మరాజు విన్నాడు. అయినా ఆయన మనస్సు చలించలేదు. అప్పుడు అన్ని దిక్కులా అంతఃపురాలలో ఉన్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల స్త్రీలు తమ తమ భవనాల పరదాలను ఎత్తి దీనులయిన పాండవులను చూడసాగారు. పాండవులందరూ మృగచర్మాలు ధరించి ఉన్నారు. వారితోపాటు నడిచివెళ్తున్న ద్రౌపదిని కూడా చూచారు. అంతకు ముందెప్పుడూ వారు ద్రౌపదిని చూడలేదు. అప్పుడు ఆ ద్రౌపది ఏకవస్త్ర, రజస్వల, జుట్టువిరబోసికొని విలపిస్తోంది. ఆ స్థితిలో ఆమెను చూచి ఆ స్త్రీలు వివర్ణవదన లయ్యారు. దుఃఖశోకపీడితులై మోహావేశంతో ఎంతో విలపించి "ఛీ ఛీ" అనుకొంటూ కంటతడిపెట్టారు.)

ధార్తరాష్ట్రుల పత్నులు కూడా ద్రౌపది ద్యూతసభకు వెళ్ళటాన్ని, అక్కడ ఆమె వస్త్రాన్ని లాగటాన్ని, తెలిసికొని స్పష్టంగా తెలిసేటట్లు ఏడ్చారు. కౌరవులను బాగా నిందించారు. చేతిలో ముఖాల నుంచుకొని ఎంతోసేపు చింతాక్రాంతు లయ్యారు. అప్పుడు ధృతరాష్ట్ర మహారాజు కూడా తన కుమారుల అవినీతిని చూచి మనస్సు కలతపడి దానిని గురించియే ఆలోచిస్తూ అశాంతికి లోనయ్యాడు. ఆయన మనస్సు ఈ విధంగా పరిభ్రమించసాగింది. మనస్సు శోకంతో కకావికలమైంది. దానితో "వెంటనే రమ్మ"ని విదురునకు కబురు చేశాడు. అప్పుడు విదురుడు ధృతరాష్ట్రుని మందిరానికి వెళ్ళాడు. ధృతరాష్ట్రుడు ఉద్విగ్నుడై విదురుని ఇలా అడిగాడు.

80. విదుర ధృతరాష్ట్రద్రోణవచనములు.

"ధర్మసుతుడైన యుధిష్ఠిరుడు, భీమసేనుడు, అర్జునుడు, నకుల సహదేవులు ఎలా వెళ్ళారు? విదురా! ధౌమ్యుడు, యశస్వినీ అయిన ద్రౌపది ఎలా వెళ్ళారు. సవిస్తరంగా చెప్పు. ఆ సమయంలో వారి చేష్టలను తెలిసికోవాలనుకొంటున్నాను చెప్పు." విదురుడిలా అన్నాడు - "కౌంతేయుడైన యుధిష్ఠిరుడు ముఖాన్ని వస్త్రంతో కప్పుకొన్నాడు. భీమసేనుడు తన విశాలబాహువులను చూస్తూ వెళ్ళాడు. అర్జునుడు ఇసుక చల్లుతూ యుధిష్ఠిరుని అనుసరించాడు. మాద్రేయుడైన సహదేవుడు తన ముఖం మీద మట్టి పూసుకొని వెళ్ళాడు. లోకంలో అందరిని మించిన అందగాడు నకులుడు ఒళ్ళంతా దుమ్ము పూసుకొంటూ వ్యాకులచిత్తుడై యుధిష్ఠిరుని అనుసరించాడు. విశాలనేత్ర, సుందరి అయిన ద్రౌపది

ముఖాన్ని జుట్టుతో కప్పుకొని విలపిస్తూ ధర్మరాజును అనుసరించింది. రాజా! ధౌమ్యుడు దర్భలను చేతబట్టి రుద్రునకు, యమునకు సంబంధించిన సామవేదభాగాలను గానంచేస్తూ నడిచాడు."

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "విదురా! పాండవులు వివిధ భంగిమలతో వెళ్ళారు గదా! నాకు వివరంగా చెప్పు. వారి చేష్టలలోని ఆంతర్యమేమిటి?" విదురుడిలా అన్నాడు. "నీ కుమారులు మోసంచేసి రాజ్యాన్ని, సంపదను అపహరించినా ధీమంతుడయిన ధర్మరాజుబుద్ధి ధర్మాన్ని అతిక్రమించటం లేదు. యుధిష్ఠిరనరపాలుడు ధార్తరాష్ట్రులపై ఎప్పుడూ దయగలవాడు. అటువంటివాడు నీ కొడుకుల మోసంతో రాజ్యాన్ని కోలుపోయాడు. ఆ కోపంతో కళ్ళు విప్పటం లేదు. భయంకరమైన నా చూపుతో నిరపరాధులైన ప్రజలు మండిపోకూడదు అనే భావంతో యుధిష్ఠిర నరపాలుడు ముఖాన్ని కప్పుకొని వెళ్తున్నాడు. భీముడు ఎలా వెళ్తున్నాడో చెపుతా విను - బాహుబలంలో నాకు సాటిరాగలవాడు ఎవ్వడూ లేడు అని ప్రకటిస్తున్నాడు. అందువలననే తన విశాల బాహువుల వైపు చూస్తూ భీముడు వెళ్తున్నాడు. బాహుబల గర్వంతో బాహువులను ప్రదర్శిస్తూ శత్రువులపై ప్రతీకారం చేసేందుకు బాహుబలానుసారంగా పరాక్రమించ దలచుకొన్నాడు. అర్జునుడు ఆ సమయంలో ఇసుక చల్లుతూ యుధిష్ఠిరుని అనుసరిస్తున్నాడు. భారతా! ఇప్పుడు తాను వెదజల్లుతున్న ఇసుకరేణువులు ఒక దానితో ఒకటి కలియకుండా నేలపై పడుతున్నట్లు శత్రువులపై ఒకదాని నొకటి తగుల్కొనని శరవర్షాలను కురిపించబోతున్నాడు. భారతా! ఇప్పుడు నాముఖాన్ని ఎవ్వరూ తెలిసికొనకూడదు అనే భావంతో సహదేవుడు తన ముఖంపై మట్టిపూసికొని వెళ్తున్నాడు. రాజా! దారిలో నేను ఏ స్త్రీ మనస్సును కూడా దొంగిలించకూడదు అని భావించి నకులుడు ఒళ్ళంతా దుమ్ముకొట్టుకొని వెళ్తున్నాడు. ద్రౌపది ఏకవస్త్ర, రజస్వల, జుట్టు విరబోసికొని ఉన్నది. వస్త్రంపై నెత్తుటి మరకలున్నాయి. ఆమె విలపిస్తూ ఈవిధంగా పలికింది. 'ఎవరి అన్యాయంవలన నేడు నేనీస్థితికి వచ్చానో వారి భార్యలు కూడా నేటికి పదునాలుగవ సంవత్సరంలో భర్తలను, పుత్రులను, బంధువులను, ప్రియజనులను కోలుపోయి శరీరమంతా నెత్తుటి మరకలు, దుమ్ముధూళి నిండగా జుట్టు విరబోసికొని భర్తలకు తిలోదకాలనిచ్చి హస్తినాపురిలోనికి ప్రవేశిస్తారు. భారతా! ధీరుడైన పురోహితుడు ధౌమ్యుడు చేతిలోని దర్భలను నైరృతి వైపు చూపుతూ యమసంబంధి సామగానం చేస్తూ ముందు నడుస్తున్నాడు. యుద్ధంలో కౌరవులు మరణిస్తే వారి గురువులు కూడా ఈ విధంగానే సామగానం చేస్తూ నడుస్తారు అని సూచిస్తూ ధౌమ్యుడు నడుస్తున్నాడు.

మహారాజా! ఆ సమయంలో నగరవాసులు దుఃఖార్తులై మాటిమాటికి ఇలా అంటున్నారు - 'అయ్యో! మన ప్రభువులు వెళ్ళిపోతున్నారు. ఈ స్థితిలో చూడండి. కురువృద్ధులంతా చిన్న పిల్లలవలె ప్రవరిస్తున్నారు. ఈ కౌరవులు రాజ్యలోభంతో పాండురాజు కొడుకులను రాజ్యంనుండి వెళ్ళగొడుతున్నారు. పాండవులు లేకపోతే మనమంతా అనాథులమే. దుర్మార్గులు, లుబ్ధులు అయిన కౌరవులపై మనకు ప్రేమ ఎలా కలుగుతుంది?' మహారాజా! ఈ ప్రకారంగా అభిమానవంతు లయిన కౌంతేయులు తమ ఆకృతి, చేష్టలద్వారా మనస్సులోని నిర్ణయాలను ప్రకటిస్తూ అరణ్యానికి వెళ్ళారు. ఈ ప్రకారంగా నరోత్తము లయిన పాండవులు హస్తినాపురంనుండి వెళ్తుండగా మేఘాలు లేకుండానే మెరుపులు వచ్చాయి. భూమి కంపించింది. అమావాస్య కాకపోయినా రాహువు సూర్యుని మ్రింగాడు. నగరానికి ఎడమవైపు ఉల్క నేలగూలింది. గ్రద్దలు, నక్కలు, కాకులు మొదలగు మాంసాహారులయిన ప్రాణులు దేవాలయాలలో, యజ్ఞశాలలో, ప్రహరీగోడలపై, మేడలపై మాంసపుముక్కలు వదలి వెళ్తున్నాయి. రాజా! నీ దురాలోచన ఫలితంగా ఈ రీతిగా అణచరాని అపశకునాలెన్నో పుట్టాయి. ఇవి భరతవంశవినాశనాన్ని సూచిస్తున్నాయి." వైశంపాయను డిలా అన్నాడు. రాజా! ఈ ప్రకారంగా ధృతరాష్ట్రమహారాజు, ధీమంతుడైన విదురుడు మాటాడుకొనే సమయంలోనే మహర్షి పరివృతుడైన నారదుడు సభామధ్యంలో కౌరవుల ఎదుట నిలిచి భీకరంగా ఇలా అన్నాడు. "నేటికి పదునాలుగవ సంవత్సరంలో దుర్యోధనుని అపరాధం వలన భీమార్జునులబలం వలన కౌరవులు నశిస్తారు." ఈ రీతిగా పలికి విశాలబ్రహ్మతేజస్సు గల దేవర్షిసత్తముడు నారదుడు గగనతలంపై కెగసి వెంటనే అదృశ్యమయ్యాడు.

(ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "విదురా! నాగరికజనులు ఏమనుకొన్నారు? గ్రామీణులు ఏమన్నారు? సమస్తవృత్తాంతాన్నీ యథాతథంగా నాకు చెప్పు." విదురుడిలా అన్నాడు - మహారాజా! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఇతరజనులు ఏమన్నారో చెపుతా విను. దుఃఖార్తులైన పౌరులు అందరూ "అయ్యో! మన ప్రభువులు అరణ్యాలకు వెళ్తున్నారు. చూడండి. ధార్తరాష్ట్రులు ఎక్కడకు తెచ్చారో" అని దుఃఖించారు. స్త్రీ బాలవృద్ధులతో కూడిన హస్తినాపురమంతా ఆనందరహితంగా, నిశ్శబ్దంగా ఉంది. ఉత్సాహాన్ని కోలుపోయింది. రోగగ్రస్తులవలె అందరూ ఉత్సాహశూన్య లయ్యారు. ప్రజలు చింతాశోకపరాయణులై ఒకరితో ఒకరు కలిసి పాండవుల గురించిన విశేషాలే చెప్పుకొన్నారు. ధర్మరాజు అరణ్యానికి వెళ్ళగానే కురువృద్ధులు కూడా శోకవ్యథకు గురి అయి దుఃఖిస్తున్నారు. అప్పుడు పురవాసు లందరు యుధిష్ఠిరుని గురించి చింతించసాగారు. అక్కడ బ్రాహ్మణులు యుధిష్ఠిరుని గురించి ఇలా చెప్తున్నారు. బ్రాహ్మణులిలా అన్నారు. ధర్మాత్ముడైన ధర్మరాజు, ఆయన తమ్ములు నిర్జనారణ్యంలో ఎలా జీవిస్తారో? ద్రుపదుని పుత్రి ద్రౌపది సుఖాలకే తగినది. అటువంటి ఆమె

దుఃఖార్తయై అరణ్యంలో ఎలా జీవిస్తుంది?" విదురుడిలా అన్నాడు – "ఈ విధంగా నగరంలోని విప్రులు భార్యాపుత్రులతో సహా పాండవులను తలచుకొంటూ ఎంతో దుఃఖానికి లోనయ్యారు. ఆయుధందెబ్బ తిన్నవారి వలె వారు ఏ మాత్రమూ సుఖంగా లేరు. మాటాడుతూ కూడా ఎవ్వరికీ ఇష్టంగా సమాధాన మివ్వటం లేదు. పగలయినా, రేయి అయినా వారు నిద్రాహారాల పొంత పోవటం లేదు. శోకం వారి విజ్ఞానాన్ని కప్పి వేసింది. వారంతా చైతన్యాన్ని కోలుపోయినట్లున్నారు. రాముడు రాజ్యానికి దూరమై, లక్ష్మణునితోపాటు అరణ్యానికి వెళ్ళినపుడు, దుఃఖార్తితో అయోధ్యానగరం ఏ అవస్థకు లోనయిందో, అదే అవస్థను, ధర్మరాజు రాజ్యాన్ని కోలుపోయి, తమ్ములతో పాటు అరణ్యాలకు వెళ్తుంటే ఇప్పుడు హస్తినాపురి కూడా అనుభవిస్తోంది." విదురుని మాటను నాగరికుల మాటలను విని ధృతరాష్ట్రుడు శోకంతో సబాంధవంగా మరల మూర్ఛిల్లాడు.)

అప్పుడు దుర్యోధనుడు, కర్ణుడు, సుబలపుత్రుడు శకుని, ద్రోణుని తమకు ఆలంబనంగా భావించి సమస్తరాజ్యాన్ని ఆయనకు సమర్పించారు. ఆ సమయంలో ద్రోణుడు అసహనశీలుడైన దుర్యోధనునితో, దుశ్శాసనకర్ణులతో, ఇతర భరతవంశీయులతో ఇలా అన్నాడు. "పాండవులు దేవతల బిడ్డలు. వారిని చంపరాదని బ్రాహ్మణులు అంటుంటారు. నన్ను శరణుకోరిన మీవైపు నేను యథాశక్తిగా పనిచేస్తాను. సామంతరాజులతో కూడిన ఈ ధార్తరాష్ట్రులను భక్తిపూర్వకంగా పూర్తిగా అనుసరిస్తాను. వారిని వదలాలి అనిపించటం లేదు. **విధి బలవత్తరం గదా!** జూదంలో ఓడిన పాండుపుత్రులు ధర్మమార్గంలోనే అరణ్యాలకు వెళ్తున్నారు. ఆ పాండవులు పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో నివసిస్తారు. బ్రహ్మచర్యాన్ని పాటించి, క్రోధామర్షాలకు లోనై తిరిగివచ్చిన పాండవులు శత్రుత్వానికి ప్రతీకారం తప్పక చేస్తారు. అది మనకు చాలా దుఃఖహేతువు. రాజా! మైత్రికి సంబంధించి యుద్ధం జరిగినప్పుడు ద్రుపదుని నేను రాజ్యభ్రష్టుని చేశాను. భారతా! ఆ ద్రుపదుడు నన్ను చంపగల కుమారుని కోసం యజ్ఞం చేశాడు. యాజోపయాజుల తపశ్శక్తివలన ధృష్టద్యుమ్నుడనే కుమారుని, వేదిమధ్యనుండి అందమైన కుమార్తెను ద్రౌపదిని పొందాడు. ధృష్టద్యుమ్నుడు పాండవులకు బావమరిది అవుతాడు. కాబట్టి పాండవులకు ఇష్టమైన పనులే చేస్తుంటాడు. అందుకని నాకు భయం కలిగింది. ధృష్టద్యుమ్నుడు అగ్నిజ్వాలవంటిరంగు గలవాడు, దేవతలు ప్రసాదించిన బిడ్డ. ఎప్పుడూ కవచాన్ని,ధనుర్బాణాలను ధరించి ఉంటాడు. మరణం మనుష్యులకు అనివార్యం కాబట్టి ధృష్టద్యుమ్నుడంటే నాకు భయం. శత్రుసంహారకు డయిన ఆ ధృష్టద్యుమ్నుడు ఇప్పుడు పాండవుల పక్షాన్ని బలపరుస్తున్నాడు. అర్జునుడు రథాతిరథులలో అగ్రగణ్యుడు, యువకుడు. ధృష్టద్యుమ్నునితో నాకు యుద్ధం తటస్థిస్తే అర్జునుడు అతనికి సహాయుడై ప్రాణాలనైనా ఇవ్వటానికి సిద్ధపడతాడు. కౌరవులారా!

ఈ లోకంలో నాకు ఇంతకు మించిన దుఃఖం మరేముంటుంది. ధృష్టద్యుమ్నుడు ద్రోణునకు మృత్యువు అని బాగాప్రసిద్ధి కెక్కినమాట. నన్ను చంపటానికే ధృష్టద్యుమ్నుడు పుట్టాడు. అయినా లోకంలో కూడా బాగా పేరుమోసినవాడు. మీకు మంచిరోజులు వచ్చాయి అన్నది నిశ్చితం. ఇంతవరకు చేసినది సరిపోదు. మీ శ్రేయస్సాధనకై త్వరగా సన్నద్దులు కండి. ఇప్పటి ఈ రాజ్యం చలికాలంలో తాటిచెట్టు నీడలాగా ముహూర్తకాలం మాత్రమే సుఖాన్ని ఇవ్వగలదు. మహాయజ్ఞాలు చేయండి. భోగాల ననుభవించండి. ఇతరులను సుఖించనీయండి. నేటికి పదునాలుగు సంవత్సరాల తర్వాత పెద్దయుద్ధం చేయవలసివస్తుంది." ద్రోణుని మాట విని ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "విదురా! ద్రోణుడు చక్కగా చెప్పాడు. పాండవులను వెనుకకు తీసికొనిరా. వారు రావటానికి సిద్ధపడకపోతే సత్కారపూర్వకంగా వారిని పంపించు. ఆయుధధారు లయిన రథికులు, సైనికులతో కూడి భోగసామగ్రితో ఆ నా కుమారులు వెళ్లేటట్టు చూడు."

81. ధృతరాష్ట్ర సంజయ సంవాదము.

మహారాజా! జూదంలో ఓడిపోయి పాండవులు అరణ్యానికి వెళ్ళిపోయిన పిదప అప్పుడు ధృతరాష్ట్రునిలో చింత మొదలయింది. ఆ ధృతరాష్ట్రమహారాజు పరిపరివిధాలుగా ఆలోచిస్తూ, నిట్టూరుస్తూ కూర్చొని ఉండగా సంజయు డిలా అన్నాడు. "రాజా! ధనాన్ని పొంది, భూమినంతా ఆక్రమించుకొని, పాండవులను రాజ్యంనుండి బయటకు పంపి ఇంకా విచారిస్తున్నావేమిటి?" ధృతరాష్ట్రుడిలా అన్నాడు - "యుద్ధనిపుణులై, బలవంతులై, మహారథులయిన పాండవులతో శత్రుత్వం ఏర్పడిన తర్వాత విచారించకుండా ఎవరైనా ఎలా ఉండగలరు?" సంజయుడిలా అన్నాడు. "రాజా! ఇది స్వయంకృతాపరాధం. మహాశత్రుత్వమే ఏర్పడింది. లోకమంతా సర్వసంబంధీకులతో పాటు నశించటమే దీని ఫలితం. బుద్ధిహీనుడైన నీ కొడుకు దుర్యోధనుడు భీష్మద్రోణ విదురులు వారిస్తున్నా వినకుండా పాండవుల ప్రియపత్ని, ధర్మచారిణి అయిన ద్రౌపదిని తీసికొని రమ్మని సిగ్గులేకుండా సూతపుత్రుడైన ప్రాతికామిని పంపించాడు.

దేవతలు తామెవరికయినా పరాభవాన్ని కల్పించదలచుకొంటే వారి బుద్ధిని అపహరిస్తారు.* దానితో ఆ బుద్ధిహీనులు అంతా తలక్రిందులుగా విపరీతంగా

* యస్మై దేవాః ప్రయచ్ఛంతి పురుషాయ పరాభవమ్ ।
బుద్ధ్యా తస్యాపకర్షంతి సోఽవాచీనాని పశ్యతి ॥ 8

చూస్తారు. వినాశకాలం దాపురించినపుడు బుద్ధి కలుషితమై, అవినీతి కూడా నీతిలా కనిపిస్తూ మనస్సు నుండి దూరంకాదు.** అనర్థాలు సార్థకాలు అనిపిస్తాయి. అర్థాలు అనర్థాలుగా తోస్తాయి. వినాశకాలంలో ఇది స్థితి. అటువంటి వాడికి తప్పక ఆదే నచ్చుతుంది. కాలం దండాన్ని ఎత్తి ఎవ్వరి తలనూ నరకదు. అర్థాన్ని మనుష్యులచే విపరీతంగా దర్శింపజేయగలగటమే దాని బలం. పాంచాలి తపస్విని. అయోనిజ. రూపవతి. అగ్నివంశంలో పుట్టినది. సర్వధర్మాలు తెలిసినది. కీర్తిమతి. అటువంటి ఆమెను సభామధ్యంలో ఈడ్చినప్పుడే రోమాలు నిక్కబొడిచే భయంకర యుద్ధానికి ప్రారంభం జరిగింది. దొంగజూదమాడే దుర్యోధనుడు తప్ప మరెవ్వరూ అటువంటి పని చేయరు. ఆ ద్రౌపది రజస్వల. అందమైనది. నెత్తుటి మరకలు గలది. ఏకవస్త్ర. ఆమె సభామధ్యంలో పాండవులను చూచింది.

వారు రాజ్యాన్ని విలువయిన వస్త్రాలను, సంపదలను, తమను కూడా కోలుపోయి ఉన్నవారు. సర్వకామాలను వీడి దాసులై కూర్చున్నారు. ధర్మపాశబద్ధులై, పరాక్రమప్రదర్శనలో అసమర్థులవలె ఉన్నారు. పాండవులను ఆ స్థితిలో చూచి ఆమె కోపించింది. దుఃఖించింది. ఆ దశకు తగని ఆమెను ఆ కౌరవసభలో దుర్యోధనుడు, కర్ణుడు తూలనాడారు. రాజా! ఇదంతా ఏదో కలతకు కారణమని నాకనిపిస్తోంది." ధృతరాష్ట్రుడిలా అన్నాడు. దీనంగా ఉన్న ఆ ద్రౌపది కళ్ళు భూమిని దహించవేయగలవు. సంజయా! ఆమె తలచుకొని ఉంటే ఇప్పటికి నేను నాకుమారులు మిగిలి ఉండేవాళ్ళం కాదు. ధర్మిష్ఠ. రూప యౌవనవతి, పాండవుల ధర్మపత్ని అయిన ద్రౌపదిని సభాభవనంలోనికి రప్పించినప్పుడు గాంధారితో సహా భరతవంశ స్త్రీలందరు పెద్దగా ఆక్రోశిస్తూ చీదరించుకొన్నారు. ఈ స్త్రీలందరు ప్రజలలోని స్త్రీలతో కలిసి పగలూ, రేయి దానిని గురించే శోకిస్తున్నారు. ద్రౌపదిని సభలో ఈడ్చిన రోజు బ్రాహ్మణులంతా కోపించి సాయంకాలం మా ఇంట అగ్ని కార్యాన్ని కూడా నిర్వర్తించలేదు. ఆ సమయంలో పెనుతుఫాను వచ్చింది. పిడుగు పాట్లతో మహాధ్వని వినిపించింది. ఆకాశం నుండి ఉల్కలు పడ్డాయి. అమావాస్య కాకపోయినా రాహువు సూర్యుని మ్రింగాడు. ప్రజలలో తీవ్రభయం చెలరేగింది. అదేవిధంగా రథశాలలలో అగ్నిప్రమాదం జరిగింది. భరతవంశ నాశనాన్ని సూచిస్తూ రథధ్వజాలన్నీ తగులబడ్డాయి. దుర్యోధనుని అగ్నిహోత్రగృహంలో నక్కలు భయంకరంగా అరిచాయి. వాటికి ప్రతిగా

---

* బుద్ధౌ కలుషభూతాయాం వినాశే సముపస్థితే।
అవయో వయసంకాశః హృదయాన్నావసర్పతి ॥ 9

అన్ని దిక్కులలో గాడిదలు ఆరిచాయి. సంజయా! అదంతా గమనించి భీష్మ, ద్రోణ, కృప, సోమదత్తులు, మహామనస్వి అయిన బాహ్లీకుడు అక్కడ నుండి వెళ్ళిపోయారు. అప్పుడు నేను, విదురుడు ప్రేరేపించగా, ద్రౌపది కోరిన వరాన్ని ఇవ్వటానికి సిద్ధపడ్డాను. ద్రౌపది పాండవుల దాస్యవిముక్తిని కోరింది. నేను రథాలు, ధనుస్సులతో సహా సమస్తసంపదలను తిరిగి తీసికొని వెళ్ళటానికి అనుమతించాను."

అప్పుడు మహాప్రాజ్ఞుడు, సర్వధర్మవేత్త అయిన విదురుడిలా అన్నాడు – "ద్రౌపదిని మీరు సభలోని కీడ్చారు. ఆమెయే మీ వినాశనానికి కారణ మవుతుంది. ఈ పాంచాల రాజకుమారి ఉత్తమలక్ష్మి. దేవతల ఆదేశంమేరకే ఆమె పాండవులను సేవిస్తోంది. పాండవులు అసహనంతో ఉన్నారు. ద్రౌపదికి జరిగిన పరాభవాన్ని వారు సహించరు. సత్యప్రతిజ్ఞుడైన వాసుదేవుడు, ఆయన రక్షణలోని వారు, మహాధనుర్ధరులు అయిన వృష్ణివంశజులు, మహారథులయిన పాంచాల వీరులు దీనిని సహించరు. పాంచాలురతో కూడి అర్జునుడు తప్పక ఎత్తి వస్తాడు. యముడు దండాన్ని విసిరినట్లు వారిమధ్య నిలిచి మేటి విలుకాడు, మహాబలుడు అయిన భీముడు గదను విసురుతూ వస్తాడు. అప్పుడు ధీమంతుడైన అర్జునుని గాండీవటంకారాన్ని, భీముని గదావేగాన్ని ఏ రాజులూ ఎదుర్కొనజాలరు. కాబట్టి పాండవులతో మైత్రినే నేనెప్పుడూ ఇష్టపడతాను కానీ యుద్ధాన్ని కాదు. పాండవులు కౌరవులకన్నా ఎప్పుడూ బలవత్తరులే అని నేను అనుకొంటాను. జరాసంధుని యుద్ధంలో భీముడు ఒక్కచేతి దెబ్బతో చంపివేశాడు. కదామరి! కాబట్టి భరతర్షభా! పాండవులతో శాంతియే తగినది. రెండు పక్షాలకు తగిన దిదే. నిస్సందేహంగా ఆ ఉపాయాన్నే ఆచరించు. మహారాజా! ఈవిధంగా నీకెంతో శ్రేయస్సు కలుగుతుంది. సంజయా! ఈవిధంగా విదురుడు నాకు ధర్మార్థయుక్తమైన సూచన చేశాడు. కానీ పుత్రుల హితాన్ని కోరుతూ కూడా దానిని నేను స్వీకరించలేదు."

ఇది సభాపర్వం

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా మెలగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నప్పుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.